

# one night @ the call center

Now in Telugu

# వన్ నైట్ @ ద కాల్ సెంటర్

చేతన్ భగత్



ఫైవ్ పాయింట్ సమ్‌వన్
వన్ నైట్ @ ద కాల్ ద కాల్ సెంటర్
నవలల
ప్రశంస

**'భారతదేశ చరిత్రలో ఇంగ్లీషు భాషలో అత్యధికంగా అమ్ముడవుతున్న నవలాకారుడు'.**

న్యూయార్క్‌టైమ్స్

'...భారతదేశంలోని యువపాఠకుల నాడిని భగత్ పట్టుకున్నాడు. ఆరాధ్యదైవం స్థాయికి చేరుకున్నాడు.'

ఇంటర్నేషనల్ హెరాల్డ్ ట్రిబ్యూన్

'స్వీయచరిత్ర చెప్పే తీరులో కథనం ఉంటుంది. ఇందులో పాత్రలు సీదాసాదాగా ఉంటాయి. వారిని మనలో ఒకరిగా వెంటనే గుర్తిస్తాం. ఒక యువ పదశిల్పి తన స్పష్టమైన ఆలోచనలతో, సరళంగా చెప్పిన వృత్తాంతంతో ఈ 'పోకెట్-ఫ్రెండ్లీ' పుస్తకాన్ని కేవలం సరదా కోసం తప్పక చదవాల్సిన పుస్తకంగా చేయటంలో విజయం సాధించాడు.'

టైమ్స్ఆఫ్ఇండియా.కామ్

'గొప్పపాత్రలు, ఆకట్టుకునే శిల్పం, చక్కగా రాయబడ్డ పుస్తకం 10-పాయింట్ల స్కేల్‌లో నిశ్చయంగా ఐదు పాయింట్లకు కుడివైపే ఉంది.'

ఇండియా టుడే

'ఫైవ్ పాయింట్ సమ్‌వన్ అతను రాసిన మొట్టమొదటి నవల అన్న విషయం మరచిపోవడం ఎంతో సులభం... చదివింపజేసే నవల...'

హిందుస్తాన్‌టైమ్స్.కామ్

'ఇంగ్లీషులో భారతీయులు చేసే రచనల్లో భూకంపంలాటి మార్పుకు కూడా చేతన్ బాధ్యుడు.'

ద హిందూ

'భారతదేశంలోని ప్రచురణా రంగానికి ఒక రాక్‌స్టార్.'

టైమ్స్ ఆఫ్ ఇండియా

'...నిర్దుష్టమైన గురి, సునిశితమైన అతని చూపు అతిచిన్న వివరాలనీ, సూక్ష్మమైన తేడాలనీ చక్కగా పట్టుకుంది... వన్ నైట్ @ ద కాల్ సెంటర్ భారతదేశంలోని యువతీయువకులని ఆకట్టుకుందని స్పష్టంగా తెలుస్తోంది - దీనిలో రాజకీయాలకన్నా కథాచిత్రణకి, ఆదేశం కన్నా సమస్యానిర్ధారణకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటమే దానికి కారణం.'

శశి థరూర్

# వన్ నైట్
# @
# ద కాల్ సెంటర్

## చేతన్ భగత్

reem

# విషయసూచిక


| | |
|---|---|
| భూమిక | 1 |
| #29 నుంచి | 10 |
| #1 | 11 |
| #2 | 15 |
| #3 | 27 |
| #4 | 31 |
| #5 : గతంలో నేనూ ప్రియాంకా కలుసుకున్న సందర్భాలు-I | 37 |
| #6 | 42 |
| #7 | 47 |
| #8 | 56 |
| #9 | 62 |
| #10 : గతంలో నేనూ ప్రియాంకా కలుసుకున్న సందర్భాలు-II | 69 |
| #11 | 77 |
| #12 : గతంలో నేనూ ప్రియాంకా కలుసుకున్న సందర్భాలు-III | 82 |
| #13 | 94 |
| #14 | 101 |
| #15 | 105 |

#16 109
#17 112
#18 : గతంలో నేనూ ప్రియాంకా కలుసుకున్న సందర్భాలు–IV 117
#19 123
#20 130
#21 134
#22 140
#23 : గతంలో నేనూ ప్రియాంకా కలుసుకున్న సందర్భాలు–V 149
#24 152
#25 158
#26 163
#27 170
#28 176
#29 184
#30 188
#31 199
#32 203
#33 210
#34 216
#35 222
#36 224
#37 229
#38 234
ఉపసంహారం 236



మీరు ఈ పుస్తకాన్ని చదవటం ప్రారంభించటానికి ముందు, నాదో చిన్న కోరిక. ఇక్కడే, మూడు విషయాల గురించి రాయండి :

i) మీరు భయపడేవి,

ii) మీకు కోపం తెప్పించేవి,

iii) మీలో మీకు నచ్చనివి

మీరు నిజాయితీగా ప్రవర్తించండి. మీరు రాసేది మీకు అర్థవంతంగా ఉండేటట్లు చూడండి.

మిమ్మల్ని నేను యిది ఎందుకు చేయమంటున్నానో అన్న విషయం గురించి మరీ ఎక్కువగా ఆలోచించకండి. చెయ్యండి, అంతే.

*నేను భయపడే విషయం:*

______________________________

*నాకు కోపం తెప్పించే విషయం:*

______________________________

*నాలో నాకు నచ్చని విషయం:*

______________________________

సరే, ఇక ఈ అభ్యాసం విషయం మరచిపోయి, కథని చదివి ఆనందించండి.

నేను చెప్పిన పని చేశారా?

చెయ్యకపోతే, దయచేసి యిప్పుడు చెయ్యండి. మీరు ఈ పుస్తకం చదవటంలో పొందే అనుభవాన్ని అది సుసంపన్నం చేస్తుంది.

మీరు చేసేశారా, అయితే నా ధన్యవాదాలు. మిమ్మల్ని అనుమానించినందుకు క్షమించండి. ఈ అభ్యాసం విషయం, మిమ్మల్ని నేను అనుమానించిన విషయం మరిచిపోయి, కథని చదివి ఆనందించండి.



# కృతజ్ఞతలు

ఇది అచ్చంగా నా పుస్తకం అనే మీరు అనుకునేటట్టుంటే, ఒక్క క్షణం ఆగండి. ఏ పుస్తకమూ ఎవరికో ఒకరికి చెందదు, ఇక నా విషయంలో చాలామంది నాకు సహకరించారు. ప్రత్యేకంగా నేను ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నది:

షైనీ ఆంటోనీకి - తన అభిప్రాయం నాకు చెపుతూ, తను చూపించిన పరిశీలన, ప్రమాణాలకు. ఆమె నా మార్గదర్శకురాలు, గురువు, స్నేహితురాలని క్రితం సారే అన్నాను.

కాల్‌సెంటర్‌లోని నా కజిన్స్, నా వదినె-మరదళ్లు, స్నేహితులు - రితికా సరీన్, శ్వేతా సరీన్, అఖిల్ సరీన్, నిఖిల్ సరీన్, నితిన్, యింకా జెసీకాకి. మీరు లేకపోతే ఈ పుస్తకం ఉండేది కాదు. కాల్‌సెంటర్లలో రాత్రుళ్లు రహస్యంగా ఆరాలు తీయటంలోనూ, సమాచారాన్ని అందించటంలోనూ, శిక్షణసామగ్రిని దొంగతనం చేయటంలోనూ, అనేకమందితో సమావేశాలు ఏర్పాటు చేయటంలోనూ నాకు చేసిన సహాయానికి ధన్యవాదాలు. అన్నిటికన్నా ముఖ్యంగా మీ జీవితాన్ని నాతో పంచుకున్నందుకు ధన్యవాదాలు. కాల్‌సెంటర్లలో ప్రతీరాత్రీ పనిచేస్తున్న వారికి తెలిసినంతగా నాకు తెలుసని నేనెన్నడూ అనలేను. కాని మీ భావనలు నేను అర్థం చేసుకోగలనని అనుకుంటున్నాను, వాటిని దృష్టిలో ఉంచుకుని రాస్తున్నప్పుడు ఈ పుస్తకం నన్ను ఎంతగానో కదిలించింది. అయినా, నేను అర్థం చేసుకోలేని సందర్భాలు ఏమన్నా మీకు కనిపిస్తే, దయతో నన్ను మరొక సాధారణ, అపరిపూర్ణ మానవుడిగా గ్రహించి, క్షమించండి.

నా ప్రత్యేకమైన మాజీ బాస్‌కు. అతనికోసం నేను పనిచేసినప్పుడు నా జీవితం నరకప్రాయం అయింది, బహుశా అది నా జీవితంలోనే ఘోరమైన దశ. అలా నాకే ఎందుకు జరుగుతోందా అని అప్పుడప్పుడూ ఆశ్చర్యపోయేవాడిని. ఇప్పుడు నాకు తెలుసు. ఆ అనుభవం లేకపోతే, ఈ పుస్తకాన్ని నేను రాయలేకపోయి ఉండేవాడిని. నన్ను బాధపెట్టినందుకు, మిస్టర్ ఎక్స్‌బాస్, నీకు నా ధన్యవాదాలు. అదే విధంగా నన్ను తిరస్కరించిన అమ్మాయిలందరికీ (లెక్కలేనంత మంది కనుక, వారి పేర్లు రాయటానికి ఇక్కడ చోటులేదు) ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను. వారే లేకపోతే, నిరాకరణలోని బాధ నాకు తెలిసుండేది కాదు.

నా కుటుంబం - అనూష, ఇషాన్, శ్యామ్, కేతన్, ఆనంద్, పీయా, పూనమ్, రేఖా, కల్పనా, యింకా సూరికి. వారింకా నాతోనే ఉన్నారు, నాలో వెర్రితనం ఉన్నప్పటికీ - నాలో గుర్తించదగిన అంశం అదొక్కటే - నన్ను సమర్థిస్తూనే ఉన్నారు.

నా పబ్లిషర్లు రూపా & కంపెనీకి - నగరంలోని ప్రతీ ఒక్క విదేశీ ప్రచురణకర్త నుంచీ తీవ్రమైన పోటీని తట్టుకుంటూ నిరాడంబరంగా మనస్ఫూర్తిగా, శ్రద్ధ కనబరుస్తూ నాణ్యమైన పనితనం అందజేస్తూ తనకంటూ ఒక స్థానం ఏర్పరచుకుంది. ఇటువంటి కంపెనీలు మనదేశానికి గర్వకారణం. నేనింతకుముందు రాసిన పుస్తకం కోసం మరింత ఎక్కువ కష్టపడి పనిచేసిన అందులోని వ్యక్తులందరికీ ప్రత్యేకంగా నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. అది వ్యాపారపరమైన కారణాలకు మించినది - నా కథ మాత్రమే చెప్పమన్నారు వాళ్లు. ఇకపై కూడా అలాగే అంటూ ఉండఁడి. (కాని నాకు కొంచెం ఎక్కువ చెల్లించచ్చు)

మిస్టర్ బిల్‌గేట్స్, అతని మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్, వారి ఎంఎస్‌వర్డ్‌కు. ఈ సాఫ్ట్‌వేర్ లేకుండా నేను రాయలేను. అయితే ఈసారి నేను వారికి ధన్యవాదాలు చెప్పటానికి వేరే కారణం ఉంది - అదేమిటో కథ చదివాక మీరే తెలుసుకుంటారు.

ఇక మీరు రెడీ అనుకుంటా - వన్ నైట్ @ ద కాల్ సెంటర్‌కు!



# • భూమిక

**ఒకరాత్రి కాన్పూరునుంచి ఢిల్లీకి నేను చేసిన రైలుప్రయాణం** నేను నా జీవితంలో ఎన్నటికీ మరిచిపోలేనిది. దానికి రెండు కారణాలు, ఒకటి, ఆ ప్రయాణంవల్లే నేను నా రెండో పుస్తకం రాయగలిగాను. రెండోది, మీరు ఖాళీ బోగీలో కూర్చునుండగా ఒక అందమైన అమ్మాయి మీ బోగీలోకి ఎక్కటం అనేది రోజూ జరిగే విషయం కాదు.

అఁ, మీరు సినిమాల్లో అలా జరగటం చూడచ్చు, మీ స్నేహితుల స్నేహితులు చెప్పగా వినచ్చు, కానీ మీకు అలా జరగటం అనేది చాలా అరుదు. నేను కుర్రవాడిగా ఉన్నప్పుడు, నా బోగీ బైట అతికించిన రిజర్వేషన్ చార్ట్‌లో నా సీటు దగ్గర్లో ఉండే అమ్మాయిల పేర్లు వెతికేవాణ్ణి (ముఖ్యంగా 17-25 ఏళ్ల వయసున్నవాళ్లు) అయినా, నాకా అదృష్టం ఎప్పుడూ కలగలేదు. తరచు నా సీటు దగ్గర ఎక్కువగా మాట్లాడే ఆంటీలో, గురకపెట్టే మగవాళ్లో, గుక్కపట్టి ఏడ్చే పసిపిల్లలో ఉండేవాళ్లు.

కానీ ఆరోజు రాత్రి మాత్రం తేడాగా ఉంది. ముఖ్యంగా, నా బోగీ పూర్తిగా ఖాళీగా ఉంది. రైల్వేవాళ్లు కొత్తగా ప్రారంభించిన వేసవి స్పెషల్ కావటంతో, ఎవరికీ దీని గురించి తెలీలేదు. ఇక రెండో విషయం, నాకు నిద్ర అస్సలు పట్టలేదు.

నేను ఐఐటీ కాన్పూర్‌లో ఉపన్యాసం ఇవ్వటానికి వెళ్లాను. కాంటీన్‌లో విద్యార్థుల్తో కబుర్లు చెపుతూ, రైలెక్కటానికి ముందు, నాలుగు కప్పులు కాఫీ తాగాను. అది పొరపాటయింది. ఖాళీ బోగీలో ఎనిమిది గంటలు నిద్రపోలేకుండా ఒంటరిగా గడపాలంటే విసుగ్గానే ఉంటుంది మరి. నా దగ్గర చదువుకోవటానికి పుస్తకాలుగాని, పత్రికలుగాని ఏవీలేవు. చీకట్లో బైటికి చూద్దామన్నా ఏమీ కనిపించదాయె. అందుకే ఇక ఈ రాత్రి మౌనంగా, మందకొడిగా గడపటానికి సిద్ధమయాను. కానీ నిజానికి ఆ రాత్రి నిశ్శబ్దంగానూ, మందకొడిగానూ గడవలేదు.

రైలు, స్టేషన్ వదిలిన ఐదు నిమిషాలకి ఆ అమ్మాయి నా బోగీలోకి వచ్చింది. నా సీటు దగ్గరున్న కర్టెన్లు తొలగించి నిర్ఘాంతపోయినట్టు కనిపించింది.

"A4 బోగీ సీటునంబర్ 63 ఇదేనా?" అడిగిందామె.

నా బోగీలోని పసుపురంగు బల్బు దానిష్టప్రకారం వెలిగి ఆరుతోంది. నేను తలెత్తి ఆమెకేసి చూసేప్పుడు అది వెలిగింది.

ఆమె మొహం చూడగానే "ఓహ్..." అన్నాను. ఆమె కళ్ళమీదినించి చూపు మరల్చుకోవటం కష్టమైంది.

"అవును, ఇదే. నా సీటు సరిగ్గా మీ సీటుకి ఎదురుగ్గా ఉంది," తన ప్రశ్నకి తనే జవాబు చెప్పుకుని, బరువైన తన సూట్‌కేస్‌ని పై బెర్త్ మీదికి ఎక్కించింది. నా ఎదురు సీట్లో కూర్చుని, తేలిగ్గా నిట్టూర్చింది.

"నేను పొరపాటున తప్పు బోగీలోకి ఎక్కాను. అదృష్టంకొద్దీ బోగీలని కలుపుతూ దారి ఉంది," అందామె తన పొడవాటి జుట్టుని సరిచేసుకుంటూ. ఆమె పొడవాటి జుట్టు చివర్లు రింగులు తిరిగి ఉంది. నేను క్రీగంట ఆమెని చూడటానికి ప్రయత్నించాను. ఆమె యవ్వనంలో ఉంది. వయసు ఇరవై, పాతికా మధ్య ఉండచ్చు. నడుం వరకూ ఉన్న ఆమె జుట్టుకి ప్రాణం ఉన్నట్టుంది, కొన్ని వెంట్రుకలు ఉండుండి ఆమె నుదుటిమీద పడుతున్నాయి. ఆమె మొహం నాకు స్పష్టంగా కనిపించలేదు కానీ అందమైనదే అని మాత్రం చెప్పగలను. ఆమె కళ్లు - ఒక్కసారి ఆ కళ్లల్లోకి చూశాక చూపుని మరల్చుకోవటం చాలా కష్టమే. అందుకే నేను కళ్లు దించుకుని కూర్చున్నాను.

ఆమె తన హాండ్‌బ్యాగ్‌లోని వస్తువులని బైటికి తీసి మళ్లీ అందులో సర్దింది. నేను కిటికీలోంచి బైటికి చూద్దామని ప్రయత్నించాను. బైట గాఢాంధకారం.

ఓ పది నిమిషాలయాక, "రైలంతా ఖాళీగా ఉన్నట్టుంది," అంది.

"అవును. ఇది కొత్తగా వేసిన హాలీడే స్పెషల్. జనానికి చెప్పకుండా దీన్ని ప్రారంభించారు" అన్నాను.

"అందుకే. లేకపోతే ఈ సెలవల్లో రైళ్లెప్పుడూ నిండిపోయి ఉంటాయి."

"ఇవీ నిండిపోతాయి, బాధపడకండి. కొన్నాళ్లు ఓపిక పట్టండి," అంటూ నేను ముందుకి వంగాను. 'హాయ్! అన్నట్టు నాపేరు చేతన్, చేతన్ భగత్," అన్నాను.

"హాయ్!" అని కొద్దిక్షణాలపాటు నాకేసి చూసి, "చేతన్... మీ పేరు ఎక్కడో విన్నట్టుందే," అంది.

ఓ, పరవాలేదే! అంటే ఈ అమ్మాయి నా మొదటి పుస్తకాన్ని చదివిందన్నమాట. నన్ను జనం అరుదుగా గుర్తిస్తారు. పైగా రాత్రివేళ రైలు ప్రయాణంలో ఒక అమ్మాయితో ఇలాంటి అనుభవమైతే, నాకు ఎన్నడూ జరగలేదు.

"మీరు నా పుస్తకం గురించి విని ఉంటారు, **ఫైవ్ పాయింట్ సమ్‌వన్**. ఆ పుస్తకం రాసింది నేనే," అన్నాను.

"ఆఁ అవును," అని ఆగి, "అవును, నేను మీ పుస్తకం చదివాను. చదువులో రాణించలేకపోయిన విద్యార్థులు ముగ్గురు, ప్రొఫెసర్‌గారి అమ్మాయి, అవునా?" అందామె.

"అవును. అయితే మీకా పుస్తకం ఎలా ఉంది?"

"ఫరవాలేదు, బాగానే ఉంది."

నేను నిస్పృహ చెందాను. అరె, ఆమె కొంచెం పొగిడితే బావుండేదికదా, అనిపించింది.



"అంతేనా? ఒట్టి బాగా ఉండటమేనా?" అన్నాను. పొగడ్త కోసం వెంపర్లాడుతున్నానని మరీ బాహాటంగా తెలియజేస్తూ.

"ఊఁ..." అని మళ్లీ ఆగిపోయింది.

"ఏమిటి? ఊఁ అంటే?" అన్నాను ఓ పదిసెకన్ల తరవాత.

"ఊఁ... బాగానే ఉంది... ఏదో ఓమాదిరి నవల," అంది.

నేను మాట్లాడలేదు. నా మొహంలో కొద్దిగా నిరాశ కనిపించినట్టుంది, "అయినా, మిమ్మల్ని కలవటం చాలా బావుంది, చేతన్. ఎక్కణ్ణించి వస్తున్నారు? ఐఐటి కాన్పూరు నుంచా?" అంది.

"అవును" అన్నాను. ఇంతకు ముందు నా గొంతులో ఆమెపట్ల ఉండిన స్నేహభావం తగ్గిపోయింది. "అక్కడ నేను ఉపన్యాసం యిచ్చాను."

"నిజంగానా? దేన్ని గురించి?"

"నా పుస్తకం గురించి - అదే ఓ మాదిరిగా ఉందే, ఆ నవల గురించి. కొంతమంది దాన్ని గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నారు," నా వ్యంగ్యోక్తులని తియ్యని కంఠంతో కప్పిపుచ్చుతూ అన్నాను.

"ఊఁ... బావుంది!" అని, మళ్లీ మౌనం వహించింది.

నేను కూడా ఏమీ మాట్లాడలేదు. ఇక ఆమెతో మాట్లాడాలనిపించలేదు. నాకు మళ్లీ నా బోగీలో ఎవరూ లేకపోతే బావుండుననిపించింది. పైన ఆరి వెలిగే ఆ పసుపుదీపం నాకు చిర్రెక్కించసాగింది. దాన్ని ఆర్పేద్దామా అనిపించింది కాని, ఇంకా అంత పొద్దుపోలేదు.

"తరువాతది ఏ స్టేషన్? ఈ రైలు మధ్యలో ఎక్కడా ఆగదా?" ఒక ఐదునిమిషాల తరవాత ఆమె అడిగింది, మళ్లీ సంభాషణ మొదలుపెట్టాలని అడిగిందని తెలుస్తూనే ఉంది.

"తెలీదు!" అని కిటికీలోంచి ఏమీ కనబడకపోయినా, బైటికి చూడటానికి మొహం తిప్పుకున్నాను.

"ఏమైంది? అంతా బాగానే ఉందికదా?" అని అడిగింది మృదువుగా.

"ఆఁ! ఎందుకలా అడుగుతున్నారు?" అన్నాను. 'ఎందుకు' అని నేనడిగినప్పుడు నాకు కోపం వచ్చిందని నా గొంతు చెప్పనే చెప్పింది.

"ఏం లేదు. మీ పుస్తకం గురించి నేనన్న మాటలకి మీరు నొచ్చుకున్నారు కదూ?"

"అదేం లేదే!" అన్నాను.

ఆమె నవ్వింది. నేనామెకేసి చూశాను. ఆమె కళ్లల్లాగే ఆమె నవ్వుకూడా సమ్మోహనకరంగా ఉంది. ఆమె నన్ను చూసి నవ్వుతోందని తెలుసు, అయినా ఆమె చిరునవ్వు చెరక్కుండా ఉంటే బావుండుననిపించింది. మళ్లీ కష్టపడి నా చూపుల్ని మరల్చుకున్నాను.

"చూడండి. మీ పుస్తకం బాగా అమ్ముడుపోయిందని నాకు తెలుసు. మీరు యువ రచయితే, కాదనను. కానీ ఎక్కడో... సర్లెండి వదిలెయ్యండి."

"చెప్పండి?"

"మీ పుస్తకం చదివితే మీరు యువరచయిత కానే కాదనిపిస్తుంది."

నేను మాట్లాడకుండా కొన్ని క్షణాలు ఆమెకేసే చూశాను. ఆమె చూపులు అయస్కాంతాల్లాగే ఉన్నా వాటిలో ఎక్కడో ఒక కోమలత్వం కనిపించింది. అవి నన్ను సవాలు చేస్తున్నట్టనిపించింది.

"నేను కాలేజీ పిల్లల గురించి పుస్తకం రాశాననుకుంటున్నాను. అది యువత కాదా?" అని అడిగాను.

"నిజమే. మీరు ఐఐటి గురించి పుస్తకం రాశారు. అలాంటిచోటికి వెళ్లగలిగేవాళ్లు ఏ కొద్దిమందో ఉంటారు. మరి ఐఐటి పిల్లలు యువత అంతటికీ ప్రతినిధులని మీరనుకుంటున్నారా?" అని అడిగి, ఆమె తన బ్యాగులోంచి పిప్పరమెంట్ల డబ్బాతీసి, నన్ను కూడా తీసుకోమంది. నేను వద్దన్నాను. ముందీ విషయమేదో తేల్చుకోవాలనిపించింది.

"అయితే ఏమిటి మీరంటున్నది? ఎక్కడో అక్కడ మొదలుపెట్టాలి కదా, అందుకే కాలేజీ అనుభవాల గురించి రాశాను. అది కేవలం ఐఐటికి సంబంధించిన కథ మాత్రమే కాదని మీకూ తెలుసు. ఆ కథ ఎక్కడైనా జరిగుండచ్చు. మరేం లేదు, ఆ కారణంగా మీరు నా పుస్తకాన్ని పనికిరాదని అనటం బాగాలేదు."

"పనికిరాదని నేననలేదే. ఆ పుస్తకం భారతదేశంలోని యువతకి ప్రాతినిధ్యం వహించదని మాత్రమే అంటున్నాను," నాకు జవాబు చెప్పి ఆమె పిప్పరమెంట్ల డబ్బా మూసేసింది.

"ఓ... అలాగా?..." నేను వాక్యం పూరిచేసే లోపల రైలు బ్రిడ్జి మీదికి చేరుకోవటంతో పెద్దశబ్దం చేస్తూ వెళ్లసాగింది.

ఆ తరవాత మూడునిమిషాలపాటు ఇద్దరం మౌనంగా ఉన్నాం. రైలు బ్రిడ్జి దాటాక చప్పుడు తగ్గిపోవటంతో, సాఫీగా వెళ్లసాగింది.

"యువతకి ప్రాతినిధ్యం వహించేదెవరంటారు?" అన్నాను.

"నాకు తెలీదు. రచయిత మీరు. మీరే ఆలోచించండి," అని నుదుటిమీదపడ్డ ముంగురుల్ని వెనక్కి తోసుకుంది.

"ఇదేం బాగాలేదు, అస్సలు బాగాలేదు," అన్నాను. నా కోపం నాకే ఐదేళ్ల పిల్లవాడి కోపంలాగ అనిపించింది. నాలో నేను గొణుక్కోవటం చూసి ఆమె నవ్వింది. మళ్లీ తనే అంది, "మీరింకా పుస్తకాలు రాయబోతున్నారా?"

"ప్రయత్నిస్తాను," అన్నాను. ఆమెతో మాట్లాడాలని నాకంతగా అనిపించలేదు.

"ఈసారి దేన్ని గురించి? ఐఐఎమ్స్ గురించా?" అంది.



"కాదు."

"ఎందుకు రాయకూడదు?"

"ఎందుకంటే అది దేశంలోని యువతకి ప్రాతినిధ్యం వహించదు కనక."

ఆమె నవ్వటం ప్రారంభించింది.

"చూడండి, నేను అభిప్రాయాలు సేకరిస్తున్నాను. మరిప్పుడు మీరు నన్ను చూసి నవ్వుతున్నారు," అన్నాను.

"లేదు లేదు. నేను మిమ్మల్ని చూసి నవ్వటం లేదు. అయినా మరీ అంత సెన్సిటివ్‌గా ఉండటం మానేస్తారా?"

"నేనేం అతిగా చలించటం లేదు. నాకు నా పుస్తకం గురించి అభిప్రాయం కావాలంతే," అనేసి నా మొహాన్ని పక్కకి తిప్పేసుకున్నాను.

"సరే... అయితే నన్ను వివరంగా చెప్పనివ్వండి. ఐఐటి విద్యార్థుల గురించి నవల రాయటం అనేది బాగానే ఉంది, కానీ మీరు చెప్పే విషయానికి విశాలమైన అర్థం ఏమిటి? నిజమే, పుస్తకం బాగా అమ్ముడుపోతోంది. మీకు ఐఐటి కాన్పూర్‌కి వెళ్లే అవకాశం దొరికింది. కానీ ఆ నవల ప్రయోజనం అంతవరకేనా?" అందామె.

"మరి, ఇంకేమిటి?"

"మీకు యువతీయువకుల గురించి రాయాలని ఉంటే, నిజంగా సమస్యలని ఎదుర్కొంటున్న వాళ్ల గురించి రాయాలి కదా? అంటే, ఐఐటి విద్యార్థులు సమస్యలని ఎదుర్కోవటం లేదని నేననటంలేదు. కానీ, మరి మిగతా వందల, వేలమంది సంగతేమిటి?"

"ఎలాంటివాళ్లు?"

"ఒక్కసారి మీ చుట్టూ చూడండి. మనదేశంలో ఈ ఆధునిక కాలంలో సమస్యలను ఎదుర్కొంటున్న యువతీయువకులు ఎవరు?"

"నాకు తెలీదు. విద్యార్థులా?"

"కాదు రచయిత గారూ. మీ మొదటి పుస్తకంలోని కాలేజీ ఆవరణదాటి ఇక బైటికి రండి. ఇంకేమైనా అసాధారణంగా, ఆసక్తికరంగా కనిపిస్తోందా? అంటే, మీ రెండో పుస్తకంలోని ఇతివృత్తం ఏమిటి?"

ఆమెవైపు మొదటిసారి జాగ్రత్తగా చూడటానికి ఆమెకేసి తిరిగాను. ఆ రాత్రి మహత్తో ఏమో తెలీదు గానీ, నేను మీతో వేళాకోళం ఆడుతున్నాననుకోవద్దు, నేను చూసిన గొప్ప అందగత్తెల్లో ఆమె కూడా ఒకతె అని అనిపించింది. ఆమెలో ఒక పరిపూర్ణత కనిపించింది. ఆమె ముఖం పసిపాప ముఖంలా ఉంది. చిన్న బొట్టు పెట్టుకుంది, కానీ ఆ బొట్టుని చూద్దామంటే ఆమె కళ్లు అడ్డం వస్తున్నాయి.

నేనామె అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పటం మీద దృష్టిపెట్టాను.

"రెండోనవలా? లేదు, ఇంకా ఇతివృత్తాన్ని గురించి ఆలోచించలేదు," అన్నాను.

"నిజంగానా? ఫలానా ఇతివృత్తం అని చూచాయగా కూడా అనుకోలేదా?"

"ఏవో ఆలోచనలు కొన్ని అస్పష్టంగా ఉన్నాయిగాని, ఇంకా తేల్చుకోలేదు."

"ఊ... తమా...షాగా ఉందే!" అంది మాటల్ని ఈడుస్తున్నట్టు. అయితే ఇంకేం, మీ మొదటి పుస్తకం విజయం సాధించడాన్ని గురించి కొన్నాళ్లు మురిసిపోతూ ఉండండి!" అంది.

ఆ తరవాత అరగంటసేపు ఇద్దరం మౌనంగా ఉన్నాం. నా బ్యాగులోంచి వస్తువులన్నీ తీసి, అర్థం లేకుండా వాటిని మళ్లీ బ్యాగులోనే సర్దేశాను. పైజామా మార్చటం అంత అవసరమా అని ఆలోచించాను. ఎలాగూ నిద్రపోయేది లేదు. ఇంకో రైలు మా పక్కనించి ధనధనమంటూ చప్పుడు చేసుకుంటూ వెళ్లింది. మళ్లీ నిశ్శబ్దం.

నాకేసే సూటిగా చూస్తూ, "మీకు పనికొచ్చే ఒక ఇతివృత్తాన్ని నేను సూచించగలను," అందామె.

"ఓ?" ఆమె మాటలు నాకు విసుగు తెప్పిస్తున్నాయి. ఆమె ఇవ్వబోయే సూచన ఎటువంటిదైనా నేను ఆసక్తి చూపించాల్సిందే.

"ఏమిటది?"

"అది కాల్‌సెంటర్‌కి సంబంధించిన కథ."

"అవునా? అంటే ఔట్‌సోర్సింగ్ వ్యాపారం చేసే కాల్‌సెంటర్లేనా? బీపీఓలు?" అన్నాను.

"అవును. మీకు వాటిగురించి ఏమైనా తెలుసా?"

కొంచెం ఆలోచించాను. కాల్‌సెంటర్స్‌లో పనిచేసే నా కజిన్స్ దగ్గర్నించి వాటిగురించి కొంత విన్నాను.

"ఆс, కొద్దిగా తెలుసు. దాదాపు 300,000 మంది వాటిల్లో పనిచేస్తున్నారు. అమెరికాలో ఉండే కంపెనీల అమ్మకాలకీ, సేవలకీ, వాళ్ల వ్యాపార వ్యవహారాలని చక్కబెట్టటానికీ సాయం చేస్తాయి ఈ కాల్‌సెంటర్స్. సామాన్యంగా రాత్రి షిఫ్ట్‌లో యువతీ యువకులు అక్కడ పనిచేస్తూంటారు. నిజానికి చాలా ఆసక్తికరమైన ఇతివృత్తం," అన్నాను.

"ఉత్త ఆసక్తికరమేనా? అక్కడ వాళ్లు ఎదుర్కొనే సమస్యల గురించి ఎప్పుడైనా ఆలోచించారా?" అంది. ఆమె గొంతు మళ్లీ కటువుగా ధ్వనించింది.

"ఓహ్, లేదు..." అన్నాను.

"ఎందుకని? వాళ్లు యువత కాదా? వాళ్ల గురించి మీకు రాయాలని లేదా?" నన్ను దాదాపు గదమాయిస్తున్నట్టుగా అంది.



"ఉండండి, మళ్లీ మనం వాదనలోకి దిగద్దు..."

"నేను వాదించటం లేదు. నా దగ్గర కాల్‌సెంటర్ కథ ఒకటుందని చెప్పాను."

నేను వాచీ చూసుకున్నాను. రాత్రి 12:30 అయింది. కాలక్షేపానికి కథ వినటం అంత కష్టమేమీ కాదు, అనుకున్నాను.

"సరే వింటాను చెప్పండి," అన్నాను.

"చెపుతాను, కానీ ఒక షరతు," అంది.

షరతా? ఏదో ఎత్తు వేస్తున్నట్టుందనిపించింది. "ఏమిటది? నేనీ కథ ఇంకెవరికీ చెప్పకూడదా?" అన్నాను.

"కాదు, నిజానికి ఈ కథ మీరు అందరికీ చెప్పాలి. దాన్ని మీ రెండో పుస్తకంగా రాస్తానని నాకు మాటివ్వాలి."

"ఏమిటీ?" అన్నాను, గాభరాగా.

ఓహ్, ఏమి షరతండీ బాబూ! సరే, నేనొక అమ్మాయిని కలిశాను, అమ్మాయి మాటలు ఆసక్తికరంగా ఉన్నాయి, అందమైన కళ్లున్న ఆ అమ్మాయి కాలక్షేపంగా నాకు కథ చెపుతా నంటోంది. కానీ, అంతమాత్రాన నేను నా జీవితంలోని రెండేళ్లు ఆ పుస్తకం రాస్తూ గడపాలా?

"అంటే ఏకంగా ఒక పుస్తకమే రాయాలా? వేళాకోళం ఆడుతున్నారా? నేను అలాగని మాటివ్వలేను. అది చాలా పెద్ద పని," అన్నాను.

"మీ ఇష్టం," అనేసి ఊరకుండిపోయింది.

నేను ఒక పది సెకన్లు వేచి చూశాను. ఆమె మాట్లాడలేదు.

"మీరు ఆ కథేదో చెప్పాక నేను నిర్ణయించుకోకూడదా? అది ఆసక్తికరంగా ఉందనిపిస్తే, ఏమో రాసినా రాస్తానేమో. కానీ కథ ఏమిటో వినకుండానే ఎలా నిర్ణయించుకోగలను?" అన్నాను.

"ఇక్కడ మీకు ఎంచుకునే స్వేచ్ఛ లేదు. నేను ఆ కథ చెప్తే మీరు రాయవలసిందే," అంది.

"ఒక పెద్ద పుస్తకం రాయాలా...?" మళ్లీ అడిగాను.

"అవును. అది మీ కథలాగా రాయాలి. అంటే ఉత్తమపురుషలో, మీ మొదటి పుస్తకంలో లాగే. ఆ కథలో వచ్చే పాత్రల చిరునామాలూ వగైరా మీకిస్తాను. వాళ్లని మీరు కలుసుకోవచ్చు, మీకు అవసరమైన వివరాలన్నిటినీ సేకరించవచ్చు, కానీ దాన్ని మీ రెండో పుస్తకంగా రాయాలి."

"సరే అయితే, మీరు నాకా కథ చెప్పకపోవటమే మంచిది," అన్నాను.

"ఓకే," అని మరేమీ మాట్లాడకుండా లేచి, తన బెర్తు మీద దుప్పటి పరుచుకుని, దిండూ, కప్పుకునే రగ్గు కూడా సర్దుకుంది. ఆమె నిద్రపోబోతోందని అనుకున్నాను.

మళ్లీ నా వాచీకేసి చూశాను. అర్ధరాత్రి ఒంటిగంట. నాకు ఆమడదూరంలో నిద్రవచ్చే సూచనలు కనిపించలేదు. పొద్దున్న ఢిల్లీ చేరుకునే వరకూ మధ్యలో ఎక్కడా ఆగకుండా వెళ్తుంది ఈ రైలు. ఆమె మినుకుమినుకుమంటున్న పసుపురంగు లైట్ ఆఫ్ చేసేసింది. ఇక బోగీలో ఒక రకమైన భయంగొలిపే నీలంలైటు మాత్రం మిగిలింది. ఆ బల్బు ఎక్కడుందో నాకు అంతుచిక్కలేదు. ఈ విశ్వంలో ఉన్నది మేమిద్దరమే అన్న వింత భావన కలిగింది.

ఆమె తన రగ్గులోకి దూరబోతూంటే, "మీరు చెప్పాలనుకున్న కథ దేన్ని గురించి? కనీసం ఇంకాస్త క్లూ ఇవ్వండి," అని ఆమెతో అన్నాను.

"చెబితే, అప్పుడు రాస్తారా?"

నేనా మసక చీకట్లో భుజాలెగరేశాను. "చెప్పలేను. నాకు అప్పుడే కథ చెప్పకండి, అది దేన్ని గురించో మాత్రమే చెప్పండి," అన్నాను.

ఆమె తలాడించి లేచి కూర్చుంది. మఠం వేసుకుని కూర్చుని మాట్లాడటం మొదలు పెట్టింది.

"సరే, కాల్‌సెంటర్‌లో పనిచేసే ఆరుగురి జీవితంలో ఒక రాత్రి జరుగుతుందా కథ," అంది.

"ఒక్క రాత్రా? అంటే ఈ రాత్రి లాగానా?" అని అడ్డం వచ్చాను.

"అవును, ఒకే ఒక రాత్రి. కాల్‌సెంటర్లో ఒక రాత్రి."

"అది ఒక నవలకి పనికొస్తుందని మీరు నమ్ముతున్నారా? అంటే, ఆ రాత్రికి అంత ప్రత్యేకత ఏముంది?"

ఆమె నిట్టూర్చి, తన మినరల్‌వాటర్ బాటిల్ తెరిచి ఒక గుక్క నీళ్లు తాగింది.

"వినండి, అది మిగతా రాత్రుల్లాటిది కాదు. అది ఒక ఫోన్‌కాల్ వచ్చిన రాత్రి," అందామె.

"ఏమిటీ?" అని పగలబడి నవ్వసాగాను. "అయితే కాల్‌సెంటర్‌కి ఫోన్‌కాల్ వస్తుందా? అదా ప్రత్యేకత?" అన్నాను.

ఆమె చిరునవ్వు కూడా నవ్వలేదు. నేను నవ్వటం ఆపేవరకూ ఎదురుచూసి, నేనేమీ అననట్టే మాట్లాడసాగింది. "అది మామూలు ఫోన్‌కాల్ కాదు, తెలుసా? ఆ రాత్రి... ఆ రాత్రి దేవుడి దగ్గర్నుంచి ఫోన్‌కాల్ వచ్చింది."

ఆమె మాటలు నన్ను నిటారుగా కూర్చోబెట్టాయి.

"ఏమిటీ?"

"నా మాటలు మీరు సరిగ్గానే విన్నారు. ఆ రాత్రి వచ్చిన ఫోన్‌కాల్ దేవుడి దగ్గర్నించి."

"ఏమంటున్నారో, స్పష్టంగా చెప్పండి!"



"ఇప్పుడే ఆ కథ దేని గురించో చెప్పాను కదా! మీరు అడిగారు, గుర్తుందా?" అంది.

"మరయితే... ఎలా... అంటే..."

"ఇంతకన్నా నేను మీకింకేమీ చెప్పను. ఇప్పుడు కథ దేన్ని గురించో మీకు తెలిసింది. పూర్తికథ వినాలంటే, నా షరతేమిటో మీకు తెలుసు."

"ఇది చాలా కఠినమైన షరతు," అన్నాను.

"నాకు తెలుసు. ఇక మీ ఇష్టం," అని మళ్లీ బ్లాంకెట్ తీసి కప్పుకుని, కళ్లు మూసుకుని పడుకుంది.

ఆరుగురు. ఒక రాత్రి. కాల్‌సెంటర్. దేవుడి దగ్గర్నించి ఫోన్. ఈ మాటలు నా తలలో అదే పనిగా తిరగసాగాయి. మరో గంట గడిచింది. రాత్రి రెండుగంటలకి మళ్లీ నీళ్లు తాగటానికి ఆమె లేచింది.

"నిద్రపోవటంలేదా?" అంది సగం మూసిన కళ్లల్లోంచి చూస్తూ.

ఏదో వోల్టేజి ప్రాబ్లం ఉన్నట్టుంది. ఇప్పుడు నీలంలైటు కూడా ఆరుతూ వెలగసాగింది.

"లేదు, అస్సలు నిద్ర రావటం లేదు," అన్నాను.

"ఓకే. అయితే గుడ్‌నైట్," అనేసి మళ్లీ పడుకోబోయింది.

"ఉండండి. లేవండి, లేచి కూర్చోండి," అన్నాను.

"ఓహ్! ఏమిటి? ఏమయింది?" అంది కళ్లు నులుపుకుంటూ.

"ఏం లేదు. ఏం జరిగిందో చెప్పండి. ఆ కథేమిటో చెప్పండి," అన్నాను.

"అయితే మీరు దాన్ని నవలగా రాస్తారా?"

"అవును," అన్నాను కొద్దిగా సంకోచిస్తూ.

"గుడ్!" అని లేచి కూర్చుంది. మళ్లీ మఠం వేసుకుని కూర్చుంది.

ఆ తరవాత రాత్రంతా ఆమె నాకు చెప్పిన కథ పక్క పేజీలో మొదలవుతుంది. అది ఆరుగురి కథ, ముగ్గురు అబ్బాయిలూ, ముగ్గురమ్మాయిలూ. అందరూ కనెక్షన్స్ కాల్‌సెంటర్‌లో పనిచేసేవాళ్లే. నేనీకథని శ్యామ్ తరఫునించి చెప్పటానికి ప్రయత్నించాను. ఎందుకంటే, అతన్ని కలిశాక అతనిలో నాకున్నటువంటి లక్షణాలు కనిపించాయి. మిగతావాళ్ల గురించీ, ఆ రాత్రి గురించీ, మరి మీకు శ్యామ్ చెపుతాడు.

# # 29 నుంచి

"ఎవరూ రాకపోతే?" అంది ఈషా.

"రాకపోతే మనం చచ్చిపోతాం," అన్నాడు వ్రూమ్.

మేం ఒక్క నిమిషం సేపు మాట్లాడకుండా ఉండిపోయాం.

"అందరూ ఏదో ఒకరోజు చావాల్సిందే," అన్నాను మౌనాన్ని భంగపరచటానికి.

"ఇలా చావటమే సులభమేమో! జీవితంతో పోరాడటం కన్నా దాన్ని ముగించటం మంచిది," అన్నాడు వ్రూమ్.

నేను ఔనని తలాడించాను. నాకు భయంగా ఉంది, అందుకే వ్రూమ్ అలా ఏదో ఒకటి మాట్లాడటం నాకు బావుంది.

"నా ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే, మనం చచ్చిపోయాక కూడా ఎవరూ మనని కనుక్కోలేకపోతే, ఆ తరవాత ఏమవుతుంది?" అన్నాడు వ్రూమ్.

"రాబందులు మనల్ని కనిపెడతాయిలే. అవి తప్పకుండా కనిపెడతాయి. నేను డిస్కవరీ ఛానల్లో చూశాను," అన్నాను.

"అదే, నాకు చాలా అవస్థ అనిపిస్తుంది. పదునైన ముక్కులు నా కండరాలని చీల్చటం, నా ఎముకల్ని కరకరా నమలటం, నా శరీరాన్ని ముక్కలుముక్కలుగా చీల్చి చెండాడటం, నాకా ఆలోచనే నచ్చదు. పైగా, నా శరీరం భయంకరమైన దుర్వాసన వేస్తుంది. గౌరవంగా కాలి బూడిదయి, చివరికి పొగగామారి ఎగిరిపోవటమే మంచిది."

"ఏయ్, మీరిద్దరూ ఈ నాన్సెన్సు ఆపేస్తారా ఇక? కనీసం ఏమీ మాట్లాడకుండా ఉండండి!" అంది ఈషా, తన చేతుల్ని ముడుచుకుంటూ.

వ్రూమ్ ఆమెని చూసి నవ్వాడు. తరవాత నావైపు తిరిగి, "అయినా ఈషా అంత కంపు కొట్టదేమోలే. తను రాసుకునే కాల్విన్ క్లెయిన్ సెంటు ఆమె శవాన్ని రోజుల తరబడి ఫ్రెష్‌గా ఉంచుతుంది," అన్నాడు.



# # 1

సముద్రం నీళ్లల్లో చేతులుపెట్టి నీళ్లని అదేపనిగా చిమ్ముతున్నాను. నేను మామూలు కొలనులోనే ఈదలేను. ఇక హిందూ మహాసముద్రం మాట చెప్పాలా! నేను నీళ్లల్లో ఉండగా నా బాస్ బక్షీ నా పక్కనే బోటులో ఉన్నాడు. అతను నా తలని నీళ్లలోకి ముంచుతున్నాడు. ప్రియాంక లైఫ్‌బోట్‌లో కొట్టుకుపోవటం కనబడింది. బక్షీ తన రెండు చేతులతోనూ నా తలని నీటి అడుగున నొక్కిపెట్టటానికి ప్రయత్నిస్తూంటే, నేను కేకలు పెట్టసాగాను. ఉప్పునీరు నా నోట్లోనూ ముక్కుల్లోనూ నిండిపోయింది. దూరంగా 'బీప్ బీప్' అనే చప్పుడు వినిపించింది.

నా ఎడమచెవి దగ్గర నా సెల్‌ఫోన్‌లోని అలారం గట్టిగా మోగేసరికి నా పీడకలనించి నేను బైటపడ్డాను. 'లాస్ట్ క్రిస్‌మస్' అనే రింగ్‌టోన్‌కి నేను నిద్ర లేచాను. ఆ రింగ్‌టోన్ షెఫాలీ నాకు బహూకరించింది. ఆమె నా కొత్త సెమి-గర్ల్‌ఫ్రెండ్. సగం తెరిచిన కళ్లలోంచి చూస్తూ సెల్‌ఫోన్ చేతిలోకి తీసుకున్నాను.

'8:32 పీ.ఎమ్' అనే అక్షరాలూ, వాటి చుట్టూ చిన్న చిన్న గంటలూ సెల్‌ఫోన్ స్క్రీన్ మీద ఆరిఆరి వెలుగుతున్నాయి.

"అయ్యబాబోయ్!" అని పక్కమీదినించి ఒక్క గెంతు గెంతాను!

ఏమాత్రం ప్రాముఖ్యత లేని నా జీవితంలో నాకొచ్చిన కల తాలూకు ప్రాధాన్యతని విశ్లేషించగలిగివుంటే ఎంతో సంతోషించేవాణ్ణి. కానీ తయారయి ఆఫీసుకి వెళ్లాల్సి ఉంది.

'అయ్యో! క్వాలిస్ ఇంకో ఇరవై నిమిషాల్లో వచ్చేస్తుంది' కళ్లు తుడుచుకుంటూ అనుకున్నాను. నాకింకా అలసటగానే ఉంది. కానీ ఆలస్యం అవుతోందనే భయంతో పడుకోలేకపోయాను. అంతేకాదు, బక్షీ మళ్లీ నా కలలోకొచ్చే ప్రమాదం కూడా పొంచి ఉంది.

అన్నట్టు, హాయ్! నా పేరు శ్యామ్ మెహరా, లేదా శామ్ మార్సీ. నన్ను ఆఫీసులో అలాగే పిలుస్తారు, అంటే గుడ్‌గాంవ్‌లోని కనెక్షన్స్ కాల్‌సెంటర్లో. (అమెరికన్ నాలుకలు నా అసలు పేరు పలకటానికి ఇబ్బందిపడి, శామ్ అని పిలవటానికే ఇష్టపడతాయి. మీరు కూడా కావాలంటే నాకు మరేదైనా పేరు పెట్టుకోవచ్చు, నిజంగా నేనేమీ అనుకోను.)

ఏదేమైనా, నేను ఒక కాల్‌సెంటర్ ఏజెంట్‌ని. కొన్ని లక్షల మందో, ఇంకా ఎక్కువ మందో నాలాంటి ఏజెంట్లు మనదేశంలో ఉన్నారు. కానీ ఈ అంబాజీపేట ఆముదం రచయిత, దేశంలో ఇంతమంది ఏజెంట్లుండగా నన్నే ఎంచుకున్నాడు. అతను నన్ను కలుసుకుని, తన రెండో నవల రాయటానికి నన్ను సాయం చెయ్యమని అడిగాడు. అసలు, ఆ పుస్తకమేదో నన్నే

రాయమని అడగబోయాడు. నేను ఒప్పుకోలేదు. నా బయోడేటా, లేదా జీవితంలో అవసరమయ్యే చిన్న చిన్నవే నేను రాయలేను, అలాంటిది ఒక పెద్ద దిక్కుమాలిన పుస్తకం రాయటం నావల్ల కాదని చెప్పేశాను. నన్ను టీమ్‌లీడర్‌గా ప్రమోట్ చెయ్యకపోవటానికి బక్షీ చెప్పిన కారణాన్ని వివరిస్తూ, నా ప్రమోషను మరో ఏడాదికి వాయిదా పడిందని చెప్పాను. నా మేనేజరు బక్షీ నాలో ప్రమోషనుకి 'అవసరమయ్యే నైపుణ్యం' లేదని అన్నాడనీ, నా రివ్యూలో అతను నేను 'గో గెటర్' కాదని రాశాడనీ చెప్పాను. (గో-గెటర్ అంటే ఏమిటో కూడా నాకు తెలీదు, అందుచేత తప్పకుండా నాలో ఆ గుణం లేదని అనాలి.)

కానీ ఈ రచయిత, అవన్నీ తనకి అనవసరమన్నాడు. తను ఎవరికో ఈ నవల రాస్తానని మాటిచ్చాననీ, అందుకని నేను మర్యాదగా సహకరిస్తే సరేసరి, లేదా నన్ను వదలననీ, చెండుకు తింటాననీ బెదిరించాడు. నేను ఈ చిక్కులోంచి బైటపడాలని చాలా ప్రయత్నించాను, కానీ అతను నన్ను పోనివ్వకుండా పట్టుకున్నాడు. ఆఖరికి సరేనన్నాను, అందుకే ఈ పనిలో ఇరుక్కున్నాను, మరి మీరు కూడా నాతోపాటే ఇరుక్కున్నారు.

నేను మీకు మరో హెచ్చరిక చెయ్యాలనుకుంటున్నాను. నా భాష (ఇంగ్లీషు) అంత గొప్పగా ఉండదు, నిజానికి, నాలో ఎటువంటి గొప్పదనమూ లేదు. అందుచేత, మీరు నా పుస్తకంలో గొప్పగొప్ప విషయాలూ, పాండిత్యమూ ఉంటుందని అనుకుంటే, మీరు పెద్దపెద్ద క్లిష్టమైన మాటలున్న, ఇంకేదైనా పుస్తకాన్ని చదవమని సలహా ఇస్తాను. నాకు తెలిసిన అతిపెద్ద పదం 'మేనేజ్‌మెంట్' అనేది మాత్రమే. కాని, ఆ విషయానికి తరవాత వద్దాం. నాకున్న భాషాజ్ఞాన పరిమితి గురించి రచయితకి చెప్పాను. అయినా ఆ అంబాజీపేట జిడ్డు రచయిత, గొప్ప భావాలని ప్రకటించటానికి గొప్ప మాటలే అవసరం లేదన్నాడు. అందుకని, నాకు అతను చెప్పిన పనిచెయ్యక తప్పలేదు. నాకు రచయితలంటే అసహ్యం. సరే, ప్రస్తుతానికి మనం కథలోకెళ్దాం. మీకు గుర్తుందనుకుంటా, నేను ఇప్పుడే ఇంటి దగ్గర నిద్ర లేచాను.

పక్కగదిలో ఏవో చప్పుళ్లవుతున్నాయి. మా బంధువులు ఊళ్లో జరుగుతున్న పెళ్లికి హాజరవటానికని వచ్చి మా ఇంట్లో దిగారు. మా పక్కింటి అబ్బాయి, తన కజిన్‌ని పెళ్లి చేసుకుంటున్నాడు... ఓ, సారీ, నాకింకా నిద్రమత్తు వదల్లేనట్టుంది, తప్పుచెప్పాను, నా కజిన్ తన పక్కింటమ్మాయిని పెళ్లి చేసుకుంటున్నాడు. కానీ నేను ఆఫీసుకెళ్లాలి, పెళ్లికి వెళ్ళలేక పోతున్నాను. అయినా మునిగిపోయిందేమీ లేదులెండి, అన్ని పెళ్లిళ్లూ ఒకలాగే ఉంటాయి, కొంచెం అటూ ఇటూగా.

ఇంకా నిద్రమత్తుతోనే బాత్రూమ్‌వైపు వెళ్లాను. అందులో ఎవరో ఉన్నట్టున్నారు.

బాత్రూమ్ తలుపు తెరిచే ఉంది. అక్కడున్న చిన్న వాష్‌బేసిన్ అద్దం కోసం నా పిన్నమ్మలూ, పెద్దమ్మలూ, మొత్తం ఐదుగురు ఒకర్నొకరు తోసుకుంటున్నారు. ఒకావిడ మ్యాచింగ్ బొట్లు ఇంటిదగ్గరే మర్చిపోయినందుకు తన కూతుర్ని తిడుతోంది. ఇంకొక పిన్ని



తన చెవికమ్మకి ఉన్న శీలని ఎక్కడో పారేసుకుని తెగ హైరానా పడిపోతోంది.

"అచ్చమైన బంగారం శీల, ఎక్కడ పడిపోయింది?" అని నా మొహంలో మొహం పెట్టి గట్టిగా అరిచింది, "పనిమనిషి దొంగిలించిందా?" పాపం పనిమనిషికి ఒక చిన్న శీలని దొంగిలించటం తప్ప మరేం పనిలేనట్టు! దొంగిలిస్తే మొత్తం రెండు కమ్మల్నీ శీలలతో సహా దొంగిలించదూ, అనుకున్నాను మనసులో.

"పిన్నీ, ఒక్క ఐదు నిమిషాలు బాత్రూమ్ వాడుకోవచ్చా? ఆఫీసుకెళ్లటానికి తయారవాలి," అన్నాను.

"ఓ, హల్లో, శ్యామ్. నిద్ర లేచావా?" అంది మా పిన్ని, అమ్మ చెల్లెలు. "ఆఫీసేమిటి? నువ్వు పెళ్లికి రావటం లేదా?" అంది.

"లేదు. నాకు పనుంది. కొంచెం స్నానం చెయ్యచ్చా..."

"చూడండర్రా, శ్యామ్ ఎంత పెద్దవాడైపోయాడో! వీడిక్కూడా త్వరగా ఒక పెళ్లాన్ని చూడాలి," అంది పిన్ని.

అందరూ పకపకా నవ్వసాగారు. ఆ రోజుకి వాళ్ల ప్రాణానికి అదే అన్నిటికన్నా పెద్ద జోక్.

"ప్లీజ్, వెళ్లచ్చా..." అన్నాను.

మా పెద్దమ్మ కొడుకు నాకు అడ్డొస్తూ, "శ్యామ్, ఆడవాళ్లతో ఏమిట్రా గొడవ? అసలు నువ్విక్కడేం చేస్తున్నావు? ఇప్పటికే ముహూర్తానికి చేరుకోగలమో లేదో తెలీదు," అన్నాడు.

"కానీ, నేను ఆఫీసుకెళ్లాలి, తయారవాలి," అని అభ్యంతరం చెప్పాను, మోచేత్తో ఆడవాళ్లని తోస్తూ బాత్రూమ్ కొళాయి దగ్గరకి వెళ్లటానికి ప్రయత్నిస్తూ.

"నువ్వు కాల్‌సెంటర్లో పనిచేస్తున్నావు కదూ?" అన్నాడు మా పెద్దమ్మ కొడుకు.

"అవును."

"నీ పనంతా ఫోన్ల ద్వారానే కదా? మరైతే తయారవటం దేనికి? నిన్నెవరు చూస్తారు?"

నేనా ప్రశ్నకి జవాబు చెప్పలేదు.

నా బ్రష్ అందిస్తూ ఒక పిన్ని, "వెళ్లి వంటింట్లో సింకులో మొహం కడుక్కో," అంది.

వాళ్లందరి వేపు కోపంగా చూశాను. కానీ ఎవరూ దాన్ని గమనించలేదు. లివింగ్‌రూమ్ ముందునుంచి వంటింట్లోకి వెళ్లాను. పెదనాన్నలూ, బాబాయిలూ అందరూ బైట కూర్చుని విస్కీ సోడా రెండో రౌండ్‌లో ఉన్నారు. వాళ్లల్లో ఒకాయన, ఈరోజు మా నాన్న బతికుంటే ఎంత బావుండేదో, అని అంటున్నాడు.

నేను వంటింట్లోకెళ్లాను. ఐస్‌ట్రే మీద కాలుపెట్టినట్టుగా, చల్లగా ఉంది నేల. సబ్బు మర్చిపోయానని అప్పుడు తెలిసింది. మళ్లీ బాత్రూమ్ దగ్గరకెళ్లాను గాని, తలుపు లోపల్నించి గడియపెట్టి ఉంది. వంటింట్లో వేణ్ణీళ్లు లేవు. చన్నీళ్లతో మొహం కడుక్కునే సరికి చలికి గడ్డకట్టుకుపోయినట్టయింది. ఢిల్లీలో చలికాలం భయంకరంగా ఉంటుంది. పళ్లు తోముకుని,

స్టీల్‌ప్లేట్లని అద్దంలాగ వాడుకుని తల దువ్వుకున్నాను. శ్యామ్, శామ్‌గా మారిపోయాడు, పని ప్రారంభించాడు.

నాకు ఆకలేసింది, కానీ ఇంట్లో తినటానికేమీ లేదు. ఎందుకంటే అందరూ పెళ్లి భోజనం తింటారు, అందుకే మా అమ్మ ఇంటిదగ్గర వంట చెయ్యక్కర్లేదనుకుంది.

రాత్రి 8:55కి క్వాలిస్ హారన్ కెవ్వుమని అరిచింది.

బైటికి అడుగు పెడుతూండగా, నా ఐడీ (గుర్తింపుకార్డు) మర్చిపోయానని గుర్తొచ్చింది. నా రూములో వెతికాను, కానీ దొరకలేదు. సరే, మా అమ్మ ఎక్కడుందో నని వెతికాను. ఆవిడ తన బెడ్రూమ్‌లో, అందరు పిన్నమ్మల్నీ చుట్టూ కూర్చోబెట్టుకుని, చీరలూ, నగలూ చూస్తోంది. వాళ్లందరూ ఎవరి నగల సెట్లు ఎక్కువ భారీగా ఉన్నాయా అని పోల్చటంలో మునిగిపోయి ఉన్నారు. సామాన్యంగా అందరికన్నా భారీగా ఉన్నావిడ నగలే భారీగా ఉంటాయనేది వాస్తవం.

"అమ్మా, నా ఐడీ చూశావా?" అన్నాను. ఎవరూ నామాట వినిపించుకోలేదు. నేను మళ్లీ నా రూముకి వెళ్లాను. ఈ లోపల క్వాలిస్ నాలుగుసార్లు హారన్ వేసింది.

"అబ్బ, దొరికింది వెధవ ఐడీ!" అన్నాను. అది మంచం కింద పడి ఉండటం గమనించి. ఆ ఐడీ కార్డుకున్న స్ట్రాప్‌ని పట్టుకుని; దాన్ని బైటికి లాగి, మెడలో వేసుకున్నాను.

అందరికీ చెయ్యి ఊపి గుడ్‌బై చెప్పినా ఎవరూ నాకు మళ్లీ చెయ్యి ఊపలేదు. అందులో ఆశ్చర్యమేం లేదు. నేనంటే వాళ్లకి ఉన్న అక్కర అంతే. నా పిన్నమ్మ, పెద్దమ్మల పిల్లలందరూ డాక్టర్లో, ఇంజినీర్లో అవబోతున్నారు. మా కుటుంబంలో 'బ్లాక్‌షీప్'ని ('నల్ల గొర్రె') - పనికిమాలిన వెధవని - నేనే. అయినా ('నల్ల గొర్రె') అనే మాట సరైనది కాదు. ఏం నల్లగొర్రెలకేం వచ్చింది? జనం నల్ల స్వెట్టర్లు వేసుకోటంలే? కానీ మా 'తండా'లో నా హోదా ఏమిటో ఈ మాటవల్ల మీకు తెలుస్తుంది. అసలు, జనం నాతో ఆ కాసిని మాటలూ మాట్లాడుతున్నారంటే, నాకొక ఉద్యోగమూ, సంపాదనా ఉన్నాయనే. ఈ కాల్‌సెంటర్‌లో చేరేముందు, నేనొక ప్రకటన సంస్థ తాలూకు వెబ్‌సైట్ విభాగంలో పనిచేసేవాణ్ణి. కానీ, ఆ సంస్థ ఇచ్చే జీతం చాలా ఘోరంగా ఉండేది. అదీకాక, అక్కడున్న వాళ్లందరూ నిజాయితీ లేనివాళ్లు. వాళ్లకి వెబ్‌సైట్ మీద కన్నా ఆఫీసు రాజకీయాల పట్ల ఎక్కువ ఆసక్తి ఉండేది. ఆ ఉద్యోగం మానేశాను, అంతే, మిన్నువిరిగి మీద పడ్డట్టు ఇంట్లో భయంకరమైన గొడవ. అప్పుడే 'బ్లాక్ షీప్' అనే పేరు నాకు తగిలించారు. కనెక్షన్స్‌లో ఉద్యోగం సంపాదించుకుని, కొంతవరకు బతికి బైటపడ్డాను. మీ పర్సులో డబ్బుంటేనే ప్రపంచం కొద్దోగొప్పో గౌరవించి, ఊపిరి తీసుకోనిస్తుంది. కనెక్షన్స్‌ని నేను సహజంగానే ఎంచుకున్నాను, ప్రియాంక అక్కడే పనిచేస్తోంది. అయినా ఇప్పుడా కారణం అసందర్భమైపోయింది.

మా పిన్ని బంగారం శీల చివరికి ఆవిడ తలకున్న నకిలీ బన్నుముడిలో ఇరుక్కుని కనిపించింది.

క్వాలిస్ హారన్ మళ్లీ గోల పెట్టింది, ఈసారి కోపంగా.

"వస్తున్నా," అని అరుస్తూ బైటికి పరిగెత్తాను.



# # 2

"ఏమిటి సాబ్, మళ్లీ లేటుగా వచ్చారు?" నేను ముందు సీట్లో కూర్చుంటూంటే డ్రైవర్ అన్నాడు.

"సారీ, సారీ. ముందుగా మిలిటరీ అంకుల్ ఇంటికెళ్లు," అన్నాను అతనితో ఆయాసపడుతూ.

"అలాగే," అన్నాడతను వాచీకేసి చూసుకుంటూ.

"కాల్‌సెంటర్‌కి రాత్రి 10కేనా చేరుకోగలుగుతామా? మా షిఫ్ట్‌కన్నా ముందు షిఫ్ట్ అయిపోయే లోపల నేనక్కడ ఒకర్ని కలవాలి," అన్నాను.

"అది మీతో పనిచేసే మిగతావాళ్లు టైముకి రావటం మీద ఆధారపడి ఉంటుంది," అన్నాడు డ్రైవర్ ముక్తసరిగా, కారుని మిలిటరీ అంకుల్ ఇంటికేసి నడుపుతూ. "ముందు ఆ పెద్దాయన్ని ఎక్కించుకుందాం," అన్నాడు మళ్లీ.

మిలిటరీ అంకుల్‌కి మేము ఆలస్యంగా వస్తే మహాచిరాకు. ఆయన వాడిచూపుల్ని తట్టుకోవటానికి సిద్ధమయాను. ఆయన ఆర్మీలో పనిచెయ్యటంవల్ల చాలా కఠినంగా ప్రవర్తిస్తాడు. ఉద్యోగవిరమణ చేసి కొన్నేళ్లు అయిందనుకోండి. యాభైఏళ్లు పైబడ్డ ఆయన కాల్‌సెంటర్‌లో పనిచేసేవాళ్లందర్లోనూ వయసులో పెద్దవాడు. నాకాయనతో అట్టే పరిచయం లేదు, అందుకని ఆయన గురించి ఏమీ మాట్లాడదల్చుకోలేదు. కానీ ఒక విషయం మటుకు నాకు తెలిసింది. మొదట్లో కొడుకు కోడలితో కలిసి ఉండేవాడనీ, ఆ తరవాత బైటికొచ్చేసి (బైటికి నెట్టబడి-అని చదువుకోమని మనవి), విడిగా ఉంటున్నాడనీ విన్నాను. ఆయనకొచ్చే పెన్షన్ సరిపోక, ఆయన కాల్‌సెంటర్ ఉద్యోగంలో చేరాడట. ఏమయినా, ఆయనకి మాట్లాడటం అసలు ఇష్టమే ఉండదు, అందుకే ఆయన 'వాయిస్ ఏజెంట్' కాదు. ఆయన ఒంటరిగా కంప్యూటర్ చాటింగ్, ఈ-మెయిల్ విభాగంలో కూర్చుంటాడు. ఆయన మా గదిలోనే కూర్చున్నప్పటికీ, ఆయన కుర్చీ దూరంగా, ఫాక్స్ మిషన్ దగ్గరగా ఒక మూల ఉంటుంది. నోరు తెరిస్తే ఒకసారికి మూడు మాటలకన్నా ఎక్కువ మాట్లాడడు. ఆయన మాతో పంచుకునేవి, ఒరే-కుర్రవెధవల్లారా, అన్నట్టు మావైపు చూసే చిన్నచూపులే.

క్వాలిస్, అంకుల్ ఇంటిముందాగింది. ఆయన గుమ్మం దగ్గరే వేచి ఉన్నాడు.

'లేటా?' అన్నాడు డ్రైవర్ వైపు చూస్తూ.

ఆయన ప్రశ్నకి జవాబు చెప్పకుండా డ్రైవర్ కారుదిగి, ఆయనకోసం వెనక డోర్ తీశాడు.

అంకుల్ ఎక్కి, మధ్య సీటులో కాక, వెనక సీట్లో కూర్చున్నాడు. బహుశా నానుంచి వీలైనంత దూరంగా కూర్చోవాలని అనుకున్నట్టున్నాడు.

నీ తప్పే అయి ఉంటుంది, అని అర్థం వచ్చేట్టు నావైపు చూశాడు. వయసులో పెద్దవాళ్లు తమకి చిన్నవాళ్లని విమర్శించే హక్కుందని అనుకుంటారులాగుంది. నేను మొహం మరోవైపుకి తిప్పుకున్నాను. డ్రైవర్, రాధిక ఇంటికి వెళ్లటానికి కారుని వెనక్కి తిప్పాడు.

మా టీమ్‌కి ఒక ప్రత్యేకత ఉంది, అదేమిటంటే మేము ఆఫీసులో కలిసి పనిచెయ్యటమే కాక, ఒకే క్వాలిస్‌లో ఆఫీసుకి చేరుకుంటాం. కొంత రూట్ ప్లాన్ చేసుకోవటం, డ్రైవర్‌ని ఒప్పించటం ద్వారా వెస్టర్న్ అప్లయెన్సెస్ స్ట్రాటజిక్ గ్రూప్‌కి చెందిన మేమందరం ఒకేసారి ఆఫీసు చేరేట్టూ, అలాగే ఒకేసారి ఇళ్లకి వెళ్లేట్టూ జాగ్రత్త తీసుకున్నాం. మేం మొత్తం ఆరుగురం: మిలిటరీ అంకుల్, రాధిక, ఈషా, వ్రూమ్, ప్రియాంక, నేను.

క్వాలిస్, రాధికా ఝా ఇంటి ముందాగింది. ఆఫీసులో ఆమె పేరు రెజినా జోన్స్. ఎప్పట్లాగే రాధిక ఆలస్యంగా వచ్చింది.

"రాధిక మేడమ్ మరీనండీ," అన్నాడు డ్రైవర్ అదేపనిగా హారన్ నొక్కుతూ. నేను గాభరాగా వాచీ చూసుకున్నాను. శెఫాలీకి కోపం తెప్పించటం నాకిష్టం లేదు.

ఆరునిమిషాలు గడిచాక రాధిక తన ముదురు ఎరుపురంగు శాలువని కుడిచేత్తో గట్టిగా పట్టుకుని మా దగ్గరకి పరిగెత్తుకొచ్చింది.

"సారీ, సారీ, సారీ...." మేమేమైనా అనేలోపల తనే డజనుసార్లు సారీ చెప్పింది.

"ఏమయింది?" క్వాలిస్ కదిలాక ఆమెని అడిగాను.

"ఏంలేదు. అత్తగారికి బాదంపాలు...బాదం పప్పుల్ని చితగ్గొట్టటానికి టైమ్ పట్టింది," అలసినట్టుగా సీటులో వెనక్కివాలి అంది. రాధిక మధ్య సీట్లో కూర్చుంది.

"మీ అత్తగారినే బాదంపాలు చేసుకోమని చెప్పు," అన్నాను.

"ఏమిటి శ్యామ్, ఆవిడ బాగా పెద్దది. నేను ఈ మాత్రమైనా చెయ్యకపోతే ఎలా? ముఖ్యంగా ఆవిడ కొడుకు కూడా ఇక్కడుండడు," అంది.

"అవును, నిజమే. ఆ మాత్రం! ఆ తరవాత రోజుకి మూడుపూటలా వంట, ఇంటి పనులు, రాత్రంతా ఉద్యోగం, ఆ తరవాత..." అని భుజాలెగరేశాను.

"ఉష్... ఇదంతా వదిలెయ్. కాల్‌సెంటర్ వార్తలేమైనా తెలిశాయా? నాకు భయంగా ఉంది," అంది.

"వ్రూమ్ చెప్పిందాన్ని బట్టి కొత్తగా ఏమీ లేవు. కొత్త ఆర్డర్లు లేవు, కాల్స్ మాత్రం మునుపటికన్నా చాలా తక్కువగా వస్తున్నాయి - కనెక్షన్స్ పని అయిపోయినట్టే. ఎప్పుడు, అనేదే ప్రశ్న," అన్నాను.

"నిజంగా?" అంది కళ్లు పెద్దవి చేసి.



అది నిజమే. కొత్త తరంలో వెలిసి, డాబుగా కనిపించే కాల్‌సెంటర్లలో అంతా అద్భుతంగా ఉంటుందనీ, క్లయింట్లు వందలకొద్దీ ఉంటారనీ, అక్కడ పనిచేసే ఏజెంట్లకి సుగంధద్రవ్యాలతో మర్దనలు చేయబడతాయనీ, మీరు వినే ఉంటారు. కానీ, మా కనెక్షన్స్ అటువంటి కాల్‌సెంటర్ కాదు. మాకున్న క్లయింటు ఒకే ఒకరు, వెస్టర్న్ కంప్యూటర్స్ అండ్ అప్లయెన్సెస్. ప్రస్తుతం వాళ్ల ఫోన్‌కాల్స్ కూడా పల్చబడ్డాయి. ప్రతిరోజూ, ఈ కాల్‌సెంటర్ పని అయిపోయిందనే పుకారు వినవస్తూనే ఉంటుంది.

"కనెక్షన్స్ మూసేస్తారంటావా? అంటే, శాశ్వతంగా?" రాధిక అడిగింది.

అంకుల్ ఒక కనుబొమ్మ పైకెత్తి మావేపు చూశాడు, కానీ అంతలోనే మళ్లీ వెనకసీట్లో తన ఆలోచనల్లో మునిగిపోయాడు. అప్పుడప్పుడూ ఆయన ఇంకాస్త మాట్లాడితే బావుండునని నాకనిపిస్తూ ఉంటుంది. కానీ అవతలివ్యక్తిని బాధపెట్టే మాటలు అనటం కన్నా, కొందరు నోరు మూసుకునుంటేనే మంచిదేమో అనిపిస్తుంది నాకు.

"అలా కాల్‌సెంటర్ ముయ్యనూవచ్చు, లేదా చాలామంది ఉద్యోగాలు ఊడనూ వచ్చు. వ్రూమ్‌ని అడుగు," అన్నాను.

ఢిల్లీలో అది పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉన్న రోజవటంతో క్వాలిస్ చాలా నెమ్మదిగా కదలసాగింది. ప్రతి వీధిలోనూ పెళ్లి ఊరేగింపే. చాలామంది లావుపాటి పెళ్లికొడుకులెక్కిన గుర్రాలని జాగ్రత్తగా దాటుకుంటూ డ్రైవర్ ముందుకి పోసాగాడు. నేను మళ్లీ టైమ్ ఎంతైందని చూశాను. శెఫాలి ఇవాళ చాలా పెద్ద నసపెట్టబోతోంది.

"నాకీ ఉద్యోగం అవసరం ఎంతైనా ఉంది. నేనూ, అనుజ్ డబ్బు కూడబెట్టాలి," తనలో తను అనుకున్నట్టుగా అంది రాధిక. అనుజ్ రాధిక భర్త. కాలేజీలో ఇద్దరూ విపరీతంగా ప్రేమించుకున్నాక మూడేళ్లక్రితం వాళ్లిద్దరికీ పెళ్లయింది. ఇప్పుడు పక్కా సంప్రదాయ వాదులైన, అనుజ్ తలిదండ్రులతో కలిసి ఉమ్మడి కుటుంబంలో ఉంటోంది. అల్లారుముద్దుగా పెరిగిన రాధిక తలిదండ్రులకి ఒకతే కూతురు. అటువంటి పిల్లకి ఇటువంటి కుటుంబంలో ఇమడటమంటే కష్టమనిపించే ఉండాలి. కానీ ప్రేమ కోసం మనిషి ఏమైనా చేస్తాడు.

డ్రైవర్, ఈషాసింగ్ (ఏజెంట్ ఎలిజా సింగర్) ఇంటికి దారితీశాడు. ఆమె ఇంటిబైటికొచ్చి నిలబడి ఉంది. డ్రైవర్ కారు ఇంజన్ ఆఫ్ చెయ్యకుండా వెనక డోర్ తీశాడు.

ఈషా కారులోకి ఎక్కగానే కారంతా ఖరీదైన సెంటు వాసన వ్యాపించింది. ఆమె రాధిక పక్కన మధ్య సీటులో కూర్చుని, తన తోలుకోటు విప్పేసింది.

"మ్... బావుంది... ఏమిటది?" రాధిక అడిగింది.

"గమనించావా? ఎస్కేప్, క్యాల్విన్ క్లెయిన్" అంది ఈషా సంతోషిస్తూ. మోకాళ్లు ముడిచి, తన పొడవాటి ముదురు గోధుమరంగు స్కర్ట్ చివర్లో ఉన్న కుచ్చుల్ని సర్దింది.

"ఓ... షాపింగ్ చేశావా?" అంది రాధిక.

"దాన్ని క్షణికమైన ఆవేశం అనో, పిచ్చి అనో అను," అంది ఈషా.

ఎలాగోలాగ డ్రైవర్ చివరికి ఖాళీరోడ్డుమీదికి చేరి, కారుని వేగంగా పోనివ్వసాగాడు.

నేను మళ్లీ ఈషాకేసి చూశాను. ఆమె డ్రస్ చేసుకునే పద్ధతి వేలెత్తి చూపటానికి వీల్లేనట్టుగా ఉంటుంది. నేను జీవితంలో ఇంత వరకూ ఎన్నడూ డ్రస్ చేసుకోనంత బాగా ఈషా దాదాపు ప్రతిరోజూ చేసుకుంటుంది. ఆమె వేసుకున్న చేతుల్లేని కాఫీ కలర్ చొక్కా ఆమె స్కర్ట్‌కి చక్కగా సరిపోయింది. పెద్దపెద్ద గోధుమరంగు కమ్మలు పెట్టుకుంది. అవి తినే వస్తువుల్లాగున్నాయి. ఆమె లిప్‌స్టిక్ దట్టమైన కోకో రంగులో ఉంది, ఇప్పుడే చాకలేట్ సాస్ కప్పుని ముద్దుపెట్టుకుని వచ్చినట్టు. ఆమె కళ్లకి ఈ కింది వాటిలో ఏదో ఒకటి తప్పక ఉండి ఉంటుంది – మస్కారా, ఐలైనర్/ఐషాడో (నాకు వాటి గురించి ఏమీ తెలీదు. కానీ ప్రియాంక అవన్నీ వేరువేరు వస్తువులని చెప్పింది.)

"లేక్మీ ఫాషన్ వీక్‌కి ఇంకా నాలుగునెలలు టైముంది. నా ఏజెంటు అందులో నాకు చోటు సంపాదించటానికి ప్రయత్నిస్తున్నాడు," అంది ఈషా రాధికతో.

ఈషాకి మోడల్ అవాలని ఉంది. ఆమె చాలా సెక్సీగా ఉంటుందిట, కనీసం కాల్‌సెంటర్‌లోని వాళ్ల అభిప్రాయం అదే. రెణ్ణెల్ల క్రితం, వెస్టర్న్ కంప్యూటర్ బేలో కొందరు ఏజెంట్లు ఆఫీసులో ఒక పనికిమాలిన విషయానికి ఓట్లు సేకరించారు. మీకు తెలుసుగా, రహస్యంగా జరుగుతాయంటారు కానీ, అందరికీ ముందే తెలిసిపోతుంది. అందరూ రకరకాల టైటిల్స్‌కి ఓట్లు వేస్తారు, ఉదాహరణకి, ఎవరు సెక్సీగా ఉన్నారు, ఎవరు అందరికన్నా అందమైన కుర్రాడు? ఏ అమ్మాయి అందర్లోకీ అందగత్తె, అలాంటివి. ఈషాకి 'హాటెస్ట్ చిక్ ఎట్ కనెక్షన్స్' అనే టైటిల్ ఇచ్చారు. ఆమె ఆ ఓటు ఫలితాల గురించి తనకేమాత్రం ఆసక్తి లేనట్టు పైకి నటించినా, ఆ రోజునించీ ఆమెలో ఒక చిన్నపాటి గర్వం తొణికిసలాడసాగింది. కానీ మొత్తం మీద చూస్తే, తను మంచి అమ్మాయే. సంవత్సరం క్రితం చండీగఢ్ నించి ఢిల్లీకి వచ్చింది. ఆ అమ్మాయి ఢిల్లీ రావటం ఆమె తలిదండ్రులకి ఇష్టం లేదు. కాల్‌సెంటర్ ఉద్యోగం వల్ల ఆమెకి నెలనెలా సంపాదన దొరుకుతుంది, కానీ పగటిపూట ఆమె రకరకాల ఏజెన్సీలకి వెళ్లి మోడలింగ్ అవకాశాల కోసం ప్రయత్నిస్తూ ఉంటుంది. పశ్చిమ ఢిల్లీలోని కొన్ని మామూలు ఫాషన్ షోలలో పాల్గొంది. కానీ అదీ, ఆఫీసులో దొరికిన టైటిల్ తప్ప, ఆమెకి గొప్ప అవకాశాలేవీ ఇంతవరకూ దొరకలేదు. ప్రియాంక ఒకసారి నాకొక విషయం చెప్పింది (దాన్ని ఇంకెవరికీ చెప్పనని నేను మాటిచ్చాను.) ఈషా నిజంగా ఏనాటికైనా మోడల్ అవగలదన్న నమ్మకం తనకి లేదని అంది. 'ఈషాకి మోడల్ అవటానికి కావల్సిన ఎత్తులేదు, పైగా ఆమె చిన్న టౌన్ నించి వచ్చిన అమ్మాయి' – సరిగ్గా ఇదే మాట అంది.

కానీ ప్రియాంకకి ఏ గుడ్డూ తెలీదు. ఈషా ఎత్తు ఐదడుగుల ఐదంగుళాలు, నాకన్నా రెండంగుళాలే పొట్టి (హీల్స్ వేసుకుంటే నాకన్నా అంగుళం పొడుగే) నా ఉద్దేశంలో ఆడపిల్లలకి అది మంచి ఎత్తే. ఇక 'చిన్న టౌన్' సంగతి, అది నాకసలు అర్థమే కాలేదు. ఈషా వయసు కేవలం ఇరవైరెండేళ్లు ఉంటుంది, ఆమె ప్రయత్నించి చూడచ్చు. ఇక చండీగఢ్ చిన్న టౌనేమీ



కాదు, అది రెండు రాష్ట్రాలకి రాజధానీ, కేంద్రపాలిత ప్రదేశమూను. కానీ ప్రియాంక భూగోళ జ్ఞానమూ అంతంత మాత్రమే. నా ఉద్దేశం ప్రియాంకకి ఈర్ష్య. సెక్సీగా లేని అమ్మాయిలందరికీ సెక్సీగా ఉన్నవాళ్లని చూస్తే ఈర్ష్య. ప్రియాంక పేరు సెక్సీ అమ్మాయిల లిస్టులోకే చేరలేదు మరి. అయినా, నా కళ్లకి ప్రియాంక అందంగానే ఉంటుంది, 'కాల్‌సెంటర్ క్యూటీ అవార్డు' పోటీకి ఆమె పేరు కూడా చేర్చబడింది. దానిక్కారణం ఆమె బుగ్గల్లో పడే సొట్టలూ, ముద్దొచ్చే గుండ్రటి మొహం అనుకుంటా. కానీ ప్రియాంక గెలవలేదు. **హెచ్‌ఆర్**లోని మరో అమ్మాయి ఆ అవార్డుని గెల్చుకుంది.

ఇక మేము వ్రూమ్‌ని క్వాలిస్‌లో ఎక్కించుకోవాల్సి ఉంది; అతని అసలు పేరు వరుణ్ మల్హోత్రా (ఏజెంట్ విక్టర్ మెల్). అయినా, అందరూ అతన్ని వ్రూమ్ అనే పిలుస్తారు, కారణం అతనికి చక్రాలమీద నడిచేది ఏదైనా సరే, చాలా ఇష్టం.

క్వాలిస్, వ్రూమ్ ఇల్లున్న వీధిలోకి తిరిగింది. అతను తన బైక్ మీద కూర్చుని మాకోసం చూస్తున్నాడు.

"ఆ బైక్ దేనికి?" అన్నాను కిటికీలోంచి తల బైటికి పెట్టి.

"నేను విడిగా వస్తాను," అన్నాడు వ్రూమ్ తోలు గ్లవ్స్ సరిగ్గా తొడుక్కుంటూ. అతను నల్లరంగు జీన్స్, ట్రెక్కింగ్ షూస్, తొడుక్కున్నాడు. వాటివల్ల అతని సన్నని కాళ్లు మరీ పొడుగ్గా కనిపిస్తున్నాయి. ముదురునీలం రంగు స్వెట్‌షర్టు మీద ఫెరారీ గుర్రం లోగో ఉంది.

"నీకు పిచ్చేమైనా పట్టిందా? ఎంత చలిగా ఉంది! కారెక్కు, ఇప్పటికే ఆలస్యం అయింది," అన్నాను.

బైక్ తోసుకుంటూ అతను నాపక్కనే వచ్చి నిలబడ్డాడు.

"లేదు. నాకివాళ చాలా చికాగ్గా ఉంది. స్పీడ్‌గా బైక్ నడిపి దాన్ని తగ్గించుకోవాలి," అన్నాడు. అతను నాపక్కనే నిలబడ్డం వల్ల నేను మాత్రమే అతని మాటలు వినగలిగాను.

"ఏమయింది?"

"ఏం లేదు. నాన్న ఫోన్ చేశాడు. అమ్మతో రెండుగంటలసేపు ఒకటే వాదన. వాళ్లెందుకు విడిపోయినట్టు? ఒకళ్లమీద ఒకళ్లు గొంతు చించుకుని అరిస్తేగాని బతకలేరు."

"ఏం ఫరవాలేదు భాయ్. నీ సమస్య కాదుగా," అన్నాను.

వ్రూమ్ నాన్న వ్యాపారవేత్త. రెండేళ్లక్రితం పెళ్లాన్ని వదిలేసి వెళ్లిపోయాడు. కుటుంబంతో గడపటం కన్నా, తన సెక్రటరీతో పడుకోవటమంటేనే ఎక్కువ ఇష్టం. అందుకని వ్రూమ్, వాళ్లమ్మా, విడిగా ఉంటున్నారు.

"నేను అస్సలు నిద్రపోలేదు. రోజంతా పక్కమీద ఊరికే పడుకుని ఉండిపోయాను. ఇప్పుడు ఒంట్లో శక్తంతా పోయినట్టుంది. మళ్లీ కొంచెం చలాకీగా అవాలి," తన బైక్ మీద కూర్చుంటూ అన్నాడు వ్రూమ్.

"కానీ చలి విపరీతంగా ఉంది, బాబూ..." అంటూండగా,

"ఏమవుతోంది శ్యామ్ సాబ్?" అన్నాడు డ్రైవరు. నేను తలతిప్పి చూశాను. డ్రైవరు నాకేసి ఏమీ అర్థం కానట్టు చూశాడు. నేను భుజాలెగరేశాను.

"అతను తన బైక్ మీద వస్తున్నాడు," అన్నాను జనాంతికంగా.

"నాతో రా. సగం టైమ్‌లో ఆఫీసుకి చేరుస్తాను," అన్నాడు వ్రూమ్.

చేతులు జోడించి, "నో, థాంక్స్," అన్నాను. వెచ్చగా ఉన్న క్వాలిస్ వదిలి నేనెక్కడికీ వెళ్లదల్చుకోలేదు.

వ్రూమ్ డ్రైవర్‌ని పలకరించటానికి ఒంగి చూశాడు.

"హల్లో డ్రైవర్ సాహబ్!" అన్నాడు.

"వ్రూమ్ సాబ్, మీకు నా క్వాలిస్ నచ్చలేదా?" అన్నాడు డ్రైవర్ ఎంతో విచారంగా.

"అది కాదు, డ్రైవర్‌జీ, నాకివాళ బైక్ మీద వెళ్లాలన్న మూడ్ వచ్చింది," అని వ్రూమ్ డ్రైవర్‌కి ఒక సిగరెట్ పాకెట్ అందించాడు. డ్రైవరు అందులోంచి ఒకటి తీసుకుంటే, వ్రూమ్ మొత్తం పాకెట్ ఉంచేసుకోమని సౌంజ్ఞ చేశాడు.

స్టీరింగ్ మీంచి చేతులు రెండూ ఎత్తేసి, "కావాలంటే ఈ క్వాలిస్‌ని మీరే నడపండి," అన్నాడు డ్రైవరు.

"లేదు. ఇంకోసారెప్పుడైనా చూస్తాను. ప్రస్తుతం నేను ఎగురుతూ వెళ్లిపోవాలి!"

"ఏయ్, వ్రూమ్. కనెక్షన్స్ గురించిన వార్తలేమైనా తెలిశాయా? ఏమైనా ముఖ్యమైనవి?" రాధిక తన జుట్టు సర్దుకుంటూ అడిగింది.

కళ్లచుట్టూ ఉన్న నలుపు తప్పిస్తే, రాధిక అందమైనదే అనాలి. ఆమె చెక్కిళ్లలోని ఎముకలు కొద్దిగా పైకి పొడుచుకొచ్చి ఉంటాయి, తెల్లటి ఒంటిరంగు, పల్చని కనుబొమలు, నల్లటి కళ్లు. నిద్రలేక వాడినా మొహం అందంగానే ఉంది. ఆమె సాదా పసుపురంగు చీర కట్టుకుంది. అత్తారింట్లో చీర తప్ప మరేమీ కట్టుకోవటానికి వీల్లేదు. పెళ్లికి ముందు జీన్స్, స్కర్ట్స్ ఇష్టపడే రాధికకి ఇది కొత్త. పుట్టింట్లో చీర అలవాటు లేదు.

"కొత్తగా వార్తలేమీ లేవు. ఇవాళ ఏమైనా తెలుస్తుందేమో చూస్తాను. కానీ బక్షీ మనందర్నీ ముంచుతాడనిపిస్తోంది. ఏయ్, శ్యామ్, అన్నట్టు వెబ్‌సైట్ మాన్యువల్ పూర్తిగా తయారయిపోయింది. ఆఫీసుకి ఈమెయిల్‌లో పంపేశాను," అని, వ్రూమ్ బైక్ స్టార్ట్ చేశాడు.

"ఓహ్, కూల్! ఇవాళ ఇచ్చేద్దాం," అన్నాను ఉత్సాహంగా.

మేం వ్రూమ్‌ని వదిలేసి మా ఆఖరి పికప్, ప్రియాంక ఇంటికి వెళ్లాం. అప్పటికే 9:30 అయింది. మా షిఫ్ట్ మొదలవటానికి గంట టైముంది. అయినా, శెఫాలి 10:20 కల్లా తన షిఫ్ట్ ముగించుకుని వెళ్లిపోతుందని నాకు ఆందోళనగా ఉంది.



అదృష్టవశాత్తూ ప్రియాంక రోడ్డుమీదికొచ్చి నిలబడి ఉంది.

"హాయ్!" అంది ప్రియాంక కారెక్కి ఈషా పక్కన కూర్చుంటూ. తను మామూలుగా తెచ్చే పెద్ద హ్యాండ్‌బాగ్ కాక మరో పెద్ద తెల్లటి ప్లాస్టిక్ బాగ్ కూడా తీసుకొచ్చింది.

"హాయ్!" నేను తప్ప అందరూ అన్నారు.

"హాయ్, చెప్పాను శ్యామ్," అంది ప్రియాంక.

నేను విననట్టు నటించాను. చాలా విచిత్రం, కానీ మేమిద్దరం దూరమయాక, ఆమెతో మాట్లాడటం నాకు కష్టంగా ఉంటోంది. రోజుకి ముప్పైసార్లు ఆమెని తలుచుకున్నా సరే.

నేనామెకేసి చూశాను. తన దుప్పట్టాని మెడచుట్టూ సర్దుకుంది. ఆమె తొడుక్కున్న ఆకుపచ్చ సల్వార్ కమీజ్ కొత్తదని గమనించాను. ఆ రంగు ఆమె లేత గోధుమరంగు ఒంటికి నప్పింది. నేనామె ముక్కుకేసీ, కోపం వచ్చినప్పుడు పొంగే నాసికారంధ్రాలకేసీ చూశాను. ఆమెకి పిచ్చికోపం వచ్చినప్పుడు బుల్లి మంటలు వాటిలోంచి వెలువడతాయని ఖచ్చితంగా చెప్పగలను.

"శ్యామ్, నేను నీతో 'హాయ్' అన్నాను," అంది మళ్లీ, ఆమెకి జవాబు చెప్పకపోతే పిచ్చికోపం వస్తుంది.

"హాయ్!" అన్నాను. ఈ రోజు రాత్రి నా వెబ్‌సైట్ మాన్యువల్ చూశాక బక్షీ నాకు ప్రమోషన్ ఇస్తాడేమో, అని ఆలోచించసాగాను.

"వ్రూమ్ ఏడీ?" అంది ప్రియాంక. ఆమెకి ఎప్పుడూ అన్నీ తెలియాలి.

"వ్రూమ్ బైక్‌మీదెక్కి..." మోటారు సైకిల్ చప్పుడు చేసింది ఈషా.

"నీ పెర్‌ఫ్యూమ్ బావుంది, ఈషా. మళ్లీ షాపింగ్ చేశావా, ఆఁ?" అని ప్రియాంక తన చిన్న ముక్కుని చిట్లిస్తూ వాసన చూసింది.

"ఎస్కేప్, క్వాలిన్ క్లెయిన్," అని ఈషా పోజిచ్చింది.

"వావ్! అమ్మాయి డిజైనర్ వస్తువులు కొంటోందే!" అంది ప్రియాంక. ఇద్దరూ నవ్వారు. ఈ విషయం నేనెంత ప్రయత్నించినా అర్థం కాదు. ఈషా గురించి కనీసం యాభైసార్లు ప్రియాంక నాతో చెడ్డగా చెప్పి ఉంటుంది, కానీ వాళ్లిద్దరూ కలిసున్నప్పుడు, చాలాకాలం తరవాత కలుసుకున్న అక్కచెల్లెళ్లలాగ ప్రవర్తిస్తారు.

"ఈషా, ఏమిటి ఎవరితోనైనా డేటింగా?" రాధిక అడిగింది.

"డేటింగ్ లేదు, ఏమీ లేదు. నేనింకా పూర్తిగా ఒంటరినే. తగిన అబ్బాయిలు క్షీణించిపోతున్న జాతి అయిపోయారు," అంది ఈషా. అమ్మాయిలందరూ నవ్వారు. నన్నడిగితే అందులో అంతగా నవ్వటానికేం లేదంటాను. వ్రూమ్ కూడా క్వాలిస్‌లో ఉండాల్సింది, అనుకున్నాను. మా టీమ్‌లో స్నేహితుడని చెప్పుకోదగ్గవాడు నాకు అతనొక్కడే ఉన్నాడు. నాకన్నా నాలుగేళ్లు చిన్న, అతనికి ఇరవైరెండు, అయినా అతనితో మాట్లాడటం నాకు హాయిగా

ఉంటుంది. రాధిక మాటలన్నీ తన సంసారం గురించే, నాకు పూర్తిగా పరిచయం లేనివి. ఈషా మోడలింగ్ మోజు కూడా నాకర్థం కాదు, ఎందుకంటే నాకున్న అందానికి నాకెవ్వరూ డబ్బివ్వరు. నేను అందంగా ఉండను : నేను 'బాగానే ఉంటాను', అని ఎవరైనా అంటే ఆ రోజు నాకు ఆనందంగా గడిచినట్టే.

కొంతకాలం క్రితం వరకూ ప్రియాంక నా స్నేహితురాలే కాదు, ఇంకా ఎక్కువగానే ఉండేది. నాలుగునెల్ల క్రితం, మేము ప్రేమికులుగా విడిపోయాం (ప్రియాంక అలాగే అంటుంది), లేక తను నన్ను వదిలించుకుంది (నా ఉద్దేశం ఇది).

అందుకని ఇప్పుడు ఆమె కోరుకున్న పని చెయ్యటానికి ప్రయత్నిస్తున్నాను, అంటే మరో అమ్మాయిని వెతుక్కోవటం, అందుకే శెఫాలితో తిరుగుతున్నాను.

బీప్ బీప్...బీప్ బీప్.

నా షర్టు జేబులోంచి గట్టిగా వచ్చిన బీప్‌లు అందర్నీ ఉలికిపాటుకి గురిచేశాయి.

"ఎవరది?" అడిగింది ప్రియాంక.

"ఓ, సారీ! నాకు ఎస్ఎమ్ఎస్ వచ్చింది," అని మెసేజ్ చూసుకున్నాను.

ఎక్కడున్నావు నా ఎడ్డీ టెడ్డీ
త్వరగా రా...రా...కర్లీ వర్లీ

శెఫాలి పంపిన ఎస్ఎమ్ఎస్. ఈ మధ్య నన్ను పిచ్చిపిచ్చి ముద్దుపేర్లతో పిలుస్తోంది. యస్‌యమ్‌యస్‌కి జవాబిచ్చాను :

క్వాలిస్ ట్రాఫిక్‌లో ఇరుక్కుంది
త్వరగా వచ్చేస్తాను.

"ఎవరది?" ఈషా నన్నడిగింది.

"ముఖ్యమైన వాళ్లు కాదులే," అన్నాను.

"శెఫాలీ కదూ?" అంది రాధిక.

"కాదు," అన్నాను. అందరూ నాకేసి చూశారు.

"కాదు," అన్నాను మళ్లీ.

"అవును, అది శెఫాలీయే, కదా?" ఈషా, రాధిక ఇద్దరూ ఒకేసారి అని, నవ్వారు.

"శెఫాలీ ఎందుకు ఎప్పుడూ ముద్దుముద్దుగా మాట్లాడుతుంది?" ఈషా రహస్యంగా రాధికతో అనటం విన్నాను. ఇద్దరూ మళ్లీ ఇకఇకలూ, పకపకలూ.

"ఏదోలే!" అని నా వాచీ చూసుకున్నాను. క్వాలిస్ ఇంకా ఎన్‌హెచ్ 8 మీదే ఉంది. ఇక గుడ్‌గాంవ్‌లోకి ప్రవేశించబోతున్నామన్నమాట. కనెక్షన్స్ చేరటానికి ఇంకో పదినిమిషాలు పడుతుంది.



కూల్! శెఫాలిని 10:10కి కలవచ్చు, అనుకున్నాను.

"ఒక్కసారి ఇంద్రజీత్ దగ్గర ఆగి టీ తాగి వెళ్దామా? అయినా మనం 10:30కి చేరుకోగలం," అంది ప్రియాంక. లారీడ్రైవర్లు ఎన్‌హెచ్ 8 మీదున్న ఇంద్రజీత్‌లో ఆగి టిఫినూ, టీ లాగిస్తూ ఉంటారు. ఆ ధాబా రాత్రంతా తెరిచే ఉంటుంది.

"ఆలస్యం అవదా?" అంది రాధిక నొసలు చిట్లించి.

"ఏం అవదు. డ్రైవర్‌జీ మెయిన్‌రోడ్డు మీదికొచ్చాక ఇరవై నిమిషాలు కలిపేశాడు. రండి డ్రైవర్‌జీ, నేను మీకు టీ ఇప్పిస్తాను," అంది ప్రియాంక.

"మంచి ఆలోచన. ఈ టీ నాకు నిద్ర రాకుండా ఆపుతుంది," అంది ఈషా.

డ్రైవరు ఇంద్రజీత్ ధాబా దగ్గర స్పీడు తగ్గించి, కౌంటర్‌కి దగ్గరగా ఆపాడు.

"ఏమర్రా, ఇక్కడ ఆగాల్సిందేనా? ఆలస్యం అవుతుందేమో," అందరూ టీ అని కోరస్‌గా అరుస్తూంటే, నేనొక్కణ్ణే అభ్యంతరం చెప్పాను.

"ఆలస్యమేమీ అవదు. మనని త్వరగా తీసుకొచ్చినందుకు డ్రైవర్‌జీకి టీ ఇప్పిద్దాం," అని ప్రియాంక కారు దిగింది. నాకిష్టం లేని పనులు చెయ్యటమే తన జీవిత లక్ష్యం!

"శెఫాలీని త్వరగా కలుసుకోవాలని తొందరపడుతున్నాడులే, అంది ఈషా రాధికని మోచేత్తో పొడుస్తూ. మళ్లీ వాళ్లు పగలబడి నవ్వారు. అంత నవ్వేందుకొస్తోంది, అని అడగాలనుకున్నాను కాని, అడగలేదు.

"అది కాదు, నా షిఫ్ట్ ప్రారంభమయ్యే కొన్ని నిమిషాలముందుగా ఆఫీసు చేరాలని అనిపిస్తుంది," అని క్వాలిస్‌లోంచి దిగాను. మిలిటరీ అంకుల్, డ్రైవరు, మా వెనకాలే దిగారు.

ఇంద్రజీత్ ధాబాలో ప్రతి బల్ల పక్కనా నిప్పుల కుంపట్లుంటాయి. నాకు వేడివేడి పరాఠాల వాసన వచ్చింది, కానీ ఆలస్యం అవుతోందని వాటికి ఆర్డరివ్వలేదు. డ్రైవర్ మాకోసం ప్లాస్టిక్ కుర్చీలు తెచ్చివేశాడు. ఇంద్రజీత్‌లోని సర్వర్లు అతివినయంగా అమ్మాయిలు ఇచ్చిన టీ ఆర్డర్లని తీసుకున్నారు. ఆ ఆర్డర్లు ఒక్కొక్కళ్లకి ఒక్కొక్క రకంగా ఉన్నాయి.

"నాకు పంచదార వెయ్యద్దు," అంది ఈషా.

"నాకు బాగా వేడిగా ఉండాలి," అంది రాధిక.

"నాకు ఏలకులు వేసిన టీ కావాలి," అంది ప్రియాంక.

మేమిద్దరం కాలేజీలో చదువుకునే రోజుల్లో ప్రియాంక తన హాస్టల్ గదిలో నాకోసం ఏలకులు వేసిన టీ తయారుచేసేది. అబ్బాయిల విషయంలో తన అభిరుచి మారిందేమో కానీ, పానీయాల విషయంలో ఏమీ మారలేదు.

మూడు నిమిషాల్లో టీ గ్లాసులు వచ్చేశాయి.

గ్లాసుచుట్టూ వెచ్చదనానికోసం చేతులు పెట్టి, "అయితే ఏమిటి కబుర్లు?" అంది ప్రియాంక. ఏలకులు కాక ప్రియాంకకి ఇష్టమైన 'మసాలా' పనికిమాలిన కబుర్లు.

"ఏవీ లేవు. నువ్వే చెప్పాలి, నీ జీవితంలోనే కదా రకరకాల మార్పులొస్తున్నాయి," అంది రాధిక.

"నిజానికి, నేను మీతో చెప్పాల్సిన విషయం ఒకటుంది," అంది ప్రియాంక దొంగనవ్వు నవ్వుతూ.

"ఏమిటది?" ఈషా, రాధికా ఒకసారే అరిచారు.

"ఆఫీసుకెళ్లాక చెప్తాను. చాలా ముఖ్యమైన సంగతి," అంది ప్రియాంక.

ప్రియాంక భుజాన్ని పొడుస్తూ, "ఇప్పుడే చెప్పవా?" అంది ఈషా.

"టైము లేదు. ఎవరో చాలా తొందరలో ఉన్నారు పాపం!" అంది ప్రియాంక అర్థవంతంగా నావైపు చూస్తూ.

నేను మొహం తిప్పుకున్నాను.

"సరే. నేను కూడా మీకో సంగతి చెప్పాలి, కానీ మీరు దాన్ని ఎవరికీ చెప్పకూడదు," అంది ఈషా.

"ఏమిటో అది?" అంది రాధిక.

"చూడండి," అని ఈషా లేచి నిలబడింది. తన చొక్కాని పైకెత్తి సాపుగా ఉన్న పొత్తికడుపుని చూపించింది. అక్కడ కొత్తగా ఒక రింగు మొలిచింది!

"కూల్! చూడండి, ఇక్కడెవరో అధునాతనంగా తయారవుతున్నారు," అంది ప్రియాంక.

మిలిటరీ అంకుల్ షాక్ తిన్నట్టు చూస్తూ ఉండిపోయాడు. ఆయన ఎప్పుడూ కుర్రాడుగా లేడేమో అనిపిస్తుంది నాకు. పుట్టటమే నలభైఏళ్ల వాడిగా పుట్టి ఉంటాడు.

"ఏమిటది? బొడ్డుకి రింగు పెట్టించుకున్నావా?" అంది రాధిక.

ఈషా అవునని తలాడించి చొక్కా కిందికి దించింది.

"నెప్పి పుట్టిందా?" అంది రాధిక.

"బాగా. ఎవరైనా నీ పొత్తికడుపుని కలిపి గట్టిగా పిన్నుకొట్టితే ఎలా ఉంటుందో ఊహించు," అంది ఈషా.

ఈషా అన్న మాటకి నాకు కడుపులో తిప్పినట్టయింది.

టీని ఒక్క గుక్కలో తాగుతూ, "ఇక వెళ్దామా?" అన్నాను.

"పదండర్రా అమ్మాయిలూ, లేకపోతే కర్తవ్యపరాయణుడిగారికి కోపమొస్తుంది," అంది ప్రియాంక వెటకారపు నవ్వుని అణచుకుంటూ. నాకామె అంటే అసహ్యం.

కౌంటర్ దగ్గరకి బిల్ చెల్లించటానికి వెళ్లాను. అక్కడ వ్రూమ్ టీవీ చూస్తూ కనబడ్డాడు.

"వ్రూమ్?" అన్నాను.



"హాయ్, మీరందరూ ఇక్కడేం చేస్తున్నారు?" అన్నాడు.

ఆడపిల్లల టీ ఐడియా గురించి చెప్పాను.

"నేనొచ్చి ఇరవై నిమిషాలవుతోంది, నాయనా," అన్నాడు వ్రూమ్. తను తాగుతున్న సిగరెట్టు ఆర్పేసి, పీక చూపించి, "ఇదే ఇవాళ మొదటిది," అన్నాడు.

వ్రూమ్ ప్రతి రాత్రీ నాలుగు సిగరెట్లకన్నా ఎక్కువ కాల్చకుండా ఉండటానికి ప్రయత్నిస్తున్నాడు. అయినా, బక్షీ ఆఫీసులో ఉన్నంతకాలం అది అసాధ్యమే.

"నువ్వు నన్ను వేగంగా కాల్‌సెంటర్‌కి తీసుకుపోగలవా? శెఫాలీ వెళ్లిపోయే టైము దగ్గర పడుతోంది," అన్నాను.

వ్రూమ్ కళ్లు ఇంద్రజీత్ ధాబా కౌంటర్ మీదున్న టీవీకి అతుక్కుపోయాయి. ఎన్‌డీటీవీ ఛానెల్లో వార్తలు వస్తున్నాయి. వ్రూమ్‌కి ఆ ఛానల్ అంటే వెర్రి ఇష్టం. ఒకప్పుడు వార్తాపత్రికలో పనిచేసి ఉండటం వల్ల, అతనికి సామాజిక విషయాలన్నా, ప్రపంచ సమస్యలన్నా ఆసక్తి. ఊరికే వార్తలు టీవీలో చూసి, ప్రపంచాన్నే మార్చెయ్యగలనని అనుకుంటూ ఉంటాడు. ఇంతకీ అది అతని భ్రమ.

ఒక టీవీ రిపోర్టరు పార్లమెంటు భవనం ముందు నిలబడి మరోనాలుగు నెలల్లో ఎన్నికలు వస్తాయని చెపుతున్నాడు.

"ఏయ్, నాకు ఇతను తెలుసు. ఇంతకు ముందు నాతోపాటు పనిచేశాడు," అన్నాడు వ్రూమ్.

"వార్తాపత్రికలోనా?"

"ఆc. ఇతన్ని మేం బూంటూ అని పిలిచేవాళ్లం – ఏపనీ సరిగ్గా చేతనయేది కాదు. ఇతను టీవీలో చేరాడని తెలీలేదే. జాగ్రత్తగా చూడు, కాంటాక్ట్ లెన్స్‌లు పెట్టుకుని ఉంటాడు," అన్నాడు వ్రూమ్. ఆ తరవాత ఇద్దరం బిల్లు చెల్లించాం.

"పదవోయ్. లేకపోతే శెఫాలీ నన్ను చంపేస్తుంది."

"శెఫాలీయా? ఓ ఆ కర్లీవర్లీ గురించి అంటున్నావా?" అన్నాడు వ్రూమ్ నవ్వుతూ.

"షటప్, మాన్! తన షిఫ్ట్ పూర్తయాక ఇదే క్వాలిస్‌లోనే ఇంటికి వెళ్తుంది. ఈ కాస్త వ్యవధిలోనే ఆమెతో గడపటం వీలవుతుంది.

"ఒకప్పుడు ప్రియాంకతో తిరిగినవాడివి, ఇప్పుడు శెఫాలీ స్థాయికి దిగజారావా?" అని వ్రూమ్ తన ఆరడుగుల రెండంగుళాల శరీరాన్ని కౌంటర్ మీద మోచేతిని ఆన్చి నిలబడ్డాడు.

"శెఫాలీకి ఏమయింది?" అన్నాను. నా బరువుని ఒక కాలినించి మరోకాలికి మార్చుకుంటూ.

"ఏమీ కాలేదు, కానీ సగం మెదడున్న అమ్మాయి గర్ల్‌ఫ్రెండ్ అయితే అంత బావుండదు చూడు! ఎందుకు నీ టైమ్‌ని ఆ అమ్మాయికోసం పాడుచేసుకుంటున్నావు?"

"ప్రియాంకని మరిచిపోవటానికి ప్రయత్నిస్తున్నాను. జీవితంలో ఆగిపోకుండా ముందుకి పోవటానికి ప్రయత్నిస్తున్నాను," అని, కౌంటర్ మీదున్న గాజుసీసాలోంచి ఒక టాఫీ తీసుకున్నాను.

"అయితే శెఫాలీ ఏమిటి? మత్తుమందా? ప్రియాంకకి మళ్లీ ప్రపోజ్ చెయ్యటం గురించి ఏమాలోచించావు?" అన్నాడు వ్రూమ్.

"నీకు చెప్పా కదా! టీమ్‌లీడర్ అయేవరకూ కుదరదు. అది త్వరలోనే జరుగుతుంది - బహుశా ఈరోజు రాత్రే, మనం వెబ్‌సైట్ మాన్యువల్ ఇచ్చాకే. సరే, ఇంక వెళ్దామా మహాశయా?" అన్నాను.

"అలాగే, పద. ఏవో ఆశలతో బతుకుతున్నావు," అని వ్రూమ్ బైలుదేరాడు.

ఎన్‌హెచ్ 8 మీద గంటకి 120 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతున్న వ్రూమ్‌ని గట్టిగా పట్టుకుని కూర్చున్నాను. నేను చచ్చిపోకుండా ఆఫీసుకి చేరాలనీ, శెఫాలీకి కోపం రాకూడదనీ దేవుణ్ణి ప్రార్థించాను.

బీప్ బీప్.బీప్ బీప్ - మళ్లీ నా మొబైల్ మోగింది.

*కర్లీ వర్లీ విచారంగా ఉంది*

*ఎడ్డీ టెడ్డీ చాలా చెడ్డవాడు*

*నేనింకో పదినిమిషాల్లో వెళ్లిపోతాను : ☹*

వ్రూమ్ కాల్‌సెంటర్‌కి చేరుకోగానే నేను బైక్ మీదనించి దూకేశాను. బైక్ ఒక్క కుదుపుతో ముందుకి వెళ్లింది. వ్రూమ్ రెండు కాళ్లూ నేలకి తాటించి పడకుండా నిలదొక్కుకున్నాడు.

"ఈజీ, మాన్!" విసుక్కున్నాడు వ్రూమ్. "నేను పార్క్ చేసిందాకా ఆగలేవా?" అన్నాడు.

"సారీ, నేను నిజంగానే చాలా ఆలస్యంగా చేరుకున్నాను," అనేసి లోపలికి పరిగెత్తాను.



# # 3

"నేను నీతో మాట్లాడటం లేదు," అంది శెఫాలి తన వెండి చెవిరింగుని వేళ్లతో తిప్పుతూ. ఆ రింగులు ఎంత పెద్దగా ఉన్నాయంటే, గాజుల్లాగ చేతికి వేసుకోవచ్చు.

"సారీ, శెఫాలీ. నా టీమ్ వాళ్లు ఆలస్యం చేశారు," ఆమె పక్కనే, ఆమె బల్లకానుకుని నుంచుని, అన్నాను. ఆమె గుండ్రంగా తిరిగే తన కుర్చీలో కూర్చుని, దాన్ని నావైపునించి తొంభై డిగ్రీలు తిప్పేసింది. తను అలిగిందని చెప్పటమన్నమాట. తన 'బే'లో ఉండేవాళ్లందరూ ఆసరికే వెళ్లిపోవటంతో, డజన్లకొద్దీ కుర్చీలు ఖాళీగా ఉన్నాయి.

"సర్లే, నువ్వు వాళ్ల టీమ్‌కి లీడరువని అనుకున్నానే," అని తన కంప్యూటర్ మీద ఏదో పనిచేస్తున్నట్టు నటించసాగింది.

"నేనేం టీమ్ లీడర్ని కాను. అవాల్సి ఉంది, కానీ ఇంకా కాలేదు," అన్నాను.

"నిన్నెందుకు టీమ్ లీడర్ని చెయ్యటం లేదు వాళ్లు?" నాకేసి తిరిగి, కనురెప్పలు అల్లల్లాడిస్తూ అడిగింది. ఆమె అలా చెయ్యటం నాకు నచ్చదు.

"నాకు తెలీదు. బక్షీ ప్రయత్నిస్తున్నాననే అన్నాడు, కానీ నేను లీడర్‌షిప్‌కి అవసరమైన నైపుణ్యాన్ని ఇంకా వేగంగా సంపాదించాలిట!"

"అంటే?" అని శెఫాలి తన హాండ్‌బాగ్ తెరిచింది.

"నాకు తెలీదు. బహుశా నా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోమని ఉద్దేశమేమో!"

"అయితే మీకు టీమ్ లీడరంటూ ఎవరూ లేరా?"

"లేరు. లీడర్ లేకుండానే మేనేజ్ చేసుకోమన్నాడు బక్షీ. ప్రస్తుతం నేను తనిఖీ పనులు చూస్తున్నాను. కానీ బక్షీ, నాకు మంచి భవిష్యత్తు ఉందనీ, సామర్థ్యం ఉందనీ అన్నాడు."

"అయితే మీ బృందం నీ మాట ఎందుకు వినరు?"

"అలా అని ఎవరన్నారు? నా మాట వింటారే."

"అయితే నువ్వు ఆలస్యంగా ఎందుకొచ్చావు?" అంది, మూడోసారి తన వాక్యాన్ని 'అయితే' అనే పదంతో ప్రారంభిస్తూ.

"శెఫాలీ, కమాన్! ఇంక ఆపెయ్యి," అన్నాను నా వాచీ చూసుకుంటూ. "నీ షిఫ్ట్ ఇవాళ ఎలా అయింది?"

"బాగానే అయింది. వెస్టర్న్ కంప్యూటర్స్ కాల్స్ బాగా తగ్గిపోయాయని టీమ్ లీడర్ అన్నాడు. కష్టమర్సందరూ ట్రబుల్‌షూటింగ్ వెబ్‌సైట్‌ని వాడుకుంటున్నారట."

"కూల్. దాన్ని తయారుచేసిందెవరో తెలుసు కదా నీకు?"

"తెలుసు, నువ్వూ, వ్రూమ్ కలిసి చేశారు. కానీ అది అంత గొప్ప పనని మీరు అనుకోనక్కర్లేదు. ఆ వెబ్‌సైట్ వలన కనెక్షన్స్‌కి రావాల్సిన వ్యాపారం చాలా తగ్గిపోయిందట."

"కాని వినియోగదార్లకి ఆ వెబ్‌సైట్ చాలా ఉపయోగపడుతుంది, అవునా?"

"ఉష్! ఇక్కడ ఆ వెబ్‌సైట్ గురించి మాట్లాడకు. కొందరు ఏజెంట్లు చాలా బాధపడుతున్నారు. ఉద్యోగాల్లోంచి కొందర్ని తీసేస్తారని అంటున్నారు."

"నిజంగానా?"

"నాకు తెలీదు. అసలు నువ్వు ఇంత అన్‌రొమాంటిక్‌గా ఉన్నావేమిటి? కర్లీ వర్లీతో ఎడ్డీ టెడ్డీ ఇలాగేనా మాట్లాడేది?"

కనెక్షన్స్‌లో ఏం జరుగుతోందో అనేది ఇంకా వివరంగా తెలుసుకోవాలని నాకుంది. బక్షీ బైటికి ఏమీ పొక్కనివ్వడు. అతను చెప్పినదల్లా, **మేనేజిమెంట్‌కి సంబంధించిన కొన్ని రహస్య ప్రాధాన్యతలున్నాయనేది** మాత్రమే. వ్రూమ్‌ని కొంచెం గూఢచారి పని చేసిపెట్టమని అడుగుదామని అనుకున్నాను.

"ఏయ్, ఎడ్డీ టెడ్డీ?" అంది శెఫాలి మళ్లీ. నేను ఆమెకేసి చూశాను. 'హల్లో కిట్టీ' హెయిర్‌పిన్నులు పెట్టుకోవటం మానేస్తే, కాస్త చూడటానికి బాగానే ఉంటుంది.

"ఆఁ!"

"నే చెప్పేది వింటున్నావా?"

"ఊఁ!"

"నేనిచ్చిన బహుమతి నచ్చిందా?"

"ఏం బహుమతి?"

"రింగ్‌టోన్స్. నీకు నేను ఆరు రింగ్‌టోన్స్ ఇచ్చా కదా. చూశావా, నీకు గుర్తే లేదు," అంది ఏడుపు మొహంతో.

"గుర్తుంది, చూడు, 'లాస్ట్ క్రిస్‌మస్'ని నా టోన్‌గా పెట్టాను," అని దాన్ని వినిపించటానికి ఫోన్ చేతిలోకి తీసుకున్నాను. దీన్ని వింటే వ్రూమ్ బహుశా నన్ను బతకనివ్వడు, కానీ శెఫాలి కోసం తప్పలేదు.

"అబ్బ ఎంత ముద్దొస్తున్నావో!" అంటూ నా బుగ్గలు గిల్లింది. "ఎంతో బావుంది కదూ నా ఎడ్డీ టెడ్డీ?"

"శెఫాలీ..."

"ఏమిటి?"

"నన్నలా పిలవటం మానేస్తావా?"

"ఏం? నీకు నచ్చలేదా?"

"నన్ను శ్యామ్ అని పిలు చాలు."

"నేను నీకిచ్చిన పేరు నచ్చలేదు కదూ?" ఏడుపుమొహం కాస్తా విషాదంతో నిండిపోయింది.

నేను మౌనం వహించాను. ఆడవాళ్లతో వాళ్లు చేసినది బాగా లేదని ఎప్పుడూ చెప్పకూడదు. అయినా, మనం మౌనంగా ఉన్నా వాళ్లు వదలరు.

"అలా అయితే, నీకు నేనిచ్చిన రింగ్‌టోన్స్ కూడా నచ్చలేదనే అనుకోవాలి," అంది ఏడుపు గొంతుతో.

"నాకు అవి బావున్నాయి, చాలా బావున్నాయి," అన్నాను ఏడుపు లంకించుకుంటుందన్న భయంతో.

"మరయితే, నేనిచ్చిన పేరో? నీకిష్టమైన మరో పేరేదైనా కావాలంటే పెట్టుకో. నేను నీ మిగతా గర్ల్ ఫ్రెండ్స్ లాంటిదాన్ని కాను," అంది. ఆమె కళ్లల్లో రెండు కన్నీటి బొట్లు నిలిచాయి. నేను వాచీకేసి చూసుకున్నాను. మూడు నిమిషాలు, ఆ తరవాత కాలమే అన్ని గాయాలనీ మాన్పుతుంది, అనుకున్నాను. నేను గట్టిగా ఊపిరి పీల్చుకున్నాను. నూట ఎనభై సెకండ్లలో ఆమె వెళ్లిపోవటం ఖాయం. ఆడపిల్ల పెంకివేషాలు వేసేప్పుడు సెకన్లు లెక్కపెట్టటంలో కాలాన్ని చాలా చక్కగా గడిపెయ్యచ్చు.

"ఎటువంటి గర్ల్ ఫ్రెండ్స్ గురించి అంటున్నావు?"

"అంటే, తమ ఇష్టప్రకారం నువ్వు నడుచుకోవాలని చూసేవాళ్లు. నీకు తెలుసుగా, ఎవరో," అంది ముక్కు ఎగపీలుస్తూ.

"ఎవరు? ఏమంటున్నావు నువ్వు?" అన్నాను. నా గొంతు కొంచెం కటువుగా ఉందనిపించింది. అది నిజమే. ప్రియాంక అలాంటిదే, కానీ ఆమె చెప్పినట్టు వినకపోతేనే అధికారం చెలాయిస్తుంది.

"సరే వదిలెయ్. నేను ఏడవటం ఆపేస్తే నాకు ఏదైనా పేరు పెడతావా?" ఆమె వెక్కిళ్లు బావురుమనే ఏడుపులోకి మారే ప్రమాదం ఉన్నట్టనిపించింది.

"అలాగే," అన్నాను. ఈ ప్రహసనం ఆమె ఆపేస్తే నేను ఆమె ఇంటిల్లిపాదికీ కొత్తపేర్లు పెట్టేస్తాను.

"ఓకే, నాకో పేరు పెట్టు," అది మామూలుగా అవుతూ.

ఎంత ఆలోచించినా నాకే పేరూ తట్టలేదు.

"శెఫీ? ఎలా ఉంది, శెఫీ?" అన్నాను చివరికి.

"నో... నాకు ఇంకా ముద్దుగా ఉండే పేరు కావాలి," అంది. శెఫాలీకి మాటల్ని సాగదీయటమంటే చాలా ఇష్టం.

"ఇప్పటికిప్పుడు ముద్దుగా ఉండే పేరేదీ తట్టటం లేదు. నాకు పనుంది. నీ క్వాలిస్ కూడా ఇక బైలుదేరుతుందేమో?" అన్నాను.

శెఫాలి వాచీ చూసుకుంది.

"అవును, ఇక నేను బైలుదేరటం మంచిది. రేపటిలోపల ఏదో ఒక పేరు ఆలోచిస్తావా?" అంది.

"ఆలోచిస్తాను. బై."

"నాకో చిన్న ముద్దివ్వు," అని వేలితో తన బుగ్గమీద తట్టింది.

"ఏమిటీ?"

"చిన్న ముద్దు."

"ఓహ్, తప్పకుండా," పెదవులు ఆమె బుగ్గకి తాకించి, వెనక్కి తిరిగి నా 'బే'కి వెళ్లటానికి బైలుదేరాను.

"బై బై, ఎడ్డీ టెడ్డీ," ఆమె గొంతు నావెంటే వచ్చింది.



# # 4

శెఫాలి 'బే' నుంచి నేను నా ఆఫీసుకి వెళ్లేసరికే అందరూ బల్ల దగ్గర ఉన్నారు.

మా 'బే' పేరు, 'వెస్టర్న్ అప్లయెన్సెస్ స్ట్రాటజిక్ గ్రూప్', లేదా డబ్ల్యూఏఎస్‌జీ. మరో 'బే'లో వాళ్లు కంప్యూటర్ వినియోగదారులకి ఏదైనా సమస్య వస్తే చూస్తారు. కానీ మేము ఇంటికి పనికివచ్చే ఫ్రిజ్‌లూ, ఒవెన్‌లూ, వాక్యూమ్ క్లీనర్ల వంటి గృహోపకరణాలని ఉపయోగించే వినియోగదారుల కోసం పనిచేస్తాం. మేనేజ్‌మెంటు మమ్మల్ని 'స్ట్రాటజిక్ బే' అని పిలవటానికి కారణం, మేము ఎక్కువ గొడవపెట్టే వాళ్లతోనూ, బాధపెట్టే వాళ్లతోనూ వేగటంలో ప్రత్యేక నైపుణ్యం కలవాళ్లం కావటమే! ఈ 'స్ట్రాటజిక్' వినియోగదార్లు మాటిమాటికీ ఫోన్ చేస్తూ ఉంటారు, ఎంత చెప్పినా అర్థం చేసుకోలేని మట్టిబుర్రగాళ్లు. (నిజానికి ఇది చాలామంది వినియోగదార్లకి వర్తిస్తుంది.)

మేము ప్రత్యేకమైన వాళ్లమని అనుకుంటూ ఉంటాం, ఎందుకంటే మేము మెయిన్ కంప్యూటర్ బేలో భాగంగా లేము. మెయిన్ బేలో వెయ్యికి పైగా 'ఏజెంట్లు'ంటారు. వాళ్లు 'వెస్టర్న్ కంప్యూటర్స్' తాలూకు అతిపెద్ద అకౌంట్లు పనులు చూస్తూంటారు. అక్కడికొచ్చే ఫోన్లు మరీ అంత అసాధారణంగా ఉండవు కానీ, డబ్ల్యూఏఎస్‌జీలో మాకు దొరికే ఏకాంతం వాళ్లకి దొరకదు.

దీర్ఘచతురస్రాకారంలో పొడుగ్గా ఉన్న నా బల్ల దగ్గరకెళ్లి సీట్లో కూర్చున్నాను. మా సీట్లన్నీ ముందే ఫలాన చోట ఉంటాయని నిర్ధారణ చేసి ఉంటుంది : నేను ప్రూమ్ పక్కన కూర్చుంటాను, ప్రియాంక సరిగ్గా నాకు ఎదురుగ్గా కూర్చుంటుంది; ఈషా ప్రియాంక పక్కన, రాధిక ఈషా పక్కనా కూర్చుంటారు. మా 'బే'లో అడ్డుగోడలూ, కేబినెట్లూ ఉండవు. అందరూ కనిపిస్తూనే ఉంటారు. మిలిటరీ అంకుల్ చాట్ స్టేషన్ గదిలో ఒక మూలకి ఉంటుంది. మిగతా మూడు మూలల్లోనూ, బాత్రూమ్‌లు, కాన్ఫరెన్స్ గది, కాయితాలూ, పెన్నులూ వగైరా అందజేసే గదీ ఉన్నాయి.

అయినా, నేను వెళ్లేసరికి అంకుల్ తప్ప ఇంకెవరూ తమతమ సీట్లలో లేరు. అందరూ ప్రియాంక చుట్టూ చేరారు.

"ఏమిటి ఏదో చెప్పాలన్నావు? ఇప్పుడు చెప్పు," అంటోంది ఈషా.

"ఓకే, ఓకే. కానీ ఒక షరతు. ఇది డబ్ల్యూఏఎస్‌జీ బైటికి పొక్కకూడదు," అంది ప్రియాంక కూర్చుంటూ. తన సీటు కిందినించి ఒక పెద్ద ప్లాస్టిక్ బాగుని తీసింది.

"ఏయ్ అమ్మాయిలూ," అన్నాను వాళ్ల సరదాకి అడ్డొస్తూ.

అందరూ నాకేసి చూశారు.

డెస్క్‌నీ, దానిమీద ఉన్న ఫోన్లనీ చూపించాను. తరవాత నా వాచీకేసి చూసుకున్నాను. 10:29 అయింది. ఫోన్లు రిసీవ్ చేసుకోటానికి ప్రతిరోజూ సాయం చేసే వారి డ్యూటీ ముగియబోతోంది, ఇంకొక్క నిమిషంలో మాకు ఫోన్లు రావటం మొదలవుతుంది.

అందరూ తమ తమ సీట్లకెళ్లి హెడ్‌సెట్లని తగిలించుకున్నారు.

"గుడ్ ఈవినింగ్, అందరూ దయచేసి దీన్ని జాగ్రత్తగా వినండి," ఎవరిదో గొంతు గట్టిగా మా 'బే' అంతా వినిపించింది. నేను పైకి చూశాను. ఆ గొంతు, అగ్నిప్రమాదం జరిగితే వచ్చే లౌడ్‌స్పీకర్‌లోంచి వస్తోంది.

"ఈ అనౌన్స్‌మెంట్లంటే నాకు బలే చిరాకు," అంది ప్రియాంక.

"కంట్రోల్ రూమ్ నించి మాట్లాడుతున్నాం. వచ్చే శుక్రవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవిస్తే ఎలా తప్పించుకోవాలో చూపించే అభ్యాసం ఉంటుందని ఏజెంట్లందరికీ తెలియ పరుస్తున్నాం. కాల్‌సెంటర్ నించి ఎలా బైటపడాలో మేము ఇచ్చే సూచనలని జాగ్రత్తగా పాటించి తెలుసుకోండి. ధన్యవాదాలు. మీ షిఫ్ట్ హాయిగా గడుస్తుందని ఆశిస్తున్నాం." అంది ఆ గొంతు.

"ఎందుకు వీళ్లు ఇలా చెపుతూ ఉంటారు. ఈ ఆఫీసుకి ఎవరూ నిప్పంటించబోవటం లేదే," అంది ఈషా.

"గవర్నమెంట్ రూల్స్," అన్నాడు వ్రూమ్.

కంప్యూటర్ తెరమీద రెండు బీప్స్ వచ్చి మా షిఫ్ట్ ప్రారంభమైందని తెలియజేయటంతో అందరూ మాట్లాడటం ఆపేశారు.

10:31కి ఫోన్‌కాల్స్ రావటం మొదలైంది. మా కామన్ స్విచ్‌బోర్డు మీద నంబర్లు వెలగసాగాయి. మేము ఒకదాని తరవాత ఒకటిగా కాల్స్ తీసుకున్నాము.

"గుడ్ ఆఫ్టర్‌నూన్, వెస్టర్న్ అప్లయెన్సెస్, విక్టర్ మాట్లాడుతున్నాను, మీ సమస్యేమిటి?" అన్నాడు వ్రూమ్ తన మొదటి కాల్‌కి స్పందిస్తూ.

"అవును, నా రికార్డుల్లో ఉన్న ప్రకారం నేను మిసెస్ స్మిత్‌తో మాట్లాడుతున్నాను. మీ దగ్గర డబ్ల్యూఏఎఫ్-200 డిష్ వాషరుంది. అంతే కదా?" ఈషా అంది.

ఈషా జ్ఞాపకశక్తి చూసి ఫోన్ చేసినావిడ సంతోషించింది. అందులో అంత గొప్పేమీ లేదు, మా ఆటోమేటెడ్ సిస్టమ్‌లో ఫోన్ చేసిన ప్రతి వ్యక్తి రికార్డూ ఉంటుంది. వాళ్ల పేర్లూ, చిరునామాలూ, క్రెడిట్ కార్డు వివరాలూ, వెస్టర్న్ అప్లయెన్సెస్‌లో వాళ్లు ఇంతక్రితం కొన్న వస్తువులూ, అన్నీ మాకు తెలుస్తాయి. క్రితంసారి ఎప్పుడు ఫోన్ చేశారన్న విషయం కూడా అందులో ఉంటుంది. అసలు, మా దగ్గరికి - అంటే వెస్టర్న్ అప్లయెన్సెస్ స్ట్రాటజిక్ డెస్క్‌కి - ఆ వ్యక్తి ఫోన్ ఎందుకొచ్చిందంటే ఆమె తరుచు విడవకుండా ఫోన్ చేస్తూ ఉంటుంది. ఈ రకంగా మెయిన్ బే తన పని నిర్విఘ్నంగా చేసుకుంటూ పోవచ్చన్నమాట.

ఒక్కోసారి డబ్ల్యూఏఎస్‌జీ స్థాయినించి చూస్తే కూడా విచిత్రంగా ప్రవర్తించే వినియోగదార్లు మాకు తగులుతూ ఉంటారు. అందరి గురించీ చెప్పను కానీ, వ్రూమ్‌కి 10:37కి వచ్చిన ఫోన్ ఈ విధంగా సాగింది :

"చెప్పండి, మిసెస్ పాల్‌సన్! మీరు మాకు గుర్తుండకపోవడమేమిటండీ! హాపీ థాంక్స్ గివింగ్, మా డబ్ల్యూఏ 100 మోడెల్ ఓవెన్‌లో పెద్ద టర్కీని వండుతున్నారని ఆశిస్తున్నాం," అన్నాడు వ్రూమ్. మా అందరి ముందు ఆ అమెరికన్ పండగని గుర్తుచేస్తూ ఒక కాయితం ఉంది.

వినియోగదారు ఏమందో నాకు వినబడలేదు, కానీ మిసెస్ పాల్‌సన్ ఓవన్ గురించి తనకున్న సమస్య వివరిస్తోందని గ్రహించాను.

"లేదు, మిసెస్ పాల్‌సన్. మీరు కవరుకున్న స్క్రూలని యిప్పి ఉండకూడదు," వీలైనంత వినయంగా అన్నాడు వ్రూమ్.

"లేదు, మేడమ్. డబ్ల్యూఏ 100 లాంటి ఎలెక్ట్రిక్ పరికరాన్ని ఆ పనిలో శిక్షణ పొందిన వాళ్లే బాగుచెయ్యాలి," డబ్ల్యూఏ 100 మాన్యువల్ రాసిన వివరాలని, అక్షరం పొల్లుపోకుండా వల్లించాడు వ్రూమ్.

మిసెస్ పాల్‌సన్ మరో నిమిషంసేపు మాట్లాడింది. మా స్ట్రాటజీ బేకి సామర్థ్యం ఉందని ఎవరూ అనుకోవటం లేదు. కానీ ఎక్కువసేపు ఇలాటి కాల్స్ రావటం వల్ల, వ్రూమ్ జవాబు చెప్పే సమయం మీద ప్రభావం పడచ్చు.

"చూడండి, మేడమ్, మీరు ముందుగా ఆ పై కవర్ ఎందుకు తియ్యవలసి వచ్చిందో నాకు చెప్పండి. ఆ తరవాత మీకు షాకెందుకు కొట్టిందో మేము బహుశా చెప్పగలుగుతాం... అందుకే, చెప్పండి... అవును... ఓ... నిజంగానా?" వ్రూమ్ గుండెలనిండా ఊపిరి పీల్చుకుంటూ మాట్లాడుతున్నాడు. స్టార్ ఏజెంట్ అవటానికి కావల్సిన ఓర్పు, అతని స్వభావంలోనే లేదు.

నేను చుట్టూ కలయచూశాను. అందరూ ఎవరి కాల్స్‌తో వాళ్లు బిజీగా ఉన్నారు. రాధిక ఎవరికో ఫ్రిజ్‌లో పేరుకున్న ఐస్ ఎలా తొలగించాలో నేర్పి, సాయం చేసింది; ఈషా ఒక వినియోగదారుడికి గిన్నెలు కడిగే మిషన్‌ని అట్టపెట్టెలలోంచి బైటికి తియ్యటంలో సాయపడింది. అందరూ అమెరికన్ యాసతో మాట్లాడుతున్నారు. క్వాలిస్‌లో మాట్లాడిన తీరుకి ఇది భిన్నంగా ఉంది. క్రితం రోజు వచ్చిన కాల్స్ సంఖ్యని ఒకచోట కూర్చటానికి నేను కాసేపు నాకొచ్చే కాల్స్‌ని తీసుకోవటం ఆపాను. నాకీ పనంటే పెద్ద ప్రేమేమీ లేదు, కానీ బక్షీ నాకు వేరే మార్గం లేకుండా చేశాడు.

"చూడండి, మేడమ్," వ్రూమ్ ఇంకా మిసెస్ పాల్‌సన్‌తో అవస్థ పడుతున్నాడు, "మీ టర్కీ ఓవెన్‌లో పట్టలేదనీ, దాన్ని ముక్కలుగా కొయ్యటానికి మీరు ఇష్టపడలేదనీ, నాకర్థమైంది.

అయినా మీరు దాన్ని విడదీసి ఉండకూడదు... కానీ, ఇటు చూడండి, అది ఆ వస్తువు తప్పు కాదు... నేను నిజంగానే మీరు ఏం చెయ్యాలో చెప్పలేను... మీ అబ్బాయి వస్తున్నాడని విన్నాను, మేడమ్... మీ దగ్గర డబ్ల్యూఏ 150 ఉండి ఉంటే అది పెద్దది కదా..." అన్నాడు వ్రూమ్ వేగంగా ఊపిరి పీలుస్తూ.

మిసెస్ పాల్సన్ ఇంకాసేపు కేకలు పెట్టింది.

"మిసెస్ పాల్సన్, మీరు మీ ఓవెన్‌ని వీలైనంత త్వరగా మీ డీలర్ దగ్గరకి తీసుకెళ్లమని సలహా ఇస్తున్నాను. ఈసారి, చిన్న టర్కీగా చూసి కొనండి... అవును ఈ రాత్రికి రెడీమేడ్ టర్కీ అయితే మరీ మంచిది... లేదు, టర్కీ సప్లయి చేసేవాళ్ల ఫోన్ నెంబరు నా దగ్గర లేదు. ఫోన్ చేసినందుకు థాంక్స్ మిసెస్ పాల్సన్, బై," అని వ్రూమ్ ఫోన్ పెట్టేశాడు.

వ్రూమ్ బల్లమీద పిడికిలితో బలంగా గుద్దాడు.

నా కాయితాల మీదనించి కళ్లు ఎత్తకుండానే, "అంతా సవ్యంగానే ఉంది కదా?" అన్నాను.

"ఊఁ... అవిడొక సైకో కేసు," అని గొణిగాడు. ఇంతలో అతని కంప్యూటర్ తెర మీద మరో నంబర్ వెలిగి ఆరసాగింది.

నేను పదినిమిషాల పాటు కంప్యూటర్ మీద నా పని చేసుకున్నాను, అదే క్రితం రోజు వచ్చిన కాల్స్ లెక్క సరిచూడటం. మిగతావాళ్లు మర్యాదగా మాట్లాడుతున్నారా లేదా అని చూసే బాధ్యత కూడా బక్షీ నామీదే పెట్టాడు. మధ్యమధ్యలో నేను ఇంకొకరికి వచ్చిన కాల్స్‌ని వింటున్నాను. 10:47కి నేను ఈషా ఫోన్‌కి లైన్ కలిపాను.

"అవును సార్! నా గొంతు మీ అమ్మాయి గొంతులా ఉందా? ఓ, థాంక్సండీ. అయితే మీ వాక్యూమ్ క్లీనర్ సమస్య ఏమిటి?" అంటోంది ఈషా.

"మీ గొంతు వినటానికి ఎంతో హాయిగా ఉంది," అన్నాడు ఫోన్ చేసిన వ్యక్తి.

"థాంక్యూ, సార్! మరి, వాక్యూమ్ క్లీనర్...?"

ఈషా గొంతు చక్కగా ఉంది – వినయమూ, స్థిరత్వమూ సమపాళ్లలో ఉన్నాయి. మేము సగటున కాల్స్‌ని ఎంతసేపట్లో ముగిస్తామనే విషయాన్ని మా యాజమాన్యం గమనిస్తూ ఉంటుంది. డబ్ల్యూఏఎస్‌జీకి ఫోన్‌చేసే వినియోగదార్లు ఇబ్బందిపెట్టే రకం కాబట్టి మాకు కాల్‌కి రెండున్నర నిమిషాలు, అంటే మామూలు కన్నా ఎక్కువ, కేటాయిస్తారు. నేను అందరి కాల్స్‌నీ నా ఫైల్స్‌లో పరిశీలించాను. అందరం రెండున్నర నిమిషాలు దాటకుండా చూసుకుంటున్నాం.

'బీప్', ఫాక్స్ మిషన్ చప్పుడుకి నేను తలెత్తి చూశాను. ఈ సమయంలో మాకు ఫాక్స్ ఎవరు పంపించారా అని కాస్త విస్తుపోయాను. మిషన్ దగ్గరకెళ్లి ఫాక్స్ ఏమొచ్చిందో చూశాను. బక్షీ పంపించాడు.

అతను పంపించిన ఏడు పేజీలనీ ప్రింటు చేసి బైటికి తొయ్యటానికి మిషన్‌కి మూడు నిమిషాలు పట్టింది. నేను మొదటి పేజీని మిషనులోంచి చింపి తీసి, పైకెత్తి పట్టుకున్నాను.



సుభాష్ బక్షీ నుంచి :

విషయం : శిక్షణ ప్రారంభం

ప్రియమైన శ్యామ్,

టీచర్లు తక్కువగా ఉండటం వల్ల, అమెరికన్ యాసతో మాట్లాడే శిక్షణ ఇవ్వటానికి నీ పేరు శిఫార్సు చేశానని తెలియజేస్తున్నాను. దీనికి నువ్వు కొంత సమయాన్ని కేటాయించ గలవని నమ్ముతున్నాను. ఎప్పటిలాగే, నీకు తగినవీ, కీలకమైనవీ అయిన అవకాశాలు కల్పించాలని ప్రయత్నిస్తున్నాను.

నీ
సుభాష్ బక్షీ
మేనేజర్, కనెక్షన్స్

ఆ ఫాక్స్‌లో ఉన్న మిగతా వివరాలు చదివి నేను ఉక్కిరిబిక్కిరి అయాను. నా షిఫ్ట్ కాక, కొత్తగా ఉద్యోగంలో చేరినవాళ్లకి మాట్లాడటం నేర్పేందుకు, మరిన్ని గంటలు నాచేత పని చేయించుకోవాలని చూస్తున్నాడు, బక్షీ. అదనపు పని మాట అలా ఉంచి, అమెరికన్ యాస నేర్పించాలంటే నాకు రోత. అమెరికన్ యాస చాలా అవకతవకగా ఉంటుంది. అమెరికన్లూ, వాళ్ల భాషా చాలా సజావుగా ఉంటాయని మీరనుకోవచ్చు, కానీ అది నిజం కాదు. వాళ్లు ప్రతి అక్షరాన్నీ రకరకాలుగా పలుకుతారు.

ఒకే ఒక ఉదాహరణ ఇస్తాను – టీ అనే అక్షరం. ఈ అక్షరాన్ని వాళ్లు నాలుగు రకాలుగా పలుకుతారు. ఒక్కోసారి దాన్ని అసలు పలకరు. అప్పుడు 'ఇంటర్‌నెట్' అనే మాట 'ఇన్నర్‌నెట్'లా వినిపిస్తుంది. 'అడ్వాంటేజ్' అనేది 'అడ్వాన్నేజ్'లా వినిపిస్తుంది. రెండో రకం ఉచ్చారణలో టీ, ఎన్ అనే అక్షరాలు కలిసిపోతాయి, 'రిటెన్' అనే 'రిట్న్' అవుతుంది, 'సర్టెన్' అనే మాట 'సర్ట్న్' అవుతుంది. ఇక మూడోది, టీ అనే అక్షరం మధ్యలో వచ్చినప్పుడు, 'డీ' లాగ వినిపిస్తుంది. 'డాటర్' 'డాడర్' లాగూ, 'వాటర్' 'వాడర్' లాగూ వినిపిస్తాయి. ఇక చివరి రకం, మీకు తెలుసుకోవాలని ఉంటే, అమెరికన్లు 'టీ'ని 'టీ'లాగే పలకటం. పదం మొదట్లో 'టీ' అనే అక్షరం వస్తే దాన్ని 'టీ' అనే పలుకుతారు, 'టేబిల్', 'స్టంబిల్' లాంటి పదాలు. అబ్బ, నాకు పిచ్చెక్కిపోతుంది! ఇంతకీ ఇది ఒక అక్షరం గురించి చెప్పిన విషయం.

"ఏమయింది?" అన్నాడు వ్రూమ్ నా దగ్గరకొస్తూ.

ఫాక్స్ అతని చేతికిచ్చాను. చదివి వంకరనవ్వు నవ్వాడు.

"ఆ, బావుంది. అతను నీకు ఎఫ్‌వైఐ పంపాడు. ఎఫ్‌వైఐ అంటే ఏమిటో తెలుసా?" అన్నాడు వ్రూమ్.

"ఏమిటి?"

"ఫక్ యూ ఇన్‌స్టెడ్! బాధ్యతని అవతలివాడి మీదికి నెట్టటానికి సామాన్యంగా అందరూ చేసే పనే ఇది!"

"నాకీ భాష నేర్పటమంటే చిరాకు, మాన్. ఒక వారంలో ఢిల్లీ వాళ్లకి అమెరికన్స్‌లా మాట్లాడటం నేర్పటం కుదరదు."

"అమెరికన్లకి పంజాబీ యాసలో మాట్లాడటం నేర్పలేనట్టే," అని నవ్వాడు ప్రూమ్. "సర్లే, వెళ్లు... వెళ్లి ట్రెయిన్ ట్రెయిన్, లూజ్ యువర్ బ్రెయిన్."

"నేనేం చేసేది?" అన్నాను నా బల్ల దగ్గరికి నడుస్తూ.

"వెళ్లు... శిక్షణ ఇవ్వటం అనే శిక్షకి గురి కా!" అని మళ్లీ నవ్వాడు ప్రూమ్. అతనికి ఆ వాక్యం నచ్చినట్టుంది. మళ్లీ మళ్లీ అంటూనే ఉన్నాడు.

నేను నా సీటు దగ్గరకి వెళ్లిపోయాను. ప్రూమ్ ట్రెయినింగ్ గురించి జోక్ చేసిన వాక్యం నా చెవుల్లో గింగురుమంటోంది. అది నాకు మరో రకమైన ట్రెయినింగ్‌ని గుర్తుచేసింది. నాకు రైలు మ్యూజియమ్‌కి వెళ్లటం జ్ఞాపకం వచ్చింది. సంవత్సరం క్రితం ప్రియాంకని కలుసుకునేందుకు, ఇద్దరం కూడబలుక్కుని అక్కడికి డేటింగ్‌కి వెళ్లాం.



# # 5

## గతంలో నేనూ ప్రియాంకా కలుసుకున్న సందర్భాలు-I

రైలు మ్యూజియమ్, చాణక్యపురి
సరిగ్గా సంవత్సరం క్రితం.

ఆమె అరగంట ఆలస్యంగా వచ్చింది. ఈ లోపల నేను రెండుసార్లు మ్యూజియమ్ మొత్తం చూసేశాను, ప్రతీ రైలు మోడల్‌నీ పరీక్షగా చూశాను, భారతదేశపు అతిప్రాచీనమైన బొగ్గు ఇంజన్ ఎక్కిచూశాను, ఆధునిక సైరన్ సిస్టమ్ ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకున్నాను. కాంటీన్‌కి వెళ్లాను. అది కృత్రిమంగా తయారుచేసిన కొలను మధ్యలో, ద్వీపంలాంటి చోట ఉంది. ఒక మ్యూజియమ్‌కి అది చాలా అందమైన దృశ్యం అనే అనాలి. సిగరెట్టు వెలిగిద్దామనుకుంటూ, అక్కడున్న బోర్డుమీద రాసిన వాక్యం చదివాను, 'ఆవిరి ఇంజన్లు మాత్రమే పొగ వదలటానికి అనుమతింపబడతాయి.' నేను నులివెచ్చగా ఉన్న కోక్ గ్లాసుని ముందర పెట్టుకుని కాంటీన్‌లో ఉండగా ఆమె వచ్చింది.

"ఓకే. ఏమీ అనద్దు. సారీ, నేను ఆలస్యం చేశాను, నాకు తెలుసు," అని నా ఎదురుగా కూలబడింది.

నేనేమీ అనలేదు. ఆమె చిన్న ముక్కుకేసి చూశాను. ఆ ముక్కుతో ఆమె అవసరమైన ఆక్సిజన్ ఎలా పీలుస్తోందో, అనుకున్నాను.

"ఏమిటి? ఏదైనా మాట్లాడు," అంది ఐదు సెకన్ల తరవాత.

"నన్ను మౌనంగా ఉండమన్నావనుకున్నానే," అన్నాను.

"మా అమ్మని డాక్టరుకి చూపించాలి, నిజం," అంది ప్రియాంక.

"ఏమయింది?" అని, స్ట్రాతో నా కోక్‌ని ఒక్కసారి కలిపాను. చిన్నచిన్న బుడగలు చిట్లిపోసాగాయి.

"చెపుతా. ముందీ విషయం చెప్పు, ఈ చోటు నీకెలా ఉంది? బావుంది కదూ?"

"ఏది, రైల్ మ్యూజియమా?" అన్నాను చేతులు గాలిలోకి విసురుతూ. "మన వయసెంత, పన్నెండా? అది సరేగాని, మీ అమ్మకేమయింది? ఇవాళ గొడవ దేన్ని గురించి?"

"మాకు గొడవ పడటానికి విషయమేమీ అక్కర్లేదు, ఒక్క చిన్న నిప్పురవ్వ చాలు. నేను ఇక్కడికి రావటానికి బైలుదేరుతూంటే ఆవిడ నా డ్రస్సు గురించి ఏదో అంది."

"ఏమంది?" అన్నాను ఆమె దుస్తులకేసి చూస్తూ. ప్రియాంక నీలం రంగు టై ఎండ్ డై స్కర్టు వేసుకుంది, శాంతి చిహ్నం ఉన్న టీషర్ట్ వేసుకుంది, ఫక్తు ప్రియాంక స్టైల్లో. ఆమె చెవిరింగుల్లో నీలంరంగు పూసలున్నాయి, అవి మెడలోని నెక్లెస్‌కి మాచ్ అయాయి. పలచగా కళ్లకి కాటుక పెట్టుకుంది. అలా తను కాటుక పెట్టుకుంటే నాకు చాలా ఇష్టం.

"నేను గుమ్మం దాకా వచ్చేశాను, ఇంతలో ఆవిడ, 'మెళ్లో బంగారం దండ వేసుకోక పోయావా? క్రితం ఏడాది నేను నీ పుట్టినరోజుకి కొనిచ్చానే, ఆ నెక్లెస్,' అంది," అంది ప్రియాంక.

"ఆ తరవాత?" ప్రియాంక మెడ వైపు చూశాను, బంగారు నెక్లెస్ వేసుకోలేదు, ఆ మెడ వంపుని చేత్తో తాకాలనిపించింది నాకు.

"లేదమ్మా, అది ఈ డ్రస్సుమీద బావుండదు, పైగా బంగారం నగలు ఫాషన్ కాదు, ఆంటీలే వేసుకుంటారు, అన్నాను. అంతే, మరుక్షణం మా ఇద్దరికీ పెద్ద వాగ్యుద్ధం మొదలైంది. అందుకే ఆలస్యమైంది, సారీ," అంది ప్రియాంక.

"నువ్వు పోట్లాడి ఉండకూడదు. ఆవిడ చూస్తూండగా ఆ నగ మెడలో వేసుకుని, తరవాత తీసేస్తే సరిపోయేది," వెయిటర్ మా ఆర్డర్ తీసుకోవటానికి వచ్చి నిలబడి ఉండగా, అన్నాను.

"కానీ సమస్య అది కాదు కదా, సర్లే," అని ప్రియాంక వెయిటర్‌కేసి చూసి, "నాకు ఒక ప్లేటు సమోసాలు తీసుకురా, ఆకలి దంచేస్తోంది. ఉండుండు, అవి లావెక్కిస్తాయి. సాలడ్ ఉందా?" అంది.

వెయిటర్ అర్థం కానట్టు చూశాడు.

"నువ్వెక్కడున్నాననుకుంటున్నావు? ఇది రైల్ మ్యూజియం కాంటీను, ఇటాలియన్ బిస్ట్రో కాదు. ఇక్కడేది ఉందో అదే తినాలి," అన్నాను.

"ఓకే, ఓకే," అంది ఆమె అక్కడున్న పదార్థాలకేసి చూస్తూ. "నాకు పొటేటో చిప్స్ తీసుకురా, ఒద్దులే, పాప్‌కార్న్ తెచ్చిపెట్టు. పాప్‌కార్న్ అయితే తేలిగ్గా ఉంటుంది, కదూ?" వెయిటర్ పోషకాహార నిపుణుడు ఐనట్టు, అతన్ని అడిగింది.

"సర్లే, పాప్‌కార్న్ తీసుకురా," అన్నాను వెయిటర్‌తో.

"ఊఁ, ఇంకా ఏమిటి విశేషాలు? వ్రూమ్‌ని కలిశావా?" అంది.

"కలవాల్సి ఉంది, కానీ వీలుకాలేదు. ఎవరో అమ్మాయిని కలవాలని వెళ్లాడు."

"ఎవరది? కొత్తమ్మాయా?"

"మరి? అతను ఒకే అమ్మాయితో ఎక్కువకాలం స్నేహం చెయ్యడు. అమ్మాయిలు అతనిలో ఏం చూస్తారో నాకైతే అర్థం కాదు. పైగా అందరూ సెక్సీ అమ్మాయిలు!" అన్నాను.



"నాకు కూడా వ్రూమ్ గొప్పదనమేమిటో అర్థంకాదు. నేను నా జీవితంలో అతనికన్నా పెద్ద భౌతికవాదినీ, అసలు భావావేశాలన్నవి లేని మనిషినీ చూడలేదు," అంది ప్రియాంక. ఇంతలో మా పాప్‌కార్న్ వచ్చింది.

"కాదు, అతనలాటివాడు కాదు," అన్నాను గుప్పిట్లో పట్టే కన్నా ఎక్కువ పాప్‌కార్న్ తీసుకుంటూ.

"మరి, అతన్ని చూడు, జీన్స్, ఫోన్లు, పిజ్జాలూ, బైకులూ. వాటికోసమే బతుకుతున్నట్టు కనబడతాడు. అదికాక, మూడునెలలకొకసారి ఒక కొత్త గర్ల్‌ఫ్రెండు. కమాన్, ఎప్పుడో ఒకప్పుడు ఇలాంటి వేషాలు మానెయ్యాలి కదా?"

"మ్... నా గర్ల్‌ఫ్రెండ్‌తోనే ఉండటానికి నాకైతే ఆనందమే," అన్నాను నోటినిండా పాప్‌కార్న్‌తో.

"నువ్వు చాలా మంచివాడివి," అంది మొహం సిగ్గుతో ఎర్రబడగా నవ్వుతూ. తరవాత ఇంకొంచెం పాప్‌కార్న్ తీసి నా నోట్లో కుక్కింది.

"థాంక్స్," అన్నాను పాప్‌కార్న్ నములుతూ. "వ్రూమ్ మారాడు. పాత ఉద్యోగం వదిలేసి మన ఆఫీసులో చేరిన కొత్తల్లో ఇలాలేడు," అన్నాను.

"న్యూస్‌పేపర్‌లో ఉద్యోగమేనా?"

"అవును, పాత్రికేయుడిగా శిక్షణ పొందుతున్నప్పుడు, అతను 'కరెంట్ అఫేయర్స్'తో మొదలుపెట్టాడు. అతను రాసిన వాటిలో అన్నిటికన్నా ఎక్కువగా పేరొచ్చిన వ్యాసం ఏదో తెలుసా?"

"తెలీదు, ఏమిటి?...అబ్బ!" అంది ప్రియాంక నా వెనకాల ఉన్నవాళ్లెవర్నో చూస్తూ.

"ఏమయింది?"

"ఏం లేదు, వెనక్కి తిరిగి చూడద్దు. నా బంధువులు తమ పిల్లపిశాచాలతో వచ్చారు. ఓ, నో!" అంది మా బల్లకేసి కళ్లు దించి.

ఎవరైనా దేన్నైనా చూడద్దు అని చెప్పినప్పుడు, తప్పకుండా చూడాలన్న తహతహ పుడుతుంది. నా కళ్ల కొలకుల్లోంచి ఒక భార్యా, భర్తా, ఇద్దరు పిల్లలూ కాంటీన్‌లో ఒక మూల కూర్చునుండటం చూశాను.

"ఇక్కడికి పిల్లలు కాకపోతే ఇంకెవరు వస్తారని అనుకుంటున్నావు? ఫరవాలేదులే, వాళ్లు చాలా దూరంగా ఉన్నారు," అన్నాను.

"నోరు మూసుకుని కిందికి చూడు. సర్లే, వ్రూమ్ రాసిన వ్యాసం గురించి చెప్పు, మరి," అంది.

"ఆఁ, దాని శీర్షిక, 'రాజకీయవేత్తలు ఆత్మహత్య ఎందుకు చేసుకోరు?' "

"ఏమిటీ? ఛీ, చాలా ఘోరంగా ఉంది," అంది.

"ఊс, ఆ వ్యాసంలో అందరూ, అంటే, విద్యార్థులూ, గృహిణులూ, వ్యాపారవేత్తలూ, ఉద్యోగస్థులూ, చివరికి సినిమా తారలు కూడా ఆత్మహత్య చేసుకుంటారు. కానీ రాజకీయవేత్తలు ఎప్పుడూ ఆత్మహత్య చేసుకోరు. దానివల్ల మీకో విషయం తెలుస్తుంది - అని ఉంది."

"ఏమిటట?" అంది ఇంకా కిందికే చూస్తూ.

"వ్రూమ్ అనేదేమిటంటే, ఆత్మహత్య అనేది చాలా భయంకరమైనది, ఎవరైనా మనసు చాలా గాయపడ్డప్పుడే ఆత్మహత్య చేసుకుంటారు. అంటే వాళ్లలో చలించే గుణం ఉంటుందని, కానీ రాజకీయవేత్తలకి అది ఉండదు కాబట్టి ఈ దేశాన్ని పాలించేది దేనిగురించో ఎటువంటి అనుభూతీ చెందనివాళ్లు."

"వావ్! అది అతని సంపాదకుడికి నచ్చి ఉంటుందని నేననుకోను."

"సరిగ్గా చెప్పావు, నచ్చలేదు. అయినా వ్రూమ్ ఎలాగోలాగ దాన్ని పేపర్‌లో వచ్చేట్లు చూశాడు. అది అచ్చయిన తరవాతే సంపాదకుడు దాన్ని చూశాడు, అంతే కొంపలంటుకున్నాయి. వ్రూమ్ ఎలాగో తన ఉద్యోగాన్ని రక్షించుకున్నాడు, కానీ అతని బాస్‌లు అతన్ని పేజీ 3లోకి మార్చారు."

"మన వ్రూమా? పేజీ 3 యా?"

"వాళ్లు అతనితో, నువ్వు అందంగా ఉంటావు, అందుకే నువ్వు ఆ పేజీ చూస్తేనే బావుంటుందన్నారు. ఇదికాక, అతను ఒక ఫోటోగ్రఫీ కోర్సు కూడా చేశాడు. అందువల్ల ఫోటోలు కూడా తనే తీసుకోవచ్చు."

"నువ్వు పేజీ 3ని కవర్ చెయ్యి, ఎందుకంటే నువ్వు అందంగా ఉన్నావు, అన్నారా? ఉత్త మొద్దుల్లా ఉన్నారే?" అంది ఆమె.

"అవును బుద్ధిలేనివాళ్లే. కానీ వ్రూమ్ అక్కడ కూడా పగ తీర్చుకున్నాడు. సమాజంలో పేరుప్రతిష్ఠలున్న వాళ్లని అందవిహీనంగా ఫోటోలు తీశాడు - నోటినిండా పదార్థాలతోనూ, వాచిపోయున్న తొడల క్లోజప్పులూ, తాగుడు ఎక్కువయి వాంతి చేసుకుంటున్నవాళ్ల ఫొటోలూ, ఇలాంటివి మర్నాటి వార్తాపత్రికలో కనిపించాయి."

"ఓ మైగాడ్!" ప్రియాంక నవ్వింది. "అతనేదో ఉద్యమకారుడిలా ఉన్నాడే. కానీ డబ్బు కోసం ఆ ఉద్యోగం వదిలేసి అతను కాల్‌సెంటర్లో చేరటం నాకర్థం కావటం లేదు," అంది.

"అతని ఉద్దేశంలో డబ్బుని వేటాడటం కూడా ఒక ఉద్యమమే."

"అదెలా వీలవుతుంది?"

"అతను అనేదేమిటంటే, ఈ ప్రపంచంలో అమెరికన్లదే పైచెయ్యిగా ఉండటానికి కారణం వాళ్లదగ్గర డబ్బు ఉండటమేట. మనం కూడా డబ్బు సంపాదించగలిగిన రోజున మనం వాళ్లని లెక్కచెయ్యక్కర్లేదుట. అందుచేత, మనం ముందుగా చెయ్యవలసిన పని డబ్బు సంపాదించటం, అంటాడు."



"బావుందే!" అని నిట్టూర్చింది ప్రియాంక. "ఊс, అందుకే మనం రాత్రిపూట ఈ చాకిరీ చేస్తున్నాం. నేను కాలేజీ చదువు అయిపోగానే బీ.ఇడి చేసి ఉండచ్చు. కానీ ముందు కొంత డబ్బు వెనకెయ్యాలనుకున్నాను. డబ్బు లేకుండా నేను కలలుగన్న నర్సరీ స్కూలు ప్రారంభించలేను కదా! అందుచేత, అంతవరకూ, ఒక రాత్రికి రెండు వందల కాల్సు చెయ్యాల్సిందే, ప్రతిరోజూ, తప్పదు." ప్రియాంక మోచేతిమీద గడ్డాన్ని ఆనించి కూర్చుంది. నేనామెకేసి చూశాను. ఈమె అందరికన్నా మంచి నర్సరీ స్కూలు ప్రిన్సిపల్ అవుతుంది, అనుకున్నాను.

"వెస్టర్న్ అప్లయెన్సెస్, శామ్ మాట్లాడుతున్నాను, మీకేం సహాయం కావాలి? దయచేసి నన్ను సహాయపడనివ్వండి, ప్లీజ్..." అమెరికన్ యాసని అనుకరిస్తూ అన్నాను.

ప్రియాంక మళ్లీ నవ్వింది.

"ప్రియాంకా దీదీ," ఐదేళ్ల పిల్లవాడు వేసిన కేకకి సమోసాలు తింటున్నవాళ్లందరూ ఉలిక్కిపడ్డారు.

ప్రియాంకవైపు పరిగెత్తుకొస్తున్న ఆ పిల్లవాడి ఒక చేతిలో బొమ్మ రైలుసెట్టూ, రెండో చేతిలో ఫౌంటెన్ కోక్ గ్లాసూ ఉన్నాయి. వాడు తడబడుతూ పరిగెత్తుతున్నాడు. తన అక్కయ్యని చూసిన ఉత్సాహాన్ని ఆపుకోలేకపోతున్నాడు. మా దగ్గరకొచ్చి పడిపోబోయాడు. వాణ్ణి పడకుండా ఆపటానికి నేను ముందుకి ఉరికాను. మొత్తం మీద పడకుండా పట్టుకున్నాను, కానీ వాడి ఫౌంటెన్ కోక్ నా షర్టుని తడిపేసింది.

"ఓ, నో!" అన్నాను మరో మూడేళ్ల పాప, పెద్ద లాలీపాప్‌ని నోట్లో పెట్టుకుని మా దగ్గరికి పరిగెత్తుకురావటం చూసి. ఆ తుఫాను నన్ను తాకకుండా పక్కకి తప్పుకున్నాను. ఆ పాప వచ్చి నేరుగా ప్రియాంక ఒళ్లో వాలింది. నేను షర్టు శుభ్రం చేసుకోవటానికి బాత్రూమ్‌కి వెళ్లాను.

నేను తిరిగి బల్ల దగ్గరకొచ్చాక, ప్రియాంక, "శ్యామ్, ఇతను నా కజిన్, డాక్టర్ అనురాగ్," అంది పరిచయం చేస్తూ. ఆ కుటుంబం మా బల్ల దగ్గరికి షిఫ్ట్ అయిపోయింది. ప్రియాంక నన్ను ఒక్కొక్కరికీ పరిచయం చేసింది. ఆ పేర్లు విన్న మరుక్షణం వాటిని మరిచిపోయాను. నేను కాల్‌సెంటర్లో పనిచేస్తున్నానని ప్రియాంక తన డాక్టర్ కజిన్‌కి చెప్పింది. ఆ తరవాత ఆ కజిన్‌కి నాతో మాట్లాడాలన్న ఆసక్తి సన్నగిల్లినట్టు అనిపించింది. పిల్లలిద్దరూ సగం పాప్‌కార్న్ తిని సగం కింద పోశారు. ఆ పిల్లవాడు తన బొమ్మరైలుని పాప్‌కార్న్ మధ్యనించి, బల్లమీద నడుపుతూ, తన చెల్లెలితో కలిసి నోటితో రైలు చప్పుడు చెయ్యసాగాడు.

"కూర్చో, శ్యామ్," అంది ప్రియాంక.

"లేదు, ఇవాళ నా షిఫ్ట్ కొంచెం ముందుగా మొదలౌతోంది," అని వెళ్లటానికి లేచి నిలబడ్డాను.

"అరె, ఉండు..." అంది ప్రియాంక.

"లేదు, నేను వెళ్లాలి," అని రైల్ మ్యూజియమ్‌లోంచి బైటికి పరిగెత్తాను. ఆ రైల్ మ్యూజియమ్ రైల్వే స్టేషనంత గోలగోలగానూ తయారయింది.

# # 6

"అబ్బా...!" ఈషా ఫోన్లో మాట్లాడుతూ పెట్టిన ఆ కేకకి నా ఆలోచనల ప్రవంతి తెగిపోయింది. జ్ఞాపకాల్లోంచి బైటపడ్డాను.

"ఏమయింది?" అన్నాను.

"ఉన్నట్టుండి కీచుమని స్టాటిక్ శబ్దం వచ్చింది, ఫోన్‌లైన్ అస్సలు సరిగ్గా లేదు... హలో... మేడమ్," అంది ఈషా.

రాధిక తన కాల్‌కోసం ఎదురుచూస్తూ గులాబీరంగు ఊలుతో ఏదో అల్లుతోంది. అందరూ ఎవరి పనుల్లో వాళ్లున్నారు, కానీ కాల్ శబ్దం తాలూకు స్థాయి మామూలు కన్నా తక్కువగా ఉందని గమనించాను.

"ఊ..." అంది ప్రియాంక ఐదు సెకన్ల తరవాత.

"అబ్బ ఏమిటీ భయంకరమైన చప్పుడు!" అన్నాడు వ్రూమ్ చెవులకి పెట్టుకున్న హెడ్‌సెట్ తీసేస్తూ.

"ఏం జరుగుతోంది?" అన్నాను.

"ఉండుండి కీచుమనే స్టాటిక్ శబ్దం వస్తోంది. ఎవరినైనా పంపమని బక్షీకి చెప్పు," అన్నాడు వ్రూమ్ చెవులు రుద్దుకుంటూ.

"నేనతని ఆఫీసుకెళ్తున్నాను. నాకొచ్చే కాల్స్ మీరు కాస్త చూసుకోండి," అని టైమెంతయిందని చూశాను, 10:51 అయింది. అంటే మొదటి బ్రేక్‌కి ఇంకా గంట కూడా లేదన్నమాట.

బక్షీ ఆఫీసుకి ట్రెయినింగ్ రూమ్ పక్కగా వెళ్లాను. లోపలికి ఒక్కసారి చూశాను, కొత్తగా ట్రెయినింగ్ తీసుకుంటున్నవాళ్ల క్లాసు నడుస్తోంది. కొందరు విద్యార్థులు కునుకుతున్నారు; బహుశా రాత్రిళ్లు పనిచేసేందుకు ఇంకా అలవాటు పడుతున్నట్టున్నారు.

'35=10' శిక్షణ ఇచ్చే అతను బ్లాక్‌బోర్డు మీద పెద్ద అక్షరాల్లో రాశాడు.

రెండేళ్లక్రితం శిక్షణ పొందుతున్నప్పుడు నేను నేర్చుకున్న 35=10 రూలు గుర్తొచ్చింది. అది ఏజెంట్లు తమకి ఫోన్ చేసేవాళ్లకి తగినట్టు అడ్జస్ట్ చేసుకోవటానికి పనికివచ్చే రూలు.

శిక్షణ ఇచ్చే అతను అంటున్నాడు, "గుర్తుంచుకోండి, ముప్పైఐదేళ్ల వయసున్న అమెరికన్ మెదడూ, ఐక్యూ ఇండియాలో ఉండే పదేళ్ల వాళ్లకి సమానంగా ఉంటుంది. ఇది



గుర్తుంచుకుంటే మీరు మీకు ఫోన్‌చేసే అమెరికన్లని ఇంకా సులభంగా అర్థం చేసుకోగలుగుతారు. ఒక చిన్న పిల్లవాడితో మాట్లాడేటప్పుడు చూపించే ఓర్పు చూపించాల్సి ఉంటుంది. అమెరికన్లు మట్టిబుర్రలు. దాన్ని మీరు ఒప్పుకోండి. ఫోన్‌కాల్స్ వచ్చినప్పుడు మీలో ఎవరూ కూడా ఓర్పు కోల్పోకూడదు..."

ఇటువంటి క్లాసులు తీసుకోవాల్సివస్తుందేమోనని నేను హడిలిపోయాను. నాకున్న ఢిల్లీ యాసని వదిలించుకోవటం అసంభవంగా ఉంది, నేను అమెరికన్ యాస నేర్చుకునే సమయంలో బహుశా క్లాసులో అందరికన్నా తక్కువ మార్కులు తెచ్చుకుని ఉంటాను.

బక్షీ తన విశాలమైన ఆఫీసుగదిలో కూర్చుని, నోరు తెరుచుకుని కంప్యూటర్ కేసి చూస్తున్నాడు. నేను లోపలికి రాగానే తను చూస్తున్న దాన్ని గబగబా మూసేశాడు. బహుశా ఇంటర్నెట్‌లో బికినీలు వేసుకునే ఆడపిల్లల బొమ్మలు చూస్తున్నట్టున్నాడు.

"గుడీవినింగ్ సార్," అన్నాను.

"ఓ హల్లో... శామ్... రా...రా" అన్నాడు. బక్షీకి మమ్మల్ని ఇంగ్లీషు పేర్లతో పిలవటం ఇష్టం. నాకు మాత్రం అతనలా పిలిస్తే అసహ్యం.

నెమ్మదిగా అతని ఆఫీసుగదిలోకి నడిచాను, తనకి ఎంతో ఇష్టమైన ఇంటర్నెట్ సైట్లని మూసెయ్యటానికి వ్యవధి ఇవ్వాలని.

"రావోయ్, శామ్, ఏం ఫరవాలేదులే. నేను 'ఓపెన్‌డోర్' మేనేజర్నే లే. నాకు నీ దగ్గర రహస్యాలేం ఉండవు," అన్నాడు బక్షీ.

నేనతని పెద్దమొహంకేసి చూశాను. 5 అడుగుల 6 అంగుళాల ఎత్తుకి సరిపోయేట్టుగా కాక, నలుచదరంగా ఉంటుందతని మొహం. ఆ పెద్ద మొహం దసరా పండగలప్పుడు తయారుచేసే రావణుడి బొమ్మల్ని గుర్తుచేస్తుంది. ఎప్పట్లాగా అతని మొహం మెరుస్తోంది. బక్షీని చూసినప్పుడు ఎవరైనా ముందు గమనించేది అతని మొహం జిడ్డోడుతూ ఉండటం. బక్షీ మొహాన్ని మనదేశంలో భూమిగా మళ్లీ సృష్టించగలిగితే మనకున్న చమురు సమస్య తీరిపోతుందని నా ఉద్దేశం. బక్షీని మొదటిసారి చూసినప్పుడు టిస్యూతో అతని మొహాన్ని గట్టిగా తుడవాలనిపించింది అని ప్రియాంక నాతో అంది. అయినా నేననుకోవటం, ఒక టిస్యూ సరిపోయేది కాదేమో అని!

బక్షీకి ముప్పై ఏళ్లుంటాయి, కానీ అతను నలభైఏళ్లవాడిలా కనిపిస్తాడు, యాభైఏళ్లవాడిలా మాట్లాడతాడు. కనెక్షన్స్‌లో గత మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. అంతకు ముందు, ఉచ్చరించటం వీలుకాని దక్షిణభారతదేశంలోని ఏదో యూనివర్సిటీలో ఎంబీఏ చేశాడు. తనేదో పెద్ద మేకైల్ పోర్టర్‌నని అనుకుంటాడు, (పోర్టర్ ఒక పెద్ద మేనేజ్‌మెంటు గురువు – నాకూ తెలీదు, బక్షీయే ఒకసారి ఎఫ్‌వైఐలో చెప్పాడు.) మేనేజర్లు మాట్లాడే భాష (దాన్నే మేనేజీస్ అంటారు)లో

మాట్లాడటం అంటే అతనికి చాలా ఇష్టం. ఇంగ్లీషు, అమెరికన్ లాగే మేనేజీస్ కూడా మరో భాష!

"అయితే మానవవనరులన్నీ ఎలా పనిచేస్తున్నాయి?" అని అడిగాడు బక్షీ తన కుర్చీలో ఇటూ అటూ తిరుగుతూ. అతను మమ్మల్ని మనుషులని ఎప్పుడూ అనడు, మేమందరం 'మానవవనరులమే'.

"బాగానే చేస్తున్నారు, సార్! నేను మీతో ఒక సమస్య గురించి మాట్లాడదామని వచ్చాను. ఫోన్‌లైన్లు సరిగ్గా పనిచెయ్యటం లేదు - మధ్యమధ్యలో ఏవేవో చప్పుళ్లు వస్తున్నాయి. మీరు సిస్టమ్స్ వాళ్లతో కాస్త..."

"శామ్," అన్నాడు బక్షీ పెన్ను నాకేసి గురిపెట్టి.

"యెస్?"

"నేను నీకేం చెప్పాను?"

"దేన్ని గురించి?"

"సమస్యలని ఎలా ఎదుర్కోవాలనేదాన్ని గురించి."

"ఏం చెప్పారు?"

"ఆలోచించు."

బాగా ఆలోచించాను, కానీ ఏమీ గుర్తు రాలేదు.

"నాకు గుర్తు రావటం లేదు, సార్... పరిష్కరించుకోమనా?"

"లేదు. నేను నీకు చెప్పింది, ఎప్పుడూ పెద్దబొమ్మని చూడాలి. పెద్దబొమ్మ దగ్గర మొదలుపెట్టాలి."

నేను నివ్వెరపోయాను. ఇక్కడ పెద్దబొమ్మ ఏముంది? ఫోన్లలో ఏవో పెద్దపెద్ద చప్పుళ్లు వినబడుతున్నాయి, దాన్ని బాగుచెయ్యమని ఫోన్ సిస్టమ్స్‌కి చెప్పాలి. నేనే వాళ్లకి చెప్పి ఉండచ్చు, కానీ బక్షీ కల్పించుకుంటే వాళ్లు త్వరగా పనిచేస్తారు.


"సార్, అది ఒక ప్రత్యేకమైన సమస్య. వినియోగదార్లకి మా మాటలు సరిగ్గా వినబడటం లేదు..."

"శామ్!" బక్షీ నిట్టూర్చి, నన్ను కూర్చోమని సౌంజ్ఞ చేశాడు. "మంచి మేనేజరుకి ఉండాల్సిన లక్షణాలేమిటి?" అన్నాడు.

"ఏమిటవి?" నేనతని ఎదురుగా కూర్చుంటూ వాచీకేసి దొంగచూపులు చూడసాగాను. 10:57 అయింది. కాల్స్ రావటం తగ్గి ఉంటుందని ఆశించాను, లేకపోతే నేనొకణ్ణి అక్కడ లేకపోవటం వల్ల వాళ్లకి చాలా కష్టమౌతుంది.

"ఉండు," అని బక్షీ ఒక రాసుకునే నోట్‌పాడ్, పెన్నూ తీశాడు. పాడ్‌ని బల్ల మధ్యలో పెట్టి, దానిమీద ఒక గ్రాఫ్ ఇలా గీసాడు.





గ్రాఫ్ గీసాక పాడ్‌ని నూటఎనభై డిగ్రీలు తిప్పి నా వైపుకి పెట్టాడు. విలాసంగా పెన్ను మూశాడు, మోనాలిజా బొమ్మ దా విన్‌చీ వేసినంత గర్వంగా!

కొన్ని సెకన్లు మౌనంగా ఉన్నాక, "సార్, సిస్టమ్స్?" అన్నాను.

"ఉండు. ముందు ఇది చెప్పు, ఇదేమిటి?" అన్నాడు బక్షీ తన చూపుడువేలితో తను గీసిన బొమ్మమీద తడుతూ.

నేను ఆ బొమ్మకీ ఫోన్‌లైన్లలో వస్తున్న గందరగోళం చప్పుళ్లకీ ఏమైనా సంబంధం ఉందా అని బుర్ర బద్దలు కొట్టుకున్నాను. నాకేమీ అర్థం కాలేదు.

తల అడ్డంగా ఊపాను ఓటమితో.

"ఛ్చొ ఛ్చొ, చూడు నేను చెపుతాను. ఈ బొమ్మ నీ ఉద్యోగానికి సంబంధించినది. నువ్వు ఇంకా పైస్థాయికి వెళ్లదల్చుకుంటే, ఈ ఒంపు మీదుగా పైకి వెళ్లాలి," అన్నాడు బక్షీ తన లావాటి వేలితో ఆ ఒంపుని చూపిస్తూ. నా జీవితాన్ని ఏ విధంగా మలుచుకోవాలో చెప్తూ.


"యెస్, సార్!" అన్నాను, ఇంకేమనాలో తెలీక.

"అదెలా సాధ్యమో నీకు తెలుసా?"

నేను తల అడ్డంగా ఆడించాను. బ్రూమ్ బహుశా నేను బైటికెళ్లి సిగరెట్టు కాల్చుకుంటున్నానని అనుకుని ఉంటాడు. నా చెవుల్లోంచి పొగ వస్తున్నట్టు నాకు ప్రస్తుతం అనిపించసాగింది!

"పెద్దబొమ్మ, ఇంతకుముందే చెప్పాకదా? పెద్దబొమ్మ మీద దృష్టిపెట్టమని. యుద్ధతంత్రంలోని యుక్తుల్ని గుర్తించాలి, శామ్!"

నేను నోరు విప్పేలోగా మళ్లీ అతను తన పెన్ను బైటికి తీశాడు. మళ్లీ మరో బొమ్మ గీయసాగాడు.



"బహుశా 2×2 మ్యాట్రిక్ (మాత్రిక)తో నేను నీకు దీన్ని వివరించగలుగుతానేమో!" అని బక్షీ ఒంగి 'పైకి', 'కిందికి' అనే మాటలు ఆ గళ్లలో రాయసాగాడు. నేనతన్ని ఆపవలసి వచ్చింది.

"సార్, ప్లీజ్," అన్నాను రెండు చేతులతోనూ ఆ బొమ్మని కప్పుతూ.

"ఏమిటి?" విసుగ్గా అన్నాడు, ఏదో తను ఐన్‌స్టీన్ అయినట్టూ, తను పనిచేస్తూంటే నేను అడ్డుపడినట్టూ.

"సార్, మీరు చెపుతున్నది నాకు చాలా ఆసక్తికరంగా ఉన్నమాట నిజమే! నేను మరోసారి వచ్చి దీన్ని నేర్చుకోవాలనుకుంటున్నాను. కానీ ప్రస్తుతం నా టీమ్ నాకోసం ఎదురుచూస్తోంది, నా షిఫ్ట్ నడుస్తోంది."

"అయితే?" అన్నాడు బక్షీ.

"ఫోన్లు, సార్! ప్లీజ్, సిస్టమ్స్ వాళ్లని డబ్ల్యూఏఎస్‌జీ బేని వెంటనే చెక్ చెయ్యమని చెప్పండి," అన్నాను ఊపిరి తీసుకోకుండా.

"ఊఁ?" అన్నాడు బక్షీ నేను అంత వేగంగా మాట్లాడటం చూసి ఆశ్చర్యపోతూ.

"వెంటనే సిస్టమ్స్‌కి ఫోన్ చెయ్యండి, సార్!" అని లేచి నిలబడి, "దాన్ని ఉపయోగించండి," అని ఫోన్‌కేసి చూపించి, గబగబా నా 'బే'కి వెళ్లిపోయాను.



# # 7

"మంచి బ్రేక్ తీసుకున్నట్టున్నావే?" నేను మా 'బే'కి తిరిగిరాగానే వ్రూమ్ అన్నాడు.

"కమాన్ మాన్, ఫోన్ల గురించి చెప్పటానికి బక్షీ ఆఫీసుకి వెళ్లి వస్తున్నాను, అంతే," అన్నాను.

"ఎవరినైనా పంపిస్తానన్నాడా?" అన్నాడు వ్రూమ్ చిక్కుపడిపోయిన తన ఫోన్ వైర్లని సరిచేస్తూ.

"నేను ముందుగా **'యుద్ధతంత్రం తాలూకు యుక్తుల్ని'** గుర్తించాలని అన్నాడు," అని నా సీట్లో కూర్చున్నాను.. చేతులు బల్లమీదపెట్టి, వాటిమీద తల ఆనించాను.

"యుద్ధతంత్రం యుక్తులా? ఏమిటవి?" అన్నాడు వ్రూమ్ నావైపు చూడకుండా.

"నాకేం తెలుసు గురూ?" గఁయ్యిమన్నాను. "అదేమిటో తెలిస్తే టీమ్ లీడరయి ఉండేవాణ్ణి. అతను ఏవో బొమ్మలు కూడా వేసి చూపించాడు." అన్నాను.

రాధికా, ఈషా, ప్రియాంకా ఫోన్‌కాల్స్‌తో బిజీగా ఉన్నారు. ఉండుండి చెవులు చిల్లులు పడే చప్పుడుకి వాళ్లు హెడ్‌ఫోన్లు చెవులమీది నించి తీసేస్తున్నారు. సిస్టమ్స్‌వాళ్లు త్వరగా వస్తే బావుణ్ణనుకున్నాను.

"బొమ్మలేమిటి?" అన్నాడు వ్రూమ్, తన సొరుగులోంచి చూయింగ్‌గమ్ తీస్తూ. నాకు కూడా ఒకటి యివ్వబోయాడు.

"ఏదో చెత్తలే, 2×2 మ్యాట్రిక్సో ఏదో అన్నాడు," అన్నాను వ్రూమ్ ఇచ్చిన చూయింగ్ గమ్ వద్దని చెపుతూ.

"పాపం, బక్షీ! కొంచెం స్క్రూలూజు గానీ, మంచివాడు. అతని గురించి పట్టించుకోకు," అన్నాడు వ్రూమ్.

"సిస్టమ్స్ మనిషి ఎక్కడ చచ్చాడు?" అని టెలిఫోన్ చేసి సిస్టమ్స్ విభాగంతో మాట్లాడాను. ఇంతవరకూ వాళ్లకి బక్షీ ఫోను చెయ్యనేలేదట. "కొంచెం త్వరగా రాగలరా... అవును ఎమర్జన్సీయే... ఆఁ మా మేనేజర్‌కి ఆ సంగతి తెలుసు," అన్నాను.

"బక్షీ ఇంతవరకూ వాళ్లకి ఫోన్ చెయ్యలేదంటే నమ్మలేకుండా ఉన్నాను!," అన్నాను. సిస్టమ్స్ వాళ్లు వెంటనే ఎవరో ఒకర్ని పంపిస్తున్నామని చెప్పారు.

"ఇక్కడ వ్యవహారం చాలా అధ్వాన్నంగా ఉంది శ్యామ్! ఏదైనా చెడువార్త వినాల్సి వస్తుందేమో!" అన్నాడు వ్రూమ్.

"ఏమంటున్నావు? ఉద్యోగాలు పీకేస్తున్నారా?" అని అడిగాను ఆందోళనగా. అసలే నిరాశగా ఉన్న నాకు ఈ విచారం కూడా తోడైంది. ఇలా అన్ని చెడ్డ అనుభూతులు ఒకేసారి నా మీదికి దాడిచెయ్యటం చూస్తే చాలా ఆశ్చర్యం వేస్తుంది.

"నేను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాను," అన్నాడు వ్రూమ్ తన కంప్యూటర్‌లో ఒక విండోని క్లిక్ చేసి తెరుస్తూ. "వెస్టర్న్ కంప్యూటర్ అకౌంటు నిజంగానే చాలా హీనావస్థలో ఉంది. ఆ అకౌంటుని పోగొట్టుకున్నామంటే ఈ కాల్‌సెంటర్ మునిగిపోతుంది," అన్నాడు.

"హతోస్మి! శెఫాలీ ఇలాంటిదే ఏదో నాతో చెప్పింది. మనం తయారుచేసిన వెబ్‌సయిట్ చాలా ఉపయోగకరమైందనుకుంటా. జనం మనకి ఫోన్లు చెయ్యటం మానేశారు," అన్నాను.

మా బేలోకి ఎవరో వచ్చి మా సంభాషణకి అంతరాయం కలిగించారు. అతని బెల్టుకి మూడు పేజర్లు, మెడలో రెండు 'మెమొరీ కార్డులూ' ఉండటం చూసి, అతను సిస్టమ్స్ నించి వచ్చాడని గ్రహించాను.

ప్రియాంక అతనికి సమస్యేమిటో చెప్పి, ఫోనులో వచ్చే కీచుమనే చప్పుడు వినమని చెప్పింది.

సిస్టమ్స్ అతను మా ఫోన్‌లైన్లన్నీ ఒక పదినిమిషాలపాటు తొలగించమన్నాడు.

అందరూ తమ హెడ్‌సెట్స్‌ని తీసేశారు. ఈషా తన జుట్టుని సరిచేసుకోవటం చూశాను. ఒక రాత్రిలో కనీసం పదిసార్లైనా ఆమె జుట్టు సవరించుకుంటూ ఉంటుంది. ముందుగా తన జుట్టుని పట్టి ఉంచిన రబ్బర్‌బాండ్‌ని తీస్తుంది. దాంతో ఆమె జుట్టు వదులుగా అయి విరబోసుకున్నట్టవుతుంది. మళ్ళీ దాన్నంతా ఒక దగ్గర చేర్చి, రబ్బర్‌బాండ్‌ని పెట్టుకుంటుంది.

ఆమె జుట్టు మరీ నల్లగా లేకుండా, చివర్లు ఉంగరాలు తిరిగి ఉంటుంది : ఖరీదైన హెయిర్ స్టయిలింగ్ ఫలితం అది. దానికి ఒక చిన్న సర్జరీకి అయేంత ఖర్చు అవుతుంది. నన్నడిగితే, అంత ఖర్చుపెట్టినందుకు అది ఏమీ అందంగా కూడా లేదు. సహజంగా జుట్టు వంకులు తిరిగి ఉండటం వేరు, కానీ మిషన్లతో అలా చేయించుకోవటం వల్ల, అది చిక్కుపడిన టెలిఫోన్ వైర్లలా అవుతుంది.

వ్రూమ్, ఈషా వైపు కన్నార్పకుండా చూడటం గమనించాను. సెక్సీగా ఉండే అమ్మాయిలతో కలిసి ఒకేగదిలో పనిచెయ్యటం అబ్బాయిలకి అంత సులభం కాదు. మీరే చెప్పండి, వాళ్ళేం చెయ్యాలి? అమ్మాయిలు సెక్సీగా ఉన్నా గమనించకుండా కంప్యూటర్‌కేసి చూస్తూ కూర్చోవాలా? సారీ, మగవాళ్ళని దేవుడు ఆ రకంగా తయారుచెయ్యలేదు.

రాధిక తన బ్యాగులోంచి గులాబీరంగు ఊలు తీసి, కొంపలు మునిగిపోతున్నట్టు గబగబా అల్లసాగింది. మిలిటరీ అంకుల్ సిస్టమ్ బాగానే పనిచేస్తూండటంతో ఆయన తన మానిటర్‌కి అతుక్కుపోయాడు.



ఈషా, రాధికవైపు చూసి, "ఏమిటి అల్లుతున్నావు?" అంది.

"మా అత్తగారికోసం స్కార్ఫ్. ఆమె ఎంతో మంచావిడ, పాపం రాత్రి పూట చలి అంటుంది!" అంది రాధిక.

"ఆవిడ మంచిదేం కాదు..." అని వ్రూమ్ అంటూ ఉంటే, రాధిక అతనికి అడ్డొచ్చింది.

"ఉష్, వ్రూమ్! ఆవిడ మంచిదే, కాస్త పాతకాలం మనిషంతే," అంది.

"అది అవస్థే కదా?" అన్నాడు వ్రూమ్.

"ఏం కాదు. అసలు, నాకు అలా కుటుంబం ఒక్కటిగా కలిసుందన్న భావం చాలా బావుంటుంది. వాళ్ళు కాస్త పాతకాలం వాళ్ళు, అంతే," అని రాధిక నవ్వింది. ఆ నవ్వు మనసులోంచి వచ్చిందని నాకనిపించలేదు. కానీ అది నాకేమాత్రం సంబంధించని విషయం.

"అవును పాపం, కొంచెం! అంటే ఎప్పుడూ తలమీద కొంగు కప్పుకోవాలని నీకు చెప్పే రకాలు," అన్నాడు వ్రూమ్.

"వాళ్ళు నిన్ను తలమీద కొంగు కప్పుకోమంటారా?" రబ్బర్‌బాండ్‌ని పళ్ళమధ్య ఇరికించుకుని అడిగింది, ఈషా.

"వాళ్ళు నన్నేమీ చెయ్యమని బలవంతపెట్టరు, ఈషా. నాకే వాళ్ళ పద్ధతులు నచ్చి, అలా నడుచుకుంటాను. వాళ్ళింట్లో పెళ్ళైన ఆడవాళ్ళందరూ చేసేదే అది," అంది రాధిక.

"అయినా, కొంచెం వింతగానే ఉంది," అంది ఈషా సందేహంగా.

"ఏమైనా, నేను దాన్నొక సవాలుగా తీసుకున్నాను. నేను అనుజ్‌ని ప్రేమించాను. తనతోపాటు తన కూడా వచ్చేవన్నీ నేను ఒప్పుకోవాలని అతనన్నాడు. కానీ, ఒక్కోసారి నువ్వు మొన్న వేసుకున్నలాంటి బొడ్డుకిందికి ఉండే జీన్స్‌ని నేనప్పుడప్పుడూ మిస్సవుతూ ఉంటానని మాత్రం ఒప్పుకుంటున్నాను."

మొన్న ఈషా ఏ డ్రస్సు వేసుకుందో రాధిక గుర్తుంచుకోవటం చూసి, నేను ఆశ్చర్యపోయాను. తామూ, తమ స్నేహితులూ యాభైరోజుల క్రితం వరకూ రోజూ ఏ డ్రస్సులు వేసుకున్నారో గుర్తుంచుకునే శక్తి ఆడవాళ్ళకే ఉందనీ, వాళ్ళ మెదళ్ళలో అటువంటి ప్రత్యేకమైన భాగం ఏదో ఉంటుందనీ, నాకనిపించింది.

"నీకా జీన్స్ నచ్చాయా?" అంది ఈషా మెరిసే కళ్ళతో.

"చాలా నచ్చాయి. కానీ అవి వేసుకోవటానికి మంచి ఫిగరుండాలి," అంది రాధిక. "ఐనా, మరో విషయంలోకి వెళ్ళినందుకు సారీ అర్రా, మనం అసలు విషయం మర్చిపోతున్నాం," అంది మళ్ళీ.

"ఏమిటి? సిస్టమ్స్ గురించా?" అన్నాను బల్లకిందికి చూస్తూ. సిస్టమ్స్ మనిషి బల్లకింద దూరాడు, అతని చుట్టూ అడవిలా అల్లుకున్న వైర్లు. అతను ఇంకో పదినిమిషాలెక్కువ కావాలని అన్నాడు.

నేను వాచీ చూసుకున్నాను. 11:20 అయింది. ఇక బక్షీ రోజూలాగ రౌండ్స్‌కి వస్తాడేమో, అనుకున్నాను.

"అబ్బే, ఫోన్ల గురించి కాదు. మిస్ ప్రియాంక ఏదో ముఖ్యమైన వార్త చెప్పాలంది, గుర్తుందా?" అంది రాధిక అల్లుతున్న ఊలుని పక్కన పెడుతూ.

"ఓ, అవును కదూ! కమాన్, ప్రియాంకా, అదేమిటో చెప్పు!" ఈషా కీచుగా అరిచింది. మిలిటరీ అంకుల్ కంప్యూటర్ తెరమీంచి తలెత్తి ఒక్క క్షణం ఇటు చూసి, మళ్లీ తన పని చూసుకోసాగాడు. తన కొడుకూ, కోడలితో కలిసి ఉన్నప్పుడు కూడా ఈయన ఇంత మౌనంగా ఉండేవాడా, అనుకున్నాను.

"ఓకే, అవును నేనొక సంగతి మీకు చెప్పాలి," అంది ప్రియాంక, తను తీసుకొచ్చిన అట్టపెట్టెకున్న ఎర్రటి సెలోఫేన్ కాయితాన్ని జాగ్రత్తగా విప్పుతూ ఆమె కొంటెగా నవ్వుతూంటే రెండు బుగ్గల్లోనూ సొట్టలు పడ్డాయి. ఆమె అలా ప్రతి పనినీ పద్ధతి ప్రకారం చెయ్యటం నాకు నచ్చదు. ఆ వెధవ కాయితాన్ని చింపి పారెయ్యచ్చుగా, అనుకున్నాను. అయినా నాకెందుకు, అనుకుని బల్లకిందికి కొద్దిక్షణాల పాటు చూశాను, ఏదో ఆ సిస్టమ్స్ మనిషికి సాయం చేసేట్టు! నా చెవులు మాత్రం ప్రియాంక మాట్లాడే ప్రతిమాటనీ వినటానికి నిక్కపొడుచుకుని ఉన్నాయని వేరే చెప్పాలా!

"సో, ఏమిటి విశేషం? ఓ... మిల్క్‌కేక్! అదంటే నాకెంతిష్టమో!" అంది రాధిక. ష్రూమ్ ఒక్క ఉరుకు ఉరికి మొదటి ముక్కని చేజిక్కించుకున్నాడు.

"చెపుతాను, కానీ ఆ వార్త డబ్ల్యూఏఎస్‌జీ దాటి బైటికి వెళ్లదని మీరందరూ మాటివ్వాలి," అంది ప్రియాంక. ఆ స్వీటు ముందుగా రాధికకీ, ఈషాకీ ఇచ్చి, తీసుకోమంది. ఈషా మానవమాత్రులకున్న వేళ్లకు వీలైనంత చిన్నముక్కని తుంపి తీసుకుంది. బొడ్డుకిందికి జీన్స్ తొడుక్కోగల రూపం కావాలంటే దానికి మూల్యం చెల్లించాల్సుంటుంది!

"ఎవ్వరికీ చెప్పం. డబ్ల్యూఏఎస్‌జీ బైట నాకసలు స్నేహితులే లేరు. ఇప్పుడు చెప్పు, ప్లీజ్!" అని తన పొడవాటి వేళ్లని టిష్యూ పేపరుతో తుడుచుకుంది, ఈషా.

"సరే, అయితే వినండి, ఇవాళ ఈ భూమ్మీద ఉన్న వాళ్లందర్లోకీ మా అమ్మ ఎక్కువ సంతోషంగా ఉంది," అంది ప్రియాంక.

"అబ్బ చెప్పేదేదో సరిగ్గా చెప్పమ్మా! అసలు విషయం ఏమిటో చెప్పు!" అన్నాడు ష్రూమ్.

"సరే, మా అమ్మకుండే ఎన్ఆర్ఐ సంబంధాల పిచ్చి మీకు తెలిసినదేగా. తన కూతురు మొండిఘటమనీ, దానికి అలాంటి మొగుడే తగినవాడనీ ఆవిడ ఉద్దేశం."

"హో... హో..." అంది రాధిక మిల్క్‌కేక్ తింటూ.

"అయితే మాకు తెలిసిన స్నేహితులు ఒక సంబంధం తీసుకొచ్చారు. సియాటల్‌లో ఉండే వాళ్ల బంధువుల ద్వారా వచ్చిందీ సంబంధం. నేనుఎప్పట్లాగే చేసుకోనని చెప్పి



ఉండేదాన్నే: కానీ, ఈసారి నేనతని ఫొటోలు చూశాను, చాలా బావున్నాడు. అతనితో ఫోన్లో మాట్లాడాను. బాగానే మాట్లాడాడు. అతను మైక్రోసాఫ్ట్‌లో పనిచేస్తున్నాడు, అందుకని సంపాదన బాగానే ఉంది. అతని తలిదండ్రులు ఢిల్లీలో ఉన్నారు, ఇవాళ వాళ్లని కలిశాను. మంచివాళ్లు," అని తనకోసం స్వీటుముక్క తుంపుకోవటానికి ఆగింది ప్రియాంక. ఇంకాస్త చిన్నముక్క తుంపుకోవాల్సింది, అనుకున్నాను. అయినా నాకెందుకులే!

"ఇంకా?" ఈషా కళ్లు పెద్దవి చేసి ప్రియాంకవైపు చూస్తూ అడిగింది.

"ఏమో నాకే తెలీదు, అన్నీ సవ్యంగా కుదిరినట్టు అనిపించింది," అంది ప్రియాంక స్వీటు తినకుండా ఊరికే చేతితో అటూ ఇటూ తిప్పుతూ. "వాళ్లు నా నిర్ణయం చెప్పమని మొహం మీదే అడిగేశారు, నేనూ 'సరే' అన్నాను."

"వా...వ్! ఓ, వావ్!" వీలైనంత పైస్థాయిలో అమ్మాయిలందరూ అరిచారు. బల్లకిందున్న సిస్టమ్స్ మనిషి భయంతో వణికిపోయాడు. ఏం కాలేదనీ, తన పని చూసుకోమనీ అతనితో చెప్పాను. బైటికి కనీసం అంతా సవ్యంగానే ఉంది. లోపల మాత్రం, నాకు ఉడికిపోతున్నట్టుగా ఉంది. నా పొట్టలోకి ఎవరో మండుతున్న బొగ్గుముక్కని పడేసినట్టనిపించింది.

రాధికా, ఈషా, ప్రియాంకని కౌగలించుకోవటానికి లేచారు, ఏదో ఇండియా వరల్డ్‌కప్ గెలుచుకున్నట్టు! జనం పెళ్లిళ్లు రోజూ చేసుకుంటూనే ఉన్నారు. ఈ అమ్మాయిలు ఇంత పెద్ద సీను నిజంగా చెయ్యాల్సిన అవసరం ఉందా? ఫోన్లు మళ్లీ సరిగ్గా పనిచెయ్యటం మొదలుపెడితే బావుణ్ను, ఈ పిచ్చిమాటలు వినటం తప్పుతుందని అనుకున్నాను.

నా కంప్యూటర్ తెరకేసి చూసేసరికి మైక్రోసాఫ్ట్‌వర్డ్ విండోస్ కనిపించింది. అన్ని మైక్రోసాఫ్ట్ లోగో ఉన్న విండోలనీ కోపంగా మూసేశాను.

"కంగ్రాచ్యులేషన్స్ ప్రియాంకా! చాలా మంచివార్త చెప్పావు!" అన్నాడు ష్రూమ్.

మిలిటరీ అంకుల్ కూడా ప్రియాంకకి షేక్‌హాండివ్వటానికి లేచి వచ్చాడు. చిన్నవాళ్లు పెళ్లి చేసుకుంటామని నిర్ణయించుకోవటం పెద్దవాళ్లకి నచ్చుతుంది. ఇరవై సెకన్లలో ఆయన మళ్లీ తన బల్ల దగ్గరకెళ్లిపోయాడు.

"ఈ వార్తకి మిల్క్‌కేక్ సరిపోదు మాకు పార్టీ ఏదీ?" అంది ఈషా. ఈషాలాంటి అమ్మాయిలు తినేది అతితక్కువ, కానీ పార్టీ ఇమ్మని మాత్రం గోల చేస్తారు.

"ట్రీట్ ఇస్తానర్రా. నేనింకా పెళ్లి చేసుకోవటానికి ఒప్పుకున్నానంతే, ఇంకా తక్కిన తతంగాలేవీ జరగలేదుగా!" అంది ప్రియాంక. చిరునవ్వు శాశ్వతంగా ఆమె మొహంమీద అతుక్కుపోయింది.

"అతన్ని కలుసుకున్నావా?" అన్నాడు ష్రూమ్.

"లేదు, అతను సియాటల్‌లో ఉన్నాడు. కానీ ఫోన్లో గంటలకొద్దీ మాట్లాడుకున్నాం. అతని ఫొటో చూశాను. బావున్నాడు. అతని ఫొటో చూడాలనుందా?" అంది ప్రియాంక.

"ఏం అక్కర్లేదు," అన్న మాటలు నా నోటంట అనుకోకుండా వచ్చాయి. ఛీ, నేనలా అన్నానని నాకే నమ్మకం కుదరటం లేదు! అదృష్టం బావుండి ప్రియాంకకి వినబడేంత గట్టిగా నేనామాట అనలేదు.

"ఆఁ? నువ్వేమైనా అన్నావా?" అంది ప్రియాంక నన్ను చూస్తూ.

నేను తల అడ్డంగా ఆడించి బల్లకిందికి చూపించాను. అవును నా దృష్టి ఫోన్లు బాగు చేయించటం మీదే ఉంది!

"మిల్క్‌కేక్ తింటావా?" అని అడిగి స్వీట్ల బాక్సు నావైపుకి జరిపింది.

"నో, థాంక్స్!" అని మళ్లీ దాన్ని ఆమెవైపుకి నెట్టాను.

"మిల్క్ కేకంటే నీకు చాలా ఇష్టమనుకున్నానే?"

"ఇప్పుడింక కాదు. నా టేస్టు మారిపోయింది. అదీగాక స్వీట్లు తగ్గిద్దామని ప్రయత్నిస్తున్నాను," అన్నాను.

"చిన్నముక్క కూడా వద్దా?" అంది తల ఒక పక్కకి వాలుస్తూ. ఒకానొకప్పుడు ఆమె అలా తలవాలిస్తే నాకు బలే ముచ్చట వేసేది, కానీ ఈరోజు మొండిగా ఉండిపోయాను.

తల అడ్డంగా ఆడించాను. మా ఇద్దరి కళ్లూ కలుసుకున్నాయి. ఒక వ్యక్తితో కొన్నాళ్ల సంబంధం పెట్టుకున్న తరవాత, మొదటి మార్పు ఒకరి కళ్లల్లోకి ఒకరు చూసుకునే పద్ధతిలో వస్తుంది. కళ్లు కలుసుకున్నాక, మరి కదలవు, చూపు మరల్చుకోవటం కష్టమైపోతుంది.

"నువ్వేమీ అనలేదే?" అంది ప్రియాంక. అమ్మాయిలు అలా అన్నప్పుడు అది నిజంగా ప్రశ్నకాదు. మీరేమైనా అనాలని వాళ్ల ఉద్దేశం.

"దేన్ని గురించి? ఫోన్‌లైన్ల గురించా? పదినిమిషాల్లో అవి బాగయిపోతాయి," అన్నాను.

"అది కాదు, నాకు పెళ్లవబోతోంది, శ్యామ్!"

"ఓ, నిజంగానా?" అన్నాను మొదటిసారి ఇప్పుడే ఆ వార్త వింటున్నవాడిలా.

"ఈరోజే ఒక పెళ్లి కొడుకుని ఓకే చేశాను."

"గుడ్!" అని నా కంప్యూటర్ వైపుకి తిరిగాను.

"మాకు అతని ఫొటో చూపించు," అని అరిచింది ఈషా. హాలీవుడ్ నటుడు బ్రాడ్‌పిట్ నగ్నంగా ఉండే ఫొటోని ప్రియాంక చూపించబోతున్నంత ఆత్రుత పడిపోతోందా అమ్మాయి. ప్రియాంక తన హాండ్‌బ్యాగ్‌లోంచి ఒక ఫొటో తీసి అందరినీ చూడమని ఇచ్చింది. నేను దాన్ని దూరంనించి చూశాను : అతను మామూలుగా అందరు సాఫ్ట్‌వేర్ శాల్తీల్లాగే ఉన్నాడు, మా బల్లకిందున్న మనిషిలాగే! కానీ, ఇతనికన్నా మంచి బట్టలు వేసుకున్నాడంతే. అతను నిటారుగా నిలబడి, పొట్టని లోపలికి అణిచిపెట్టాడు, చిరుబొజ్జ ఉన్న ఎవరైనా ఫొటో తీసుకునేప్పుడు పాటించే యుక్తే అది. కళ్లకి కళ్లజోడుంది, జుట్టు మరీ నీటుగా దువ్వి ఉంది, ప్రతిరోజూ



పొద్దున్నే వాళ్లమ్మ అతని బుగ్గల్ని పట్టుకుని చక్కగా తల దువ్వినట్టు. అసలు అతను ఈ ఫొటోని 'పెళ్లిచూపుల' కోసమే తీయించుకుని ఉంటాడు. వెనకాల స్టాచూ ఆఫ్ లిబర్టీతో ఫొటో తీయించుకున్నాడు, బహుశా ఎన్ఆర్ఐ సంబంధం అనీ, మిగతా వాళ్లకన్నా తను మెరుగైనవాణ్ణి అనే విషయాన్నీ చెప్పటానికేమో! బలవంతంగా మొహానికి పులుముకున్న నవ్వు, అతను జీవితంలో పూర్తిగా ఓడిపోయాడని తెలియజేస్తోందనిపించింది నాకు. అంటే కాలేజీలో చదువుతున్నప్పుడు ఏ అమ్మాయితోనూ మాట్లాడని రకంలా కనిపించాడు. ఏమయినా, అతను మంచి డిమాండ్‌లో ఉన్నాడనీ, బుగ్గల్లో సొట్టలు పడే ఆడపిల్లలు అతన్ని కలవకుండానే పెళ్లి చేసుకోవటానికి సిద్ధపడుతున్నారనీ మాత్రం అర్థమైంది.

"అబ్బ, ఎంత ముద్దొస్తున్నాడో! బుల్లి టెడ్డీబేర్‌లాగ!" అని ఈషా ఆ ఫొటోని రాధికకి అందించింది.

అమ్మాయిలు ఎవరైనా అబ్బాయిని 'టెడ్డీబేర్' అన్నారంటే, అతను మంచివాడని అంటున్నారు కానీ అతని పట్ల వాళ్లకి ఆకర్షణ లేదని అర్థం. అటువంటి అబ్బాయిలు తమకి నచ్చుతారని అమ్మాయిలు అనచ్చేమోకానీ, వాళ్లతో పడుకోవటానికి వాళ్లిష్టపడరు. ఆ అబ్బాయిల తల్లులు తమ చుట్టుపక్కల ఉండే అమ్మాయిల్ని వేటాడితే, అది వేరే సంగతి.

"ఏమయింది నీకు?" అంది ప్రియాంక నాతో. మిగతా వాళ్లందరూ ఆ ఫొటోని పరిశీలించటంలో మునిగిపోయారు.

"ఏం? ఎందుకడుగుతున్నావు?"

"ఏంలేదు, ఇంకాస్త ఏమైనా అంటావనుకున్నాను. ఇక్కడున్న వాళ్లందరికన్నా మనిద్దరం ఎక్కువకాలం స్నేహితులుగా ఉన్నాం, నాలుగేళ్లు."

రాధికా, ఈషా, వ్రూమ్, ఫొటోనించి కళ్లు తిప్పి మాకేసి చూడసాగారు.

"ఇంకా ఏమైనా అనాలా? గుడ్, అని అన్నట్టున్నానే?" అన్నాను.

"అంతేనా?" అంది ప్రియాంక. ఆమె చిరునవ్వు ఆ బిల్డింగు వదిలి ఎటో పోయింది.

"ఏమిటిది? నేను ఫోన్లు రిపేరు చేయించటంలో బిజీగా ఉన్నాగా?" అన్నాను.

అందరూ నాకేసే ఇంకా కళ్లార్పకుండా చూస్తున్నారు.

"ఓకే! ఓకే, ప్రియాంకా! ఇది చాలా అద్భుతమైన వార్త. నీకిలాంటి పెళ్లికొడుకు దొరికినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది, ఓకే?" అన్నాను.

"నువ్వు ఈ మాటని ఇంకాస్త మంచిగా అని ఉండచ్చు. సర్లే, ఇప్పుడే వస్తా," అంటూ గొణిగి, ఆమె లేడీస్ రూమ్ వైపుకి వెళ్లిపోయింది.

"ఏమిటి? ఎందుకు అందరూ నాకేసే చూస్తున్నారు?" అన్నాను. అందరూ అటు తిరిగారు.

సిస్టమ్స్ మనిషి ఎలాగైతేనేం బల్లకిందనించి బైటికొచ్చాడు.

"సరిగా అయిందా?" అన్నాను.

"నాకు సిగ్నల్స్‌ని పరీక్షించటానికి పరికరాలు కావాలి," అన్నాడు నుదుటికి పట్టిన చెమటని తుడుచుకుంటూ. "సమస్య బిల్డింగ్ బైట అయి ఉండచ్చు, ప్రస్తుతం గుడ్‌గాంవ్‌లో రోడ్లన్నీ తవ్వేస్తున్నారు, ఎవరో పనికిమాలిన కంట్రాక్టర్లు మన లైన్లని తవ్వేసి ఉంటారు. నేనొచ్చేలోపల కాస్త విశ్రాంతి తీసుకోండి. మీ మేనేజర్‌ని కూడా ఇక్కడికి రమ్మనండి," అని వెళ్లిపోయాడతను.

బక్షీని పిలవటానికి ఫోనెత్తాను. లైను బిజీగా ఉంది. మా ఆఫీసుకి రమ్మని వాయిస్ మెయిల్‌లో మెసేజ్ ఇచ్చాను.

ప్రియాంక లేడీస్ బాత్రూమ్‌లోంచి బైటికి వచ్చింది. మొహం కడుక్కొచ్చిందని గమనించాను. ముక్కుమీద ఇంకా ఒక నీటిబొట్టు అలానే ఉంది.

"ఈరోజు మనకి పనేమీ ఉండేట్టు లేదు. ఇవాళ్టికి ఫోన్లు బాగవకుండా ఉంటే బావుణ్ను" అంది రాధిక యమస్పీడుగా అల్లుతూ.

"ఫోన్లు పనిచెయ్యనప్పుడు కాల్‌సెంటర్ ఉద్యోగమంత సుఖమైనది మరోటి ఉండదు," అని స్వీట్ల బాక్సు మూసేసింది ప్రియాంక.

"సరే, ఇంకా అతని గురించి చెప్పు, మనిషి ఎలాంటివాడు?" అంది ఈషా.

"ఎవరు? గణేశ్ గురించా?" ప్రియాంక అడిగింది.

"అతని పేరు గణేశా? బావుంది," అని ఈషా తన మొబైల్‌ఫోన్ ఆన్ చేసింది. అందరూ ఆమెని అనుకరించారు. గదిలో రకరకాల సెల్‌ఫోన్ల శబ్దాలు వినపడసాగాయి. సాధారణంగా ఏజెంట్లు 'బే'లో తమ సెల్‌ఫోన్లు ఉపయోగించకూడదు. కానీ ఇప్పుడు ఫోన్లు పనిచెయ్యటం లేదు కాబట్టి, ఫరవాలేదు.

నాకు శెఫాలి నించి రెండు మెసేజెస్ వచ్చాయి : ఒకటి నాకు గుడ్‌నైట్ చెపుతూ, రెండోది నాకు స్వీట్‌డ్రీమ్స్‌నీ, వెచ్చని రాత్రినీ కోరుతూ. నేను ముడుచుకుపోయాను.

"గణేశ్‌కి కబుర్లు చెప్పటం ఇష్టమేనా? ఒక్కోసారి ఈ సాఫ్ట్‌వేర్ అబ్బాయిలు ఏమీ మాట్లాడరు," అంది రాధిక.

"ఓహ్, అతను పెద్ద వాగుడుకాయ. అసలు, నా సెల్‌ఫోన్ ఆన్ చేసి ఉంది కదా, ఇప్పుడే అతని దగ్గర్నించి ఫోన్ వచ్చినా రావచ్చు," అని నవ్వింది, ప్రియాంక. "మేమిద్దరం ఒకర్ని గురించి ఒకరం తెలుసుకునే దశలోనే ఉన్నాం కాబట్టి వీలైనప్పుడల్లా మాట్లాడుకోవటం మంచిదే," అంది.

"అబ్బ! నువ్వు ఎంత సంతోషంగా కనిపిస్తున్నావో!" ఆమె 'ఎంత' అన్నప్పుడు ఆ పదం నాలుగుసెకన్లపాటు పలికింది.



"అవును, నాకు సంతోషంగా ఉంది. కొత్త కుటుంబాన్ని సంపాదించుకోవటం గురించి రాధిక చెప్పింది నాకిప్పుడు అర్థమవుతోంది. గణేశ్ వాళ్లమ్మ ఈరోజు మా ఇంటికొచ్చి నాకొక పెద్ద బంగారం గొలుసు ఇచ్చింది. అంతేకాదు, నన్ను కావలించుకుని ముద్దు కూడా పెట్టుకుంది."

"బొత్తిగా పల్లెటూరి బాపతులాగుందే!" అన్నాడు వ్రూమ్.

"షటప్, వ్రూమ్! ఓహ్, ప్రియాంకా, నువ్వెంత అదృష్టవంతురాలివే!" అంది ఈషా.

నేను ఈ సంభాషణ విని ఆనందంతో గంతులెయ్యటంలేదన్న సంగతి వ్రూమ్ గ్రహించాడు.

"సిగరెట్ కావాలా?" అన్నాడు.

నేను వాచీ చూసుకున్నాను. 11:30. మామూలుగా మేము సిగరెట్టు కాల్చుకునే వేళయింది. ఏమైనా, గణేశ్‌కుండే అభిరుచులని గురించి తెలుసుకోవటం కన్నా, నా ఊపిరితిత్తుల్ని కాల్చుకోవటమే మంచిదనిపించింది నాకు.

# 8

ఫ్రూమ్, నేనూ కాల్‌సెంటర్ పార్కింగ్ లాట్‌కి వెళ్లాం. ఫ్రూమ్ తన బైక్‌కి ఆనుకుని నిల ఒక అగ్గిపుల్లతో రెండు సిగరెట్లు వెలిగించాడు. నేనతని పొడవాటి, సన్నటి ఆకారాన్ని చూస్తు అంత సన్నగా ఉండకపోయినట్టయితే, ఎంతో మగసిరి ఉన్నవాడని అనుకునే అవకాశం ఉండే అనుకున్నాను. ఇంకా లేతగా ఉన్న అతని పెదాలమీద సిగరెట్టు ఎబ్బెట్టుగా అనిపించింది బహుశా అందరూ అతన్ని 'పసిమొహం' అంటూ ఉండటం వల్లేమో, అతను రోజు విడిచి రో గడ్డం చేసుకుంటాడు. వెలిగించిన సిగరెట్టుని ఫ్రూమ్ నాకు అందించాడు. నేను దమ్ములా చల్లటి గాలిలోకి పొగ వదిలాను.

మేము నిమిషంపాటు మాట్లాడలేదు. దానికి నేను మనసులోనే ఫ్రూమ్‌కి ధన్యవాదా చెప్పాను. అబ్బాయిలకి ఎప్పుడు నోరుమూసుకుని ఉండాలో తెలుసు.

ఫ్రూమ్ చివరికి నోరు విప్పాడు. ఎవరికీ సంబంధించని ఏదో విషయం గురిం మాట్లాడుతూ, "నాకు విశ్రాంతి కావాలి, శ్యామ్! వచ్చే శనాదివారాలు మనాలీ వెళ్తున్నాను" అన్నాడు.

"కూల్! మనాలీ నిజంగానే బావుంటుంది," అన్నాను.

"నాతో స్కూల్లో చదువుకున్న స్నేహితులతో వెళ్తున్నాను. అక్కడ బైకుల మీ తిరుగుతామేమో."

"బైక్స్ మీదా? పిచ్చెక్కిందా? చలికి గడ్డకట్టుకుపోతారు."

"రెండు పదాలు : లెదర్ జాకెట్స్. అయినా నువ్వక్కడికి ఎప్పుడెళ్లావు?"

"పోయిన సంవత్సరం. మేం బస్సులో వెళ్లాంలే," అన్నాను.

"ఎవరెవరు వెళ్లారు?" సిగరెట్టు నుసి దులపటానికి సరైనచోటు కోసం చూస్తు అడిగాడు, ఫ్రూమ్. కానీ అతనికి అది దొరకలేదు. పార్కింగ్‌లో ఒక మూలకి వెళ్లి రెం పెద్దపెద్ద ఆకులు తుంపుకొచ్చాడు. మేమిద్దరం, ఆకులతో ఆష్‌ట్రే తయారుచేసి, దాన్లో ను దులుపుకున్నాం.

"ప్రియాంకా, నేనూ వెళ్లాం," అనేసి మౌనంగా ఉండిపోయాను. ఫ్రూమ్ కూడా పది సెక పాటు ఏమీ అనలేదు.

"సరదాగా గడిపారా?" అన్నాడు చివరికి.



"ఆc, చాలా బాగా గడిచింది. బస్సు ప్రయాణంతో ఒళ్లు హూనం అయిందనుకో," అన్నాను.

"ఏం? ఏమయింది?"

"మేం పొద్దున్న నాలుగింటికి ఐఎస్‌బిటి నించి బస్సు తీసుకున్నాం. ప్రియాంక తన 'హోదా' గురించి పట్టించుకోని మూడ్‌లో ఉంది. అందుకే వేగంగా వెళ్లే డీలక్స్ బస్సు కాకుండా, మామూలు బస్సులోనే వెళ్లాలని పట్టుపట్టింది. నెమ్మదిగా కిటికీలోంచి కనబడే దృశ్యాలని చూస్తూ వెళ్దామంది."

"ఊc! ఆ తరవాత?"

"తరవాత ఏముంది? బస్సు హైవే మీదికి రాగానే తల నా భుజంమీద ఆన్చి నిద్రపోయింది. నా భుజం నెప్పి పుట్టింది. కదలకుండా కూర్చోటం వల్ల ఒళ్లంతా పచ్చిపుండులా అయింది. ఆ భయంకరమైన ప్రయాణం తప్పిస్తే, మిగతా అంతా భలే సరదాగా గడిచిందిలే."

"ఆమెకి తెలివితేటలు తక్కువ," అన్నాడు ఫ్రూమ్ బోలెడంత పొగ వదుల్తూ, ఆ పొగ రింగుల వెనక అతని చిరునవ్వు కనిపించింది.

"అవును. ఆ రోజుల్లో నువ్వామెని చూడాల్సింది. పూసలూ, చేనేత దుస్తులూ, అవీ వేసుకునేది ఎప్పుడూ. ఇంకా లారీ డ్రైవర్లతో కూర్చుని టీ తాగేది."

"వావ్! ఇప్పుడు ప్రియాంకని అలా ఊహించలేను," అన్నాడు ఫ్రూమ్.

"నా మాట నమ్మచ్చు, ఆ అమ్మాయిలో విశృంఖలత్వం కూడా ఉంది," అని ఆమె మొహం జ్ఞాపకం రాగా ఆగాను. "ఏమైనా, అది ఇప్పుడు చరిత్ర. ఆడపిల్లలు మారిపోతారు," అన్నాను మళ్లీ.

"నిజమే. ప్రస్తుతం జీవితంలో స్థిరపడ్డానికి సిద్ధంగా ఉంది."

నేను అవునని తలాడించాను. ఇంక నాకు ప్రియాంక గురించి మాట్లాడాలనిపించలేదు. కనీసం నాలో ఒక భాగానికి లేదు. కానీ మిగతా భాగాలన్నీ ఎప్పుడూ ఆమె గురించి మాట్లాడాలనే కోరుకుంటూ ఉంటాయి.

"ఎన్ఆర్ఐని పట్టింది, మైక్రోసాఫ్ట్, అదీ, వ్యవహారం బాగానే ఉంది," అన్నాడు ఫ్రూమ్ మరో సిగరెట్టు వెలిగిస్తూ. నేను అతన్ని చూసి కళ్లు చికిలించాను.

"ఏమిటి? ఇది నా రోజువారీ కోటాయే. ఐదిట్లో ఇది ఇంకా మూడోదే," అన్నాడు పెద్ద పొగమబ్బుని వదుల్తూ.

"మరీ ఇంత త్వరగానా?" అన్నాను.

"ఏమిటి? సిగరెట్టు గురించా? నాకివాళ దీని అవసరం ఉంది."

"అది కాదు. ప్రియాంక పెళ్లి. తను మరీ త్వరపడి నిర్ణయం తీసుకుంటోందనిపించటం లేదూ, నీకు?"

"త్వరగానా? కమాన్, మాన్! ఇలాంటి సంబంధాలు రోజూ తగుల్తాయా? అతను మైక్రోసాఫ్ట్‌లాంటి కంపెనీలో పనిచేస్తున్నాడు. అంటే అతిమంచి సంబంధం. అతను ఎమ్మెస్ పెళ్లికొడుకు 1.1-డీలక్స్ ఎడిషన్!"

"మైక్రోసాఫ్ట్ గొప్పేమిటిట? మంచి ఉద్యోగమా?"

"గురూ! సంవత్సరానికి లక్ష డాలర్లదాకా సంపాదిస్తూ ఉంటాడనే నా నమ్మకం."

"ఏమిటీ? ఏడాదికి లక్ష అమెరికన్ డాలర్లా?"

వ్రూమ్ అవునని తలాడించాడు. నేను ఆ లక్ష డాలర్లని రూపాయల్లోకి మార్చి, దాన్ని పన్నెండుతో భాగించి, నెలకి అతని జీతం ఎంతుంటుందో లెక్కకట్టటానికి ప్రయత్నించాను. సున్నాలు ఎక్కువగా ఉండటంతో, దాన్ని మనసులో లెక్కవెయ్యటం కష్టమనిపించింది. కొన్ని సెకన్లపాటు బుర్ర బద్దలు కొట్టుకున్నాను.

"రూపాయల్లోకి లెక్కవెయ్యటం ఆపు," అన్నాడు వ్రూమ్ నవ్వుతూ.

"నేనేమీ లెక్కవేయటం లేదు."

"ప్రియాంక పెద్ద చేపనే పట్టింది, నే చెపుతున్నా విను," వ్రూమ్ మళ్లీ అన్నాడు.

అతను మాట్లాడటం ఆపి నాకేసి చూశాడు. అతని కళ్లు కుక్కపిల్ల కళ్లలా తడిగా ఉన్నాయి. గోధుమరంగులో, సానుభూతితో నిండి ఉన్నాయి. అతని చుట్టూ అమ్మాయిలెందుకు మూగుతారో నాకర్థమయింది, కారణం అతని కళ్లే.

"నేను నిన్నొకటి అడగాలనుకుంటున్నాను. నిజం చెపుతావా?" అన్నాడు వ్రూమ్.

"తప్పకుండా."

"ప్రియాంక పెళ్లి చేసుకుంటోందని నీకు బాధగా ఉందా? నీకు ఆమెమీద ఇంకా మనసుందని నాకు తెలుసు."

"లేదు," అని నవ్వసాగాను. "కొంచెం ఆశ్చర్యంగా ఉంది, కానీ బాధగా లేదు. అది మరీ పెద్దమాట. ప్రస్తుతం మేమిద్దరం కలిసి తిరగటం అదీ ఏం లేదు కదా! లేదు గురూ, నాకేం బాధగా లేదు," అన్నాను.

నేను మరీ విపరీతంగా నవ్వటం చూసి వ్రూమ్ మాట్లాడకుండా నేను నవ్వటం ఎప్పుడు ఆపుతానా అని చూస్తూ కూర్చున్నాడు. చివరికి నేను నవ్వు ఆపాక, "నాతో అబద్ధాలాడద్దు. మరి ఆమెతో పెళ్లి ప్రస్తావన తెస్తానన్నావుగా, అదేమయింది?" అన్నాడు వ్రూమ్.

నేనేమీ మాట్లాడలేదు.

"ఏం ఫరవాలేదు, మాన్! నాతో చెప్పచ్చులే!"

నేను నిట్టూర్చి, "హూఁ! అవును ఆమె అంటే నాకింకా ఇష్టమే. కానీ అది కేవలం అడుగంటిన ఇష్టం," అన్నాను.



"అడుగంటినవా...? అంటే?"

"అంటే కొన్ని పనికిరాని అవయవాల్లాగే, వాటివల్ల ఎటువంటి ఉపయోగమూ ఉండదు. కానీ అవి నీకు అపెండిక్స్‌లో నెప్పిని కలిగిస్తాయి. ప్రియాంక మీద నాకున్న ఇష్టం కూడా అటువంటిదే. నేను ఆమెని వదిలి జీవితంలో మరో అమ్మాయిని వెతుక్కున్నానని అనుకుంటున్నాను, కానీ అలా జరగలేదని స్పష్టంగా తెలుస్తూ ఉంది. ఈ లోపల మిస్టర్ ఎన్ఆర్ఐ వచ్చి నా ముడ్డిమీద తన్నాడు!" అన్నాను.

"ఆమెతో మాట్లాడు. మాట్లాడబోవటం లేదని నాతో చెప్పకు," అంటూ వ్రూమ్ సిగరెట్టు పొగని రింగులుగా వదిలాడు.

"త్వరలోనే మాట్లాడాలనుకుంటున్నాను. మన వెబ్‌సైట్ మాన్యువల్‌ని సబ్‌మిట్ చేస్తామనీ, దానివల్ల నా ప్రమోషన్‌ని బోస్టన్ ఆఫీసు సులభంగా ఆమోదిస్తుందనీ ఆశించాను. ఇవాళ మిల్క్‌కేక్ అందరికీ పంచుతుందని నాకేం తెలుసు? అన్నట్టు, అది ఎలా ఉంది? నేను దాన్ని ముట్టుకోలేదు."

"మిల్క్‌కేక్ అద్భుతంగా ఉంది. తిండి దగ్గర కోపతాపాలు పనికిరావు, గురూ! అయినా దాని సంగతి వదిలెయ్. చూడూ, నీకింకా టైముంది. ఆమె పెళ్లికి సరే అని మాత్రమే అంది."

"నీ మాట నిజమవాలని కోరుకుంటున్నాను. కానీ, టీమ్‌లీడర్‌గా ప్రమోట్ అయినా కూడా మిస్టర్ మైక్రోసాఫ్ట్‌తో పోటీపడటం చాలా కష్టమే."

కొన్ని క్షణాలు ఇద్దరం మౌనంగా ఉండిపోయాం.

"అవును, మాన్! ఆడపిల్లలు చాలా తెలివైనవాళ్లు. వాళ్లు ప్రేమ, రొమాన్సు అని ఏవేవో వాగుతారు, కానీ పెళ్లి వ్యవహారం దగ్గరకొచ్చేసరికి వాళ్లు తమ లాభమే చూసుకుంటారు. బాగా డబ్బున్నవాడినే ఎంచుకుంటారు," అని ఆకుల ఆష్ట్రేని దొన్నెలాగ మడిచాడు వ్రూమ్.

"ఊఁ! నేను ఇంకా ఎక్కువ డబ్బు సంపాదించగలనేమో కాని, ధనవంతుణ్ణి కాలేను," అన్నాను.

"అవును నువ్వు బాగా బలిసిన కోడిలా, తాజాగా, ఈకలతో నిండి ఉండాలి! ఆడపిల్లలకి వాళ్లకేం కావాలో బాగా తెలుసు. అందుకే నువ్వు బాధపడకూడదు. మనం మంచి మొగుళ్లుగా పనికిరాము, అది ఒప్పేసుకో, అంతే."

"థాంక్స్, వ్రూమ్, నీతో మాట్లాడాక మనసు తేలిగ్గా ఉంది," అన్నాను. కానీ, వ్రూమ్ చెప్పిన దానితో నేను కూడా ఏకీభవించాను. అది పరిణామక్రమం. బహుశా ప్రకృతికి సొట్టలు పడే బుగ్గలకీ, సాఫ్ట్‌వేర్ శాస్త్రీలకీ పుట్టిన బుల్లి గణేశ్ పసిపిల్లలు కావాలేమో! ఎప్పుడూ దిగులుగా ఉంటూ, ఎందుకూ పనికిరాని చిన్న శ్యామ్‌లకన్నా వాళ్లు సమాజానికి ఎక్కువగా పనికివస్తారేమో!

"అయినా, ఎప్పుడూ ఎంచుకునే స్వేచ్ఛ అమ్మాయిలకే ఉంటుంది. అబ్బాయిలు పెళ్లి

ప్రస్తావన తీసుకొస్తారు. అమ్మాయిలు దాన్ని అంగీకరించటమో, ఎక్కువసార్లు తిరస్కరించటమో చేస్తూ ఉంటారు."

నిజమే. ఆడపిల్లలు అదేదో వాళ్ల జన్మహక్కయినట్టు, ఒకళ్ల తరవాత ఒకళ్లనిగా, అబ్బాయిలని తిరస్కరిస్తూ పోతారు. మాకు దానివల్ల ఎంత బాధ కలుగుతుందో వాళ్లకి తెలీదు. నేనెక్కడో చదివాను (లేదా డిస్కవరీ ఛానెల్ చూసే రోజుల్లో చూశానో), ఆడ జంతువులు, తమ జాతిని కొనసాగించటానికి ఎంతో శ్రమపడి పిల్లల్ని కంటాయి కాబట్టే ఎంపిక విషయంలో అంత జాగ్రత్తగా ఉంటాయిట. ఈ లోపల మగాళ్లు వాళ్ల చుట్టూ తిరుగుతూ, డబ్బు ఖర్చు పెడుతూ, వాళ్లని నవ్విస్తూ, పిచ్చి కవిత్వం రాస్తూ, వాళ్లని సొంతం చేసుకోవటానికి అష్టకష్టాలూ పడుతూ ఉంటారు. ఈ ప్రేమాయణంలో ఆడవి మగవాటిని ఆకర్షించి గెలుచుకోవటమనేది, ఒక్క నీటిగుర్రాలలోనే కనిపిస్తుంది. ఆడగుర్రాలకి బదులు మగగుర్రాలు పిల్లల్ని కంటాయి; అవి నీటిగుర్రం గుడ్లని సంచీల్లాంటి వాటిలో మోస్తాయి. అప్పుడేం జరుగుతుందో తెలుసా? ఆడగుర్రాలు ఎప్పుడు చూసినా మగవాటిని కొడుతూ ఉంటాయి. మగవి తమ ముక్కులు చిట్లిస్తూ అన్నిటికన్నా అందమైన ఆడగుర్రాన్ని ఎంచుకుంటాయి. నేను కూడా నీటిగుర్రం అయితే బావుండుననిపించింది. వీపుమీద రెండు గుడ్లని మొయ్యటం ఎంత కష్టంగా ఉంటుంది?

ప్రూమ్ నా ఆలోచనలకి అడ్డొచ్చాడు.

"ఎవరు చెప్పగలరులే? ప్రియాంక అందరు అమ్మాయిల్లా కాదు, లేక అలాంటిదేనా? ఏది ఏమైనా, అప్పుడే వదిలెయ్యద్దు, గురూ! ఆమెని మళ్లీ గెలుచుకో," అని ప్రూమ్ నన్ను ప్రోత్సహిస్తూ భుజం తట్టాడు.

"సరే కానీ. మనం మళ్లీ ఆఫీసులోకెళ్లాలేమో?" అన్నాను వాచీకేసి చూస్తూ. '11:45 అయింది,' అన్నాను.

పార్కింగ్ స్థలం నించి ఆఫీసుకెళ్తూ వెస్టర్న్ కంప్యూటర్స్ మెయిన్ బే పక్కనించి వెళ్లాం. మెయిన్ బే స్కూలు క్లాసురూమ్‌లాగా, గొడవగా ఉంది. తేడా అల్లా ఇక్కడ పిల్లలు ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడుకోవటం లేదు, వినియోగదార్లతో మాట్లాడుతున్నారు. మానిటర్ సమస్యలూ, వైరస్‌లూ, తప్పుడు మెసేజ్‌లూ - ఇలాంటివి ఏవైనా సరే కనెక్షన్ సాయపడలేనిదంటూ ఏదీ లేదు.

"ఇంకా బిజీగానే ఉన్నట్టుంది," అన్నాను.

"ఏం కాదు. ఫోన్‌కాల్సు నలభైశాతం తగ్గిపోయాయని అంటున్నారు. చాలామందిని ఉద్యోగాల్లోంచి తీసేస్తారనుకుంటా, ఇంకా ఘోరమైన పరిస్థితి ఏమవుతుందంటే, ఇక్కడ ఉద్యోగంలో ఉన్న వాళ్లందర్నీ తీసేసి, మన క్లయెంట్లని బెంగుళూర్ సెంటర్‌కి మార్చేస్తారు."



"బెంగుళూర్‌కా? మరిక్కడో?"

"సరిగ్గా నడవని ఈ పిచ్చాసుపత్రిని మూసిపారేస్తారు, ఇంకేమిటి? బక్షీలాంటి వాళ్లు మిగిలిన మేనేజర్లతో రాజకీయాలు నడపటానికే తమ సగం టైముని వినియోగిస్తుంటే మరి అదే జరిగేది!" అన్నాడు ప్రూమ్.

వెస్టర్న్ కంప్యూటర్స్ 'బే'లో ఒక అందమైన అమ్మాయిని నాకు చూపించాడు.

"మూసేస్తారా!" అన్నాను అరసెకనుపాటు ఆ అమ్మాయివైపు చూసి. "నిజంగానే అంటున్నావా? మరి ఇక్కడ వందలమంది చేస్తున్న ఉద్యోగాల మాట?" అని అడిగాను.

"వాళ్లకేం పట్టింది? బక్షీ దాన్ని గురించి పట్టించుకుంటాడని అనుకుంటున్నావా?" అని ప్రూమ్ తన సన్నటి భుజాలని ఎగరేశాడు.

"జీవితంలో ఎన్నో పనికిమాలిన విషయాలు జరుగుతాయి. వాటిలో ఒకటి ఈరోజు రాత్రి జరగచ్చు," మేం డబ్ల్యుఏఎస్‌జీని సమీపిస్తుండగా అన్నాడు ప్రూమ్.

# # 9

సిస్టమ్స్ వాడు మళ్లీ బల్లకిందికి దూరాడు.

"ఇంకా కాల్సేవీ రాలేదు. వాళ్లు సీనియర్ ఇంజనీరుకోసం ఫోన్ చేశారు," అంది ప్రియాంక.

"ఇది బైటెక్కడో పాడయింది. కొన్ని కేబుల్సు తెగిపోయినట్టున్నాయి. గుడ్‌గాంవ్‌లో పిచ్చిగా బిల్డింగులు కట్టేస్తున్నారు," బల్లకిందినించి బైటికొస్తూ అన్నాడు సిస్టమ్స్ మనిషి.

"బక్షీకి తెలుసా?" అన్నాను.

"ఏమో, నాకు తెలీదు," అంది ప్రియాంక.

వ్రూమ్, నేనూ మా బల్ల దగ్గర కూర్చున్నాం.

"ఫరవాలేదు, చక్కటి బ్రేక్ దొరికింది," తన గోళ్లని ఒక భయంకరమైన గోళ్లు కత్తిరించుకునే దానితో సాపు చేసుకుంటూ అంది ఈషా.

ప్రియాంక సెల్‌ఫోన్ మోగింది. అందరూ ఉలిక్కిపడ్డారు.

"ఇంత ఆలస్యంగా నీకెవరు ఫోన్ చేస్తున్నారు?" అంది రాధిక ఇంకా స్కార్ఫ్‌ని అల్లుతూ.

"విదేశం నుంచనుకుంటా," అంది ప్రియాంక నవ్వుతూ.

"ఊ హ్...!" ఈషా కదిలిపోతున్న భవనంమీద నిలబడ్డ రెండేళ్ల పసిపాపలా కెవ్వుమంది. విదేశం నుంచి ఫోన్‌కాల్ వస్తే అంత సీన్ చెయ్యాలా? అనుకున్నాను.

"హాయ్, గణేశ్! ఇప్పుడే నా ఫోను ఆన్ చేశాను, ఇంత త్వరగా నువ్వు ఫోన్ చేస్తావని అనుకోలేదు," అంది ప్రియాంక.

అట్నించి గణేశ్ ఏమన్నాడో నాకు వినబడలేదు, మంచిదే!

"పదిహేనుసార్లా? నా నెంబరు కలపటానికి పదిహేనుసార్లు ప్రయత్నించావా? నమ్మలేకపోతున్నాను... సారీ గణేశ్!" అంది ప్రియాంక. ఆ సంతోషంలో ఆమె నాకు తెలివితక్కువదద్దమ్మలా కనిపించింది.

"అవును, ఆఫీసులో ఉన్నాను. కానీ ఈరోజు అంతా అస్తవ్యస్తంగా ఉంది. సిస్టమ్స్ అన్నీ పాడయాయి... హల్లో?... నువ్వు థాంక్స్ గివింగ్ రోజున పనిచేస్తున్నావేమిటి? ఓ, ఇండియన్స్ ఆరోజు పనిచేస్తామని అన్నారా? చాలా మంచిపని చేశారు...హల్లో?" అంది ప్రియాంక.



"ఏమయింది?" అంది ఈషా.

"నెట్‌వర్క్ అసలు పనిచెయ్యటమే లేదు, అంది ఫోన్‌ని కుదుపుతూ, అలా చేస్తే అది బాగయేట్టు! నాకు ఆమెని పట్టుకుని కుదిపెయ్యాలనిపించింది.

"మనం బేస్‌మెంట్‌లో ఉన్నాం. ఈ చీకటి గుయ్యారంలో ఏదీ పని చెయ్యదు," అన్నాడు వ్రూమ్. అతను ఇంటర్నెట్‌లో ఫార్ములా I వెబ్‌సైట్ చూస్తున్నాడు.

"లాండ్‌లైన్," అంది ఈషా అదనంగా మా బల్లమీదున్న ఫోన్‌కేసి చూపిస్తూ. కనెక్షన్‌లో ప్రతి టీము దగ్గరా ఒక అదనపు ఫోన్‌లైన్, ఎమర్జన్సీలో వాడుకోవటానికని, విడిగా ఉంటుంది. "ఆ లాండ్‌లైన్‌కి ఫోన్ చెయ్యమని అతనికి చెప్పు," అంది ఈషా.

"ఇక్కడికా?" అంది అనుమతికోసం నాకేసి చూస్తూ.

మామూలుగా అయితే ఇది అసలు వీలవని విషయం. కానీ మా ఫోన్లన్నీ పాడయిపోయి ఉండటంవల్ల, అది వాడుకున్నా ఏమీ నష్టం ఉండదు. అదీకాక, కొత్త జంట రొమాన్సు చేసుకోవటానికి అడ్డంపడే విఫల ప్రేమికుడిలా కనబడటం నాకిష్టం లేకపోయింది.

నేను సరేనని తలాడించి, నా కంప్యూటర్ తెరమీద ఏదో చూడటంలో మునిగిపోయినట్టు నటించాను. తాత్కాలికంగా టీమ్‌లీడర్ హోదాలో ఉండటం వల్ల నాకు కొన్ని అధికారాలున్నాయి. వ్యక్తిగతంగా మాట్లాడుకునే ఫోన్‌కాల్స్‌ని నేను అనుమతించవచ్చు. నా హెడ్‌సెట్‌లోంచి ఏ ఫోన్‌లో ఎవరు మాట్లాడినా వినే వెసులుబాటు నాకుంది. కానీ, ఈ విడిగా ఉన్న ఎమర్జెన్సీ ఫోన్లో మాత్రం నేను వినలేను. బల్లకింద దూరి దాని లైన్లని ట్యాప్‌చేస్తే తప్ప అది వీలుకాదు.

"ఆ లైన్‌ని ట్యాప్ చెయ్యి!" నా బుర్రలో ఏదో గొంతు మెల్లిగా గొణిగింది.

"లేదు, అది తప్పు," అని మనసులోనే నన్ను నేను మందలించాను.

అయినా ఇటువేపునించి జరిగే సంభాషణ నాకు వినబడుతూనే ఉంది.

"హల్లో... గణేశ్, లాండ్‌లైన్‌కి ఫోన్ చెయ్యి... అవును, 22463463, ఢిల్లీకోడ్ 11... పదినిమిషాలు పోయాక ఫోన్ చెయ్యి, మా బాస్ ఇంకొద్దిసేపట్లో మా 'బే'కి వస్తాడు... నాకు తెలుసు, పది నిమిషాలంటే ఆరువందల సెకన్లు, ఈలోపల నీకేమీ కాదని నాకు తెలుసులే," అని విరగబడి నవ్వి, ఫోన్ పెట్టేసింది. ఆడవాళ్లు అలా ఆపకుండా నవ్వుతున్నారంటే, వాళ్లు సరసాలాడుతున్నారనే అనుకోవాలి. ప్రియాంక అంటే నాకు అసహ్యం వేస్తోంది.

"అతను ఎంతో ముద్దుగా మాట్లాడుతున్నాడు కదూ!" అంది ఈషా, ముద్దుగా అనే మాటని మరీ గట్టిగా ఒత్తి పలుకుతూ.

"ఇంక చాలు, నేను బక్షీని పిలుచుకురావటానికి వెళ్తున్నాను. ఫోన్లని బాగుచెయ్యాల్సిందే," అని లేచి నిలబడ్డాను. సిస్టమ్స్ మనిషిని అలా బల్లకింద ఇంక భరించటం నావల్ల కాలేదు. అంతకన్నా ఎక్కువగా ప్రియాంక 'ఆరువందల సెకండ్ల గోల' అసలే భరించలేకపోయాను.

నేను బక్షీ ఆఫీసుకెళ్తూండగా అతను ఎదురుపడ్డాడు.

"ఏజెంట్, శామ్! నువ్వు నీ బల్ల దగ్గరెందుకు లేవు?" అన్నాడు బక్షీ.

"మీకోసమే చూస్తున్నాను, సార్!" అన్నాను.

"ఇదుగో, నీ ఎదురుగానే ఉన్నాగా!" అన్నాడు బక్షీ నోరంతా తెరిచి నవ్వుతూ. అతను నాదగ్గరకొచ్చి నా భుజం చుట్టూ చెయ్యి వేశాడు. అతనలా చేస్తే నాకు చాలా రోతగా ఉంటుంది.

బక్షీ, నేనూ కలిసి డబ్ల్యుఏఎస్‌జీకి వచ్చాం. అందరికీ బక్షీ భారమైన అడుగుల చప్పుడు వినిపించింది. రాధిక తను అల్లే స్కార్ఫ్‌ని బల్లకింద దాచేసింది. ఈషా నైల్‌కటర్‌ని బాగులో పడేసింది. వ్రూమ్ కంప్యూటర్‌లో ఖాళీ ఎమ్ఎస్ వర్డ్ పేజీని తెరిచాడు.

సిస్టమ్స్ మనిషి బల్లకిందినించి వచ్చి, తన బాస్‌కి ఫోన్ చేశాడు, అంటే ఐటి విభాగం హెడ్డుకి.

"చూడగా ఇక్కడ సాంకేతికపరమైన సమస్యేదో ఉన్నట్టుందే?" అన్నాడు బక్షీ. సిస్టమ్స్ మనిషి అవునని తలాడించాడు.

కొద్దిసేపట్లోనే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హెడ్ వచ్చాడు. అతనూ, సిస్టమ్స్ మనిషీ సిస్టమ్స్‌కి సంబంధించిన అర్థం కాని విషయాలని చర్చించారు. వాళ్లు మాట్లాడిన భాష ఇంగ్లీషనే అనాలి! వాళ్ల చర్చ ముగిశాక, ఐటి హెడ్డు మాతో, అర్థంకాని సాంకేతిక వివరాలని గురించి ఆపకుండా, ధారాప్రవాహంగా మాట్లాడాడు. నాకర్థమయిందేమిటంటే, సిస్టమ్స్ మీద ఎక్కువ ఒత్తిడి పడుతోందనీ, డబ్లుఏఎస్‌జికున్న సామర్థ్యంలో ఎనభైశాతం దెబ్బతిందనీ, మిగిలిన ఇరవై శాతం ప్రస్తుతం ఉన్న పనిభారాన్ని మొయ్యలేదనీ.

"హూఁ... హూఁ... ఇది చాలా ఘోరం, కదా?" అన్నాడు బక్షీ తన గడ్డాన్ని ఎడంచేత్తో రుద్దుకుంటూ.

"అయితే మమ్మల్నేం చెయ్యమంటారు?" అన్నాడు ఐటి హెడ్డు.

అందరూ బక్షీకేసి చూశారు. ఇలాంటి పరిస్థితి అంటే బక్షీకి చాలా అయిష్టం - ఏదైనా నిర్ణయం తీసుకోవలసి రావటం, ఏదైనా సలహా ఇవ్వటం లాంటివి.

"హూఁ..." అని బక్షీ మోకాళ్లని ఒకసారి వంచి మళ్లీ సరిగ్గా నిలబడ్డాడు, ఈ లోపల జవాబు ఆలోచించటానికి అతను చేసిన ఉపాయం ఇది. "మనకి సరైన పద్ధతిలో ఒక ప్రణాళిక అవసరం," అన్నాడు.

"ఈరోజు రాత్రికి డబ్లుఏఎస్‌జి సిస్టమ్‌ని మూసేద్దాం. వెస్టర్న్ కంప్యూటర్స్ ప్రధాన విభాగం ఎలాగూ సవ్యంగా పనిచేస్తూనే ఉంది," అన్నాడు ఐటినుండి వచ్చిన రెండో వ్యక్తి.

"కానీ డబ్ల్యుఏఎస్‌జి పూర్తిగా దెబ్బతినలేదుగా. బోస్టన్‌కి యిక్కడి బేని మూసెయ్యటం నచ్చదు," అన్నాడు ఐటి హెడ్డు. అతను చెప్పింది బోస్టన్‌లో ఉన్న వెస్టర్న్ కంప్యూటర్స్ అప్లయెన్సెస్ ప్రధాన కార్యాలయం గురించి.

మళ్లీ బక్షీ, "హూఁ" అని చెమట పట్టిన అరచేతిని నా బల్లమీద పెట్టి ఒత్తాడు. "బోస్టన్‌కి కోపం తెప్పించటం ఇప్పుడున్న పరిస్థితిలో మంచిది కాదు. మనం ఇప్పటికే కనెక్షన్స్‌లో **కిందికి జారుతున్నాం**. మనం ఇంకా **క్రియాశీలతతో పనిచెయ్యాలి**," అన్నాడు.

బక్షీ భాష విని వ్రూమ్ ముసిముసిగా నవ్వాడు. తరవాత మరోవైపుకి తిరిగి పళ్లు నూరుకున్నాడు.

"సార్! నేనొకటి చెప్పనా?" అన్నాను. కానీ నేను నోరు మూసుకుని ఉంటే బావుండేది.

"ఏమిటది?" అన్నాడు బక్షీ.

"మనం బెంగుళూరు వాళ్ల సాయం తీసుకోవచ్చు," అన్నాను. ఇండియాలో ఉండే రెండో వెస్టర్న్ అప్లయెన్సెస్ అండ్ కంప్యూటర్స్ కాల్‌సెంటర్ గురించి చెపుతూ.

"బెంగుళూరా?" అన్నారు బక్షీ ఐటి హెడ్డూ ఏకకంఠంతో.

"అవును, సార్! ఇవాళ అమెరికన్ల థాంక్స్ గివింగ్ డే, ఫోన్‌కాల్స్ తక్కువ వస్తున్నాయి. అందుకని బెంగుళూరు వాళ్లకి కూడా తక్కువ కాల్సే వస్తూ ఉంటాయి. మనకొచ్చే కాల్స్‌లో ఎక్కువ కాల్స్‌ని అటు పంపిస్తే వాళ్లకి చేతినిండా పని ఉంటుందేమో కానీ, మరీ ఎక్కువ కాల్స్ వస్తున్నాయనిపించదు. ఈ లోపల మనం కొన్ని కాల్స్‌ని ఇక్కడ మేనేజ్ చెయ్యవచ్చు," అన్నాను.

"అవును, బాగానే ఉంటుంది. కొన్నిగంటలపాటు మనం సులభంగా కాల్స్‌ని బెంగుళూరుకి సరఫరా చెయ్యచ్చు. ఇక్కడి ఫోన్లని రేపు పొద్దున్న బాగుచేసెయ్యచ్చు," అన్నాడు జూనియర్ ఐటి మనిషి.

"అవును. అమెరికాలో ఇంకాసేపట్లో థాంక్స్ గివింగ్ విందులు ప్రారంభమౌతాయి. అప్పుడు ఫోన్‌కాల్స్ ఇంకా తగ్గిపోతాయి," అన్నాను.

మా గదిలో పనిచేసేవాళ్లందరూ నాకేసి చూసి అంగీకారసూచకంగా తలాడించారు. మనసులో ఈ రాత్రి పని లేకుండా పోయిందని వాళ్లందరూ తెగ సంతోషపడిపోతున్నారు. కానీ బక్షీ మౌనంగా ఏదో దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

"సార్, శ్యామ్ చెప్పింది విన్నారు కదా? బెంగుళూరు ఆఫీసుని అడుగుదాం, మనకి అదొక్కటే దారి," అంది ప్రియాంక.

బక్షీ అప్పటికీ మాట్లాడకుండా కొన్ని సెకన్లపాటు ఆలోచిస్తూ ఉండిపోయాడు. అటువంటి సమయాల్లో అతను అసలు ఏమాలోచిస్తాడని తెలుసుకోవాలనుంటుంది, నాకు.

"చూడండి, అసలు విషయమేమిటంటే," అని బక్షీ మధ్యలో ఆగాడు... "మనం **ఆపిల్ పళ్లని బత్తాయిలతో పోలుస్తున్నాం** కదూ?" అన్నాడు మళ్లీ.

"ఏమిటీ?" అన్నాడు వ్రూమ్ బక్షీకేసి విసుగ్గా చూస్తూ.

బక్షీ ఏమంటున్నాడో నాకైతే అర్థం కాలేదు. నన్ను ఆపిల్ అని అంటున్నాడా? ఢిల్లీని బత్తాయిపండుతో పోలుస్తున్నాడా? మరైతే బెంగుళూరు ఏ పండో?

"నాకో ఐడియా వచ్చింది! మనం బెంగుళూరు వాళ్లని ఎందుకు వాడుకోకూడదు?" అని బక్షీ చిటిక వేశాడు.

"కానీ శ్యామ్ చెప్పింది..." జూనియర్ ఐటి మనిషి వాక్యం ముగించేలోపల బక్షీ అడ్డం వచ్చాడు. పాపం ఆ ఐటి వ్యక్తికి బక్షీ సంగతి తెలీదు.

"చూడండి, ఇది విచిత్రంగా అనిపించవచ్చు, కానీ ఒక్కోసారి మనం ఉన్న చట్రంలోంచి బైటికొచ్చి ఆలోచించాల్సి వస్తుంది," అన్నాడు బక్షీ తన బుర్రమీద వేలితో కొట్టుకుంటూ, తనని తాను అభినందించుకుంటున్నట్టు.

"అవును, సార్! ఇది మంచి ఐడియా. ఇక చిక్కుముడిని మనం విప్పేసినట్టే," అన్నాను.

"గుడ్!" అని ఐటి వాళ్లిద్దరూ కంప్యూటర్ మెనూలతో ఆడుకోసాగారు. బక్షీ మొహం మీద ఆత్మతృప్తితో కూడిన చిరునవ్వు కదలాడింది.

ఐటి వాళ్లు వెళ్తూవెళ్తూ డబ్ల్యుఏఎస్‌జి కాల్స్ సంఖ్య 'సూపర్‌లైట్'గా, అంటే గంటకి ఇరవై కాల్స్ కన్నా తక్కువ, ఉంటుందని చెప్పి వెళ్లారు. మా ఆనందానికి హద్దుల్లేవు, కానీ బక్షీ ముందర మొహంలో ఎటువంటి భావాలూ కనబడనీయలేదు.

"చూశారా, సమస్య పటాపంచలైపోయింది," అన్నాడు బక్షీ చేతులు చాస్తూ. "నేనున్నది అందుకే, మరి," అన్నాడు.

"మేం చాలా అదృష్టవంతులం, సార్!" అంది ప్రియాంక.

బక్షీ ఇంక వెళ్లిపోతాడని అనుకున్నాం, కానీ అతని మనసులో ఇంకేదో ఉన్నట్టుంది.

"శామ్, ఈరోజు నువ్వు ఖాళీగా ఉన్నావు కనక, కొన్ని ముఖ్యమైన డాక్యుమెంట్ల విషయంలో నాకు సాయం చెయ్యగలవా? దానివల్ల నీకు మరిన్ని విషయాలు తెలుస్తాయి," అన్నాడు.

"ఏమిటి సార్, అవి?" నా రాత్రిని అతని పరం చెయ్యటం ఇష్టంలేకపోయినా, అడిగాను.

"ఇవిగో, ఇవి ఈ నెలరోజుల వివరాలకి సంబంధించిన పది కాయితాలు. వీటిని ఇంతకుముందే తయారుచేశాను. కారణం ఏమిటో తెలీదు, కాని, ఈ పదీ ఒక క్రమంలో రాలేదు. మొదటి పేజీకి పది కాపీలూ, రెండో పేజీకి పది కాపీలూ, అలా పది పేజీలకీ కాపీలు కావాలి. నువ్వీపని చేసిపెట్టగలవా?" అన్నాడు బక్షీ కుడిచేత్తో కొన్ని కాయితాలు తీసి పట్టుకుని.

"మీరు ముందే ఇన్ని కాపీలు కావాలని అని అడిగి ఉండరు, ప్రింట్ చేసేప్పుడు అలా కాపీల సంఖ్య ఎంపిక చేసుకోవచ్చు," అన్నాడు వ్రూమ్.

"అవునా? అలా చెయ్యచ్చా?" అన్నాడు బక్షీ, మేమేదో పాత మెదడు స్థానంలో కొత్త మెదడుని పెట్టటం గురించి చెప్పినట్టు!

"అవును," అని వ్రూమ్ తన బల్లసొరుగులోంచి చూయింగ్‌గమ్ బైటికి తీశాడు. ఒక ముక్కని నోట్లో వేసుకుంటూ, "అయినా, ఒక ప్రింటుని తీసుకుని, దాన్ని ఫోటోకాపీ చేసుకోవటం సులభం. అలా చేస్తే అన్నీ కలిపి పిన్నుతో గుచ్చి కూడా తీసుకోవచ్చు," అన్నాడు.



"నా సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాల్సి ఉంది. టెక్నాలజీ ఎంతో వేగంగా మారిపోతూ ఉంటుంది. కానీ, శామ్, ఈసారికి వాటిని సరిగ్గా అమర్చి పిన్నులు పెట్టటానికి సాయం చేస్తావా?" అన్నాడు బక్షీ.

"తప్పకుండా," అన్నాను నాకు మహా వేరేదారి ఉన్నట్టు.

బక్షీ ఆ కాయితాలన్నిటినీ నా బల్లమీద పడేసి బైటికి వెళ్లిపోయాడు.

ప్రియాంక నోరువెళ్లబెట్టి నాకేసి చూసింది.

"ఏమయింది?" అన్నాను.

"నేను నమ్మలేకపోతున్నాను. అతనలాటి పనులు చేస్తూ ఉంటే చూస్తూ ఊరుకుంటా వేమిటి?" అంది తల విదిలిస్తూ.

"కమాన్, ప్రియాంకా. శ్యామ్ జోలికి వెళ్లకు. అతని జీవితాన్ని నడిపేది, బక్షీయే," అన్నాడు వ్రూమ్.

"అదే నేనూ అంటున్నాను. శ్యామ్ అతన్ని ఇష్టమొచ్చినట్టు వాడుకోనిస్తున్నాడు. నచ్చని విషయాలని కొందరు ఎందుకు ఎదిరించలేకపోతారో?"

నేనెందుకు ఎదిరించలేనో నాకు తెలీదు, కానీ ప్రియాంక వేసే ఇటువంటి ప్రశ్నల్ని మాత్రం నేను భరించలేను. ఆమెకి అసలు విషయం అర్థం కాదు, కానీ ప్రపంచాన్ని ఉద్దేశించి ప్రశ్నలు వేస్తూ ఉంటుంది.

నేనామెని పట్టించుకోకుండా ఉండటానికి ప్రయత్నించాను. కానీ ఆమె మాటలు నన్ను బాధపెట్టాయి. బల్లమీది కాయితాల మీద దృష్టి పెట్టలేకపోయాను. మొదటి సెట్‌ని ఒకచోట చేర్చి, పిన్ను గుచ్చబోతూండగా, "బక్షీకి ప్రస్తుతం అతను ఎదురుచెప్పలేడు, ప్రియాంకా! అసలే మేనేజ్‌మెంటు ఉద్యోగాలు ఊడబీకే మూడ్‌లో ఉంది," అన్నాడు వ్రూమ్.

"అవును...థాంక్స్, వ్రూమ్! ఎవరైనా జీవిత వాస్తవాలని వివరిస్తారా? నేను బతకటానికి డబ్బు సంపాదించాలి. నాకోసం సియాటల్‌లో మిస్టర్ మైక్రోసాఫ్ట్ పవర్ పాయింటెవరూ ఎదురుచూస్తూ కూర్చోలేదు," అని గట్టిగా కాయితాలకి పిన్ను గుచ్చాను. తొందరలో పొరపాటున ఆ పిన్ను నావేలికి గుచ్చుకుంది.

"ఆ...!" మిలిటరీ అంకుల్ కూడా తన సీటులోంచి లేచి పడేంతగా పెద్ద గావుకేక పెట్టాను.

"ఏమయింది?" అంది ప్రియాంక లేచి నిలబడుతూ.

నేను రక్తం కారుతున్న వేలు పైకెత్తి చూపించాను. రెండుచుక్కలు బక్షీ కాయితాల మీద పడ్డాయి.

అమ్మాయిలు "ఈ..." అని ఒకరితరవాత ఒకరు అరిచారు.

"ఇది ప్రతీకరా, నాయనా! ఈ ఉద్యోగం కోసం నీ రక్తం ధారపోస్తున్నావు!" అన్నాడు

ప్రూమ్. "నేను వాంతి చేసుకునే లోపు ఎవరైనా వీడికి ఒక బేండ్ఎయిడ్ ఇస్తారా?" అన్నాడు తనే మళ్లీ.

అందరమ్మాయిలూ నా చుట్టూ ఆసరికే చేరారు. "నా దగ్గరుంది," అంది ఈషా. మరీ భయంకరమైన గాయం కాకపోతే ఆడవాళ్లకి గాయానికి కట్లుకట్టటం, మందురాయటం వంటివి ఇష్టం.

"అయ్యో, బాగా లోతుగానే గుచ్చుకుంది!" అంది ఈషా తన బ్యాగులోంచి బేండ్ ఎయిడ్ తీస్తూ. ఆమె దగ్గర ఒక యాభైదాకా బేండ్ ఎయిడ్‌లు ఉన్నాయి.

"అబ్బే, ఏమీలేదు, చిన్న గాయం, అంతే!" అన్నాను. నా వేలు విపరీతంగా పోటు పెడుతూండటంతో పళ్లబిగువున అనగలిగాను.

ప్రియాంక కొన్ని టిస్యూపేపర్లు తన బ్యాగులోంచి తీసింది. నా వేలు చేత్తో పట్టుకుని రక్తాన్ని తుడవసాగింది.

"అబ్బా!" అని అరిచాను మళ్లీ.

"ఓ, ఇంకా పిన్ను ముక్క లోపలే ఉన్నట్టుంది. ఫోర్‌సెప్స్ కావాలి, ఎవరి దగ్గరన్నా ఫోర్‌సెప్స్ ఉందా?" అంది ప్రియాంక.

ఈషా బ్యాగులో ఫోర్‌సెప్స్ కూడా ఉంది. దాన్ని ఆమె తన కనుబొమల వెంట్రుకల్ని పీకటానికి ఉపయోగిస్తుందనుకుంటా. అమ్మాయిల బ్యాగుల్లో ఉండే వస్తువులతో అంటార్కిటికాలో కూడా బతికెయ్యచ్చు!

ప్రియాంక ఫోర్‌సెప్స్‌తో నావేల్లో గుచ్చుకున్న పిన్నుముక్కని, సర్జన్‌కి ఉండేటంత తదేక దృష్టితో తియ్యటం మొదలుపెట్టింది.

రక్తంతో తడిసిన పిన్నుని ఫోర్‌సెప్స్‌తో పట్టుకుని చూపిస్తూ, "దోషి దొరికాడు!" అంది. అప్పట్నించీ నాకు పిన్నులంటే భయం పట్టుకుంది - దాన్ని పిన్నోఫోబియా అనచ్చేమో!

ప్రియాంక నా వేలిని తుడిచి దానికి బేండ్ ఎయిడ్ అతికించింది. ఇంక రక్తపాతంతో నిండిన దృశ్యాలేవీ కనబడకపోయేసరికి, ఎవరి సీటుకి వాళ్లు వెళ్లిపోయారు. నేను మళ్లీ కాయితాలని వరసక్రమంలో పెట్టటానికి వెళ్లాను. బహుశా బుర్ర ఉపయోగించక్కర్లేని కూలిపనికే నేను పనికి వస్తానేమో!

ఈషా, రాధికా బక్షీ గురించి మాట్లాడుకోసాగారు.

"ఇటి మనిషి ఏమంటున్నాడో బక్షీకి అసలు అర్థమే కాలేదు," అంది రాధిక.

"అవును. అసలు నువ్వు అతని మొహం చూశావా? ఏదో సీబీఐ వాళ్లు ఆరా తీస్తున్నట్టు మొహం పెట్టాడు," అంది ఈషా.

నేను ప్రియాంక వైపు చూశాను. సీబీఐ అనే మాట పాత జ్ఞాపకాలని తట్టిలేపాయి. చేతులు బక్షీ కాయితాలని బొత్తులుగా పెడుతూనే ఉన్నా, నా మనసు మాత్రం పండారా రోడ్‌కేసి వెళ్లిపోయింది.



# #10

## గతంలో నేనూ ప్రియాంకా కలుసుకున్న సందర్భాలు-II

*హేవ్ మోర్ రెస్టారెంటు, పండారా రోడ్*

*ఈనాటికి తొమ్మిది నెలల క్రితం*

"శ్యామ్!" అంది ప్రియాంక, నన్ను దూరంగా నెట్టటానికి ప్రయత్నిస్తూ, "ఇలాంటి పనులు ఇక్కడ చెయ్యకూడదు, ఇది పండారారోడ్డు," అంది.

"అవునా?" అన్నాను దూరంగా జరగకుండా. మేం ఒక మూల బల్లదగ్గర కూర్చున్నాం. నగిషీలు చెక్కిన చెక్కతో చేసిన తెర ఒకటి మాకు కొంతవరకూ అడ్డుగా ఉంది. "పండారా రోడ్డయితే ఏమిటిట?" అన్నాను ఆమెని మళ్లీ ముద్దు పెట్టుకుంటూ.

"ఇది కుటుంబాలు వచ్చిపోయే చోటు," అని, తన అరచేత్తో బలంగా నా మొహాన్ని దూరంగా నెట్టింది.

"అయితే? ఇలాంటి పనులు చేస్తేనే కదా కుటుంబాలు ఏర్పడేది?" అన్నాను.

"బావుందిలే, జోకులాపు! నువ్వే ఇక్కడికి వద్దామని అన్నావు. ఇక్కడ పదార్థాలు నువ్వు చెప్పినంత రుచిగా ఉంటాయో లేదో చూడాలి."

"ఢిల్లీలోకెల్లా ఇదే మంచి హోటలు," అన్నాను. పండారారోడ్డులో ఉండే అద్భుతమైన, ఖరీదైన, అరడజను రెస్టారెంట్లతో నేను హేవ్‌మోర్‌నే ఎంచుకున్నాను. మేం చాలా మ్యూజియములు చూశాం. రైలు మ్యూజియం చూశాక, ప్లానిటేరియమ్ (చీకటిగా ఉన్న ఆ థియేటరు రొమాన్సుకీ, సరదాలు తీర్చుకోవటానికీ చాలా అనువుగా ఉందని ఒప్పుకుంటున్నాను), నేచురల్ హిస్టరీ మ్యూజియమ్, డాల్స్ మ్యూజియమ్, సైన్సు మ్యూజియమ్, అన్నీ చూశాం. ప్రియాంక ఉద్దేశంలో మ్యూజియమ్స్‌లో కావల్సినంత ఏకాంతం, అందమైన తోటలూ, చవక కాంటీన్లూ ఉంటాయి.

"పప్పు ధర నూటముప్పై రూపాయలా!" మెనూ తెరిచి ప్రియాంక ఆశ్చర్యంగా అంది. కాటుక పెట్టుకున్న ఆమె కళ్లు పెద్దవయాయి, ముక్కుపుటాలు కూడా పెద్దవయాయి : ఆమె మొహం విస్తుపోయిన కార్టూన్ లాగ అనిపించింది. వెయిటర్ అప్పటికే ఆర్డరు తీసుకోవటానికి మా బల్ల దగ్గరికొచ్చి నిలబడ్డంతో, నాకు చాలా మొహమాటం అనిపించింది.

"ఇదుగో, నీకేం కావాలో చెప్పు, ఓకే?" అన్నాను గొంతు తగ్గించి.

ప్రియాంక జవాబు చెప్పటానికి ఇంకో ఐదు నిమిషాలు తీసుకుంది. ఆమె ఏం తినాలో ఈ విధంగా నిశ్చయించుకుంటుంది. మొదటి మెట్టు : మెనూలో ఉన్న పదార్థాలన్నిటినీ వాటి ఖరీదుని బట్టి విడగొట్టటం. రెండో మెట్టు : కాలరీలని బట్టి చవగ్గా ఉన్నవాటినన్నిటినీ విడిగా ఎంచుకోవటం.

"ఒక నాన్, వెన్న లేకుండా. పప్పు," అంది నేనామెకేసి ఉరిమిచూస్తూంటే.

"ఓకే, మామూలు పప్పు వద్దు, నల్లశనగలు, ఇంకా..." అంది.

"ఇంకా ఒక షాహీ పనీర్," అన్నాను.

"నువ్వెప్పుడూ ఒకటే తెప్పిస్తావు, నల్లశనగలూ, షాహీపనీర్," అంది మొహం ముడుచుకుంటూ.

"అవును, ఒక్కత్తే అమ్మాయి, ఒకే రకం పదార్థాలు. అన్నిటికన్నా మంచిది దొరికాక కొత్త ప్రయోగాలు దేనికి?" అన్నాను.

"నువ్వు బాగా మాట్లాడతావు," అంది ఆమె నవ్వుతూ. నవ్వితే ఆమె కళ్లు చిన్నవై పోతాయి. నా బుగ్గలు రెండూ గిల్లి, బల్లమీద ఉన్న, వినెగార్‌లో నానిన, ఉల్లిపాయని నాకు తినిపించింది. అది రొమాంటిక్‌గా ఎంతమాత్రం లేకపోయినా, నేను సంతోషించాను.

మా పక్క బల్ల దగ్గరకి ఎవరో వస్తూండేసరికి, గబుక్కున తన చేతులు వెనక్కి తీసేసుకుంది. మా పక్క బల్ల దగ్గరికి పెళ్ళైన ఒక జంటా, ఇద్దరు పిల్లలూ, ఒక పెద్దావిడా వచ్చారు. ఆ ఆడపిల్లలు కవలలు, ఏ నాలుగేళ్లో ఉంటాయి.

కుటుంబంలోని అందరి మొహాలూ దిగులుగా ఉన్నాయి. ఎవరూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఇలా మొహాలు మాడ్చుకుని ఇంట్లోనే కూర్చోకుండా, ఇంత డబ్బు ఖర్చు పెట్టటానికి ఇక్కడికెందుకు వచ్చారా అని ఆశ్చర్యపోయాను.

"సరే, కబుర్లేమైనా చెప్పు?" అంది ప్రియాంక.

"పెద్దగా ఏమీ లేవు. నేనూ వ్రూమ్ ఒక వెబ్‌సైట్‌ని తయారుచేస్తున్నాం. కంప్యూటర్లో ఏవైనా సమస్యలు వస్తే వాటిని సరిదిద్దటానికి పనికివచ్చే వెబ్‌సైట్."

"ఓ, ఎలా వస్తోందది?"

"నిజంగా చాలా చక్కగా వస్తోంది. పెద్ద షోకులేవీ ఉండవు, అసలు మంచి వెబ్‌సైట్లెప్పుడూ చాలా సీదాసాదాగా ఉంటాయి. వ్రూమ్ మానసిక వికలాంగుల కోసం ఉండే ఎన్నో సైట్లు కూడా చూశాడు. మేం కనక అటువంటి సైట్ల ఆధారంగా వెబ్‌సైట్‌ని తయారుచేస్తే, దాన్ని అమెరికన్లు కూడా ఉపయోగించుకోగలుగుతారని అన్నాడు."

"వాళ్లు మరీ అంత మొద్దురాచిప్పలేం కాదు. అమెరికన్లే కంప్యూటర్‌ని కనిపెట్టారు గుర్తులేదా?" అంది ప్రియాంక.

ఇంతలో వెయిటర్ మేం చెప్పినవి తీసుకొచ్చాడు.



"అవును, అమెరికాలో మొత్తం ఒక పదిమంది తెలివైనవాళ్లు ఉండచ్చు. మిగతావాళ్లందరూ రాత్రిళ్లు మనకి ఫోన్లు చేస్తూ ఉంటారు," అని నాన్ ముక్క తుంపి, పప్పులో ముంచాను.

"మనకి ఫోన్లు చేసేవాళ్లకి అసలు తెలివితేటలు ఉండవని ఒప్పుకుంటాను. నేనైతే, 'ఆన్ చేసే బటన్ ఎక్కడుందో మీరే వెతికి కనుక్కోండి, హాల్లో?' అంటాను," అంది.

ఆమె తన ప్లేట్లో కళ్లకి కనిపించనంత చిన్నముక్కలు వడ్డించుకుంది.

"సరిగ్గా తిను. ఎప్పుడూ ఈషాలాగ డైటింగ్ చెయ్యటం మానెయ్యి," అన్నాను.

"నాకంత ఆకలిగా లేదు," అంది, నేను మనుషులు తినేట్టు ఆమె ప్లేటులో వడ్డిస్తూంటే.

"ఏయ్, నీకు ఈషా గురించి చెప్పానా? ఎవరికీ చెప్పద్దు," అంది గొంతు తగ్గించి, కనుబొమలు ఎగరేస్తూ.

నేను తల అడ్డంగా ఆడించి, "నీకు పోచికోలు కబుర్లంటే చాలా ఇష్టం, అవునా? నీ పేరు మిస్. పోచికోలు కబుర్లు, ఎఫ్ ఎమ్ 99.5 అని పెట్టాలి," అన్నాను.

"నేనెప్పుడూ పోచికోలు కబుర్లు చెప్పను, అంది ఫోర్కుని నాకేసి ఆడిస్తూ, సీరియస్‌గా. "ఓహ్! ఇక్కడ పదార్థాలన్నీ ఎంతో బావున్నాయి!" అంది.

నా ఛాతీ గర్వంతో పొంగింది, నేనే రాత్రంతా మేలుకొని అవన్నీ వండినట్టు!

"లేదు, నీకు పనికిమాలిన కబుర్లంటే ఇష్టం. ఎవరైనా 'ఎవరికీ చెప్పద్దు,' అని వాక్యాన్ని మొదలుపెడితే, ఇక ఆ తరవాత పసందైన కబురేదో చెప్పబోతున్నారనే నేననుకుంటాను," అన్నాను.

ప్రియాంక మొహం ఎర్రబడి, ముక్కు కొస టొమాటో రంగుకి మారింది. ఆమె చాలా అందంగా కనిపించింది. అప్పటికప్పుడు ఆమెని నేను ముద్దుపెట్టుకునేవాణ్ణే, కానీ మా పక్కన ఉన్న చిరచిరలాడుతున్న కుటుంబం వాదనలోకి దిగింది. ఆ విచారకరమైన వాతావరణాన్ని మార్చటం నాకిష్టం లేకపోయింది.

"ఓకే, నాకు పోచికోలు కబుర్లంటే ఇష్టమే అనుకుందాం, కానీ చాలా కొంచెంగానే. కానీ నేనెక్కడో చదివాను, పోచికోలు కబుర్లు చెప్పుకోవటం మంచిదట!" అంది ప్రియాంక.

"ఓ, నిజమా?" అన్నాను వ్యంగ్యంగా.

"అవును. నీకు మనుషులంటే ఆసక్తి ఉందనీ, వాళ్లని పట్టించుకుంటావనీ, దానివల్ల తెలుస్తుందిట."

"చాలా కుంటిసాకు అది," అని పగలబడి నవ్వాను. స్పూనుతో ఆమెని చూపిస్తూ, "అది సరే, ఈషా గురించి ఏదో చెపుతున్నావు? వ్రూమ్‌కి ఈషా అంటే వెర్రి ఇష్టం ఉందని నాకు తెలుసు. కానీ ఆమెకి అతనంటే ఇష్టమేనా?" అన్నాను.

"లేదు శ్యామ్! అది పాత కథ. ఆమె వ్రూమ్ ప్రేమని ఇంతకు ముందే కాదంది. తాజా వార్త ఏమిటంటే, ఆమె ఫెమినా మిస్ ఇండియా పోటీలో పేరు నమోదు చేయించుకుంది.

పోయిన వారం ఆమె ఎత్తు సరిపోలేదని నిరాకరించినట్టు ఉత్తరం వచ్చింది. తన ఎత్తు ఐదడుగుల ఐదంగుళాలు, కనీసం ఐదు-ఆరు ఉంటే కాని పనికిరారుట. రాధిక బాత్రూమ్‌లో ఈషా ఏడవటం చూసింది."

"ఓ, వావ్! మిస్ ఇండియా?"

"కమాన్! ఆమె అంత అందంగా ఏమీ ఉండదు. ఇక ఈ మోడలింగ్ ప్రయత్నాలు తను మానేస్తే మంచిది. మైగాడ్, అయినా ఎంత బక్కగా ఉంటుందో! ఓకే, నేనింక తినటం లేదు," అని తన ప్లేటు దూరంగా తోసేసింది ప్రియాంక.

"ఏయ్, మొద్దూ, తిను! నీకు ఆనందంగా ఉండాలనుందా, సన్నగా ఉండాలనుందా?" అని మళ్లీ ప్లేటు ఆమె దగ్గరకి తోశాను.

"సన్నగా!"

"నోర్ముయ్! సరిగ్గా తిను. ఈ రెస్టారెంటు పేరు నీకు ఏమీ చెప్పటం లేదా? ఇక ఈషా విషయానికొస్తే, మిస్ ఇండియాకి ఆమె పనికి రాకపోవటం, జాలిపడాల్సిన విషయమే. కానీ, ప్రయత్నిస్తే తప్పు లేదుగా?" అన్నాను.

"కానీ, తను ఏడ్చింది కదా? బాధపడే ఉంటుంది. అదీకాక, తలిదండ్రులకి ఇష్టం లేకపోయినా ఢిల్లీకి వచ్చిందాయె. ఒంటరిగా ఉంటూ పోరాడటం సులభం కాదు," అంది ఆమె.

నేను అవునని తలాడించాను.

మేం తినటం ముగించేసరికి అలాఉద్దీన్ భూతంలాగ వెయిటర్ ప్రత్యక్షమయాడు. మా ప్లేట్లు తియ్యసాగాడు.

"స్వీట్?" అన్నాను.

"అస్సలు చోటు లేదు, కడుపు నిండిపోయింది," అంది ప్రియాంక గొంతువరకూ తిన్నానని మెడమీద చెయ్యి పెట్టుకుని చూపిస్తూ, ఒక్కోసారి భలే అభినయం చేస్తుంది, వాళ్లమ్మ లాగే. కానీ ఆమెతో అలా అని చెప్పే ధైర్యం నాకు లేదనుకోండి!

"ఓకే, ఒక కుల్ఫీ తీసుకు రండి," అన్నాను వెయిటర్‌తో.

"వద్దు, గులాబ్‌జామ్ తెప్పించకూడదూ?" అంది ఆమె.

"ఊc? నీకు స్వీట్ అక్కర్లేదనుకున్నానే..... ఓకే, ఒక్క ప్లేటు గులాబ్‌జామ్ తీసుకురండి" అన్నాను.

వెయిటర్ మళ్లా అలాఉద్దీన్ దీపంలోకి మాయమయాడు.

"మీ అమ్మ ఎలా ఉన్నారు?" అన్నాను.

"అలాగే ఉంది. పోయిన వారం గొడవపడ్డాక, ఏడుపులూ అవీ ఏవీ లేవు, అందుకే పండగ చేసుకోవచ్చు. నేను సగం గులాబ్‌జామ్ తినచ్చా?"



"పోయిన వారం ఏం జరిగింది?"

"పోయిన వారమా? ఓ, మా మామయ్యలు భోజనానికి వచ్చారు. ఆ దృశ్యం ఊహించుకో: డిన్నర్ అయిపోయాక మేమందరం బటర్‌స్కాచ్ ఐస్‌క్రీమ్ తింటూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని ఉన్నాం. మా మామయ్యల్లో ఒకాయన తన కూతురి పెళ్లి ఒక డాక్టర్‌తో నిశ్చయమైందనీ, అతను కార్డియాక్ సర్జన్ అనో ఏదో చెప్పాడు," అంది ప్రియాంక.

వెయిటర్ గులాబ్‌జామ్‌లు తెచ్చి బల్లమీద పెట్టాడు. నేను ఒక ముక్క కొరికాను.

"అబ్బా.... చాలా వేడిగా ఉన్నాయి, జాగ్రత్త," అన్నాను. "సరే అయితే, ఆ తరవాత ఏం జరిగింది?" అని అడిగాను.

"ఊc! నేను నా ఐస్‌క్రీమ్ తింటూండగా మా అమ్మా గట్టిగా అరిచింది, 'ప్రియంకా, నువ్వు కూడా జీవితంలో బాగా స్థిరపడ్డవాడినే చేసుకోవాలి, తెలిసిందా?' ఆఖరి మాటలు కీచుమని వచ్చాయి!"

"నేను త్వరలో టీమ్ లీడర్ అవబోతున్నాను," అని ఆమె నోట్లో ఒక గులాబ్‌జామ్ ముక్క పెట్టాను.

"హైరానా పడకు, శ్యామ్," అంది నా చేతిని తడుతూ ప్రియాంక. గులాబ్‌జామ్ తింటూ, "ఆవిడ అన్నది నీ గురించి కాదులే. అసలు హఠాత్తుగా అలా అందరిముందూ నాతో ఎలా మాట్లాడగలిగింది? అంటే, మిగతా వాళ్లందరిలా నేను హాయిగా నా ఐస్‌క్రీమ్ తినేవరకూ ఆగచ్చుగా? నా ఐస్‌క్రీమ్‌లో ఈ చేదు మందు కలపకపోతే ఏం? నా తమ్ముడు నోటినిండా కుక్కుకుంటూ తింటూ ఉంటే, వాణ్ణి ఎవరూ ఏమీ అనరే!"

నేను నవ్వి బిల్లు తీసుకురమ్మని వెయిటర్‌కి సౌంజ్ఞ చేశాను.

"అయితే అప్పుడు నువ్వేం చేశావు?" అన్నాను.

"ఏం లేదు. నా చెంచాని ప్లేట్లో పెద్ద చప్పుడుతో పడేసి, గదిలోంచి బైటికి వెళ్లిపోయాను."

"పెద్ద డ్రామా, అc? నువ్వు కూడా తక్కువేం తినలేదు!"

"అప్పుడు ఆవిడ మిగతావాళ్లతో ఏమందో ఊహించగలవా? 'నేను దీన్ని ప్రేమగా పెంచి పెద్ద చేసినందుకు ఫలితం ఇదీ! దానికి నా గురించి ఏమీ పట్టలేదు. దాన్ని కనేందుకు నేను దాదాపు చచ్చి బతికాను, అయినా అది నన్ను పట్టించుకోదు,' అంది."

ప్రియాంక ఎంతో గొప్పగా వాళ్లమ్మని అనుకరించేసరికి నేను నవ్వు ఆపుకోలేకపోయాను. బిల్లు వచ్చింది, దాన్ని చూసి ఒక్క క్షణం నా కనుబొమలు పైకి లేచాయి, నాలుగు వందల అరవై మూడు రూపాయలు! బిల్లు చెల్లించాను.

మేము వెళ్లటానికి లేచాం. అప్పుడే మాకు ఆ చిరచిరలాడే కుటుంబం మాటలు వినిపించాయి.

"ఏం చెయ్యగలం? ఈవిడగారు మన ఇంట్లో కాలు పెట్టినప్పట్నించీ, మనకి దురదృష్టం

పట్టుకుంది! ఆగ్రా సంబంధం వాళ్లు మనకి క్లినిక్ కూడా పెట్టి ఇస్తామన్నారు. అప్పుడు మన బుద్ధి ఎందుకు పనిచెయ్యలేదో తెలీదు!" అంటోంది పెద్దావిడ.

ఆవిడ కోడలు కళ్లల్లో నీళ్లు ఉబికాయి. ఆ అమ్మాయి తన ముందున్న పదార్థాలని ముట్టుకోనే లేదు. అతను మాత్రం తనకి ఏమీ పట్టనట్టు సుబ్బరంగా లాగించేస్తున్నాడు.

"చూడు ఎలా మొహం గంటుపెట్టుకుని కూర్చుందో! పోవే, ఎక్కడైనా పోయి చావు! కూడా చిల్లి గవ్వ తేలేదు, పైగా ఈ ఇద్దరు ఆడపిల్లల్నీ నా మెడకి గుదిబండల్లా కట్టావు!" అంది అత్తగారు.

నేనా చిన్న పిల్లలకేసి చూశాను. వాళ్లిద్దరూ ఒకే రకమైన జడలు వేసుకుని, వాటి చివర్ల గులాబీరంగు రిబ్బన్లు కట్టుకుని ఉన్నారు. వాళ్లిద్దరూ వాళ్లమ్మ చెరో చెయ్యి పట్టుకుని, హడిలిపోయినట్టుగా కూర్చుని ఉన్నారు.

ప్రియాంక వాళ్లకేసే చూస్తోంది. వాళ్లు కుల్ఫీ తెప్పించుకున్నారని గమనించి, నేను కూడా అదే ఆర్డరిస్తే, నాలిక కాలకుండా ఉండేది కదా, అనుకున్నాను.

"ఏమైనా మాట్లాడవేమే? బెల్లంకొట్టిన రాయిలా ఉలుకు పలుకు లేకుండా కూర్చుంటావేం?" అంది అత్తగారు కోడలి బుజాలు పట్టి కదుపుతూ.

"ఆ అమ్మాయి ఏమి మాట్లాడదేం?" అంది ప్రియాంక నాతో రహస్యంగా.

"ఆమె ఏమీ మాట్లాడలేదు! బాస్ చెడ్డవాడయితే మనం ఏమీ జవాబు చెప్పలేం," అన్నాను.

"ఈ శనిగ్రహాలకి డబ్బు ఎవరు ఖర్చుపెడతారు? జవాబు చెప్పు!" అంది అత్తగారు. కోడలి కంట్లోంచి కన్నీళ్లు ఇంకా వేగంగా కారసాగాయి.

"నేను చెపుతాను!" అంది ప్రియాంక అత్తగారికి ఎదురుగా నిలబడి.

ఆ చిరచిరలాడే కుటుంబ సభ్యులందరూ ఆశ్చర్యంతో మాకేసి చూశారు. ఆ పరిస్థితి నించి తప్పించుకోవటానికి ఎక్కడైనా చోటు దొరుకుతుందా అని చూడసాగాను నేను.

"మీరెవరు?" అన్నాడు భర్త. హోటలుకొచ్చాక బహుశా అతను మొదటిసారి నోరువిప్పాడనుకుంటూ.

"ఆ విషయం తరవాత చూద్దాం, కానీ మీరెవరు మహాశయ? ఆమె భర్త అనుకుంటాను?" అంది ప్రియాంక.

"ఆc, అవును. మేడమ్! ఇది మా కుటుంబ వ్యవహారం," అన్నాడతను.

"ఓ, నిజంగానా? దీన్ని మీరు 'కుటుంబం' అంటున్నారా? నాకైతే అలా కనబడటం లేదు! నాకొక ముసలి గయ్యాళి గంపా, పనికిమాలిన శాల్తీ కలిసి ఈ ఆడపిల్లల్ని బాధపెడుతున్నట్టు కనిపిస్తోంది. మీకు సిగ్గు వెయ్యటం లేదూ? ఇందుకేనా మీరామెని పెళ్లి చేసుకున్నారు?" అంది ప్రియాంక.



"ఇదిగో, ఇంకొకత్తి బైలుదేరింది. ఈ కాలం అమ్మాయిల్ని చూడు : మర్యాదగా మాట్లాడటం కూడా చాతకాదు. ఆ కళ్లు చూశావా? సినిమా హీరోయిన్ లాగ మేకప్పు అదీను?" అంది అత్తగారు.

"మా తరం అమ్మాయిలకి సరిగ్గా మాట్లాడటం, ప్రవర్తించటం బాగానే వచ్చు. మీ లాంటి ముసలి వాళ్లే నేర్చుకోవాలి. వీళ్లు మీ మనవరాళ్లు, కానీ మీరు వాళ్లని శనిగ్రహాలని అంటున్నారు," అంది ప్రియాంక. ఆమె ముక్కు మరింత ఎర్రబడింది. నాకు ఆ ముక్కుకి ఫోటో తియ్యాలనిపించింది.

"మీరెవరు మేడమ్? మా విషయంలో ఎందుకు జోక్యం కలిగించుకుంటున్నారు?" ఈసారి కొంచెం గట్టిగానే అడిగాడు ఆ భర్త గారు.

"నేనెవరో చెపుతాను," అని ప్రియాంక తన హాండ్‌బాగ్‌లో కాసేపు వెతికి, కాల్‌సెంటర్ ఐడి కార్డు బైటికి తీసి వాళ్లముందు అర క్షణంసేపు ఆడించి, "నా పేరు ప్రియాంక సిన్హా, సీబీఐ, విమెన్స్ సెల్!" అంది.

"ఏమిటీ?" అన్నాడు భర్త నమ్మలేనట్టుగా.

"మీ కారు నంబర్ చెప్పండి?" అంది ప్రియాంక గొంతులో ఏ భావము కనిపించనీయకుండా.

"ఎందుకు?" అన్నాడు అతను భయం భయంగా.

"లేక నన్ను బైటికెళ్లి చెక్ చెయ్యమంటారా?" అని బల్ల మీదున్న కారు తాళాలవైపు చూసి, "శాంత్రో కదూ?" అంది.

"డిజిఐ 463, ఎందుకడుగుతున్నారు?" అన్నాడతను.

ప్రియాంక తన సెల్‌ఫోను బైటికి తీసి ఏదో నంబరు కలుపుతున్నట్టు నటించింది. "హల్లో, సిన్హాని మాట్లాడుతున్నాను. డిజిఐ 463 కారు గురించిన వివరాలు సంపాదించండి..... అవును..... శాంత్రో.... థాంక్స్! అంది.

"మేడమ్! ఏం చేస్తున్నారు?" అన్నాడు భర్త వణికే గొంతుతో.

"మూడేళ్లు! ఆడవాళ్లని పీడిస్తే మూడేళ్లు శిక్ష పడుతుంది. తీర్పు త్వరగా ఇచ్చేస్తారు, మరింక అప్పీలుండదు!" అని ప్రియాంక అత్తగారి వైపు గుడ్లురిమి చూసింది.

ఆ ముసలావిడ ఒక మనవరాలిని తన ఒళ్లోకి లాక్కుంది.

"ఏమిటి, మేడమ్! ఇది కేవలం మా.... మా కుటుంబ వ్యవహారం, అదీగాక..." అతని నోటివెంట మాటలు సరిగ్గా రావటంలేదు.

"కుటుంబం అనకండి!" అంది ప్రియాంక గొంతు పెంచుతూ.

"మేడమ్!" అంది అత్తగారు. ఇప్పుడావిడ గొంతు తీయగా, ఆ గొంతునెవరో గులాబ్‌జాముల్లో ముంచి తీసినట్టుంది. "మేడమ్! మేమిక్కడికి భోజనం చెయ్యటానికి వచ్చాం. నా కోడల్ని నేను వంట కూడా చెయ్యనివ్వను, గమనించారా? మేం కేవలం..."

"....షటప్! మా దగ్గర మీ రికార్డులున్నాయి. మిమ్మల్ని గమనిస్తూనే ఉంటాం. మళ్ళీ ఇలాంటి వేషాలు వేశారో, మీరూ మీ అబ్బాయి కలిసి హాయిగా నెలల తరబడి భోజనం చెయ్యచ్చు-జైల్లో!"

"సారీ, మేడమ్!" అన్నాడు భర్త చేతులు జోడించి. అతను బిల్లు అడిగి, డబ్బు కోసం జేబులు తడుముకోసాగాడు. ఒక్క నిమిషంలో బిల్లు చెల్లించి వాళ్లందరూ బైట పడ్డారు.

నేను నోరు తెరుచుకుని ప్రియాంక కేసి చూశాను.

"ఏమీ మాట్లాడకు, పద పోదాం," అంది ఆమె.

"సిబిఐ?"

"వద్దు, పద."

కాల్‌సెంటర్ డ్రైవర్‌ని అడిగి తెచ్చుకున్న క్వాలిస్‌లో ఇద్దరం ఎక్కి కూర్చున్నాం.

"ముసలి నక్క!" అంది ప్రియాంక. నేను కారు నడపసాగాను. ఐదు నిమిషాలయ్యాక ప్రియాంక నాకేసి తిరిగి, "ఓకే, ఇప్పుడు నీ ఇష్టమొచ్చినది మాట్లాడచ్చు," అంది.

"ఐ లవ్ యూ!" అన్నాను.

"ఏమిటీ? ఇప్పుడు ఇదెందుకు?"

"ఎందుకంటే, నువ్వు తప్పు అనుకున్నదాన్ని ఎత్తి చూపించటానికి ధైర్యంగా నిలబడ్డావు చూడూ, అందుకూ! అంతేకాదు, సిబిఐ ఆఫీసరుగా నీ నటన బ్రహ్మాండంగా ఉంది, అందుకూ. నేను ఖర్చుపెడుతున్నానని నువ్వు చవగ్గా ఉండే పదార్థాలని ఎంచుకుని ఆర్డర్ చేస్తావు చూడు, అప్పుడు కూడా నీ మీద ప్రేమ పొంగుకొస్తుంది. నీ కళ్లకున్న కాటుక అంటే నాకు ప్రేమ. నాతో పోచికోలు కబుర్లు చెప్పేప్పుడు నీ కళ్లలో కనిపించే తళుకులు నాకు చాలా ఇష్టం. ముందు స్వీటు వద్దని, తీరా నేను ఆర్డరు చేశాక, దాన్ని మారుస్తావు. ఎందుకంటే నా స్వీటులోంచి చిన్న ముక్క నీకూ తినాలని ఉంటుంది, అప్పుడు కూడా నువ్వు నాకు ముద్దొస్తావు. మీ అమ్మగురించి నువ్వు చెప్పే కథలంటే నాకిష్టం. నా మీద నమ్మకం ఉంచి, నేను ఉద్యోగంలో నిలదొక్కుకునే దాకా వేచి ఉండటం చూస్తే, నీ మీద ప్రేమ పుట్టుకొస్తుంది. అసలు నీకో విషయం తెలుసా ప్రియంకా?" అన్నాను.

"ఏమిటి?"

"నేను హార్ట్ సర్జన్ కాకపోవచ్చు, కానీ నాకున్న ఒకే ఒక చిన్ని గుండెని, నేను నీకిచ్చేశాను"

ప్రియాంక పగలబడి నవ్వి తన చెయ్యి మొహానికడ్డంగా పెట్టుకుంది.

"సారీ!" అంది తల అడ్డంగా ఆడించి, ఇంకా నవ్వుతూ. "సారీ! అంత వరకు ఎంతో బాగా మాట్లాడావు, కానీ ఆ హార్ట్ సర్జన్ దగ్గరకొచ్చేసరికి, అది ఉందిచూడు, అదే అసలు బాగాలేదు!"

"నీకొక విషయం తెలుసా?" అని ఒక చెయ్యి స్టీరింగ్ వీల్‌మీదినించి తీసి ఆమె ముక్కు మెల్లిగా నలిపి, "రొమాంటిక్ వాక్యాలని చంపేస్తున్నందుకు, నిన్ను జైల్లో పెట్టాలి," అన్నాను.



# # 11

"నేనిది నమ్మలేకపోతున్నాను," అని తన మొబైల్‌ఫోన్‌ని బల్లమీద పడేసింది రాధిక. దాంతో నా పండారారోడ్డు కల కాస్తా చెదిరిపోయింది.

అందరూ ఆమెకేసి చూశారు. మొహాన్ని రెండు చేతులతోనూ కప్పుకుని గట్టిగా రెండుసార్లు ఊపిరి పీల్చింది.

"ఏమయింది?" అంది ప్రియాంక.

"ఏం లేదు," అని నిట్టూర్చింది రాధిక. ఆమె చాలా విచారంలో ఉన్నట్టు కనిపించింది, చిన్నగా కూడా కనిపించింది. ఐదేళ్ల క్రితం రాధిక అందంగా ఉండి ఉంటుంది, అనుకున్నాను.

"చెప్పవా?" అంది ఈషా.

"అనుజ్ ఎస్ఎమ్ఎస్ చేశాడు. ఒక్కోసారి ఎంత అనుచితంగా ప్రవర్తిస్తాడో!" అని ఈషాకి ఫోన్ అందించింది. అందులో ఎస్ఎమ్ఎస్ మెసేజి ఉంది.

"ఏమిటది?" అంది ప్రియాంక.

"పైకి చదువు," బ్యాగులో తలనెప్పి మాత్రలకోసం వెతుకుతూ అంది రాధిక. "అయ్యో! ఒక్కటే మాత్ర మిగిలింది!" అంది.

"అవునా?...ఓకే!" అని ఈషా ఎస్మెస్ మెసేజి చదవసాగింది, 'పెద్దవాళ్లకి మర్యాద ఇయ్యి. కోడలిలాగ ప్రవర్తించు, గుడ్‌నైట్!'

"నేనేం తప్పు చేశానని? హడావిడిగా బైలుదేరాను, అంతే!" అని తనలో తాను గొణుక్కుని, నీళ్లతో మాత్ర వేసుకుంది రాధిక.

ఈషా రాధిక భుజం మీద చెయ్యివేసి, "ఏమయింది?" అంది మృదువుగా. ఆడవాళ్లకి ఇది బాగా వచ్చిన విద్య. కొన్ని సెకన్ల ముందే గణేశ్ గురించి ఎంతో ఉత్సాహంగా కేకలు పెట్టింది, ఇప్పుడు అనుజ్ అన్న మాటలకి రాధికకి సానుభూతి చూపిస్తోంది.

"అనుజ్ కోల్‌కతా టూర్‌మీద వెళ్లాడు. అతను ఇంటికి ఫోన్‌చేస్తే మా అత్తగారు నామీద చెప్పినట్టుంది – బాదంపప్పు ఇంకా మెత్తగా నూరమన్నందుకు నేను మొహం విసుగ్గా పెట్టానని అంది. ఇది నమ్మేట్టుగా ఉందా? నేను క్వాలిస్‌ని అందుకునే తొందరలో ఉన్నాను. అయినా ఆవిడకి బాదంపాలు చేసిచ్చాను," అంది రాధిక కణతల్ని నొక్కుకుంటూ.

"అయితే తల్లీ, కొడుకూ ఇలాంటివే మాట్లాడుకుంటారా?" అంది ప్రియాంక.

రాధిక ఇంకా చెప్పుకుపోయింది, ఆవిడ ఇంకా ఇలా అందిట, 'నేను ముసలిదాన్నైపోయాను, బాదం ముక్కలు మరీ పెద్దవిగా ఉంటే నా గొంతుక్కి అడ్డుపడతాయి. రాధిక నన్ను చంపాలనుకుంటున్నట్టుంది!' "ఆవిడ నా గురించి అంత ఘోరంగా ఎందుకు చెపుతుంది?"

"అయినా నువ్వు ఆవిడకోసం స్కార్ఫ్ అల్లుతున్నావా?" అన్నాడు వ్రూమ్ అల్లుతున్న సూదులకేసి చూపిస్తూ.

"నన్ను నమ్మండి. కోడలుగా ఉండటం మోడల్‌గా ఉండటం కన్నా చాలా కష్టం," అంది రాధిక. మాత్ర పనిచెయ్యటం మొదలుపెట్టినట్టుంది, ఆమె మొహం కొంచెం తేటపడింది. "సర్లే, నా బోరింగ్ జీవితాన్నీ, నన్నూ వదిలేయ్. ఏమిటి సంగతి? గణేశ్ మళ్లీ ఇప్పట్లో ఫోన్ చేస్తున్నాడా?"

"నీకిప్పుడు తేలిగ్గా ఉందా?" అంది ఈషా ఇంకా రాధిక చేతిని వదలకుండా.

"ఆc. బాగానే ఉన్నాలే. సారీ అర్రా, నేను కొంచెం ఎక్కువగా మాట్లాడినట్టున్నాను. ఇది మా ఇద్దరి మధ్యా చిన్న అపార్థం అంతే!"

"మీ అత్తగారికి ప్రతిదాన్నీ గురించీ అతిగా చేసి చెప్పటం ఇష్టం లాగుంది. ఆవిడ మా అమ్మని కలవాలి," అంది ప్రియాంక.

"నిజంగానా?" అంది రాధిక.

"నిజంగానే! మా అమ్మ అతినాటకీయతకి మిస్ యూనివర్స్! మేమిద్దరం కలిసి కనీసం వారానికొకసారైనా ఏడుస్తాం. కానీ ఈరోజు మాత్రం ఆవిడ స్వర్గానికి బెత్తెడు దూరంలో ఉంది," అంటూ ప్రియాంక లాండ్‌లైన్‌ని దగ్గరికి లాక్కుంది.

నా కంప్యూటర్ తెరమీద కాల్ వస్తోందని మెసేజ్ రావటంతో నా ధ్యాస అటు మళ్లింది.

"నేను చూస్తాను," అన్నాను చెయ్యి పైకెత్తి. "వెస్టర్న్ అప్లయెన్సెస్, శామ్ మాట్లాడుతున్నాను. చెప్పండి, ప్లీజ్!" అన్నాను.

ఆ రాత్రి నాకొచ్చిన విచిత్రమైన కాల్స్‌లో అది కూడా ఒకటి. వర్జీనియానించి ఒక వ్యక్తి తన ఫ్రిజ్‌ని డీఫ్రాస్ట్ చెయ్యటం చాతకావటంలేదని ఫోన్ చేశాడు. దానికి కారణం తెలుసుకోవటానికి నాకు నాలుగు నిమిషాలు పట్టింది. ఫోన్ చేసిన వ్యక్తి ఒక 'బిగ్ పెర్సన్' అని తెలిసింది. అమెరికన్లు లావుగా ఉండేవారిని అలా అంటారు. అందుచేత డీఫ్రాస్ట్ చేయటానికి తిప్పవలసిన చిన్నబటన్ని అతని లావాటి వేళ్లు తిప్పలేకపోతున్నాయి, అని తేలింది. స్క్రూడ్రైవరునో, చాకునో వాడమని సలహా ఇచ్చాను. అదృష్టవశాత్తూ, ఏడుసార్లు ప్రయత్నించాక ఆ ఉపాయం పనిచేసింది.

"వెస్టర్న్ అప్లయెన్సెస్‌కి ఫోన్ చేసినందుకు థాంక్స్, సార్!" అని ఫోను పెట్టేశాను.

"ఇంకా వినయంగా మాట్లాడాలి, ఏజెంట్ శామ్! ఇంకాస్త మర్యాదగా మాట్లాడు," అని గొంతు వినిపించింది. మరుక్షణం అతని బరువైన ఊపిరి నా మెడకి తగలటం గమనించాను.



"సార్! మళ్లీ వచ్చారా?" అని వెనక్కి తిరిగాను. బక్షీ మొహం ఎప్పటిలా మెరుస్తోంది - జిడ్డోడుతూ! బహుశా ప్రతిరోజూ రాత్రి అతను దిండుమీదినించి జారిపోతూ ఉండి ఉంటాడు.

"సారీ, నేనొక ముఖ్యమైన విషయాన్ని మర్చిపోయాను. మీరు వెస్టర్న్ కంప్యూటర్స్ వెబ్‌సైట్ మాన్యువల్‌ని తయారుచేశారా? నేను ఆ ప్రాజెక్టు రిపోర్టుని ఇంక బోస్టన్‌కి పంపించదలిచాను," అన్నాడు బక్షీ.

"యెస్, సార్. వ్రూమ్, నేనూ కలిసి దాన్ని నిన్ననే పూర్తిచేశాం," అంటూ నా సొరుగులోంచి దాని కాపీ బైటికి తీశాను.

"హుఁ..." అన్నాడు బక్షీ కవర్‌పేజీని జాగ్రత్తగా చూస్తూ.

వెస్టర్న్ కంప్యూటర్స్
సమస్యల్ని పరిష్కరించే వెబ్‌సైట్
మాన్యువల్, ప్రణాళిక వివరాలు

తయారుచేసినవారు - కనెక్షన్స్, ఢిల్లీ
శ్యామ్ మెహరా, వరుణ్ మల్హోత్రా
(శామ్ మేసన్, విక్టర్ మెల్)

"నాకు ఈ-మెయిల్‌లో పంపటానికి నీ దగ్గర కంప్యూటర్ కాపీ ఉందా? బోస్టన్‌కి అది తక్షణం కావాలిట," అన్నాడు బక్షీ.

"యెస్, సార్!" అన్నాడు వ్రూమ్ తన కంప్యూటర్‌కేసి చూపిస్తూ. "నా కంప్యూటర్‌లో స్టోర్ చేసి ఉంది, దాన్ని మీకు పంపిస్తాను," అన్నాడు.

"అన్నట్టు, ఆ పేపర్లని విడివిడిగా బొత్తిపెట్టావా, శామ్?"

"ఎస్, సార్!" అని అతనికి ఆ పదిసెట్లూ ఇచ్చాను.

"ఎక్సెలెంట్! నేను నీకు ఒక అధికారాన్ని ఇస్తే, నువ్వు దాన్ని ఉపయోగించుకుని నాకు ఫలితానిచ్చావు! నిజానికి నా దగ్గర ఇంకో డాక్యుమెంటుంది, బోర్డుమీటింగ్ ఇన్విటేషన్. నువ్వేమైనా సహాయం చెయ్యగలవా?"

"ఏం చెయ్యమంటారు?" అన్నాను.

"ఇదిగో, దాని కాపీ. నేనీసారి ఎక్కువ ప్రింట్ చెయ్యలేదు.

పది జెరాక్స్ కాపీలు తీసివ్వగలవా, ప్లీజ్? నా సెక్రటరీకి ఈ రోజు సెలవ," అన్నాడు బక్షీ.

"ఆ... అలాగే సార్! జెరాక్స్ చెయ్యాలి, అంతేకదా?"

బక్షీ అవునని తలాడించాడు.

"సార్, బోర్డ్ మీటింగ్ దేన్ని గురించి?" అన్నాడు వ్రూమ్.

"ఏమీ లేదు. మామూలు మేనేజ్‌మెంట్‌కి సంబంధించిన విషయాల గురించే," అన్నాడు బక్షీ.

"ఉద్యోగాలు ఊడబోతున్నాయా?" అని అడిగాడు వ్రూమ్. అలా కుండబద్దలు కొట్టినట్టు అతను అడిగేసరికి అందరం అప్రమత్తులం అయాం.

"ఊc..." ఎప్పటిలాగే, ముఖ్యమైన ప్రశ్న వేసేసరికి, బక్షీ మాటలకోసం తడుముకో సాగాడు.

"వెస్టర్న్ కంప్యూటర్స్ ముఖ్య విభాగంలో ఏవో గాలికబుర్లు వినిపిస్తున్నాయి. ఏం లేదు మాకు ఏ విధమైన ఇబ్బందీ ఉండదు కదా అని తెలుసుకుందామని అడిగాను," అన్నాడు వ్రూమ్.

"వెస్టర్న్ అప్లయెన్సెస్ మీద ఎటువంటి ప్రభావమూ ఉండదు కదూ?" అంది ఈషా.

బక్షీ గట్టిగా ఊపిరి పీల్చి, "నేను మీకు ఎక్కువగా ఏమీ చెప్పలేను. ఒకటిమటుకు నిజం మనం 'రైట్ సైజ్'లో ఉండటానికని ఒత్తిడికి గురవుతున్నాం."

'రైట్ సైజా?' రాధిక నిజంగానే అర్థం చేసుకోలేక అడిగింది.

"అంటే కొందరి ఉద్యోగాలు పోతాయి, అంతేనా?" అన్నాడు వ్రూమ్. 'రైట్ సైజ్'కి అంతకన్నా వేరే అర్థం ఎప్పుడూ కనిపించదు.

బక్షీ జవాబు చెప్పలేదు.

"సార్, కొత్త వినియోగదార్లని సంపాదించాలంటే మనం సేల్స్ విభాగంలో సిబ్బందిని పెంచాలి. ఉద్యోగాలనించి తీసెయ్యటం పరిష్కారం కాదు," అన్నాడు వ్రూమ్ ధైర్యంగా. అతనికి అంత ధైర్యం రావటం ఆశ్చర్యమే!

బక్షీ వ్యంగ్యంగా నవ్వుతూ వ్రూమ్‌కేసి తిరిగాడు. అతని భుజంమీద చెయ్యి వేసి, "నీ ఉత్సాహం చూస్తే సంతోషంగా ఉంది, విక్టర్. కానీ బాగా తల పండిన మేనేజ్‌మెంట్, కంటికి కనిపించని విభిన్న అంశాలని కూడా అధ్యయనం చెయ్యాలి. ఆ తరవాత ఒక స్థిరమైన పరిష్కారాన్ని సూచించాలి. అది అంత సులభం కాదు," అన్నాడు.

"కానీ, సార్! మనం ఇంకా ఎక్కువ..." అని వ్రూమ్ ఏదో అంటూండగా బక్షీ అతని భుజం తట్టి వెళ్ళిపోయాడు.

బక్షీ గదిలోంచి బైటికెళ్ళిపోయాడని నిర్ధారణ చేసుకునేదాకా ఆగి, వ్రూమ్, "... మతిలేని శాల్తీ! బక్షీ చేసిన పొరపాట్ల వలన అమాయకులైన ఏజెంట్ల ఉద్యోగాలు పోతున్నాయి" అన్నాడు గట్టిగా అరిచినట్టుగా.

"నువ్వు కాస్త శాంతించు," అన్నాను, కాయితాలని పోగుచేస్తూ.

"అవును, శాంతంగా ఉండు, ఇదుగో ఈ జెరాక్స్‌గాడిలా, అన్నిటినీ తలవంచి అంగీకరిస్తాడు!" అంది ప్రియాంక.

"ఎక్స్‌క్యూజ్‌మీ! నా గురించి మాట్లాడుతున్నావా?" అన్నాను తలెత్తి.



ప్రియాంక జవాబు చెప్పలేదు. నాకు రక్తం ఉడికిపోయి, ఏమీ అనకుండా ఉండలేకపోయాను.

"అసలు నీకేమిటి సమస్య? నేనిక్కడకి వచ్చి, నెలకి పదిహేనువేలు సంపాదించుకుని ఇంటికెళ్తున్నాను. అందరికీ ఉద్యోగాలు పోతున్నాయని నాకు మంటగా ఉంది. నా ఉద్యోగాన్ని కాపాడుకోవటానికి శాయశక్తులా నేను ప్రయత్నిస్తున్నాను. కానీ మొత్తం మీద చూస్తే, నా పరిస్థితిని నేను అంగీకరించవలసిందే. అన్నట్టు వ్రూమ్, మళ్ళీ మర్చిపోతాను, నువ్వు బక్షీకి ఆ మాన్యువల్‌ని ఈమెయిల్ చేసేస్తావా?"

"అదే చేస్తున్నాను," అన్నాడు వ్రూమ్ మౌస్‌ని క్లిక్ చేస్తూ. "అయినా ఇక్కడ జరుగుతున్నదేం బాగాలేదు!" అన్నాడు మళ్ళీ తనే.

"ఏమీ విచారించకు. మనం వెబ్‌సైట్‌ని తయారుచేశాం. మనకి ఏమీ ప్రమాదముండదు," అన్నాను.

"అదే నా ఆశ కూడానూ. ఛీ! నెలకి పదిహేనువేల రూపాయలు సంపాదించలేకపోతే నేనుత్త చెత్తవెధవనైపోతాను. వారానికి మూడుసార్లు పిజ్జా తినకపోతే చచ్చిపోతాను!" అన్నాడు వ్రూమ్.

"అంత తరచుగా నువ్వు పిజ్జా తింటావా?" ఈషా అంది.

"అది ఆరోగ్యానికి మంచిది కాదు కదా?" అంది రాధిక. ఎస్ఎమ్ఎస్‌లో వాదన జరిగినా ఆమె మళ్ళీ స్కార్ఫ్ అల్లటం ప్రారంభించింది. అల్లటం అనే అలవాటు అంత త్వరగా వదలవనుకుంటా.

"ఏం కాదు. పిజ్జా పోషకాహారాలలో అన్నిటికన్నా మంచిది. అందులో ఉండే పదార్థాలు చూడు, రొట్టెలో ధాన్యం, చీజ్‌లో పాలలోని కొవ్వుపదార్థాలు, కూరలూ, మాంసం చేర్చేసరికి, అందులో అన్ని రకాల పోషకాలూ ఉంటాయి. నేను ఇంటర్నెట్‌లో చదివాను, పిజ్జా ఒంటికి మంచిదట."

"నువ్వూ నీ నెట్టూను!" అంది ఈషా. ఆమె అన్నది నిజమే. వ్రూమ్ అన్ని విషయాలూ ఇంటర్నెట్ నించే తెలుసుకుంటాడు, బైకులూ, ఉద్యోగాలూ, రాజకీయాలూ, డేటింగులకి అవసరమైన చిట్కాలూ, ఇప్పుడు పిజ్జా గురించి కూడా, అని తెలిసింది.

"పిజ్జాలు ఆరోగ్యానికి మంచివి కావు. ఎక్కువ తింటే నేను వేగంగా బరువు పెరుగుతాను, ముఖ్యంగా నేను బతికే పద్ధతిలో. నాకు వ్యాయామం చెయ్యటానికి సమయమే దొరకదు. అది చాలదన్నట్టు నేను ఇరుకుగా ఉండేచోట కదలకుండా కూర్చుని పనిచేస్తాను," అంది ప్రియాంక.

ప్రియాంక అన్న చివరి రెండు మాటలూ విని నా గుండె లయ తప్పింది. 'ఇరుకుగా ఉండే చోటు' అనే మాట నాకు ఒకేఒక అర్థాన్ని స్ఫురింపజేస్తుంది – 32వ మైల్‌స్టోన్ డిస్కోలో మేం గడిపిన ఆ రాత్రి.

# # 12

# గతంలో నేనూ ప్రియాంకా కలుసుకున్న సందర్భాలు-III

*32వ మైల్‌స్టోన్, గుడ్‌గాంవ్ హైవే*
*ఈ రాత్రికి ఏడు నెలల ముందు*

నేను దీన్ని నిజంగా 'డేట్' అని అనకూడదు. ఎందుకంటే ఈసారి ఈషా, వ్రూమ్ కూడా మాతో వచ్చారు. మాతో పనిచేసిన వారితో వెళ్లటం గురించి నేను మునుపు ప్రియాంకతో వాదన పెట్టుకున్నాను. తను మరీ అంత సంఘీభావం లేకుండా నన్ను ఉండద్దని చెప్పింది. వ్రూమ్ 32వ మైల్‌స్టోన్‌కి వెళ్దామని అన్నాడు. అక్కడ 'డోర్ బిచ్' ఉండదని అమ్మాయిలు కూడా అక్కడికి వెళ్లటానికి ఒప్పుకున్నారు. ప్రియాంక లెక్కన డిస్కో బైట నిలబడే డిస్కో యజమానురాలు డోర్‌బిచ్! లోపలికెళ్లే ప్రతి అమ్మాయినీ ఆమె శల్యపరీక్ష చేస్తుంది, అమ్మాయిల నడుం కొలత ఇరవైనాలుగు అంగుళాలకన్నా ఎక్కువుంటే, లేదా వాళ్ల దుస్తులు డిస్కో డాన్స్‌కి అనువైనవి లేకపోతే, 'డోర్‌బిచ్' వాళ్లని ఏవగింపుతో చూస్తుంది. వాళ్లు ఏభై ఏళ్ల ముసలమ్మలా కనిపిస్తారు ఆమె కళ్లకి.

"నిజంగానా? నేనింతకు ముందెప్పుడూ బైట నిలబడ్డ డోర్‌గర్ల్స్‌ని గమనించలేదే" అన్నాను, బార్ స్టూల్ మీద అందరం కూర్చుంటూండగా.

"అది అమ్మాయిలకి సంబంధించిన విషయంలే. వాళ్లు మమ్మల్ని కళ్లతోనే అంచనా వేస్తారు. కళ్లు తిరిగి పడిపోయేటంత ఆకర్షణ మాలో లేకపోతే, మమ్మల్ని చూస్తూ వెకిలిగా నవ్వుతారు," అంది ప్రియాంక.

"అయితే నువ్వెందుకు పట్టించుకోవాలి? నువ్వు ఆకర్షణీయంగానే ఉన్నావుగా!" అన్నాను. ఆమె నవ్వి నా బుగ్గ గిల్లింది.

"వికారంగా నవ్వుతారా? మీ ఆడవాళ్ల భాష ఏమిటో మీకే అర్థం కావాలి! సరే, ఎవరైనా డ్రింకు తీసుకుంటారా?" అన్నాడు వ్రూమ్.

"నాకు లాంగ్ ఐలాండ్ ఐస్‌టీ కావాలి," అంది ఈషా. మేకప్ వల్ల ఆమె అందం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని గమనించాను. ఒంటికి అతుక్కునట్టు ఉన్న నల్లటి చొక్కా నల్లరంగు పేంటూ వేసుకుంది. ఆమె పేంటు ఎంత బిగుతుగా ఉందంటే, దాన్ని విప్పటానికి నెమ్మదిగా చుదుతూ విప్పాలేమో అనిపించింది.



"లాంగ్ ఐలాండా? ఏమిటీ వెంటనే తాగేసి మత్తులోకెళ్లాలా?" అన్నాను.

"కమాన్! నా ఒత్తిడిని వెంటనే తగ్గించుకోవాలి. పోయిన నెలంతా పిచ్చిపట్టినట్టు మోడలింగ్ ఏజెన్సీల చుట్టూ తెగతిరిగాను. అదీగాక, పోయిన వారం తాలూకు వెయ్యి ఫోన్‌కాల్స్ ఇంకా గొంతులోనే ఉన్నాయి. వాటిని దిగమింగాలి!" అంది ఈషా.

"అవును సరిగ్గా చెప్పావు. నావి పన్నెండు వందలు. పదండి అందరం లాంగ్ ఐలాండ్స్ తాగుదాం," అన్నాడు వ్రూమ్.

"నాకోసం వోడ్కా తీసుకురా, ప్లీజ్," అంది ప్రియాంక. ఒంటెరంగు పేంటు పైన చెమ్కీలు కుట్టిన పిస్తారంగు పచ్చని చొక్కా వేసుకుంది. పోయిన సంవత్సరం ఆమె పుట్టినరోజున నేను కొనిచ్చిన చొక్కా అది. చాలా కనీ కనిపించకుండా ఐలైనర్, లేతరంగు మెరిసే లిప్‌స్టిక్కు వేసుకుంది. నాకు ఈషా 'ఏషియన్ పెయింట్ల' పనికన్నా ప్రియాంకాయే బాగుంది.

"మోడలింగ్‌లో ఏమైనా అదృష్టం కలిసొచ్చిందా?" అన్నాను ఈషాతో ఎక్కడో ఆలోచిస్తూ.

"ఇంతవరకూ ఏమీ లేదు. ఒక 'టాలెంట్ ఏజెంట్'ని కలిశాను. కొందరు డిజైనర్స్ దగ్గరికీ ఫ్యాషన్ షో ప్రొడ్యూసర్ల దగ్గరికీ నన్ను పంపిస్తానన్నాడు. అలాంటి వారి మధ్య కనిపిస్తూ నేను ఉండాలి," అంది ఈషా బొడ్డుని కప్పుకోవటానికి షర్టుని కిందికి లాక్కుంటూ.

మాకోసం డ్రింక్స్ తీసుకురావటానికి వ్రూమ్ బార్ టెండర్ దగ్గరికి వెళ్లాడు. నేను డిస్కోని ఒకసారి కలయజూశాను. అది రెండు అంతస్తుల్లో ఉంది, కింద డాన్స్ చేసే స్థలమూ, మొదటి అంతస్తులో విశ్రాంతిగా కూర్చుని తాగటానికి ఏర్పాట్లూ ఉన్నాయి. నేపథ్యంలో **'దిల్ చాహతాహై'** పాట రీమిక్స్ వినిపిస్తోంది. శనివారం రాత్రి అవటంతో, డిస్కోలో మూడువందల మందికి పైగా ఉన్నారు. అందరూ డబ్బున్నవాళ్లూ, లేదా ఒక కాక్‌టైల్‌కి 300 రూ॥ కన్నా ఎక్కువ ఖర్చుపెట్టగల డబ్బున్న స్నేహితులతో వచ్చినవాళ్లూ. మా బడ్జెట్టు కూడా ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయలు, అది మా ప్రాణానికి దుబారాఖర్చే. కానీ చాలా పని ఒత్తిడిలో ఎండాకాలమంతా చక్కగా పనిచెయ్యటం వల్ల మాకు దొరికిన బహుమతి అది.

డాన్స్ ఫ్లోర్‌మీద చీపురుపుల్లల్లా ఉన్న కొందరు మోడల్స్ కనిపించారు. వాళ్ల పొట్టలు ఎంత లోతుగా ఉన్నాయంటే, ఒకవేళ వాళ్లు ఏదైనా మాత్ర మింగితే దాని ఆకారం మనకి ఆ పొట్ట మీద కనిపిస్తుందన్నమాట! ఈషా ఆకారం కూడా అలాగే ఉంటుంది, కానీ ఒకటే తేడా, తను కొంచెం పొట్టి.

"కావాలంటే పరీక్షించి చూసుకో, ఆ అమ్మాయికి అసలు ఆకలనేదే లేదు. కావాలంటే పందెం!" అంది ప్రియాంక, డాన్స్ చేస్తున్న ఒక పాలిపోయిన మోడల్‌ని చూపిస్తూ. ఆ అమ్మాయి వేసుకున్న షర్టుకి, చేతులూ, మెడా, కాలరూ ఏవీ లేవు. అమ్మాయిలు అలాంటి షర్టుని 'భుజాలు లేని' షర్టు అని అంటారనుకుంటా. ఫిజిక్స్ నియమాలని ఉల్లంఘిస్తూ, అది కిందికి జారిపోటం లేదు. ఎంతోమంది మగాళ్లు పాపం ఓపిగ్గా వేచి ఉన్నారు!

ఆ పొలిపోయిన అమ్మాయి వెనక్కి తిరిగింది, వీపంతా పూర్తిగా నగ్నం!

"వావ్! నేను కూడా అంత సన్నగా ఉంటే ఎంత బావుణ్ణు! ఓ మైగాడ్! చూడు, ఆ అమ్మాయి ఏం తొడుక్కుందో!" అంది ఈషా.

"ఆమె బ్రా వేసుకోలేదంటే నేను నమ్మను. పూర్తిగా చదునుగా ఉన్నట్టుంది!" అంది ప్రియాంక.

"ఏయ్, పిల్లలూ!"

"ఆc?" ఈషా, ప్రియాంక నావైపు తిరిగారు.

"నాకు చాలా బోరు కొడుతోంది. మీరిద్దరూ మేము కూడా పాలుపంచుకునే విషయాల గురించి మాట్లాడతారా?" అన్నాను దీనంగా. నేను వ్రూమ్ కోసం చూశాను, అతను డ్రింకులు తీసుకుని వెర్రెత్తినట్టు మా సాయంకోసం చేతులు ఊపుతున్నాడు.

"నే వెళ్తా," అని ఈషా వ్రూమ్ దగ్గరకెళ్లింది.

ఎలాగైతేనేం, నేనూ, ప్రియాంకా ఒంటరిగా మిగిలాం కదా అని ఆనందించాను.

"అయితే..." అంది ఆమె ముందుకి వంగి అంటీ అంటనట్టు నా పెదవులమీద ముద్దు పెడుతూ. "మా అమ్మాయిల మాటలతో నిన్ను దూరంగా ఉంచేశామా?" అంది.

"మరి? ఇది 'డేట్' అనుకున్నాం కదా? నేను బలవంతాన వాళ్లతో వచ్చాను. మనిద్దరం ఒంటరిగా కలుసుకుని మాట్లాడుకుని నాకు యుగాలైనట్టుంది."

"చెప్పా కదా? వ్రూమ్ వస్తావా అని అడిగాడు, నేను మరీ అంత కటువుగా రాను చెప్పలేకపోయాను. కానీ మనం కొద్దిసేపట్లో వాక్‌కి వెళ్దాం. నాకు కూడా నీతో ఒంటరిగా ఉండాలనుంది, తెలుసా?" అంది నా జుట్టుని చేత్తో రేపుతూ.

"ప్లీజ్, త్వరగా వెళ్దాం!"

"తప్పకుండా. కానీ వాళ్లు వచ్చేస్తున్నారిక్కడకి." అంది ప్రియాంక. వ్రూమ్, ఈషా మా దగ్గరకి వచ్చారు. వ్రూమ్ మా అందరికీ డ్రింక్స్ అందించాడు. 'ఛీర్స్' అని ఎంతో ఉత్సాహంగానూ, ఆనందంగానూ కనిపించటానికి ప్రయత్నించాం. ఎందుకంటే డిస్కోలో అందరూ అలాగే కనిపించాలి.

"వెబ్‌సైట్ వీరులకి అభినందనలు. ఆ సైట్ చాలా బాగా వచ్చిందని విన్నాను," అంది ఈషా తన గ్లాసులోని డ్రింక్‌ని మెల్లిగా ఒక గుక్క తాగి.

"ఊc! వెబ్‌సైట్ బావుంది. ముందు నమూనాగా కొందరు వినియోగదార్లకి పంపాం. వాళ్లకది నచ్చింది. ఇంక ఫోన్ డయల్ చెయ్యక్కరలేదు. ఇది చాలా సింపుల్, అన్నీ మందే తినిపించాల్సిన ఆ అమెరికన్స్‌కి ఇదే సరైనది," అన్నాడు వ్రూమ్.

"అయితే, త్వరలో శ్యామ్‌గారికి ప్రమోషన్ వస్తుందన్నమాట!" అంది ప్రియాంక. రెండు గుక్కల్లో తన మూడో డ్రింకుని తాగేసిందామె.



"ఊc... మిస్టర్ శ్యామ్ ప్రమోషన్‌ది ఇంకో కథ. దాన్ని మిస్టర్ శ్యామ్ తన నోటితోనే చెప్పటానికి ఇష్టపడతాడేమో!" అన్నాడు వ్రూమ్.

"ప్లీజ్, ఒరే నాయనా, ఇప్పుడుకాదు, ఇంకెప్పుడైనా చూద్దాం," అన్నాను. ప్రియాంక నావైపు చెప్పమన్నట్టు చూస్తోంది.

"సరే, బక్షీ బోస్టన్‌తో ఈ విషయం మాట్లాడుతున్నానని అన్నాడు. కాని దానికి కొంత సమయం పడుతుంది," అన్నాను.

"అతనితో నువ్వు నిక్కచ్చిగా ఎందుకుండవు?" అంది ప్రియాంక.

"అంటే ఎలా? నీ బాస్‌తో నువ్వు అంత నిక్కచ్చిగా ఎలా ఉండగలవు?" అన్నాను విసుగ్గా గొంతు పెంచుతూ.

"శాంతించండి," వ్రూమ్ అన్నాడు. "మనం పార్టీ చేసుకుంటున్నాం. పైగా....."

ఒక పెద్ద శబ్దం మా మాటలకి అడ్డువచ్చింది. డిజె సంగీతం ఆపేశాడు. డాన్స్‌ఫ్లోర్ మీద ఏదో గొడవ జరుగుతోంది.

"ఏమైంది?" అన్నాడు వ్రూమ్. మేమందరం డాన్స్‌ఫ్లోర్ దగ్గరకెళ్లాం.

అక్కడ కొట్లాట జరుగుతోంది. బాగా తాగి ఉన్న ఒక స్నేహితుల గుంపు తమతో వచ్చిన అమ్మాయిని ఎవరో ముట్టుకున్నారని గొడవ చేస్తున్నారు. ఎవర్నో దోషి అనుకుని అతని కాలరు పట్టుకున్నారు. ఇంతలో ఆ దోషిగారి స్నేహితులు అతన్ని కాపాడటానికి వచ్చారు. డాన్స్‌ఫ్లోర్ మీద సంగీతం మరీ గట్టిగా ఉండటంతో వాదనలు లాభం లేదనుకుని ముష్టియుద్ధానికి దిగారు. ఎవరో మరో అబ్బాయిని కొట్టి కింద పడేసేసరికి సంగీతం ఆగిపోయింది. చాలామంది ఒకళ్లమీద ఒకళ్లు పడ్డారు. అక్కడి సెక్యూరిటీవాళ్లు, చివరికి అందర్నీ విడదీసి శాంతిని నెలకొల్పారు. స్పృహతప్పి పడిపోయిన అబ్బాయిని తీసుకెళ్లటానికి స్ట్రెచర్ వచ్చింది.

"ఏమిటి గురూ! ఇది ఇంకొంతసేపుంటే బావుండేది," అన్నాడు వ్రూమ్.

నిజమే. డిస్కోలో అందమైన వాళ్లని చూడటం కన్నా ఎక్కువ ఆసక్తి కలిగించేది కొట్లాటలే. కొట్లాట జరుగుతోందంటే పార్టీ మంచి ఊపందుకుందన్నమాట!

ఐదు నిమిషాల తరవాత మళ్లీ సంగీతం మొదలైంది. డాన్స్‌ఫ్లోర్‌మీద మళ్లీ ఆకలి వెయ్యని అమ్మాయిల వాహిని కనిపించింది.

"డబ్బున్న నాన్నలూ, అవసరానికి మించిన డబ్బూ ఉన్న పిల్లలకి జరిగేది అదే!" అన్నాడు వ్రూమ్.

"కమాన్, వ్రూమ్! నువ్వు డబ్బు ముఖ్యం అని అన్నావనుకుంటా. డబ్బుంటేనే కదా అమెరికన్స్‌ని ఓడించగలిగేది?" అంది ప్రియాంక. లాంగ్ ఐలాండ్ ఐస్ట్ టీ తాగిన ఏడు నిమిషాల్లో అంత ఆత్మవిశ్వాసం రావటం వింతేమీ కాదు.

"అవును. నీ మొబైల్ ఫోన్స్‌కీ, పిజ్జాలకీ, డిస్కోలకీ డబ్బు కావాలి కదా?" అన్నాను.

"కావాలి. కానీ ఒక తేడా ఉంది. ఈ డబ్బు నేను సంపాదించుకున్నాను. ఈ డ… కుర్రాళ్ళకి డబ్బు సంపాదించటం ఎంత కష్టమో తెలీదు," అని తన గ్లాసు పైకెత్తాడు ౖ… "ఈ డ్రింకు వెల మూడువందల రూపాయలు. దీన్ని సంపాదించాలంటే ఒక రా… రెండువందల మంది అమెరికన్లు నా చెవులు చిల్లులుపడేలా అరిస్తే, ఆ చిరాకుని భరిం… అప్పుడే ఈ డ్రింకు నాకు దొరుకుతుంది. దీన్నిండా ఐస్‌ముక్కలే ఎక్కువున్నాయనేది… సంగతి! ఈ కుర్రకారుకి ఇలాంటివేం తెలుసు? నాకూ వాళ్ళకీ పోలికా?" అన్నాడు.

"ఓ! నాకిప్పుడు ఈ డ్రింక్ తాగాలనిపించటంలేదు," అంది ప్రియాంక.

"కమాన్! నువ్వు బాగా సంపాదిస్తున్నావు. పాత్రికేయురాలిగా శిక్షణ పొందుతున్న… సంపాదించిన ఎనిమిది వేలకన్నా ఎంతో ఎక్కువ ఇప్పుడు సంపాదిస్తున్నావు," అన్నా…

పెద్ద, నూట ఇరవై రూపాయల గుక్క తన గ్లాసులోంచి తాగి, "అవును. మనకి … బాగానే ఇస్తున్నారు. నెలకి పదిహేనువేలు. అరె! అంటే రోజుకి దాదాపు పన్నెండు … వావ్, అమెరికాలో బర్గర్లు అమ్ముకునే కుర్రాడు రెండుగంటల్లో సంపాదించే మొత్తా… ఒక రోజులో సంపాదిస్తున్నాను. నా కాలేజీ డిగ్రీకి తగిన జీతమే. జర్నలిస్ట్‌గా నేను సంపా… దానికి రెండింతలు, బాస్!" అని అతను తన గ్లాసుని తోశాడు, అది బల్ల చివరివరకూ జా…

అందరూ ఒక నిమిషం మౌనంగా ఉన్నారు. వ్రూమ్‌కి కోపం వస్తే అతన్ని భరిం…

"అంత దిగులుపడటం మాను. పద డాన్స్ చేద్దాం!" అని ఈషా వ్రూమ్ చెయ్యి ప…

లాగసాగింది.

"వద్దు," అన్నాడు వ్రూమ్.

"ఒక్క పాటకి డాన్స్ చేద్దాం," అని ఈషా తన స్టూలు మీదినించి లేచి నిలబ…

"ఓకే, కానీ నిన్నెవరైనా ఏడిపిస్తే, నేను పోట్లాడను," అన్నాడు వ్రూమ్.

"ఏం భయం లేదు. నన్నెవరూ ఏమీ అనరు. ఇక్కడ నాకన్నా అందమైన అమ్మాయిలున్నా…

అంది ఈషా.

"నేనలా అనుకోవటం లేదు. సరే, పద పోదాం," అన్నాడు వ్రూమ్. ఇద్దరూ డాన్… దగ్గరకి వెళ్ళారు. 'షరారా షరారా' అనే పాట వేశారు. అది ఈషాకి ఎంతో ఇష్టమైన పా… ఒకటి.

ప్రియాంక, నేనూ మా సీట్లలో వాళ్ల డాన్స్ చూస్తూ కూర్చున్నాం.

కొద్ది నిమిషాలు పోయాక, "అలా నడిచి వద్దామా?" అంది ప్రియాంక.

"ఓ!" అన్నాను. మేమిద్దరం చేతులు పట్టుకుని 32వ మైల్‌స్టోన్‌లోంచి బైటికి వ… గేటు దగ్గరున్న సెక్యూరిటీ 'బౌన్సర్' మా చేతులమీద ముద్రవేశాడు. ఆ ముద్ర ఉంటే… లోపలికి వెళ్ళచ్చు. మేం పార్కింగ్ కేసి నడిచాం. అక్కడికి సంగీతం సన్నగా వినిపిస్తో… చెవులకి మునుపెన్నడూ ఇంత హాయిగా అనిపించలేదు.



"ఇక్కడ ఎంత ప్రశాంతంగా ఉందో!" అంది ప్రియాంక. మళ్లీ తనే, "వ్రూమ్ మరీ కోపాన్ని ఆపుకోలేడు, అది నాకు నచ్చదు. కొంచెం దాన్ని అదుపులో పెట్టుకోవటం నేర్చుకోవాలి అతను. మరీ అడ్డూ ఆపూ లేకుండా అంత ఆవేశపడటం మంచిది కాదు," అంది.

"అతనికి ఇంకా చిన్నతనం, పైగా సవ్యంగా ఆలోచించలేడు. బాధపడకు, జీవితమే అతన్ని ఎదురుదెబ్బలతో సరిదిద్దుతుంది. నా ఉద్దేశం, అప్పుడప్పుడూ బాధపడుతుంటాడు - పాత ఉద్యోగం వదిలి కనెక్షన్స్‌లో ఎందుకు చేరానా అని. అదీకాక, అతని తలిదండ్రులు విడిపోవటాన్ని అతను తట్టుకోలేకపోతున్నాడు. అప్పుడప్పుడూ ఆ బాధ కనబడుతూ ఉంటుంది."

"అయినా తనని తన అదుపులో పెట్టుకోవాలి. ఎవరో ఒకే అమ్మాయిని గర్ల్‌ఫ్రెండ్‌గా చేసుకున్నా బాగానే ఉంటుంది, దాంతో అతను కొంత శాంతిస్తాడు."

"అతనికి ఈషా అంటే ఇష్టమనుకుంటా," అన్నాను.

"కానీ ఈషాకి అతనంటే ఇష్టం ఉందో లేదో తెలీదు. ఆమె దృష్టంతా తన మోడలింగ్ మీదే ఉంది."

మేం క్వాలిస్ దగ్గరకి చేరుకున్నాం. సిగరెట్టు పాకెట్టు తీసుకోవటానికని కారు తలుపు తెరిచాను.

"నా దగ్గరగా నిలబడి సిగరెట్టు కాల్చద్దు," అని నా దగ్గర్నించి పాకెట్టు లాగేసుకుంది.

"చూశావా, ఒకే గర్ల్‌ఫ్రెండ్‌కి అతుక్కుపోవటం కూడా అంత మంచిది కాదు!" అన్నాను.

"అవునా? అయితే మిస్టర్ శ్యామ్ మనసు మార్చుకోదలిచావా?" అంది తలని ఒక పక్కకి వంచి.

"లేదు," అని క్వాలిస్ తలుపు మళ్లీ తెరిచి, ఒక బాటిల్ బైటికి తీశాను.

"ఏమిటది?" అని అడిగింది ఆమె.

"అవసరమొస్తుందని బకార్డీ ఎప్పుడూ దగ్గర పెట్టుకుంటాం. ఒక బాటిల్ డ్రింకు మూడువందల రూపాయలు."

"బావుందే! అబ్బాయిలు చాలా చురుకైనవాళ్లే!" అని ప్రియాంక నా బుగ్గలు సాగదీసింది. ఆ తరవాత బాటిల్‌లోంచి ఒక గుక్క తాగింది.

"జాగ్రత్త. ఫ్రీగా వస్తోంది కదా అని ఎక్కువ తాగెయ్యకు."

"నా మాట నమ్ము. ఇంట్లో తల్లో తండ్రో మతిస్థిమితం లేనివాళ్లైతే, ఇలాంటివి అవసరమౌతాయి."

"ఇవాళేమైంది?"

"ఏం లేదులే. ఇవాళ నాకు ఆవిడ గురించి మాట్లాడాలని లేదు. రా, ఇద్దరం కలిసి తాగుదాం," అంది. బాటిల్ మూతని తను కప్పుగా వాడితే, సిగరెట్టు పెట్టె పై భాగాన్ని పీకేసి

నేను కప్పుగా వాడాను. ఇద్దరం మా మొదటి 'పెగ్గు' తాగాం. నా పెదవులనించి నా పొట్టలో వెచ్చదనం పాకింది.

"బక్షీ గురించి నేనిందాక లోపల అన్న మాటకి నన్ను క్షమించు," అందామె.

"ఫరవాలేదులే, ఏం కాదు," అని రెండో పెగ్గు ఇప్పుడే తీసుకోవటమా తరవాతనా అ ఆలోచించాను.

"ఒక్కోసారి, చాలా ఘోరంగా ప్రవర్తిస్తాను, కానీ మళ్లీ మనం ఒకటైపోతాం, నేను మ ప్రేమికురాలిని కదూ?" అందామె డ్రింకులు ఎక్కువై.

"నువ్వు చాలా మంచిదానివి," అని ఆమె తడికళ్లవైపు చూశాను. ఆమె ముక్కు కొ చిట్లించింది. దాన్ని ఎల్లకాలం అలా చూస్తూ ఉండిపోవాలని అనిపించింది.

"అయితే," అంది.

"అయితే, ఏమిటి?" అన్నాను ఇంకా మంత్ర ముగ్ధుడిలా ఆమె ముక్కునే చూస్తూ

"ఎందుకు నాకేసి అలా చూస్తున్నావు?" అని నవ్వింది.

"ఎలా చూస్తున్నాను?"

"దగ్గరికి రా, అంటునట్టు. నాకు నీకళ్లల్లో కొంటెతనం కనిపిస్తోంది, మిస్టర్!" అంది న రెండు చేతులూ పట్టుకుని నవ్వులాటకి అంటున్నట్టు.

"కొంటెతనం ఏమీ లేదే, నువ్వే ఏదో ఊహించుకుంటున్నావు," అన్నాను.

"చూద్దాం," అంటూ దగ్గరగా వచ్చింది. నా మెడ మీద ముద్దు పెట్టుకుంది. మేమిద్ద కావలించుకున్నాం.

"ఏయ్!" అంది.

"ఏమిటి?" అన్నాను అస్పష్టంగా.

"మనం అలా 'కలిసి' ఎన్నాళ్లయింది?"

"ఓ, అడక్కు! చాలా బాధ కలుగుతుంది, నెల దాటింది!"

నిజమే. మేమిద్దరం శారీరకంగా కలిసింది, ఎవరూ లేని సమయం చూసి, మా ఇం కానీ ఈ మధ్యన బయట చలిగా ఉండటం వల్ల అమ్మ ఎక్కువగా ఇంటిదగ్గరే ఉంటో తనకెంతో సరదా ఐన బంధువులని కలవటం అనే కార్యక్రమాన్ని కూడా వదులుకుం

"ఎప్పుడైనా ఇరుగ్గా ఉండే చోట్ల ప్రేమవ్యవహారం నడిపావా?"

"ఏమిటీ?" అన్నాను ఆమె చెవికి నోరు ఆనించి.

"అబ్బా!" అంది చెవి రుద్దుకుంటూ. "హల్లో? నేనన్న మాట నువ్వు విన్నావా, క

"ఏం మాట్లాడుతున్నావు?"



"ఊc, మనకి ఇప్పుడు తీరిక ఉంది, సన్నగా సంగీతం వినిపిస్తోంది, ఏకాంతంగా ఉన్న చోటు దొరికింది."

"అయితే?"

"అయితే, క్వాలిస్‌లోకి ఎక్కు మై ఫ్రెండ్!" అని కారు తలుపు తీసింది. నేను వెనక సీట్లోకి ఎక్కాను. నా వెనకే ఆమె కూడా ఎక్కింది.

మా క్వాలిస్ డిస్కో వెనకే పార్క్ చేసి ఉంది. మేం మాట్లాడకుండా ఉంటే సంగీతం వినిపిస్తుంది. ఆ పాట ఐపోయి, 'మాహీవే' అనే పాట, 'కాంటే' సినిమాలోది ప్రారంభమైంది.

"నాకీ పాటంటే చాలా ఇష్టం," అని తన రెండు కాళ్లూ రెండు పక్కలా వేసి, నా ఒళ్లో కూర్చుంది.

"అది పోల్‌డాన్సర్ పాట, తెలుసా?" అన్నాను.

"అవును, తెలుసు. కానీ నాకు పాటలో సాహిత్యం ఇష్టం. వాళ్ల ప్రేమ నిజమైనది, కానీ విధి రాత మరోలా ఉంది."

"నేనెప్పుడూ సాహిత్యం వినను."

"వీడియోలో బట్టలు దాదాపు లేనట్టుగా ఉన్న అమ్మాయిల మీదే ఉంటుంది నీ ధ్యాసంతా," అని తన వేళ్లని నాజుట్టులోకి పోనిచ్చింది.

నేను మౌనంగా ఉండిపోయాను.

"మరి, నువ్వు నా ప్రశ్నకి జవాబు చెప్పలేదు, ఇరుగ్గా ఉండే చోట ఎప్పుడైనా సెక్స్‌లో పాల్గొన్నావా?" అంది ఆమె.

"ప్రియాంకా, నీకు పిచ్చెక్కిందా లేక తాగిన మత్తులో ఇలా మాట్లాడుతున్నావా?"

నా షర్టుకున్న పై బటన్లు కొన్నిటిని ఊడదీసి, "రెండూనూ మిస్టర్! ఇరుగ్గా ఉండే చోటయితే నువ్వు కూడా సహకరించాల్సి ఉంటుంది. ఊc, నీ చేతులు అడ్డుగా ఉన్నాయి, అడ్డం తియ్యి," అంది.

మా ఊపిరి చప్పుడు తప్ప క్వాలిస్‌లో మరే చప్పుడూ లేదు.

కారు అద్దాలన్నీ వేసి ఉన్నాయని నిర్ధారణ చేసుకుని నన్ను షర్టు విప్పెయ్యమని ఆజ్ఞ జారీ చేసింది. తన 'కుర్తీ'ని ముందు తీసేసింది. ఆ తరవాత నెమ్మదిగా బ్రాకున్న హుక్‌ని ఊడదీసింది.

"నీ బట్టలు జాగ్రత్తగా ఒకచోట పెట్టు. తరవాత వాటిని త్వరగా తీసి వేసుకోవాలి," అంది.

"నీకు పిచ్చి పట్టిందా...?" అన్నాను రొప్పుతూ. ఒక పక్క ఆమె నా తలమీదినించి నా షర్టుని తీసెయ్యటానికి వీలుగా నా చేతుల్ని పైకెత్తుతూ. నా షర్టుని ఒక పక్కగా పెట్టటానికి తను కదిలేసరికి ఆమె కాలు నా కాలి చిటికెనవేలి మీద పడింది.

"అబ్బా!" అని గట్టిగా అరిచాను.

"అయ్యో! సారీ!" అంది కొంటెగా. ఆమె కాలు తీసేస్తూంటే తల కారు పైభాగాన్ని కొట్టుకుంది.

"అబ్బా!... సారీ! ఇది 'టైటానిక్' మూవీలో ఉన్నంత సొగసుగా లేదు!" అంది.

"ఫరవాలేదులే. కదలికలన్నిటినీ ముందే నిర్ణయించి చేసే సెక్స్ కన్నా ఇలా అవకతవకగా చేస్తేనే బావుంటుంది. అసలు సెక్సే చెయ్యకపోవటం కన్నా ఇది ఎన్నోరెట్లు నయం!" అన్నాను ఆమెని దగ్గరకి లాక్కుంటూ.

"అన్నట్టు కండోమ్ ఉందా?" అంది.

"యెస్, సార్! మేము ఎడతెగని ఆశాజీవులం!" అన్నాను పర్సు బైటికి తీస్తూ.

ఆమె నన్ను కావలించుకునేసరికి ఇద్దరం నవ్వుకున్నాం. ఆమె నా మొహంమీద ముద్దులు పెట్టుకోసాగింది. నేనామె భుజాలని ముద్దు పెట్టుకున్నాను. కొన్ని క్షణాల తరవాత నేను కంపెనీవాళ్ల క్వాలిస్‌లో ఉన్నానన్న సంగతి మర్చిపోయాను.

ఇరవై నిమిషాల తరవాత ఇద్దరం కారు వెనకసీట్లో ఒకరి చేతుల్లో ఒకరం అలా సోలిపోయాం.

"అద్భుతం... అద్భుతమైన అనుభవం, మిస్. ప్రియాంకా!"

"'మై ప్లెజర్,' సార్!" అని నాకు కన్నుకొట్టింది. "మనం ఇక్కడే పడుకుని కాసేపు కబుర్లు చెప్పుకుందామా?" అంది.

"తప్పకుండా," అన్నాను, నా బట్టలకోసం చెయ్యిచాస్తూ.

మేమిద్దరం బట్టలు వేసుకున్నాక, మళ్లీ నన్ను ఆమె పొదువుకుంది.

"నీకు నేనంటే ప్రేమేనా?" అంది. ఆమె గొంతులో ఇప్పుడు కొంటెతనం లేదు.

"ఈ భూప్రపంచంలో ఇంకెవర్నీ ప్రేమించనంతగా నిన్ను ప్రేమిస్తున్నాను. చివరికి నన్ను కూడా!" అన్నాను ఆమె జుట్టు నిమురుతూ.

"నేను ఎదుటివారిని పట్టించుకుంటానని నువ్వు అనుకుంటున్నావా?" అని గద్గద కంఠంతో అడిగింది.

"ఎందుకెప్పుడూ నన్ను అలా అడుగుతూ ఉంటావు?" అన్నాను.

"మా అమ్మ ఇవాళ పాత ఫోటోల ఆల్బమ్ చూస్తూ కూర్చుంది. నేను మూడేళ్ల దాన్ని ఉండగా తీసిన ఒక ఫోటో దగ్గర ఆగిపోయింది. నేను మూడుచక్రాల సైకిలుమీద కూర్చుని ఉన్నాను, ఆవిడ నన్ను తోస్తోంది. ఆ ఫోటో చూసి ఆవిడ ఏమందో తెలుసా?"

"ఏమంది?"

"నేను మూడేళ్లప్పుడు ఎంతో ముద్దొస్తూ ఉండేదాన్నని అంది."



"నువ్విప్పుడు కూడా ముద్దొస్తూనే ఉన్నావు," అని ఆమె ముక్కుని బటన్ నొక్కినట్టు నొక్కాను.

"అప్పుడు ఎంతో ప్రేమగానూ, ముద్దొస్తూనూ ఉండేదాన్ననీ, ఇప్పుడు అలా లేనేలేననీ అంది. నేను ఇంత కఠినంగా మారటానికి కారణం ఏమయుంటుందని తను ఎప్పుడూ అనుకుంటూ ఉంటానని అంది... ..." అని ప్రియాంక భోరుమని ఏడవసాగింది.

నేనామెని గట్టిగా పొదివి పట్టుకున్నాను. ఏడుపుతో ఆమె ఒళ్లు ఎగిరెగిరి పడుతోంది. నేనేం మాట్లాడాలా అని తీవ్రంగా ఆలోచించాను. ఇటువంటి సందర్భాల్లో భావోద్వేగాన్ని తగ్గించటానికి ఏం మాట్లాడాలో అబ్బాయిలకి చస్తే తెలీదు. పైగా ఏదో అసందర్భంగా కూడా అనేస్తారు.

"మీ అమ్మకి పిచ్చి..."

"మా అమ్మను గురించి ఏమీ అనకు. నాకావిడంటే ప్రేమ. నేచెప్పేది ఒక ఐదునిమిషాలు స్తిమితంగా వింటావా?" అంది ప్రియాంక.

"తప్పకుండా... సారీ..." అన్నాను ఆమె ఇంకా గట్టిగా వెక్కిళ్లు పెట్టసాగింది. ఐదు నిమిషాలు మౌనంగా ఉంటానని నాకు నేను మాటిచ్చుకున్నాను. ఎన్నిసార్లు ఊపిరి పీలుస్తున్నానో లెక్కపెట్టసాగాను, ఏమీ తోచక. నిమిషానికి సగటున పదిసార్లు! అంటే ఎనభైసార్లు ఊపిరి పీలిస్తే ఐదు నిమిషాలు మౌనంగా ఉండి ఆమె చెప్పేది వింటున్నానని అర్థం.

"మేమిద్దరం మొదట్నించీ ఇలా లేం. నేనూ మా అమ్మా ప్రాణస్నేహితుల్లా ఉండేవాళ్లం. ఎనిమిదో తరగతి వరకూ అనుకుంటా. ఆ తరవాత నేను పెద్దదాన్నవుతున్నకొద్దీ, ఆవిడ పిచ్చిపిచ్చిగా తయారవసాగింది," అందామె.

ఇంతకుముందే వాళ్లమ్మని పిచ్చిది అనద్దని నన్ను కోప్పడిందన్న విషయం గుర్తు చేద్దామా వద్దా, అనుకున్నాను. ఏమయినా నోరు తెరవనని మాటిచ్చాను కదా!

"నాకూ, నా తమ్ముడికీ వేరేవేరే రూల్సుండేవి. దాంతో నాకు అవస్థగా అనిపించేది. నేను ఏది వేసుకున్నా ఆవిడ ఏదో ఒకటి అనేది, ఎక్కడికెళ్లినా విమర్శించేది. కానీ నా తమ్ముడి విషయంలో... వాడిని ఆవిడ ఏమీ అనేది కాదు. నేనా విషయం ఆవిడకి వివరిద్దామని ప్రయత్నించాను. కానీ దానివల్ల ఆవిడ నాకు ఇంకా చిరాకు తెప్పించేది. కాలేజీలో చేరాక, ఇక ఎప్పుడు ఇంట్లోంచి బైటికి వెళ్దామా అని చూసేదాన్ని."

"ఓ..." నా ఐదు నిమిషాల్లో సగం గడిచిపోయి ఉండచ్చని అంచనా వేసుకుంటూ, అన్నాను. నా కాలు తిమ్మిరెక్కుతోంది. సెక్స్ అయిపోయాక ఇరుకు ప్రదేశాలు తలనెప్పిగా తయారౌతాయి.

"కాలేజీలో చదివినన్నాళ్లూ ఆవిడని పట్టించుకోలేదు, నాకు కావల్సినది చేశాను. నిజానికి, ఈ 'నువ్వంటే లెక్కలేదు,' అనే ధోరణి అప్పుడే మొదలైంది. కానీ ఇంకోపక్క నాకు తప్పుచేస్తున్నానన్న భావం విపరీతంగా ఉండేది. కాలేజి చదువు అయిపోయాక మళ్లీ ఆవిడకి

దగ్గరవుదామని ప్రయత్నించాను. కానీ ఆవిడకి నాతో అన్నీ సమస్యలే - నా ఆలోచనలు, నా స్నేహితులు, నా బాయ్‌ఫ్రెండ్స్."

ఆ ఆఖరి పదం విని ఉలిక్కిపడ్డాను. నేనిప్పుడు మాట్లాడక తప్పదు, యాభైపేదు స... ఊపిరి తీసినప్పటికీ!

"సారీ... నువ్వు బాయ్‌ఫ్రెండ్ అన్నావా?"

"ఊఁ, అన్నాను. ఆవిడకి నేను నీతో తిరుగుతున్నానని తెలుసు. కానీ ఆవిడకి నీ... జీవితంలో స్థిరపడ్డ అబ్బాయిని చేసుకోవాలని ఉంది."

'స్థిరపడ్డ'? ఆ మాట రీవైండ్ అయి నా బుర్రలో చాలాసార్లు మారుమోగింది. అయి... ఆ మాటకి అర్థం ఏమిటి? ఒక డబ్బున్నవాడనా, లేక నెలాఖరికి ఇంత మొత్తం అని ఖచ్చితం... డబ్బు చేతిలోకొచ్చేవాడనా? తలిదండ్రులు దాన్ని ఆ రకంగా చెప్పరు, ఎందుకంటే అందరికు... ఎక్కువ వేలంపాట పాడేవాడికి తమ కూతుర్ని ఇస్తామన్న అర్థం అందులో ధ్వనిస్తుంది. ... ఒక రకంగా చూస్తే వాళ్లు చేసేది అదే. ప్రేమ, మనోభావాలు, ఇలాంటి చెత్తవాటికి వాళ్లు ... విలువ ఇవ్వరు. "మాకు నీ డబ్బు చూపించి, జీవితాంతం మా అమ్మాయిని నీతోనే ఉంచు... పెద్దలు చూసి నిర్ణయించే పెళ్లిలో ఇలాంటి ఏర్పాటే ఉంటుంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అంది ఆమె.

"మీ అమ్మ లెక్కన నేను దమ్మిడీకి కొరగానివాణ్ణి, అంతేనా?" అన్నాను.

"నేనన్నది అది కాదే?"

"మనం మాట్లాడుకున్నప్పుడల్లా నువ్వు బక్షీ గురించీ, నా ప్రమోషన్ గురించీ ఏదో ఒక... అంటూనే ఉంటావు కదా?" అన్నాను దూరంగా జరుగుతూ.

"ఎందుకలా ఆత్మరక్షణకు దిగుతావ్? అయినా, బక్షీ నీకు ప్రమోషన్ ఇవ్వకపోతే ను... మరో ఉద్యోగం చూసుకోవచ్చు."

"నాకు ఉద్యోగాలు వెతుక్కుని వెతుక్కుని విసుగొచ్చేసింది. ఎక్కడా మంచి ఉద్యోగా... లేవు. పైగా ప్రతిచోటా 'నీకు ఈ ఉద్యోగం ఇవ్వం' అనే మాట వినలేకుండా ఉన్నాను. ... మరో కాల్‌సెంటర్లో చేరటంలో అర్థం లేదు. మళ్లీ జూనియర్ ఏజెంటుగా మొదలుపెట్ట... - నువ్వుండవు, ఈ స్నేహితులుండరు. కానీ నీకొక విషయం చెపుతున్నాను, నేను టీమ్... కాకపోవచ్చు, కానీ నేను సంతోషంగా ఉన్నాను. నాకు తృప్తిగా ఉంది. నీకది తెలుస్తోం... మీ డ్రామా రాణీ అమ్మకి, నేను ఎందుకూ పనికిరానివాడిననే సంగతి నాతోనే నేరుగా చెప్ప... చెప్పు. నిన్ను స్థిరపడిన ఏ వెధవకైనా, నెలనెలా జీతం తెచ్చుకునే వాడెవడికైనా ఇచ్చి, పెళ్లి... పంపెయ్యమని చెప్పు. నేను నేనే..." అన్నాను, మొహం కందగడ్డలా చేసుకుంటూ.

"శ్యామ్, ప్లీజ్, అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తావా?"

"ఏమిటి అర్థం చేసుకునేది? మీ అమ్మనా? లేదు, నావల్లకాదు. నీవల్ల కూడా కా... కానీ ఏ మూలో నీ మనసులో నువ్వు ఆవిడతో ఏకీభవిస్తున్నావేమోనని నాకు అనుమా...



ఉంది. అంటే, నేనీ పనికిమాలిన వాడిని ఎందుకు పట్టుకుని ఏడుస్తున్నాను, అనే భావం నీలో ఉందని నా అనుమానం."

"పిచ్చిపిచ్చిగా వాగకు," అని అరిచింది ప్రియాంక. "ఇప్పుడే నీతో సుఖం పంచుకున్నాను, కొంచెం ఆలోచించి మాట్లాడు! ఆ పనికిమాలిన అనే మాట వదిలెయ్యి," అని మళ్లీ ఏడవసాగింది.

రెండుసార్లు కిటికీ అద్దం మీద ఎవరో తట్టేసరికి మా సంభాషణ మధ్యలో తెగిపోయింది. వ్రూమ్, అతని పక్కనే ఈషా.

"హల్లో! మనమందరం కలిసే వచ్చామనుకుంటా? మీరిద్దరూ చిలకా గోరింకల్లా ఒకర్నొదిలి ఒకరు ఉండలేరు లాగుందే?" అన్నాడు వ్రూమ్.

# 13

ల్యాండ్‌లైన్ టెలిఫోను గట్టిగా మోగేసరికి నేను 32వ మైల్‌స్టోన్ నించి ఈ లోకంలోకి కొచ్చాను. ప్రియాంక వెంటనే ఫోన్ ఎత్తింది, "హాయ్... గణేశ్!" అంది. నన్నడిగితే, ఆమె పిలిచిన ఆ పిలుపులో గొంతు వగలుపోయింది. అయినా నా అభిప్రాయం కోసం ఎవరేడ్చారు!

అవతలివైపునించి అతని గొంతు ఎలా ఉండి ఉంటుందో, అనుకున్నాను. "బల్లకిందికి దూరు, ఫోన్‌ని 'ట్యాప్' చెయ్యి శ్యామ్!" అంది నా అంతరాత్మ. అటువంటి ఘోరమైన ఆలోచన వచ్చినందుకు, నన్ను నేను తిట్టుకున్నాను.

"తప్పకుండా నువ్వే అయి ఉంటావనుకున్నాను. ఈ ఎమర్జన్సీ ఫోన్‌లైన్‌కి ఇంకెవరూ ఫోన్ చెయ్యరు," అని ప్రియాంక తన జుట్టులోకి వేళ్లు పోనిచ్చి వేళ్లతోనే దువ్వుకోసాగింది. అబ్బాయిలతో మాట్లాడేటప్పుడు ఆడపిల్లలు జుట్టుతో ఆడుకోవటం అనేది, వాళ్లు అసంకల్పితంగా చేసే ఒక చర్య. ఆడ జంతువులు అలా తమ శరీరంమీది రోమాలు దువ్వుకోవటం డిస్కవరీ ఛానల్‌లో ఒకసారి చూశాను.

"అవును, నాకు కార్లంటే ఇష్టం. నువ్వే కారు కొందామని అనుకుంటున్నావు?... లెక్ససా?" అంది కొద్ది సెకన్ల తరవాత.

"లెక్సస్! గురుడు లెక్సస్ కొంటున్నాడు!" వ్రూమ్ గట్టిగా అరిచాడు, అది ఖరీదైన కారని నాకు అర్థమయేంత గట్టిగా!

"కాస్త ఏ మోడలో అడగవా? ప్లీజ్ అడుగు!" అన్నాడు వ్రూమ్. ప్రియాంక ఉలిక్కిపడింది. వ్రూమ్‌ని చూస్తూ తల అడ్డంగా ఆడించింది.

"వాళ్లని మాట్లాడుకోనీ వ్రూమ్. కార్ మోడల్స్‌కన్నా ముఖ్యమైన విషయాలు ఉంటాయి వాళ్లకి మాట్లాడుకోటానికి," అంది ఈషా.

"ఏ కలరా? కమాన్, అది నీ కారు, నేనెలా చెప్తాను?" అంది ప్రియాంక. మెలికలు తిరిగిన టెలిఫోన్ వైర్‌తో ఆడుకుంటూ. ఆ తరవాత ఐదునిమిషాలపాటు గణేశ్ మాట్లాడే మాట్లాడాడు. ప్రియాంక 'ఆఁ... ఊఁ" అని జవాబు మాత్రం చెపుతూ ఉండిపోయింది.

"ఫోన్ 'ట్యాప్' చెయ్యి!" అని నా బుర్రలో గోల పెడుతూనే ఉంది నా అంతరాత్మ. నన్ను చూస్తే నాకే అసహ్యం వేసింది, కానీ నాకు ఆ పని చెయ్యాలనే అనిపించింది. బల్ల దగ్గర్నించి ప్రియాంక కొంచెం దూరంగా ఎప్పుడు వెళ్తుందా, అనిపించింది.



"లేదు, లేదు, గణేశ్! ఏం ఫరవాలేదు. నువ్వు నీ మీటింగ్‌కి వెళ్లు. నేనిక్కడే ఉంటాగా, కాసేపయాక మళ్లీ ఫోన్ చెయ్యి," అని ప్రియాంక ఫోన్ పెట్టేసింది. పాపం, మిస్టర్ మైక్రోసాఫ్ట్‌కి మొత్తం మీద పనేదో ఉందన్నమాట.

"వ్రూమ్! లెక్సస్ మంచి కారా?" ప్రియాంక అడిగింది.

వ్రూమ్ ఆసరికే ఇంటర్‌నెట్‌లో లెక్సస్ బొమ్మలు చూస్తున్నాడు. అతను తన మానిటర్‌ని ప్రియాంక వైపుకి తిప్పాడు. "చూడు, లెక్సస్ చాలా ఖరీదైన కార్లలో ఒకటి. గురుడి దగ్గర దబ్బు మూలుగుతున్నట్టుంది!" అన్నాడు.

వ్రూమ్ కంప్యూటర్ తెరకేసి ప్రియాంక కొన్ని సెకన్లపాటు చూసి, తరవాత అమ్మాయిల కేసి తిరిగి, "అతను నన్ను రంగు ఎంపిక చెయ్యమంటున్నాడు. మీరు నమ్ముతారా అది? కానీ నేను ఆ పని చెయ్యకూడదు," అంది.

వ్రూమ్ తన తిరిగే కుర్చీని వెనక్కి నెట్టి, "నలుపు కానీ, వెండిరంగు కానీ తీసుకోమను. క్లాసిక్ కలర్సంత అందంగా మరేవీ ఉండవు. అయినా నీకోసం నేను మరిన్ని రంగులు వెతుకుతాలే," అని, మళ్లీ "కారు లోపలంతా డార్క్ లెదర్ ఉండాలని అతనికి చెప్పు," అన్నాడు.

ఈలోగా నాలో మంటలు చెలరేగటం మొదలుపెట్టాయి. నాకు వాంతికొచ్చేంత పనయింది.

ఫోన్ ఎప్పుడు ట్యాప్ చెయ్యాలా అని ఆలోచించసాగాను. అది తప్పని తెలుసు. ప్రియాంకా, మిగతా అమ్మాయిలూ, కనిపెట్టారంటే నన్ను చంపేస్తారు. కానీ నేను ఆ పని చెయ్యాల్సిందే. అది నన్ను నేను బాధపెట్టుకోవటమే అవుతుందని తెలుసు, కానీ ఆ దొంగ గాడిద నా మాజీ ప్రేయసిని ఖరీదైన కార్లు ఎరగా చూపి ఎగరేసుకుపోవటానికి ఎలాంటి మాటలతో వల పన్నుతున్నాడో వినాలి.

నేను బల్లకిందికి దూరవలసిన అవసరాన్ని కల్పించుకోవటానికి చక్కటి సాకుని తయారు చేసుకోవటానికి ప్రయత్నించాను.

"పది నిమిషాలుగా అసలు కాల్సే రాలేదేమిటి? కనెక్షన్లు సరిగ్గా ఉన్నాయో లేదో చెక్ చెయ్యాలి," అన్నాను.

"ఒదిలేద్దూ. నేను హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నాను," అంది ఈషా.

"అవును, నేను కూడా. పైగా కనెక్షన్లు సరిగ్గానే ఉన్నాయి. బెంగుళూర్ బలే ఉత్సాహం చూపిస్తోంది! అన్ని కాల్స్‌నీ పిక్అప్ చేస్తోంది," అంది రాధిక.

"బయో?" అంది ప్రియాంక ఈషాతో. వాళ్లిద్దరూ రహస్యంగా మాట్లాడుకోవటానికి బాత్రూమ్‌కి వెళ్దామని చెప్పటానికదే వాళ్లకొక కోడ్ వర్డ్.

"ఓ, పద!" అని ఈషా సీట్లోంచి లేచింది. ప్రియాంక ఏదో అర్జంటుగా చెప్పాలనుకుంటోందని ఆమెకి అర్థమయింది.

"నేనూ వస్తా," అని లేచింది రాధిక. నావైపు తిరిగి, "టీమ్‌లీడర్‌గారూ! అమ్మాయిల బయోకి విరామం కావాలి," అంది.

"మీరందరూ వెళ్తున్నారా?" అన్నాను ఇష్టం లేనట్టు నటిస్తూ. కానీ మనసులో చాలా ఆనందంగా ఉంది. మంచి అవకాశం దొరకబోతోంది! "సర్లే, ఎలాగూ ఇక్కడ పనేం లేదుగా, ఓకే!" అన్నాను.

అమ్మాయిలు కనుమరుగైన మరుక్షణం బల్ల కిందికి దూరాను.

"ఏం చేస్తున్నావు?" అన్నాడు వ్రూమ్.

"ఏం లేదు. కనెక్షన్లు సరిగ్గా ఉన్నట్టు లేవు," అన్నాను.

"అయినా, కనెక్షన్ల గురించి నీకేం తెలుసు మహా?" అని వ్రూమ్ బల్ల కిందికి చూడటానికి వంగాడు. "నిజం చెప్పు! ఏం చేస్తున్నావు?" అన్నాడు.

ఫోన్‌ని ట్యాప్ చెయ్యాలన్న కోరికని అణుచుకోలేకపోతున్నాని చెప్పాను. వ్రూమ్ నన్ను ఐదుసెకన్లపాటు కోప్పడ్డాడు. కానీ వెంటనే నా సాహసం చూసి తను కూడా ఉత్సాహపడుతూ నాతోపాటు బల్లకిందికి చేరాడు.

"నేను నీకీ పనిలో సాయపడుతున్నానని నమ్మలేకపోతున్నాను. ఈ విషయం అమ్మాయిలు కనిబెడితే, మన్ని చంపేస్తారు!" అన్నాడు వ్రూమ్.

"వాళ్లకి తెలిసే అవకాశమే లేదు," అని వైర్లని కలిపాను. "చూడు, అయిపోవచ్చింది" అన్నాను.

వ్రూమ్ ల్యాండ్‌లైన్ ఫోన్లో లైన్లు కనెక్ట్ అయాయా లేదా అని పరీక్షించాడు. నా కంప్యూటర్‌లో ఒక లైన్‌ని ఎంచుకుని, నా హెడ్‌సెట్‌లో ల్యాండ్‌లైన్‌లో మాటలు నాకు వినిపిస్తాయా లేదా అని పరీక్షించాను. మిస్టర్ మైక్రోసాఫ్ట్ నా చేతికి చిక్కాడు!

"ఎందుకీ పని చేస్తున్నావు?" అన్నాడు వ్రూమ్.

"నాకు తెలీదు. నన్నా సంగతి అడక్కు."

"అయినా, అమ్మాయిలు ఇంత సేపేం చేస్తున్నట్టు?"

"నీకు వాళ్ల సంగతి తెలుసుకదా? వాళ్ల కబుర్లన్నీ టాయిలెట్‌లోనే ఎప్పుడూ."

"వాళ్లేం మాట్లాడుకుంటున్నారో నీకు వినాలని లేదా? వాళ్లు తప్పకుండా మైక్రోసాఫ్ట్ గురించే మాట్లాడుకుంటూ ఉంటారు."

"ఓ నో!" అన్నాను ఏం కబుర్లు మిస్సవుతున్నానో కదా, అని విచారిస్తూ. "అయినా అక్కడ మనం చాటునుంచి వినటం కుదరదుగా?" అన్నాను.

"మగవాళ్ల టాయ్‌లెట్‌లో మూలగా ఉన్న టాయ్‌లెట్‌లోకి వెళితే వినబడుతుంది. దానికీ అమ్మాయిల టాయిలెట్‌నీ కలుపుతూ ఉంది అక్కడి గోడ. నీ చెవిని గట్టిగా గోడకి ఆనిస్తే వాళ్ల మాటలు వినచ్చు."



"నిజమా?" అన్నాను మెరిసే కళ్లతో.

వ్రూమ్ అవునని తలాడించాడు.

"కానీ అలా దాక్కుని వినటం ఎంతైనా తప్పు కదా?" అన్నాను.

"అవును, తప్పే!"

"అయితే అయిందిలే, పద," అన్నాను. ఇద్దరం మా కుర్చీలమీదినించి ఒక్క గెంతు గెంతాం.

వ్రూమ్, నేనూ ఆ మూల ఇరుగ్గా ఉండే టాయ్‌లెట్‌లోకి దూరి, తలుపు వేసుకున్నాం. ఇద్దరం చెవుల్ని గోడకి నొక్కిపెట్టాం. నాకు రాధిక గొంతు వినిపించింది.

"అవును, అతను మంచివాడిలాగే ఉన్నాడు, నిజంగా," అంటోంది.

"కానీ నేనతనికి కారురంగు గురించి చెప్పకూడదు కదా? అది అతని కారు, పైగా చాలా ఖరీదైనది. కానీ అతనేమన్నాడో తెలుసా?" అంది ప్రియాంక.

"ఏమన్నాడు?" అంది రాధిక.

" 'కాదు, అది మన కారు,' అన్నాడు. ఆ తరవాత, 'నువ్వు నా జీవితాన్ని రంగులతో నింపావు, అందుకని నీకు రంగుని ఎంచుకునే అవకాశం ఇవ్వాల్సిందే,' అన్నాడు."

"ఓహ్! అబ్బ, ఎంత రొమాంటిక్‌గా అన్నాడో!" అంది ఈషా.

"పిచ్చి మాటలూ, వాడూనూ! జీవితాన్ని రంగులతో నింపిందిట, బుద్ధిలేని గాడిద!" అన్నాను వ్రూమ్‌తో.

"ఉష్! వాళ్లకి మన మాటలు వినిపిస్తాయి, స్టుపిడ్! నోరుమూసుకో!" అని వ్రూమ్ తన చేత్తో నా నోరు మూశాడు.

"ఊం, నా సంగతి సరే, అనుజ్ ఎలా ఉన్నాడు?" అంది ప్రియాంక. నాకు ఆమె గాజుల గలగల చప్పుడు వినిపించింది. బహుశా తల దువ్వుకుంటున్నట్టుంది.

"అనుజ్ బాగానే ఉన్నాడు. డీలర్ల మీటింగుకి కొల్‌కతా వెళ్లాడు. కొందరు డీలర్లకి ఎంత తాగినా ఇంకా తాగాలనుంటుంది కాబోలు, రాత్రి పొద్దుపోయేవరకూ తను మేలుకునే ఉండాల్సి వస్తుంది!" అంది రాధిక.

"సేల్స్ ఉద్యోగం కష్టమే బాబూ!" అని మళ్లీ, "ఓకే! ఎక్స్‌క్యూజ్‌మీ, దీన్ని కొంచెం మార్చుకోవాలి... అబ్బా!" అంది ఈషా.

"ఏం జరుగుతోంది?" అన్నాను.

వ్రూమ్ భుజాలెగరేశాడు.

"ఈషా! నీ గాయం ఇన్ని రోజులైనా మానలేదు. ఉత్త బ్యాండ్‌ఎయిడ్ వేస్తే చాలదు," అంది ప్రియాంక. అప్పుడు ఈషా తన బ్యాండ్‌ఎయిడ్‌ని మారుస్తోందని నాకర్థమైంది.

"ఏం ఫరవాలేదు. లాక్మీ ఫాషన్ వీక్ లోపల ఇది మానిపోతే చాలు!" అంది ఈషా.

"పదండే! ఒంటిగంట అవబోతోంది, లేకపోతే అబ్బాయిలు గొడవచేస్తారు," అంది రాధిక.

"అబ్బాయిలెప్పుడూ గొడవచేస్తూనే ఉంటారులే. వాళ్లు మహా సిగరెట్టు తాగటానికి బైటికెళ్లరా ఏం?" అంది ఈషా.

"కానీ ఈ రోజు వాళ్లు మరీ ఎక్కువ సణుక్కుంటున్నారు. కనీసం, ఒకరు!" అంది రాధిక.

బ్రూమ్ నావైపు వేలు చూపించాడు. అవును వాళ్లు అనుకుంటున్నది నా గురించే.

నేను పెదాలు మాత్రం ఆడిస్తూ సణుక్కున్నాను.

"అంటే శ్యామ్ ఈ వార్త విని బాధపడుతున్నాడంటావా?" అంది ప్రియాంక, వాళ్లు టాయ్‌లెట్ బైటికి నడుస్తూ ఉండటంతో ఆమె గొంతు అస్పష్టంగా వినిపించింది.

"నువ్వే చెప్పు. నీకే అతని గురించి మాకన్నా బాగా తెలుసు!" అంది ఈషా.

"నాకిప్పుడు అతని గురించి తెలిస్తే బావుణ్ణు. ఒక్కోసారి అతను రుసరుసలాడుతూ చిన్నపిల్లాడిలా ఎందుకు ప్రవర్తిస్తాడో నాకు అర్థం కాదు," అంది ప్రియాంక బైటికెళ్తూ.

"చిన్నపిల్లవాడిలా ప్రవర్తిస్తానా? నేనా? నేనలా ప్రవర్తిస్తానా?" అన్నాను బ్రూమ్‌తో, ఇరుకు టాయ్‌లెట్‌లో చిందులు తొక్కుతూ. "ఏమనుకుంటోంది మనసులో. ఆ మిస్టర్ మైక్రోసాఫ్ట్‌గాడు తేనెపలుకులు పలికితే వాడు ముద్దొస్తాడా? వాడు రొమాంటిక్‌గా కనిపిస్తాడా? నేనేమీ అనకపోయినా చిన్నపిల్లాడిలా ప్రవర్తిస్తున్నానా?" అన్నాను పిడికిలితో టాయ్‌లెట్ తలుపు మీద బాదుతూ.

"శ్యామ్, పసిపిల్లాడిలా ప్రవర్తించకు!" అన్నాడు బ్రూమ్.

మేమిద్దరం ఆ గదిలోంచి బైటికొచ్చాం. నేను ఒక్క అడుగు వెనక్కి గెంతాను. బక్షీ సింకు దగ్గర నిలబడి ఉన్నాడు.

బక్షీ అద్దంలో మా ఇదర్నీ చూశాడు. మావైపు తిరిగి నోరు తెరుచుకుని చూడసాగాడు.

"హల్లో, సార్!" అంటూ బ్రూమ్ అతని పక్కనున్న సింకు దగ్గరకెళ్లాడు.

"సార్! మీరనుకుంటున్నట్టు అలాంటిదేమీ లేదు..." అన్నాను టాయిలెట్‌కేసి చూపిస్తూ.

"నేనేమీ అనుకోవటం లేదు. మీ వ్యక్తిగత జీవితంలో మీరేం చేస్తారో, అది మీ ఇష్టం. కానీ, మీరు మీ డెస్కు దగ్గరెందుకు లేరు?" అని అడిగాడు బక్షీ.

"ఇప్పుడే బైటికి వచ్చాం, సార్! ఈరోజు మాకు కాల్సు చాలా తక్కువగా వస్తున్నాయి" అన్నాను.

"మీరు ఇలా బైటికి వస్తున్నట్టు 'లాగ్' చేశారా? మీ బేలో అమ్మాయిలు కూడా ఎవరూ కనిపించలేదు," అన్నాడు బక్షీ. అతని మొహం మెరుపుతో కూడిన గులాబిరంగు నుంచి ఎరుపుకి మారింది.



"నిజంగానా? అమ్మాయిలెక్కడికెళ్లారు?" అన్నాడు బ్రూమ్.

బక్షీ యూరినల్స్ వేపుకి నడిచాడు. నేను అతని యూరినల్‌కి పక్కనున్న దాన్లోకి వెళ్లాను.

"ఇప్పుడే నువ్వు టాయిలెట్ వాడి బైటికి రాలేదూ?" అన్నాడు బక్షీ.

"సార్!... అది వేరు, సార్... బ్రూమ్‌తో..." అన్నాను.

"ప్లీజ్, నాకు తెలుసుకోవాలని లేదు!" అన్నాడు బక్షీ.

"సార్, అది కాదు..." అన్నాను.

ఇలాంటి పరిస్థితిని ఆడవాళ్లు ఎప్పుడూ ఎదుర్కోవలసి రాదు; మీ బాసు పక్కనే నిలబడి పాస్‌కి వెళ్లడం అనేది ఈ లోకంలోకల్లా ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఒకటి. అప్పుడు మీరేం చెయ్యాలి? అతని మానాన అతని వదిలెయ్యటమా, లేక అతనితో సరదాగా కబుర్లు చెప్పటమా? అతను తన పని తాను చేసుకుంటూండగా మాట్లాడచ్చా, మాట్లాడకూడదా?

"సార్, మీరు ఈ బాత్‌రూమ్ వాడుతున్నారేమిటి?" అతన్ని అక్కడ మునుపెన్నడూ చూడకపోవటం చేత, అడిగాను.

"ఇక్కడికి రావాలనుకోలేదు. నేనెప్పుడూ ఎక్జెక్యూటివ్ టాయ్‌లెట్టే వాడతాను," అన్నాడు బక్షీ, తను నాకన్నా పెద్దస్థాయిలో ఉన్నానని నొక్కి చెపుతూ.

"యెస్, సార్!" అని తల నిలువుగా ఆడించాను, అతను మాలాంటివాళ్లు ఉపయోగించే టాయ్‌లెట్‌ని వాడదన్న విషయాన్ని తెలియజేస్తూ. కానీ అతను ఇక్కడెందుకున్నాడు?

"సరే, నేను ఈషాకి వచ్చిన కొరియర్ ఆమెకిద్దామని మీ డెస్క్ దగ్గరకి వచ్చాను."

"కొరియరా? ఈ సమయంలోనా?" అన్నాడు బ్రూమ్ సింక్ దగ్గరే నిలబడి.

"ఆ పార్సెల్‌ని ఆమె బల్లమీద పెట్టాను. ఆమెకి చెప్పండి," అని బక్షీ పాంటు జిప్ పైకి లాక్కున్నాడు.

"అన్నట్టు, శ్యామ్! నువ్వు మీ ఏజెంట్లందర్నీ 2:30కి నా గదికి టీమ్ మీటింగ్‌కి రమ్మని చెప్పగలవా? ఓకే?" అన్నాడు బక్షీ.

"ఏమిటి విశేషం, సార్?" అన్నాడు బ్రూమ్.

"ఏమీ లేదు, మీ అందరితో నాకు తట్టిన కొన్ని ముఖ్యమైన ఆలోచనల్ని పంచుకోవాలి. నిన్ను వెబ్‌సైట్ గురించి ఓ రెండు ప్రశ్నలు అడగచ్చు కదా? నీకు అది క్షుణ్ణంగా తెలుసుగా?"

"యెస్, సార్! అయినా మీకు పంపిన మాన్యువల్‌లోని ఎఫ్ఏక్యూ అధ్యాయంలో దాదాపు అన్ని ప్రశ్నలకీ సమాధానాలు ఉంటాయి," అన్నాడు బ్రూమ్.

"ఎఫ్ఏక్యూ?"

"అంటే తరచు తలెత్తే ప్రశ్నలు."

"గుడ్! బోస్టన్‌కి ఏవైనా సందేహాలుండచ్చు. వాటికి జవాబు చెప్పటానికి నేను మీ

తెలివితేటలమీద ఆధారపడతాను. ఉదాహరణకి, కొత్త కంప్యూటర్ మోడల్సు కోసం ఈ సైటు మీరు ఏ విధంగా మార్పులూ, చేర్పులూ చేస్తారు?"

"అది సులభం, సార్! సిస్టమ్స్ మనిషి ఎవరైనా వెబ్‌సైట్‌లో కొత్త మోడల్‌కి సరిపోయే విధంగా ఆ మార్పుల్ని చెయ్యగలుగుతారు," అన్నాడు వ్రూమ్.

బక్షీ మమ్మల్ని మరికొన్ని ప్రశ్నలు అడిగాడు. ఆ వెబ్‌సైట్‌ని పూర్తిగా మేమే తయారుచేసి ఉండటంవల్ల, వాటికి తేలిగ్గా జవాబులు చెప్పాం.

"గుడ్, గుడ్! మీ తెలివికి సంతోషిస్తున్నాను. మాన్యువల్ ఇచ్చినందుకు థాంక్స్. దాన్ని నేను బోస్టన్‌కి పంపించేశాను," అని బక్షీ తన చేతులకి అంటిన తడిని విదిలించాడు. ఆ చుక్కలు నామీద పడకుండా నేను దూరంగా జరిగాను.

"అవునా? పంపించారా?" అన్నాం ఇద్దరం ఒకేసారి.

"సార్, మీరు దాని కాపీ మాకు ఈమెయిల్‌లో పంపితే మేముకూడా 'లూప్‌లో' ఉంటాం, ఏం జరుగుతోందో తెలుస్తూ ఉంటుంది," అన్నాడు వ్రూమ్. బావుంది, వ్రూమ్ బక్షీ మాట్లాడే భాషనే అతనిమీద తిరిగి ప్రయోగిస్తున్నాడు.

"ఓ? నేను మీకు కాపీ పంపలేదా? చాలా సారీ! అయినా నాకు ఈమెయిల్సు రాయటం అంతగా రాదు. నేను దాన్ని మీకు 'ఫార్వర్డ్' చేస్తాను. ఇక మీరు మీ బేకి వెళ్లండి, ఓకే?"

"తప్పకుండా, సార్!" అన్నాను.

"నేను నీకిచ్చిన ఆ 'చిన్న' పని అయిపోయిందా?" అన్నాడు బక్షీ.

"ఏది, సార్?" అన్నాక అతను బోర్డుమీటింగ్ ఇన్విటేషన్ల గురించి మాట్లాడుతున్నాడని అర్థమయింది. 'అయిపోయినట్టే, సార్! మీకు ఇప్పుడే పంపిస్తాను," అన్నాను.

బక్షీ తలాడించి వెళ్లిపోయాడు. వెబ్‌సైట్ ప్రస్తావనని బోస్టన్‌కి పంపేటప్పుడు అతను ఆ మెయిల్ తాలుకు కాపీ మాకు పంపకపోవటం నాకు విచిత్రంగా అనిపించింది. కానీ నేను ఆశ్చర్యపోలేదు.

"ఇతను పూర్తిగా మతిచెడిన బాపతా? ఈమెయిల్ కాపీ పంపలేదా?" అన్నాడు వ్రూమ్.

"ఊరుకో, గురూ! పద ఆఫీసులో కెళ్దాం," అన్నాను.



# # 14

మేం మగవాళ్ల టాయ్‌లెట్‌లోంచి బైటికొచ్చి మా ఆఫీసు రూమ్‌లోకి వెళ్లాం. డబ్ల్యుఎస్‌జిలో మళ్లీ ఫోన్‌కాల్స్ రావటం మొదలైంది. రాధిక తనకి ఫోన్ చేసిన వాళ్లకి వాక్యూమ్ క్లీనర్‌ని ఎలా విప్పాలో వివరిస్తోంది. ప్రియాంక ఎవరో ఆవిడకి వేడిగా ఉన్న గిన్నెలని డిష్‌వాషర్‌లో పెట్టకూడదని చెపుతోంది. ఈషా ఒక ముసలాయనకి, పండే ముందర ఓవెన్‌ని వేడి చెయ్యటం గురించి చెపుతూ, ఆయన "నీ గొంతు బలే సెక్సీగా ఉంది!" అనే మాటకి ఏమీ అనకుండా తప్పించుకుంటోంది.

నా తెరమీద మరో కాల్ నెంబరు కనిపించింది.

"నాకితను తెలుసు. నేనీ కాల్‌కి జవాబు చెప్పనా?" అన్నాడు వ్రూమ్.

"ఎవరది?" అన్నాను కనుబొమలు పైకెత్తి.

"విలియమ్ ఫాక్స్ అని, ఒక వదరుబోతు! కావాలంటే హెడ్‌ఫోన్స్ పెట్టుకుని నువ్వు కూడా విను," అన్నాడు వ్రూమ్.

నేను కంప్యూటర్‌లో ఒకచోట మీట నొక్కాను.

"గుడ్ ఆఫ్టర్‌నూన్! వెస్టర్న్ అప్లయెన్సెస్ నుంచి విక్టర్ మాట్లాడుతున్నాను. మిస్టర్ ఫాక్స్, చెప్పండి నేనేం సాయం చెయ్యాలి?" అన్నాడు వ్రూమ్.

"సర్లే రా, గాడిదా! చచ్చినట్టు నాకు సాయం చెయ్యాల్సిందే!" అన్నాడు అవతలి వ్యక్తి. అతని గొంతు కరుకుగా ఉంది. దక్షిణ అమెరికా యాసలో మాట్లాడుతున్నాడు. వయసు ముప్పైఐదో, ముప్పైఆరో ఉండొచ్చు. అతను తాగి ఉన్నాడని నేను గ్రహించాను.

"ఎవరు వీడు?" అన్నాను రహస్యంగా. వ్రూమ్ నన్ను మాట్లాడద్దని అన్నాడు.

"సార్! నేను మాట్లాడుతున్నది మిస్టర్ విలియమ్ ఫాక్స్‌తోనే కదా?"

"అవున్రా! నా పేరు తెలిసినంత మాత్రాన నాకు చెత్త వస్తువులు అంటకట్టచ్చని అనుకుంటున్నావా? నువ్వు అమ్మిన హూవర్స్ వస్తువు ఎంత పనికిమాలినదో తెలుసా?"

"మీ వాక్యూమ్ క్లీనర్‌లో లోపం ఏమిటి, సార్? అది వీఎక్స్-100 కదా?"

"అది దుమ్ముని పీల్చుకోవటం లేదు!"

"మీరు పోయినసారి దుమ్ముచేరే సంచుల్ని ఎప్పుడు మార్చారో గుర్తుందా, సార్?" అని అడిగాడు వ్రూమ్.

"ఎందుకు గుర్తులేదు, బాగానే గుర్తుంది రా! మొద్దువెధవా, అది ఉత్త పనికిరాని మిషను, తెలిసిందా?"

ఫ్రూమ్ గట్టిగా మూడుసార్లు ఊపిరి పీల్చాడు. ఇటువంటి పరిస్థితుల్లో ఎలాంటి తెలియజెయ్యాలో మాకు ముందే చెపుతారు. ఫ్రూమ్ దాన్ని గుర్తుచేసుకుని, "సార్! దయ అటువంటి భాష ఉపయోగించకండి!" అన్నాడు.

"ఓ, అవునా? అయితే నీ దిక్కుమాలిన వాక్యూమ్ క్లీనర్ పనిచేసేట్టు చూడరా!"

తను జవాబు చెప్పేముందు ఫ్రూమ్ తన ఫోనుకున్న ఒక బటన్‌ని నొక్కాడు. "ఒరే వెధ ఊరకుక్కా... వదరుబోతూ... నువ్వే నోరు ముయ్యరా!" అన్నాడు.

"ఏం చేస్తున్నావు?" అన్నాను హడలిపోతూ.

"నా కోపాన్ని కక్కుతున్నాలే. భయపడకు, ఫోన్ 'మ్యూట్'లో పెట్టాను, వాడికి మాటలు వినబడవు," అన్నాడు ఫ్రూమ్ మొహం చిట్లిస్తూ. "మళ్లీ మామూలుగా అవుతు అని మళ్లీ బటన్‌ని నొక్కాడు ఫ్రూమ్. తన గొంతుని వీలైనంత శాంతంగా ఉంచుకోవ ప్రయత్నిస్తూ, "మీ దుమ్ము బ్యాగులు నిండిపోగానే వాటిని మార్చాల్సి ఉంటుంది, సా అన్నాడు.

"నేనెవరితో మాట్లాడుతున్నాను?" అవతలివైపునించి గొంతులో ఆందోళన వినిపించి

"సార్! నాపేరు విక్టర్!"

"నీ అసలు పేరు చెప్పరా! నువ్వు ఇండియన్‌వి కదూ?"

"సార్! నేను ఎక్కణ్ణించి మాట్లాడుతున్నానో, చెప్పకూడదు."

"చెప్పు, బాబూ! నువ్వు ఇండియన్‌వే కదూ?"

"అవునండీ! నేను ఇండియానుంచే మాట్లాడుతున్నాను."

"అయితే ఈ ఉద్యోగం సంపాదించుకోవటానికి ఏం చదవాల్సి వచ్చింది? సూక్ష్మ ఫిజిక్స్‌లో వెధవ డిగ్రీ సంపాదించుకున్నావా?"

"సార్, మీకు వాక్యూమ్ క్లీనర్ గురించి నేను సాయం చెయ్యాలా వద్దా?" అన్నా ఫ్రూమ్.

"కమాన్! నాకు జవాబు చెప్పు, నాన్నా! నాకు నీ సాయం అక్కర్లేదు. దుమ్ము చేసే మారుస్తాలే. మీ విషయం చెప్పు. మీరు దుమ్ముకొట్టుకుని ఉన్న మీ దేశాన్ని ఎప్పు మారుస్తారు?"

"ఎక్స్‌క్యూజ్‌మి, సార్! మీరలా మాట్లాడటం వెంటనే ఆపెయ్యమని అడుగుతున్నా అన్నాడు ఫ్రూమ్.

"ఆఁ? ఏమిటీ? ఒక నల్లపిల్లవాడు ఏం చెయ్యాలో నాకు చెపుతాడా–" నేను ఫోన్ చెయ్యటంతో విలియమ్ ఫాక్స్ గొంతు మరి వినిపించలేదు.



ఫ్రూమ్ కొన్ని సెకన్లపాటు కదలకుండా ఉండిపోయాడు. అతని ఒళ్లంతా వణకసాగింది, బరువుగా ఊపిరి పీల్చసాగాడు. తరవాత రెండు మోచేతులూ బల్లమీద పెట్టి, అరచేతుల్లో మొహం దాచుకున్నాడు.

"నీకు తెలుసుకదా? నువ్వు ఇటువంటి వాళ్లతో మాట్లాడక్కర్లేదు," అన్నాను ఫ్రూమ్‌తో.

అమ్మాయిలు తమకొచ్చే కాల్స్ విషయం చూసుకుంటూనే, మావైపు తలలుతిప్పి చూశారు.

"ఫ్రూమ్! నీతోనే మాట్లాడుతున్నాను."

చేతుల్లోంచి మొహం పైకెత్తి నెమ్మదిగా నావైపు తిరిగాడు. మరుక్షణం పిడికిలితో బల్లమీద గట్టిగా గుద్దాడు. "ఛీ!" అని అరిచి బల్లకింద కాళ్లతో తన్నాడు.

"ఏమిటది... నా కాల్ కట్ అయింది!" అంది ప్రియాంక.

ఫ్రూమ్ తన్నటంవల్ల ఎలెక్ట్రిక్ వైర్లు ఊడిపోయి ఫోన్లన్నీ డిస్‌కనెక్ట్ అయిపోయాయి. నేను వైర్లు చెక్ చేద్దామనుకున్నాను, కానీ ముందు ఫ్రూమ్ సంగతి చూడటం ముఖ్యమని అనిపించింది. ఫ్రూమ్ లేచి నిలబడ్డాడు. ఆరడుగుల కన్నా పొడవుగా ఉన్న అతను మా అందరికన్నా చాలా పొడుగ్గా కనిపించాడు.

"నేను రెండు విషయాలని అసలు భరించలేను... జాతివాదం, అమెరికన్లూ!" అన్నాడు రెండువేళ్లు చూపిస్తూ.

ప్రియాంక నవ్వటం మొదలుపెట్టింది.

"ఇందులో నవ్వటానికేముంది?" అన్నాను.

"ఎందుకంటే అతనన్న మాటలు పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. జాతివాదం ఇష్టం లేదు, కానీ అమెరికన్లని భరించలేడు!" అంది ప్రియాంక.

"ఎందుకు... ఎందుకు కొందరు పొగరుబోతు తెలివితక్కువ దద్దమ్మలు, అమెరికన్లు, మనకన్నా గొప్పవాళ్లలా ప్రవర్తిస్తారు? ఎందుకో మీకు తెలుసా?" అన్నాడు ఫ్రూమ్.

ఎవరూ జవాబు చెప్పలేదు.

"ఎందుకో నేను చెపుతాను. వాళ్లు మనకన్నా తెలివైనవాళ్లు అవటంచేత కాదు. వాళ్లు మనకన్నా మెరుగైనవాళ్లూ కారు. కాని, వాళ్ల దేశం డబ్బున్నదేశం, మనది బీదదేశం. అదొక్కటే కారణం! మనదేశాన్ని యాభైఏళ్లుగా పరిపాలించిన పనికిమాలిన నాయకులు, దీన్ని ఒక బీదదేశంగా మార్చటం తప్ప మరేమీ చెయ్యలేకపోయారు. చాలా గొప్ప పని చేశారు, థాంక్యూ ప్రియమైన చచ్చు దేశనాయకులారా, థాంక్యూ!"

"ఫ్రూమ్ మరీ ఎక్కువ ఆవేశపడకు. ఎవడో పిచ్చివెధవ ఫోన్ చేసి..." రాధిక అంది.

"అమెరికన్లని చావనీ! చూడు, నువ్వు మొత్తం సిస్టమ్‌ని పాడుచేశావు," అని కంప్యూటర్ స్క్రీన్‌వైపు చూపిస్తూ, అతనికి నీళ్ల బాటిలు అందించాను.

“ఎవరో అమెరికన్లని మరీ గట్టిగా తన్నారు. ప్రస్తుతం కాల్సేవీ రావు,” అంది ప్రియాం కళ్లని గుండ్రంగా తిప్పుతూ.

“నన్ను చూడనివ్వండి,” అని బల్లకింద దూరాను. ఎమర్జన్సీ ఫోన్ని ట్యాప్ చేస్ గురించి నాకు ఎక్కువ ఆందోళనగా ఉంది. కానీ అవి మాత్రం చెక్కుచెదరలేదు.

“శ్యామ్, కొంచెం ఉండు! కాల్స్ రిసీవ్ చేసుకోకుండా ఉండటానికి ఒక మంచి ప్ల దొరికింది. కొంతసేపు అలాగే ఉంచెయ్యి,” అంది ఈషా.

అందరూ ఆమెని సమర్థించారు. ఇరవై నిమిషాల తరవాత సిస్టమ్స్‌వాళ్లని పిలవా నిశ్చయించుకున్నాం.

“బక్షీ ఇక్కడికెందుకొచ్చాడు? అతను మగవాళ్ల టాయిలెట్‌లోంచి బైటికి రావ చూశానే,” అంది ప్రియాంక.

“ఈషాకి ఏదో కొరియర్ ఇవ్వటానికి. 2:30కి టీమ్ మీటింగ్ ఉందని కూడా అన్నా ఓ! నేనింకా బోర్డు మీటింగ్ ఇన్విటేషన్లు జెరాక్స్ చెయ్యాల్సి ఉంది!” అన్నాను.

మళ్లీ బక్షీ ఇచ్చిన కాయితాలన్నీ వరసప్రకారం పేర్చాను.

“కొరియర్ ఏమిటి? ఇదా?” అంది ఈషా, తన కంప్యూటర్ దగ్గరున్న బ్రౌన్ పాకెట్‌ని ఎత్తిపట్టుకుని.

“అయుంటుంది, కానీ ఈ టైములో కొరియర్‌వాళ్లు ఎవరొస్తారు?” అన్నాడు వ్రూ

ఈషా పాకెట్‌ని తెరిచింది. అందులోంచి వందరూపాయల నోట్ల కట్టలు రెండ బైటికి తీసింది. ఒక కట్టమీద చిన్న పసుపురంగు కాయితం అంటించి ఉంది. ఆ కాయి మీద రాసి ఉన్నది చదవగానే ఆమె మొహం పాలిపోయింది.

“వావ్! ఎవరికో బోలెడు డబ్బులొచ్చాయే!” అన్నాడు వ్రూమ్.

“ఫరవాలేదే! ఆ డబ్బు దేనికోసం?” అంది రాధిక.

“ఏమీ లేదు. ఒక ఫ్రెండు నాదగ్గర తీసుకున్న డబ్బు వాపసు చేసింది,” అంది ఈ

ఆ పాకెట్‌ని తన సొరుగులో నిర్లక్ష్యంగా పారేసి, సెల్‌ఫోన్ చేతిలోకి తీసుకుంది. ఆ మొహంలో ఏదో ఆలోచన, ఫోన్ చెయ్యనా వద్దా అన్న మీమాంసలో పడ్డట్టు. నేను కాయితాలన్నీ పట్టుకుని జెరాక్స్ రూమ్‌కి బైలుదేరాను.

“సాయం చెయ్యాలనుందా?” అన్నాను వ్రూమ్‌తో.

“నో థాంక్స్! నాతో పనిచేసినవాళ్లు నేషనల్ టీవీ రిపోర్టర్లవుతున్నారు. కానీ న చూడు! పనికిమాలిన వెధవల ఫోన్లకి జవాబు చెప్పటం, పనికిమాలిన ఉద్యోగంలో అం సాయం చెయ్యటం!” అని వ్రూమ్ మొహం తిప్పేసుకున్నాడు.



# 15

స్టోర్‌రూమ్‌లో జెరాక్స్ మిషన్‌ని ఆన్ చేసి బక్షీ ఇచ్చిన కాయితాల దొంతరని డాక్యుమెంట్ ఫీడర్‌లో పెట్టాను. నేను ‘స్టార్ట్’ బటన్‌ని నొక్కానో లేదో, జెరాక్స్ మిషన్ లోంచి గరగరమని శబ్దం వచ్చి, అది ఆగిపోయింది. తెరమీద, ‘పేపర్ జామయింది: ట్రే 2’ అనే పెద్ద పెద్ద అక్షరాలు కనిపించాయి.

మా స్టోర్‌రూములో ఉండే జెరాక్స్ మిషన్, మిషన్ కాదు, అది ఒక మనిషి! జీవితమంటే విసుగూ, కోపమూ, ఒక వికృతమైన మానసిక ధోరణీ ఉన్న మనిషి! రెండు పేపర్ల కన్నా ఎక్కువ కాపీ చెయ్యటానికి ప్రయత్నించినప్పుడల్లా కాయితాలు కదలవు. ఆ తరవాత ఆ మిషను మిమ్మల్ని వెక్కిరిస్తుంది. దాన్ని మళ్లీ కదిలేట్టు చెయ్యటానికి ఏమేం చేయ్యాలో వరస ప్రకారం చెపుతుంది-కవరు తియ్యండి, ట్రేని బైటికి తీసెయ్యండి, మీటని లాగండి. ఇవన్నీ దానికి తెలిసినప్పుడు, తనే ఆ పనులన్నీ చెయ్యొచ్చు కదా?

“ఛీ!” అని గొణుక్కుంటూ కాయితాలు పెట్టిన ట్రేని తెరవటానికి కిందికి వంగాను. కొన్ని మీటల్ని తిప్పి, కనిపించిన కాయితాన్నల్లా బైటికి లాగాను.

లేచి నిలబడి ఆ కాయితాలని ఫీడర్ ట్రేలో మళ్లీ సర్దాను. మళ్లీ ‘స్టార్ట్’ బటన్‌ని నొక్కాను. నా ఐడీ కార్డు, బక్షీ ఇచ్చిన కాయితాల మీద ఉందని గమనించలేదు. మిషన్ నడవటం మొదలుపెట్టి, కాయితాలతో పాటు నా ఐడీ కార్డుని కూడా లోపలికి లాక్కోసాగింది. దాంతో నా మెడచుట్టూ ఐడీ కార్డు కుండే రిబ్బను బిగుసుకోసాగింది.

“ఆ...హా...హా....” అని అరిచాను. నాకు ఊపిరి ఆగిపోయినంత పనయింది. ఐడీ మరింత లోపలికి వెళ్లటంతో రిబ్బను మెలికలు తిరిగి నా గొంతుకి బిగుసుకోసాగింది. నేను గట్టిగా కేకలు పెడుతూ ఆ కార్డుని లాగటానికి ప్రయత్నించాను. అయినా మిషన్‌కి నా కన్నా ఎక్కువ బలం ఉంది. అది నన్ను చంపిగాని ఊరుకోదని బాగా అర్థమైపోయింది. బహుశా ఎలాగూ జెరాక్స్ కాపీలు తీస్తోంది కాబట్టి నేను చచ్చిపోయాక నా చావు గురించి రాయటానికి నా ఐడీ కార్డు పనికొస్తుందనుకుని ఉంటుంది! నేను మిషన్‌ని కాళ్లతో బలం కొద్దీ తన్నసాగాను.

వ్రూమ్ పరిగెత్తుకుంటూ ఆ గదిలోకొచ్చాడు. “ఏమిటిది....?” అతనికేం అర్థం కాలేదు. ఏ4 షీట్లు రూమంతా పడి ఉండటం చూశాడు, జెరాక్స్ మిషన్ మూలుగుతోంది, నేను ఆ మిషన్ మీద అడ్డంగా పడుకుని నా మెడకున్న రిబ్బన్‌ని తెంపటానికి శాయశక్తులా ప్రయత్నించటం చూశాడు.

"ఏమైనా చెయ్యి...." అన్నాను బొంగురు గొంతుతో.

"ఏం చెయ్యమంటావు?" అని, మిషన్‌ని చూడటానికి వంగాడు. తెరమీద, 'పే జామ్' అనే అక్షరాలు వెలుగుతూ ఆరుతూ ఉన్నాయి. నా ఐడీ రిబ్బన్ పూర్తిగా మిషన్‌లో ఇరుక్కుపోయింది.

ఫ్రూమ్ స్టోర్‌రూమంతా కలయచూసి, ఒక కత్తెరని వెతికి తెచ్చాడు.

"కత్తిరించనా?" అని నన్ను చూసి నవ్వి, "దీన్ని మిగతా వాళ్లకి కూడా చూపి లనిపిస్తోంది!" అన్నాడు.

"షటప్... కట్ చెయ్యి...." అన్నాను.

ఒక్క వేటుతో పోయిన నా ఊపిరి తిరిగొచ్చింది.

"ఇప్పుడింక ఓకేనా?" కత్తెరని తీసినచోటే పడేస్తూ అడిగాడు ఫ్రూమ్.

నేను నిలువుగా తలాడించి, మెడమీద చేత్తో రుద్దుకుంటూ గట్టిగా ఊపిరి పీల్చుకున్నా నా తలని వెచ్చగా, హాయిగా ఉన్న జెరాక్స్ మిషన్ అద్దం మీద ఆనించాను. నేను మరీ గట్టి తల ఆ అద్దం మీద పెట్టానో, లేక నా తల అంత బరువుగా ఉందో తెలీదు, అద్దం బీటలు చప్పుడు వినిపించింది.

"ఏయ్! అద్దం విరిపేశావా?" అన్నాడు ఫ్రూమ్.

"ఏమిటీ?" అన్నాను తల పైకెత్తుతూ.

"అక్కణ్ణించి ఇవతలికి రా," అంటూ నన్ను ఇవతలికి లాగి, "నీకేమైంది, మా రోజు నీకు అన్నీ ఆఫీసు కష్టాలే లాగుందే!" అన్నాడు.

"ఏమో, ఎవరికి తెలుసు? నేను నిజంగానే ఎందుకూ పనికిరానివాణ్ణి. ఈ చిన్న పని కూడా చెయ్యలేను. నేను చచ్చిపోవలసింది! రేపు వార్తల్లో హెడ్‌లైన్స్ ఏమని వచ్చేవో తెలుసా 'జెరాక్స్ మిషన్ ఒక మనిషి తల నరికింది, డూప్లికేటు కాపీలు తీసింది!' " అన్నాను కాయితా బొత్తి పెడుతూ.

ఫ్రూమ్ నవ్వుతూ నా భుజం చుట్టూ చెయ్యి వేశాడు.

"టెన్షన్ ఫీలవకు, గురూ! అయినా నీకు సారీ చెప్పాలి!"

"దేనికి సారీ?" అన్నాను. గత ఇరవై ఆరేళ్లలో నాకు ఎప్పుడూ, ఎవరూ సారీ చెప్ప

"నేను చాలా మోటుగా ప్రవర్తించాను. నీకు సాయం చెయ్యటానికి రానన్నాను, అసలు కాల్‌సెంటర్ మూతపడుతోందనే పుకార్లూ, తరవాత నాతో పని చేసిన బా ఎన్‌డిటివిలో చేరటం, బక్షీ మనకి ఈమెయిల్ కాపీ పంపకుండా వెబ్‌సైట్‌కి సంబంధి వివరాలు పంపించెయ్యటం, ఈలోపల ఎవడో తిక్కవెధవ ఫోన్‌లో నన్ను అనరాని మాటలు ఒక్కోసారి బుర్ర పాడైపోతుంది!"



"నీ బుర్రని పాడుచేసేవేమిటి?" అని అడిగాను. మళ్లీ బక్షీ ఇచ్చిన కాయితాలని కాపీ చెయ్యటానికి ప్రయత్నించసాగాను. నేను బటన్‌ని నొక్కిన ప్రతిసారీ జెరాక్స్ మిషన్ తెరమీద భయంకరమైన తిట్లు మెసేజ్‌ల రూపంలో వస్తున్నాయి. కొద్ది నిమిషాల్లో అది తన అద్దం పగిలిందని తెలుసుకుని, పూర్తిగా ఆగిపోయింది. అది ఆత్మహత్య చేసుకుందనుకుంటూ!

"జీవితం, జీవితం బుర్రని తొలిచేస్తుంది. నువ్వు చాలా సంతోషంగా ఉన్నాననే అనుకుంటావు, మంచి జీతం, మంచి స్నేహితులు, జీవితం ఒక పండగలాగ అనిపిస్తుంది, కానీ హఠాత్తుగా, ఒక్క దెబ్బతో, అంతా బీటలు వారిపోతుంది. ఇదిగో, ఈ స్టుపిడ్ జెరాక్స్ మిషన్‌కున్న అద్దం లాగ," అన్నాడు ఫ్రూమ్ స్టోర్‌రూమ్‌లో ఉన్న స్టూల్‌మీద కూర్చుంటూ.

నాకు ఫ్రూమ్ చెప్పిన అద్దం సిద్ధాంతం జీవితంతో ఎలా ముడిపడి ఉందో పూర్తిగా అర్థం కాలేదు. కానీ అతని మొహం చూసి, చాలా విచారంగా ఉన్నాడని మాత్రం అర్థమయింది. నన్ను ఇంతకుముందే చావునించి కాపాడిన అతన్ని ఓదార్చాలని అనుకున్నాను.

"ఫ్రూమ్ నీకున్న సమస్య ఏమిటో తెలుసా?"

"ఏమిటి?"

"నీకు జీవితంలో నిజమైన ప్రేమ దొరకలేదు. నువ్వు ప్రేమలో పడాలి, ప్రేమలో బతకాలి, ప్రేమిస్తూనే ఉండాలి. నీ జీవితంలో ఆ లోటు ఉండిపోయింది," అన్నాను ఎంతో విశ్వాసంతో, నేనేం మాట్లాడుతున్నానో మహా నాకు బాగా తెలిసినట్టు!

"అలా అంటావా? నాకు గర్ల్‌ఫ్రెండ్స్ ఉండేవాళ్లు. త్వరలోనే మరో అమ్మాయిని గర్ల్‌ఫ్రెండ్ చేసుకోబోతున్నాను, నీకూ తెలుసు," అన్నాడు ఫ్రూమ్.

"అలాంటి అమ్మాయిలు కాదు. నీకు నిజంగా చాలా ఇష్టం అనిపించే అమ్మాయి. ఆ అమ్మాయెవరో మాకందరికీ తెలుసులే."

"ఈషా?"

నేను జవాబు చెప్పలేదు.

"ఈషాకి నామీద ప్రేమ లేదు. నేనామెని అడిగాను. తనకి మోడలింగ్ మీదే ధ్యాసంతా ఉందనీ, అబ్బాయిలతో సంబంధం పెట్టుకోవటానికి తీరిక లేదనీ అంది. అంతేకాక, నాలో తనకి నచ్చని విషయాలు కూడా కొన్ని ఉన్నాయి," అన్నాడు ఫ్రూమ్.

"ఏమిటవి?"

"నాకు ప్రేమంటే ఏమిటో తెలీదుట. అమ్మాయిలకన్నా నాకు బైకులూ, కార్లు అంటే ఎక్కువ ప్రేమట."

నేను నవ్వి "అవును, నిజమే" అన్నాను.

"అది చాలా అన్యాయం, అదేం పోలిక? అమ్మాయిల్ని, మీకు చెప్పులంటే ఎక్కువ ఇష్టమా, మొగవాళ్లంటే ఎక్కువిష్టమా అని అడిగినట్టు! దానికి జవాబు చెప్పటం సులభం కాదు."

"నిజమా? అయితే మనని చెప్పులతో పోలుస్తారన్నమాట!"

"నా మాట నమ్ము, ఆడవాళ్లు సెక్సీ షూలకోసం మొగవాళ్లని కూడా పట్టించుకో మానెయ్యగలరు. కానీ అసలు విషయానికి రా – ఈషా!"

"నీకు ఆమె అంటే ప్రేమ ఉందా?" అన్నాను.

"చెప్పలేను. కానీ ఒక ఏడాదిగా ఆమెని చూస్తే అదోరకంగా ఇష్టంలాంటిది అనిపిస్తో

"కానీ పోయిన ఏడు నువ్వు వేరే ఎందరో అమ్మాయిలతో డేటింగ్ చేశావు కదా

"వాళ్లకి ఎప్పుడూ అంత ప్రాధాన్యం ఇవ్వలేదు. వాళ్లు టీవీ ఛానళ్లలాంటి వాళ్లు. కావల్సిన ఛానెల్ దొరికేదాకా తిప్పుతూ పోవటమే. నువ్విప్పుడు ఈ 'కర్లీ వర్లీ' పిల్లతో స్నే చేస్తున్నావు, కానీ నీకింకా ప్రియాంక మీద ప్రేమ ఉంది," అన్నాడు వ్రూమ్.

అతనన్న మాటకి నేను ఉలిక్కిపడ్డాను.

"నేను ప్రియాంకని మర్చిపోయి, మళ్లీ కొత్త జీవితాన్ని ప్రారంభించటానికే శెఫా స్నేహం చేస్తున్నాను," అన్నాను.

"పిచ్చిమాటలు మాట్లాడకు. ఆ పిల్ల నీకు ఆడవాళ్లంటే అసహ్యం పుట్టించగల ప్రియాంకని మర్చిపోయేందుకు బహుశా అదేమన్నా పనికొస్తుందేమో!" అన్నాడు వ్రూ

"మాట మార్చకు. మనం నీ గురించి మాట్లాడుతున్నాం. నువ్వు మళ్లీ ఈషాతో మాట్లా ఇద్దరం ప్రేమించుకుందామని అడుగు. అడుగు, మాన్!"

వ్రూమ్ నాకేసి కొన్ని సెకన్లు చూసి, "నువ్వు నాకు సాయం చేస్తావా?" అన్నాడు.

"నేనా? అమ్మాయిల విషయంలో నువ్వే కదా అనుభవజ్ఞుడివి?" అన్నాను.

"ఇది వేరులే. ఇందులో నేను కోల్పోయేది ఎక్కువే ఉండొచ్చు! నేనామెతో మాట్లాడేటప్పుడు నువ్వుకూడా పక్కనుంటావా? ఊరికే మా మాటలు విను. ఆ తరవాత కావాలంటే వా మనిద్దరం విశ్లేషించుకోవచ్చు."

"అలాగే, తప్పకుండా, పద అయితే ఇప్పుడే మొదలుపెడదాం!"

"ఇప్పుడా?"

"ఎందుకు చెయ్యకూడదు? మనకి తీరిక ఉంది. ఆ తరవాత కాల్స్ రావటం మొద పెడతాయి, పనిలో పడిపోతాం. మహా అయితే, మేనేజ్‌మెంటు మనని ఉద్యోగంలో తీసేస్తుంది. అనుకున్నప్పుడే మొదలుపెడితే మంచిది కదా?" అన్నాను.

"ఓకే! ఎక్కడ ప్రారంభిద్దాం?" ఆలోచిస్తూ, నుదుటిని చేత్తో రాసుకుంటూ, "డై రూములోనా?" అన్నాడు.

డైనింగ్ రూమ్ సరైన చోటని అనిపించింది. నేనూ దగ్గర్లోనే ఉండచ్చు. వాళ్లకి దూ ఉండి వినచ్చు.



# # 16

"ఏం కాలేదు కదా? నాకేవో చప్పుళ్లు వినిపించాయి," అంది ఈషా మేము స్టోర్‌రూము నించి ఆఫీసులోకి అడుగుపెట్టగానే. ఆమె తన కుర్చీమీద కూర్చుని ఒళ్లు విరుచుకుంది. ఆమె వేసుకున్న టాప్ పైకి పోయి బొడ్డుకి పొడిపించుకున్న రింగు తళుక్కుమంది.

"జెరాక్సు మిషన్ చచ్చిపోయింది! అది సరే, ఎవరైనా స్నాక్స్ తినటానికొస్తారా?" అన్నాను.

"యెస్, పద పోదాం. నాకు కూడా కొంచెం నడక అవసరం. రా, ప్రియాంకా," అని ఈషా ప్రియాంక జబ్బ పట్టుకుని లేపటానికి ప్రయత్నించింది.

"లేదు, నేనిక్కడే ఉంటా. గణేశ్ ఫోన్ చేస్తాడేమో!" అంది ప్రియాంక నవ్వి.

ఒక పెద్ద గరిటెడు కరిగించిన సీసం నా తలలోంచి పాదాలదాకా ప్రవహించింది. వదిలెయ్యి, మర్చిపో! నాకు నేను గుర్తు చేసుకున్నాను. అదే సమయంలో ఆ ల్యాండ్‌లైన్ ఫోన్ తీసుకుని దాన్ని వెయ్యిముక్కలు చెయ్యాలన్న బలమైన కోరిక కలిగింది.

రాధిక లేవబోతూంటే నేనామెని ఆపాను.

"రాధికా, నువ్విక్కడే ఉండకూడదూ? బక్షీ ఇటుకేసి వస్తే ఆఫీసులో ఎవరో ఒకరు ఉన్నారులే అనుకుంటాడు," అన్నాను.

రాధిక అయోమయంగా చూస్తూ మళ్లీ కూర్చుంది. మేం బైటపడ్డాం.

కనెక్షన్స్‌లో డైనింగ్‌రూము అటు రెస్టారెంటుకీ, కాలేజీ హాస్టల్ మెస్‌కీ మధ్యరకంగా ఉంటుంది. గ్రానైట్‌తో చేసిన బల్లలు మూడు వరసలుంటాయి. వాటికి రెండుపక్కలా కూర్చోటానికి కుర్చీలుంటాయి. కుర్చీల కుషన్లు ముఖమల్‌లాగ మెత్తగా ఉంటాయి. ఆధునికంగా డిజైనర్ కుర్చీల్లా కనిపించేందుకు వాటి కుషన్లని నల్లటి తోలుతో చేశారు. బల్లల మీద మూడడుగుల కొకటి చొప్పున చిన్నపూలకూజాలుంటాయి. అతి ఖరీదైన కన్సల్టింగ్ కంపెనీ ఒకటి (దాన్నిండా ఎమ్‌బీఏలే) ఈ మధ్యనే డైనింగ్ రూమ్ వెలుతురుతో నిండి ఉండాలనీ, అప్పుడే అక్కడ పనిచేసేవాళ్లకి ఉత్సాహంగా పనిచెయ్యాలన్న ప్రేరణ కలుగుతుందనీ సిఫార్సు చెయ్యటంతో, మా మేనేజిమెంటు డైనింగ్‌రూమ్‌లో మార్పులూ చేర్పులూ చేసింది. అసలు నన్నడిగితే, బక్షీని ఉద్యోగంలోంచి పీకేసి ఉంటే, చవకలో పోయుండేది.

వ్రూమ్ చీజ్ సాండ్‌విచ్, చిప్స్ తీసుకున్నాడు. (మేము ఇండియన్ పదార్థాలు తయారు చెయ్యం – అది కూడా ప్రేరణ కలగజెయ్యటం కోసమే) తన ట్రే తీసుకుని ఒక బల్ల దగ్గర కూర్చున్నాడు. ఈషా ఉత్త సోడా మాత్రం తీసుకుని వ్రూమ్‌కి ఎదురుగా కూర్చుంది. ఆమె మూడురోజులకొకసారి తింటుందనుకుంటా! నేను మరీ పెద్ద చాకలెట్ కేక్ ఒకటి తీసుకున్నాను.

తీసుకుని ఉండకూడదు, కానీ స్నేహితుడికి సాయం చేయటానికి వచ్చాను, ఆ మాత్రం ఫలితం దొరక్కపోతే ఎలా? అనుకున్నాను.

నేను పక్కనే ఉన్న బల్ల దగ్గర కూర్చున్నాను. నా సెల్‌ఫోన్ బైటికి తీసి, ఎస్ఎమ్ఎస్‌లు పంపుతున్నట్టు నటించసాగాను.

"శ్యామ్ మనతో ఎందుకు కూర్చోలేదు?" అంది ఈషా ఫ్రూమ్‌తో, సీట్లో వెనక్కి తిరిగి నాకేసి చూస్తూ.

"ప్రైవేటు ఎస్ఎమ్ఎస్‌లు పంపిస్తున్నాడు!" అన్నాడు ఫ్రూమ్. ఈషా కళ్లు గుండ్రంగా తిప్పి తలాడించింది.

"అసలు, ఈషా, నేను నీతో ఒక విషయం చెప్పాలని అనుకున్నాను," అన్నాడు ఫ్రూమ్ వేళ్లతో ప్లేటులోని చిప్స్‌ని కదుపుతూ. నేను అప్పటికే సగం కేకు తినేశాను. బహుశా కిందటి జన్మలో నేను తిండి సరిగా తినలేని పందిని అయి ఉంటాను!

"ఊఁ!" అంది ఈషా ఫ్రూమ్‌తో, ఆ మాటని పొడుగ్గా ఈడుస్తూ. ఒక కనుబొమ పైకెత్తి అనుమానంగా చూసింది. కళ్లకి కనబడని ఏంటెనాలు ఆడవాళ్లలో ఉంటాయి కాబోలు, అవి వాళ్లకి జాగ్రత్తగా ఉండమని సలహా ఇస్తాయి! "దేన్ని గురించి మాట్లాడాలి?" అని అడిగింది.

ఫ్రూమ్ గొంతు సవరించుకుని, "ఈషా! ఈ మధ్యన నీ గురించి తెగ ఆలోచిస్తున్నాను," అన్నాడు.

"అవునా?" అని, కళ్ల చివర్లనించి నేను వాళ్లమాటలు వింటున్నానేమోనని, నాకేసి చూసింది. నేను వింటున్నమాట నిజమే, కానీ తింటున్న కేకుమీదే నా ధ్యాసంతా ఉన్నట్టుగా మొహం పెట్టటానికి కష్టపడి ప్రయత్నించాను. తను వారానికి సరిపడేట్టుగా తినే తిండిని నేను క్షణాల్లో గుటకాయస్వాహా చెయ్యటం చూస్తూ కూర్చుంది.

"నిజంగానే, ఈషా! నేనెందరో అమ్మాయిల్ని చూసి ఉండచ్చు, కానీ వాళ్లెవరూ నీలా లేరు."

ఈషా పళ్లికిలించి, బల్లమీద వాజ్‌లో ఉన్న పువ్వుని చేతిలోకి తీసుకుంది. దాని రెక్కల్ని తుంచసాగింది.

"అవును. అందుకే ఊరికే ఉబుసుపోకకి వీళ్లతో వాళ్లతో తిరక్కుండా ఒకే అమ్మాయితో సంబంధం పెట్టాకోవాలనుకుంటున్నాను. అందుకే నిన్ను మళ్లీ అడుగుతున్నాను, నాతో స్నేహం చేసి బైటికి వస్తావా?" అన్నాడు ఫ్రూమ్.

కొన్ని నిమిషాలు ఈషా మౌనంగా ఉండిపోయింది, "నేను నీకు ఏమని జవాబు చెప్పాలనుకుంటున్నావు?"

"నాకు తెలీదు. యెస్ అంటే ఎలా ఉంటుంది?"

"అవునా? కానీ దురదృష్టవశాత్తూ నాకా మాట తట్టలేదు," అంది ఈషా మొహం సీరియస్‌గా పెట్టి.

"ఎందుకని?" అన్నాడు ఫ్రూమ్. అతను ఈ విషయం ఇంతటితో ముగిసిపోయిందను కుంటున్నాడని నాకు తెలిసిపోయింది. ఒకసారి తను నాతో అన్నాడు, ఎవరైనా అమ్మాయి తనకి



ఆసక్తి లేనట్టు ప్రవర్తిస్తే, అక్కడితో ఆ విషయం వదిలేసి వెళ్లిపోవటమే మంచిదని. ఒప్పించటం అనే వ్యాపకం పెట్టుకోకపోవటమే మేలని అన్నాడు.

"నేను ముందే నీకు చెప్పాను. నేను మోడలింగ్ మీద నా దృష్టిని పూర్తిగా ఫోకస్ చెయ్యాలి. బాయ్‌ఫ్రెండ్‌ని ఏర్పాటు చేసుకోవటం అనే భోగం భరించటం నావల్లకాదు," అందామె. ఆమె గొంతులో ఏమాత్రం మార్దవం లేదు.

"నీ సమస్యేమిటి, ఈషా? నీకెవరైనా అండగా ఉండటం ఇష్టం లేదా?" అన్నాడు ఫ్రూమ్.

"సరిగ్గా గ్రహించావు! పోయిన ఏడాది ముగ్గురు గర్ల్‌ఫ్రెండ్స్‌ని మార్చావు, అందుకే నాకు కావల్సి వచ్చినప్పుడు నువ్వు ఎక్కడికీ వెళ్లకుండా అక్కడే ఉంటావని నాకు నమ్మకం ఉంది," అంది ఈషా.

"ఆ అమ్మాయిలందరూ సరదా చేసుకోవటానికి. వాళ్లు నాకేమీ కాదు. వాళ్లు, పిజ్జా, సినిమాలాంటివాళ్లు. ఛానల్ మార్చినట్టు మార్చటానికి పనికొచ్చే బాపతు. నీ విషయంలో నేనలా అనుకోవటం లేదు," అన్నాడు ఫ్రూమ్.

"అయితే నేను ఎటువంటి 'సీరియస్' ఛానల్‌ని? బీబీసీనా?" అంది ఈషా.

"ఏడాది పైగా నీతో పరిచయం ఉంది. కొన్ని వందల రాత్రులు మనం కలిసి గడిపాం..."

ఫ్రూమ్ చివరి మాటలు నాకు ఎబ్బెట్టుగా అనిపించాయి, కానీ ఈషా తన గొడవలో తనుండి, గమనించలేదు.

"ఫ్రూమ్, ఈ సంగతి వదిలెయ్!" అని ఈషా పువ్వుని మళ్లీ వాజ్‌లో పెట్టేసింది. ఆమె ఏడుపు మొదలుపెట్టనప్పటికీ, గొంతులో ఏడుపు వినిపించింది.

"నువ్వు, ఓకేయేనా?" ఫ్రూమ్ చెయ్యి చాయి ఆమె చేతిని పట్టుకోబోయాడు. ఆమె అది గమనించి, ముందే చెయ్యి వెనక్కి లాక్కుంది. క్షణంలో వెయ్యోవంతులో ఆ పనిచేసింది ఈషా.

"లేదు, బాగాలేను!" అంది ఈషా.

"మనం స్నేహితులమని అనుకున్నాను. దాన్ని తరువాతి స్థాయికి తీసుకెళ్దామని ప్రయత్నించాను..." అన్నాడు ఫ్రూమ్.

"ప్లీజ్, ఆపెయ్యి!" అని ఈషా చేతుల్తో కళ్లు మూసుకుంది. "దీన్ని గురించి మాట్లాడటానికి చాలా తప్పుడు టైముని ఎంచుకున్నావు," అంది.

"ఏమయింది, ఈషా? నేనేమైనా సాయం చెయ్యగలనా?" అన్నాడు ఫ్రూమ్. అతని గొంతులో ఇప్పుడు రొమాన్స్ తాలూకు భయంకన్నా ఈషా పట్ల ఆందోళన ఎక్కువ కనిపించింది.

ఆమె గబగబా తలాడించింది.

ఫ్రూమ్ ఘోరంగా ఓడిపోయాడని నాకర్థమైంది. ఈ పిల్లకి అతనిలో ఆసక్తి లేదు. పైగా ఇవాళ ఆమె చాలా ఘోరమైన మనస్థితిలో ఉంది. నేను నా వెయ్యి కాలరీల కేక్ తినేసి, మంచినీళ్ల కోసం కౌంటర్ దగ్గరకెళ్లాను. నేను మళ్లీ వచ్చేసరికి వాళ్లిద్దరూ అక్కడ లేరు.

# # 17

నేను డబ్ల్యుఏఎస్‌జి బేకి వచ్చాక కూడా నా నోట్లో నేను తిన్న చాక్లెట్ కేక్ రుచి అలాగే ఉంది. నేను నా బల్ల దగ్గర కూర్చుని ఏవేవో అర్థంలేని వెబ్‌సైట్లన్నీ చూడటం మొదలుపెట్టాను. పెళ్లికూతురికి కావల్సిన బట్టలు దొరికే ఢిల్లీలోని మంచి మంచి షాపుల్ని రాధిక, ప్రియాంకకి సిఫార్సు చేస్తోంది. ఈషా, వ్రూమ్ మౌనంగా ఉన్నారు. చాక్లెట్ కేక్ తిన్నందుకు నేను తప్పు చేశాననుకుంటున్నంతలో, సిస్టమ్స్ పాడయాయని రిపోర్టు చెయ్యకపోవటం కూడా పొరపాటే అనే భావం కూడా దానికి తోడయింది. తప్పుచేశానన్న ఒక భావనకి అలాంటి మరో భావన కూడా తోడైతే అది వెయ్యిరెట్లు పెరిగిపోతుంది. చివరికి, ఐటి వాళ్లకి ఫోన్‌చేసి, మా ఫోన్లని బాగుచెయ్యమని చెప్పాను. వాళ్లు బిజీగా ఉన్నారు, కానీ పదినిమిషాలలో వస్తామని అన్నారు.

అదనంగా ఉన్న ల్యాండ్‌లైన్ మోగటంతో అందరం ఉలిక్కిపడ్డాం.

"గణేశ్" అంది ప్రియాంక ఫోన్ దగ్గరికి కంగారుగా పరిగెత్తుతూ. నేను మొహంలో ఏ భావమూ కనిపించనివ్వకుండా, ఆ ఫోనులో జరిగే సంభాషణ వినటానికి అనువైన మీటని నొక్కాను.

"అమ్మా! నువ్వింకా నిద్రపోవటం లేదా? ఈ నెంబరు నీకెవరిచ్చారు?" అంది ప్రియాంక.

"నిద్రపోవటమా? ఇవాళ ఎవరూ ఒక క్షణం కళ్లుమయ్యలేదు," అంది వాళ్లమ్మ ఉత్సాహం పట్టలేకుండా. ఆమెని నేనెప్పుడూ చూడలేదు. కానీ ప్రియాంక చెప్పిన విషయాల వల్ల నాకావిడ బాగా తెలిసిన మనిషిలా అనిపించింది.

నేను 'ట్యాప్' చేసిన ఫోన్‌లైన్ చాలా స్పష్టంగా వినిపిస్తోంది. వాళ్లమ్మ సంతోషంతో ఉప్పొంగిపోతోంది. నాకది చాలా విచిత్రంగా అనిపించింది. ఎందుకంటే (ప్రియాంక లెక్కన) ఆవిడ తన జీవితమంతా నిరాశా నిస్పృహలమధ్యే గడిపినట్టు నేను విన్నాను. ఆ నిరాశా నిస్పృహలు కూడా ఆవిడ బలవంతాన తన జీవితంలోకి తెచ్చిపెట్టుకున్నవే.

ఇంతకుముందే గణేశ్ తనకి ఫోన్ చేశాడనీ, ఈ ఎమర్జన్సీ నంబరిచ్చాడనీ ఆవిడ ప్రియాంకతో అంది. ఇండియాలోనే ఉంటున్న అతని తలిదండ్రులు కూడా నిద్రపోవటం లేదుట; వాళ్లు గంట కొకసారైనా ప్రియాంక ఇంటికి ఫోన్ చేస్తున్నారట. గణేశ్ ప్రియాంక తలిదండ్రులతో, "నాకు ఎవరెస్ట్ ఎక్కినంత ఆనందంగా ఉంది," అని చెపుతున్నాడట. పాపం ఆ అర్భకుడికి జీవితంలో మరేదీ ఉన్నట్టు లేదు.



"నాకు చెప్పలేనంత సంతోషంగా ఉంది. చూడు ఇంత మంచి సంబంధం వెతుక్కుంటూ మరీ మన గుమ్మంలోకి వచ్చింది! నేనేమో ఎప్పుడూ నీ గురించి ఆందోళన పడుతూ ఉండేదాన్ని," అంది ప్రియాంక తల్లి.

"అవునమ్మా, నిజంగానే! కానీ ఏమిటీ హడావిడి? ఇంకొన్ని గంటల్లో ఇంటికొచ్చేస్తా కదా? మరెందుకు నాకు ఫోన్ చేశావు?" అంది ప్రియాంక.

"ఊరికేనే. అమ్మని నా కూతురికి నేను ఫోన్ చెయ్యకూడదా?" అంది ప్రియాంక వాళ్లమ్మ. 'అమ్మ... చెయ్యకూడదా?' అనేది ఆవిడకి ఎంతో ఇష్టమైన వాక్యం.

"అదేం కాదమ్మా! ఎందుకు చేశావో అనుకున్నానంతే. ఇవాళ నేనూ గణేశ్ కొన్నిసార్లు మాట్లాడుకున్నాం."

"ఊ, తరవాత?"

"తరవాత ఏమిటి?"

"తన ప్లాన్స్ గురించి చెప్పాడా?"

"ఏ ప్లాన్స్?"

"అతను వచ్చేనెల ఇండియాకి వస్తున్నాడు. అసలు సంబంధాలు చూడటానికి ఈ ప్రయాణం పెట్టుకున్నాడు. కానీ ఇప్పుడు అమ్మాయిని ఎంచుకోవటం అయిపోయింది కాబట్టి, ఈసారి వచ్చినప్పుడు ఏకంగా పెళ్లి చేసుకుందామని అనుకుంటున్నాడు," అంది ప్రియాంక వాళ్లమ్మ. ఆనందం, ఆత్రుతతో ఆవిడకి సరిగ్గా ఊపిరాడటం లేదు.

"ఏమిటీ? వచ్చే నెలా?" అంది ప్రియాంక. నిర్ఘాంతపోయి మా అందరివైపూ కలయ చూసింది. అందరూ తమకేమీ అర్థంకానట్టు ఆమెకేసి చూశారు. నేను కూడా వాళ్లలాగే ఏమీ అర్థం కానట్టు నటించాను.

"అమ్మా... నో! వచ్చేనెలే ఎలా పెళ్లి చేసుకుంటాను? ఐదువారాలు కూడా లేవే!" అని ఏడుపు గొంతుతో అరిచింది ప్రియాంక.

"దాన్ని గురించి నువ్వేం బెంగ పడక్కర్లేదు. ఏర్పాట్లన్నీ నేను చూసుకుంటాగా. నువ్వలా చూస్తూ ఉండు, ఈ పెళ్లిని బ్రహ్మాండంగా చెయ్యటానికి నేను పగలూ-రాత్రీ ఏకం చేసెయ్యనూ!"

"అమ్మా! నేను పెళ్లి బ్రహ్మాండంగా జరుగుతుందా లేదా అనే విషయం గురించి గాభరాపడటం లేదు. నేను పెళ్లి చేసుకోవటానికి సిద్ధంగా ఉండాలిగా! నాకు గణేశ్ గురించి ఏమీ తెలీదే!" అంది ప్రియాంక.

"ఆc మరీను, నువ్వు సిద్ధంగా లేకపోవటమేమిటే! రెండు కుటుంబాలూ సంబంధం నిశ్చయం చేసుకున్నాక, పిల్లా, పిల్లాడూ సంతోషంగా ఒప్పుకున్నాక, ఇంకెందుకు ఆలస్యం చెయ్యటం? పైగా ఆ అబ్బాయి మళ్లీ మళ్లీ రాలేడుగా. చాలా పెద్ద ఉద్యోగంలో ఉన్నాడాయె."

ఒవునవును! మైక్రోసాఫ్ట్ కంపెనీలో ఉండే వేలకొద్దీ ఇండియన్ చవటల్లో వాడూ ఒకడు! కానీ ఈవిడకి మాత్రం వాడు సాక్షాత్తూ బిల్‌గేట్సే! అనుకున్నాను మనసులో.

"అమ్మా, ప్లీజ్, వచ్చేనెల్లో నేను పెళ్లి చేసుకోలేను. సారీ, కానీ చేసుకోలేనంతే! సరే, ఇంక ఫోన్ పెట్టేస్తున్నాను," అంది ప్రియాంక.

"చేసుకోనంటే ఏమిటే నీ ఉద్దేశం? అసలు బుద్ధుందా నీకు? నేను ఎడ్డెం అంటే తెడ్డెం అనటమే పనిగా పెట్టుకున్నావా?"

"అమ్మా ఇందులో నీ మాట వినకపోవటం అనేది ఎక్కడుంది? అసలు నన్నడిగితే, ఇది నీకు సంబంధించిన విషయం ఎలా అయింది? ఇది నా జీవితం. సారీ, ఐదు వారాలు మాత్రమే పరిచయం ఉన్న మనిషిని నేను పెళ్లి చేసుకోలేను."

ప్రియాంక వాళ్లమ్మ కాసేపు ఏమీ మాట్లాడలేదు. ఆవిడ వాదిస్తుందని ఎదురుచూశాను. కానీ ఈ మౌనం మాటలకన్నా ఎక్కువ ప్రభావం చూపుతుందని తరవాత నాకర్థమైంది. ప్రియాంక మెడమీద తన మనోభావాలనే పదునైన కత్తిని పెట్టటం ఆవిడకి బాగానే తెలుసు.

"అమ్మా! లైన్లో ఉన్నావా?" పది సెకన్ల తరవాత ప్రియాంక అడిగింది.

"ఆc! ఇక్కడే ఉన్నాను. త్వరలోనే చచ్చిపోతానేమో, కానీ దురదృష్టవశాత్తూ ఇంకా ఇక్కడే ఉన్నాను!"

"ఏమిటమ్మా ఇది..."

"పొరపాటున కూడా నన్ను సంతోషంగా ఉండనివ్వకు!" అందావిడ. అబ్బ, ఏం దెబ్బ కొట్టింది! అనుకున్నాను. చప్పట్లు కొట్టేంత పనీ చేశాను.

ప్రియాంక ఉద్రేకం ఆపుకోలేక ఒకచెయ్యి గాలిలోకి పైకి విసిరింది. ఒత్తిడి ఉన్నప్పుడు ఉపయోగించే బంతి, వ్రూమ్ కంప్యూటర్ దగ్గరుంటే, దాన్ని చేతిలోకి తీసుకుంది. దాన్ని గట్టిగా ఒత్తింది. ప్రియాంక గొంతు తగ్గించేసరికి నేను హెడ్‌ఫోన్లని చెవులకి గట్టిగా నొక్కిపెట్టాను.

"అమ్మా! అలా మాట్లాడటం, ఆపమ్మా, ప్లీజ్!"

"ఇవాళ గంటసేపు పూజ చేశాను, తెలుసా? నువ్వు సంతోషంగా ఉండాలని... ఎప్పటికీ సంతోషంగానే ఉండిపోవాలని పూజ చేశాను..." అంది ప్రియాంక వాళ్లమ్మ ఏడవటం మొదలుపెట్టింది. వాదించుకుంటున్నప్పుడు ఎవరు ముందు ఏడిస్తే వాళ్లకి లాభం. ఇది ప్రియాంక వాళ్లమ్మకి పనికొస్తుంది. మాటవినే కూతురు లేకపోయినా, చెప్పినట్టు వినే కన్నీటి గ్రంథులున్నాయి!

"అమ్మా! సీన్ చెయ్యద్దు. నేను ఆఫీసులో ఉన్నాను. నేనేం చెయ్యాలని నీ ఉద్దేశం? నేను ఆ అబ్బాయిని చేసుకోవటానికి సరే అన్నాను. అలాంటప్పుడు అందరూ నన్నలా ఎందుకు ఇంత తొందరపెడుతున్నారు?"

"ఏం, గణేశ్ బాలేడా? అసలు ఏమిటి నీ బాధ?" ఆవిడ గొంతులో ఎంత విషాదం! బాలీవుడ్‌లో హీరో తల్లి వేషం వేసేవాళ్లందరూ ఈవిడ్ని చూసి సిగ్గుపడాలి!

"అమ్మా! అతను బాగాలేడని కాని, నాకేదో బాధ ఉందనిగాని, నేననలేదే. నాకు కొంచెం టైం కావాలి, అంతే."



"నీ ధ్యాస మరెక్కడో లేదు కదా? ఆ కాల్‌సెంటర్లో పనిచేసే పనికిమాలిన కుర్రాడితో ఇంకా స్నేహంగా ఉంటున్నావా? అన్నట్టు అతని పేరేమిటి?... శ్యామ్ కదా?"

నా పేరు వినిపించగానే ఎగిరిపడ్డాను.

"లేదమ్మా! ఇప్పుడది ముగిసిపోయింది. నేను నీకెన్నోసార్లు చెప్పాను. గణేశ్‌ని చేసుకుంటానని చెప్పా కదా?"

"అయితే మరి వచ్చేనెల చేసుకోవటానికి ఎందుకు ఒప్పుకోవు? అందర్నీ ఆనందం కోసం సరేననచ్చుగా? నీ అమ్మగా ఆ మాత్రం నిన్ను బతిమాలే హక్కు నాకు లేదా?"

మళ్లీ 'ఒక అమ్మగా...' రెండోసారి!

ప్రియాంక తనని తాను అదుపులో పెట్టుకోవటానికి కళ్లు మూసుకుంది. తరవాత నెమ్మదిగా, "నేను కొంచెం ఆలోచించుకోవచ్చా?" అంది.

"తప్పకుండా. ఆలోచించుకో. కానీ మా అందరి గురించీ కూడా ఆలోచించు. నీ ఒక్కదాన్ని గురించి మాత్రమే కాదు."

"ఓకే, అలాగే. కాస్త... కాస్త నాకు టైమివ్వండి."

ప్రియాంక ఫోన్ పెట్టేసి అలాగే ఉండిపోయింది. అమ్మాయిలు ఫోన్‌లో మాట్లాడిన విషయాల గురించి అడిగారు.

ఆమె చుట్టూ చూసి, చేతిలో ఉన్న బంతిని తన కంప్యూటర్ మానిటర్‌కేసి కొట్టింది.

"మా అమ్మ నన్ను వచ్చే నెల్లో పెళ్లి చేసుకోమంటోందని చెపితే, మీరు నమ్ముతారా? వచ్చే నెల్లో!" ప్రియాంక లేచి నిలబడి, "వాళ్లు నన్ను పాతికేళ్లు పెంచారు. కానీ ఇప్పుడు నన్ను వదిలించుకోటానికి ఇరవైఐదు రోజులు కూడా ఆగలేకపోతున్నారు. వీళ్లకేమైంది? నేను వాళ్లకి అంత బరువైపోయానా?"

ప్రియాంక, వాళ్లమ్మతో మాట్లాడిన మాటలన్నిట్నీ, రాధికకీ ఈషాకీ చెప్పింది. వ్రూమ్, బక్షీ మాకు ఏవైనా ఈమెయిల్స్ పంపాడేమో అని కంప్యూటర్‌లో చెక్ చేశాడు.

"కానీ, అది అంత పెద్ద సమస్యేం కాదు కదా? ఎలాగూ అతన్ని పెళ్లి చేసుకోబోతున్నావు. మరెందుకు ఆలస్యం చెయ్యటం?" అంది రాధిక ప్రియాంకతో.

"అవును, పైగా త్వరగా లెక్సస్ కారు నడిపే అవకాశం దొరుకుతుంది," అన్నాడు వ్రూమ్ కంప్యూటర్ మీదనించి చూపు తిప్పకుండా. ఈ వ్రూమ్‌గాడిని తగలెయ్య! కళ్ల చివర్నించి వ్రూమ్ వైపు కోపంగా చూశాను.

"నేనే డ్రస్సు వేసుకోవాలి?" అంది ఈషా. ఇంతసేపూ మొహం వేలాడేసుకుని కూర్చున్న ఆమెలో ఈ వార్త వినగానే ఉత్సాహం వచ్చింది. ఈషాకి మంచి డ్రస్సు వేసుకునే అవకాశం వస్తే చాలు, తనచుట్టూ ఉన్నవాళ్లు చచ్చిపోతున్నా పట్టించుకోదు! "కానీ చాలా తక్కువ వ్యవధి ఉందే. ఇలాంటివి ఉన్నప్పుడు ప్రతిసారీ నాకు కొత్త డ్రస్సుండాలి!" అంది.

"నీకు చాలామంది డిజైనర్ స్నేహితులున్నారుగా? వాళ్లని అరువిమ్మని అడుగు" అన్నాడు వ్రూమ్. అతని గొంతులో వ్యంగ్యం తొంగిచూసింది.

ఈషా మొహం మళ్లీ వేలాడేసింది. నాకు మాత్రమే, ఆమె కళ్లల్లో తడి కనిపించింది. తన పర్సులోంచి టిస్యూపేపర్ తీసుకుని, లిప్‌స్టిక్‌ని తుడుచుకుంటున్నట్టు నటిస్తూ, కళ్లు తుడుచుకుంది.

"నేనసలు ఈ పెళ్లికి సిద్ధంగా లేను. ఒక్క నెలరోజుల్లో నేను ఒకరికి భార్యనయిపోతాను. ఓ, గాడ్! చిన్నపిల్లలు నన్ను 'ఆంటీ' అని పిలుస్తారు!"

నాలుగు వారాల్లో ప్రియాంక పెళ్లి చేసుకోవటం వల్ల వచ్చే లాభ-నష్టాల గురించి అందరూ చర్చించుకున్నారు. ఒకసారి భర్తని ఎన్నుకున్నాక త్వరగా పెళ్లి చేసుకోవటంలో అంత తప్పేమీలేదని దాదాపు అందరూ అభిప్రాయపడ్డారు. వాళ్లందరికీ నా గురించి ఎంత మాత్రం పట్టలేదన్నది, వేరే విషయం అనుకోండి!

అందరూ ఇలా మాట్లాడుకుంటూండగానే సిస్టమ్స్ మనిషి మా ఫోన్ల విషయం చూడటానికి మళ్లీ వచ్చాడు.

"ఇక్కడ ఏమయింది?" అన్నాడతను బల్లకిందనించి. "ఎవరో వైర్లని గట్టిగా పక్క లాగేసినట్టుందే?" అన్నాడు.

"నాకు తెలీదు. మళ్లీ కనెక్షన్ దొరుకుతుందేమో కొంచెం ప్రయత్నించండి." అన్నాను.

ప్రియాంక వాళ్ల అమ్మ - ఆమె నా గురించి 'పనికిమాలిన కాల్‌సెంటర్ కుర్రాడు' అన్న మాటలు - నా బుర్రలో గింగురుమనసాగాయి. ప్రియాంక, వాళ్లమ్మకి నా గురించి ఉన్న అభిప్రాయం నాకు చెప్పటం గుర్తొచ్చింది. అది జరిగి ఎన్నో రోజులవలేదు. మోచా కేఫ్‌లో మేం కలుసుకున్నాం. మేం విడిపోయే ముందు కలుసుకున్న ఆఖరి కలయికల్లో అది కూడా ఒకటి.



# # 18

## గతంలో నేనూ ప్రియాంకా కలుసుకున్న సందర్భాలు-IV

*మోచా కేఫ్, గ్రేటర్ కైలాష్ I*

*ఐదు నెలల క్రితం.*

మేమిద్దరం పోట్లాడుకోకుండా ఉంటేనే కలుసుకోవాలని అనుకున్నాం. ఒకర్నొకరు తప్పు పట్టటం, వ్యంగ్యంగా వ్యాఖ్యానించుకోవటం, విమర్శించుకోవటం, ఇలాంటివేమీ చెయ్యమని ఒకరికొకరం మాటిచ్చుకున్నాం. మళ్లీ తను ఆలస్యంగా వచ్చింది. దిక్కులు చూస్తూ, మెనూకార్డు తెరుస్తూ, మూస్తూ కూర్చున్నాను. మోచాలో అలంకరణంతా అరబ్బుదేశాల్లోలా ఉంటుంది. హుక్కాలూ, ముఖమల్ దిళ్లూ, రంగుటద్దాల్లో దీపాలూ, అంతటా కనిపిస్తాయి. చాలా బల్లల దగ్గర జంటలు కూర్చున్నారు. ఒకరిచేతులొకరు పట్టుకుని, ప్రేమలో నిండా మునిగిపోయినట్టే కనిపించారు. అబ్బాయిలు ఏం మాట్లాడినా అమ్మాయిలు నవ్వుతున్నారు. అబ్బాయిలు మెనూలో ఉన్నవాటిలో, అన్నిటికన్నా ఖరీదైన పదార్థాలకే ఆర్డరిస్తున్నారు. ఉన్నట్టుండి ఇద్దరి కళ్లూ కలుసుకోవటం, ఇకిలించుకోవటంగా ఉంది! వాళ్ల ఆనందమంతా వాళ్లిద్దరూ కలిసుండటమే అన్నంత ఉషారుగా ఉన్నారు. అబ్బాయి, అమ్మాయిల మధ్య సంబంధం ఏర్పడిన కొత్తలో ఉండే పిచ్చి భ్రమలు : అవి ఎంత అద్భుతంగా ఉంటాయో కదా?

నా జీవితం అంత ఆనందంగా లేనేలేదు. మొదటి విషయం, నా గర్ల్‌ఫ్రెండ్, నేనింకా ఆమెని అలా పిలవటం సబబైతే, టైముకి రాలేదు. అదీగాక, నన్ను ఎలాగైనా వదిలించుకోవాలని ప్రయత్నిస్తోందని నేను గ్రహించాను. మేమిద్దరం ఈమధ్య ఒకరికొకరం చేసుకున్న ఫోనుకాల్సు పదింటిలో ఎనిమిదిసార్లు ఎవరో ఒకరం మాటల మధ్యలో ఫోన్ పెట్టెయ్యటం జరిగింది.

నేను ఈరోజు పగలంతా నిద్రపోలేదు. మామూలుగా అది ఎవరికీ పెద్ద సమస్య కాకపోవచ్చు, కానీ రాత్రంతా మేలుకుని పనిచేసే నాకు అది కొంచెం ఇబ్బందిగానే ఉంది. నా ఉద్యోగం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. బక్షీ నా ఒంట్లో ఉన్న రక్తాన్ని ఆఖరి బొట్టు దాకా పీల్చెయ్యాలని శపథం పట్టినట్టున్నాడు. అతనన్నది నిజమేనేమో - జీవితంలో పైకెళ్లటానికి అవసరమైన తెలివితేటలూ, చాకచక్యమూ, మేనేజర్‌కి ఉండవలసిన నాయకత్వ లక్షణాలూ నాలో లేవేమో! ప్రియాంక వాళ్లమ్మ అన్నమాటకూడా నిజమే అయుంటుంది - ఆవిడ కూతురు దమ్మిడీకి పనికిరాని వాడితో తిరుగుతోంది!

నేనీ ఆలోచనలతో సతమతమౌతూండగా ప్రియాంక వచ్చింది. అప్పుడే జుట్టు

కత్తిరించుకున్నట్టుంది. నడుందాకా ఉండే జుట్టు, ఇప్పుడు భుజాల కిందికి కొద్ది అంగు[illegible] మాత్రమే ఉంది. నాకు తన పొడుగాటి జుట్టంటే చాలా ఇష్టం, కానీ నా మాట త[illegible] వినిపించుకోదు. ఎవరినైనా మాట వినేట్టు చెయ్యగల నాయకత్వపు లక్షణాలు నాలో [illegible] ముందే చెప్పాను కదా! అయినా ప్రియాంక జుట్టు ఇంకా అందంగానే ఉంది. తెల్లరంగు [illegible] టాప్, పొడుగ్గా ఉన్న లేత ఊదారంగు స్కర్టు వేసుకుంది. స్కర్టు చివర్లు ముడతలు ముడ[illegible] ఉన్నాయి. మెడలో సన్నటి వెండిగొలుసూ, దానికి అతిచిన్న పెండెంట్‌లో ప్రపంచంలో[illegible] చిన్నదైన వజ్రం పొదగబడి ఉంది. నేను ఆలస్యానికి అభ్యంతరం చెపుతున్నవాడిలా [illegible] వాచీకేసి చూసుకున్నాను.

"సారీ, శ్యామ్!" అంది అతిపెద్ద గోధుమరంగు బ్యాగ్‌ని బల్లమీద పెడుతూ. [illegible] హెయిర్‌కట్ చేసే గాడిద ఎంతసేపు కత్తిరించాడో! నేను త్వరగా వెళ్లాలని చెపుతూనే ఉ[illegible]

"ఏం ఫరవాలేదు. హెయిర్‌కట్ నాకన్నా ముఖ్యమే కదా!" అన్నాను గొంతులో [illegible] భావమూ కనిపించనీయకుండా.

"మనం వ్యంగ్యంగా మాట్లాడకూడదనుకున్నట్టున్నాం! పైగా, నేను సారీ క[illegible] చెప్పానే," అంది.

"అవును. అరగంట ఆలస్యానికి ఒక సారీ చెప్పటం సబబే. అసలు, ఒక రెండు గం[illegible] పాటు ఫేషియల్ కూడా చేయించుకుని రా. మళ్లీ వచ్చి నాలుగుసార్లు సారీ చెప్పవ్చు!"

"శ్యామ్, ప్లీజ్! నేను ఆలస్యంగా వచ్చానని నాకు తెలుసు. మనం పోట్లాడుకోకూ[illegible] అనుకున్నాం. హెయిర్‌కట్ చేయించుకోటానికి నాకు శనివారం తప్ప వీలుపడదు."

"నేను నిన్ను జుట్టు పొడుగ్గా ఉంచుకోమన్నాను," అన్నాను.

"చాలారోజులు అలాగే ఉంచుకున్నా కదా! కానీ దానికి సేవ చెయ్యటం చాలా [illegible] శ్యామ్! సారీ, కానీ ఎప్పుడైనా నువ్వు కూడా నా ఇబ్బందుల్ని అర్థం చేసుకోవాలి. నా [illegible] నాకే చాలా విసుగనిపించింది. దాన్ని ఏం చెయ్యాలో తెలీలేదు. ఆ దిక్కుమాలిన పొడు[illegible] జుట్టుకి నూనె రాయటానికే గంట పట్టేది. ఈ ఢిల్లీ వేసవిలో అది చాలా ఉక్కపోస్తుంది[illegible]

"సర్లే!" అన్నాను విసుగ్గా. మెనూకార్డుని చూస్తూ, "ఏం కావాలి?" అని అడిగాను[illegible]

"నా శ్యామ్ మంచి మూడ్‌లోని రావటం కావాలి," అని నాచెయ్యి పట్టుకుంది. [illegible] మేము వేళ్లు కలపలేదు.

'నా' శ్యామ్! అయితే నామీద ఇంకా ఇష్టం ఉందన్నమాట, అయినా అమ్మా[illegible] తియ్యగా మాట్లాడటం బాగా తెలుసు, అనుకున్నాను.

"హుఁ..." అంటూ పెద్ద నిట్టూర్పు విడిచాను. ఆమె నాతో సంధి చేసుకో[illegible] ప్రయత్నిస్తూంటే, నేను కూడా సహకరించాలి! "మనం వీళ్లు చేసే స్పెషల్ మాగీ [illegible] తిందాం," అన్నాను.

"మాగీయా? ఇంతదూరం నువ్వొచ్చింది, మాగీ తినటానికా?" అని మెనూకార్డు[illegible]



[illegible]దగ్గర్నించి తీసుకుంది. "పైగా ఇది చూడు, మాగీకి తొంభై రూపాయలుట!" చివరి వాక్యం గట్టిగా అనేసరికి మిగతా బల్లల దగ్గరున్న వాళ్లూ, కొందరు వెయిటర్లూ మాకేసి చూశారు.

"ప్రియాంకా, ఇప్పుడు మనం సంపాదించుకుంటున్నాం. ఆమాత్రం ఖర్చుపెట్టగలం," అన్నాను.

"చాక్లెట్ కేకూ, ఐస్‌క్రీమూ తెప్పించు. కనీసం అవి ఇంటి దగ్గర దొరకనివి," అంది.

"నాకేం కావలిస్తే అది తెప్పించమనీ, తింటాననీ నాతో అన్నట్టున్నావు?" అన్నాను.

"అన్నాను, కానీ మాగీ?" అని మొహం చిట్లించింది. ఆమె ముక్కుపుటాలు చిన్నవయాయి. ఆమె మొహం అలా అవటం నేనింతకు ముందుకూడా చూశాను, అందుకే నువ్వు ఆపుకోలేకపోయాను. నేను ఆమె కోపంనుంచి తప్పించుకునేందుకు బ్రౌనీ ఆర్డరిచ్చాను.

వెయిటర్ చాక్లెట్ కేక్ తెచ్చి ప్రియాంక ముందు పెట్టాడు. ఒక పెద్ద చాక్లెట్ కేక్ ముక్కమీద వెనీలా ఐస్‌క్రీమ్ ముద్ద పడిపోకుండా ఉంచి, దానిమీద సగం లీటరు చాక్లెట్ సాస్ ఒంపి ఉంది. అది ఒక పళ్లెంలో పెట్టి అందించిన హార్ట్ అటాక్! ప్రియాంక రెండు స్పూన్లు తిని, దాన్ని నావైపు నెట్టింది.

"నన్ను చూడు, ఆవులాగ ఎలా తింటున్నానో!" అంది.

"మీ అమ్మతో మనసు విప్పి మాట్లాడావా?" అన్నాను.

ప్రియాంక పెదవుల అంచులకి అంటుకున్న చాక్లెట్‌ని టిస్యూతో తుడుచుకుంది. అక్కడికక్కడే తనని ముద్దుపెట్టుకోవాలనిపించింది. కానీ, సంకోచించాను. ప్రేమలో ఉన్నప్పుడు అలా సంకోచపడితే, ఎక్కడో ఏదో లొసుగు ఉందన్నమాటే.

"నేనూ మా అమ్మా మామూలుగా మనుషుల్లా మాట్లాడుకోలేం. నేను నీ గురించీ, పై చదువులు చదవాలన్న నా కోరిక గురించీ మాట్లాడాలని ప్రయత్నించాను. అది చాలా మామూలుగా సాగవలసిన సంభాషణలాగే కనిపిస్తోంది కదూ?"

"ఇంతకీ ఏం జరిగింది?"

"ఏడు నిమిషాల్లో ఇద్దరం ఏడుపు లంకించుకున్నామని చెపితే నమ్మగలవా?"

"మీ అమ్మ విషయంలో నమ్మగలను. ఆవిడ ఇంతకీ ఏమంది?"

"నీకు తెలియకపోవటమే మంచిది."

"లేదు, నాకు తెలుసుకోవాలనుంది."

"ఆవిడకి నువ్వు ముమ్మాటికీ నచ్చలేదుట. ఎందుకంటే నువ్వింకా జీవితంలో స్థిరపడలేదట. అంతేకాదు, నీతో తిరగటం మొదలుపెట్టినప్పట్నించీ నేను మారిపోయానుట. ఏమాత్రం ప్రేమా, ఆపేక్షా లేని బండరాయిలా మారిపోయానుట."

"ప్రేమలేకుండానా? ఏమిటా మాటలు...?" అని అరిచాను. నా మొహం కందగడ్డలా అయింది. "నేను నిన్ను ఏ విధంగా మార్చేశానుట, చెప్పమను?"

ప్రియాంక అన్న రెండో వాక్యం నన్ను కత్తిపోటు తిన్నట్టు బాధపెట్టింది.

అలాగే 'స్థిరపడలేదు' అనే ముద్రని కూడా నేను భరించలేకపోయాను. కానీ అం కొంత నిజం ఉంది. కానీ ప్రియాంకని ప్రేమా, ఆపేక్షా లేకుండా మార్చేశానన్న నింద నామీద ఎలా వేసింది?

ప్రియాంక ఏమీ అనలేదు. ఆమె మొహం వాడిపోయింది, నాకు వెక్కిళ్లు వినిపిం ఇది మరీ బావుంది! అవమానం జరిగింది నాకు, నేను ఏడవాలి. కానీ ఇలాంటి అప్పుడు అమ్మాయిలే ఏడిస్తే బావుంటారనుకుంటా.

"ప్రియాంకా, మీ అమ్మ పిచ్చిది..." అన్నాను.

"కాదు, ఆవిడ పిచ్చిది కాదు. నీవల్ల కాదు కానీ, నేను మాత్రం మారటం నిజమే. బ వయసు ప్రభావం కావచ్చు. ఆవిడ దాన్ని అర్థం చేసుకోకుండా, నీ సాంగత్యం వ పొరబడుతోంది. మేమిద్దరం ఎంతో ప్రేమగా ఉండేవాళ్లం. ఇప్పుడావిడకి నేనం నచ్చటం లేదు," అంటూ ప్రియాంక పెద్దగా ఏడుపు లంకించుకుంది. కేఫ్‌లో ఉన్నవాళ్ల నేను నా గర్ల్‌ఫ్రెండ్‌ని మోసం చేశాననీ, మరో అమ్మాయికోసం తనని మధ్యలో వదిలేస్తు అనుకుని ఉంటారు. మిగతా బల్లల దగ్గర కూర్చున్న అమ్మాయిల కళ్లు నాతో, 'మీ మ ఎంత చెడ్డవాళ్లు!' అన్నాయి.

"ఊరుకో, ప్రియాంకా! ఆవిడకేం కావాలిట? అసలు నాతో నిజం చెప్పు. కావాలి?" అన్నాను.

ప్రియాంక తల అడ్డంగా ఆడించి మౌనంగా ఉండిపోయింది.

అలా తను చేసినప్పుడల్లా నాకు పిచ్చెక్కినట్టుంటుంది. ఒక్కోసారి ఉగ్రవాదుల చేత కక్కించటం కన్నా, ఆడవాళ్ల చేత నోరువిప్పి మనసులో మాట చెప్పించటం చాలా

"నాతో మాట్లాడు, ప్లీజ్!" అన్నాను ఆమె ప్లేట్లో నీరుకారిపోయిన ఐస్‌క్రీమ్‌ని చూస్తూ.

చివరికి ఆమె నోరువిప్పి మాట్లాడింది, "నేనావిడని ప్రేమిస్తున్నానని రుజువు చే తను నాకోసం ఎంపిక చేసిన అబ్బాయినే పెళ్లి చేసుకుని ఆవిణ్ణి సంతోషపెట్టాలి."

"మరి, నీకేం కావాలి?" అన్నాను.

"నాకు తెలీదు!" అంది టేబుల్‌క్లాత్ వేపు చూస్తూ.

ఏమిటి ప్రియాంక ఉద్దేశం? అనుకున్నాను. నాలుగేళ్లు ఆమెతో కలిసి ఉన్నందు దక్కే ఫలితం, "నాకు తెలీదు" అనే జవాబా?

"నువ్వు నన్ను వదిలించుకోవాలని చూస్తున్నావు, కదా? నీ తల్లిదండ్రుల పనికిమాలిన వాణ్ణని అనుకుంటున్నందుకేగా?"

"అదేం కాదు, శ్యామ్. మా అమ్మ మా నాన్నని పెళ్లి చేసుకున్నప్పుడు ఆయన



ఒక ప్రభుత్వోద్యోగి. కానీ ఆయన మంచివాడని తోచటంతో ఆవిడ ఒప్పుకుంది. ఆవిడ చెల్లెళ్లు ఇంకా ఎక్కువ చదువుకుని, మంచి ఉద్యోగాలు చేస్తున్నవాళ్లని పెళ్లి చేసుకున్నారు. ఇవాళ వాళ్లు ఆవిడకన్నా డబ్బున్నవాళ్లు, నా గురించిన ఆందోళన ఆవిడకి కలగటానికి అదే కారణం. ఆవిడ నాకు అమ్మ. నాకేది మంచిదో ఆవిడకి తెలియకుండా ఉండదు. నాకు కూడా మంచి ఉద్యోగంలో స్థిరపడ్డ అబ్బాయిని చేసుకోవాలనుంది."

"అయితే మన మధ్య ఏర్పడిన ఈ ఒత్తిడికి మీ అమ్మ మాత్రమే కారణం కాదు, నువ్వు కూడా కారణమే."

"ఇద్దరు విడిపోవటానికి ఒకే ఒక కారణం ఎప్పుడూ ఉండదు. దానికి ఎన్నో కారణాలుంటాయి. నువ్వు నీ గురించి ఏమైనా చెపితే వినిపించుకోవు. వ్యంగ్యంగా మాట్లాడతావు. నా కోరికలేమిటో నీకు తెలీదు. నీ ఉద్యోగంమీద దృష్టి ఉంచమని నేనెప్పుడూ నీకు చెపుతూనే ఉంటానా లేదా?"

"నువ్వు ముందు పో ఇక్కణ్ణుంచి!"

నేను గొంతు పెంచేసరికి పక్కనే కూర్చున్నవాళ్లు మాకేసి చూశారు. మోచాలో ఉన్న అమ్మాయిలందరూ నేను పురుషాధిక్యత కనబరచే వెధవనని నమ్మి ఉంటారు.

ప్రియాంక మళ్లీ కన్నీళ్లు కార్చబోయింది. కానీ అందరూ మా వైపే చూస్తున్నారని గమనించి, తనని తాను అదుపులో పెట్టుకుంది. టిస్యూతో కళ్లు తుడిచేసుకుని, మళ్లీ ఏం జరగనట్టు మొహం పెట్టింది.

"శ్యామ్! ఈ ధోరణే! ఇంట్లో మా అమ్మ నన్ను అర్థం చేసుకోలేకుండా ఉంది. బైటేమో నువ్వు అర్థం చేసుకోవు. నువ్వెందుకిలా తయారయావు, శ్యామ్! నేను మొదటిసారి కలిసిన శ్యామ్ వేరు, అతను ఎప్పుడూ సంతోషంగా ఉండేవాడు," అంది, చాలా కష్టం మీద గొంతుని అదుపులో పెట్టుకుంటూ.

"నాకేమీ అవలేదు. నీకే నాలో రోజుకొక తప్పు కనిపిస్తోంది. నా బాస్‌తో వేగలేకుండా ఉన్నా, ఎలాగోలా సంతోషంగా కాలాన్ని నెట్టుకొస్తున్నారు. నీకేమయింది? నువ్వు ట్రక్కుడ్రైవర్లు తినే ధాబాల్లో తినేదానివి. ఇప్పుడు హఠాత్తుగా నీ అవసరాలు తీర్చటానికి ఎన్ఆర్ఐ కార్డియాక్ సర్జన్ కావాల్సి వచ్చాడా?"

మేమిద్దరం ఒకరికేసి ఒకరం రెండు సెకన్లపాటు చూసుకున్నాం.

"ఓకే! నాదే తప్పు అదే కదా రుజువు చేద్దామని చూస్తున్నావు? నేను అయోమయంలో ఉన్నాను, స్వార్థపరురాలిని, నా మనస్తత్వం చాలా నీచమైంది, అంతేనా?" అంది.

నేనామెకేసే చూశాను. ఈ మనిషినీ, ముక్కుపుటాలు పెద్దవిచేసి మాట్లాడటాన్నీ, నాలుగేళ్లపాటు ప్రేమించానని నమ్మలేకపోయాను. ఇప్పుడు, ఆమె చెప్పిన మాటకి ఎదురు చెప్పకుండా నాలుగువాక్యాలు కూడా మాట్లాడలేకపోతున్నాను.

నేను నిట్టూర్చి, "ఇవాళ వాదనలూ, తప్పుపట్టడాలూ, వ్యంగ్యోక్తులూ అం[illegible] అనుకున్నాను. కానీ అవన్నీ ఇద్దరూ చక్కగా చేశాం!"

"నాకు నువ్వంటే చాలా ఇష్టం," అంది నా చెయ్యి పట్టుకుని.

"నాకు కూడా. కానీ జీవితంలో మిగతా విషయాల గురించి కూడా మనం ప[illegible] కోవాలనుకుంటాను."

బిల్లు తెమ్మని చెప్పి, వాతావరణం, ట్రాఫిక్, కేఫ్‌లో ఉన్న అలంకరణలూ, ఈ వి[illegible] గురించి పైపై మాటలు మాట్లాడుకున్నాం. మేము చాలా ఎక్కువ మాట్లాడాం కానీ, ఆలో[illegible] పంచుకోలేదు.

"సాయంత్రం తీరిగ్గా ఉంటే నాకు ఫోన్ చెయ్యి," అన్నాను, బిల్లు చెల్లించి, వెళ్ల[illegible] లేస్తూ.

పరిస్థితి ఇలా తయారైంది : ఫోన్ చెయ్యమని అడగాల్సి వస్తోంది. మునుపట్లో [illegible] గంటసేపు కూడా మేం ఎస్ఎమ్ఎస్‌లో, ఫోనుకాల్సో చేసుకోకుండా గడిచేది కాదు.

"ఓకే! లేకపోతే, నేను నీకు ఎస్ఎమ్ఎస్ ఇస్తాలే," అంది ఆమె. ఇంకొకసారి మాట్లా[illegible] కన్నా ఎస్ఎమ్ఎస్ పంపడం సులభం అనిపించి ఉండచ్చు.

మేం మర్యాదకోసం కావలించుకున్నాం, అందులో ఒకర్నొకరు తాకినట్టు అనిపించ[illegible] ముద్దుపెట్టుకోవటం ఆ స్థితిలో అసంభవం అనిపించింది.

"అలాగే. నీ దగ్గర్నించి మెసేజెస్ అందుకోవటం నాకెప్పుడూ ఇష్టమే," అన్నా[illegible]

మళ్లీ వ్యంగ్యం! అబ్బ! ఈ జన్మలో నాకు బుద్ధి వచ్చేట్టు లేదు!



# # 19

ట్యూబ్‌లైట్లతో వెలిగిపోతున్న డబ్ల్యుఎస్‌జి ఆఫీసుకి నా మనసు తిరిగి చేరుకోవటంతో హైదాకేఫ్, అరేబియన్ నైట్స్ లాంటి రంగురంగుల అలంకరణలూ మాయమయాయి. టైమెంతయిందోనని చూశాను, తెల్లవారుజాము 2:00 అయింది. నేనలా కొంచెం నడిచివద్దామని లేచాను. ప్రియాంక అమ్మ గురించి ఆలోచించటం, మిగతా అమ్మాయిలు ప్రియాంక పెళ్లి గురించి మాట్లాడటం - ఈ రెండిట్లో నాకేది ఎక్కువ చిరాకు పుట్టిస్తోందో నాకే తెలీలేదు. మిలిటరీ అంకుల్ కూర్చున్న గది మూలకి వెళ్లాను. ఇద్దరం మౌనంగా పలకరించుకున్నాం. కంప్యూటర్ స్క్రీన్‌కేసి చూశాను. దానిమీద జంతువుల బొమ్మలు కనిపించాయి, చింపాంజీలూ, ఖడ్గమృగాలూ, సింహాలూ, జింకలూ.

"వీళ్లే మీ ఖాతాదార్లా?" అని నేను వేసిన హాస్యంలేని జోకుకి నేనే నవ్వుకున్నాను.

మిలిటరీ అంకుల్ నన్నుచూసి చిరునవ్వు నవ్వాడు. ఎప్పుడోగాని ఆయన అలాంటి మంచి మూడ్‌లో ఉండడు.

"ఈ ఫొటోలు నేను జూలో తీసినవి. వీటిని నా మనవడికి పంపించటానికి స్కాన్ చేశాను."

"బావుంది. మీ మనవడికి జంతువులంటే ఇష్టమా?" అంటూ చింపాంజీని చూడటానికని ముందుకి వంగాను. దానిలో నాకు బక్షీ పోలికలు కొట్టొచ్చినట్టు కనిపించాయి!

"అవును, వీటిని మా అబ్బాయికి ఈమెయిల్ చేస్తున్నాను. కానీ మన ఈమెయిల్స్‌లో నాలుగు మెగాబైట్లకన్నా ఎక్కువ పంపటానికి లేదు, అదే ఇబ్బందిగా ఉంది."

సిస్టమ్స్ మనిషి ఫోన్లని సరిచేసేదాకా ఆఫీసులో నాసీటుకి వెళ్లబుద్ధవకపోవటం వల్లే, అంకుల్‌కి సాయం చేద్దామని అనుకున్నాను.

"ఊం... ఇవి పెద్ద ఫైల్సు," అన్నాను ఆయన మౌస్‌ని చేతిలోకి తీసుకుంటూ. "వీటిని 'జిప్' చెయ్యటానికి ప్రయత్నించి చూస్తాను. దానివల్ల ఫొటోలని కుదించటం పెద్దగా వీలవక పోవచ్చు బహుశా. మరో మార్గం ఉంది, వాటి రిజల్యూషన్ తగ్గించవచ్చు. లేదా మీరు కొన్ని జంతువుల ఫొటోలని పంపించటం మానెయ్యాలి," అన్నాను.

మిలిటరీ అంకుల్ వాటి రిజల్యూషన్‌ను ఎక్కువగానే ఉంచటానికే నిశ్చయించుకున్నాడు. అందుకని జింకల్నీ, నీటిగుర్రాలనీ వదిలేద్దామని అనుకున్నాం. ఆయన మనవడికి అవంటే పెద్ద ఇష్టం లేదని అన్నాడు.

"చాలా థాంక్స్, శ్యామ్!" అన్నాడు అంకుల్, నేను కంప్యూటర్‌లో 'సెండ్' నొక్కగా నేను ఆయనకేసి చూశాను, నిజంగానే ఆయన మొహంలో కృతజ్ఞతాభావం కనిపించింది. కోడలిమీద మరీ ఎక్కువ పెత్తనం చెలాయించాడనే కారణంతో ఆయన్ని బైటికి తరిమేశా నేను నమ్మలేకపోయాను. రాధిక ఒకసారి నాకు అలాగని చెప్పింది.

"యూ ఆర్ వెల్‌కమ్!" అన్నాను. ఇంతలో వ్రూమ్ నన్ను రమ్మని సైగ చెయ్య చూశాను. ప్రియాంక పెళ్లి గురించిన మాటలు అయిపోయే ఉంటాయని ఆశిస్తూ, నా దగ్గరకి వచ్చేశాను.

"బక్షీ మనకి ప్రపోజల్ కాపీ పంపాడు," అన్నాడు వ్రూమ్.

నేను నా కంప్యూటర్ దగ్గర కూర్చుని, ఈమెయిల్‌లో ఇన్‌బాక్స్ తెరిచాను. బక్షీ పం ఈమెయిలు ఉంది.

ఫోన్లు ఇంకా బాగవలేదు. సిస్టమ్స్ మనిషి కొత్త వైర్లు తీసుకురావటానికి తన విభాగ వెళ్లాడు.

"ఏ తెల్లతోలుగాళ్లకి నంగిరినంగిరిగా మెయిల్స్ పంపాడో చూద్దామా?" వ్రూమ్ గొం ఉద్రిక్తంగా మారింది.

ముందుగా అతను ఎవరికి పంపాడో చూడటానికి మెయిల్ తెరిచాను. బోస్టన్‌లో వెస్టర్న్ కంప్యూటర్స్‌లోని ముఖ్యమైన వాళ్లందరి పేర్లూ ఉన్నాయి : సేల్స్ మేనేజర్, మేనేజర్, నిర్వహణ అధికారి, ఇంకా చాలామంది పేర్లు. మా ఖాతాదార్లందరికీ బక్షీ ఈమెయిల్‌ని పంపాడు. బూతుచిత్రాల నాయకుడికన్నా యితనికే జనాల్ని ఎలా ఆకర్షిం బాగా తెలుసునని నాకనిపించింది.

"అతను అందరికీ కాపీ పంపాడు. 'టు' అనే చోట బోస్టన్‌లోని సీనియర్ మేనేజ్‌మెం అనీ, ఆ తరవాత మొదటి కాపీ మనదేశంలో ఉన్న సీనియర్ మేనేజ్‌మెంటుకీ, పంపా అన్నాను.

"కానీ పాపం ఎందుకనో మనకి పంపటం మర్చిపోయాడు. బక్షీ ద గ్రేట్!" అన్నా వ్రూమ్.

బక్షీ పంపిన ఆ చిన్న ఈమెయిల్‌ని పైకి చదివాను :

ప్రియమైన మీ అందరికీ,

వెస్టర్న్ కంప్యూటర్స్‌లోని కస్టమర్ సర్వీస్ తాలూకు హద్దులన్నిటినీ మార్చివేసే వెబ్ చాలాకాలంగా ఎదురుచూస్తున్న మీ అందరికోసం ఈ మెయిల్‌తోపాటు పంపుతు ఈరోజే దీన్ని తయారుచేసి ముగించాను. నేను బోస్టన్ వచ్చినప్పుడు దీన్ని గురించి మ వివరంగా మనం చర్చించుకోవచ్చని చెప్పటానికి సంతోషిస్తున్నాను..."

నేను వినిపించీ వినిపించకుండా ఈల వేశాను.

"బోస్టన్? ఈ గాడిద బోస్టన్‌కి ఎలా వెళ్తున్నాడట?" అన్నాడు వ్రూమ్.



అమ్మాయిలకి ఆ మాటలు వినిపించాయి.

"దేన్ని గురించి మాట్లాడుకుంటున్నారు?" అంది ప్రియాంక.

"బక్షీ బోస్టన్‌కి వెళ్లటం గురించి! మీ లేడీస్‌లో ఎవరైనా వెంట వెళ్తారా?" అన్నాడు వ్రూమ్.

"ఏమిటీ? అతను బోస్టన్‌కి దేనికి వెళ్తున్నాడు?" అంది ఈషా.

"మా వెబ్‌సైట్ గురించి మాట్లాడటానికి. బహుశా తనకోసం ఒక ట్రిప్ సంపాదించుకుని ఉంటాడు," అన్నాను.

"అసలిక్కడ ఏం జరుగుతోందర్రా? ఒకపక్క ఖర్చు తగ్గించుకోవాలని ఉద్యోగాల్లోంచి తీసేస్తున్నారు, మరోపక్క ఇడియట్స్‌ని అమెరికా పంపించటానికి వీళ్ల దగ్గర డబ్బుందా?" అని వ్రూమ్ తన స్ట్రెస్ బంతిని బల్లమీదికి విసిరేశాడు. అది కాస్తా పెన్‌స్టాండ్‌కి తగిలి, దాన్లోని వస్తువులన్నీ కింద పడ్డాయి.

"జాగ్రత్త!" అంది ఈషా విసుగ్గా. కొన్ని పెన్నులు ఆమెవైపుకి దొర్లాయి. ఆమె చేతిలో మొబైలుంది. బహుశా ఎవరికో ఫోన్ చెయ్యాలని ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నట్టుంది.

"వెర్రాసుపత్రి! ఈ కనెక్షన్స్‌ని అలాగే అనాలి. బోస్టనా?" అంది ప్రియాంక తల అడ్డంగా ఆడిస్తూ. ఆమె ఇంటర్నెట్‌లో ఏవో సైట్లు చూస్తోంది. ఆమె ఏ సైట్లు చూస్తోందో, అనుకున్నాను. పెళ్లి బట్టలు, అమెరికా జీవితం, లేక లెక్సస్ కార్ల సైటా?

నేను బక్షీ పంపిన ఈమెయిలు తీసేద్దామనుకునేంతలో వ్రూమ్ నన్ను ఆపాడు.

"ఆ డాక్యుమెంటు ఓపెన్ చెయ్యి. అతను పంపిన వెబ్‌సైట్ ఫైలుంది చూడు, దాన్ని తెరు ఒక్కసారి," అన్నాడు వ్రూమ్.

"అది మనం అతనికి పంపినదే, యూజర్ మాన్యువల్," అన్నాను.

"దాన్ని తెరిచావా?"

"లేదు, అవసరమేముంది?..."

"ఒకసారి తెరు దాన్ని," అతను గట్టిగా అనేసరికి ఈషా మాకేసి చూసింది. ఇంత అలస్యంగా ఆమె ఎవరికి ఫోన్ చేస్తోందా అనే నా ఆలోచనని చెదరగొడుతూ వ్రూమ్ గొంతు.

నేనా ఫైల్‌ని తెరిచాను. అది మా యూజర్ మాన్యువలే.

"ఇదిగో, ఇది మనం పంపిందే," అంటూ దాన్ని పైకి జరపసాగాను. ఆ మొదటిపేజీ చివరికి వచ్చేసరికి నా నోరు సగం తెరుచుకుంది, కొంత కంపరంవల్లా, కొంత ఏదైనా శాపనార్థం ఇవ్వాలనేందుకు సిద్ధమవుతూ.

వెస్టర్న్ కంప్యూటర్స్ ట్రబుల్ షూటింగ్ వెబ్‌సైట్
ప్రాజెక్ట్ వివరాలూ యూజర్ మాన్యువల్
కనెక్షన్స్ ఆఫీసు, ఢిల్లీ తయారుచేసినది,

సుభాష్ బక్షీ
మేనేజర్, కనెక్షన్స్

"నా మొహం లాగుంది, ఇదేనా మనం పంపిన వెబ్‌సైట్?" అన్నాడు వ్రూమ్ తను [illegible] పెన్నులని మళ్లీ బల్లమీదికి విసిరేస్తూ. ఒకటి వెళ్లి ఈషా ఒళ్లో పడింది. ఆమె ఈసరికి [illegible] నెంబరుకి ఇరవైసార్లు ఫోను చెయ్యాలని ప్రయత్నించి ఉంటుంది. ఆమె వ్రూమ్‌కేసి కోపంగా చూసి, ఆ పెన్నుని మళ్లీ అతనిమీదికి విసిరేసింది. అతని చూపులు నా కంప్యూటర్ తెర మీదుండటంతో, అతను ఆమెని పట్టించుకోలేదు.

నా మోనిటర్ మీద వేలితో గట్టిగా తడుతూ, "చూడు దీన్లో ఈ వెబ్‌సైట్ ఆ దొంగవెధవ బక్షీ తయారుచేసినట్టు ఉంది," అన్నాడు వ్రూమ్. "సరిగ్గా చూడు, పియానోకీ కంప్యూటర్ [illegible] తేడా తెలియని ఆ జడ్డి వెధవ, ఈ వెబ్‌సైట్‌నీ, మాన్యువల్‌నీ తయారుచేశాట్ట. అవును [illegible] తనే తయారుచేశాడు కదూ?" అన్నాడు.

వ్రూమ్ పిడికిళ్లు బిగించి బల్లని గుద్దాడు. ఒక రకమైన వెర్రికోపంతో బల్లమీద చేతుల్ని అటూ ఇటూ ఊపాడు. అన్ని పెన్నులూ నేలమీద పడిపోయాయి.

"నీకేమైంది?" అని ఈషా ఆ పెన్నుల వర్షం తనమీద పడకుండా కుర్చీని దూరంగా జరుపుకుంది. కనెక్షన్ కోసం ఫోన్‌ని కదుపుతూ, లేచి కాన్ఫరెన్సు గదిలోకి వెళ్లింది.

"మనం చేసిన పనిని తను చేసినట్టు చూపించుకున్నాడు, శ్యామ్! నీకర్థమైందా?" అంటూ నా భుజాలు పట్టి గట్టిగా కుదిపాడు.

నేను బక్షీ పంపిన మా మాన్యువల్, అదే బక్షీ మాన్యువల్‌కేసి, మొద్దుబారిపోయి చూడసాగాను. అవతలివారినుంచి పేరు కొట్టెయ్యటంలో ఈసారి బక్షీ తనని తానే మించిపోయాడు. నా తల తిరగసాగింది, ఊపిరి అందలేదు.

"ఇది చాలా ఘోరం! ఈ ఒక్క మాన్యువల్ కోసమే ఆరునెలలు కష్టపడ్డాం. అతను ఇంతగా దిగజారుతాడనుకోలేదు," అన్నాను ఫైల్ మూసేస్తూ.

"మరి ఇప్పుడు?"

"ఇప్పుడేమిటి? ఏం చెయ్యాలో నాకస్సలు తోచటంలేదు. నేను షాక్‌లో ఉన్నాను. అదీకాక, ఇప్పుడు ఉద్యోగంలోంచి తీసేస్తాడనే భయం ఒకటుంది..." అన్నాను.

"ఉద్యోగంలోంచి తీసేస్తాడా?" అని వ్రూమ్ లేచి నిలబడ్డాడు. "మనం దీనికోసం ఆరునెలలు కష్టపడ్డాం, మాన్! ఇంత జరిగాక మనని ఉద్యోగంలోంచి తీసేస్తాడనే భయంతో ఏమీ చెయ్యలేమని అంటున్నావా? ఈ పనికిమాలిన బక్షీగాడు నిన్ను కూడా దేభ్యంగాడిలా తయారుచేస్తున్నాడు! మిస్టర్, శ్యామ్! నువ్వు మౌస్‌ప్యాడ్‌లా మారిపోతున్నావు. రోజూ అందరూ నిన్ను వాడుకుంటున్నారు. ప్రియాంకా, అతన్నేమైనా చెయ్యమని చెప్పు. బక్షీగాడి ఆఫీసులో అతని చొక్కాకాలరు పట్టుకోమను!" అన్నాడు.

ప్రియాంక మాకేసి చూసింది. ఆ రోజు రాత్రి మా ఇద్దరి కళ్లూ కలుసుకోవటం అది రెండోసారి. ఆమె చూసిన చూపు, అదే చూపు, నన్ను కుంచించుకుపోయేలా చేసిన చూపు. ఆ చూపులో, నీమీద అరిస్తే మట్టుకు ఏం లాభం, అనే భావం.

ఆమె తల అడ్డంగా ఆడించి, వంకరనవ్వొకటి నవ్వింది. ఆ నవ్వు నాకు కంఠోపాఠమే - తనకి ముందే ఇలా జరుగుతుందని తెలిసినట్టు. నాకు ఆమె కాలరు పట్టుకుని జాడించాలనిపించింది. నీకోసం అవతల లెక్సస్ కారు వేచి ఉన్నప్పుడు, అలా చూడటం చాలా సులభం, అందామనిపించింది. కానీ నేనేమీ అనలేదు. బక్షీ చేసిన పని నన్ను చాలా బాధపెట్టింది. ఆ ఆరునెలలూ కష్టపడి పనిచేసినందుకు మాత్రమే కాదు, నాకు ప్రమోషన్•వచ్చే అవకాశం చేజారిపోయినందుకు. అంటే... ఊష్‌కాకి! అన్నమాట. ప్రియాంక కూడా వెళ్లిపోతోంది. కానీ ప్రస్తుతం నా చుట్టూ ఉన్నవాళ్లు నేను కోపం తెచ్చుకోవాలని ఎదురుచూస్తున్నారు. మీరు బాధపడుతున్నారని తెలిస్తే, మీరు బలహీనులని జనం అనుకుంటారు. ఎప్పుడూ మీరు ధైర్యంగా, మనోబలంతో ఉండాలనుకుంటారు, అంటే రగిలే కోపం అన్నమాట. నాలో బహుశా అది లేదేమో. అందుకే నేను టీమ్ లీడర్‌ని కాను. అందుకే నాకోసం ఆఫీసులో అమ్మాయిలెవరూ స్వీట్లు పంచిపెట్టరు.

"ఎక్కడున్నావు, మిస్టర్ శ్యామ్? ఈ ఈమెయిల్ అందుకున్న వాళ్లందరికీ మనం కూడా ఈమెయిల్ పంపించి అసలు సంగతి చెపుదాం," అన్నాడు వ్రూమ్.

"ఆవేశం తగ్గించుకో వ్రూమ్! పెద్ద హీరోలాగా ఏం ప్రవర్తించక్కరలేదు!" అని కోప్పడ్డాను.

"ఓ, అలాగా? మరైతే ఎలా ప్రవర్తించాలిట? పనికిమాలిన వెధవల్లా ప్రవర్తించాలా? చెప్పు, శ్యామ్! ఇలాంటి విషయాలలో నువ్వే కదా ఎక్స్‌పర్ట్‌వి?" అన్నాడు వ్రూమ్.

నాకు కోపం ముంచుకొచ్చింది. "నువ్వు ముందు నోరుమూసుకుని కూర్చో! ఏం చేద్దామని, నీ ఉద్దేశం? ఆ అమెరికన్లకి మరో మెయిలు పంపిద్దామనా? ఇక్కడ మనలో మనం కొట్టుకు చస్తున్నామని వాళ్లకి చెపుదామా? అలాచేస్తే వాళ్లు ఎవరి మాట నమ్ముతారనుకుంటున్నావు? వాళ్లని కలవటానికని బోస్టన్‌కి వెళ్లబోతున్నవాడి మాట నమ్ముతారా, లేక అనుకున్నది సాధించలేక నిరాశానిస్పృహలతో కొట్టుకుంటున్న ఒక ఏజెంటు, 'నేనే ఆ వెబ్‌సైట్ తయారుచేశానని,' చెపితే నమ్ముతారా? వరుణ్, కాస్త వాస్తవం ఏమిటో చూడు. నీ ఉద్యోగం ఊడటం తప్ప ఇంకేమీ జరగదు. బక్షీ అంటే మేనేజ్‌మెంటు - అతనే వ్యవహారాలన్నీ చూస్తున్నాడు, అంతే. అతను మేనేజ్ చేస్తున్నది తన కెరీర్‌ని, మనని కాదు," నేను ఆవేశంలో వాదిస్తూ రాధికని గమనించలేదు. ఆమె చేతిలో నీళ్ల బాటిలు పట్టుకుని నా పక్కకొచ్చి నిలబడింది.

"థాంక్స్" అని చప్పుడు చేస్తూ రెండుగుక్కలు తాగాను.

"ఇప్పుడు కాస్త నెమ్మదిగా ఉందా?" అంది రాధిక.

ఆమె ఇంకా ఏమైనా అనకముందే చెయ్యెత్తి ఆపాను. "దీన్ని గురించి నాకింకేమీ మాట్లాడాలని లేదు. ఇది మాకూ బక్షీకీ సంబంధించిన విషయం. జీవితాన్ని ఏ చీకూచింతా

లేకుండా గడిపేసే దారినపోయే దానయ్యలూ, దానమ్మలూ దీన్ని గురించి అభిప్రాయం వెలిబుచ్చటం నాకు నచ్చదు. అవును, నా బాస్ దుర్మార్గుడు. చాలామంది బాస్‌లు దుర్మార్గులే. అదేం పెద్ద పట్టించుకోవలసిన విషయం కాదు," అని కూర్చున్నాను. వ్రూమ్‌కేసి ఓసారి చూశాను. అతను కూడా కూర్చున్నాడు.

వ్రూమ్ ఒక నోటుబుక్కు తీసి దానిలో 2×2 గడిని గీశాడు.

"ఏమిటా పిచ్చిబొమ్మ?" అన్నాను.

"మొత్తం మీద బక్షీని నేను అర్థం చేసుకున్నాను. ఈ బొమ్మ సాయంతో వివరించనీ," అన్నాడు వ్రూమ్.

"నన్ను ఊరికే విసిగించకు, నాకా బొమ్మలూ-గిమ్మలూ ఏవీ వద్దు," అన్నాను.

"ఒకసారి నేచెప్పేది విను," అన్నాడు వ్రూమ్ ఆ గడిలో ఏదో రాస్తూ.

గడిలో అడ్డంగా ఉన్న గీత మీద 'మంచివాడు' అని రాశాడు. బాక్సులకి అటూ ఇటూ 'చెడ్డవాడు' అని రాశాడు. నిలువుగా ఉన్న గీతమీద 'చురుకైనవాడు' అనీ, 'బుద్ధిలేనివాడు' అనీ రాశాడు.

"ఓకే. బక్షీలాంటివాళ్ల గురించి నేను ప్రతిపాదించే సిద్ధాంతం ఇదీ," అంటూ వ్రూమ్ పెన్నుతో తను గీసిన గడిని చూపించాడు. "ఈ లోకంలో నాలుగు రకాల బాస్‌లు ఉంటారు. వాళ్ల తీరు రెండు కొలతలమీద ఆధారపడి ఉంటుంది : 1) వాళ్లు ఎంత తెలివైనవాళ్లు, బుద్ధిలేనివాళ్లు, అనే దానిమీదా 2) వాళ్లు మంచివాళ్లా, చెడ్డవాళ్లా అనే దాని మీదా. ఎంతో అదృష్టం ఉంటే తప్ప తెలివితేటలూ, మంచితనం, ఈ రెండు గుణాలూ ఉన్న బాస్ దొరకడు. ఇకపోతే, బక్షీ అతిప్రమాదకరమైనవాడు, కానీ మామూలుగా అందరు బాస్‌ల్లాంటివాడే. అతనికి బుద్ధిలేదన్న సంగతి మనందరికీ తెలుసు. కానీ అంతేకాక, అతను దుర్మార్గుడు." అన్నాడు వ్రూమ్ తన పెన్నుతో నాలుగు గళ్లనీ తట్టుతూ.

"బుద్ధిలేని దుర్మార్గుడు," అన్నాను.

"అవును. అతన్ని మనం తక్కువగా అంచనా వేశాం. అతను భయంకరమైన మనిషి. ఒక కళ్లులేని పాములాంటివాడు : నీకు దాన్ని చూస్తే జాలివేస్తుంది. అయినా సరే అది కరిస్తే విషం ఒంట్లోకి ఎక్కుతుంది. మనకి స్పష్టంగా కనిపిస్తూనే ఉంది, అతనికి బుద్ధిలేదు. అందుకే ఈ కాల్‌సెంటర్ ఇంత ఘోరంగా నడుస్తోంది. కానీ అతను దుర్మార్గుడు, తన బదులు మనందరం నష్టపోయేట్టు చూడటానికి చాలా జాగ్రత్త పడతాడు," అన్నాడు వ్రూమ్.

నేను తల అడ్డంగా ఆడించాను.

"చేసేదేమీ లేదు. విధి నా దారిలో ఒక దరిద్రుడిని అడ్డం పెట్టింది. ఇంకేం చెప్పమంటావు?" అని మొహం చిట్లించాను.

రాధ నా బల్లమీదనించి సీసా తీసుకుంటూ, "మీ ఇద్దరి మాటలకీ అడ్డం వస్తున్నందుకు సారీ, కానీ మీరు 'చీకూ చింతా లేకుండా జీవితాన్ని గడిపేవాళ్లు' అన్నది నా గురించి కాదు కదా? నా జీవితం అలా ఏమీ లేదు, ఫ్రెండ్స్! నిజంగానే అలా లేదు –"

"–నీ గురించి కాదు, రాధికా మేమన్నది. శ్యామ్ ఆమాట స్పష్టంగా నాగురించే అన్నాడు," అంది ప్రియాంక రాధికకి అడ్డువస్తూ.

"అబ్బ, వదిలిపెడుదురూ!" అని లేచి నిలబడ్డాను. ఈ విసిగించే మూకనించి తప్పించుకోవటానికనే బల్ల దగ్గర్నించి దూరంగా పోయాను. నేను అక్కణ్ణించి వెళ్తూ వ్రూమ్ అనేది విన్నాను : "ఈ బక్షీగాడి సంతోషాన్ని ఒక్కసారి పాడుచేసే అవకాశం దొరికితేచాలు, ఈ భూమ్మీద అందరికన్నా అదృష్టవంతుడినని అనుకుంటాను."

# # 20

నేను డబ్ల్యుఎఎస్‌జి బల్ల దగ్గర్నించి దూరంగా వెళ్లాను. నా మనసంతా ఇంకా చాలా గందరగోళంగా ఉంది. బక్షీని చిన్నచిన్న ముక్కలుగా నరికి ఢిల్లీ వీధుల్లో తిరిగే అన్ని ఊరకుక్కలకి వెయ్యాలనిపించింది. నేను కాన్ఫరెన్స్ రూమ్ దగ్గరకెళ్లాను. ఆ గది తలుపు మూసి ఉంది. తలుపు తట్టి కొన్ని సెకన్లు ఆగాను. లోపలంతా నిశ్శబ్దంగా అనిపించింది.

"ఈషా?" అంటూ తలుపు తెరవబోయాను.

ఈషా కాన్ఫరెన్స్ గదిలోని ఒక కుర్చీలో కూర్చుని ఉంది. ఆమె కుడికాలు మడిచి మరో కుర్చీమీద పెట్టి కూర్చునుంది. ఆమె మోకాలి కింద తగిలిన దెబ్బని చూసుకుంటోంది.

డబ్బారేకులు కత్తిరించే కత్తెరొకటి ఆమె చేతిలో ఉంది. దాని కొసలు రక్తంతో ఎర్రగా ఉన్నాయి. బల్లమీద ఉపయోగించిన బ్యాండ్ ఎయిడ్ ఒకటి కనిపించింది. ఆమె కాలికి అయిన గాయం నుంచి రక్తం వస్తోంది.

"ఏమయింది?" అన్నాను ఆమె దగ్గరకెళ్తూ.

ఈషా నావైపు చూసింది. ఆమె మొహంలో ఏ భావమూ లేదు.

"ఓ, హాయ్ శ్యామ్!" అంది శాంతంగా.

"ఇక్కడేం చేస్తున్నావు? అందరూ నీకోసం వెతుకుతున్నారు."

"ఎందుకు? నాకోసం ఎందుకు వెతుకుతారెవరైనా?"

"పెద్ద కారణమేమీ లేదనుకో. అయినా ఇక్కడేం చేస్తున్నావు నువ్వు? నీ గాయంనుంచి రక్తం కారుతోంది. బ్యాండేజి, లోషన్ ఏమైనా కావాలా?" అని చూపులు మరల్చుకున్నాను. రక్తం చూస్తే నాకు పొట్టలో తిప్పుతుంది. డాక్టర్లు ప్రతిరోజూ చికిత్స ఎలా చేస్తారో నాకు తెలీదు.

"లేదు, శ్యామ్! నాకిలాగే బావుంటుంది. లోషన్ వాడితే నెప్పి తగ్గిపోతుంది," అంది ఈషా.

"ఏమిటీ? కానీ అదే కదా కావల్సింది? నెప్పి తగ్గాలని నువ్వు అనుకుంటున్నావా లేదా?"

"లేదు," అని విషాదంగా నవ్వింది ఈషా. చేతిలోని కత్తెరతో గాయాన్ని చూపిస్తూ, "ఈ నెప్పి వల్ల నేను నా అసలు బాధని మర్చిపోతాను. నా అసలు బాధేమిటో నీకు తెలుసా, శ్యామ్?"

ఆ అమ్మాయి ఏమంటోందో నాకసలేమీ అర్థం కాలేదు. కానీ ఆ గాయాన్ని వెంటనే బ్యాండేజీతోనో కప్పకపోతే, ఇంతకుముందు నేను తిన్న చాక్లెట్ కేక్ వాంతి చేసుకుంటానని మాత్రం నాకు తెలుసు.

"ఉండు, స్టోర్‌రూమ్‌నించి ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ తెస్తాను."

"నా ప్రశ్నకి నువ్వు జవాబు చెప్పలేదు. నా అసలు బాధ ఏమిటి, శ్యామ్?"

"నాకు తెలీదు... ఏమిటది?" అన్నాను. ఆమె నున్నటి కాలిమీద కొత్తగా కారుతున్న రక్తాన్ని చూడలేక గాభరాపడుతూ.

"అసలు బాధ మనసుకి సంబంధించినది," అంది ఈషా.

"అవును," అన్నాను, చాలా తెలివిగా జవాబు చెపుతున్నట్టు. ఆమె పక్కనే మరో కుర్చీమీద కూర్చున్నాను.

"నీకెప్పుడైనా మానసికమైన బాధ కలిగిందా?"

"నాకు తెలీదు. నేను అన్నీ తేలిగ్గా తీసుకునే రకం. చాలా విషయాలు అసలు నన్ను కదిలించవు," అన్నాను.

"అందరూ బాధ పడతారు. ఎందుకంటే అందరి జీవితాల్లోనూ చీకటితో నిండిన పార్శ్వం ఒకటుంటుంది."

"చీకటిగా ఉండే పార్శ్వమా?"

"అవును, చీకటితో నిండిన పార్శ్వం – అంటే నీలో నీకిష్టంలేని ఒక విషయం, నీకు కోపం తెప్పించేదో, భయం కలిగించేదో : ఇదంతా మనలో ఉండే చీకటి. నీలోనూ అలాంటి చీకటి ఉందా, శ్యామ్?"

"ఓ, ఆ విషయం మనం మాట్లాడొద్దు. నాకలాంటివి ఎన్నో ఉన్నాయి – ఒక అరడజను చీకటి పార్శ్వాలు. నేను ఎన్నో చీకటి కోణాలున్న షడ్భుజాన్ని!" అన్నాను.

"ఎప్పుడైనా నీకు అపరాధభావం కలిగిందా, శ్యామ్? నిజంగా చాలా బలంగా పట్టి కుదిపే అపరాధభావం?" బలహీనమైన గొంతుతో అడిగింది ఈషా.

"ఏమైంది, ఈషా?" అన్నాను, ఎలాగోలా, ఆమె కాలికి అయిన గాయం కనపడకుండా మొహం మాత్రం కనిపించేట్టు సర్దుకుని కూర్చుంటూ.

"నేను నీకో విషయం చెబితే నన్ను తప్పుగా అర్థం చేసుకోకుండా ఉంటావా? అలా అని మాటిస్తావా?"

"తప్పకుండా. అయినా నేను ఇతరుల తప్పొప్పులు ఎంచటంలో అంత నేర్పు ఉన్నవాడినేం కాదులే."

"మోడలింగ్ ఛాన్స్ సంపాదించుకోవటానికి నేను ఒకరితో పడుకున్నాను," అంది నిట్టూరుస్తూ.

"ఏమిటీ?" అన్నాను, 'పడుకున్నాను' అనే మాటకి అర్థం ఒక క్షణంలో స్ఫురించింది. దాని అర్థం 'గుర్రుపెడుతూ నిద్రపోవటం' మాత్రం కాదు!

"అవును. నా ఏజెంటు ఆ మనిషికి మోడలింగ్‌తో సంబంధం ఉందని అన్నాడు. ఒక పెద్ద ఫ్యాషన్ షోలో పాల్గొనేందుకు నేను ఒకసారి అతనితో పడుకోవాల్సి వచ్చింది. నన్నెవరు బలవంత పెట్టలేదు. నేనే అలా చెయ్యాలని నిశ్చయించుకున్నాను. కానీ అప్పట్నించీ ఆ అపరాధభావం నన్ను పట్టుకుని వదలటం లేదు. ప్రతిక్షణం వెంటాడుతోంది! అదే తగ్గిపోతుందను కున్నాను గాని, పోవటం లేదు. ఆ బాధ చాలా భయంకరంగా ఉంది, నా కాలికి అయిన ఆ దెబ్బ దాంతో పోలిస్తే కితకితలు పెడుతున్నట్టుంది," అని ఈషా కత్తెరని తన గాయానికి తగ్గరగా తీసికెళ్లి, ఆ గాయం చుట్టూ ఉన్న చర్మాన్ని గీకటం మొదలుపెట్టింది.

"ఆపు ఈషా! ఏం చేస్తున్నావు?" అంటూ ఆ కత్తెరని ఆమె దగ్గర్నించి లాక్కున్నాను. "నీకేమైనా పిచ్చి పట్టిందా? నీకు ఏ టెటనసో, గాంగ్రీనో వస్తుంది. టీవీలో వాక్సిన్ ప్రకటనల్లో చూపిస్తారే, అలాంటి భయంకరమైనవన్నీ వస్తాయి."

"ఇది ఏమీ కాదు. అసలు ప్రమాదకరమైందేమిటో నేను చెపుతాను. నా దిక్కుమాలిన బుర్ర! నా బుర్రలో నాకు భ్రమ కలిగిస్తూ, నీలో మోడల్ అయేందుకు కావలసినవన్నీ ఉన్నాయని చెపుతుండే, ఆ గొంతు! ఆ మనిషి అంతా అయిపోయాక ఏమన్నాడో తెలుసా?"

"ఏ మనిషి?" అన్నాను, కత్తెరని బల్ల అవతలి అంచుకి తోసేస్తూ.

"నేను వాడితో పడుకున్నానే, వాడు, నలభైఏళ్ల డిజైనర్. నేను ర్యాంప్ మోడల్‌గా పనికిరాననీ, కారణం నేను మరీ పొట్టిగా ఉన్నాననీ నా ఏజెంటుతో చెప్పాడు," అంది ఈషా, గొంతు పెద్దది చేసి. అయినా ఆ గొంతులో దుఃఖం కూడా కనిపించింది. నాతో పడుకున్నప్పుడు ఆ వెధవకి ఆ సంగతి తెలీలేదా?" ఈషా ఏడవటం మొదలుపెట్టింది. అరిచే అమ్మాయి నయమా ఏడిచే అమ్మాయి నయమా అనేది నాకు తెలీదు. కానీ రెండు రకాల వాళ్లతోనూ ఎలా ప్రవర్తించాలో కూడా నాకు తెలీదు. నేను ఈషా భుజాలమీద చేతులు వేసి, తను నన్ను కావలించుకోవాలని అనుకున్నట్టయితే, రెడీగా ఉండాలని, అలా నిలబడ్డాను.

"ఆ ఊరకుక్క వెధవ, తరవాత చేసిన పనికి బదులుగా నాకు డబ్బు పంపించాడు," అంది వెక్కుతూ. "ఇది కూడా జీవితంలో భాగమేనని నా ఏజెంటుగాడు నాకు చెప్తాడు. అవును, జీవితంలో భాగమే - పనికిమాలిన మోడల్ ఈషా దిక్కుమాలిన జీవితంలో భాగమే. నా కత్తెర నాకిచ్చెయ్యి, శ్యామ్!" అంది ఈషా అరచెయ్యి చాస్తూ.

"లేదు, ఇవ్వను. చూడూ, ఇటువంటి పరిస్థితిలో ఏంచెయ్యాలో నాకు నిజంగానే తెలీదు. కానీ జరిగిందాన్ని మర్చిపో," అన్నాను. నేను చెప్పింది నిజమే; నాతో సెక్స్ కావాలని ఎవరూ కోరరు. అందుకని, అలా సెక్స్ కావాలని అడిగినవారితో పడుకున్నాక అపరాధభావం అనేది నాకు పూర్తిగా పరిచయంలేని విషయం.

"నన్ను చూస్తే నాకే అసహ్యం వేస్తోంది, శ్యామ్! చాలా అసహ్యం వేస్తోంది! నా మొహమంటే నాకసహ్యం. ఈ మొహాన్ని చూపించే వెధవ అద్దమంటే అసహ్యం. నేను మోడల్ అవగలనని అబద్ధాలు చెప్పినవాళ్లంటే నాకు రోత. వాళ్లని నమ్మినందుకు నామీద నాకే రోత. నా మొహాన్ని మార్చుకోవటం వీలవుతుందా?"

అందమైన అమ్మాయిల్ని అందవికారంగా తయారుచేసే ప్లాస్టిక్ సర్జన్లెవరూ నాకు తెలీదు. అందుకని మౌనంగా ఉండిపోయాను. తొంభై సెకన్ల తరవాత ఆమె ఏడుపు ఆపింది. మీరు పట్టించుకోకపోతే ఏ అమ్మాయికైనా ఏడుపు ఆపటానికి పట్టే సమయం అంతే. బ్యాగులోంచి టిస్యూ తీసి కళ్లు తుడుచుకుంది.

"వెళ్దామా? వాళ్లందరూ ఎదురుచూస్తూ ఉంటారు," అన్నాను. లేవటానికి ఆమె నా చెయ్యి పట్టుకుంది.

"నే చెప్పింది విన్నందుకు, థాంక్స్!" అంది ఈషా. వాళ్లు చెప్పిన మాటలు విన్నందుకు థాంక్స్ చెప్పాలని ఆడవాళ్లు మాత్రమే అనుకుంటారు.

# 21

ఈషా, నేనూ ఆఫీసులోకి వచ్చేసరికి, ఇంకా ప్రియాంక పెళ్లి గురించే చర్చలు జరుగుతూండడం నాకు రోత పుట్టించింది.

ఈషా మాట్లాడకుండా తన సీట్లో కూర్చుంది.

"ఎక్కడున్నావు ఇంత సేపు?" అన అడిగింది ప్రియాంక ఈషాని.

"ఇక్కడే ఉన్నానే. ఎవరికో ఫోన్ చెయ్యాలని అవతలికెళ్లాను," అంది ఈషా.

"నేను అత్తగారితో ఎలా ప్రవర్తించాలో రాధికని అడిగి తెలుసుకుంటున్నాను," అంది ప్రియాంక. "నాకు ఆవిడ మీద అంతగా ఆసక్తి లేదనుకో. ప్రస్తుతం ఆవిడ మంచిగానే ఉంది కానీ పోను పోను ఎలా తయారవుతుందో ఎవరికి తెలుసు?" అంది.

"కమాన్! నీకు ఈ పెళ్లితో ఎన్ని సుఖాలు దొరుకుతున్నాయి! గణేశ్ ఎంతో మంచి అబ్బాయి," అంది రాధిక.

"అయినా, నేనైతే ఒక లెక్సస్ దొరుకుతుందంటే ముగ్గురు అత్తగార్లని కూడా భరిస్తాను. ఆ కారు తీసుకురా, మాన్!" అన్నాడు వ్రూమ్.

రాధికా, ప్రియాంకా నవ్వసాగారు.

"నిన్ను మిస్సవుతాను, వ్రూమ్, నిజం చెపుతున్నాను," అంది ప్రియాంక ఇంకా నవ్వుతూనే.

"ఇంకా ఎవర్ని మిస్సవుతావు?" అని వ్రూమ్ అనగానే అందరం మౌనంగా ఉండిపోయాం. ప్రియాంక సీట్లో ఒకసారి సర్దుకుంది. వ్రూమ్ ఆమెని ఇరుకులో పెట్టాడు. ఆమెకి నా పేరు చెప్పాలని లేదని నాకు తెలుసు.

"ఓ! మీ అందర్నీ మిస్సవుతాను!" అంది. తను కోరుకున్నప్పుడు ఇటువంటి చాతుర్యంతో బైటపడగల టక్కరిదే. తనిచ్చే బోరింగ్ జవాబులతో ఈ లోకాన్నే మోసపుచ్చగలదని అనుకుంటుంది.

"సర్లే," అన్నాడు వ్రూమ్.

"కానీ, వ్రూమ్! ముగ్గురు అత్తగార్లు కావాలని కోరుకోవద్దు. ముగ్గురు జోక్‌లు కోరుకున్నట్టే ఉంటుంది. కనీసం ఆడవాళ్లకి అలాగే ఉంటుంది," అంది రాధిక.



"అయితే నీ అత్తగారు దుర్మార్గురాలా?" అన్నాడు వ్రూమ్.

"ఆవిడ చెడ్డదని నేనెప్పుడూ అనలేదే. కానీ ఆవిడ అనుజ్‌కి నామీద చెప్పిందిగా, అనుజ్ ఏమనుకుంటాడు?"

"ఏమీ అనుకోడు. నువ్వు తనకి దొరకటం ఎంత అదృష్టమో అతనికి తెలిసే ఉంటుంది," అంది ప్రియాంక ఖచ్చితంగా.

"ఒక్కోసారి కష్టంగానే ఉంటుంది. ఎంతైనా ఆవిడ మా అమ్మ కాదు కదా!"

"ఓహ్! ఆ సంగతి నాకు చెప్పద్దు. మా అమ్మతో కన్నా ఇంకెవరి అమ్మతోనన్నా నేను సర్దుకుపోగలుగుతాను. మా అమ్మకి ఉండే తిక్క పిరికితనం, నన్ను ఎటువంటి అత్తగారినైనా తట్టుకోగలిగేట్టు తయారుచేసింది," అంది ప్రియాంక. బల్ల దగ్గర ఉన్న వాళ్లందరూ నవ్వారు. నేను నవ్వలేదు. ప్రియాంక వాళ్లమ్మలో నాకు నవ్వేందుకేమీ కనిపించలేదు. అవతలివారి మానసిక బలహీనతల్ని తమ ప్రయోజనానికి వాడుకునే వాళ్లని జైల్లో వెయ్యాలి. ఆ జైల్లో ప్రాణాలు తోడేసే టీవీ సీరియల్స్ రోజంతా చూపించటమే వాళ్లకి తగిన శిక్ష.

"అనుజ్ నన్నేమీ అనడు కదా? చెప్పండర్రా, అతనికి నామీద అసహ్యం కలుగుతుందా?" రాధిక అడిగింది.

ప్రియాంక లేచి రాధిక దగ్గరకెళ్లి, "అలాంటిదేం ఉండదులే. అతనికి నువ్వంటే ప్రేమ, నీతో సరిగ్గానే ఉంటాడు," అంది.

"అతను నీమీద కోపంగా ఉన్నాడోలేడో తెలుసుకోవాలనుందా? నేనొక ఉపాయం చెపుతాను," అన్నాడు వ్రూమ్.

"ఏమిటది?" అంది రాధిక.

నేను వ్రూమ్‌కేసి చూశాను. ఇతను రాధిక, అనుజ్ గురించి ఏం చెప్పబోతున్నాడబ్బా? అనుకున్నాను.

"మనం రేడియో జాకీ ఆట ఆడదాం. బలే సరదాగా ఉంటుంది," అన్నాడు వ్రూమ్.

"రేడియో జాకీ అంటే?" రాధికకి ఏమీ అర్థం కాలేదు.

"నేనేం చేస్తానంటే, అనుజ్‌కి ఫోన్‌చేసి రేడియోషో నుంచి కాల్ చేస్తున్నట్టు నటిస్తాను. అతను ఒక బహుమతిని గెల్చుకున్నాడనీ, ఒక పెద్ద గులాబీపూల బొకేనీ, పెట్టెడు స్విస్ చాక్లెట్లనీ, తనకి ఎంతో ప్రియమైన వాళ్లకి, ఒక ప్రేమ సందేశంతోపాటు ఇండియాలో ఎక్కడికైనా పంపించవచ్చనీ, చెపుతాను. అప్పుడు అతను నీ కోసం చెప్పే ప్రేమ వాక్యాలని మేమందరం వినగలుగుతాం."

"సర్లే, అది కుదిరేపని కాదు. నువ్వు రేడియో జాకీలాగ మాట్లాడలేవు," అంది ప్రియాంక.

"నన్ను నమ్ము. నేను కాల్‌సెంటర్‌లో పనిచేస్తున్నాను. నేను రేడియో జాకీలా మట్లాడి నమ్మించగలను."

ఫ్రూమ్ ఆర్‌జె లాగ ఎలా నటిస్తాడో చూడాలని నాకు ఆసక్తి కలిగింది.

ఫ్రూమ్ ఆర్‌జె లాగ మాట్లాడటానికి సిద్ధం అవుతూ, "ఓకే! కార్యక్రమం ప్రారంభమౌతోంది. మిత్రులారా! లైన్ ఫైవ్‌ని ఎవరైనా తీసుకోండి. చప్పుడు చెయ్యద్దు. మైక్‌లోకి ఊపిరి వదలకండి. ఓకే?" అన్నాడు.

రాధిక అతనికి నంబరిచ్చింది. మేము లైన్ ఫైవ్ తీసుకున్నాం. ఫ్రూమ్ అనుజ్ సెల్ ఫోన్ నంబరు డయల్ చేశాడు.

మేము హెడ్‌సెట్లని చెవులకి అతికించుకున్నాం. ఫోన్ ఐదుసార్లు మోగింది.

"అతను నిద్రపోతున్నాడు," అంది ప్రియాంక రహస్యంగా.

"ఉష్...." అన్నాడు ఫ్రూమ్. ఎవరో ఫోన్ ఎత్తిన చప్పుడయింది.

"హల్లో?" అన్నాడు అనుజ్ నిద్రమత్తు నిండిన గొంతుతో.

"హల్లో! ఇది 98101-46301 యేనా?" ఫ్రూమ్ రేడియో జాకీలా చాలా ఉత్సాహం, పిచ్చి ఆనందంతో అన్నాడు.

"అవును, మీరెవరు?" అన్నాడు అనుజ్.

"ఇది ఈ రాత్రి మీకు మేం అందిస్తున్న లక్కీ కాల్. ఆర్‌జె మాక్స్‌ని, రేడియో సిటీ 98.3 ఎఫ్ ఎమ్ నించి మాట్లాడుతున్నాను. ఫ్రెండ్! మీరిప్పుడే ఒక బహుమతిని గెల్చుకున్నారు."

"రేడియో సిటీయా? నాకేమైన అమ్మాలని చూస్తున్నారా?" అన్నాడు అనుజ్. తను కూడా సేల్స్‌లోనే ఉన్నాడు కాబట్టి అతనికి అనుమానం వచ్చినట్టుంది.

"కాదు, మై ఫ్రెండ్! నేనేమీ అమ్మటం లేదు–క్రెడిట్ కార్డ్లూ, బీమా పాలసీలూ, ఫోన్ ప్లాన్లూ ఇవేవీ లేవు. మా స్పాన్సర్లు ఇంటర్‌ఫ్లోరా వాళ్లు మీకు ఇచ్చే ఒక చిన్న బహుమతి గురించి మీకు చెప్పాలి. కావాలంటే మీ కిష్టమైన పాటని కోరుకోండి. అబ్బ! ఈ మధ్య అందరికీ నా మీద అనుమానం పెరిగిపోతోంది!" అన్నాడు ఫ్రూమ్.

"సారీ! నాకు అనుమానం వచ్చింది," అన్నాడు అనుజ్.

"నా పేరు, మాక్స్. మీ పేరో?" అన్నాడు ఫ్రూమ్.

"అనుజ్."

"మీతో మాట్లాడటం చాలా బావుంది అనుజ్. ఇప్పుడు మీరెక్కడున్నారు?"

"కోల్‌కత్తాలో."

"ఓహ్, మిఠాయిల ప్రదేశం, ఎక్సెలెంట్! ఇకపోతే, అనుజ్ మీరు ఇండియాలో ఎక్కడికైనా డజను ఎర్రగులాబీలు, మీ సందేశం జోడించి పంపించవచ్చు. ప్రపంచంలోని అతిపెద్ద ఫ్లవర్ కంపెనీల్లో ఒకటైన ఇంటర్‌ఫ్లోరా మీకు ఈ అవకాశం కల్పిస్తోంది."

ఫ్రూమ్ నిజంగానే ఎంతో అనుభవజ్ఞుడిలా మాట్లాడుతున్నాడని, ఒప్పుకుంటున్నాను.



"నేను డబ్బేమీ చెల్లించక్కర్లేదా? థాంక్స్, ఇంటర్‌ఫ్లోరా!" అన్నాడు అనుజ్ కృతజ్ఞతతో.

మేమందరం గట్టిగా పెదవుల్ని బిగబట్టి, హెడ్‌సెట్‌కి ఉన్న మైకుని చేత్తో మూసి ఉంచాం.

"లేదు, ఫ్రెండ్? డబ్బేమీ చెల్లించక్కర్లేదు. మరయితే మీరు వీటిని పంపించాలనుకుంటున్న వారి పేరూ, చిరునామా ఇస్తారా?"

"ఆఁ తప్పకుండా. వాటిని నేను నా గర్ల్‌ఫ్రెండ్ పాయల్‌కి పంపుతాను."

అంతే, మా కాళ్లకింద భూమి కదిలిందనుకుంటా. నేను ఫ్రూమ్‌కేసి చూశాను, అతని నోరు పూర్తిగా తెరుచుకుని ఉండిపోయింది. ఏం చెయ్యాలో తెలీక చేతుల్ని అటూ ఇటూ ఆడించాడు.

"పాయల్?" అన్నాడు ఫ్రూమ్. అతని గొంతు ఇప్పుడు మామూలుగా అయింది. ఆర్‌జె గొంతుకుండే అత్యుత్సాహం దానిలో ఇప్పుడు లేదు.

"అవును. ఆమె నా గర్ల్ ఫ్రెండ్. ఢిల్లీలోనే ఉంటుంది. ఆమె ఆధునిక యువతి, అందుచేత ఆ బొకేని కాస్త ఫ్యాషన్‌బుల్‌గా తయారు చెయ్యండి...." అన్నాడు అనుజ్.

ఇక రాధిక మాట్లాడకుండా ఉండలేకపోయింది.

"పాయలా? ఏమన్నావు, అనుజ్? నీ గర్ల్ ఫ్రెండ్ పాయలా?" అంది రాధిక.

"ఎవరది?..... రాధికా.........?"

"అవును, రాధికనే, నీ పెళ్లాం పిశాచిని!"

"ఏం జరుగుతోంది? ఈ మాక్స్ గాడెవరు? ఏయ్, మాక్స్? అన్నాడు అనుజ్.

మాక్స్‌గాడు అప్పటికప్పుడు చచ్చిపోయాడని అనుకున్నాను. ఫ్రూమ్ తలకాయ పట్టుకుని కూర్చున్నాడు. ఇక ఏం మాట్లాడాలా అని ఆలోచించటం మొదలుపెట్టాడు.

"ఏయ్... ఒరేయ్ లోఫర్! పాయల్‌కి ఏమని మెసేజ్ పంపిద్దామనుకున్నావు నువ్వు?" అంది రాధిక. బహుశా పెళ్లయ్యాక అనుజ్‌తో ఆమె ఇలా మాట్లాడటం మొదటిసారి అయిఉంటుంది.

"రాధికా!హనీ! నే చెప్పేది విను. ఇదేదో తమాషాకి అన్న మాట. మాక్స్? మాక్స్?"

"ఇక్కడ మాక్స్ ఎవరూ లేరు. నేను ఫ్రూమ్‌ని," అన్నాడు ఫ్రూమ్ గొంతులో ఏ భావమూ కనిపించనీయకుండా.

"ఒరే బాస్టు..." అనుజ్ మాట పూర్తికాక ముందే రాధిక లేచి నిలబడి ఫోన్‌లైన్ కట్ చేసేసింది. ఆమె ప్రూన్పడిపోయినట్టు తన కూర్చీలో కూలబడింది. కొద్ది సెకన్ల తరవాత ఆమె ఏడవటం మొదలెట్టింది.

ఫ్రూమ్ రాధికకేసి చూశాడు. "రాధికా! సారీ!" అన్నాడు.

రాధిక జవాబు చెప్పలేదు. ఆమె అలా ఏడుస్తూనే ఉంది. మధ్యలో తను సగం అల్లిన

స్కార్ఫ్‌ని తీసి కళ్లు తుడుచుకుంది. రాధిక ఇక ఆ స్కార్ఫ్‌ని పూర్తి చెయ్యదని నాకెం అనిపించింది.

ఈషా రాధిక చెయ్యి గట్టిగా పట్టుకుంది. ఏడవటం అనే జాడ్యం బహుశా చేతుల్లో పాకినట్టుంది, ఈషా కూడా ఏడవసాగింది. ప్రియాంక వెళ్లి గ్లాసులో నీళ్లు పట్టుకొచ్చి రాధిక గ్లాసెడు కన్నీళ్లు కార్చి, గ్లాసులోని నీళ్లు తాగింది.

"అరే, అంతగా బాధపడకు! ఇదేదో అపార్థం అయి ఉంటుందిలే!" అంది ప్రియాం ఈషా ఈ పాయల్ గురించి అంతగా ఎందుకు బాధపడుతోందో అర్థంకాక, ప్రియా ఈషావైపు ఆశ్చర్యంగా చూసింది. ఈషా 'అసలు బాధ' మళ్లీ పైకి తన్నుకొచ్చినట్లుంది, అ అనుకున్నాను నేను.

రాధిక తన బ్యాగులో తలనెప్పి మాత్రలకోసం వెతికింది. అందులో ఒక ఖాళీ పా షీటు తప్ప ఏమీ దొరకలేదు. ఆమె తిట్టుకుంటూ దాన్ని పక్కన పడేసింది.

"రాధికా?" అంది ప్రియాంక.

"కొన్ని నిమిషాలపాటు నన్ను ఒంటిరిగా వదిలెయ్యండి!" అంది రాధిక.

"ఏయ్! నేను మీతో ఒక విషయం చెప్పాలి," అంది ఈషా అమ్మాయిలతో.

"ఏమిటి విషయం?" అంది ప్రియాంక ఈషా వైపు చూస్తూ. వాళ్లిద్దరి చూపు కలుసుకున్నాయి. కళ్ల భాషలోనే ఈషా ప్రియాంకని టాయిలెట్‌లోకి రమ్మని చెప్పిం ప్రియాంక ఈషా భుజం తట్టింది. ఇద్దరూ లేచి నిలబడ్డారు.

"ఏమిటి? ఎక్కడికెళ్తున్నారు మీరిద్దరూ?" అన్నాడు వ్రూమ్. "ఈ పరిస్థితిని కల్పించి నేను, మీరు ఇక్కడే మాట్లాడుకోవచ్చుగా?" అన్నాడు మళ్లీ.

"మా సొంత విషయాలేవో మాట్లాడుకోవాలి," అని వ్రూమ్‌తో సీరియస్‌గా అ ప్రియాంక బైటికెళ్లిపోయింది.

"ఏమిటి సంగతి? ఈషాకి ఏమయింది?" అమ్మాయిలు బైటికి వెళ్లిపోగానే వ్రూ నన్నడిగాడు.

"ఏమీ లేదు!" అన్నాను.

"కమాన్, నాకు చెప్పు! తను నీకు కాన్ఫరెన్స్ గదిలో చెప్పే ఉంటుంది."

"నేన్నీకు చెప్పలేను," అని నా కంప్యూటర్ తెరకేసి చూడసాగాను. మాట మార్చేందు "బక్షీ టీమ్ మీటింగ్‌కి అవసరమైన ఏర్పాట్లు మనం చెయ్యాలని ఎదురుచూస్తోంది అన్నాను.

"నన్ను కాదన్నందుకు ఈషాకి బాధగా ఉన్నట్టుంది," అన్నాడు వ్రూమ్.

నేను వంకర నవ్వొకటి నవ్వాను.

"మరైతే ఇంకేమిటి కారణం?" అన్నాడు వ్రూమ్ ఏమీ అర్థంకానట్టు మొహంపెట్టి



భుజాలెగరేశాను.

"సరే. నేను మనం ఇందాక చేసిన పనే మళ్లీ చేస్తాను. ఇదేదో తెలుసుకోటానికి నేను టాయిలెట్‌కి వెళ్తున్నాను," అన్నాను వ్రూమ్.

"వద్దు, వ్రూమ్, వద్దు!" అంటూ అతని షర్టు పట్టుకోబోయాను. కానీ అతను విడిపించుకుని మగవాళ్ల టాయిలెట్‌లోకి వెళ్లాడు.

నేనతని వెంట పడలేదు. సంగతి అతనికి తెలిసిపోతుందని నేనేమీ ఆందోళన పడలేదు. అతను ప్రేమించే అమ్మాయి ఏమిటో అతనికి తెలిస్తేనే మంచిదనుకున్నాను. సిస్టమ్స్ వాళ్లకి ఫోన్ చేసి, ఫోన్ లైన్లు ఇంకా బాగవలేదని చెప్పాను. మా బల్ల దగ్గరికి కొత్త వైర్లతో మరో 'ఐదు నిమిషాల్లో' వచ్చేస్తున్నామని చెప్పారు వాళ్లు. కంప్యూటర్లు మనుషులకి సహాయపడటానికే ఉన్నాయి, కానీ వాటిలో కూడా చాలా వాటికి మనుషుల సాయం అవసరమౌతూ ఉంటుంది.

ఆఫీసు బల్ల దగ్గర ఎవరూ లేకపోవటంతోనూ, సిస్టమ్స్ పని చెయ్యకపోవటంతోనూ, గదిలోనే ఒకసారి అలా తిరిగివద్దామని అనుకున్నాను. మిలిటరీ అంకుల్ కూర్చున్న కోటివైపుగా వెళ్తూ ఆయన బల్లమీదకి ఒరిగిపోయి కూర్చునుండటం చూశాను. ఆయనని ఎప్పుడూ అలా చూడలేదు. నేను దగ్గరకెళ్లాను. ఆయన తల బల్లమీద ఆని ఉంది.

"ఏమయింది?" అన్నాను. ఈరోజు ఇప్పటికే బోలెడన్ని చిక్కులతో అవస్థపడుతున్నాం. మిలిటరీ అంకుల్ తలెత్తాడు. నేనాయన మొహంకేసి చూశాను : ఆయన మొహాన ఉన్న ముడతలు మరీ కొట్టొచ్చినట్టు కనిపిస్తూ, ఆయన్ని మరీ ముసలివాడిలా చేస్తున్నాయి.

"నేను పంపిన మెయిలుకి మా అబ్బాయి జవాబు రాశాడు. ఫైలు మరీ పెద్దదయినట్టుంది," అన్నాడాయన.

"అవునా? ఏమన్నాడు?" అన్నాను.

మిలిటరీ అంకుల్ తల అడ్డంగా ఆడించి, తలని మళ్లీ బల్లమీద ఉంచాడు. ఆయన కంప్యూటర్ తెరమీదున్న ఈమెయిలు మెసేజ్ నాకు కనిపించింది –

"డాడ్... నా బతుకుని ఇప్పటికే అనవసరమైన చెత్తతో చాలావరకు నింపావు, ఇక నా మెయిల్‌బాక్స్‌ని నింపడమైనా ఆపెయ్యి. నాకేం పిచ్చికుక్క కరిచిందో కానీ, నీకూ నా కొడుక్కీ మధ్య ఉత్తరాలు రాసుకునేందుకు అనుమతించాను. నీ నీడ కూడా వాడిమీద పడటం నాకిష్టం లేదు. వాడికి దూరంగా ఉండు. ఇంకమీదట వాడికి ఈమెయిల్స్ పంపద్దు. నీ 'అటాచ్‌మెంట్లు', అంటే నీతో సంబంధం అని కూడా అర్థం, మాకిక దాని అవసరం లేదు.

"ఏమీ లేదు, శ్యామ్!" అని అంకుల్ కంప్యూటర్ విండోలని అన్నిటినీ మూసేసి, "నేనింక నా పని చేసుకోవాలి. అన్నట్టు మీ సిస్టమ్స్ సంగతి ఏమయింది? ఇంకా బాగవలేదా?" అన్నాడు.

"ఈరోజు చాలా విషయాలు పాడయాయి, ఒక్క సిస్టమ్సే కాదు!" అని నా సీటుకి వెళ్లిపోయాను.

# # 22

"ఏయ్, నీకీ విషయం తెలుసా?" టాయిలెట్‌లోంచి వచ్చి, వ్రూమ్ నాతో రహస్యంగా అన్నాడు.

"ఏమిటి?" అన్నాను.

"ఈషా నడిపిన వ్యవహారం!"

"నాకు ఆ సంగతి మాట్లాడాలని లేదు. అది ఆమె స్వవిషయం."

"అందుకే, నాతో స్నేహం చెయ్యటానికి ఒప్పుకోలేదు తను! ఎలాగో ఒకలాగ మోడల్ అవటమే తనకి కావల్సినది. దానికోసం ఏం చెయ్యటానికైనా రెడీయే, బిచ్!"

"ఏయ్ ఏమిటా మాటలు? అసలు అమ్మాయిలేరీ?" అన్నాను.

"వస్తున్నారులే! రాధికని నీ పిట్ట ఓదారుస్తూండగా నేను వచ్చేశాను."

"ప్రియాంక నా పిట్ట ఏమీకాదు, వ్రూమ్! నువ్వు కాస్త నోరుమూసుకుంటావా?"

"ఓకే, నేను నోరు మూసుకుంటాను. ఒక మంచి కాల్‌సెంటర్ ఏజెంటు చేసే పని అదే కదా? అతని చుట్టూ ఎంత ఛండాలం జరుగుతున్నా చిరునవ్వు నవ్వుతూ, 'నేను మీకే విధంగా సహాయపడగలను?' అంటాడు - అంటే, నేను ఇష్టపడిన ఒకే ఒక అమ్మాయి ఇంకెవరితోనో పడుకున్నట్టు! కాని అదేం పెద్ద విషయం కాదు కదా? ఊఁ తరవాత లైన్లో ఉన్న వెధవనియ్యి?!"

అమ్మాయిలు వెనక్కి రావటం చూసి, "వాళ్లొచ్చేస్తున్నారు. నీకు ఈషా గురించి ఏమీ తెలీనట్టు నటించు," అన్నాను.

అమ్మాయిలు తమ తమ సీట్లలో కూర్చున్నారు. ఫోన్లు ఇంకా పనిచెయ్యటం లేదు. వ్రూమ్ ఏదో అనబోయేసరికి, మాట్లాడద్దని నేనతనికి సైగ చేశాను. సిస్టమ్స్ మనిషి ఎలాగైతేనేం వచ్చాడు. తన్నినా తెగిపోని వైర్లు పట్టుకొచ్చి మా ఫోన్లని బాగుచేశాడు. ఫోన్లు నెమ్మదిగా ఒకటొకటే వస్తూండటంతో నాకున్న ఒత్తిడి తగ్గుముఖం పట్టింది. మా జీవితాల్లో ఉన్న సమస్యలని పరిష్కరించుకోవటం కన్నా, అమెరికన్లకి వచ్చే అవెన్ సమస్యలనీ, ఫ్రిజ్ సమస్యలనీ పరిష్కరించటం సులభమనిపించింది.

నేను ప్రియాంక కేసి ఒకసారి చూశాను. తను ఫోన్లో ఎవరితోనో మాట్లాడుతూ బిజీగా ఉంది. 'నా పిట్ట!' వ్రూమ్ అన్న మాటకి మొహం చిట్లించి వంకరనవ్వు నవ్వుకున్నాను. తను ఇక నా 'పిట్ట' కాదు. డబ్బున్న కుర్రాణ్ణి, జీవితంలో పైస్థాయికి చేరుకున్న వాడిని, నాలాంటి



పనికిమాలిన వాడితో పోటీపడాల్సిన అగత్యం లేని వాడిని పెళ్లి చేసుకోబోతోంది. ముఖ్యంగా బక్షీ నా వెబ్‌సైట్‌ని దొంగిలించి నన్ను వెన్నుపోటు పొడిచాక, అసలు పోటీకి అవకాశమే లేకుండా పోయింది, అనుకున్నాను. కానీ నేను ఆమెమీది ఆశ వదులుకున్నట్టేనా? ఇంకా ఆమెని నేను ప్రేమిస్తున్నానా? ఇటువంటి అసందర్భపు ప్రశ్నలు మనసులో తలెత్తటంతో, నా తలని విదిల్చాను. నేనింకా ఆమెని ప్రేమిస్తే మాత్రం ఏమిటి లాభం? నాకు ఆమెని పొందే యోగ్యత లేదు, ఆమె నాకు దొరకదు. అదే వాస్తవం! నా విషయంలో వాస్తవం ఎప్పుడూ భరించరానిదిగానే ఉంటుంది.

టాయిలెట్ నించి వచ్చినప్పట్నించీ ఈషా దిగులుగానే ఉంది. ప్రియాంక ఆమెకి ఉత్సాహం కలిగించాలని ప్రయత్నిస్తోంది.

"నా ఎంగేజ్‌మెంట్‌కి పొడవాటి లెహంగా కొనుక్కో. మరి పెళ్లికి ఏం వేసుకుంటావు? చీర కట్టుకుంటావా?" అని ఈషాని అడిగింది ప్రియాంక కాల్స్ మధ్య మాట్లాడుతూ.

"నా బొడ్డుకున్న రింగు కనబడుతుంది," అంది ఈషా.

ఆడవాళ్లు ఎంత త్వరగా శాంతించగలరో అది చూసినప్పుడల్లా నాకు ఆశ్చర్యం వేస్తుంది. పది నిమిషాల్లో, ఎవరితోనన్నా మాట్లాడి, వాళ్లని కావలించుకుని, ఏడ్చి, స్థిమిత పడిపోతారు. ఆ తరవాత జీవితంలో ఏ సమస్య వచ్చినా ఎదుర్కోగలుగుతారు. ఈషాకుండిన 'అసలు బాధ' తగ్గినట్టే కనిపిస్తోంది. కనీసం ఆమె దృష్టి మరోవైపుకి మళ్లింది. అందుకే ప్రియాంకతో తను వేసుకోవలసిన డ్రస్సుల గురించి మాట్లాడగలుగుతోంది.

"మరీ ఎక్కువ ఖర్చుపెట్టి ఏమీ కొనద్దు. నేను కూడా మా అమ్మకి సింపుల్‌గా ఉండే చీర కొనమని చెప్పబోతున్నాను. ఆవిడకి ఆ మాటవిని పిచ్చెక్కుతుంది, అది వేరే సంగతి," అని, "ఏయ్, రాధికా, సర్దుకున్నావా?" అంది ప్రియాంక, రాధిక నుదురు రుద్దుకోవటం చూసి.

"కొద్దిసేపట్లో తగ్గిపోతుంది. నా తలనెప్పి మాత్రలు అయిపోయాయి." అంది తనకొచ్చిన ఫోన్‌కాల్‌కి జవాబు చెప్పటానికి ఫోనెత్తుతూ. "వెస్టర్న్ ఎప్లయెన్సెస్ నుంచి రెజినా మాట్లాడుతున్నాను. చెప్పండి?" అంది.

ఇంతలో ల్యాండ్‌లైన్ ఫోను మోగటంతో అందరి దృష్టి అటు మళ్లింది.

"ఈ కాల్ నాకే. సిస్టమ్స్ బాగుపడ్డాయని నాకు తెలుసు, కానీ ఈ ఫోన్ నేను ఎత్తచ్చా?" అంది ప్రియాంక.

"ఓ, అలాగే. ఎలాగూ ఫోన్లు ఆట్టే రావటం లేదుగా!" అన్నాడు వ్రూమ్. ల్యాండ్‌లైన్ ఇంకా మోగుతూనే ఉంది.

ప్రియాంక ఫోన్‌వైపు చెయ్యి చాచింది. నేను మామూలుగా పనిచేసుకుంటున్నట్టు నటిస్తూ నా తెరమీద ఆ ఫోన్ కనెక్షన్‌ని క్లిక్ చేశాను.

ప్రియాంక ఫోన్ ఎత్తుతూండగా వ్రూమ్, "అన్నట్టు, ముదురు మైకారంగు నీలం కూడా బావుంటుంది," అన్నాడు.

"ఏమిటీ?" అంది ప్రియాంక.

"నేను లెక్సస్ వెబ్‌సైట్‌కి వెళ్లి చూశాను. ముదురు మైకారంగు నీలం అన్నిటిలోకీ మం రంగు," అన్నాడు ప్రూమ్.

నేను ప్రూమ్‌కేసి రోతగా చూశాను.

"కనీసం, నాకలా అనిపించింది," అన్నాడు ప్రూమ్ నెమ్మదిగా, నా చూపుని గమని

"హల్లో! నా అందాల బొమ్మా! "గణేశ్ గొంతు స్పష్టంగా వినిపించింది, ప్రియాం ఫోనులోనూ, నా ఫోనులోనూ!

"హాయ్, గణేశ్!" అంది ప్రియాంక గంభీరంగా.

"ఏమయింది ప్రియా? అంత సీరియస్‌గా ఉన్నావేం?" అన్నాడు గణేశ్.

తన పేరుని ప్రియా అని పొట్టిచేసి పిలిస్తే ప్రియాంకకి నచ్చదు. ఈ మూర్ఖుడికి విషయం తెలీదు.

"ఏం లేదు. ఈరోజు అన్నీ కష్టాలే, బాధలతో గడుస్తోంది ఈరోజు! ప్లీజ్, నన్న ప్రియాంకా అని పిలు," అంది ఆమె.

"ఓ! నాకు ఇవాళ బలే సరదాగా గడుస్తోంది. ఆఫీసులో అందరూ నా గురించి చా ఉత్సాహంగా ఉన్నారు. 'అయితే పెళ్లెప్పుడు?' అనీ, 'హనీమూన్‌కి ఎక్కడికి వెళ్తున్నారు' అ తెగ అడుగుతున్నారు.

"ఆఁ, పెళ్లి తేదీ గురించి, ఇప్పుడే అమ్మ ఫోన్ చేసింది, గణేశ్!" అంది ప్రియాంక

"అవునా? ఓహ్, ఎంత పనిచేసింది? ఆ శుభవార్త నేనే నీకు చెప్పాలనుకున్నాను!"

"ఏ శుభవార్త?"

"వచ్చేనెల నేను ఇండియాకి వస్తున్న సంగతి. మనం అప్పుడే పెళ్లి చేసేసుకోవా అయితే అట్నుంచటే హనీమూనా? అందరూ బహామాస్ అద్భుతంగా ఉంటాయంటున్నా కానీ నేను ఎప్పట్నించో పారిస్‌కి వెళ్లాలనుకుంటున్నాను. పారిస్ కన్నా రొమాంటిక్ ప్రదేశ ఇంకోటేముంటుంది?"

"గణేశ్!" అంది ప్రియాంక, ఆర్తనాదం చేస్తున్నట్టు.

"ఏమిటి?"

"నేనొక మాట చెప్పచ్చా?"

"తప్పకుండా. కానీ ముందిది చెప్పు, బహామాస్‌కా, పారిస్‌కా?"

"గణేశ్!"

"ప్లీజ్, నీకెక్కడికి వెళ్లాలనుందో చెప్పు."



"పారిస్. ఇక నేను చెప్పేది వింటావా?"

పారిస్ అనే మాట వినగానే రాధికా, ఈషా కనుబొమలు పైకెత్తారు. హనీమూన్ ఏర్పాట్ల గురించి మాట్లాడుకుంటున్నారని ఊహించటం వాళ్లకి పెద్ద కష్టమనిపించలేదు.

"అలాగే చెప్పు, ఏం చెప్పాలనుకుంటున్నావు?"

"మనం మరీ తొందరపడుతున్నట్టుంది కదా?"

"ఏమిటీ?"

"మన పెళ్లి గురించి. మనం వారం రోజులుగా ఒకరితో ఒకరం మాట్లాడుకుంటున్నాం. చాలా విషయాలే మాట్లాడుకున్నాం, నాకు తెలుసు, కానీ..."

"నువ్వు నన్ను చేసుకోటానికి ఒప్పుకున్నావు కదా?"

"అవును, ఒప్పుకున్నాను, కానీ..."

"అయితే వేచి ఉండటం దేనికి? నాకు ఇక్కడ ఆట్టే సెలవ దొరకదు. ఇక అనుక్షణం నీ గురించే ఆలోచిస్తూ గడుపుతున్న నాకు నిన్ను ఇక్కడికి ఎంత త్వరగా తెచ్చుకోవాలా అని ఉంటుంది కదా?"

"కానీ ఇది పెళ్లి, గణేశ్! ఉత్తినే సెలవలు కలిసి గడపటం కాదు. మనిద్దరికీ దీనికి సిద్ధంగా ఉండటానికి మరికొంత సమయం కావాలి," అని ప్రియాంక తన జుట్టులోని ఒకపాయని వేలికి చుట్టుకోసాగింది. మేమిద్దరం స్నేహంగా ఉన్నప్పుడు తన జుట్టుతో ఆడుకోవటమంటే నాకు చాలా ఇష్టంగా ఉండేది.

"కానీ... నువ్వు మీ అమ్మతో మాట్లాడావు కదా? వచ్చేనెల మనిద్దరి పెళ్లి జరగబోతోందని ఆవిడ ఎంత సంతోషంగా ఉందో నీకు తెలుసు. మా వాళ్లకి కూడా చాలా ఉత్సాహంగా ఉంది. పెళ్లనేది కుటుంబాలకి సంబంధించిన విషయం కూడా, కదూ?"

"అవును, నాకు తెలుసు. ఇవాళ మాకు ఎదురైన సమస్యల వల్ల నేను తిన్నగా ఆలోచించలేకపోతున్నాను. రేపటికి మామూలుగా అవుతానేమో, చూద్దాం."

"అలాగే, నీ ఇష్టం. కానీ రంగు విషయం ఆలోచించావా?"

"ఏది? కారు గురించా?"

"ఆఁ. రేపే డిపోజిట్ కట్టేస్తున్నాను. నువ్వొచ్చేసరికి అది ఉండాలి కదా! అంటే వచ్చేనెల నువ్వు పెళ్లికి ఒప్పుకుంటావని అనుకునే, సుమా!"

"నేనేం చెప్పలేను. అన్నట్టు, ఉండు, ముదురు మైకా నీలంరంగు బావుంటుందని విన్నాను."

"నిజంగానా? నాకైతే నలుపు బావుంటుందనిపిస్తోంది," అన్నాడు గణేశ్.

"సరే అయితే నలుపే తీసుకో. నాకోసం..." అంది ప్రియాంక.

"లేదు, నువ్వు చెప్పిన మైకా నీలం రంగే తీసుకుందాం. డీలర్‌తో అది నా భార్య ఎంచుకున్న రంగని చెప్తాను!"

'నా భార్య' అనే రెండు మాటలూ, మెక్‌డొనాల్డ్స్‌లో ఫ్రెంచి ఫ్రైలు వేయించినట్టుగా నా మనసుని కుతకుతలాడించాయి. నేను కొన్ని సెకన్లపాటు కళ్లు మూసుకున్నాను. మరో మగాడు ప్రియాంకతో ఇలా మాట్లాడటం నేను భరించలేకపోయాను.

"ఏయ్, గణేశ్! ఇప్పుడిక్కడ రాత్రి 2:25 అయింది. ఇంకో ఐదు నిమిషాల్లో, 2:30కి బాసుతో మీటింగుంది, దానికి రెడీ అవాలి. మనం మళ్లీ మాట్లాడుకుందామా?" అంది ప్రియాంక.

"అలాగే, నేను ఈ రోజు ఆఫీసునించి త్వరగా ఇంటికి వెళ్తున్నాను. పూల్‌లోకి కొత్త లైట్ల కోసం షాపింగ్ చెయ్యాలి. ఇంటికెళ్లాక మళ్లీ ఫోన్ చేస్తాలే, సరేనా?"

"పూలా?" అంది ప్రియాంక అతని వలలో మళ్లీ పడుతూ.

"అవును. మనింట్లో చిన్న స్విమ్మింగ్‌పూల్ ఉంది."

"మనిల్లా? అంటే నీకు సొంతిల్లుందా?"

"మరింకేమనుకున్నావు? నీకు ఈదటం వచ్చా?"

"నా జీవితంలో ఎన్నడూ స్విమ్మింగ్‌పూల్‌లో కాలుకూడా పెట్టలేదు!" అంది ప్రియాంక.

"ఏం ఫరవాలేదు. నేను నేర్పిస్తాను. పూల్‌లోకి దిగి మనం ఎన్నో సరదా పనులు చెయ్యచ్చు!"

నా మనసులోని ఫ్రెంచి ఫ్రైస్ మాడి మసిబొగ్గు అవుతున్నాయి.

"బై, గణేశ్!" అని తలవిదిలిస్తూ నవ్వి, "మీ మగాళ్లందరూ ఒకటే!" అంది ప్రియాంక ఆమె ఫోను పెట్టేసింది.

ఈషా తన గోళ్లని సరిదిద్దుకుంటూ "ఏమిటి సంగతులు?" అంది.

"ఏం లేదు, ఎప్పుడూ ఉండేదే. అయినా ముందిది చెప్పు, నువ్విప్పుడు ఓకేగా ఉన్నావా?" అంది ప్రియాంక.

"నేను బాగానే ఉన్నాను. ప్లీజ్, మరేదైనా మాట్లాడు. పారిస్ అనటం విన్నానే!"

"అవును. హనీమూన్‌కి పారిస్ వెళ్లాలని అనుకుంటున్నాం. అది కాక, వచ్చేనెలే పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేస్తున్నాడు. నాకిష్టం లేదు, కానీ నేను ఒప్పుకోక తప్పేట్టు లేదు.

"ఊఁ.... అయినా పెళ్లి చేసుకుంటే త్వరగా పారిస్ చూడచ్చనుకుంటే...." అంటూ మాకేసి చూసి, "ఏమంటారు మీరంతా?" అంది ఈషా.

"అవును. నువ్వేమంటావు, శ్యామ్!" అన్నాడు వ్రూమ్.

బుద్ధిలేని గాడిద! నాకు వ్రూమ్ అంటే అసహ్యం!!



"నేనా?" అన్నాను, అందరూ నాకేసే చూస్తుంటే. ఈషా ఐదు సెకన్ల పాటు కళ్లార్పకుండా నన్నే చూసింది. నేను చిన్నపిల్లాడిలా అలిగినట్టు కనిపించదలుచుకోలేదు. అందుకే, "అవును. అదేదో త్వరగా ముగిస్తేనే మంచిది. పారిస్‌కో బహామాస్‌కో, మరో చోటికో!" అన్నాను.

ఆ మాటలు నా నోటంట వచ్చిన మరుక్షణం, మనసులోనే నన్ను తిట్టుకున్నాను. ప్రియాంక నా మాటలు విని నాకేసి చూసింది. ఆమె దీర్ఘంగా ఆలోచిస్తుంటే ఆమె ముక్కు పుటాలు పెద్దవయాయి.

ప్రియాంక నేరుగా నాకేసి చూస్తూ, ముక్కు పుటాలెగరేస్తూ నెమ్మదిగా, "ఏమన్నావు, శ్యామ్?" అంది.

"ఏం లేదు," అన్నాను ఆమె చూపుల్ని తప్పించుకుంటూ. "త్వరగా పెళ్లి చేసుకుని పారిస్‌కి వెళ్లమన్నాను," అన్నాను.

"లేదు, నువ్వు బహామాస్ అని కూడా అన్నావు. గణేశ్ బహామాస్ గురించి మాట్లాడాడని నీకెలా తెలిసింది?" అంది ప్రియాంక.

నేను మాట్లాడలేదు.

"చెప్పు, శ్యామ్! గణేశ్ బహామాస్ గురించి కూడా చెప్పాడు. కానీ నేనా విషయం మీకెవరికీ చెప్పలేదు. మరి అతను దాన్ని గురించి చెప్పాడని నీకెలా తెలిసింది?"

"నాకేమీ తెలీదు. నేను అప్పటికప్పుడు తట్టిన పేరేదో చెప్పేశాను అంతే." అన్నాను నమ్మబలుకుతూ. కానీ నా వణికే గొంతు నా అబద్ధాని పట్టిచ్చింది.

"నువ్వు..... మా మాటలు వింటూ ఉన్నావా, శ్యామ్? ఫోన్‌ని నీకు వినిపించేట్టు ఏమైనా చేశావా?" అని ప్రియాంక లేచింది. ఆమె ల్యాండ్‌లైన్ ఫోన్‌ని ఎత్తి బల్లమీద నించి అవతలికి లాగింది. వైరు ఆమె వెంటే వచ్చింది. బల్లకిందికి తొంగి చూసి, మళ్లీ వైర్లని లాగింది. ఒక చిన్న వైరు, నా సీటు వరకూ ఉన్నది, బిగుసుకుంది. ఛీ! దొరికిపోయాను! అనుకున్నాను.

"శ్యామ్!" ప్రియాంక కప్పెగిరిపోయేట్టు అరిచి, ఫోనుని బల్లకేసి కొట్టింది.

"అవును," అన్నాను వీలైనంత శాంతంగా.

"ఇక్కడ ఏం జరుగుతోందసలు? నువ్వింతగా దిగజారతావని అనుకోలేదు. నాతో ఇంతకన్నా అమర్యాదగా ప్రవర్తించేవాళ్లెవరూ ఉండరు!" అందామె.

కనీసం ఇందులోనైనా నేను మొదటిస్థానం సంపాదించాను, అనుకున్నాను!

రాధికా, ఈషా నాకేసి చూశారు. ఈ విషయం నాకేమీ తెలీదన్నట్టు చేతులు రెండూ పైకెత్తి సైగ చేశాను.

వ్రూమ్ లేచి ప్రియాంక దగ్గరికి వెళ్లాడు. ఆమె భుజాలచుట్టూ చేతులువేసి, "కమాన్ ప్రియాంకా! ఇదేం పెద్ద విషయం కాదుగా, టేకిటీజీ! ఈరోజు అంతా గందరగోళంగా ఉంది," అన్నాడు.

"షటప్! పిచ్చిపిచ్చిగా వాగకు!" అని నావేపు తిరిగి, "నాకు వచ్చే కాల్స్‌ని నువ్వెలా ట్యాప్ చేశావసలు? దీన్ని గురించి ఫిర్యాదు చేసి నీ ఉద్యోగం ఊడగొట్టగలను, తెలుసా?" అంది.

"అయితే చెయ్యి. ఇంకా దేనికోసం ఎదురుచూస్తున్నావు? నన్ను ఉద్యోగంలోంచి తీసేయించు. నీ ఇష్టమొచ్చినట్టు చేసుకో!" అన్నాను.

వ్రూమ్ మొదట ప్రియాంకకేసి, తరవాత నాకేసీ చూశాడు. తను ఏరకంగానూ సాయం చెయ్యలేదని తెలియటంతో, తన సీటుకి వెళ్ళిపోయాడు.

ఈషా ప్రియాంక చెయ్యి పట్టుకుని లాగి, కూర్చోపెట్టింది.

"అసలు ఏమిటి వీళ్ల ఉద్దే....." గొంతులో కోపాన్నీ, ఏడుపునీ దిగమింగుకుంటూ అంది ప్రియాంక. "కొలీగ్స్ నించి ఆ మాత్రం సభ్యత ఎదురుచూడలేమా?" అంది.

అయితే నేనిప్పుడు కేవలం ఒక సహోద్యోగినన్న మాట. అది కూడా సభ్యత తెలియని కొలీగ్‌ని!

"జవాబు చెప్పు!" అంది ప్రియాంక నాతో.

నేను మాట్లాడకుండా ట్యాప్ చేసిన వైర్‌ని పీకేశాను. దాన్ని ప్రియాంకకి చూపించి బల్లమీద పడేశాను.

మా ఇద్దరి కళ్లూ కలుసుకున్నాయి. మేమేమీ మాట్లాడుకోకపోయినా మా కళ్లు మాత్రం మాట్లాడుకున్నాయి.

నా కళ్లు ఆమెతో, "నన్నెందుకిలా అవమానిస్తున్నావు?" అన్నాయి.

ఆమె కళ్లు, "ఇలాంటి పనులెందుకు చేస్తున్నావు, శ్యామ్?" అన్నాయి.

కళ్ల సంభాషణ, మాట్లాడటం కన్నా ఎక్కువ భావప్రకటన చెయ్యగలదని అనుకుంటా. అప్పుడప్పుడూ మనుషులు నోరు మూసుకుని కళ్లతో మాట్లాడుకోవాలి. కానీ ప్రియాంక మౌనంగా ఉండేట్టు లేదు.

"ఎందుకు, శ్యామ్? ఎందుకు ఇలాంటి పిచ్చిపిచ్చి అర్థం లేని పనులు చేస్తూ ఉంటావు? నువ్వేమైనా చిన్న పిల్లాడివా? మనిద్దరం స్నేహితుల్లా విడిపోవాలనుకున్నాం. కొన్ని షరతులని పాటిస్తామని ఒప్పుకున్నాం, అవునా?"

మా షరతుల్ని అందరిముందూ చర్చించటం నాకిష్టం లేదు. ఆమె నోరు మూసుకుని, నేను కేకలు పెడితే బావుంటుందని నాకు అనిపించింది. కానీ నేను తప్పు చేశాను. కారు డ్రైవరు సైకిల్ని కొట్టినట్టు. నోరు మూసుకోవటం తప్ప నేను చేయగలిగిందేమీ లేదు. నా తుంటరి పనికి శిక్ష అనుభవించాల్సిందే!

"మనిద్దరం కలిసి పనిచేసేందుకు ఒప్పుకున్నాం. మనిద్దరి మధ్యా ఏ సంబంధమూ లేకపోయినా, స్నేహితుల్లా కొనసాగిద్దామనే అనుకున్నాం. కానీ ఈ పని?" చేత్తో వైరుని ఎత్తి మళ్లీ పడేస్తూ అంది, ప్రియాంక.



"సారీ" అన్నాను, కాదు రహస్యంగా గొణిగాను.

"ఏమిటీ?" అంది.

"సారీ!" అన్నాను గట్టిగా, స్పష్టంగా. నన్ను ఆమె అవమానించటానికి ఇలా ప్రయత్నిస్తే నాకు మంట. సారీ అన్న మాట విన్నావు కదా, మరి అంగీకరించి ఊరుకోవచ్చుగా, అనుకున్నాను.

"నువ్వు నాకొక పెద్ద ఉపకారం చెయ్యాలి. దయచేసి నా జీవితంలో జోక్యం కలిగించుకోవద్దు! సరేనా?" అంది ప్రియాంక. నా దగ్గర నేర్చుకున్న వ్యంగ్యాన్నే తన గొంతులో పలికించింది.

నేనామెకేసి చూసి సరేనని తల ఆడించాను. ఆమెనీ, గణేశ్‌నీ ముదురు మైకా నీలం రంగు లెక్సస్‌లోకి తోసి, ల్యాండ్‌లైన్ వైర్‌తో దాన్ని గట్టిగా కట్టేసి, దాన్ని గణేశ్ ఇంట్లోని కొత్త స్విమ్మింగ్ పూల్‌లో ముంచెయ్యాలని అనిపించింది నాకు.

తన మౌస్‌ని క్లిక్ చేస్తూ, వ్రూమ్ ముసిముసిగా నవ్వాడు. రాధికా, ఈషా కూడా చిన్న చిరునవ్వు నవ్వారు.

"ఏమిటి అంత నవ్వు వస్తోంది?" అంది ప్రియాంక. ఆమె మొహం ఇంకా ఎర్రగా కందిపోయే ఉంది.

"ఫరవాలేదు, ప్రియాంకా, కమాన్! దీన్ని కొంచెం తేలిగ్గా తీసుకోలేవా?" అన్నాడు వ్రూమ్.

"నీ హాస్యం అపహాస్యంలాగ ఉంది. నాకేమీ నవ్వు రావటం లేదు," అని ఆగింది ప్రియాంక.

"2:30 అయిందర్రా. బక్షీ ఆఫీసుకెళ్లటానికి టైమయింది," అంది ఈషా చప్పట్లు చరుస్తూ.

లేచి వెళ్తూ నేనూ, ప్రియాంకా ఒకరినొకరం కళ్లెర్రజేసి చూసుకున్నాం.

"మిలిటరీ అంకుల్ కూడా రావాలా?" అంది ఈషా.

"అక్కర్లేదు. ఒక్క ఫోన్స్ అటెండ్ అయే వాయిస్ ఏజెంట్లు వెళ్తే చాలు," అన్నాను. మూలన కూర్చున్న మిలిటరీ అంకుల్‌కేసి చూశాను. ఆయన చాటింగ్ హెల్ప్‌లైన్‌తో బిజీగా ఉన్నాడు.

"పద రాధికా వెళ్దాం," అన్నాడు వ్రూమ్.

"అతను ఆ పిల్లని నిజంగా ప్రేమిస్తున్నాడంటావా? లేక ఉత్త సెక్స్‌కోసమే తనతో తిరుగుతున్నాడా? ఆమెతో సెక్స్ అతనికి బహుశా ఎక్కువ ఉద్రేకాన్ని కలిగిస్తుందేమో!" అంది రాధిక.

"రాధికా నువ్వింకా బాధపడుతున్నావా?"

"లేదు, బాగానే ఉన్నాను. నిజానికి ఇలా ఉన్నందుకు నాకే ఆశ్చర్యం వేస్తోంది. బహుశా

నేను షాక్ తిన్నానేమో! లేదా ఇటువంటి పరిస్థితికి ఎలా స్పందించాలో నాకెవరూ చెప్పలేదేమో! నా మొగుడు నా వెనక మరో ఆడదానితో తిరుగుతున్నాడు. అప్పుడు నేనేం చెయ్యాలి? అరవాలా? ఏడవాలా? ఏం చెయ్యాలి?"

"ప్రస్తుతం ఏం చెయ్యొద్దు. మనం ముందు బక్షీ మీటింగ్‌కి వెళ్దాం," అన్నాడు ష్రూప్ మేం బక్షీ ఆఫీసుకి వెళ్తాండగా.

నా బుర్ర ఇంకా ప్రియాంక అన్నమాటలనే నెమరు వేసుకుంటోంది, 'మనం షరతులు పెట్టుకున్నాం.' ఏదో మేం విడిపోవటం ఒక బిజినెస్ డీల్‌లాగ! బక్షీ ఆఫీసుకేసి నడుస్తూంటే మేం చివరిసారి కలుసుకున్నప్పుడు జరిగిన సంఘటనలు ఒక్కొక్కటీ నా కళ్లముందు తిరగసాగాయి. మేమిద్దరం పిజ్జాహట్‌కి వెళ్లాం. ఆరోజు తరవాత మళ్లీ ఎన్నడూ పిజ్జాల్లో అంత రుచి నాకు కనిపించలేదు.



# # 23

## గతంలో నేనూ ప్రియాంకా కలుసుకున్న సందర్భాలు-V

*పిజ్జాహట్, సహారామాల్, గుడ్‌గాంవ్*

*నాలుగునెలల క్రితం*

ఆ రోజు తను చెప్పిన సమయానికే వచ్చింది. ఎంతైనా పని మీద వస్తోంది కదా. ఇది మా 'డేట్' కాదు, ప్రేమికుల్లా కాకుండా విడిపోవటానికి కలుస్తున్నాం. నిజానికి విడిపోవటానికి మా మధ్య సంబంధమేమీ మిగల్లేదు. అయినా, తనన్నట్లు, తన మొహాన్ని చూడటానికని నేను ఒప్పుకున్నాను. తను కూడా ఇకమీదట మా మధ్య ఎలాంటి సంబంధం ఉండబోతోందో, ఏవరిదారిన వాళ్లం ఎలా వెళ్లాలో చర్చించటానికే వస్తున్నానని చెప్పింది. అసలు ఇటువంటి మాటలు ఉపయోగించటం మొదలుపెట్టినప్పుడే ఇద్దరి మధ్య ప్రేమ సంబంధం లేదని అర్థమైపోతుంది.

మేం పిజ్జాహట్‌లో కలవాలనుకోవటం, అది వీలుగా ఉంటుందనే. విడిపోవటానికి, వాతావరణం కన్నా చోటు ముఖ్యం అవుతుంది. తను సహారా మాల్‌లో షాపింగ్‌కని వచ్చింది. సెలవు రోజుల్లో ఢిల్లీలోని సగం జనాభా ఆ మాల్‌లోనే ఉంటారు.

"హాయ్!" అని తన వాచీకేసి చూసుకుంది. "వావ్! చూశావా, ఇవాళ నేను చెప్పిన టైముకి వచ్చేశాను! ఎలా ఉన్నావు?" తన షర్ట్‌కాలర్‌ని పట్టుకుని గాలికోసం ఆడించింది. "జూలైలో ఇంత వేడిగా ఉందేమిటి?" అంది.

ప్రియాంక ఇబ్బందికరమైన మౌనాన్ని భరించలేదు. ఆ జాగాని భర్తీ చెయ్యటం కోసం ఏమైనా మాట్లాడగలదు. పిచ్చివాగుడు ఆపు, అందామని అనుకున్నాను కాని, అనలేదు.

"ఇది ఢిల్లీ! ఇక్కడ మరింకెలా ఉంటుందనుకున్నావు?" అన్నాను.

"మాల్స్‌కి వచ్చేవాళ్లలో చాలామంది ఎయర్‌కండిషనింగ్ కోసమే వస్తారనుకుంటా-!"

"మనం త్వరగా ముగిద్దామా?" అన్నాను ఆమెకి అడ్డొస్తూ. మాల్‌కి జనం ఎందుకొస్తారో తెలుసుకోవాలన్న ఆసక్తి నాకు లేదు.

"ఓహ్!" అందామె నేను మాట్లాడిన విధానానికి ఉలిక్కిపడుతూ.

వెయిటర్ వచ్చి మా ఆర్డరు తీసుకున్నాడు. నేను రెండు చిన్న చీజ్ ఎండ్ మష్‌రూమ్

పిజ్జాలు తెమ్మని అతనికి చెప్పాను. ఒకటే పిజ్జా తెప్పించి ఆమెతో పంచుకోవటానికి నా మనస్కరించలేదు, పెద్ద పిజ్జా రెండు చిన్న వాటికన్నా చవక అయినప్పటికీ.

"నాకు ఇలా విడిపోవటం ఎలా ఉంటుందో, ఏం చెయ్యాలో తెలీదు. అందుకే దీన్ని అనవసరంగా పొడిగించద్దు. మనం పనిమీద ఇక్కడికి వచ్చాం. ఇప్పుడేం చెయ్యాలి. విడిపోయే ముందు నేనేమైనా అనాలా?"

ఆమె రెండు సెకన్లు నాకేసి చూసింది. నేను ఆమె ముక్కుకేసి చూడకుండా ఉండటానికి ప్రయత్నించాను. ఆమె ముక్కు నాదేనని, నా సొంతం అని, నాకెప్పుడూ అనిపించేది.

"ఊс! నేను దీన్ని కొంచెం ఉల్లాసంగా చేద్దామనుకున్నాను. మనం ప్రేమికులుగా విడిపోయినా, స్నేహితుల్లా ఉండచ్చు కదా?" అంది.

ఏమిటీ అమ్మాయిలు, జీవితాంతం స్నేహితులుగా ఉందామని ఎందుకంటారు! 'బాయ్‌ఫ్రెండు'కీ 'నో ఫ్రెండ్‌కీ' ఉన్న తేడాని స్పష్టంగా ఎందుకు తేల్చుకోలేరు?

"అనవసరం అనుకుంటా. మనకి ఇప్పటికే చాలామంది స్నేహితులు ఉన్నారు కదా?"

"ఇదే నాకు నీలో నచ్చనిది. నీ గొంతులో ఉండే ఆ మొండితనం, వ్యంగ్యం..." అంది.

"ఒకరి లోటుపాట్లు ఇంకొకరం ఇవాళ ఎత్తి చూపకూడదని ముందే నిర్ణయించుకున్నట్టున్నాం కదా? నేనివాళ ఇక్కడి కొచ్చింది విడిపోవటానికి, స్నేహితుల్ని సంపాదించుకోవటానికీ, నా ప్రవర్తన గురించి నువ్వు లోతుగా విశ్లేషిస్తుంటే వినటానికీ కాదు!"

వెయిటర్ పిజ్జాలు తెచ్చేవరకూ తనేమీ మాట్లాడలేదు. నేను ఒక ముక్క తీసుకుని తినసాగాను.

"మనిద్దరం కలిసి ఒకే చోట పనిచేస్తున్నామని నువ్వు మర్చిపోయినట్టున్నావు. దాని వల్ల మరింత ఇబ్బందిగా ఉంటుంది," అంది ప్రియాంక.

"ఏ విధంగా?"

"మనిద్దరి మధ్యా మానసికంగా ఒత్తిడి ఏర్పడితే, దాని ప్రభావం మనం చేసే పనిమీద ఉంటుంది, పని మీద దృష్టి పెట్టలేం. మనకీ, మిగతావాళ్ళకీ కూడా ఇబ్బందే," అంది ఆమె.

"అయితే ఏం చేద్దామంటావు? నీతో విడిపోయాను, ఇక ఉద్యోగం కూడా వదిలెయ్యమంటావా?" అన్నాను.

"నేనలా అనలేదు. అయినా నేనీ ఉద్యోగం మరో తొమ్మిది నెలలే చెయ్యబోతున్నాను. వచ్చే ఏటికి బీ.ఈడీ చేసేందుకు సరిపోయేంత డబ్బు కూడబెట్టగలుగుతాను. అందువల్ల ఆ పరిస్థితి దానంతటదే సర్దుకుంటుంది. కానీ మనం కొన్ని షరతులకి ఒప్పుకుంటే, అంటే ఈ మధ్యకాలంలో మనం స్నేహితుల్లా ఉండగలిగితే....."

"నేను బలవంతపెడితే స్నేహంగా ఉండలేను," అని ఆమె మాటకి అడ్డొచ్చాను. "నేను ఇతరులతో సంబంధాలు పెట్టుకునే పద్ధతి వేరు. నీకు అది పనికి రాకపోతే, సారీ! కానీ నేనలా నటించలేను," అన్నాను.



"నేనేం నిన్ను నటించమనటం లేదు," అంది.

"మంచిదే. ఎందుకంటే ఇక నువ్వు నేనేం చెయ్యాలో నాకు చెప్పే స్థితిలో లేవు. అందుకే, దీన్ని త్వరగా ముగించేద్దాం. ఇప్పుడు అనవలసింది ఏమిటి? మనం ఏం చెప్పుకోవాలట? 'మనం విడిపోతున్నాం' అని నేను యిప్పుడు అంటున్నాను. ఇక తరవాత మన యిద్దరం అనాలా, 'ఔను, నేను విడిపోతున్నా!' 'ఔను, నేను విడిపోతున్నా!' అని?"

నేను నా ప్లేటుని దూరంగా తోసేశాను. నా ఆకలి పూర్తిగా చచ్చిపోయింది. ఫ్రిస్బీని విసిరేసినట్టు నా పిజ్జాని గది అవతలివైపుకి గిరవాటెయ్యాలనిపించింది.

"ఏమిటి? ఏమైనా మాట్లాడు?" అన్నాను ఆమె పదిసెకన్ల వరకూ ఏమీ మాట్లాడక పోయేసరికి.

"ఏం మాట్లాడాలో తెలీటం లేదు," అంది ఆమె గొంతు కష్టం మీద పెగుల్చుకుని.

"నిజంగానా? సలహాలూ, ఆఖరి నిమిషంలో ఉపదేశాలూ, ఏవీ లేవా? పనికిమాలిన నీ బాయ్‌ఫ్రెండుకి ఆఖరిరోజు గొప్ప నీతివాక్యాలు ఏవీ చెప్పటం లేదా? కమాన్ ప్రియాంకా, ఓడిపోతున్నవాణ్ణి మరో దెబ్బ కొట్టే అవకాశాన్ని వదులుకోకు!"

ఆమె తన బ్యాగు తీసుకుని లేచి నిలబడింది. వందరూపాయల నోటు తీసి బల్లమీద పెట్టింది. అది ఆమె పిజ్జాకి చెల్లించిన తన వంతు ధర.

"ఓకే! మళ్లీ ఆమె ఏమీ మాట్లాడకుండానే వెళ్లిపోతోంది. మరోసారి నేనే చెడ్డవాణ్ణి అయాను!" ఆమెకి వినిపించేంత గట్టిగా గొణిగాను.

"శ్యామ్!" అంది ఆమె బ్యాగుని భుజానికి తగిలించుకుంటూ.

"ఆс!" అన్నాను.

"నువ్వెప్పుడూ నేనెందుకూ పనికిరానివాణ్ణి, ఏ పనీ సరిగ్గా చెయ్యలేను, అని అంటూ ఉంటావు కదా? అది నిజం కాదనుకుంటా. ఎందుకంటే ఒక పని నువ్వు చాలా చక్కగా చెయ్యగలవు," అంది ఆమె.

"ఏమిటది?" అన్నాను. బహుశా చివరి క్షణంలో నన్ను మెచ్చుకోవాలనీ, నాకు ఊరట కలిగించాలనీ అనుకుంటున్నట్టుంది!

"అవతలి వాళ్ల మనసుని గాయపరచటంలో నీకు నువ్వేసాటి. ఆ నేర్పుని వదులుకోవద్దు!"

ఆ మాట అని, నా మాజీ ప్రియురాలు వెనక్కి తిరిగి వెళ్లిపోయింది.

# # 24

మేం 2:30కి బక్షీ ఆఫీసుకి వెళ్లాం. అతని ఆఫీసు సింగిల్‌బెడ్‌రూమ్ ఫ్లాట్‌లా ఉంటుంది. బహుశా ఈ ప్రపంచంలోకల్లా ఎందుకూ పనికిరాని ఆఫీసు ఇదే! అతని బల్ల దానిమీద అధునాతనమైన ఫ్లాట్ స్క్రీన్ పీ.సీ. ఆ గదిలో ఒక మూలగా ఉన్నాయి. ఆ బల్ల పక్క ఒక పుస్తకాల షెల్ఫ్ ఉంది. దాన్నిండా భయంకరమైన లావుపాటి బిజినెస్ మేనేజ్‌మెంట్ పుస్తకాలున్నాయి. వాటిలో కొన్ని ఎంత బరువున్నాయంటే, వాటిని ఆయుధాలుగా ఉపయోగించి ఎవరిమీదైనా దాడి చెయ్యొచ్చు! ఇంతకుముందు జరిగిన టీమ్ మీటింగులలో వాటిలో ఒక దానితో బక్షీ బుర్రమీద గట్టిగా కొట్టాలన్న ఆలోచన చాలాసార్లు నాకు వచ్చింది. ముగ్గురు అందమైన అమ్మాయిలతో గడపటం కాక, ఇండియాలోని మగాడు ఊహాలోకంలో కోరుకునే చిట్టచివరి కోరిక, బాస్‌ని తన్నాలనేదే.

గదిలో ఇంకోమూల ఒక కాన్ఫరెన్స్ బల్లా, ఆరు కూర్చీలూ ఉన్నాయి. బల్ల మధ్యలో ఒక స్పీకర్ ఫోనుంది. దానిలో మిగతా ఆఫీసులన్నిటితోనూ మాట్లాడే వెసులుబాటుంది.

మేం అక్కడికి చేరేసరికి బక్షీ ఆఫీసులో లేడు.

"ఎక్కడికి పోయాడు ఈ మనిషి?" అన్నాడు వ్రూమ్.

"టాయిలెట్‌లో ఉన్నాడేమో!" అన్నాను.

"ఆఫీసర్లు వాడే టాయిలెట్, దాని షోకే వేరు!" అన్నాడు వ్రూమ్. నేను అవునని తలాడించాను.

మేం బక్షీ కాన్ఫరెన్స్ బల్ల చుట్టూ కూర్చున్నాం. అందరం మీటింగ్‌కి నోటుపుస్తకాలు పట్టుకొచ్చాం. మేమెప్పుడూ వాటిని ఉపయోగించకపోయినా, మీటింగుల కొచ్చినప్పుడు మన ముందు ఒక నోటు పుస్తకాన్ని తెరిచి ఉంచి కూర్చోవటం అవసరమనుకుంటా.

"ఏడీ ఇతను?" అంది ప్రియాంక.

"నాకు తెలీదు, అయినా మనకేం పట్టింది?" అని వ్రూమ్ లేచి నిలబడ్డాడు. "ఏయ్ శ్యామ్! బక్షీ కంప్యూటర్లో ఏముందో చూద్దామా?" అని బక్షీ బల్ల దగ్గరకి నడిచాడు.

"ఏమిటి, నీకేమైనా మతిపోయిందా? ఏ క్షణాన్నైనా అతను రావచ్చు. అయినా ఇంత త్వరగా ఏం చూద్దామని నీ ఉద్దేశం?" అన్నాను.

"ఊరికే సరదాకి. బక్షీ ఏ వెబ్‌సైట్లు చూస్తాడో నీకు తెలుసుకోవాలనుందా?" అని



ముందుకి వంగి, బక్షీ కీబోర్డుని ముట్టుకోబోయాడు. ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్‌ని తెరిచి, బక్షీ చూసిన వెబ్‌సైట్లని తెలుసుకోవటానికి Ctrl + H బటన్‌ని నొక్కాడు.

"నీకు నిజంగానే పిచ్చెక్కింది. చిక్కుల్లో పడబోతున్నావు!" అన్నాను.

"ఇటు వచ్చెయ్యి, వ్రూమ్!" అంది ఈషా.

"ఓకే. ఇప్పుడే ఒక ప్రింట్ తీసుకోవటానికి సిద్ధంగా ఉన్నాను," అని బక్షీ ప్రింటర్ దగ్గరికీ గబగబా వెళ్ళాడు వ్రూమ్. ఆ ప్రింటవుట్‌ని పట్టుకుని కాన్ఫరెన్స్ బల్ల దగ్గరికి ఒక్క ఉదుటున వచ్చేశాడు.

"నీకు బుద్ధిలేదా?" అన్నాను.

"ఓకే! అందరూ ఇది చూడండ్రా!" అని ఏ4 కాయితాన్ని ఎదురుగా పట్టుకున్నాడు. "*timesofindia.com, rediff.com* ఆ తరవాత ఏముంది? హార్వర్డ్ బిజినెస్ రివ్యూ వెబ్‌సైట్, బోస్టన్ వాతావరణానికి సంబంధించిన వెబ్‌సైట్, బోస్టన్‌లో చూడవలసిన ప్రదేశాలూ, బోస్టన్ రియల్ ఎస్టేట్ –"

"–ఇతనికీ బోస్టన్‌కీ ఏమిటి లంకె?" అంది ఈషా.

"త్వరలో అక్కడికి బిజినెస్ ట్రిప్ మీద వెళ్లబోతున్నాడుగా!" అని రాధిక గుర్తు చేసింది.

"ఇంకా ఏమేం వెబ్‌సైట్లున్నాయి?" అన్నాను.

"ఇంకా ఉన్నాయి.... ఆహా! నేను వెతుకుతున్నది ఇదుగో. ఇక్కడుంది : *awesomeindia.com* – ఇండియన్ అమ్మాయిలకి సంబంధించిన గొప్ప బూతు సైట్! *adultfriendfinder.com* – సెక్స్ వ్యక్తుల సైట్, *cabaretlounge.com* – అమ్మాయిలూ, అబ్బాయిలూ బట్టలు విప్పేస్తూ నగ్నంగా ప్రదర్శనలిచ్చే బోస్టన్‌లో స్ట్రిప్‌క్లబ్ – *porninspector.com* ... హల్లో.... ఈ విభాగంలో పెద్ద తరగని లిస్టే ఉందర్రోయ్!"

"ఇతనికీ బోస్టన్‌కీ ఏమిటి లంకె," అన్నాను ఈషా అన్న మాటల్నే మళ్లీ పలుకుతూ.

"ఎవరికి తెలుసు?" అని నవ్వాడు వ్రూమ్. "ఏయ్, ఇది చూడండి : వయాగ్రాకి సంబంధించిన అఫీషియల్ సైట్. ఆరుగంటల క్రితం ఈ సైట్‌కి వెళ్లాడు, గురుడు!" అన్నాడు.

"నేనతన్ని బోస్టన్ గురించి అతన్ని అడగటానికి ప్రయత్నిస్తాను," అంది ప్రియాంక.

ఇంతలో బక్షీ అడుగుల చప్పుడు వినబడింది. వ్రూమ్ తన చేతిలోని కాయితాన్ని మడత పెట్టేశాడు. మేం నిశ్శబ్దంగా మా నోటు పుస్తకాలలో ఖాళీ పేజీని తెరిచాం.

ఆఫీసులోకి రాగానే బక్షీ గబగబా అడుగులు వేశాడు.

"సారీ, టీమ్! కంప్యూటర్స్ విభాగంలోని టీమ్ లీడర్స్ దగ్గరకి అవసరమైన మేనేజ్‌మెంట్ విషయాలు మాట్లాడటానికి వెళ్లాల్సి వచ్చింది. అయితే అందరూ ఎలా ఉన్నారు?" అన్నాడు బక్షీ కాన్ఫరెన్స్ బల్ల చుట్టూ ఉన్న కూర్చీల్లో ఖాళీగా ఉన్న కూర్చీలో కూర్చుంటూ.

ఎవరూ జవాబు చెప్పలేదు. నేను తలాడించి, బాగానే ఉన్నానని అన్నాను. కానీ బక్షీ నావైపు చూడటం లేదు.

"టీమ్! ఇవాళ మిమ్మల్ని ఇక్కడికి పిలిచింది, కనెక్షన్స్‌లో జరగబోయే కొన్ని మార్పుల గురించి చెప్పటానికి. ఇక్కడ కొంతమందిని ఉద్యోగాల్లోంచి తీసెయ్యాల్సి వచ్చేట్టుంది."

"అయితే కొందరి ఉద్యోగాలు ఊడతాయన్నమాట. అది ఉత్త పుకారు కాదు," అన్నాడు ఫ్రూమ్.

రాధిక మొహంలో నెత్తురుచుక్క లేదు. ప్రియాంక, రాధికా ప్రమాన్పడిపోయినట్లు కూర్చుండిపోయారు.

"మాకు ఎవరి ఉద్యోగాలూ ఊడగొట్టాలని ఉండదు, మిస్టర్ విక్టర్! కానీ ఒక్కోసారి ఎక్కువమంది ఉన్నారనిపిస్తే తగ్గించాల్సి వస్తుంది, తప్పదు."

"ఎందుకు? ఎందుకని మనం ఉద్యోగాల్లోంచి మనుషుల్ని తీసెయ్యాలి? మనం ఈ సమస్యని మరోలా పరిష్కరించుకోవచ్చని స్పష్టంగా కనబడుతూనే ఉందిగా?" అన్నాడు ఫ్రూమ్.

"మేం అన్ని రకాల ప్రత్యామ్నాయాలనీ చాలా జాగ్రత్తగా తరచి చూశాం కానీ..." అని బక్షీ పెన్ను తీశాడు. అందరం భయంతో వెనక్కి తగ్గాం. మాకిప్పుడు బక్షీ గీసే బొమ్మ చూడటంలో ఎటువంటి ఆసక్తీ లేదు!

"ఖర్చు తగ్గించుకోవటం ఒక్కటే దారి," అని బక్షీ ఏదో బొమ్మ గీయసాగాడు. కానీ పెన్ను సరిగ్గా రాయలేదు. దాన్ని విదిల్చి రాసేట్టు చేద్దామని ప్రయత్నించాడు, బాల్‌పెన్నుని విదిలించటం వల్ల ఏమీ లాభం ఉండదు. పెన్ను కూడా సహకరించలేదు, బహుశా బక్షీ తను వాడుకునే పద్ధతి దానిక్కూడా నచ్చలేదేమో!

నా దగ్గరున్న పెన్ను ఇవ్వబోతూంటే, నా పక్కనే కూర్చున్న ఈషా అది గమనించి, నా మోచేతిని పొడిచి, ఆపింది. బక్షీ ఇంకా తన ఉపన్యాసం ఇస్తూనే ఉన్నాడు. ఆరునిమిషాలపాటు ఆపకుండా మాట్లాడాడు. రకరకాల మేనేజ్‌మెంటు తత్వాల గురించి మాట్లాడాడు, ఆలోచనా ధోరణుల గురించి మాట్లాడాడు, కార్పరేట్ నియమాల గురించీ, ఇంకా ఎన్నో లోతైన క్లిష్టమైన విషయాల గురించీ లెక్చరిచ్చాడు. వాటి గురించి నామటుకు నాకు ఏమీ తెలీదు. అతను చెప్పదల్చుకున్న సంగతి, మేము కంపెనీని మరింత సమర్ధతగలదానిలా తయారుచేయాలి. అలా చెప్పటానికి అవసరమైన సమర్ధత మాత్రం అతని దగ్గర లేదు!

ఇవాళ బక్షీతో వెబ్‌సైట్ గురించి మాట్లాడనని ఫ్రూమ్ నాకు మాటిచ్చాడు. కనీసం ఉద్యోగాలు పోవటం సంగతి తేలేవరకూ మాట్లాడానని అన్నాడు. కానీ, బక్షీతో వాదన పెట్టుకోవటానికి అది అతనికి అడ్డురాలేదు.

"సార్! మనకి సేల్స్‌లో పెరుగుదల లేకపోయినప్పుడు, ఖర్చులు తగ్గించుకోవటంతో లాభమేమీ ఉండదు. మనకి ఇంకా ఎక్కువమంది ఖాతాదార్లు అవసరం, కంపెనీ అనేది ఆగకుండా పోయేంతవరకూ, అలా ఖర్చులు తగ్గించుకుంటూ పోవటం కాదు," అన్నాడు ఫ్రూమ్, బక్షీ తన ఉపన్యాసాన్ని ముగించాక. ఫ్రూమ్‌లో పట్టువదలని విక్రమార్కుడిలాంటి ఆశావాది ఉండి ఉండాలి. బక్షీ తన మాట వింటాడని అతనికి ఎంత గట్టి నమ్మకం ఉందో!


"మేం అవన్నీ ఆలోచించాం. సేల్స్ కోసం మనుషుల్ని ఉద్యోగాల్లోకి తీసుకోవటం అనేది చాలా ఖరీదుతో కూడుకున్న పని," అన్నాడు బక్షీ.

"సార్! ఉన్నవాళ్లతోనే మనం ఒక సేల్స్ గ్రూప్‌ని తయారుచెయ్యచ్చు. మన దగ్గర కొన్నివేలమంది ఏజెంట్లున్నారు. వాళ్లలో తప్పకుండా కొంతమంది అమ్మకాలు చెయ్యగల వాళ్లుంటారని నా నమ్మకం. మేం రోజూ వినియోగదార్లతో మాట్లాడతాం, అందుకే వాళ్లకేం కావాలో మాకు తెలుసు."

"కానీ మన ఖాతాదార్లున్నది అమెరికాలో. మనం అమ్మకాలు అక్కడ చెయ్యాలి."

"అయితేనేం? కొంతమంది ఏజెంట్లని అమెరికాకి పంపి మన ఖాతాదార్ల సంఖ్యని పెంచుకోవచ్చు కదా? ఏమన్రా, అలా ఎందుకు చెయ్యకూడదు?" అని ఫ్రూమ్ మాకేసి చూశాడు. మేమందరం అతనితో ఏకీభవించి తలకాయల్ని అదేపనిగా ఊపేస్తామనుకున్నట్టున్నాడు. కానీ వింటున్నది నేనొక్కణ్ణే, అయినా మౌనంగా ఉండిపోయాను.

రాధిక తన నోటుపుస్తకంలో పిచ్చిగీతలు గీస్తోంది. ఆమె గీస్తున్న బొమ్మ ఇలా ఉంది.



ప్రియాంక తన పుస్తకంలో వరసగా అంకెలు వేస్తోంది. తన పెళ్లిరోజు ఏ తేదీన వస్తుందో తెలుసుకోటానికి క్యాలెండర్ వేస్తోందనుకుంటా. ఆ పుస్తకాన్ని చింపి పోగులుపెట్టాలనిపించింది నాకు. ఈషా తన పెన్ను నిబ్‌ని పుస్తకంలోకి గట్టిగా పొడిచి, దాన్ని వెనుకవైపుకి వచ్చేట్టు చెయ్యాలని చూస్తోంది.

"ఏజెంట్లని అమెరికా పంపాలా? బోస్టన్‌లో ఉండే ఆఫీసుకా?" అని బక్షీ నవ్వాడు.

"అవును, కొందర్ని, కనీసం ఒకసారి పంపి చూడచ్చుగా? కొందరు నిజంగానే ఎంతో చురుకైనవాళ్లున్నారు. వాళ్లు వందమంది ఉద్యోగాలని రక్షించే ఒకే ఒక ఖాతాదారుని తెచ్చుకోగలుగుతారేమో, ఎవరు చూడొచ్చారు? అవునా, శ్యామ్?" అన్నాడు ఫ్రూమ్.

"ఆఁ!" అన్నాను నా పేరు ఉచ్చరించటం విని ఉలిక్కిపడుతూ.

"మిస్టర్ విక్టర్! అవతలివాళ్ల ఉద్దేశాలు తెలుసుకోవాలనే కోరిక ఉన్న మేనేజర్‌గా నువ్వు చెప్పిన సలహాలని నేను వినిపించుకోవటం అనేది ఎప్పుడూ ఉంటుంది. అయినా, నువ్వు చెప్పిన ఈ సలహా మాత్రం అంత బాగా లేదనిపిస్తోంది," అన్నాడు బక్షీ.

"ఎందుకని?" వ్రూమ్ రెట్టిస్తూ, ప్రైమరీ స్కూలు పిల్లాడిలా అమాయకంగా అడిగాడు.

"అది అంత మంచి సలహా అయితే, ఇంతకుముందే ఎవరికైనా తట్టేదే కదా! ఉదాహరణకి నాకే ఎందుకు తట్టలేదంటావు?" అన్నాడు. బక్షీ.

"ఆc!" అన్నాడు వ్రూమ్ నిర్ఘాంతపోతూ. ఇలాంటివి ఇంతకుముందే చాలా విన్నాడు కాబట్టి అది నన్ను కదిలించలేదు. బక్షీ ఒంట్లోని రక్తంలో ఉండే ఒక్కొక్క ఎర్రకణమూ, తెల్లకణమూ, నల్లకణమూ నాకు బాగా తెలిసినవే!

"అయితే పరిస్థితి ఏమిటి, సార్? ఎవరెవరి ఉద్యోగాలు ఊడబోతున్నాయో... అంటే అదే ఉద్యోగుల సంఖ్యని సరిచెయ్యటం, ఎప్పుడు జరుగుతుంది?"

"త్వరలోనే తెలుస్తుంది. మేము లిస్ట్ తయారుచెయ్యటం పూర్తి చేశాం. కాని దాన్ని ఇవాళ పొద్దున్నో, లేదా రేపు రాత్రి పెందరాళనో మీకు చెపుతాం," అన్నాడు బక్షీ. నేనతన్ని ఎదిరించలేదన్న కారణంగా అతను హాయిగా ఊపిరి పీల్చుకున్నాడని అతని నుదుటిని చూస్తే తెలిసింది.

"ఎంతమందిని ఉద్యోగంలోంచి తీసేస్తున్నారు, సార్? ఎంత శాతం?" అంది రాధిక మీటింగులో మొదటిసారి మాట్లాడుతూ.

"ముప్పైనించి నలభైశాతం, ప్రస్తుతానికి ఉండచ్చు," అన్నాడు బక్షీ బాగా అనుభవం ఉన్న గొంతుతో శాంతంగా. అతని గొంతు వాతావరణ సూచన తెలుపుతున్నంత మామూలుగా ఉంది.

"అంటే కొన్ని వందల మంది," అన్నాడు వ్రూమ్ అదేదో చాలా కష్టమైన లెక్కలాగ.

"కార్పొరేట్ జీవితం అలాగే ఉంటుంది, మై ఫ్రెండ్!" అంటూ బక్షీ లేచి నిలబడ్డాడు. అంటే మీటింగ్ అయిపోయిందని అర్థం. "మీకు తెలుసుకదా, అందరూ ఏమంటారో? దీన్ని అడవి అంటారు!" అలా ఎవరన్నారో నాకు తెలీదు, కానీ బక్షీని చూస్తే, ఈ అడవిలో బఫూన్లు కూడా ఉన్నారని అనిపించింది.

అమ్మాయిలు తమ నోటుపుస్తకాలని జాగ్రత్తగా తీసుకుని లేచారు. వ్రూమ్ కొన్ని సెకన్లు అక్కడే కూర్చుండిపోయాడు. బక్షీ చూసిన వెబ్‌సైట్ల కాయితాన్ని నలిపి జేబులో పెట్టుకున్నాడు.

"థాంక్యూ సార్!" అంది ఈషా.

"యూ ఆర్ వెల్‌కమ్! నా దగ్గరకి ఎవరైనా ఎప్పుడైనా రావచ్చని మీకు తెలుసు. ఇక్కడైనా బోస్టన్‌లోనైనా ఈ మేనేజరు ఎప్పుడూ మీకు అందుబాటులోనే ఉంటాడు."

మేం బైటికెళ్తూ తలుపు దగ్గరకొచ్చినప్పుడు ప్రియాంక బక్షీని, "సార్! మీరు త్వరలో బోస్టన్ వెళ్తున్నారా?" అని అడిగింది.

బక్షీ ఆసరికి తన బల్ల దగ్గరకెళ్లి ఫోన్ ఎత్తాడు, కానీ ప్రియాంక ప్రశ్న విని "ఆc... యెస్, అన్నట్టు ఆ విషయం మీకు చెప్పాలి. అది ఏమంత ముఖ్యమైన విషయం కాదు.



కానీ త్వరలో నేను ట్రాన్స్‌ఫరయి బోస్టన్‌కి వెళ్తున్నాను. బహుశా ఒక నెలరోజుల్లో," అన్నాడు.

"బోస్టన్‌కి ట్రాన్స్‌ఫరా?" వ్రూమ్, రాధిక, ఈషా, ప్రియాంక, నేనూ, అందరం ఒకేసారి అన్నాం.

"అవును. నా సొంత డబ్బా నేనే కొట్టుకోవటం నాకిష్టం ఉండదు. కానీ మనం చేసే పనికి వెలకట్టే కంపెనీ విభాగం వాళ్లు నేను కంపెనీకి చేసిన సేవల్ని గుర్తించినట్టున్నారు," అన్నాడు బక్షీ. అతని జిడ్డుమొహంమీద ఒక చిరునవ్వు చక్కగా జారింది. ఆ పుస్తకాల షెల్ఫ్‌ని మొత్తంగా అతని బుర్రమీద పడేట్టు తొయ్యాలని అనిపించింది నాకు.

"కానీ వివరాలు తరవాత తెలుస్తాయి. సరే, మీరేమీ అనుకోకపోతే, నేనొక ఫోన్‌కాల్ చెయ్యాలి. ఇంకా ఏమైనా సమాచారం తెలిస్తే మీకు ఎప్పటికప్పుడు చెపుతాలెండి."

బైటికెళ్లాక తలుపు మూసెయ్యమని బక్షీ మాకు సైగ చేశాడు. తలుపు మూస్తూంటే, ఎవరో చాచి నా మొహం మీద కొట్టినట్టనిపించింది. మేము అడుగులో అడుగు వేసుకుంటూ బక్షీ ఆఫీసునించి వెళ్లిపోయాం.

# # 25

బక్షీతో మీటింగ్ అయాక మేం మళ్లీ డబ్ల్యుఏఎస్‌జీకి వచ్చాం. ఫోన్‌కాల్స్ కంప్యూటర్ తెరమీద వెలిగి ఆరుతున్నాయి, కానీ ఎవరూ వాటిని పట్టించుకోలేదు. నేను నా సీట్లో కూర్చుని ఈమెయిల్స్ చూసుకోసాగాను. నా బుర్రంతా ఏవేవో ఆలోచనలతో నిండిపోయి, తెరమీది అక్షరాలు చదవలేకపోయాను.

టైము చూస్తే 2:45 అయింది.

బ్రూమ్ తన బల్ల దగ్గర కూర్చుని సణుక్కుంటూ, తిట్టుకుంటున్నాడు. తన కంప్యూటర్‌లో కనెక్షన్స్ తాలూకు ఇంటర్నల్ వెబ్‌పేజీని తెరిచాడు. దానిలో అమెరికా దేశపటం ఉంది. పెన్నుతో అమెరికాకు తూర్పువైపు సముద్రపు ఒడ్డున ఒక చోటిని తట్టాడు.

"ఇదే, ఇదే బోస్టన్," అని పెన్ను మీదున్న పిడికిలిని బిగించాడు. "మనం రోడ్డుమీద ఉద్యోగం కోసం వెతుక్కుంటూ తిరుగుతున్నప్పుడు, మన బాస్ ఇక్కడ ఉంటాడు!" అన్నాడు.

అందరం నిశ్శబ్దంగా ఉండిపోయాం.

"అందరూ అలా మూగమొద్దుల్లా ఎందుకున్నారో తెలుసుకోవచ్చా?" అన్నాడు బ్రూమ్.

"మనం ఇక ఫోన్‌కాల్స్‌కి జవాబులు చెప్పటం మొదలుపెట్టచ్చేమో!" అని, టెలిఫోన్ కంట్రోల్స్‌తో కుస్తీ పట్టసాగాను.

"అవునవును, మరి చెయ్యద్దూ!?" అంటూ బ్రూమ్ పెన్నుతో తన కంప్యూటర్ మానిటర్‌ని గట్టిగా పొడిచాడు. పెద్ద శబ్దం అయేసరికి అందరం ఉలిక్కిపడ్డాం. బ్రూమ్ మానిటర్ అద్దం మీద, సాలీడుగూడులా తొమ్మిది అంగుళాల మేర పగుళ్లు ఏర్పడ్డాయి. మిగతా తెరమీద ఏమీ జరగనట్టు పని జరుగుతూనే ఉంది.

"ఏమయింది?" అంటూ అమ్మాయిలందరూ బ్రూమ్ కంప్యూటర్ చుట్టూ మూగారు.

"డామిట్!" అంటూ బ్రూమ్ తన పెన్నుని నేలకేసి విసిరికొట్టాడు. అది రెండు ముక్కలయింది. కొంతమంది బాధ కలిగినప్పుడు ఏడుస్తారు. కొంతమంది చేతికి అందిన వస్తువుల్ని పగలగొడతారు.

"ఓహ్, నో! మానిటర్ పూర్తిగా ధ్వంసమయింది!" అంది ఈషా. బ్రూమ్ భుజం మీద చెయ్యివేసి," ఇప్పుడు కోపం తగ్గిందా?" అంది.



"ఏయ్, తిరుగుబోతూ! నన్ను ముట్టుకోవటానికి నీకెంత ధైర్యం?" అని బ్రూమ్ ఈషా చెయ్యి విదిలించి కొట్టాడు.

"ఏమిటీ? ఏమన్నావు?" అంది ఈషా.

"ఏం లేదు. ఇక్కణ్ణించి వెళ్లు, వెళ్లి నీ ఉద్యోగం ఊడకూడదని దేవుణ్ణి ప్రార్థించు, పో! బ్లడీ బిచ్! ఒళ్లమ్ముకుని బతకటానికి తయారవుతోంది!" అంటూ బ్రూమ్ తన కుర్చీని ఈషాకి దూరంగా జరిపాడు.

కొన్ని సెకన్లపాటు అమ్మాయిలు మ్రాన్పడిపోయి నిల్చుండిపోయారు. ఆ తరవాత నెమ్మదిగా తమ సీట్ల దగ్గరికి వెళ్లిపోయారు.

"వీడికేమయింది?" అంది ప్రియాంక ఈషాతో రహస్యంగా. కానీ అది మాకు వినిపించింది.

"నేను చెప్పా కదా, అతను మళ్లీ నాకు ప్రపోజ్ చేశాడు, నేను కాదనటాన్ని బహుశా సహించలేకపోతున్నాడు," అంది ఈషా.

"ఓ, నిజంగానా?" అని అరిచి బ్రూమ్ లేచి నిలబడ్డాడు. "అయితే నాకోపం అంతా అందుకే అనుకుంటున్నావా? నాకు నువ్వు నడిపిన వ్యవహారాలన్నీ తెలీదనుకుంటున్నట్టున్నావు. ఇక్కడ అందరికీ వాటి గురించి తెలుసు, శ్యామ్‌కీ, రాధికకీ, ప్రియాంకకీ. నేను కనిపెట్టలేనని అనుకున్నావు కదూ? నువ్వు డబ్బుకోసం ఎవడితో పడితే వాడితో పడుకునే రకం అని నేను నీతో స్నేహం మొదలుపెట్టకముందే తెలిస్తే బావుండేది. ఛీ, నన్ను చూస్తే నాకే అసహ్యం వేస్తోంది!" అన్నాడు.

ఈషా నిర్ఘాంతపోతూ మా అందరికేసీ చూసింది. ఆమె కళ్లల్లో నీళ్లు ఉబికాయి. మనిషి వణికిపోసాగింది. రాధిక సాయంపట్టి ఆమెని కూర్చోపెట్టింది. నిలబడి ఏడవటం కన్నా కూర్చుని ఏడవటం ఇంకా బావుంటుంది!

బ్రూమ్ సీటు దగ్గరకెళ్లి ప్రియాంక అతనికేసి ఉరిమిచూసింది. ఆమె మొహం కందగడ్డలా అయింది. ఠప్! బ్రూమ్ మొహంమీద చేతితో గట్టిగా ఒక చరుపు చరిచింది.

"ఆడవాళ్లతో ఎలా మాట్లాడాలో నేర్చుకో. ఇంకొక్కమాట అన్నావంటే నీకు జీవితంలో ఆనందమనేది లేకుండా చేస్తాను, తెలిసిందా?" అంది ప్రియాంక.

బ్రూమ్ కూడా ప్రియాంకని గుడ్లురిమి చూశాడు, చేత్తో బుగ్గని రుద్దుకున్నాడు. ప్రతి ఘటించలేనంతగా అవాక్కయాడు బ్రూమ్. నేను వాళ్లిద్దరి మధ్యకీ అడ్డం వెళ్లాను, "ఏమర్రా కొంచెం శాంతిస్తారా? ఇప్పటికే బోలెడన్ని సమస్యలతో తలమునకలై ఉన్నాం. ప్లీజ్, కూర్చుని ఎవరిపని వాళ్లు చేసుకుందామా?" అన్నాను.

"నేను పనిచెయ్యలేను. ఇంకొన్ని గంటల్లో నాకీ ఉద్యోగం ఉంటుందో, ఊడుతుందో కూడా తెలీని పరిస్థితి!" అంటూ ప్రియాంక తన సీట్లోకి వెళ్లిపోయింది. అక్కడినించే బ్రూమ్‌ని గుడ్లురిమి చూడసాగింది.

"కనీసం కూర్చోండి," అన్నాను.

"అతను ఈషాకి క్షమాపణ చెప్పాలి. ఇడియట్! ఏం మాట్లాడుతున్నాడో కాస్త ఆలోచించి మాట్లాడాలి," అంది ప్రియాంక.

ఈషా ఇంకా ఏడుస్తూనే ఉంది, రాధిక ఆమెని ఓదార్చటానికి ప్రయత్నిస్తోంది.

"నీకు ఉద్యోగం గురించి విచారం ఏముంటుంది? నువ్వెలాగూ పెళ్లి చేసుకోబోతున్నావుగా? ఆడవాళ్లకి ఎంతైనా పెద్ద ఇబ్బందులేమీ ఉండవు, సుఖంగా గడిచిపోతుంది," అన్నాడు వ్రూమ్.

"ఏమిటి నువ్వనేది? ఇదుగో, మళ్లీ నాతో పెట్టుకుంటున్నావు, జాగ్రత్త! నాకు చాలా సుఖంగా ఉందనుకుంటున్నావా? మాకే ఇబ్బందీ లేదా?" అంది రాధికనీ, ఈషానీ చూపిస్తూ ప్రియాంక తన సీటు దగ్గరకి వెళ్లింది కానీ కూర్చోలేదు.

వ్రూమ్ మాట్లాడకుండా కళ్లు దించుకున్నాడు.

"రాధికకి తన మొగుడు తనని మోసం చేస్తున్నాడని తెలిసింది. అదీ, తను పగలనక రాత్రనక అతనికీ, అతని కుటుంబానికీ వెట్టిచాకిరీ చేస్తూ ఎంతో ప్రేమగా ఉన్నప్పుడు. ఇక ఈషా, దిక్కుమాలిన వెధవలతో పడుకుంటే కానీ తనకి మంచి అవకాశాలు రావు. అయినా వాళ్లు మానిటర్లని బద్దలుకొట్టి నోటికొచ్చిన తిట్లు తిట్టటం లేదు, వ్రూమ్. మేం గొడవ చెయ్యనంత మాత్రాన మాకు అంతా సుఖంగా గడిచిపోతోందని అనుకోకు," అంది గట్టిగా అరుస్తూ, అది నా చెవులకి 'గొడవ'లాగే వినిపించింది.

"ఒక రెండు నిమిషాలు మనం మాట్లాడకుండా ఉండలేమా? ఫోన్లు ఎత్తద్దులే! కనీసం గోల చెయ్యకుండా ఉండండి?" అన్నాను.

రాధిక గ్లాసులో నీళ్లు తెచ్చి ఈషాకి తాగమని ఇచ్చేసరికి, ఈషా ఏడవటం మానేసింది. ప్రియాంక కూర్చుని, తను క్యాలెండర్ గీసిన నోటుపుస్తకం తెరిచింది. బల్లమీద పడి చెదిరిపోయిన అద్దం ముక్కల్ని చూస్తూ వ్రూమ్ మౌనంగా ఉండిపోయాడు.

అంతా నిశ్శబ్దంగా ఉండటంతో, బక్షీతో జరిగిన మీటింగ్‌ని నేను నెమరువేసుకోవటానికి అవకాశం దొరికింది. నా ఉద్యోగం ఊడితే నేనేం చేస్తాను? *మళ్లీ ఏజెంటుగా మారతానా?* ఇక టీమ్‌లీడర్ అవుతానన్న ఆశ వదులుకోవలసిందే!

"సారీ!" అని గొణిగాడు వ్రూమ్.

"ఏమన్నావు?" అంది ఈషా.

"సారీ, ఈషా!" అన్నాడు వ్రూమ్ గొంతు సవరించుకుంటూ. "నేను నిన్ను చాలా ఘోరమైన మాటలని బాధపెట్టాను. నా మనసేం బావుండలేదు. ప్లీజ్, నన్ను క్షమించు!" అన్నాడు.

"ఫరవాలేదులే, వ్రూమ్! నువ్వన్నమాటల్లో కొంత నిజం ఉండటంవల్లే నేను బాధపడ్డాను," అంది ఈషా వంకరగా నవ్వుతూ.



"ఆ ఘోరమైన మాటలన్నీ నన్ను నేను అనుకోవాలని అనిపించినవి, అందుకే," అని వ్రూమ్ రెండుచేతులూ పిడికిళ్లు బిగించి బల్లమీద గుద్దాడు. "ఎందుకంటే అసలైన వ్యభిచారిని, నేను, నువ్వుకాదు," అన్నాడు.

"ఏమిటీ?" అన్నాను.

"అవును, ఈ జీతం నన్ను పట్టుకుని వదలటంలేదు. ప్రతిరాత్రీ ఇక్కడికొచ్చి, ఇక్కడివాళ్లు నన్ను ఉపయోగించుకుంటూ ఉంటే, చూస్తూ కూర్చుంటున్నాను!" అని వ్రూమ్ టెలిఫోన్ హెడ్‌సెట్ చేతిలోకి తీసుకున్నాడు. "ఇదుగో, దీనితో అమెరికన్లు, ఒక రాత్రిలో వందలసార్లు నన్ను వాడుకుంటారు. బక్షీ, తన మేనేజ్‌మెంటు సూత్రాలతోనూ, వెన్నుపోట్లతోనూ, ఉద్యోగాలు ఊడతాయనే బెదిరింపులతోనూ, నన్ను ఎడాపెడా వాడుకుంటాడు. అసలు తమాషా ఏమిటంటే, నేను అలా వాళ్లని వాడుకోనిస్తున్నాను. డబ్బు కోసం, భద్రత కోసం, అలా జరగనిస్తాను. రండి... వచ్చి నన్ను మరింత వాడుకోండి!" అని వ్రూమ్ హెడ్‌సెట్‌ని బల్లమీదికి విసిరేశాడు.

"నీకు నీళ్లు కావాలా?" అంటూ రాధిక అతనికి ఒక గ్లాసులో నీళ్లిచ్చింది.

వ్రూమ్ ఆ గ్లాసందుకుని ఒక్క గుక్కలో దాన్ని ఖాళీ చేశాడు. ఆ ఖాళీ గ్లాసుని నేలమీదికి విసిరి పగలగొట్టడు కదా, అనుకున్నాను. అదృష్టంకొద్దీ, దాన్ని బల్లమీద చప్పుడయ్యేట్టు బలంగా పెట్టాడు.

"థాంక్స్! నీళ్లివటం మంచిదే అయింది. నిజం చెప్పాలంటే, నాకు కాస్త విశ్రాంతి కావాలి. లేకపోతే పిచ్చెక్కేట్టుంది. ఇంక భరించే శక్తి తగ్గిపోయింది!" అన్నాడు వ్రూమ్.

"నాకు కూడా విశ్రాంతి కావాలి. ఏం ఫరవాలేదులే వ్రూమ్. ఇంకొన్ని గంటల్లో మన షిఫ్ట్ పూర్తవుతుంది!" అంది ప్రియాంక.

"లేదు, నాకు ఇప్పుడే బ్రేక్ కావాలి. నేను అలా కారులో తిరిగి వస్తాను. రండర్రా, అందరం కారులో అలా తిరిగివద్దాం. నేను క్వాలిస్ తీసుకొస్తాను," అని వ్రూమ్ లేచి నిలబడ్డాడు.

"ఇప్పుడా? టైము 3 అవుతోంది!" అన్నాను.

"అవును, ఇప్పుడే. ఈ ఫోన్‌కాల్స్ గురించి మనకేం పట్టింది? నీకు ఈ ఉద్యోగమే లేకుండా పోవచ్చు. లే, లే!"

"అసలు మీలో ఎవరైనా బైటికెళ్తుంటే, 24 గంటల మందుల దుకాణం నించి నాకు తలనెప్పి మాత్రలు తెచ్చిపెట్టగలరా?" అంది రాధిక.

"లేదు, అందరం వెళ్తున్నాం. లే, శ్యామ్! నువ్వు బైలుదేరితే అందరూ వస్తారు," అన్నాడు వ్రూమ్.

"నేను వస్తున్నాను," అంది ఈషా.

"ఓకే. నేను కూడా వస్తాను. కొంచెం గాలిపీల్చుకుని రావచ్చు," అంది ప్రియాంక.

నేను వాళ్లకేసి చూశాను. అందరూ వాళ్ల వాళ్ల బాధల్నించి కొన్ని నిమిషాలైనా, బైటపడాలని చూస్తున్నారు. నాకు కూడా బక్షీ, గణేశ్, కనెక్షన్స్, వీటన్నిటినించీ దూరంగా పారిపోవాలనిపించింది.

"సరే వెళ్దాం. కానీ త్వరగా వెనక్కి వచ్చెయ్యాలి," అన్నాను.

"ఎక్కడికెళ్తున్నాం మనం? కొత్త లౌంజ్ బార్ 'బెడ్' దగ్గర్లోనే ఉందని విన్నాను," అంది ఈషా.

"అవన్నీ వీల్లేదు, ఊరికే కారులో అలా తిరిగేసి వద్దాం..." అన్నాను. కానీ వ్రూమ్ నా మాటకి అడ్డొచ్చాడు.

"చాలా మంచి ఐడియా! మనం 'బెడ్'కి వెళ్తున్నాం... బలే బావుంటుంది అక్కడ!"

"నాకు నిజమైన 'బెడ్' కావాలి, నిద్రపోవాలనుంది," అంది రాధిక ఒళ్లు విరుచుకుంటూ.

అందరం లేచాం. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు, ఒక్కొక్కరమే బైటికి వెళ్లాలని అనుకున్నాం.

"లేవండి, మిలిటరీ అంకుల్!" అన్నాడు వ్రూమ్ ఆయన బల్ల దగ్గరకెళ్లి.

"ఆఁ!" అన్నాడు ఆయన లేస్తూ. మామూలుగా అయితే ఆయన వ్రూమ్‌ని కసిరేవాడు. కానీ ప్రస్తుతం తన కొడుకు దగ్గర్నించి వచ్చిన ఈమెయిలు గురించి ఆలోచించి మరీ బాధపడుతున్నట్టు ఉన్నాడు, అందుకే ఎప్పట్లా కసరలేదు.

"అందరం కారులో అలా తిరిగివద్దాం. మిగతావాళ్లు మీకు జరిగిందంతా చెపుతారు. నేను వెళ్లి క్వాలిస్ తీసుకొస్తాను," అంటూ వ్రూమ్ మిలిటరీ అంకుల్ మానిటర్‌ని స్విచాఫ్ చేశాడు.



# # 26

3:00 గంటలకల్లా ఠంచనుగా మేం కనెక్షన్స్ మెయిన్‌గేటు బైట ఉన్నాం. ఒక తెల్లటి క్వాలిస్ వచ్చి మా ముందాగింది.

"ఎక్కండి," అన్నాడు వ్రూమ్ కారు తలుపులు తెరుస్తూ.

"అబ్బ, ఎంత చలిగా ఉందో! ఇంతసేపయిందేం?" ముందు సీట్లోకి ఎక్కుతూ అంది ఈషా.

"గాఢనిద్రలో ఉన్న డ్రైవర్‌ని మరో క్వాలిస్‌లోకి మార్చటానికి ప్రయత్నించి చూడు, నీకే తెలుస్తుంది," అన్నాడు వ్రూమ్.

రాధికా, ప్రియాంకా, నేనూ మధ్య సీట్లో కూర్చున్నాం. మిలిటరీ అంకుల్ ఒంటరిగా వెనకాల కూర్చోవటానికే ఇష్టపడ్డాడు. ఆయన కొద్దిగా స్తబ్ధుగా ఉన్నట్టు కనిపించాడు. బహుశా మేం అందరం అదే స్థితిలో ఉన్నామేమో!

ఆఫీసర్ల పార్కింగ్ ఏరియా మీదుగా వ్రూమ్ కారుని బైటికి పోనిచ్చాడు. అక్కడ బక్షీ కారు తెల్ల మిత్సుబిషీ లాన్సర్ కనిపించింది.

"బక్షీ దగ్గర చాలా షోకైన కారుందే!" అంది ఈషా.

"కంపెనీ వాళ్లిస్తే ఉండకేం చేస్తుంది!" అంది ప్రియాంక.

వ్రూమ్ అతినెమ్మదిగా క్వాలిస్‌ని ముందుకి తీసుకెళ్లి లాన్సర్‌కి దగ్గరగా ఆపాడు. క్వాలిస్ హెడ్‌లైట్లని ఆన్ చేసేసరికి లాన్సర్-బ్రహ్మాండంగా వెలిగిపోయింది.

"ఒక ప్రశ్న అడగచ్చా? మనుషులమీంచి బండిని పోనిస్తే ఏం శిక్ష పడుతుంది?" అన్నాడు వ్రూమ్.

"ఎక్స్‌క్యూజ్‌మీ, ఏమంటున్నావు నువ్వు?" అన్నాను.

"ఈ క్వాలిస్‌ని బక్షీమీంచి పోనిస్తేనో? పొద్దున్న అతను తన కారు దగ్గరకొచ్చినప్పుడు మనం ఆ పనిచెయ్యచ్చు. ఎన్నేళ్లు జైల్లో ఉండాల్సొస్తుందంటావు?" అన్నాడు వ్రూమ్.

అది బుద్ధిలేని వాగుడు. అయినా ప్రియాంక అతన్ని ఉసికొల్పింది.

"కోర్టు ఆ నేరాన్ని ఎలా చూస్తుందో, దాన్నిబట్టి ఉంటుంది. అది ఒక ఏక్సిడెంటని కోర్టు అనుకుంటే, అంటే హత్యకాదని నిర్ధారిస్తే, రెండేళ్లు శిక్ష పడచ్చు," అంది ఆమె.

ప్రూమ్ కారుని మళ్లీ స్టార్ట్ చేసి, బయటిగేటువైపు నడిపాడు.

"రెండేళ్లు మరీ ఎక్కువేమీ కాదు. వాటిని మనందరం పంచుకోవచ్చు కదా? అంటే తలా నాలుగు నెలలూ," అన్నాడు ప్రూమ్.

"నాకు తెలీదు, లాయర్ని అడుగు," అంది ప్రియాంక, భుజాలెగరేస్తూ.

"బక్షీని ఈ లోకంనించి పంపెయ్యటానికి నాలుగునెలలు జైలుశిక్ష అనుభవించటం పెద్ద కష్టమేం కాదు," అంది ఈషా తన పెదాలమీద పడిన జుట్టుని ఊదుతూ.

"ఒక పదహారు శనాదివారాలని త్యాగం చెయ్యాలి. మిగతా ఆర్రోజులూ ఎలాగూ జైల్లో ఉన్నట్టే గడుస్తున్నాయి!" అన్నాడు ప్రూమ్. "అయితే ఏమంటారు? చేసేద్దామా?"

ఆసరికి మేం కాల్‌సెంటర్ వదిలి హైవేమీదికి వచ్చేశాం. ఒకటీ అరా ట్రక్కులు తప్ప రోడ్లు ఖాళీగా ఉన్నాయి. ఇండియాలో వందకోట్లమంది ఉన్నారు. కానీ వాళ్లలో తొంభైశాతం రాత్రిళ్లు గాఢనిద్రలో ఉంటారు. అప్పుడు దేశం కొద్దిమందికే సొంతం అవుతుంది : ట్రక్కు డ్రైవర్లూ, రాత్రి షిఫ్ట్‌లో పనిచేసేవాళ్లూ, డాక్టర్లూ, హోటళ్లలో పనిచేసేవాళ్లూ, కాల్‌సెంటర్ ఏజెంట్లూ. నిశాచరులం, మేమే రోడ్లనీ, దేశాన్నీ ఏలుతాం. ప్రూమ్, క్వాలిస్ వేగాన్ని గంటకి ఎనభై కిలోమీటర్లకి పెంచాడు.

"శిక్షని అలా పంచుకోవటం వీలవదనుకుంటా. డ్రైవర్‌దే పూర్తి బాధ్యత అవుతుంది," అంది ప్రియాంక, ఇంకా ఆ బక్షీ హత్య గురించిన విషయాన్నే పట్టుక్కూర్చుని. "పైగా అది ముందే ప్లాన్ చేసి చేసిందని తెలిస్తే, పదేళ్లకి పైనే ఉంటుంది శిక్ష!" అంది.

"హూం... పదేళ్లంటే ఆలోచించాల్సిన విషయమే! ఏమంటావు, శ్యామ్? అయినా బక్షీని వదిలించుకోగలిగితే అదంత పెద్ద శిక్షేమీ కాదు కదూ?"

"ఓకే, ఇంక చాలు, ఈ పిచ్చిమాటలు ఆపండి! మమ్మల్ని నువ్వు డ్రింక్ ఇప్పించటానికి బైటికి తీసుకెళ్తున్నావనుకున్నా," అన్నాను.

"నేను ఊరికే..." అన్నాడు ప్రూమ్ ఒకచేతిని స్టీరింగ్ మీంచి ఎత్తి.

"నోరుమూసుకుని డ్రైవ్ చెయ్యి! నాకు డ్రింక్ తాగాలనుంది," అన్నాను.

"ప్లీజ్, ముందు కెమిస్ట్ దుకాణానికి. మందులు కొనటానికి వెళ్దామా? ప్లీజ్" అంది రాధిక, తన తలని రుద్దుకుంటూ.

బక్షీని హత్యచెయ్యటం అనే విషయాన్ని అంతటితో వదిలేశాం. అయినా జీవితంలో ఒకే ఒక హత్య చెయ్యటానికి చట్టం నాకు అనుమతి ఇచ్చినట్టయితే, అందులో మొదటి పేరు ఎవరిదై ఉంటుందో నాకు స్పష్టంగా తెలుసు. లేదు, కొంచెం ఉండండి, నా మాజీ ప్రియురాలి తల్లి విషయం నేను మరిచేపోయాను. నిజం చెప్పాలంటే, ఇద్దరిలో ఎవర్ని ముందు చంపాలో నాకే తెలీదు! బహుశా నా సమస్య ప్రత్యేకమైనదనుకుని చట్టం రెండు హత్యలు చేసినా నన్ను శిక్షించకపోవచ్చు.



ప్రూమ్ వేగంగా కుడివైపుకి కారుని తిప్పి 24 గంటలు తెరిచుండే మందుల షాపున్న రోడ్డులోకి కారుని పోనిచ్చాడు.

రాధిక మౌనంగా కూర్చుని మందుకోసం ఎదురుచూస్తోంది. బహుశా ఆమె సగం బుర్రని పాయల్ ఆక్రమించి ఉంటుంది. మిగతా సగంలో తలనెప్పి ఉంది!

"నియోన్ రంగు రెడ్‌క్రాస్ కనబడగానే, ఈషా," అదుగో అదే!" అంది.

"నాకీ రోడ్డూ, ఈ చుట్టుపక్కల ప్రదేశం తెలుసు," అంటూ ప్రూమ్ క్వాలిస్ వేగాన్ని వంద కిలోమీటర్లకి పెంచాడు. "గురూ, రోడ్లూ, అమ్మాయిలూ రాత్రయేసరికి బలే మజాగా ఉంటాయిలే!" అన్నాడు.

"చాలా చెత్తగా ఉంది నువ్వన్నది," అంది ప్రియాంక.

"సారీ! అనుకోకుండా వచ్చేసింది నోటంట!" అంటూ పళ్లన్నీ బైటపెట్టి నవ్వాడు, ప్రూమ్.

క్వాలిస్‌ని ప్రూమ్ మందుల దుకాణం దగ్గర ఆపాడు. నిద్రమత్తులో ఉన్న పదిహేడేళ్లు మించని కుర్రాడు ఆ దుకాణంలో పనిచేస్తున్నాడు. కొన్ని మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షల గైడ్లు అతని ఎదురుగా ఉండే కౌంటర్ మీదున్నాయి. ఈగల్ని చంపే కాడ ఒకటి పేజీల మధ్యలో గుర్తుగా పెట్టి ఉంది. ఆ కుర్రాడు ఏమీ తోచకుండా ఉన్నట్టూ, మమ్మల్ని చూసినందుకు కృతజ్ఞతా భావంతో నిండిపోయినట్టూ కనిపించాడు. వాడి ఆనందానికి కారణం మందులు మాకు అమ్మచ్చు అనేదానికన్నా, మేం కనిపించటమే, అనిపించింది.

ప్రూమ్, రాధికా క్వాలిస్‌లోంచి దిగారు. నేను కూడా కాస్త కాళ్లు చాచుకుందామని కిందికి దిగాను.

రాధిక గబగబా ఆ కుర్రాడి దగ్గరికి వెళ్లింది.

మేం కూడా కౌంటర్ దగ్గరికి చేరుకున్నాక, "ఏం కావాలి, రాధికా, శారిడానా?" అన్నాడు ప్రూమ్.

"కాదు," అని తల అడ్డంగా ఆడించి, కుర్రాడికేసి చూసి, "మూడుషీట్లు ఫ్లూక్సెటైన్, ఐదు షీట్లు సెర్ట్రాలైన్, మరో ఐదు షీట్లు పారోక్సెటైన్ ఇయ్యి. కాస్త త్వరగా ఇవ్వాలి!" అని కౌంటర్ మీద ఆదుర్దాగా వేళ్లతో తట్టసాగింది. ఆమె చేతికున్న ఎర్రటి గాజులు గలగల్లాడాయి.

కుర్రాడు రాధికవైపు నోరు తెరుచుకుని చూసి, వెనక్కి తిరిగి షెల్ఫ్‌లో మందులకోసం వెతకసాగాడు.

మందుల వాసన తప్పించుకోవటానికని నేనూ, ప్రూమ్, నాలుగడుగులు వెనక్కి వెళ్లాం. ప్రూమ్ సిగరెట్ వెలిగించాడు. ఇద్దరం దాన్ని పంచుకున్నాం.

కుర్రాడు మందులకట్టతో మళ్లీ కౌంటర్ దగ్గరకొచ్చాడు. రాధిక వాటిని తీసుకోవటానికి చెయ్యి చాచింది, కానీ వాడు ఆ మందుల మీద తన చెయ్యి పెట్టి, వాటిని ఆమెకి దూరంగా జరిపాడు. "ఇవి చాలా స్ట్రాంగ్ మందులు, మేడమ్! మీ దగ్గర డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉందా?" అన్నాడు.

"అర్ధరాత్రి మూడయింది," అంది రాధిక విసుగ్గా. "ఆఫీసులో పనిచేసుకుంటూండగా మందులు ఐపోయాయి. అలాంటప్పుడు ప్రిస్క్రిప్షన్ ఎలా చూపించగలననుకున్నావు, స్త్రీ మొహం!" అంది.

"సారీ మేడమ్. కొందరు పిల్లలు డిస్కోలకి వెళ్లేముందు ఇక్కడికొచ్చి రకరకాల మందులు కొంటుంటారు..."

"నాకేసి చూడు!" అంది రాధిక తన మొహాన్ని చూపిస్తూ. "పార్టీ చేసుకునే మూడ్‌లో ఉన్న టీనేజర్‌లా కనిపిస్తున్నానా నేను?" అంది.

లేదు, రాధిక పార్టీకెళ్తున్న టీనేజర్‌లాగ లేదు - జబ్బుమనిషిలా ఉంది, కళ్ల కిందంతా నలుపు. ఆ అబ్బాయి త్వరగా రాధికకి ఆ మందులిస్తే బావుండునని అనుకున్నాను.

"అయినా, ఇవి చాలా స్ట్రాంగ్ మందులు, మేడమ్! ఇవి మీకు ఎందుకు కావల్సి వచ్చాయి? అంటే, మీకు ఒంట్లో ఏమయింది?" అన్నాడు కుర్రాడు.

"ఛీ, వెధవా!" అని పిడికిలితో గట్టిగా ఆ గాజుకౌంటర్‌ని కొట్టింది. ఆ గాజుపలక అదిరింది కాని, పగల్లేదు. రాధిక ఎర్రగాజులు రెండుమాత్రం వెయ్యి ముక్కలయాయి. ఆ ఎర్రటి ముక్కలన్నీ ఆ కౌంటర్ మీద వెదజల్లబడ్డాయి.

ఆ చప్పుడికి కుర్రాడు భయపడ్డాడు; రెండడుగులు వెనక్కి గెంతాడు. వ్రూమ్ సిగరెట్టుని నలిపి పారేశాడు. ఇద్దరం కౌంటర్ దగ్గరకెళ్లాం.

"ఎక్స్‌క్యూజ్‌మీ, మేడమ్!" అన్నాడు కుర్రాడు.

"నోరు ముయ్యి, వెధవా! నా జబ్బేమిటో తెలుసుకోవాలని ఉందా? నాకు ఏమయిందో నీకు తెలియాలిరా, పనికిరాని వెధవా?"

"ఏమైంది రాధికా? ఏమైనా ప్రాబ్లమా?" అన్నాడు వ్రూమ్.

"ఈ గాడిదకి నా జబ్బేమిటో తెలుసుకోవాలనుందిట!" అంది రాధిక కుర్రాడివైపే చూపిస్తూ. "వీడెవడు మధ్యలో? ఈ కుర్రకుంకకి నా గురించి ఏం తెలుసని?" అంది.

"ఊరుకో, రాధికా!" అన్నాను. కానీ నామాటలు ఆమెకి అసలు వినిపించినట్టు లేదు. నా గోల నాది! నేననే మాటల్లో సగం మాటల్ని ఎవరూ వినిపించుకోరు!

"వీడికి మంచీచెడూ ఏం తెలుసు? ఒకే మొద్దూ, నా జీవితంలో అంతా చెడే! నేను ఒళ్లు హూనం అయేట్టు చాకిరీ చేస్తూంటే, నా మొగుడు మరో అమ్మాయితో కులుకుతున్నాడురా! ఇప్పుడు నీకు ఆనందంగా ఉందా?" అంది రాధిక. ఆమె మొహం పగిలిన గాజులకన్నా ఎర్రగా అయింది. రెండు చేతుల్తోనూ తలని కొన్ని సెకన్లపాటు పట్టుకుంది. తరవాత చేతుల్ని తలమీంచి తీసి మందుల్ని దొరకబుచ్చుకుంది. మందులమ్మే కుర్రాడు ఈసారి అభ్యంతరం చెప్పలేదు.

"నీళ్లు... నాకు కాసిని నీళ్లిస్తావా?" అంది రాధిక.



కుర్రాడు దుకాణం లోపలికి పరిగెత్తి గ్లాసుతో నీళ్లు తెచ్చిచ్చాడు.

కొత్తగా కొన్న మాత్రల్ని చింపి - ఒకటి, రెండు, మూడు, మూడు మాత్రల్ని మింగిందనుకుంటా. తలనెప్పికి ఇదేదో మంచిమందే, అనుకున్నాను.

"నాలుగువందల అరవైమూడు రూపాయలయింది, మేడమ్!" అన్నాడు కుర్రాడు భయంతో వణికే గొంతుతో.

"వీటివల్లే నేనింకా బతికున్నాను. ప్రాణాలు కాపాడుకోవటానికే గాని, పార్టీ చేసుకోవటానికి కాదు, నేను వాటిని కొనటం," అంది రాధిక.

మందులకి డబ్బు చెల్లించి ఆమె క్వాలిస్ దగ్గరకి నడిచింది. ఆమెకి కొద్ది దూరంలో నడుస్తూ మేముకూడా కారు దగ్గరకి వెళ్లాం.

"అదేం మందు?" అని అడిగాను.

"నాకేం తెలుసు, గురూ? నేనేం డాక్టర్ని కాను," అన్నాడు వ్రూమ్.

"ఆ మందులకి ప్రిస్క్రిప్షన్ తన దగ్గర ఉందంటావా?"

"ఆమెనే అడుగు, ధైర్యం ఉంటే!" అన్నాడు వ్రూమ్.

"అయ్యో, వద్దులే. త్వరగా లౌంజ్ బార్‌కి వెళ్దాం పద," అన్నాను.

"మందులు దొరికాయా? మాకేదో గొడవ వినిపించింది!" అంది ఈషా మేం కారులోకి ఎక్కుతూంటే.

"ఏంలేదు. బక్షీ అన్నట్టు, ఒకరి మాట ఇంకొకరికి అర్థం అవటానికి కొంత వాదించాల్సి వచ్చింది. కానీ ప్రస్తుతం వాటిని 'బెడ్' మీదికి పంపేద్దాం!" అన్నాడు వ్రూమ్ క్వాలిస్‌ని వెనక్కి తిప్పుతూ.

రాధిక మందులని తన బ్యాగ్‌లో పెట్టుకుంది. వేసుకున్న మూడు మాత్రలూ పనిచెయ్యటం మొదలుపెట్టినట్టున్నాయి, తను ఇప్పుడు శాంతంగా ఉంది.

వ్రూమ్ క్వాలిస్ వేగాన్ని నూటపదికి పెంచాడు, ఇంజను కాపాడమని గోల చెయ్యకుండా వెళ్లగల వేగం అంతే.

"స్పీడు తగ్గించు, వ్రూమ్!" అంది ఈషా.

"స్పీడు తగ్గించటం, వ్రూమ్ అనే రెండు మాటలనీ ఒకే వాక్యంలో వాడకు," అన్నాడు వ్రూమ్.

"బలే డైలాగు! చప్పట్లు కొట్టాలా?" అన్నాను.

ఎండుగడ్డి మేటలతో నిండిన ఒక ట్రక్కు భారంగా, సరిగ్గా నడవలేని ఏనుగులా, మా పక్కనించే వెళ్లింది. ఆ గోనెసంచులు మా హెడ్‌లైట్ల వెలుతుర్లో, అంత చీకట్లోనూ, మిరుమిట్లు గొలిపాయి.

"చూడండి, ఆ ట్రక్కు కూడా మనకన్నా వేగంగా వెళ్తోంది. నేను జాగ్రత్తగా డ్రైవ్ చేస్తాను," అన్నాడు వ్రూమ్.

"సారీ, పిల్లలూ!" అంది రాధిక. మందులు ఆమె మీద బాగా పనిచేస్తున్నట్టున్నాయి! "అక్కడ అంత గొడవ చేసినందుకు మీ అందరికీ, సారీ!" అంది మామూలు గొంతుతో.

"నువ్వేం కొన్నావు, రాధికా? ఎందుకా కుర్రాడు అంత గొడవ చేశాడు?" అన్నాను కుతూహలాన్ని అణుచుకోలేక.

"బాధని అణిచేసే మందులు, ఏంటీ డిప్రెసెంట్స్! మందులమ్మేవాళ్లు వెయ్యిప్రశ్నలు వేస్తారు. ఎందుకంటే ప్రిస్క్రిప్షన్ లేనిదే వాటిని అమ్మకూడదు. కానీ చాలామంది దాన్ని పట్టించుకోరు."

"వావ్! అంటే, అవి ప్రోజాక్ లాంటి మత్తుమందులా?" అన్నాడు వ్రూమ్.

"అవును ఫ్లూక్సెటైన్ అంటే ప్రోజాకే. కానీ ఇది మనదేశంలో తయారవుతుంది, అందుకే చాలా చవక."

"మనందరిలాగా!" అని తన జోక్‌కి తనే నవ్వాడు, వ్రూమ్.

"కానీ డాక్టర్‌ని సంప్రదించకుండా అలాంటి మందులు వేసుకోవటం ప్రమాదం," అంది ప్రియాంక. "అయితే, అది వ్యసనంగా మారదా?" అంది మళ్లీ.

"అది చట్టబద్ధమైన వ్యసనం. నేను అది లేకుండా బతకలేను. అవును, అది నిజంగానే ఒంటికి మంచిది కాదు. కానీ నా జీవితాన్ని ఎదుర్కోవటం కన్నా ఇది ఎన్నో రెట్లు నయం!" అంది రాధిక.

"మానెయ్యి రాధికా – అవి నీకు చెడుపు చేస్తాయి," మేం కారులో బైలుదేరాక మిలిటరీ అంకుల్ మొదటిసారి నోరువిప్పి మాట్లాడాడు.

"నేను చాలా తగ్గించేశాను, మిలిటరీ అంకుల్! కానీ అప్పుడప్పుడూ ఎక్కువ డోసు అవసరమౌతుంది. అందరూ ఇంకేదైనా విషయం మాట్లాడరూ, ప్లీజ్? 'బెడ్' ఇంకా ఎంత దూరం?"

"ఇక్కణ్ణించి ఒక రెండు కిలోమీటర్లు. నేను డ్రైవ్ చేస్తే తొంభై సెకన్లు, శ్యామ్ చేస్తే ఇంకా చాలా ఎక్కువ సమయం పడుతుంది," అన్నాడు వ్రూమ్ మా వైపు చూడకుండా. నేనతని మాటల్ని పట్టించుకోలేదు. ఎందుకంటే అతను రోడ్డుకేసి చూడటమే మంచిదనుకున్నాను. కొందరు తాగున్న ట్రక్కుడ్రైవర్లు మా పక్కనించి వెళ్లారు. వ్రూమ్ ఆ ట్రక్కుల్ని తప్పించుకుంటూ కారు నడిపాడు.

" 'బెడ్'కి అందరూ గీరగాళ్లే వస్తారని విన్నాను. నేను మంచిడ్రస్సు వేసుకోలేదు," అంది ప్రియాంక తన సల్వార్ కమీజ్‌ని సర్దుకుంటూ. ఆమె వేసుకున్న ముదురు ఆకుపచ్చరంగు దుపట్టాకి మెరిసే రాళ్లతో కుట్టిన బార్డరు ఉండటం గమనించాను.



"నీ డ్రస్సు చక్కగా ఉంది. షిఫాన్ ఈ రోజుల్లో ఫ్యాషనే. నేను బాధపడాలి, ఎంత చెత్తగా ఉన్నానో, చూడు!" అంది ఈషా, ప్రియాంకకి ధైర్యం చెపుతూ.

"ఏం ఫరవాలేదు, ఈషా! బొడ్డుకి రింగుపెట్టుకున్న వాళ్లెవర్నీ డిస్కోలోకి రానివ్వక పోవటం అనేది జరగదు," అన్నాడు వ్రూమ్.

"మీరే ఇలా సందేహిస్తూంటే, నాలాంటి బోరింగ్‌హౌస్ వైఫ్‌నైతే, అస్సలు రానివ్వరేమో!" అంది రాధిక.

"ఏం భయం లేదు. మనం డబ్బు ఖర్చుపెట్టగలమని తెలిస్తే మనని లోపలికి రానిస్తారు. అదీకాక, 'బెడ్'లో పనిచేసే డీ.జే. స్కూలురోజుల్నించీ నా క్లాస్‌మేట్," అన్నాడు వ్రూమ్.

"నీ క్లాస్‌మేట్లందరూ ఇలాంటి ఫ్యాషనబుల్ ఉద్యోగాల్లోనే ఉన్నట్టున్నారే!" అన్నాను.

"అవును, అదే సమస్య. వాళ్లందరికీ డబ్బున్న నాన్నలున్నారు. వాళ్లలా బతకటానికి నేను కష్టపడి పనిచెయ్యాల్సి వస్తోంది. మా డబ్బున్న నాన్న మమ్మల్ని వదిలి వెళ్లకుండా ఉండుంటే... సర్లెండి! రండర్రా, వెల్‌కమ్ టు 'బెడ్' మీ ఈ డ్రైవర్ దాసుడి సాయంతో ఇక్కడికొచ్చారు! ఇప్పుడు 3:23 మాత్రమే అయింది. కారు హెడ్‌లైట్లని ఒక బోర్డుమీదికి వేశాడు. అక్కడ, బెడ్ లౌంజ్ అండ్ బార్ : మీ సొంతచోటు, అని రాసి ఉంది.

"ఓ... అప్పుడే వచ్చేశామా?" అంది ఈషా. పర్సులో వెతికి ఒక అద్దం బైటికి తీసి, తన పెదాలని పరీక్షించుకుంది. అద్దాలని కనిపెట్టక మునుపు ఆడవాళ్లు ఏం చేసేవాళ్లో?

నా జుట్టు ఎలా ఉంది? ఎప్పటిలాగే ఛండాలంగా ఉందా?" అంది ప్రియాంక రాధికతో.

నేనామె పొడవాటి నొక్కుల జుట్టుకేసి చూశాను. ప్రియాంక ఎప్పుడూ 'ఈలోకంలో అందరికన్నా బోరింగ్ జుట్టు' తనదే అనీ, 'దాంతో తను ఏమీ చెయ్యలేను' అనీ అంటూ ఉంటుంది. నాకది ఎప్పుడూ అర్థం కాలేదు, ఆమె జుట్టంటే నాకు చాలా ఇష్టం; ఆ జుట్టుని నిజానికి ఎంతో ప్రేమించాను. ఇంతకు మునుపు కొన్నివందలసార్లు చేసినట్టే ఇప్పుడు కూడా ఆ జుట్టులోకి వేళ్లు పోనిచ్చి నిమరాలని మనసు తెగ పీకింది. కానీ నేనలా చెయ్యలేకపోయాను. కొన్ని వారాల్లో నా బదులు గణేశ్ అనేవాడు ఆ పని చెయ్యబోతున్నాడు. మెక్‌డొనాల్డ్స్ వాళ్ల ఫ్రెంచ్‌ఫ్రైల నూనె మళ్లీ నాలోపల సలసలా కాగటం మొదలుపెట్టింది. అయినా వాళ్లు మెక్‌డోనాల్డ్స్‌లో వాడే నూనె ఏమిటో! అది భయంకరంగా మరుగుతుంది!

"నీ జుట్టు చక్కగా ఉంది. అయినా లోపలంతా చీకటిగా ఉంటుంది. పదండి పోదాం. రండి మిలిటరీ అంకుల్ లోపలికెళ్దాం," అంది రాధిక.

# 27

మేమందరం ప్రూమ్ వెనకాలే ఒక పెద్ద నల్లటి తలుపు దగ్గరకెళ్లాం, అదే 'బెడ్' మెయిన్‌డోర్. ఆ తలుపుకి గోడరంగుతో కలిసిపోయే రంగు వేశారు. బాగా కండలు తిరిగిన ఒక బౌన్సర్, సరైన పోషకాహారం లేని ఒకామె ఆ తలుపు పక్కన నిలబడి ఉన్నారు.

ఆ బక్కచిక్కిన స్త్రీ ప్రూమ్‌ని, "మీరు మెంబరా, సార్?" అని అడిగింది. ఆవిడే 'బెడ్'కి హోస్టెస్ (ప్రియాంక భాషలో డోర్-బిచ్), నల్లడ్రస్సు వేసుకునుంది ఆమె. ఎత్తు ఐదడుగుల నాలుగంగుళాలు ఉండచ్చు, కానీ సన్నగా ఉండటం వల్లా, హీల్స్ వల్లా ఇంకా పొడగరిలా కనిపిస్తోంది. హీల్స్ కోక్ బాటిలంత పొడుగున్నాయి!

"లేదు, మేం డ్రింక్స్ తీసుకుని త్వరగా వెళ్లిపోతాం," అన్నాడు ప్రూమ్. ఇదుగో దీనిమీద ఉన్న ట్యాబ్‌ని మీరు ఓపెన్ చేసుకోవచ్చు, అని అంటూ తన క్రెడిట్ కార్డుని బైటికి తీశాడు.

"సారీ, సార్! ఈరోజు మెంబర్లకి మాత్రమే లోపలికెళ్లటానికి అనుమతి దొరుకుతుంది," అందావిడ. కండలు తిరిగిన బౌన్సర్ మావేపు శూన్యంగా, ఒక పిచ్చిచూపు చూశాడు. బక్షీలాగ అతను కూడా మనుష్యేతర జాతికి చెందిన మనిషిలా కనిపించాడు.

"మెంబరవాలంటే ఏం చెయ్యాలి?" అని అడిగాను.

"ఫార్మ్ నింపి, సంవత్సర చందా యాభైవేలు కట్టాలి," ఏదో చిల్లర కోసం అడిగినంత తాపీగా చెప్పిందామె.

"ఏమిటీ? ఎక్కడో విసరేసినట్టున్న ఈ క్లబ్‌లో చేరటానికి యాభైవేలా?" అంది ప్రియాంక చేత్తో ఆ తలుపుని చూపిస్తూ. ఆమె తన దుపట్టాని తలకిందులుగా వేసుకుంది, అదంతా అధునాతనంగా కనిపించటానికి చేస్తున్న ప్రయత్నం.

"అయితే మీరింకెక్కడికైనా వెళ్లచ్చుగా!" అందామె ప్రియాంక వైపు తిరస్కారంగా చూస్తూ. ఒంటినిండా బట్టలేసుకున్న ఆడపిల్లలకి డిస్కోలోకి వెళ్లటానికి అనుమతి ఉండదు.

"మీరలా నావేపు చూడకండి!" అంది ప్రియాంక.

"తొందరపడకు, ప్రియాంకా!" అని ప్రూమ్, బౌన్సర్ వైపు తిరిగి, "ఏమిటి బాస్ ఇది? డిజె జాస్ లోపలున్నాడా? నాకతను తెలుసు," అన్నాడు.

"ఆఁ... ఏమిటీ?" అన్నాడు బౌన్సర్. వాడి మొహాన భయం కనిపించింది. ఉత్త మొద్దులా ఉన్నాడు. ఎన్నో నెలల తరవాత అతను అంత కష్టమైన ప్రశ్నని ఎదుర్కోవలసి వచ్చింది!



"మీకు జాస్ తెలుసా?" అంది హోస్టెస్ ఈసారి కొంచెం స్నేహంగా.

"ఏడేళ్లు ఒకే స్కూల్లో చదువుకున్నాం. ప్రూమ్ వచ్చాడని అతనికి చెప్పండి!" అన్నాడు ప్రూమ్.

"అలాగే, మరి ముందే ఈ విషయం నాకెందుకు చెప్పలేదు ప్రూమ్?" అని ఆవిడ ప్రూమ్‌ని చూసి కొంటెగా నవ్వింది. ఆవిడ వెల్వెట్ తాళ్లని విప్పటానికి వంగింది. ఆవిడ శరీరం పైభాగం అస్థిపంజరంలా కనిపించింది. ఆవిడ ఎముకలు విరిగితే ఎక్స్‌రే అవసరం ఉండదు!

"మేం ఇక లోపలికి పోవచ్చా?" అంది ఈషా విసుగ్గా.

"యెస్! కానీ ప్రూమ్, ఈసారి వచ్చేప్పుడు నీ స్నేహితులకి 'బెడ్'కి తగ్గట్టు డ్రస్ వేసుకోమని చెప్పు," అని ఆవిడ అర్థవంతంగా ప్రియాంకకేసి, రాధికకేసీ చూసింది.

"దాని గొంతు పట్టుకుని ఊరికే అలా నొక్కానంటే చాలు, కోడిమెడలాగ పుటుక్కున విరుగుతుంది!" అంది ప్రియాంక.

మేం లోపలికి వెళ్లబోతూంటే బౌన్సర్ ప్రూమ్‌నీ నన్నూ నిలువునా తడిమి చూశాడు. అప్పటిగ్గాని అతను అక్కడ ఎందుకున్నాడో నాకు అర్థం కాలేదు. ఆ తరవాత అతను ప్రియాంక వైపు వెళ్లాడు.

"ఏం చేస్తున్నావు?" అన్నాను అతనితో.

"ఈవిడని చెక్ చెయ్యాలి. కొంచెం తగాదాపడే స్వభావం ఉన్నట్టుంది," అని అతను ప్రియాంక దగ్గరికెళ్లాడు. అంత ఎత్తూ, లావూ ఉన్న అతని ఆకారాన్ని చూసి ప్రియాంక బిగుసుకుపోయింది.

అప్పుడు ఎలా అనగలిగానో తెలీదు, నా నోటంట, "నువ్వు ఆమెని ముట్టుకోవటానికి వీల్లేదు, అర్థమైందా?" అనే మాటలు వచ్చాయి.

బౌన్సర్ నిర్ఘాంతపోయాడు. నావైపు తిరిగాడు. అతని చేతికండలు నా తొడలంత ఉన్నాయి! నా మొహాన పిడికిలితో ఒక్కటి కొట్టాడంటే ఎంత నెప్పి పుడుతుందో తలుచుకునే సరికి నాకు ఒణుకు పుట్టింది.

"ఏమిటి? ఇక్కడేం జరుగుతోంది?" అంది హోస్టెస్ మా దగ్గరికి వస్తూ.

"ఏం లేదు. అమ్మాయిలతో ఎలా ప్రవర్తించాలో మీ టార్జాన్‌గారికి కొంచెం చెప్పండి," అని, ప్రియాంక చెయ్యి పట్టుకుని లాగాను. మరుక్షణం మేం 'బెడ్' లోపల ఉన్నాం.

'బెడ్' లోపల అలంకరణంతా స్టార్‌ట్రెక్‌కీ, స్త్రీలోలుడైన ఒక రాజు అంతఃపురానికీ మధ్య రకంగా ఉంది. అల్ట్రావయలెట్ బల్బుల వెల్తురు తప్ప లోపల మరే వెల్తురూ లేదు. ఆ మసక చీకటికి నా కళ్లు అలవాటయాక, రెండు వరసల్లో ఆరేసి పరుపులు పరిచి ఉండటం కనిపించింది. వాటిలో ఐదింటి మీద మాత్రమే ఎవరో ఉన్నారు. మరి మమ్మల్ని లోపలికి పంపించటానికి బైట అంత హంగామా ఎందుకు చేశారో నాకర్థం కాలేదు. బహుశా ఎవరినైనా పరుపుమీదికి తీసుకెళ్లటం అనేది అంత సులభం కాదనుకుంటా!

ఒక మూలగా ఉన్న పరుపు దగ్గరికి మేం నడిచాం. దాని పక్కనే రెండు హుక్కాలు ఉన్నాయి.

"బైట ఆవిడ అంత అసహ్యంగా ప్రవర్తించిందెందుకో?" అంటూ ఈషా పరుపుమీద కెక్కి కూర్చుంది. రెండు దిళ్లని మోచేతులు ఆనించుకోటానికి తీసుకుంది. "ఆమె అన్న మాటలు విన్నారా మీరు? ఇంకెక్కడికైనా పొండి, అట. కస్టమర్లతో అలాగేనా మాట్లాడేది?" అంది.

"అది వాళ్ల ఉద్యోగం. అలా మాట్లాడటానికే వాళ్లకి జీతాలు ఇస్తారు. దాంతో ఈ చోటుకి ఒక ప్రత్యేకమైన వైఖరి ఏర్పడుతుంది!" అన్నాడు ష్రూమ్ దాన్ని ఏమాత్రం పట్టించుకోనట్టు. అతను హుక్కా వెలిగించాడు. మండే నిప్పుకణికల్ని చూస్తూంటే నాకు గణేశ్ గుర్తుకొచ్చాడు. ఎందుకోగాని, అతని పాంటులో వీటిని వేస్తే బలే మజాగా ఉంటుందన్న ఆలోచన వచ్చింది నాకు.

"నాకు కూడా ఇలా అసహ్యంగా ప్రవర్తించటానికి జీతం వచ్చే ఉద్యోగం కావాలి! కాల్‌సెంటర్‌లో ఎప్పుడూ, "మంచిగా ఉండండి, మర్యాదగా మాట్లాడండి, సాయం చెయ్యండి," అని చెపుతూ ఉంటారు. ఇలా అమర్యాదగా మాట్లాడటంలోనే మజా ఉంది!" అంటూ రాధిక ఒక పొడుగాటి దిండుమీద వాలి కూర్చుంది. ఇంతకుముందు ఎంతో బాధగా గడిచినా కూడా ఆమె ఇప్పుడు హాయిగా ఉన్నట్టే అనిపించింది, అందంగా కనిపించింది. అయినా ఈ నీలం రంగు వెల్తుర్లో అసలు ఎవరైనా అందవికారంగా కనిపిస్తారా అనేది సందేహమే. అనుజ్ అనే బుద్ధిలేని మనిషి ఈమెని వదిలి ఎలా ఉండగలుగుతున్నాడా, అని ఆశ్చర్యపోయాను.

ఈషా, రాధికా మాత్రం పడుకున్నారు. మిగతావాళ్లం బాసింపట్టు వేసుకుని పరుపు మీద కూర్చున్నాం.

ష్రూమ్ డి.జె. జాస్‌ని పలకరించటానికి వెళ్లాడు. జాస్ మాకు అర్థంకాని ఫ్రెంచ్ - ఆఫ్రికన్ - ఇండియన్ ఫ్యూజన్ మ్యూజిక్ రికార్డులు ప్లే చేస్తున్నాడు. ష్రూమ్ పన్నెండు కామికాజీ డ్రింకులు తీసుకుని వచ్చాడు. మిలిటరీ అంకుల్ తాగనన్నాడు, కానీ అతన్ని మేం బలవంతం చెయ్యలేదు, మిగిలేది మాకోసమే కదా! ష్రూమ్ అంకుల్ వద్దనున్న డ్రింకుల్ని తీసుకుని ఒకదాని తరవాత ఒకటి వరసగా తాగేశాడు.

మేం మా కామికాజీ డ్రింకుల్నీ తాగటం ముగించామో లేదో మరో బక్కపల్చని స్త్రీ (బెడ్ ప్రత్యేకత!) మరో ఆరు డ్రింకులు పట్టుకుని మా దగ్గరకి వచ్చింది.

"లాంగ్ ఐలాండ్ ఐస్ టీలు. డి.జె. జాస్ మీకివ్వమన్నాడు," అంది.

"బావుందే, నీ స్నేహితులందరూ సరైన చోట్లలోనే ఉన్నారు!" అంది రాధిక తన లాంగ్ ఐలాండ్‌ని గ్లాసుడు నీళ్లలా గటగటా తాగేస్తూ. తరచు తాగనివాళ్లకి తాగే అవకాశం దొరికితే వెర్రెత్తిపోతారు.

"ఈ లాంగ్ ఐలాండ్ డ్రింకు చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది," అన్నాను కొన్ని గుక్కలు తాగి. నా తల తిరగటం నాకు తెలుస్తోంది. "ఏయ్, కొంచెం జాగ్రత్తగా తాగండ్రా! మన షిఫ్టు ఇంకా పూర్తికాలేదు. త్వరగా ఒక డ్రింకు తాగేసి వెళ్లిపోదామనుకున్నాం, కదా! పదండి పోదాం," అన్నాను.

"ఏం ఫరవాలేదు, మాన్! ఇంకా ఒకే ఒకటి తాగి వెళ్లిపోదాం," అని ష్రూమ్ మరో రౌండ్ డ్రింకులకి ఆర్డరిచ్చాడు.

"నాకు మత్తెక్కుతోంది. నేనిదంతా మిస్ అవుతాను. మీ అందర్నీ మిస్సవుతానర్రా!" అంది ప్రియాంక.

"అవునవును, నువ్వు సియాటల్‌కి వెళ్లాక చూద్దాం. ఇదుగోనర్రా, ఈ హుక్కా తాగండి, దీనికి ఆపిల్ వాసన ఉంటుంది," అన్నాడు ష్రూమ్ గట్టిగా హుక్కా దమ్ము పీలుస్తూ. అతను అందరికీ ఆ డ్రింకు అందించాడు. మిలిటరీ అంకుల్ తప్ప అందరూ డ్రింకు తీసుకున్నారు. అంకుల్ మొహం నిమిషనిమిషానికీ, మేం చేస్తున్న పనితో తనకేమీ సంబంధం లేదన్నట్టు, మారిపోతోంది. మేమందరం వంతులవారీగా ఆ హుక్కా తాగాం. డిజె జాస్ ఇప్పుడు వేస్తున్న సంగీతం, మధురంగా, మేం తాగుతున్న హుక్కాకి సరిపోయేట్టుగా ఉంది.

మా పరుపుకి ఎదురుగా రెండు ఫ్లాట్ ఎల్‌సీడీ తెరలున్నాయి. ఒకదానిలో ఎమ్‌టీవీ, మరోదానిలో సీఎన్ఎన్ వస్తున్నాయి. ఎమ్‌టీవీలో యూత్‌స్పెషల్ కార్యక్రమంలో భాగంగా బాలీవుడ్ ఐటమ్ సాంగ్ వస్తోంది. పాటతోపాటు ఒకమ్మాయి తన ఒంటిమీద ఉన్న బట్టల్ని ఒక్కొక్కటిగా వలిచేస్తోంది. సీఎన్ఎన్‌లో తాజావార్త, అమెరికా మళ్లీ ఇరాక్ మీదికి యుద్ధానికి వెళ్లటానికి సన్నాహాలు చేస్తోంది, అని. ష్రూమ్ సీఎన్ఎన్ వస్తున్న టీవీకేసి కళ్లార్పకుండా చూడటం గమనించాను.

"అమెరికన్లు జబ్బుమనుషులు!" అన్నాడు ష్రూమ్ యుద్ధాన్ని సమర్థిస్తూ మాట్లాడుతున్న ఒక రాజకీయవేత్తని చూపిస్తూ. "వాణ్ణి చూడు, వాడికే కనక అవకాశమిస్తే ఈ ప్రపంచాన్నే పేల్చేస్తాడు!" అన్నాడు.

"కాదు, మొత్తం ప్రపంచాన్ని కాదు. చైనాని పేల్చరనే అనుకుంటా. వాళ్లకి చవగ్గా వచ్చే కూలీలు కావాలి," అంది ప్రియాంక మత్తు తలకి ఎక్కినట్టుగా.

"అలా అయితే గుడ్‌గాంవ్ కూడా పేల్చరు. వాళ్లకి కాల్‌సెంటర్లు అవసరం కదా!" అంది రాధిక.

"అయితే మనకి ఏ ఆపదా రాదు, మంచిదే. గుడ్‌గాంవ్ ఈ భూమ్మీదున్న ఏకైక సురక్షితమైన ఊరు, మీ అందరికీ ఆహ్వానం పలుకుతున్నాం!" అంది ఈషా.

అమ్మాయిలు నవ్వటం మొదలుపెట్టారు. మిలిటరీ అంకుల్ సైతం చిరునవ్వు నవ్వాడు.

"దీన్లో నవ్వటానికేమీ లేదర్రా! మన ప్రభుత్వం అర్థం చేసుకోవటం లేదు కానీ, అమెరికన్లు మనని వాడుకుంటున్నారు. మనం ఒక పూర్తి తరాన్ని వాళ్ల కాల్‌సెంటర్లకి బలి చేస్తున్నాం," అన్నాడు ష్రూమ్. ఏదో ఒకరోజు ష్రూమ్ రాజకీయవేత్త అవుతాడని నాకు నమ్మకం కుదిరింది.

ఎవరూ జవాబు చెప్పలేదు.

"మీరు నాతో అంగీకరించటం లేదా?"

"ప్లీజ్... ఈ గొడవ ఇక ఆపేస్తావా?" అన్నానో లేదో, నా నోరు మూయించేసింది ఈషా.

"కమాన్, వ్రూమ్! కాల్‌సెంటర్ల వల్ల మనకీ ఉపయోగమే. మిగతా చోట్ల నెలకి పదిహేనువేలు దొరకటం ఎంత కష్టమో నీకు తెలుసు. మరి మనం? హాయిగా ఎయిర్‌కండీషన్ ఆఫీసులో కూర్చుని, ఫోన్‌లో మాట్లాడుతూ, జీతం తీసుకుని ఇంటికి పోతున్నాం. మనమే కాదు కొన్ని వందల మంది, వేలమంది అబ్బాయిలూ, అమ్మాయిలూ మనలా పనిచేస్తున్నారు. మరి ఈ ఉద్యోగంలో తప్పుపట్టటానికి ఏముంది?" అంది ఈషా.

"ఎయిర్‌కండిషన్ ఉన్నా, చెమటలు కారుస్తూ చాకిరీ చేస్తున్నాంగా! నిజం చెప్పాలంటే, ఇది మరీ అన్యాయం, ఎందుకంటే ఈ చెమటలు ఎవరికీ కనిపించవు. నీ బుర్రని వాళ్లెలా తింటారో, అదీ కనిపించదు!" అన్నాడు వ్రూమ్.

"అయితే నువ్వీ ఉద్యోగాన్ని వదిలెయ్యచ్చుగా? ఎందుకింకా ఇక్కడే ఉన్నావు?" అన్నాను. ఇలాంటి మాటలతో నా మత్తునీ మజానీ వ్రూమ్ పాడుచేస్తే నాకు చిర్రెత్తుకొస్తుంది.

"ఎందుకంటే, నాకు డబ్బు కావాలి. నా ఫ్రెండ్స్ ఒక స్థాయిలో బతుకుతున్నారు, వాళ్లతో నేనూ సరిసమానంగా బతకాలి. డబ్బు వల్లే నేనిలాంటి చోట్లకి రాగలుగుతున్నాను," అన్నాడు వ్రూమ్.

"నీ సమస్య బక్షీ. అతనిమీద కోపం పెంచుకుని నువ్వు కాల్‌సెంటర్ని తప్పు పడుతున్నావు," అన్నాను.

"బక్షీ విషయం వదిలెయ్. లోకంలో అతనొక్కడే చెడ్డ బాస్ ఏమీ కాదు. కమాన్, ప్రపంచాన్నే ఒక చెడ్డ, మూర్ఖుడైన, దుర్మార్గుడైన బాస్ నడుపుతున్నాడు!" అన్నాడు వ్రూమ్, సీఎన్ఎన్ ఛానల్‌ని చూపిస్తూ. "వాళ్లని చూడు, భయంతో చస్తున్నారు! అందుకే జనాన్ని బాంబులతో చంపాలని చూస్తున్నారు. కానీ మనం? రాత్రంతా ఫోనుల్లో మాట్లాడుతూ కూర్చుంటాం, ప్రపంచమంతా గుర్రుపెట్టి నిద్రపోతూ ఉంటుంది, అంతేగా?" అన్నాడు.

"రాత్రిళ్లు పనిచెయ్యటం గురించి నసపెట్టకు. డాక్టర్లు రాత్రిళ్లు పనిచేస్తారు, హోటళ్లలో రాత్రిళ్లు పనిచేస్తారు, పైలట్లూ, ఫ్యాక్టరీ కార్మికులూ రాత్రిళ్లు పనిచేస్తారు! పెద్ద చెపుతావు. ఆ 'డోర్‌బిచ్' కూడా రాత్రిపూటే పనిచేస్తుంది!" అంది ప్రియాంక.

"రాత్రి పనిచెయ్యటంలో తప్పేమీ లేదు. డబ్బు కూడా బాగానే ఇస్తున్నారని ఒప్పుకుంటాను. కానీ మనకున్న సామర్థ్యానికి సరిపడే ఉద్యోగాలు మనకి లేవు, అదే తేడా. మన దేశాన్ని చూడండి, అమెరికన్ల కన్నా ఎంత వెనకబడి ఉన్నామో! మనం వాళ్లకన్నా తక్కువేం కాదని మనకి తెలుసు," అన్నాడు టీవీస్క్రీన్‌కేసి పిచ్చివాడిలా చేతులు ఆడిస్తూ.

"అయితే, ఇంకోరకమైన ఉద్యోగాలంటే, ఎలాటివి?" అన్నది ఈషా తలపిన్నుని నోటితో పట్టుకుని. ఆమె మళ్లీ తన జుట్టు విప్పి మళ్లీ కట్టుకోవటం అనే కార్యక్రమం మొదలెట్టింది.

"అంటే, చెయ్యటానికి ఎన్నో ఉన్నాయి. మనం ప్రతి ఊళ్లోనూ రోడ్లనీ, పవర్ ప్లాంట్లనీ, విమానాశ్రయాలనీ, ఫోన్ల నెట్‌వర్క్‌లనీ, మెట్రోరైళ్లనీ, పిచ్చిగా నిర్మించవచ్చు. ప్రభుత్వం కాస్త కదిలి, ఇలాంటి పనులు తలపెడితే, దేశంలోని యువకులకి అక్కడ ఉద్యోగాలు దొరుకుతాయి. మనదేశం కోసమూ, దేశభవిష్యత్తు కోసమూ ఏదైనా నిర్మించటానికి పనిచేస్తున్నామని అనిపిస్తే, నేను పగలనక రాత్రనక శ్రమపడతాను. కానీ ప్రభుత్వం పనికొచ్చే ఏ పనీ చెయ్యదు, అందుకే ఇలాంటి బీపీఓలని తెరిచేసి, యువకులకి ఏదో చేసేస్తున్నామని అనుకుంటుంది. ఇదుగో ఈ ఎమ్టీవీలో చూపించే ఈ పిచ్చిది లోదుస్తులతో గెంతితే అది యువకులకోసం ప్రత్యేక కార్యక్రమం అనుకున్నట్టే! ప్రభుత్వానికి మన గురించి నిజంగా ఏమైనా పట్టిందని అనుకుంటున్నారా?"

"ఎవరు? ఎమ్టీవీయా, గవర్నమెంటా?" అంటూ లేచి చెక్ కోసం సైగ చేశాను (బార్లలో ఎప్పుడూ 'చెక్' ఇమ్మనే అడగాలి 'బిల్' ఇమ్మని కాదు). అప్పటికి 3:50 అయింది, వ్రూమ్ లెక్చర్‌తో నా కడుపు నిండిపోయింది. త్వరగా కాల్‌సెంటర్‌కి వెళ్లాలనిపించింది.

తన క్రెడిట్‌కార్డుతో వ్రూమ్ బిల్లు చెల్లించాడు. ఆ డబ్బులో మా వాటా తరవాత ఇచ్చేస్తామని చెప్పాం.

"ఇద్దరూనూ, ఇద్దరికీ ఏమీ పట్టలేదు!" అన్నాడు వ్రూమ్ 'బెడ్'లోంచి బైటికి వెళ్తున్నప్పుడు.

డోర్‌బిచ్, బౌన్సర్, మేం బైటికి వస్తూంటే మాకేసి అర్థంకానట్లు అదోలా చూశారు.

# 28

ఫ్రూమ్ మమ్మల్ని కారెక్కించుకుని 'బెడ్'ని వదిలిపెట్టి మళ్లీ హైవేమీదికి తెచ్చాడు. మాటిమాటికీ క్వాలిస్ రోడ్డుమీద ఎడంపక్కకీ, కుడిపక్కకీ అదుపు లేకుండా వెళ్లటం మొదలుపెట్టింది.

"జాగ్రత్త," అంది ఈషా. "బాగానే ఉన్నావు కదా ఫ్రూమ్?"

"బాగానే ఉన్నాను, మాన్! నేను డ్రైవింగ్ అంటే పడి చస్తాను!" అన్నాడు ఫ్రూమ్ కలబ కంటూ.

"కావాలంటే నేను డ్రైవ్ చేస్తా..." అన్నాను.

నా మాటకి అడ్డొస్తూ, "చెప్పాకదా, నేను బాగానే ఉన్నానని!" అన్నాడు ఫ్రూమ్ కొంచెం గట్టిగా. కొద్ది నిమిషాల్లో మేం సహారామాల్ పక్కనించి వెళ్లాం. గుడ్‌గాంవ్‌లో దానికన్నా పెద్ద షాపింగ్‌మాల్ మరోటి లేదు. ఉన్నట్టుండి ఫ్రూమ్ క్వాలిస్‌ని ఆపాడు.

"నాకు కడుపులో తిప్పుతోంది!" అన్నాడు ఫ్రూమ్. ఫ్రూమ్ డ్రైవ్ చేసిన పద్ధతివల్ల మాకందరికీ కూడా అలాగే ఉంది.

"ఏం చేస్తావో చెయ్యి, కానీ క్వాలిస్‌లో మాత్రం వాంతి చేసుకోకు. డ్రైవర్ నిన్ను చంపేస్తాడు!" అంది ఈషా.

ఫ్రూమ్ తలని స్టీరింగ్‌మీద ఆన్చాడు. వీధికుక్కల్ని లేపేంత గట్టిగా హారన్ మోగింది.

ఫ్రూమ్ భుజం తట్టి, "పద ఫ్రూమ్, కాసేపు అలా నడిచి వద్దాం," అన్నాను. ఇద్దరం కారు దిగాం.

ఫ్రూమ్‌ని సహారామాల్ చుట్టూ నడిపించాను. మాకు ప్రకటనలున్న ఎన్నో బోర్డులు కనిపించాయి. వాటిలో రకరకాల మనుషులున్నారు; ఒక జంట అప్పుడే కొత్త టూత్‌బ్రష్ కొన్న కారణంగా పళ్లన్నీ బైటపెట్టి నవ్వుతోంది; కొందరు స్నేహితులు మొబైల్‌ఫోన్లు పట్టుకుని పళ్లికిలిస్తున్నారు; ఒక కుటుంబం తమ పిల్లలకి ఆనందంగా జంక్‌ఫుడ్ తినిపిస్తోంది, ఒక గ్రాడ్యుయేట్ కుర్రాడు క్రెడిట్‌కార్డు పట్టుకుని సంతోషం పట్టలేక గంతులేస్తున్నాడు; ఒక అమ్మాయి ఏడు షాపింగ్ బ్యాగులు పట్టుకుని మురిసిపోతోంది. అన్ని ప్రకటనల్లోనూ కొట్టొచ్చినట్టు కనిపించిన ఒకే ఒక విషయం, అందరూ ఆనందంగా ఉండటం.



"దేన్ని చూసి వీళ్లు ఇంత ఆనందపడుతున్నారు? ఆ టూత్‌బ్రష్ జంట చూడు, మా అమ్మా, నాన్నా ఎప్పుడూ అంత ఆనందంగా ఉండరే!" అన్నాడు ఫ్రూమ్.

"గట్టిగా ఊపిరిపీలుస్తూ నేరుగా నడు, ఫ్రూమ్. నువ్వు బాగా తాగి ఉన్నావు," అన్నాను.

"నేను బాగానే ఉన్నా... కానీ అమ్మా, నాన్నా... ఎందుకు శ్యామ్ వాళ్లకి ఒకళ్లని చూస్తే ఒకళ్లకి అంత అసహ్యం?" అన్నాడు ఫ్రూమ్.

"పెద్దవాళ్లు కదా, గురూ! వాళ్లు మనకన్నా ఎక్కువ జటిలంగా ఉంటారు. వాళ్లని అర్థం చేసుకోవటానికి ఎప్పుడూ ప్రయత్నించద్దు," అన్నాను.

ఫ్రూమ్ నడవటం ఆపి నిటారుగా నిలబడ్డాడు. నన్ను కూడా ఆగమన్నాడు. ఆ తరవాత, "ఇది కొంచెం ఆలోచించు. నన్ను కన్న వాళ్లిద్దరికీ ఒకరంటే ఒకరికి చెప్పలేనంత అసహ్యం. అంటే అది నా గురించి నీకేం చెపుతోంది? నాలో ఉన్న జీన్స్‌లో సగం మిగతా సగంతో కొట్లాడుతూ ఉండి ఉంటాయి. అందుకే నా బుర్రంతా చిక్కుముళ్లతో నిండి ఉంది!" అన్నాడు.

"మనం అందరం అలాగే ఉన్నాం, గురూ! పద పోదాం," అన్నాను అతని భుజం మీద పొడుస్తూ.

నాకన్నా ముందుండాలని తను త్వరత్వరగా నాలుగడుగులు వేశాడు.

సహారామాల్ మలుపులో మేం పిజ్జాహట్ పక్కగా వెళ్లాం. అది మూసి ఉంది. ఫ్రూమ్ ముందుకి వెళ్లి దానిముందు నిలబడ్డాడు. అతనికి నిజంగా పిచ్చి పట్టిందనుకున్నాను. లేకపోతే ఈ సమయంలో పిజ్జా దొరుకుతుందని అనుకుంటున్నాడా?

మేం పిజ్జా తలుపు దగ్గర నిలబడ్డాం. మాకు కుడివైపున ముప్పై అడుగుల వెడల్పున్న కోలా కంపెనీవాళ్ల ప్రకటన ఉన్న ఇనుపబోర్డు ఉంది. ఒక ప్రఖ్యాత బాలీవుడ్ తార డ్రింక్ బాటిల్ పట్టుకుని కళ్లతోనే రారమ్మని పిలుస్తోంది. ఒక్క డ్రింకుతో ఆమెని వశపరుచుకుని పడక మీదకి తీసుకెళ్లవచ్చని కాబోలు ఆ ప్రకటన అర్థం!

ఫ్రూమ్ ఆ తార మొహం దగ్గరికి నడిచాడు.

"ఏమిటి, గురూ?" అన్నాను.

"ఈమెని చూశావా?" అన్నాడు ఫ్రూమ్ తారని చూపిస్తూ.

చూస్తున్నానని తలాడించాను.

"మన బెస్ట్ ఫ్రెండులా మనవేపు ఎలా చూస్తోందో చూడు! ఏదో మనమీద ప్రేమ ఒలికిపోతున్నట్టు!"

"ఏమో తెలీదు! ఆమె యువతకు ఆరాధ్యదేవత, మాన్!" నేను భుజాలెగరేసి అన్నాను.

"అవును యువతీ యువకులకి ఆరాధ్యదేవత! ఈ మట్టిబుర్ర పిల్ల మనకి ఆదర్శం! ఆమెకి జీవితం గురించి కానీ, మన గురించి కానీ ఏమైనా తెలుసా? అసలు మనల్ని పట్టించుకుంటుందా? దీనికి కావల్సింది డబ్బు. నీ గురించీ నా గురించీ ఈవిడగారికి

అక్కర్లేదు. ఈ నల్లరంగు ఉచ్చ నువ్వు కొనటమే దానికి కావల్సినది!" అన్నాడు ప్రూమ్ కోలా సీసా చూపిస్తూ.

"నల్లటి ఉచ్చా?" అని నవ్వుతూ దగ్గర్లో ఉన్న మెట్ల మీద కూర్చున్నాను.

"ఒక్క బాటిల్‌లో ఎంత చక్కెర ఉంటుందో నీకు తెలుసా?" అన్నాడు ప్రూమ్.

తెలీదని తల అడ్డంగా ఆడించాను.

"ఒక్క బాటిల్‌లో ఎనిమిది చెంచాల చక్కెర, అది తప్ప ఇంకేమీ ఉండదు. అయినా ఇది చాలా ముఖ్యమని మనని నమ్మమంటారు, కానీ కాదు!"

ప్రూమ్ చుట్టూ చూశాడు. ఒక ఇటుకలకుప్ప కనిపించింది. ఒక ఇటుకని తీసి కోలా బోర్డు మీదకి బలం కొద్దీ విసిరాడు. అది కాస్తా వెళ్లి తార బుగ్గకి ధామ్మని కొట్టుకుంది. నిజంగానే ఆ తార బుగ్గలో సొట్ట ఉందా అనిపించేట్టు, బోర్డుమీద సొట్టపడింది. ఆమె ఇంకా నవ్వుతూనే ఉంది!

"జాగ్రత్తరా, బాబూ! పద పోదాం. ఎవరైనా చూస్తే మనని జైల్లో పెడతారు."

"నేను పట్టించుకున్నట్టు, ఎవరూ పట్టించుకోరు," అంటూ ప్రూమ్ తూలుతూ నాకేసి నడిచాడు. వీధిదీపాల వెలుతుర్లో అతని పొడుగాటి ఆకారాన్ని చూశాను. "ప్రభుత్వానికి ఎవరి సంగతీ పట్టదు. ఆ 'యూత్ స్పెషల్' ఛానల్ కూడా, వాళ్లు కూడా పట్టించుకోరు. వాళ్లు 'యూత్' అనటం దేనికోసం తెలుసా? అప్పుడే పిజ్జా హట్లో, కోక్, పెప్సీ వాళ్లూ వాళ్లకి ప్రకటనలిస్తారు. మన జీతమంతా ఆ పిజ్జాలకీ, కోక్‌లకీ ఖర్చుపెడితే మనం ఆనందంగా ఉంటామని ఆ ప్రకటనలు అంటాయి. యువకులకి బుర్ర ఉండదని అనుకుంటారేమో వాళ్లు. వాళ్లు ఏ చెత్త కొనమన్నా మనం కొనేస్తామా?" అన్నాడు.

ప్రూమ్ పిజ్జా హట్ మెట్లమీద కూర్చున్నాడు. "శ్యామ్! నాకు వాంతికొచ్చేట్టుంది," అన్నాడు.

"ఓహ్, నో! అంటూ అతనికి మూడడుగులు దూరంగా జరిగాను.

"యాక్..." అంటూ ప్రూమ్ వాంతి చేసుకున్నాడు. అది 12 అంగుళాల పిజ్జాలాగ కొట్టు ముందర నేలమీద పరుచుకుంది.

"ఇప్పుడు హాయిగా ఉందా?" అన్నాను అతను లేవటానికి జాగ్రత్తగా సాయం పడుతూ. ప్రూమ్ తలాడించాడు.

లేచి నిలబడి భుజాలు విదిలించి నా పట్టునించి తప్పించుకున్నాడు. మరో ఇటుక తీసి చేత్తో పైకి పట్టుకుని, ఒక్కసారి చెయ్యి విసిరి దాన్ని పిజ్జా హట్ రెస్టారెంటు మీద పడేట్టు చేశాడు. ఒక కిటికీ బద్దలయి, ఐస్ ఫౌంటెన్‌లాగ గాజుముక్కలు అంతటా పడ్డాయి. లోపలెక్కడో అలారం మోగసాగింది.

"ఏమిటిది, ప్రూమ్! నీకు పిచ్చెక్కిందా? పద ఇక్కణ్ణించి త్వరగా పోదాం!" అన్నాను.



అలారం చప్పుడు విని ప్రూమ్ కూడా తుళ్లిపడ్డాడు, అతని శరీరం ఒక్కసారిగా అప్రమత్తంగా అయింది.

"ఊఁ పద పరిగెత్తు!" అన్నాడు. ఇద్దరం క్వాలిస్ ఉన్నచోటికి పరిగెత్తాం.

క్వాలిస్ దగ్గరికి చేరుకున్నాక, "నీకు పిజ్జా ఇష్టమనుకున్నానే!" అన్నాను.

"అవును, నాకు పిజ్జా ఇష్టం, చాలా ఇష్టం. నాకు జీన్సన్నా, మొబైలన్నా, పిజ్జాలన్నా చచ్చేంత ఇష్టం. నేను సంపాదిస్తాను, తింటాను, చెత్తంతా కొంటాను, చివర్కి చస్తాను. అదేరా ప్రూమ్ జీవితమంటే! ఇదంతా పనికిరాని చెత్త, గురూ!" అన్నాడు ప్రూమ్ పొట్ట పట్టుకుని, ఆయాసపడుతూ. అతని బాధ ఇంకా తగ్గినట్టు లేదు. కానీ పరిగెత్తటం వల్ల మత్తు దిగిపోయి నట్టుంది.

"సీరియస్‌గా అడుగుతున్నా, గురూ! ఇప్పుడు నేను డ్రైవ్ చెయ్యచ్చా?" అన్నాను, ప్రూమ్ కారు ముందు తలుపు తెరుస్తూంటే. అతను చప్పుడుచేస్తూ, గట్టిగా ఊపిరి పీలుస్తున్నాడు.

"వీల్లేదు..." అంటూ నన్ను అవతలికి తోశాడు, ప్రూమ్.

కారు గేరులో ఉండగానే స్టార్ట్ చేసేప్పటికి, ఒక్క జర్క్ యిచ్చి ఆగింది.

"ఇప్పుడు నీ ఒంట్లో బాగానే ఉందా?" అంది ఈషా.

ప్రూమ్ అవునని తలాడించి, చెయ్యెత్తి అందరికీ క్షమాపణ చెప్పాడు. కొన్ని సెకన్లు ఆగి, జాగ్రత్తగా కారింజన్ని స్టార్ట్ చేశాడు. ఈసారి నెమ్మదిగా డ్రైవ్ చేస్తానని మాటిచ్చాడు. మళ్లీ మేం రోడ్డుమీదికి వచ్చాం.

తన తాగుడు మత్తు గురించి కాక ఇంకేమైనా మాట్లాడాలన్న ఉద్దేశంతో ప్రూమ్, "మీకు 'బెడ్' నచ్చిందా?" అని అడిగాడు.

"చాలా బావుంది. నాకు కావల్సినట్టుగా ఉంది ఆచోటు! ఏయ్, ప్రూమ్! కార్లో క్యాసెట్లేమైనా ఉన్నాయా?" అంది ఈషా.

"ఉండే ఉండాలి. చూస్తానుండు," అంటూ ప్రూమ్ కారు గ్లవ్‌బాక్స్‌లో వెతికి ఒక టేప్‌ని తీసి పైకి పట్టుకుని, "ముసాఫిర్ లౌంజ్," అన్నాడు.

"ఊఁ... బావుంటుంది," అన్నారు ఈషా, రాధికా.

"వద్దు," అన్నాం నేనూ, ప్రియాంకా ఒకేసారి.

"కమాన్! మీ ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టం లేదని తెలుసు, కానీ ఒకే రకమైన అయిష్టాలున్నాయని తెలీదే?" అని నవ్వాడు ప్రూమ్. టేప్ పెట్టి ఆన్ చేశాడు. 'రబ్బా' అనే పాట మొదలైంది.

మునుపు కూర్చున్నట్టే, అవే చోట్లలో కూర్చున్నాం. అందరం, కానీ నేనుమాత్రం ప్రియాంక పక్కన కూర్చున్నాను. పాట లయకి ఆమె శరీరం నా కుడిపక్క అంతా తగులుతూండటం తెలుస్తూనే ఉంది, ఆ స్పర్శతో మెత్తటి విద్యుత్ తరంగాలు నాలో ప్రవహిస్తున్నట్టు

అనిపించింది. ఆమె చెయ్యి మళ్లీ పట్టుకోవాలని ఎంతో అనిపించినా, నా మనసుని అదుపులో పెట్టుకున్నాను. చల్లటి గాలికోసం కిటికీ తెరిచాను.

"కిటికీ తెరవకు, చాలా చలిగా ఉంది," అంది ఈషా.

"ఒక్క నిమిషం!" అని చల్లటి గాలిని లోపలికి రానిచ్చాను.

పాటలోని సాహిత్యం మీద ధ్యాస ఉంచాను. ఆ పాడే అతను తన జీవితంలోకి ప్రియురాలు ఎందుకు రాకూడదో చెపుతున్నాడు. ఒకవేళ వచ్చినా తనతోనే ఉండిపోవాలి గాని, వదిలి వెళ్లిపోకూడదంటున్నాడు. ఆ పాటలోని మాటలు నా మనసుకి మరీ దగ్గరగా అనిపించాయి. అయినా, నాకు ఆ తరవాత రాబోయే పాట, 'మాహీ వే' గురించి విచారం పట్టుకుంది. ఆ పాట 32వ మైల్‌స్టోన్ పార్కింగ్ జాగా జ్ఞాపకాలని మళ్లీ రేపుతుంది.

నా కను కొలకుల్లోంచి ప్రియాంక మొహంలో భావాలు మారటం చూశాను. రాబోయే పాట గురించి ఆమె కూడా భయపడుతున్నట్టు కనిపించింది. అవును, దాన్ని విని తట్టుకోవటం కష్టమే మరి!

నేను భయపడుతున్న ఆ పాట మొదలవగానే వ్రూమ్, "నాకు ఈ పాటంటే చెప్పలేనంత ఇష్టం!" అన్నాడు.

ఆ పాటలోని సాహిత్యం వినబడగానే ఏకాంతంగా నా తలకాయలో రీవైండ్ బటన్‌ని నొక్కి ప్లే చెయ్యటం మొదలుపెట్టాను. 32వ మైల్‌స్టోన్ దగ్గర గడిపిన ప్రతి క్షణం గుర్తు కొచ్చింది. ప్రియాంక నా ఒళ్లో కూర్చోవటం, నా కాలివేలు తొక్కటం, ఆమె తల కారు పైకప్పుకి కొట్టుకోవటం, అన్నీ నాకు గుర్తొచ్చాయి. ఆమె ఎంతో జాగ్రత్తగా, నెమ్మదిగా, అద్భుతంగా నాతో సెక్స్ అనుభూతి పొందటం గుర్తొచ్చింది. తన ఊపిరి నా గడ్డానికి తగలటం, తన కళ్లు నా కళ్లలోకి చూడటం, నా చెవుల్ని తను కొరికినప్పుడు నాకు కలిగిన తీయని బాధ, వాటన్నిటినీ నేను యిప్పుడు మిస్సవుతున్నాను. మనం మర్చిపోదామనుకునే విషయాలని జ్ఞాపకం చేసే ఆ గుణం సంగీతానికెలా అబ్బిందో? నాకు ప్రమోషన్ వచ్చి ఉంటే బావుండేదనిపించింది. ప్రియాంక నన్ను అసలు వదిలిపోకుండా ఉంటే బావుండేదనిపించింది. నా ప్రపంచం ఇంకా ఆనందంతో నిండి ఉంటే బావుండేదనిపించింది.

నేను బైటికి చూడటానికని తల తిప్పుకున్నాను. గాలి మరీ చల్లగా అనిపించింది. ముఖ్యంగా నా బుగ్గలమీద ఉన్న రెండు చారల మీద – నా మొహాన్ని తడిమి చూసుకున్నాను. ఘోరం! నేను ఏడుస్తున్నానని నమ్మలేకపోయాను!

"ప్లీజ్, ఇక ఆ కిటికీ మూసేద్దామా? గాలికి నా జుట్టంతా ఎగిరిపోతోంది!" అంది ఈషా.

నేను కిటికీ అద్దం మూసేశాను. నా కళ్లు కూడా మూసుకోవటానికి ప్రయత్నించాను కానీ, కన్నీళ్లు బైటికి కారుతూ ఉండటం వల్ల, అది వీలుకాలేదు. అలా ఏడవటం నాకు చాలా చిన్నతనమనిపించింది.

ప్రియాంక వైపు చూశాను. బహుశా నా ఊహేనేమో తెలీదు కానీ, తన కళ్లు కూడా తడిగా



కనిపించాయి. నాకేసి ఒకసారి చూసి, చటుక్కున మొహం తిప్పేసుకుంది. నేను కూడా ప్రస్తుతం ఆమె కళ్లలోకి చూడటాన్ని భరించే స్థితిలో లేను. అందులోనూ, ఆ ముక్కుకేసి చూడటం అసంభవమనిపించింది!

వ్రూమ్ టిస్యూ బాక్సులోంచి రెండు టిస్యూపేపర్లు తీసి, చెయ్యి వెనక్కి జాపి, మాకు వాటిని అందించాడు.

"ఏమిటిది?" అన్నాను.

"రియర్ వ్యూ మిర్రర్ ఉంది. నేను చూడగలను," అన్నాడు వ్రూమ్.

"మేమందరం చూడగలం," అంటూ ఈషా, రాధికా పగలబడి నవ్వారు.

"నువ్వు ముందుకి చూస్తూ డ్రైవ్ చెయ్యి, తెలిసిందా?" అన్నాను. టిస్యూ తీసుకుని ముక్కు తుడుచుకుంటున్నట్టు నటిస్తూ కళ్లు తుడుచుకున్నాను. ప్రియాంకా కూడా ఒకటి తీసుకుని కళ్లు అద్దుకుంది.

ఈషా తన సీట్లోంచే చెయ్యి వెనక్కి పెట్టి ప్రియాంకా చేతిని నిమిరింది.

"మీరిద్దరూ చాలా తమాషా మనుషులు. ఏదీ, మీరిద్దరూ కాలేజీలో ఎలా కలుసుకున్నారో, ఒకసారి నాకు గుర్తుచెయ్యి?" అన్నాడు వ్రూమ్.

"ఆ సంగతి వదిలెయ్యి!" అన్నాను.

"కమాన్, శ్యామ్! చెపుదూ, మీరు నాకా సంగతి చెప్పనే లేదు," అంది రాధిక.

"క్యాంపస్ ఫెయిర్‌లో," అన్నాం నేనూ, ప్రియాంకా ఒకేసారి.

నేనామెకేసి చూశాను. ఇద్దరం మర్యాదకి చిరునవ్వు నవ్వాం.

"నువ్వే చెప్పు!" అంది ప్రియాంక.

"లేదు, నువ్వే బాగా చెప్పగలవు," అన్నాను.

మేమిద్దరం వందసార్లు చెప్పినా విసుగుపుట్టని ఆ కథని మళ్లీ చెప్పటానికి ప్రియాంక నిటారుగా కూర్చుంది.

"రెండో సంవత్సరం చదువుతూండగా, ఇద్దరం క్యాంపస్‌లో ఎగ్జిబిషన్ జరుగుతున్నప్పుడు కలుసుకున్నాం. మేమిద్దరం అక్కడ స్టాల్సు పెట్టాం. నాది స్త్రీలకి అధికారం కల్పించటం గురించిన స్టాలు. మనదేశంలోని గ్రామీణ స్త్రీలు ఎదుర్కొనే సమస్యల గురించి స్లైడ్లు వేసి చూపించాను. శ్యామ్‌ది వీడియో గేమ్స్ కౌంటర్. ఎవరూ మా ఇద్దరి స్టాల్సుకీ రాలేదు. అందరూ ఫుడ్‌స్టాల్సుకే తిండికోసం ఎగబడ్డారు."

"ఊఁ, తరవాత?" అంది ఈషా ప్రియాంకనే చూస్తూ.

"ఆ తరవాత శ్యామ్, నేనూ ఒక ఒప్పందానికి వచ్చాం, ఇద్దరం ఒకళ్ల స్టాలుకి ఒకరం రోజుకి ఆరుసార్లు వెళ్లాలని. శ్యామ్ వచ్చి పొలాల్లో కష్టపడి పనిచేసే ఆడవాళ్లనీ, స్త్రీవిద్యకి

సంబంధించిన కార్యక్రమాలనీ చూసేవాడు. నేను అతని స్టాలుకి వెళ్లి 'దూమ్ II', అతని స్టాల్లో ప్లేస్టేషన్‌లో ఆడేదాన్ని. ఎగ్జిబిషన్ అయిపోయే సమయానికి నేను ఆ ఆటలో అతన్ని ఓడించేటంత చక్కగా ఆ ఆట నేర్చుకున్నాను," అంది ప్రియాంక.

"ఏం కాదులే. ఎప్పుడు కావాలంటే అప్పుడు నిన్ను 'దూమ్ II' ఆటలో ఓడించగలను!" అన్నాను.

"సరే, మొత్తం మీద మూడు రోజుల్లో మేమిద్దరం ముప్పైసార్లకి పైగా ఒకరి స్టాలుకి మరొకరం వెళ్లాం. మూడురోజులూ అయిపోయాక మాకు అనిపించింది..." అని ఆగిపోయింది ప్రియాంక.

"ఏమనిపించింది?" అంది రాధిక.

"ఆ రెండు స్టాల్సూ మా ఇద్దరివీ అనిపించింది. అంతేకాదు, మేమిద్దరం కలిసి ఉన్నంత సేపూ ఇంకెవరూ మా స్టాల్సుకి రావక్కర్లేదని కూడా అనిపించింది," అంది ప్రియాంక, గొంతు పూడుకుపోతూంటే.

నా గొంతులో ఆసరికే బత్తాయి పండంత ఉండ అడ్డుపడి ఉంది. అందుకే మామూలుగా ఉండటానికి ప్రయత్నిస్తూ అవునని తలాడించి ఊరుకున్నాను.

మేమిద్దరం మౌనంగా ఉండిపోయం. ఇక ప్రియాంక పెద్దపెట్టున ఏడుపు లంకించుకుంటుందని అనిపించింది నాకు.

"ఊc, ఎన్నో మార్పులొస్తాయి, అయినా జీవితం ముందుకి సాగుతూనే ఉంటుంది.. ఇంకా మెరుగైనవాటి వైపుకి, ప్లేస్టేషన్ నించి x-బాక్స్‌కి వెళ్లినట్టుగా!" అన్నాడు వ్రూమ్.

నాకు వ్రూమ్ అంటే రోత. ప్రియాంక బాగా మెత్తబడే టైమ్‌కి వ్రూమ్ అన్న అతితెలివి మాటలు ఆమెని మళ్లీ వాస్తవంలోకి తీసుకొచ్చాయి. ఆమె సర్దుకుని, మాట మార్చింది.

"ఇంకా ఎంత దూరం ఉంది?" అంది.

నేను నా వాచీకేసి చూసుకున్నాను.

"ఏమిటి వ్రూమ్? 4:00 దాటింది. ఇంకా ఎంతదూరం వెళ్లాలి?"

"కాల్‌సెంటర్‌కి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాం. నేను ప్రస్తుతం నెమ్మదిగా డ్రైవ్ చేస్తున్నాను. ఇంకా వేగంగా పోనివ్వమంటావా?"

"వద్దు!" అందరం గట్టిగా అరిచాం.

"మనం చేరటానికి ఆలస్యం అవుతుంది. బక్షీ చిందులు తొక్కుతాడు!" అన్నాను.

"కావాలంటే దగ్గరదారిలో వెళ్తాను," అన్నాడు వ్రూమ్.

"దగ్గర దారా?" అన్నాను.

"కొద్దిదూరంలో ఎడమకి ఒక మట్టిరోడ్డుంది. దాన్ని బిల్డింగులు కట్టేవాళ్లకోసం వేశారు. అది పొలాలగుండా వెళ్తుంది. అలా వెళితే రెండు కిలోమీటర్లు కలిసొస్తాయి."



"ఆ రోడ్డుమీద దీపాలున్నాయా?" ఈషా అడిగింది.

"లేవు. కానీ మనకి కారు హెడ్‌లైట్లున్నాయిగా? ఇంతకుముందు నేను ఆ దారిన వెళ్లాను. అట్నించి వెళ్దాం," అన్నాడు వ్రూమ్.

ఒక కిలోమీటరు దూరం వెళ్లాక వ్రూమ్ వేగంగా ఎడమకి తిరిగాడు.

"అబ్బా! ఈ రోడ్డు ఇంత కుదుపులతో ఉంటుందని నువ్వు ముందుగా మాకు చెప్పలేదు!" అంది ఈషా.

"కొద్ది నిమిషాలే. నిన్న కురిసిన వానకి ఇవాళ నేల తడిగా ఉంది. అందుకే కారు సాఫీగా వెళ్లటం లేదు," అన్నాడు వ్రూమ్.

మేం పూర్తిగా చీకట్లోకి కూరుకుపోయాం. హెడ్‌లైట్లు దారి చూపించటానికి ఎంత ప్రయత్నించినా పెద్దగా లాభం లేకపోయింది. దారంతా పొలాలూ, ఇంకా కడుతున్న కట్టడాలూ, సిమెంటూ, ఇటుకలూ, ఇనపకడ్డీలూ ఉన్నాయి. కొన్నిచోట్ల లోతైన గుంటలున్నాయి. అవి ఎత్తైన భవనాలకోసం బిల్డర్లు వేసిన పునాదులు. ఢిల్లీ మొత్తం గుడ్‌గావ్‌కి తరలిరావటానికి ప్రయత్నిస్తోందనీ, పంటల బదులు జనం ఇళ్లని పండిస్తున్నారనీ అనిపించింది నాకు.

"వచ్చేశాం. కాస్త దూరం వెళ్లి మళ్లీ తిరిగితే హైవేమీదికి చేరుకుంటాం," అన్నాడు వ్రూమ్ వేగంగా కుడివైపుకి కారుని తిప్పుతూ.

ఉన్నట్టుండి క్వాలిస్ అదుపు తప్పింది. కారు దబదబమని చప్పుడు చేస్తూ కిందికి జారిపోసాగింది.

"జాగ్రత్త!" ప్రతిఒక్కరూ అరిచారు, పక్కన ఏది దొరికితే దాన్ని గట్టిగా పట్టుకున్నారు. క్వాలిస్ రోడ్డుమీదినించి కిందికి దిగిపోయి, ఎత్తునించి కిందికి బురదలోకి వెళ్లిపోయింది. వ్రూమ్ స్టీరింగ్‌ని అదుపులో ఉంచటానికి నానా అవస్థా పడుతున్నాడు. కానీ చక్రాలు నేలమీద నిలవలేకపోతున్నాయి. తాగుబోతు దేశదిమ్మరిలా, క్వాలిస్ తడబడుతూ వెళ్లి ఒక పెద్ద బిల్డింగ్ పునాదుల మీదికి చేరుకుంది.

# # 29

ఇక నేల వాలుగా లేకపోయినప్పటికీ క్వాలిస్ ఇంకా ముందుకి దొర్లిపోతూనే ఉంది. కట్టడానికని పేర్చిన ఇనుపచువ్వల జాలీమీదికి చేరుకున్నాక దాని వేగం తగ్గింది. ప్రూమ్ బలమంతా ఉపయోగించి బ్రేకులు వేశాడు. దాంతో క్వాలిస్ ఆ జాలీమీద గణగణమని చప్పుడు చేస్తూ, రెండుసార్లు ఎగిరిపడ్డాక, ఆగిపోయింది.

"డామిట్!" అన్నాడు ప్రూమ్.

అందరం నిర్ఘాంతపోయి మౌనంగా ఉండిపోయాం.

"ఏం బెంగ పడకండ్రా!" అని ప్రూమ్ కారు స్టార్ట్ చేశాడు. క్వాలిస్ భయంకరంగా కంపిస్తూ కదలసాగింది.

"ఇగ్నిషన్... ఆపెయ్యి... ప్రూమ్..." అన్నాను. నేను కారుకిందికి చూశాను. మాకిందున్న ఇనుపచువ్వల చట్రం విపరీతంగా కంపిస్తోంది.

ఇంజన్ ఆఫ్ చేస్తూంటే ప్రూమ్ చేతులు కూడా వణికాయి. అతని ఒంట్లో ఇంకా ఏమాత్రం ఆల్కహాలు మిగిలున్నా కొద్ది సెకన్లలో అది ఆవిరైపోయుంటుందని అనుకున్నాను.

"ఎక్కడున్నాం, మనం?" అంటూ ఈషా కిటికీ అద్దం తెరిచింది. బైటికి చూసి "ఓహ్... నో!" అని కెవ్వున అరిచింది.

"ఏమయింది?" అంటూ నేను మళ్ళీ బైటికి చూశాను. ఈసారి జాగ్రత్తగా చుట్టూ పరికించి చూశాను. నాకు కనపడిన దృశ్యం హడలగొట్టేట్టు ఉంది : మేము ఒక బిల్డింగ్ పునాది తాలూకు గుంటలో పడ్డాం. దానిమీద కప్పిన ఇనపచువ్వలు పొడుచుకొస్తూ ఉన్నాయి. ఆ పునాది గుంట ఏ యాభై అడుగుల లోతో ఉండి, దానిమీదున్న చట్రంలో, సిమెంటు, కాంక్రీటు చేయబడ్డ ఇనప చువ్వలున్నాయి. ఆ చువ్వలు క్వాలిస్‌కి సమానాంతరంగా ఉండి, అటువైపుకి పైకి పొడుచుకొస్తున్నాయి. ఆ చువ్వలు మాత్రమే మాకు ఆధారంగా ఉన్నాయి. మేం కదిలినప్పుడల్లా క్వాలిస్ ఎగిరిపడుతోంది. ఆ చువ్వలు స్ప్రింగుల్లా పనిచేస్తున్నాయి. అందరి మొహాల్లోనూ నాకు భయం కనిపించింది, చివరికి మిలిటరీ అంకుల్ మొహంలో కూడా.

"మనం ఒక గుంటమీద వేళ్లాడుతున్నాం. కేవలం 'టూత్‌పిక్స్' ఆధారంతో! మన పని అయిపోయ్యింది!" అంది రాధిక, అందరి తరఫునా పరిస్థితిని క్లుప్తంగా వివరిస్తూ.

"మనం ఇప్పుడేం చేద్దాం?" అంది ఈషా. ఆమె గొంతులోని గాభరా మా అందరికీ భయం కలిగించింది.



"ఏం చేసినా చెయ్యండి కాని, మీరెవరూ కదలద్దు," అన్నాడు ప్రూమ్.

కొన్ని నిమిషాలు గడిచాయి. ఆరుగురు మనుషులు భారంగా ఊపిరి పీల్చటం తప మరే చప్పుడూ లేదు.

"మనం ఎవరినైనా సహాయం కోసం కేకేద్దామా? పోలీసుల్ని? ఫైర్ బ్రిగేడ్ని కాల్‌సెంటర్ని?" తన బ్యాగులోంచి మొబైల్‌ఫోన్ బైటికి తీస్తూ అంది ఈషా.

ప్రూమ్ తలాడించాడు. అతని మొహంలో భయం స్పష్టంగా కనిపిస్తోంది.

"అయ్యో, నా మొబైల్ పనిచెయ్యటంలేదు. పనిచేసే మొబైల్ ఎవరిదగ్గరన్నా ఉందా?" అంది ఈషా.

ప్రియాంక దగ్గరున్న సెల్‌ఫోనూ, రాధిక సెల్‌ఫోనూ కూడా పనిచెయ్యటంలేదు మిలిటరీ అంకుల్ దగ్గర మొబైల్ లేదు. ప్రూమ్ తన ఫోన్ బైటికి తీశాడు.

"నో నెట్‌వర్క్!" అన్నాడు.

నా ఫోన్‌ని జేబులోంచి తీసి ఈషాకి ఇచ్చాను.

"నీ ఫోను కూడా పనిచెయ్యటం లేదు, శ్యామ్!" అని ఈషా దాన్ని డాష్‌బోర్డుమీ పెట్టింది.

"అయితే ఈ లోకంలో ఎవరితోనూ మనం మాట్లాడలేమన్నమాట!" అంది రాధిక.

మా కారుకిందున్న ఒక ఇనుపకడ్డీ విరిగింది. క్వాలిస్ కొన్ని డిగ్రీలు కుడివైపుకి ఒరిగింది రాధిక నా వైపుకి ఒరిగింది; ప్రూమ్ పడకుండా ఉండటానికి స్టీరింగుని గట్టిగా పట్టుకున్నాడు డ్రైవర్ సీట్లో అతను బిగుసుకుపోయాడు, ఇంకేం చెయ్యాలో తెలీక. ఇంకో కడ్డీ విరిగింది, తరవాత మరోటి. మా కింద అవి పుల్లల్లా విరగటం మొదలుపెట్టాయి. క్వాలిస్ ముప్ఫై డిగ్రీల గుండ్రంగా తిరిగి ఆగింది.

మాకు అరవటానిక్కూడా ధైర్యం చాలలేదు.

"ఎవరికైనా ఏదైనా ఉపాయం తడుతోందా?" అన్నాడు ప్రూమ్.

నేను ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాను. నా మృత్యువు కనబడింది. నా జీవితం ఇక్కడిత ముగిసిపోవచ్చు, ఇలా ఎవరికీ తెలీకుండానే. ఎవరైనా మమ్మల్ని ఎలా కనుక్కోగలుగుతారు ఎప్పటికి కనుక్కోగలుగుతారు, అనిపించింది నాకు. రేపో ఎల్లుండో పనిలోకొచ్చే కూలీల మమ్మల్ని చూస్తారేమో!

"దుర్మరణం పాలైన ఆరుగురు బాధ్యతారహితమైన ఏజెంట్ల శరీరాల్లో ఆల్కహాలు అన్ని హెడలైన్స్ పేపర్లో వస్తాయి.

"ప్రూమ్, తలుపు తీయటానికి ప్రయత్నించు," అన్నాడు మిలిటరీ అంకుల్.

ప్రూమ్ తనవైపు తలుపు తీశాడు. క్వాలిస్ ఊగేసరికి, వెంటనే తలుపు మూసేశాడు

"వీలవదు. బాలెన్స్ పోతోంది. పైగా తీసి ఏం లాభం? మనం కార్లోంచి దిగలేం, సరాసరి ఆ గుంటలో పడిపోతాం," అన్నాడు ప్రూమ్.

వెనకనున్న కారు అద్దంలోంచి బైట ఏముందో చూద్దామని వెనక్కి తిరిగాను. మాకు కొన్ని అడుగుల దూరంలో పొదలు కనిపించాయి.

"ఎడమవైపుకి జరగండి. కుడివైపు బరువు వెయ్యద్దు. రేపు పొద్దున్నే ఎవరైనా మనని చూసేదాకా బాలన్సు చేసుకుని ఉండాలి," అన్నాడు ప్రూమ్.

నేను వాచీ చూసుకున్నాను. 4:14 అయింది. తెల్లారటానికి ఇంకా మూడుగంటలు ఆగాలి. ఒక జీవితకాలం! పైగా వెంటనే ఎవరైనా వస్తారని కూడా నమ్మకం లేదు.

"ఎవరూ రాకపోతే?" అంది ఈషా.

"రాకపోతే మనం చచ్చిపోతాం," అన్నాడు ప్రూమ్.

మేం ఒక్క నిమిషం సేపు మాట్లాడకుండా ఉండిపోయాం.

"అందరూ ఏదో ఒకరోజు చావాల్సిందే," అన్నాను మౌనాన్ని భంగపరచటానికి.

"ఇలా చావటమే సులభమేమో! జీవితంతో పోరాడటం కన్నా దాన్ని ముగించటం మంచిది," అన్నాడు ప్రూమ్.

నేను ఔనని తలాడించాను. నాకు భయంగా ఉంది, అందుకే ప్రూమ్ అలా ఏదో ఒకటి మాట్లాడటం నాకు బావుంది.

"నా ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే, మనం చచ్చిపోయాక కూడా ఎవరూ మనని కనుక్కోలేకపోతే, ఆ తరవాత ఏమవుతుంది?" అన్నాడు ప్రూమ్.

"రాబందులు మనల్ని కనిపెడతాయిలే. అవి తప్పకుండా కనిపెడతాయి. నేను డిస్కవరీ ఛానల్లో చూశాను," అన్నాను.

"అదే, నాకు చాలా అవస్థ అనిపిస్తుంది. పదునైన ముక్కులు నా కండరాలని చీల్చటం, నా ఎముకల్ని కరకరా నమలటం, నా శరీరాన్ని ముక్కలుముక్కలుగా చీల్చి చెండాడటం, నాకా ఆలోచనే నచ్చదు. పైగా, నా శరీరం భయంకరమైన దుర్వాసన వేస్తుంది. గౌరవంగా కాలి బూడిదయి, చివరికి పొగగామారి ఎగిరిపోవటమే మంచిది."

"ఏయ్, మీరిద్దరూ ఈ నాన్సెన్సు ఆపేస్తారా ఇక? కనీసం ఏమీ మాట్లాడకుండా ఉండండి!" అంది ఈషా, తన చేతుల్ని ముడుచుకుంటూ.

ప్రూమ్ ఆమెని చూసి నవ్వాడు. తరవాత నావైపు తిరిగి, "అయినా ఈషా అంత కంపు కొట్టదేమోలే. తను రాసుకునే కాల్విన్ క్లెయిన్ సెంటు ఆమె శవాన్ని రోజుల తరబడి ఫ్రెష్‌గా ఉంచుతుంది," అన్నాడు.

మాకింద మరో రెండు కడ్డీలు 'టంగ్'మని చప్పుడు చేస్తూ విరిగాయి.



"ఓహ్, నో!" అంది ప్రియాంక, తను కూర్చున్న సీటు కిందే ఉన్న మరో కడ్డీ విరిగిన చప్పుడు విని. డాష్‌బోర్డు మీద లైటు మినుకుమినుకు మనటం కనిపించింది.

నా సెల్‌ఫోన్ కంపిస్తూండడం చూసి అందరం అప్రమత్తులమయాం.

"అది నా ఫోను," అన్నాను.

ఫోను మోగసాగింది. అందరి నోళ్లూ తెరుచుకున్నాయి.

"నెట్‌వర్క్ లేకుండా ఇదెలా మోగుతోంది?" అంది ఈషా. ఆమె గొంతులో భయం తొంగిచూసింది.

"ఎవరది?" అంది రాధిక.

"ఎత్తండి," అన్నాను నాచెయ్యి చాస్తూ. నా చెయ్యి డాష్‌బోర్డుదాకా వెళ్లటం లేదు. ఎక్కువ కదలడం నాకిష్టంలేదు.

ఈషా ఫోన్ ఎత్తింది. ఫోన్ స్క్రీన్‌ని చూసి బరువుగా ఊపిరి తీసుకుంది.

"ఎవరది?" అన్నాను.

"నీకు... గాడ్ అనేవాళ్లెవరైనా తెలుసా? దీన్లో 'గాడ్ కాలింగ్' అని వస్తోంది," అంది ఈషా.

# # 30

ఈషా వేళ్ళు వణికాయి. ఫోన్ స్పీకర్ ఆన్ చేసి, బటన్‌ని నొక్కింది.

"హాయ్, పిల్లలూ! ఇంత ఆలస్యంగా ఫోన్ చేస్తున్నందుకు క్షమించండి!" ఒక గొంతు ఉల్లాసంగా పలికింది.

"ఊఁ... ఎవరది?" అంది ఈషా.

"నేను, దేవుణ్ణి!" అందా గొంతు.

"దేవుడా? అంటే....?" వెలుగుతున్న ఫోన్ వంక మేమందరం హడిలిపోయి చూస్తుండగా, రాధిక అడిగింది.

"అంటే, దేవుడు! మీరు ఒక విచిత్రమైన చిక్కులో ఇరుక్కోవటం చూసి, ఎలా ఉన్నారో కనుక్కుందామని ఫోన్ చేశాను!"

"ఎవరా మాట్లాడేది? జోక్ చేస్తున్నారా?" అన్నాడు వ్రూమ్ గొంతు పెంచుతూ.

"ఏం? నేను హాస్యమాడుతున్నట్టు అనిపిస్తోందా? నేను దేవుడినని అంటున్నాను అంతేగా!" అందా గొంతు.

నేను కళ్లు చికిలించాను. అసలు దేవుడు సెల్‌ఫోన్ ఉపయోగించటమే ఒక వింత, పైగా దేవుడే స్వయంగా ఫోన్ చెయ్యాల్సినంత గొప్పగా నా జీవితం ఉందని నేననుకోలేదు.

"సామాన్యంగా దేవుడు ఫోన్లూ అవీ చెయ్యడు. మీరు దేవుడని నిరూపించుకోండి. అలా చెయ్యలేని పరిస్థితిలో, దయచేసి మాకెవర్నైనా సాయం చేసేవాళ్లని చూసి పెట్టండి," అన్నాడు వ్రూమ్.

"నేను దేవుడినే అని ఎలా నిరూపించను? ఈ సెల్‌ఫోన్‌ని గాలిలో తేలేట్టు చెయ్యాలా? లేక మీరు అడగ్గానే మెరుపులు, ఉరుములతో వాన కురిపించాలా? పోనీ మీకు ఇంద్రజాలం అంటే ఇష్టమా? ఏవైనా స్పెషల్ ఎఫెక్ట్స్ లాంటివి?" అన్నాడు దేవుడు.

"ఊఁ, నాకు తెలీదు. కానీ మీరు చెప్పిన లాంటివే అనుకుంటా!" అన్నాడు వ్రూమ్.

"అంటే మీకు నమ్మకం కలిగించేందుకు నేను ఏర్పాటు చేసిన భౌతిక నియమాలనే నేను భంగం చెయ్యాలన్న మాట! సారీ, నేనీమధ్య అలాంటివి చెయ్యటం లేదు. పైగా నన్ను నమ్మేవాళ్లు చాలామంది తయారయారు. ఏదో మీకు సాయం చేద్దామనుకున్నాను, కానీ ఇక ఫోన్ పెట్టేస్తాను, మళ్లీ కలుద్దాం...." అన్నాడు దేవుడు.



"లేదు.....లేదు...... ఆగండి. మాకు సాయం చెయ్యండి....దే.... దేవుడా!" అని ఈషా కొద్దిగా పక్కకి తిరిగి, సెల్‌ఫోన్ మాకందరికీ వినిపించేట్టుగా పట్టుకుంది.

వ్రూమ్‌ని మాట్లాడద్దని సైగ చేస్తూ రాధిక చూపుడువేలిని తన పెదవుల మీద ఉంచింది.

"సరే, నేను వెళ్లటం లేదు లెండి! చెప్పండి, ఎలా ఉన్నారు?" అన్నాడు దేవుడు ఉత్సాహం నిండిన గొంతుతో.

"మేమిక్కణ్ణించి బైట పడటానికి సాయం చెయ్యండి. ఇంకొన్ని కడ్డీలు విరిగాయంటే మేం చచ్చిపోవటం ఖాయం!" అన్నాను.

"నేనడిగింది దీన్ని గురించి కాదు. అసలు మీ జీవితాలు ఎలా ఉన్నాయని?" అన్నాడు దేవుడు.

అలా అంత స్పష్టంగా అడిగే కష్టమైన ప్రశ్నలకి జవాబు చెప్పటం నాకు చేతకాదు. నా జీవితం ఎంత అధోగతిలో ఉందో ఒప్పుకోవటం కూడా నాకిష్టం లేదు.

"కానీ, ప్రస్తుతం మేమిక్కడ ఇరుక్కుపోయాం..." అనగానే దేవుడు నా మాటలకి అడ్డొచ్చాడు.

"ఏం భయం లేదు. క్వాలిస్ పడిపోదు. గాభరా పడకు."

నేను దీర్ఘంగా నిట్టూర్చాను. అందరూ మౌనంగా ఉన్నారు.

"సరే మళ్లీ అదే ప్రశ్న అడుగుతున్నాను. జీవితం ఎలా సాగుతోంది? నువ్వు ముందు చెపుతావా, రాధికా?" అని అడిగాడు దేవుడు.

"మీరు దేవుడు కదా, అంటే మీకన్నీ ముందే తెలిసుండాలి. నా జీవితం ఘోరంగా ఉంది," అంది రాధిక.

"నిజం చెప్పాలంటే, నాకు అంతా తెలుసు! మీరు మీ జీవితాన్ని గురించి ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలని అడుగుతున్నానంతే," అన్నాడు దేవుడు.

"మేమేమనుకుంటున్నామో చెపుతాను. జీవితం ఛం... సారీ!" అని వ్రూమ్ ఆగి, సరిదిద్దుకుని, "చాలా ఘోరంగా ఉంది. మేమేం తప్పు చేశామని? మా జీవితం ఇలా అధః పాతాళంలో కురుకుపోయిందెందుకు... అక్షరాలా, అలంకారికంగా కూడా? నే చెప్పిందే మా అందరి జీవితాలకీ వర్తిస్తుందని అనుకుంటా," అన్నాడు.

అందరం అంగీకారం తెలిపాం. దేవుడు నిట్టూర్చాడు.

"సరే, మిమ్మల్నొకటి అడుగుతాను. ప్రతిరోజూ మీకు ఎన్ని ఫోన్‌కాల్స్ వస్తాయి?" అన్నాడు దేవుడు.

"వంద. బిజీగా ఉండే రోజుల్లో రెండు వందలు," అన్నాడు వ్రూమ్.

"ఓకే! ఈ లోకంలోకల్లా అతిముఖ్యమైన ఫోన్‌కాల్ ఏదో మీకు తెలుసా?"

"తెలీదు," అన్నాడు వ్రూమ్. అందరం తలలు అడ్డంగా ఆడించాం.

"మనసులోంచి వచ్చే కాల్!" అన్నాడు దేవుడు.

"మనసులోంచి వచ్చే కాల్ అంటే?" అందరం ఒకేసారి అన్నాం.

"మీలో ఉండే చిన్న గొంతు, అది మీతో మాట్లాడాలని అనుకుంటూ ఉంటుంది. కానీ అది మీకు వినబడాలంటే మీరు శాంతంగా ఉండాలి- అప్పుడు కూడా దాని గొంతు వినపడడం చాలా కష్టం. ఎందుకంటే ఈ ఆధునిక యుగంలో నెట్‌వర్క్‌లు మరీ బిజీగా ఉంటాయి. ఆ గొంతే మీకు నిజంగా ఏం కావాలో చెప్పగలదు. నేనేమంటున్నానో మీకు తెలుస్తోందా?"

"కొంత వరకు," అంది ప్రియాంక ఫోన్ మీదినించి చూపులు తిప్పుకుంటూ.

"ఆ గొంతు నాది!" అన్నాడు దేవుడు.

"నిజంగానా?" అంది ఈషా. ఆమె నోరు తెరుచుకుని ఉండిపోయింది.

"అవును. ఆ గొంతుని వినిపించుకోకుండా ఉండటం కూడా సులభమే, ఎందుకంటే మీ ధ్యాస ఇంకో దానిమీద ఉంటుంది, మీరు బిజీగా ఉంటారు, లేదా జీవితం మరీ సాఫీగా గడిచిపోతూ ఉంటుంది. హాయిగా ఉన్న మీ జీవితం సాలెగూట్లో, చిక్కుకునేవరకూ, మరి అలాగే దాన్ని పట్టించుకోకుండా ఉండండి! ఆ తరవాత ఈరోజు జరిగినట్లు ఏదో సంఘటన జరిగి, జీవితం ఎటూ పోలేని స్థితికి చేరుకుంటుంది. మీముందు ఒక చీకటిలాంటి నల్లటి బిలం తప్ప మరేమీ ఉండదు!"

"మీరు చెప్పేదాన్లో నిజం ఉంది. అంతా అర్థం అవకపోయినా నిజమే అనిపిస్తోంది నాకు," అన్నాను ఏకీభవిస్తూ - బహుశా నాతో నేనే ఏకీభవించాననుకుంటా.

"నాలోని ఆ గొంతు నాకు తెలుసు. కానీ అది మరీ నెమ్మదిగా మాట్లాడదు. ఒక్కోసారి అరుస్తుంది. నన్ను కరుస్తుంది!" అన్నాడు వ్రూమ్.

"అయితే ఆ గొంతు నీతో ఏమంటుంది, వ్రూమ్?" అని అడిగాడు దేవుడు.

"నేను కేవలం డబ్బుకోసం ఒక ఉద్యోగాన్ని ఎంచుకోకుండా ఉండవలసిందని అంటుంది. కాల్‌సెంటర్లు ఎక్కువ జీతమిస్తాయి, ఎందుకంటే ఎక్స్‌చేంజ్ రేటు అమెరికన్లకి లాభదాయకంగా ఉంటుంది. వాళ్లు చిల్లర డబ్బులు మన మొహాన పారేస్తారు. రూపాయల్లో చూస్తే అది చాలా ఎక్కువలాగ కనిపిస్తుంది. నిజానికి, తక్కువ జీతమిచ్చే ఉద్యోగాలు ఇంతకన్నా మెరుగ్గా ఉండచ్చు. నేనేమిటో తెలియజేసే ఉద్యోగాలు ఉండచ్చు, నా దేశానికి నేను సాయం చెయ్యటానికీ, నేనేమైనా నేర్చుకోవటానికీ, తోడ్పడేట్టుగా అవి ఉండచ్చు. నేనీ ఉద్యోగాన్ని ఎంచుకోవటానికి, డబ్బే ప్రగతి అని సమర్థించుకున్నాను. కానీ అది నిజం కాదు. ప్రగతి అంటే భవిష్యత్తులో కూడా నిలిచి ఉండేట్టుగా దేన్నైనా నిర్మించటం," అన్నాడు వ్రూమ్. అతని గొంతులో ఏదో అడ్డుపడ్డట్టుగా అనిపించింది వినేవాళ్లకి. అతను తన మొహాన్ని తన చేతుల్లో దాచుకున్నాడు.



ఈషా తన చేతిని వ్రూమ్ భుజం మీద ఉంచింది.

"అరె, ఏమిటిది? అంతగా భావోద్వేగం చెందకండర్రా! ఇంతకన్నా మీరింకా ఎంతో ఎక్కువగా పని చెయ్యగలరు. మీరందరూ సామర్థ్యం గలవాళ్లే," అన్నాడు దేవుడు.

నా గురించి మాట్లాడుతూ 'సామర్థ్యం గలవాడు' అని ఎవరైనా అనటం ఇదే మొదటిసారి!

"మేం చెయ్యగలమా?" అని అడిగాను.

"తప్పకుండా. చూడండి, మీతో ఒక విషయమై బేరం చెయ్యబోతున్నాను. నేనీరోజు మీ ప్రాణాలని కాపాడతాను, బదులుగా మీరు నాకేమైనా ఇవ్వాలి. మీరందరూ మూడు నిమిషాలు కళ్లు మూసుకోండి. మీకు నిజంగా ఏం కావాలో ఆలోచించండి, దాన్ని పొందటానికి మీ జీవితాల్లో ఎటువంటి మార్పు రావాలో కూడా ఆలోచించండి. ఒక్కసారి ఇక్కణ్ణించి బైటపడ్డాక, ఆ మార్పులు తెచ్చుకోవటానికి ప్రయత్నించండి మీరా పని చేస్తే నేను ఈ గోతిలోంచి మిమ్మల్ని బైట పడేస్తాను, ఒప్పుకున్నట్టేనా?"

"అలాగే," అన్నాను. చావు నుంచి కాపాడతానంటే దేనికైనా ఒప్పుకుంటాం కదా! అందరూ సరేనని తలాడించారు.

మేం కళ్లు మూసుకుని గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నాం.

మీకు నేనో విషయం చెప్పాలి, మూడు నిమిషాలపాటు కళ్లు మూసుకుని ఈ లోకం నుంచి ఏమీ ఆలోచించకుండా ఉండటం అన్నిటికన్నా కష్టమైన పని! నేను ఏదైనా ఒక విషయం మీద మనసు కేంద్రీకరిద్దామని ఎంతో ప్రయత్నించాను, కానీ నేను ఒక్క కల్లోలాన్ని మాత్రం చూడగలిగాను! ప్రియాంక, బక్షీ, నా ప్రమోషన్, గణేశ్ - నా మనసు ఒకదాని మీంచి మరోదాని మీదికి దూకసాగింది.

"ఊఁ... ఇప్పుడు చెప్పండి!" అన్నాడు దేవుడు, మూడు నిమిషాలూ అయిపోయాక.

మేమందరం కళ్లు తెరిచాం. అందరి మొహాలూ ఇందాకటికన్నా ప్రశాంతంగా ఉన్నాయి.

"రెడీయా?" అన్నాడు దేవుడు.

అందరం తలాడించాం.

"సరే. క్వాలీస్‌లోని ఒక్కొక్కరినీ అడుగుతాను. వ్రూమ్, ముందు నువ్వు చెప్పు," అన్నాడు దేవుడు.

"నాకు అర్థవంతమైన జీవితం కావాలి. 'బెడ్' లేకపోయినా, రోజూ పిజ్జాహట్‌కి వెళ్లకపోయినా ఫరవాలేదు. నేనీ కాల్‌సెంటర్‌ని వదిలిపెట్టాలి. సారీ, 'కాలింగ్' అనేది నా 'కాలింగ్' కాదు!" అన్నాడు వ్రూమ్.

అతని ఆఖరి వాక్యం నాకు చాలా తెలివిగా ఉన్నట్టనిపించింది, కానీ పదాల గారడీని

పొగుడుతూ కూర్చోటానికి అది సమయం కాదు.

ఫ్రూమ్ తరవాత ప్రియాంక మాట్లాడింది. నా చెవులు మరింత నిక్కబొడుచుకున్నా

"మా అమ్మ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను. కానీ దాని కోసం నన్ను నే చంపుకోలేను. కుటుంబం అనే ఆలంబన ఉంటే చాలా మంచిదే, కానీ, ఆమె సంతోషంగా ఉండాలంటే దానికి బాధ్యత పూర్తిగా ఆవిడదే. నా దృష్టి నా జీవితం మీదా, నాకేం కావాలో దాని మీదా ఉండాలి," అంది ప్రియాంక. తన మాటల్లో నా పేరు కూడా ఎక్కడైనా వచ్చి ఉంటే బావుండేదని అనిపించింది నాకు, కానీ ఆ అదృష్టం నాకు దక్కలేదు. బహుశా ప్రియాంక మెదడులో తొంభై శాతం వాళ్లమ్మ ఆక్రమించుకుని ఉంటుంది, లేదా అది ఆవిడ అధీనంలో ఉంటుంది అని నేను అనుకుంటా.

ప్రియాంక తరవాత మిలిటరీ అంకుల్ వంతు వచ్చింది. అప్పుడు ఆయన నోట ఎన్నడు నేను విననన్ని ఎక్కువ మాటలు వచ్చాయి.

"నాకు అబ్బాయితోనూ, మనవడితోనూ కలిసుండాలని ఉంది. ప్రతిక్షణం వాళ్ళు దూరంగా ఉన్నారని బాధపడుతూంటాను. రెండేళ్ల క్రితం నేను వాళ్లతోనే ఉండేవాణ్ణి. కానీ నా కోడలు నాకు నచ్చని పనులే చేసేది, పార్టీలకి వేళ్లేది, ఆమె ఇంట్లోనే ఉండాలని నాకు అనిపించేది, కానీ తను ఉద్యోగానికి వెళ్లేది..... నేను వాళ్లతో పోట్లాడి విడిగా వెళ్లిపోయాను. కానీ నేను చేసింది తప్పు. వాళ్ల జీవితాన్ని, నా ఛాందస భావాలతో విమర్శించే హక్కు నాకు లేదు. అంతేకాక నాలో బాగా పెరిగి పోయిన నా అహంకారాన్ని నేను వదులుకోవాలి. అబ్బాయి దగ్గరికి వెళ్లి వాళ్లతో అన్ని విషయాలూ మాట్లాడి రావాలి," అన్నాడు.

తరవాత రాధిక వంతు వచ్చింది. కన్నీళ్లని ఆపుకుంటూ ఆమె మాట్లాడటం మొదలు పెట్టింది, "నేను నేనుగా మళ్లీ ఉండాలని కోరుకుంటున్నాను, అంటే పెళ్ళికి ముందు ఉన్నట్టుగా, నా తలిదండ్రులతో. అనుజ్‌కి విడాకులు ఇవ్వాలని ఉంది. ఇక జన్మలో మా అత్తగారి ముఖం చూడాలని అనిపించటం లేదు. ఇది జరగాలంటే, అనుజ్‌ని నేను పెళ్లి చేసుకోవటం ఒక పెద్ద పొరపాటని నేను ఒప్పుకోవాలి." అంది.

రాధిక తరవాత ఈషా మాట్లాడింది. "నా తల్లిదండ్రుల ప్రేమని మళ్లీ సంపాదించుకోవాలని ఉంది. తెలవితేటలు అక్కర్లేని మోడల్ అవాలని నాకు లేదు. అందానికి అసలు విలువ ఏదైనా ఉంటే, దాన్ని అంతకన్నా బాగా ఉపయోగించుకోగలనని అనిపిస్తోంది నాకు. ఏ వృత్తి నన్ను 'నువ్వు ఒక్క అంగుళం తక్కువున్నావు, పనికి రావని అన్నా', ఆ వృత్తికోసం నైతికతని వదులుకోవలసి వచ్చినా, అది శుద్ధ దండగ," అంది.

అందరూ నాకేసి చూశారు. ఇక మాట్లాడవలసి ఉన్నది నేనొక్కణ్ణే.

"నేనా? నేనేం చెప్పకుండా ఉండచ్చా?" అన్నాను.

అందరూ నాకేసి గుడ్లురిమి చూశారు. ఒక్కోసారి మనకున్న ఆలోచనలు ఎంత విచిత్రమైనవైనా, వాటిని లోకంలో పంచుకోవటం తప్పనిసరి అవుతుంది.



"ఓకే! నేను చెప్పేది చాలా తెలివితక్కువగా అనిపించచ్చు, కానీ నాకు సొంతంగా ఏదైనా బిజినెస్ మొదలుపెట్టాలని ఉంది. వ్రూమ్, నేనూ కలిసి ఒక చిన్న వెబ్ డిజైనింగ్ కంపెనీ పెట్టాలన్న ఆలోచన నాకుంది. అంతే. కానీ అది కుదరకపోవచ్చు, ఎందుకంటే నేను చేసే పనులేవీ సక్రమంగా జరగవు, అయినా...."

"ఇంకా ఏమిటి, శ్యామ్?" అన్నాడు దేవుడు నా మాటలకి అడ్డొస్తూ.

"ఆఁ.... ఏం లేదు," అన్నాను.

"శ్యామ్ నువ్వింకా చెప్పటం ముగించలేదు. నీకా సంగతి తెలుసు," అన్నాడు దేవుడు. దేవుడి కళ్లు కప్పటం అంత తేలిక కాదని అనుకుంటా. నేను అసలు విషయం చెప్పక ముందు చుట్టూ ఒకసారి చూసి చెప్పటం ప్రారంభించాను.

"ఏదో ఒక రోజు ప్రియాంక లాంటి వాళ్ల దృష్టిలో గౌరవం సంపాదించుకోవాలని ఉంది. ఈరోజు నేను ఆమెకి తగను, ఆ విషయం నేను ఒప్పుకుంటున్నాను....."

"శ్యామ్, నేనెప్పుడూ అలా అనలేదు...." అంది ప్రియాంక.

"ప్లీజ్, నన్ను చెప్పనియ్యి ప్రియాంకా! ఇక మీరందరూ నన్ను అణగదొక్కటం ఆపొచ్చు!" అన్నాను.

ప్రియాంక నాకేసి చూసి, మౌనంగా ఉండిపోయింది. నేనంత ఖరాఖండిగా మాట్లాడేసరికి కాస్త ఖంగుతిందని అనిపించింది.

నేను మళ్లీ చెప్పటం మొదలుపెట్టాను, "కానీ ఏదో ఒక రోజు ఆమెలాంటి అమ్మాయికి తగినట్టుగా తయారవాలని ఉంది. తనలాగా తెలివీ, చలాకీతనమూ, సరదా ఐన స్వభావమూ, స్పందించే గుణమూ ఉన్న అమ్మాయి, స్నేహాన్ని ప్రేమతో సునాయాసంగా ముడి వేయగల అమ్మాయికి నేను సరితూగాలి. అంతేకాదు, నేను జీవితంలో విజయాన్ని కూడా సాధించాలి," అన్నాను.

మేమందరం వంతులవారీగా మాట్లాడేశాం. దేవుడు మౌనంగా ఉండిపోయాడు.

"దేవుడా! ఏమన్నా అనండి. మాలో నిగూఢంగా ఉన్న రహస్యాలన్నీ మీతో చెప్పుకున్నాం కదా!" అంది ఈషా.

"నాకు నిజంగా చెప్పటానికేంలేదు. నాకు చాలా ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ ఉంది. మీరందరూ ఎంతో బాగా మాట్లాడారు. మీకేం కావాలో తెలుసుకోవటం ఒక గొప్ప ప్రారంభం. దాన్ని కొనసాగించటానికి సిద్ధంగా ఉన్నారా?" అన్నాడు దేవుడు.

నేను తప్ప అందరూ తలాడించారు.

"శ్యామ్ నువ్వు రెడీయేనా?" అన్నాడు దేవుడు.

నేను చిన్నగా తలాడించాను.

"శ్యామ్, నీ వ్యక్తిగత జీవితం గురించి నీ స్నేహితుల ముందు నేనొక మాట చెప్పవచ్చా?

అది నీకే కాక అందరికీ పనికొచ్చేదే," అన్నాడు దేవుడు.

"తప్పకుండా!" అని మనసులో, "ఆం నన్ను ఉదాహరణగా చూపిస్తూ 'ఎలా జీవించ కూడదు' అనే విషయాన్ని అందరికీ చెప్పండి. ఆ విధంగానైనా నేను కాస్త ఉపయోగపడతాను" అనుకున్నాను.

"నీకు జీవితంలో విజయం సాధించాలని ఉంది కదూ?" అన్నాడు దేవుడు.

"అవును," అన్నాను.

"విజయాన్ని సాధించాలంటే ఒక వ్యక్తికి నాలుగు లక్షణాలు అవసరం. స్పష్టంగా కనిపించేవి, రెండిటిని ముందుగా చెపుతాను. ఒకటి, సామాన్యమైన మోతాదులో తెలివితేటలు. రెండు, కొంచెం ఊహాశక్తి. ఒప్పుకుంటారా?"

"ఒప్పుకుంటాం," అన్నారు అందరూ.

"మీ అందరి దగ్గరా ఈ రెండూ ఉన్నాయి," అన్నాడు దేవుడు.

"మూడోదీ, నాలుగోదీ, ఏమిటి?" అన్నాడు వ్రూమ్.

"మూడోది, శ్యామ్ పోగొట్టుకున్నది," అన్నాడు దేవుడు.

"ఏమిటది?" అని అడిగాను.

"ఆత్మవిశ్వాసం. మీరు విజయాన్ని సాధించాలంటే కావల్సిన మూడో విషయం, ఆత్మ విశ్వాసం. కానీ శ్యామ్ దాన్ని పోగొట్టుకున్నాడు. తను ఎందుకు కొరగాడని అతను నూటికి నూరుపాళ్లు నమ్ముతున్నాడు."

నేను తల దించుకున్నాను.

"ఆ నమ్మకం నీకెలా కలిగిందో తెలుసా?" అన్నాడు దేవుడు.

"ఎలా?" అన్నాను.

"బక్షీ వల్ల. పనికిమాలిన బాస్ ఆత్మకి పట్టిన రోగం లాంటివాడు. ఎక్కువకాలం అటువంటి వాడికింద పనిచేస్తే, నీలోనే ఏదో తప్పుందనే నమ్మకం నీకు కలుగుతుంది. అసలు నిజానికి బక్షీ జీవితంలో విజయం పొందలేడని తెలిసినా, నీకు నీమీదే అనుమానం కలుగుతుంది. అలాటప్పుడే నీ ఆత్మవిశ్వాసం సడలుతుంది."

ఇంతక్రితం కడ్డీలమీద కంపిస్తూ నిలబడ్డ క్వాలిస్‌లాగ దేవుడు మాటలు విని నా పేగులు మెలితిరగసాగాయి.

"నాకు నా ఆత్మవిశ్వాసాన్ని తిరిగి పొందాలని ఉంది," అన్నాను.

"మంచిది. భయపడటం మానేస్తే దాన్ని మళ్లీ సంపాదించుకోగలుగుతావు. ఆ తరువాత నిన్నెవరూ ఆపలేరు," అన్నాడు దేవుడు.

నా ఒంట్లోని రక్తం పొంగి చెవుల్లో హోరెత్తింది. నా గుండె వేగంగా కొట్టుకుంటోంది.



నాకు వెంటనే కాల్‌సెంటర్లో ఉండాలనిపించింది. అదే సమయంలో బక్షీని తలుచుకోగానే సర్రున కోపం ఎగదన్నింది. నాలోని ఒక భాగాన్ని చంపేసిన ఆ మనిషిమీద, అందరి ఉద్యోగాలకీ ఎసరు పెట్టిన వాడిమీద, కాల్‌సెంటర్ని నాశనం చేసిన వాడిమీద, పగ తీర్చుకోవాలనిపించింది.

"విజయానికి పనికి వచ్చే నాలుగో అంశం ఏది?" అన్నాడు వ్రూమ్.

"నాలుగోది అన్నిటికన్నా బాధాకరమైనది. దాన్ని మీరందరూ ఇంకా నేర్చుకోవలసి ఉంది. ఎందుకంటే, చాలాసార్లు అదే అన్నిటికన్నా ముఖ్యమైనదని అనిపిస్తుంది," అన్నాడు దేవుడు.

"ఏమిటది?" అని అడిగాను.

"ఓటమి!" అన్నాడు దేవుడు.

"ఏమిటీ? మీరు విజయం గురించి మాట్లాడుతున్నారని అనుకున్నానే," అన్నాడు వ్రూమ్.

"అవును, కానీ నిజంగా విజయాన్ని సాధించాలనుకుంటే, మీరు ఓటమిని ఎదుర్కోవాలి. దాన్ని అనుభవించాలి, అర్థం చేసుకోవాలి, రుచి చూడాలి, బాధపడాలి. అప్పుడే మీరు రాణిస్తారు," అన్నాడు దేవుడు.

"ఎందుకు?" అని అడిగింది ప్రియాంక. నా వ్యక్తిత్వ విశ్లేషణ మీదే తన ధ్యాసంతా ఉందని తెలుస్తూనే ఉంది. నా ఉద్దేశంలో, గణేశ్ దగ్గర లెక్సస్ ఉంటే ఉండుగాక, కాని ఆమెకు నా అంత ఆసక్తికరమైన సైకో కేసు దొరకదుగాక దొరకదు.

"ఎందుకంటే, ఒకసారి ఓటమిని రుచి చూశాక, ఇంక భయం అనేది ఉండదు. ఎటువంటి విపత్తునైనా సులభంగా ఎదుర్కోగలుగుతారు. అతిజాగ్రత్త పాటిస్తూ, వీలైనంత ఒడిదుడుకులు లేకుండా బతకటానికి ప్రయత్నించరు - ఎగరటానికి సిద్ధంగా ఉంటారు. విజయం అంటే స్వేచ్ఛగా ఎగరటమే, ముడుచుకుని కూర్చోవటం కాదు," అన్నాడు దేవుడు.

"మంచి పాయింటు చెప్పారు," అంది ప్రియాంక.

"అయితే ఈ రహస్యం వినండి. ఓటమికి ఎన్నడూ భయపడకండి. అది మీకు ఎదురైతే, తరవాత విజయాన్ని సాధించేందుకు నేను మీకొక అవకాశాన్ని కల్పిస్తున్నాను, అని దాని అర్థం!"

"కూల్!" అంది ప్రియాంక.

"థాంక్యూ!" అన్నాడు దేవుడు.

"మీరు ఇండియాకి కూడా అమెరికాకి ఇచ్చినంత ఇచ్చి ఉంటే," అన్నాడు వ్రూమ్.

"ఏం, నీకు ఇండియా అంటే ఇష్టంలేదా?" అని అడిగాడు దేవుడు.

"అబ్బే, అదేం లేదు. ఇండియా బీద దేశం అయినంతమాత్రాన నేను దాన్ని ప్రేమించటం

మానేస్తానని అర్థం కాదు. ఈ దేశం నాది. కాని అమెరికాకి యింకా ఎన్నో ఉన్నాయి," అన్నాడు ఫ్రూమ్.

"ఊఁ, అమెరికా గురించి మరీ అంత గొప్పగా అనుకోకు. అమెరికన్ల దగ్గర ఎన్నో ఉండచ్చు, కానీ ఏ రకంగా చూసినా ఈ లోకంలో వాళ్ళే అందరికన్నా ఆనందంగా ఉన్నారని అనలేం. యుద్ధం చెయ్యటం ఒక వ్యసనంగా ఉన్న ఏ దేశమూ ఆనందంగా ఉండలేదు," అన్నాడు దేవుడు.

"నిజం!" అంది రాధిక.

"అంతే కాదు, అక్కడి జనం బుర్రల్లో చాలా పెద్ద పెద్ద సమస్యలున్నాయి, కాల్‌సెంటర్ ఏజెంట్లకి మాత్రమే తెలిసిన సమస్యలు. మీ కాల్‌సెంటర్ని దక్కించుకోవటానికి, ఈ రోజు రాత్రి మీరు వాటిని ఉపయోగించుకోవచ్చు," అన్నాడు దేవుడు.

"అయోమయంలో కూరుకుపోయిన అమెరికన్ల తలకాయలు మా కాల్‌సెంటర్ని కాపాడతాయా?" ఫ్రూమ్, రాధికా, నేనూ ఒకేసారి అన్నాం.

"అవును. వాళ్ల బలహీనతలు ఏవి అని కాస్త ఆలోచించండి. అప్పుడు మీరు విజయాన్ని పొందగలుగుతారు," అన్నాడు దేవుడు.

"అంటే ఎలాంటివి? వాళ్లవి ఊబశరీరాలు, వెకిలిగా ప్రవర్తిస్తారు, బుద్ధి ఏమాత్రం లేకుండా మాట్లాడతారు, ఎప్పుడూ విడాకులు తీసుకుంటూ ఉంటారు!" అంది ఈషా.

"ఇంకా ఉన్నాయి. నేను మీకొక హింట్ ఇస్తాను. ఈ యుద్ధం అనే భావన వెనక ఉన్నదేమిటి?" అన్నాడు దేవుడు.

"భయం. అది స్పష్టంగా తెలిసిపోతోంది. ఈ లోకంలో అందరికన్నా భయస్థులూ, అనుమానస్థులూ మానసిక ప్రకోపం ఉన్నవాళ్లూ, వాళ్లే," అన్నాను.

"వాళ్లని భయపెట్టి మాకు ఫోన్లు చేసేట్టు చేస్తే, అప్పుడు మాకు మునుపట్లా బోలెడన్ని ఫోన్లు వస్తాయి!" అన్నాడు ఫ్రూమ్ గొంతులో ఉత్సాహం తొణికిసలాడుతూంటే.

"ఇప్పుడు మీరు ఆలోచిస్తున్నారు. నిజానికి, బక్షీ మీద పగ తీర్చుకునే మార్గం కూడా మీరే వెతుక్కోగలరు. న్యాయం, ధర్మం కాస్త పక్కన పెట్టి, కొన్ని నియమాలని మీకు అనుగుణంగా మలుచుకునే అర్హత మీకు ఉంది," అన్నాడు దేవుడు. ఆయన చప్పుడు చెయ్యకుండా నవ్వుతున్నట్టు నాకనిపించింది.

అందరం చిరునవ్వు నవ్వాం.

"నిజంగా మనం బక్షీకి గుణపాఠం నేర్పగలమా?" అన్నాను.

"తప్పకుండా. బక్షీ మీ బాస్ కాదనీ, అందరికన్నా పెద్ద బాస్‌ని నేనేననీ, గుర్తుంచుకోండి. ఇకపోతే నేను మీతో ఉన్నాను, మరింక మీరు దేనికి భయపడాలి?" అన్నాడు దేవుడు.

"క్షమించండి! కానీ మీరు ఎప్పుడూ మాతోనే ఉండరుగా? ఉంటే, మరి మేమిలా ఇక్కడ ఎందుకు యిరుక్కుపోయాం?" అని అడిగింది రాధిక.

జవాబు చెప్పేముందు దేవుడు మళ్లీ ఒకసారి నిట్టూర్చాడు. "నా సిస్టమ్ ఎలా పనిచేస్తుందో ముందు మీరు అర్థం చేసుకోవాలి. వినండి, నాకు అందరు మనుషులతోనూ ఒక ఒప్పందం ఉంటుంది. మీరు మీ శక్తికొద్దీ చక్కగా పని చేస్తారనుకోండి, మీకు బోనస్‌లా, అప్పుడప్పుడూ నేను మీ వెనకే వచ్చి మిమ్మల్ని కాస్త ముందుకి తోస్తాను. కానీ అసలు పనిని మీరే మొదలుపెట్టాలి. లేకపోతే, ఎవరికి నా సాయం ఎక్కువ అవసరమో నేను గుర్తించలేను," అన్నాడు.

"మంచి పాయింటు!" అన్నాడు ఫ్రూమ్.

"అయితే నా అంతరాత్మ చెప్పేది విని, వీలైనంత బాగా పనిచేస్తానని మాటిస్తే మీరు నాకు సాయం చేస్తారా?" అన్నాను.

"తప్పకుండా. కానీ ప్రస్తుతం నేను వెళ్లాలి. ఇంకొకరెవరికో నా సాయం అవసరమయ్యేట్టుంది," అన్నాడు దేవుడు.

"ఆగండి! ముందు మేమీ గోతిలోంచి బైటపడేందుకు సాయం చెయ్యండి," అంది ఈషా.

"ఆఁ, అవును కదూ! మిమ్మల్ని ఈ గుంటలోంచి బైటికి తియ్యాలి కదా!" అన్నాడు దేవుడు. మళ్లీ ఫ్రూమ్‌తో, "ఓకే, ఫ్రూమ్! ఇప్పుడు నీకారు కొన్ని కడ్డీల మీద నిలిచి ఉంది. ఇలాంటి పరిస్థితినించి బైటపడటానికి రెండు ఉపాయాలున్నాయి," అన్నాడు.

"ఏమిటవి?"

"మొదటిది, రివర్స్ గేర్ సంగతి గుర్తుంచుకో. రెండోది, కడ్డీలతో మంచిగా ఉండు, వాటితో పోట్లాడకు. కడ్డీలని రైలు పట్టాల్లాగ వాడుకుంటే అవే నీకు బైటికి వెళ్లే దారి చూపిస్తాయి. ఊరికే అదే పనిగా వాటిని ఊపావనుకో, ఇక ఆ గొయ్యి అడుక్కి పడిపోతావు.

ఫ్రూమ్ కారు కిటికీలోంచి తల బైటికి పెట్టాడు, "కానీ ఈ ఇనుప కడ్డీలు, మరీ సన్నగా, నా వేళ్లంత మందంగా ఉన్నాయి. వాటిని ఒక చోట ఎలా చేర్చటం?"

"వాటిని కలిపి కట్టు!" అన్నాడు దేవుడు.

"ఎలా?" ఫ్రూమ్ అడిగాడు.

"అన్నీ నేనే చెప్పాలా?" అన్నాడు దేవుడు.

"దుపట్టా.... నా దుపట్టా తీసుకో," అంది ప్రియాంక.

"ఇందా, సగం అల్లిన స్కార్ఫ్ కూడా ఉంది, నా బ్యాగులో," అంది రాధిక.

"ఇక మీ సంగతి మీరు చూసుకోగలరనుకుంటా. వెళ్తున్నా గుర్తుంచుకోండి, మీకు అవసరమైనప్పుడు పలకటానికి నేను మీలోనే ఉంటాను," అన్నాడు దేవుడు.

"హూఁ....?" అని ఫ్రూమ్ ఫోన్‌కేసి చూశాడు.

"బై, దేవుడూ!" అన్నారు అమ్మాయిలు ఒకరి తరవాత ఒకరు.

"అందరికీ బై బై!" అని దేవుడు ఫోన్ పెట్టేశాడు. నేను అసంకల్పితంగా ఫోన్‌కి 'బై బై' అని చెయ్యి ఆడించాను. నిశ్శబ్దం మా చుట్టూ ఆవరించింది.

"అది....ఏమిటి...అయి ఉంటుంది?" అంది ప్రియాంక.

"నాకు తెలీదు గానీ, కాస్త ఆ దుపట్టానిలా ఇస్తావా ప్లీజ్?" అన్నాడు శ్రూమ్. "మిలిటరీ అంకుల్, వెనక తలుపు తెరిచి చక్రాలకిందున్న కడ్డీలని కలిపి కట్టగలరా? కావాలంటే దుపట్టాని చింపండి," అన్నాడు.

ఆఖరి వాక్యం విని ప్రియాంక ఒక్కక్షణం నొసలు చిట్లించింది. కానీ ఆ తరవాత మేం ఆ దుపట్టాని గాని, రాధిక సగం అల్లిన స్కార్ఫ్‌ని గాని, మళ్లీ చూడలేదు. క్వాలిస్ పదడుగుల దూరం నడిచి స్థిరంగా ఉండే నేలమీదికి చేరటం కోసం, శ్రూమ్, మిలిటరీ అంకుల్ చక్రాలకింది కడ్డీలని కలిపి కట్టారు. ఆ పని చేస్తూ వాళ్లు చాలాసార్లు ఆ లోతైన గుంటమీద ఒంగి, చీకటిగా ఉన్న అగాధంలోకి చూడాల్సి వచ్చింది. ఆ పని నేను చెయ్యవలసి రాలేనందుకు సంతోషించాను. ఆ దృశ్యాన్ని చూస్తే నేనయితే చచ్చిపోయుండేవాణ్ణి!

"ఓకేనక్రా! గట్టిగా పట్టుకుని కూర్చోండి!" అన్నాడు శ్రూమ్ తన సీట్లో వచ్చి కూర్చుంటూ.

శ్రూమ్ కారు స్టార్ట్ చేశాడు. క్వాలిస్ కంపించింది. మా కిందున్న కడ్డీలు మళ్లీ కంపించసాగాయి.

"శ్రూ...మ్...నేను...జారి...పోతున్నాను!" అంది ఈషా గ్లవ్ బాక్సుకున్న హ్యాండిల్‌ని గట్టిగా పట్టుకుంటూ.

క్షణంలో వెయ్యో వంతులో శ్రూమ్ క్వాలిస్‌ని రివర్స్ చేసి వెనక్కి నడిపాడు. మేమందరం తలల్ని కిందికి దింపాం, శ్రూమ్‌కి కనపడాలని కొంతా, ఎక్కువగా భయం వల్లా!

కొండమీదినించి కిందికి దొర్లుతున్నట్టుగా క్వాలిస్ కంపించటం మొదలుపెట్టింది. కానీ, మేమెవ్వరం పడిపోలేదు. నా దవడలు రెండూ విపరీతంగా ఒకదానితో ఒకటి కొట్టుకోసాగాయి. ఒకటి రెండు పళ్లు ఊడిపోతాయేమోనని భయం వేసింది నాకు.

ఆరు సెకన్లలో అంతా అయిపోయింది. మేం గోతిలోంచి బైటికొచ్చి, మళ్లీ బురదగా ఉన్న రోడ్డుమీదికి చేరుకున్నాం.

"సాధించాం! నేను బతికే ఉన్నట్టున్నాను," అన్నాడు శ్రూమ్ ఒత్తిడినించి తేరుకుని నవ్వుతూ. అతను చుట్టూ చూసి, "ఇంకెవరైనా బతికున్నారా?" అన్నాడు.



# # 31

అందరం ఒకేసారి ఊపిరి వదిలాం. అమ్మాయిలు ఒకర్నొకరు కావలించుకున్నారు. శ్రూమ్ చెయ్యి చాచి నా వీపుమీద ఎంత గట్టిగా కొట్టాడంటే, వెన్నెముక విరిగి, నేను చచ్చిపోతాననుకున్నాను.

శ్రూమ్ యూటర్న్ తీసుకుని, మొదటి గేర్‌లో, హైవే చేరుకునే దాకా, కారుని నెమ్మదిగా నడిపాడు.

"ఎలాగైతేనేం బైట పడ్డాం," అంది ఈషా కన్నీళ్లు తుడుచుకుంటూ. ప్రియాంక చేతులు జోడించి కొద్దిసేపు ప్రార్థించింది.

"మనం చచ్చిపోతామనుకున్నాను!" అంది రాధిక.

"అయినా, ఆ ఫోనేమిటి?" అంది ఈషా.

"అవును, చాలా విచిత్రంగా ఉంది, మనం దాన్ని గురించి మాట్లాడకూడదని ఒప్పందం చేసుకుందామా?" అన్నాను. అందరూ సరేనని తలాడించారు, సరిగ్గా వాళ్ల మనసులో ఉన్నదే నేను కూడా అన్నట్టు. నిజంగానే నాకు ఆ ఫోన్‌కాల్ మరీ వ్యక్తిగతమైనదని అనిపించింది. దాన్ని గురించి ఇంక నేను మాట్లాడదల్చుకోలేదు.

"అది ఏమైనా కానీ, మనమిప్పుడు బాగానే ఉన్నాం! ఇంకాస్సేపట్లో ఆఫీసులో ఉంటాం," అంది ప్రియాంక.

"ఇంకా 4:40 అయిందంతే. ఇంక రెండు కిలోమీటర్లే ఉంది," అన్నాడు శ్రూమ్. కొద్దిసేపటికే అతని ఆత్మవిశ్వాసం తిరిగి వచ్చింది. అతను కారుని గంటకి అరవై కిలోమీటర్ల వేగంతో నడపసాగాడు.

"నేను బతికుండటమే అదృష్టం అనుకుంటున్నాను. ఆఫీసుకి ఎప్పుడు చేరినా నాకేం పరవాలేదు," అంది ఈషా.

"నాకు త్వరగా వెళ్లి, ఎవరెవరికి ఉద్యోగాలు ఊడాయో తెలుసుకోవాలనుంది. ఏమయినా నేను మాత్రం ఉద్యోగం మానేస్తున్నాను," అన్నాడు శ్రూమ్.

"అవునా?" అంది ఈషా.

"అవును. ఇంత వరకూ భరించింది చాలు," అన్నాడు శ్రూమ్.

"మరేం చేస్తావు నువ్వు?" అని అడిగింది ప్రియాంక.

"ఇంకా ఫలానా ఉద్యోగంలో స్థిరపడాలని అనుకోలేదు – జర్నలిజం చేస్తానేమో మళ్ళీ కానీ ప్రస్తుతం, వెంటనే నేను చెయ్యదల్చుకున్న పని, కాల్‌సెంటర్‌ని కాపాడటం," అన్నాడు శ్రూమ్.

"ఏయ్, నీకు నాతో కలిసి వెబ్ డిజైనింగ్ కంపెనీ తెరవాలని ఉందా?" అన్నాను.

"నీతో కలిసా?" అన్నాడు శ్రూమ్ వెనక్కి తిరిగి చూస్తూ.

"నేను కూడా ఉద్యోగం వదిలేస్తున్నాను," అన్నాను.

"నిజంగానా?" అంది ప్రియాంక కళ్లు పెద్దవి చేస్తూ. ఏడేళ్ల పిల్లాడు ఎవరెస్టు ఎక్కుతున్నానని చెపితే ఎలా చూస్తారో, అలాంటి చూపుని నావైపు విసిరింది ప్రియాంక.

"అవును, ఆ గోతిలో నేను చావుకి బెత్తెడు దూరంలోకి వచ్చాను. నేనక్కడ చచ్చిపోయి ఉండచ్చు! జీవితంలో దేని కోసమూ ప్రయత్నించకుండానే నా జీవితం ముగిసిపోయేది. కష్టపడకుండా, హాయిగా బతకటం అంటే విసుగు పుట్టింది. బైటికెళ్లి ప్రపంచాన్ని ఎదుర్కోవాలి. అది ఎంత కష్టమైనా, ఎంత బాధాకరమైనా ఫరవాలేదు. నేను ముడుచుకుని నిద్రపోవటం కన్నా, ఎగురుతూ కింద పడటానికే ఇష్టపడతాను."

అందరూ అవునని తలాడించారు. నేను నిర్ఘాంతపోయాను; మొదటిసారిగా జనం నామాటలు వినిపించుకుంటున్నారు.

"ఇది కాక, నాకు నేనే ఒక వాగ్దానం చేసుకున్నాను," అన్నాను.

"ఏమిటది?" శ్రూమ్, ప్రియాంకా ఒకేసారి అన్నారు.

"ఒక బుద్ధిలేని గాడిద దగ్గర ఎక్కడా, ఎప్పుడూ పనిచెయ్యబోనని. తక్కువ జీతం దొరికినా సరే. రోజుకి ఒక పూట భోజనం మానేసి ఆకలితో పడుకుంటాను, కానీ, చచ్చే ఒక మూర్ఖుడి కింద జీవితాంతం పని చెయ్యలేను."

"ఫరవాలేదే! మన కాబోయే టీమ్ లీడర్‌కి తెలివితేటలు ఎక్కువవుతున్నట్టున్నాయే!" అన్నాడు శ్రూమ్.

"ఇది తెలివో కాదో నాకైతే తెలీదు, కానీ నేనొక నిర్ణయం మాత్రం తీసుకున్నాను. ఏం జరుగుతుందో చూద్దాం. ప్రస్తుతం నా ఎదురుగా ఒక తాత్కాలిక లక్ష్యం కూడా ఉంది."

"ఎలాంటి లక్ష్యం అది? కాల్ డాక్యుమెంటేషన్ లాంటిదేం కాదు కదా, కొంపదీసి?" అన్నాడు శ్రూమ్ పూర్తి ధ్యాస డ్రైవింగ్ మీదే ఉంచి.

"లేదు, నేను బక్షీ పని కూడా పట్టాలి. ఇక మనకి జరిగే నష్టమేదీ లేదు కాబట్టి అతనికో గుణపాఠం చెపుదాం!" అన్నాను.

శ్రూమ్ హఠాత్తుగా కారాపాడు. బ్రేకులు కీచుమని అరిచాయి. మేమందరం ముందుకి పడ్డాం.



"ఇప్పుడేమయింది?" అన్నాను.

"ఉండు. ఇప్పుడే నాకు 'యురేకా!' అని అరవాలనిపించింది. బక్షీని, కాల్‌సెంటర్‌నీ బాగుచేయ్యటానికి నాకొక ఉపాయం తట్టింది!" అన్నాడు శ్రూమ్.

"ఏమిటది?"

"ఆహా! ఎంత మంచి ఐడియా!" అని శ్రూమ్ తనలో తనే నవ్వుకున్నాడు.

"డామిట్! ఏమిటది?" అని అడిగాను.

అతను వెనక్కి తిరిగి నా చెవిలో ఏదో గుసగుసలాడాడు.

"వీల్లేదు, నా ఉద్దేశం అది, ఎలా వీలవుతుంది?"

"వీలవుతుంది! అది ఎలాగో మనం ఆఫీసుకి చేరుకున్నాక చెపుతాను. మనం డబ్ల్యు ఎస్ జి కాన్ఫరెన్స్ రూమ్‌లో కలుసుకుందాం," అని శ్రూమ్ ఆక్సిలరేటర్‌ని బలంగా తొక్కాడు. కాల్‌సెంటర్ చేరుకోవటానికి ఇది మా ఆఖరి విడత ప్రయాణం. కనెక్షన్స్ మెయిన్ గేట్‌లోకి ప్రవేశించాం. టైము 4:45 అయింది. మళ్లీ బక్షీ కారుని దాటుకుంటూ వెళ్లాం.

"దాన్ని ఒక్కసారి గట్టిగా ఢీకొడదాం. పెద్ద డెంట్ పడేట్టు ఢీ కొడదామా?" అన్నాను శ్రూమ్‌తో.

"ఆ ఆలోచన నాకు కూడా వచ్చింది," అన్నాడు శ్రూమ్. నిట్టూర్పు విడిచాడు. "కాని అన్ని ఆటోమొబైల్స్‌నీ నేను ఎంతగానో ప్రేమిస్తాను వాటికి హాని కలగజేయలేను. ల్యాన్సర్ కారు బక్షీ చేతిలో ఎలాగూ బాధపడుతునే ఉంది. నువ్వు బాధపడకు, వాడి సంగతి లోపల తేలుద్దాం."

క్వాలిస్‌ని శ్రూమ్ పార్కింగ్ జాగాలోకి తీసుకెళ్లాడు. మా డ్రైవర్ యింకో కార్లో నిద్రపోతున్నాడు. అందుకే వాడి పక్కనే మేము నెమ్మదిగా క్వాలిస్‌ను పార్కు చేసాం. పట్టికొట్టుకున్న తన కారుని వాడు చూసేలోగా, మరికొన్ని గంటలు వాడు నిద్రపోవాలని మేము కోరుకున్నాం.

"అందరూ పదండి, 4:46," అని శ్రూమ్ అంటూ కారులోంచి బయటకి గెంతాడు. మా మా డెస్క్ ముందు, నా మానిటర్‌కి అతికించి ఉన్న A-4 సైజు కాగితం, దానిమీద గొలుసుకట్టుగా రాసున్న పెద్ద పెద్ద అక్షరాలూ కనిపించాయి.

"దీన్ని ఒకసారి చూడు," అన్నాను. అది బక్షీరాతే.

**అందరూ ఎక్కడున్నారు? వీలైనంత త్వరగా ఫోను చేయండి లేదా నా ఆఫీసుకి రండి. నా బోర్డు మీటింగు ఎజెండా కాపీలు ఎక్కడ? జెరాక్స్ మిషన్‌కు ఏమైంది? ఏజెంట్ విక్టర్ మానిటర్‌కు?**

శ్రూమ్ ఆ నోటీస్‌కేసి చూశాడు, నవ్వాడు. "సర్లే, వాడికి జవాబులు దొరుకుతాయి.

కాని, ముందు వాడు మనకి సమాధానం యివ్వాలి. ఫ్రెండ్స్, కాన్ఫరెన్స్ రూంకి పదండి," అన్నాడు ఫ్రూమ్.

మేం కాన్ఫరెన్స్ రూంలోకి వెళ్లాక, ఫ్రూమ్ తలుపుకి గడియవేశాడు.

"చూడండి, నేను ఎంబీఏ వాళ్లలా మట్లాడినట్టనిపిస్తే సారీ, కాని నేను అనుకుంటున్నది ఏమిటంటే, రాబోయే కొన్ని గంటల్లో మన ముందు ఉందేది ఒక మూడు పాయింట్ల ఎజెండా. మొదటిది, మన కాల్‌సెంటర్‌ను కాపాడుకోవటం. రెండోది, బక్షీకి గుణపాఠం నేర్పటం – ఒప్పుకున్నట్టే కదా?"

"మూడో పాయింట్ ఏమిటి?" రాధిక అడిగింది.

"అది నాకు శ్యామ్‌కి మధ్యన ఉన్నది. వ్యక్తిగతమైంది. ఓకే, వినండి...'

అప్పుడు ఫ్రూమ్ తన ప్లానేమిటో వివరించాడు : అ) కాల్‌సెంటర్‌ను కాపాడటం, ఆ) బక్షీని ఆటపట్టించటం, మొదటిసారి అది విన్నప్పుడు మేమందరం మా సీట్లలోంచి ఎగిరి గంతేశాం. నెమ్మదిగా ఫ్రూమ్ మాకు నమ్మకం కలిగించాడు. తీవ్ర ఏకాగ్రత, నవ్వులా మధ్య, మాలో ప్రతీ ఒక్కరమూ కల్పించుకుని ఆ ప్లాన్ యింకా బాగా తయారు చేశాం. మా మీటింగును 5:10 కల్లా ముగించి డబ్ల్యూఏఎస్‌జీ కాన్ఫరెన్స్ రూం నుంచి బయటపడ్డాం.

"అంతా సిద్ధమేనా?" ఫ్రూమ్ అన్నాడు.

"వేరే చెప్పాలా," ఏకకంఠంతో అరిచాం అదరమూ.

"గుడ్. ఒకటవచర్య: బక్షీ ఆఫీసు బయటకి వచ్చేలా చేయాలి," ఫ్రూమ్ అన్నాడు. "ఈషా, నువ్వు రెడీయేనా?"

"ఆఁ" అని అంటూ ఈషా మాకేసి కన్ను కొట్టింది.

ఫోను తన చేతిలోకి తీసుకుని బక్షీ నంబరును డయల్ చేసింది. తన గొంతును ఒక ముసలామె గొంతులా మార్చింది.

"సర్, మెయిన్ బేనుంచి ఎలీనాను మాట్లాడతున్నాను. సర్, మీకో కాల్, బోస్టన్ నుంచి అని అనుకుంటా," అని ఈషా అంది, డ్యూటీ మీదున్న ఒక సెక్రటరీ చెప్పే గొంతుతో.

"అలా వీలవదు, సర్, నేను ఆ కాల్‌ని ట్రాన్స్‌ఫర్ చేయలేను... సర్, అలా చేయాలని ప్రయత్నించాను, కాని లైను దొరకటంలేదు... సర్, ఇక్కడ కొత్తగా చేరిన ఒక అసిస్టెంట్‌ని నేను, అందుకే ఈ ఫోన్లు ఎలా పనిచేస్తాయో తెలీటంలేదు... సర్, నన్ను మీరు క్షమించాలి, దయచేసి మీరే యిక్కడకి వస్తారా, సర్.... యస్ సర్" అని ఈషా అన్నాక ఫోను పెట్టేసింది.

"పనయిందా?" అడిగాను నేను.

"బోస్టన్ గురించి ఏదన్న అంటే చాలు బోర్లాపడతాడు, వెంటనే నమ్మేస్తాడు. వెంటనే బయల్దేరుతున్నాడు. కాని కొన్ని నిమిషాలపాటే వాడు బయట ఉంటాడు. అందుకే మనం తొందరపడాలి, పదండి"



# # 32

మేము ఆశించినట్లే, అక్కడకి మేము చేరుకునేసరికి బక్షీ ఆఫీసు ఖాళీగా ఉంది.

ఫ్రూమ్ తిన్నగా బక్షీ కంప్యూటర్ దగ్గరకు వెళ్లి, అతడి ఈ-మెయిల్ తెరిచాడు.

రాధికా, ప్రియాంకా నాతో పాటు బక్షీ కాన్ఫరెన్స్ టేబుల్ ముందు కూర్చున్నారు.

"త్వరగా," ఒక కన్ను తలుపు వేపు ఉంచి రాధిక అంది.

"ఒక్క క్షణం." అన్నాడు ఫ్రూమ్, బక్షీ కీబోర్డు మీద వేగంగా టైపు చేస్తూ.

మేము చేస్తున్నది తప్పు అని నాకు తెలుసు, కాని ఈషా అన్నట్లు మేము చేస్తున్న ఈ తప్పు ఎందుకోగాని 'వాస్తవమైన, భరింపరాని, బాధాకరమైన అపరాధం' అని అనిపించటంలేదు. నిజానికి, అది ఎంతో బావున్నట్టనిపించింది. తన పని పూర్తిచేశాక, ఫ్రూమ్ బక్షీ ప్రింటరుమీద ఐన్నో కాపీలు ప్రింటు చేశాడు.

"ఐదు కాపీలు, అందరికీ తలొకటి మడతపెట్టి, దాన్ని జాగ్రత్తగా ఉంచండి," అన్నాడతను.

నేను నా కాపీని మడతపెట్టి, దాన్ని నా షర్ట్ జేబులో పెట్టాను.

బక్షీ యిరవైసెకన్ల తర్వాత వచ్చాడు.

"పనికిరాని టెలిఫోన్ సిస్టంలు మాదగ్గర ఇంకా ఉన్నాయంటే నమ్మలేకపోతున్నాను," ఆఫీసులోకి వస్తూ బక్షీ తనలో తాను గొణుక్కుంటున్నాడు. కాన్ఫరెన్స్ టేబుల్ ముందు కూర్చున్న మమ్మల్నందరినీ గమనించాడు.

"ఓ, మీరా. మీరంతా ఎక్కడికి పోయారు? జెరాక్స్ మిషన్‌కేమయింది? ఏజెంట్ విక్టర్ మానిటర్‌కేమయింది?" బక్షీ అడిగాడు. తన రెండు చేతులూ పొట్ట ముందు కట్టుకుని ఒక్కొక్కరుగా మా అందరి వేపూ చూశాడు.

"ఒక్క క్షణం కూర్చుంటావా, బక్షీ?" తన పక్కనున్న కూర్చీని చేత్తో తడుతూ అన్నాడు ఫ్రూమ్.

"ఏమిటీ?" తనని ఫ్రూమ్ పేరు పెట్టి పిలవటంతో బక్షీ కంగుతిన్నాడు. "నీకన్నా సీనియర్స్‌ని ఎలా పిలవాలో నువ్వు నేర్చుకో...."

"అదలా ఉంచు బక్షీ" అన్నాడు ఫ్రూమ్ తన పాదాలని బక్షీ మీటింగ్ టేబుల్ మీదుంచి.

"ఏజెంట్ విక్టర్, ఏమంటున్నావ్? నువ్వేం చేస్తున్నావో నీకేమన్నా తెలుస్తోందా?" అన్నాడు బక్షీ యింకా నిలబడే.

"ఓహ్," అన్నాడు ఫ్రూమ్. "ఇది ఎంతో సౌకర్యంగా ఉంది. ఇలా అందరూ ఎందుకు కూర్చోరో?" ఫ్రూమ్ తన కాళ్లని టేబుల్ మీద ఒకదాని మీద ఒకటి వేశాడు.

"ఉన్న సిబ్బందిని తగ్గించమని నేను సలహా యిద్దామనుకుంటున్న ఈ సమయంలో, నువ్విలా అనుచితంగా ప్రవర్తిస్తున్నావంటే నాకు నమ్మబుద్ధి కావటంలేదు...." అని బక్షీ అంటుంటే ఫ్రూమ్ అతనికి మళ్లీ అడ్డొచ్చాడు.

"నువ్వో పరమ మూర్ఖుడివి బక్షీ..." ఫ్రూమ్ మధ్యలో అన్నాడు.

"ఎక్స్యూజ్‌మీ? ఇప్పుడు ఏమన్నావ్, ఏజెంట్ విక్టర్?"

"అయితే నువ్వొట్టి మూగవాడివే కాదు, చెవిటివాడివి కూడాను. అతనన్నది నీకు వినిపించలేదా?" అంది ఈషా అతికష్టం మీద నవ్వు ఆపుకుంటూ.

"ఏం జరుగుతోంది యిక్కడ?" అన్నాడు బక్షీ, నేనొక నాన్సెన్స్‌ను విడమరచి చెప్పే విఖ్యాత విశ్లేషకుడినైనట్టు, నావేపు శూన్యంగా చూస్తూ.

ఫ్రూమ్ ఒక ప్రింట్‌ఔట్‌ను బక్షీ ముందుకి తోసాడు.

"ఏమిటిది?" అడిగాడు బక్షీ.

"చదువు. నీ ఎమ్‌బీఏ కోర్సులో ఎలా చదవాలో నీకు నేర్పించే ఉంటారు, ఔనా?" అన్నాడు ఫ్రూమ్.

ఆ ఈ-మెయిల్‌లో యిలా ఉంది :

*సుభాష్ బక్షీ నుంచి :*

*ఈషాసింగ్‌కు*

*పంపిన సమయం : 05:04 a.m.*

*విషయం : ఒక రాత్రి మాత్రమే*

*ప్రియమైన ఈషా*

*నువ్వు కంగారు పడకు. నాది సీదా సాదా ఆఫర్. కేవలం ఒక రాత్రి నాతో గడుపు. నాకు ఆనందాన్నివ్వు – నీ ఉద్యోగం పోకుండా నేను కాపాడుతాను. నేను నీ ఉద్యోగాన్ని రక్షించడానికి బదులుగా, నువ్వు నన్ను సుఖపెట్టు – ఇది ఫెయిర్‌డీల్ అని అనుకుంటా. ఏమో ఎవరికి తెలుసు, అది నీకు కూడా ఆనందాన్ని కలగజేయవచ్చు. నీ నిర్ణయం నాకు త్వరలోనే తెలియజేయ్.*

*నిన్ను ఆరాధించే,*

*బక్షీ.*

బక్షీ మొహం తెల్లగా పాలిపోయింది. అతను ఆ ఈ-మెయిల్‌ను ఎన్నోసార్లు మళ్లీ మళ్లీ చదువుతూన్నప్పుడు, నోరు ఐదు అంగుళాలు తెరుచుకుని ఉంది.

"ఏమిటది? ఏమిటీ చెత్తంతా?" బక్షీ కీచుమన్నాడు, అతని చేతులు గొంతు వణికినంతగానూ వణికాయి. అతని నోరు యింకా తెరుచుకునే ఉంది, బేటరీ మీద నడుస్తున్నదానిలా అది కంపించసాగింది.

"అది నువ్వు చెప్పాలి. ఆ మెయిల్ నీ ఇన్-బాక్సులోంచి వచ్చిందిరా,•శుంఠా," ఫ్రూమ్ అన్నాడు.

"కాని నేను దాన్ని ఎప్పుడూ రాయలేదు," అన్నాడు బక్షీ, గొంతులో ధ్వనిస్తూన్న నిరాశని కప్పిపుచ్చలేకపోతూ. "నేను దాన్ని రాయనేలేదు."

"నిజంగా?" అన్నాడు ఫ్రూమ్ సిగరెట్టు వెలిగించుకుంటూ. "మరి యిప్పుడూ దాన్ని నువ్వు రాయలేదని, నువ్వు ఎలా నిరూపించగలవు? దాన్ని నువ్వు రాయలేదని నీ బోస్టన్ ఆఫీసులోని జనానికి నిరూపించగలవా?"

"నువ్వేం మాట్లాడుతున్నావ్? దీనికీ బోస్టన్ ఆఫీసుకీ సంబంధం ఏమిటీ?" నూనె జిడ్డు ఓడుతున్న మొహం మీద, చెమట బిందువులు మొలకెత్తుతుండగా, బక్షీ అన్నాడు.

"సరే, చూద్దాం. ఈ మెయిల్ కాపీని మేం బోస్టన్‌కు పంపితే ఏమవుతుంది? అదే, నువ్వు వెబ్‌సైట్ మాన్యువల్ కాపీలు పంపిన వాళ్లందరికీనూ! వాళ్లు 'ఫెయిర్ డీల్స్' చేసే తమ సిబ్బందిని ప్రేమిస్తారని నాకు క్షుణ్ణంగా తెలుసు," అన్నాను.

"నేను దాన్ని రాయలేదు," అన్నాడు బక్షీ, అంతకన్నా మంచి మాటలు తట్టక.

"లేకపోతే, మేము పోలీసులకే ఆ కాపీ పంపగలం," బక్షీ మొహం మీదకి సిగరెట్టు పొగ వదులుతూ అన్నాడు ఫ్రూమ్. "ఇంకా నా రిపోర్టర్ ఫ్రెండ్స్‌కు కూడా. రేపు పేపర్లలో నీ పేరు కనిపించాలని ఉందా, బక్షీ? ఇదో అవకాశం నీకు.." ఫ్రూమ్ ఫోన్ అందుకున్నాడు. "అన్నట్టు, ఒక్కక్షణం... బహుశా టీ.వీ.లో కూడా నువ్వు కనపడేటట్లు చేయగలనేమో!"

"టీవీ?" అని అన్నాడు బక్షీ.

"ఔను, హెడ్‌లైన్స్‌ని ఊహించుకో : 'కాల్‌సెంటర్ బాస్ ఉద్యోగాలకోసం అమ్మాయిలను తనతో గడపమని అడుగుతూంటాడు.' NDTV దాని మీద ఓ వారం బతకగలదు. డేమిట్, నేనో మంచి జర్నలిస్టునని నాకు తెలుసు," అని అంటూ ఫ్రూమ్ నవ్వసాగాడు.

"కాని నేనేం చేశాను?" అంటూ బక్షీ తన డెస్క్ వేపు పరిగెత్తాడు. తన ఈ-మెయిల్ తెరిచి, 'సెంట్ ఐటమ్స్' ఫోల్డర్ చెక్ చేశారు.

"ఎవరు రాశారు దీన్ని?" తన స్క్రీన్ మీదనున్న అదే మెయిల్‌ను చూస్తూ బక్షీ అడిగాడు.

"మీరు రాయలేదా?" నిజంగా కలవరపడుతున్నట్టు ప్రియాంక అంది.

"మిస్టర్ బక్షీ, మిమ్మల్నెంతో గౌరవించాను. ఇవాళ నా రోల్-మోడల్ మీద నేనుంచిన విశ్వాసం తునాతునకలైంది," అని అంటూ ఈషా తన రెండు చేతులతో మొహాన్ని కప్పుకుంది. ఆమె చాలా బాగా నటించింది. ఆమె ఏక్టింగ్ కెరీర్‌కు ప్రయత్నిస్తే బావుంటుందని నాకు అనిపించింది.

"నో, నేనది రాయలేదు, ఒట్టు," మౌస్‌తోనూ, కీబోర్డుతోనూ ఒక పక్క పెనుగులాడుతూ, అన్నాడు బక్షీ.

"అయితే ఎవరు రాశారు దాన్ని? శాంతాక్లాజా? ఎవరైనా దేవతలా?" అని అరుస్తూ, ఫ్రూమ్ లేచి నిలబడ్డాడు. "పోలీసులకు, జర్నలిస్టులకు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బోస్టన్ ఎగ్జిక్యూటివ్స్‌కు నువ్వే వివరించు."

"హా! ఇటు చూడండి, నేను చెరిపేశాను దీన్ని," కంప్యూటర్ మౌస్‌పై నుంచి చెయ్యి తీసేస్తూ, తెలివిగా నవ్వుతూ అన్నాడు బక్షీ.

"కమాన్ బక్షీ," ఫ్రూమ్ నిట్టూరుస్తూ అన్నాడు, "అదింకా నీ 'డెలిటెడ్ ఐటమ్స్ ఫోల్డర్' లోనే ఉంది."

"ఓహ్!" అని అంటూ బక్షీ, మౌస్‌ని కదిపాడు. కొన్ని క్లిక్‌లు చేశాక "అదుగో, అది ఎగిరిపోయింది. ఈ-మెయిల్ అంటూ లేదు," అన్నాడు బక్షీ.

ఫ్రూమ్ చిరునవ్వు నవ్వాడు. "నీకోసం మరో టిప్, బక్షీ! డెలిటెడ్ ఐటమ్స్‌కు వెళ్లు, టూల్స్ మెనూని సెలెక్టు చేశాక, 'రికవర్ డెలిటెడ్ ఐటమ్స్' ఆప్షన్‌ని ఎంచుకో. ఆ మెయిల్ అక్కడే ఉంటుంది," అన్నాడు ఫ్రూమ్.

ఫ్రూమ్ యిచ్చిన క్లిష్టమైన సూచనలను పాటించడానికి ప్రయత్నిస్తుండగా బక్షీ మొహం భయంతో నిండుతుంది. నిరాశగా తన మౌస్‌ని క్లిక్ చేశాడతను.

"ఓహ్, బక్షీ, దాన్ని ఆపేయ్. ఆ మెయిల్ నా ఇన్‌బాక్స్‌లో కూడా ఉంది. అదీగాక ఫ్రూమ్ దానికి చాలా కాపీలు తీశాడు," అంది ఈషా.

"హు?" అని బక్షీ అంటుంటే, అతనో భయపడ్డ కుందేలులా కనపడ్డాడు. "మిమ్మల్ని ఊరికే వదులుతాననుకోకండి!" ఈషా, నీకు తెలుసు నేనీపని చేయలేదని. నువ్వు బిగుతుగా ఉండే స్కర్ట్‌లూ, టాప్స్ వేసుకుంటావ్, కాని నేను వాటిని దూరంనుంచే చూస్తుంటాను. చివరకి నీ నడుము చూపించే జీన్స్‌ని కూడా నేను కేవలం చూసింది...."

"ఆగు అక్కడే, యూ స్టుపిడ్," ఈషా అరిచింది.

"మీరు నన్నేం చేయలేరు," బక్షీ అన్నాడు.

"మాకు ఐదుగురు సాక్షులున్నారు బక్షీ, ఈషా చెప్పిందాన్ని వాళ్లు సమర్థిస్తారు," అన్నాను నేను.

"ఓహ్, మా దగ్గర వేరే యింకో సాక్ష్యం కూడా ఉంది. ఈషా డ్రాయర్లో డబ్బు ప్యాకెట్ ఉంది, దాని మీదంతా నీ వేలిముద్రలే ఉన్నాయి, నువ్వు అంత దిగజారవనే అనుకుంటున్నాం," అన్నాడు ఫ్రూమ్.

బక్షీ వేళ్లు తబలా వాయించడానికి అతను ఏదో సిద్ధపడుతున్నట్లు వణకసాగాయి.

"మా దగ్గర నువ్వు వెళ్లే బూతు వెబ్‌సైట్ల ప్రింట్‌ఔట్ కూడా ఉంది," అంది రాధిక.

"నేను కాదని నీకు తెలుసు, ఈషా, నా నిర్దోషిత్వం ఎలాగోలాగ నిరూపించగలను," తన గొంతు ఒక అసహాయుడైన ముష్టివాడి గొంతుకలా వణుకుతుండగా బక్షీ అన్నాడు. అతని కళ్లంట నీళ్లొచ్చేట్టున్నాయి.

"అయుండచ్చు. కాని నీ కెరీర్‌ను నాశనం చేయటానికి ఆ అద్భుతమైన పబ్లిసిటీ చాలు. గుడ్‌బై బోస్టన్," వీడ్కోలు చెప్తున్నట్టు చెయ్యి ఊపుతూ అన్నాను నేను. మిగిలిన ప్రతి ఒక్కరూ గుడ్‌బై చెప్తున్నట్టు చెయ్యెత్తి ఊపారు.

బక్షీ భయంగా మావేపు చూసి కూలబడ్డాడు. అతని పాలిపోయిన మొహం ఎరుపు రంగులోకి మారింది, కాదు, కొంచెం ఊదారంగులోకి- అయితే అదింకా జిడ్డోడుతూనే ఉంది. అతని నుదుటి వేపు కణత అదరటం నాకు కనిపిస్తూనే ఉంది. అతడిని యింకా బాధపెట్టాలని అనిపించింది. అతని బుక్‌షెల్ఫ్‌నుంచి లావుపాటి మేనేజ్‌మెంట్ పుస్తకాన్ని తీసాను.

నేను బక్షీ వేపుకెళ్లి, అతని పక్కన నిలబడ్డాను.

"మీరు నాపట్ల ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు? మిమ్మల్ని అందరినీ వదిలి బోస్టన్ ఎలాగూ వెళ్లిపోతున్నాను కదా!," అన్నాడు బక్షీ.

"బోస్టన్?" అన్నాను నేను. "భటిండాలో పని చేసే అర్హత కూడా నీకు లేదు. నీకసలు ఉద్యోగార్హతే లేదు. నిజానికి, ఎవరైనా నీకు జీవించే హక్కు కూడా లేదని వాదించచ్చు. నువ్వు కేవలం ఒక దుర్మార్గుడైన బాస్‌వే కాదు, మాకు, ఈ కంపెనీకి, ఈ దేశానికి నువ్వొక చీడపురుగువి. నిన్ను తగలెట్ట!"

నేను ఆ మేనేజ్‌మెంట్ పుస్తకంతో అతని తలపై గట్టిగా మోదాను. బక్షీ బుర్ర ఖాళీ, అందుకే ఆ దెబ్బకి పెద్ద శబ్దం వచ్చింది. అబ్బ! నాకెంతో హాయిగా ఉన్నట్లు అనిపించింది. ఈ ప్రపంచంలో అతితక్కువ మందికి వాళ్ల బాస్‌ని కొట్టే అవకాశం లభిస్తుంది, కాని అలా చేసినవాళ్లు అది సెక్స్‌లో పాల్గొనడం కన్నా బావుంటుందని మీతో అంటారు.

"మీకేం కావాలి? మీకు కావలసిందేమిటి? నన్ను నాశనం చేయదలుచుకున్నారా?" తలరుద్దుకుంటూ బక్షీ అన్నాడు. "నాకో కుటుంబం ఉంది. ఇద్దరు పిల్లలున్నారు. అతికష్టం మీద నా కెరీర్ చక్కగా నడుస్తోంది. మా ఆవిడ నన్నెలాగూ వదిలేయాలని అనుకుంటోంది. నన్ను నాశనం చేయకండి, నేను కూడా మనిషినే".

బక్షీ అన్న ఆఖరి వాక్యాన్ని నేను అంగీకరించను. అతను పూర్తిగా మనిషే అని నేననుకోవటం లేదు.

"నిన్ను నాశనం చెయ్యడం ఒక మంచి, సరదా పని," ప్రూమ్ అన్నాడు. "కాని అంతకన్నా మంచి లక్ష్యాలు మాకున్నాయి యిప్పుడు. నీతో ఒక బేరం చేయాలని ఉంది నాకు. మేము ఈ విషయానికి స్వస్తి పలుకుతాం, దానికి బదులుగా మాకోసం నువ్వు కొన్ని పనులు చెయ్యాలి.

"ఎలాంటి పనులు?" బక్షీ అడిగాడు.

"మొదటిది. రాబోయే రెండుగంటలు కాల్‌సెంటర్‌ను నా ఆధీనంలో ఉంచుకోవాలను కుంటున్నాను. అందరినీ ఎడ్రసు చేసే స్పీకర్‌లో మాట్లాడదామనుకుంటున్నాను."

"అదే అగ్నిప్రమాదం సంభవించే సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రకటించటానికి మేనేజ్‌మెంట్ వాడేది...." అన్నాను నేను.

"ఫయిర్ డ్రిల్ స్పీకర్ ప్రతీ ఒక్కరితో మాట్లాడటానికి వాడేది, అది మీకెందుకు? నా ఈ-మెయిల్ విషయం దానిలో మీరు మాట్లాడతారా?" అన్నాడు బక్షీ.

"అందుకు కాదు, శుంఠా! కాల్‌సెంటర్‌లో ఉద్యోగాలని రక్షించేందుకు. ఇప్పుడు, నాకు స్పీకర్ దొరుకుతుందా?"

"అలాగే. ఇంకా ఏం కావాలి?"

"శ్యామ్ కోసం, నా కోసం మా రాజీనామా పత్రాలు నువ్వు రాసి పెట్టాలి. ఉద్యోగాలున్నా, లేకపోయినా, మేము కనెక్షన్స్‌ని వదిలేస్తున్నాం."

"మీరిద్దరూ యిప్పుడే వదిలిపెట్టిపోతున్నారా?" అన్నారు అమ్మాయిలు.

"ఔను. నేను, శ్యామ్ ఒక చిన్న వెబ్‌సైట్ డిజైన్ బిజినెస్ ప్రారంభించబోతున్నాం. అవును కదూ, శ్యామ్?" ప్రూమ్ అన్నాడు.

"ఔను," అన్నాను నేను. 'వావ్!' అని నేను మనసులో అనుకున్నాను.

"గుడ్. ఇకనుంచీ, మా వెబ్‌సైట్లకు క్రెడిట్ యింకే మూర్ఖుడూ కొట్టేయడు," అని అంటూ ప్రూమ్ బక్షీ మొహం మీద కొట్టాడు. ఆ దెబ్బకి బక్షీ ముఖం 60 డిగ్రీల వరకు తిరిగిపోయింది. తన చెంపలని పట్టుకున్నాడు, కాని మౌనంగా ఉండిపోయాడు, అతని నోటినుంచి వినీ వినిపించకుండా ఏడుపులేని వెక్కిళ్లు మాత్రం వచ్చాయి.

అతని మొహంలోని భావాలలో 90 శాతం బాధ, పది శాతం అవమానం కనిపించాయి.

"మరినేనో?" అన్నాను నేను.

"ఊc! కానీ! నీ సరదా కూడా తీరుస్తాను!" అన్నాడు ప్రూమ్.

చెంపదెబ్బ! బక్షీ ముహంమీద నేనో దెబ్బ వేశాను. ఆ మొహం అరవై డిగ్రీలు మరో వైపుకి తిరిగింది. నా కెరీర్‌లో అత్యంత వినోదభరితమైన క్షణం అది. ఆ జిడ్డోడుతున్న మొహం వేడెక్కింది.

"అయితే, నువ్వు రాజీనామా ఉత్తరం యిస్తున్నావు, అవునా?" ప్రూమ్ అడిగాడు.



"ఓకే," అన్నాడు బక్షీ తన చెంప రుద్దుకుంటూ. "మరి ఈషా ఆ ఈ-మెయిల్‌ను తీసేస్తుంది కదా?"

"ఆగు. మా పనింకా పూర్తవలేదు. మేం చేయబోయే బిజినెస్ ప్రారంభించటానికి పెట్టుబడి అవసరమౌతుంది. కనుక, కంపెనీ నుంచి మమ్మల్ని పంపిచేస్తున్నందుకుగాను, మాకు ఆరు నెలల జీతం 'సెవరెన్స్ ప్యాకేజీ' కింద కావాలి. అర్థమయిందా?" అన్నాడు ప్రూమ్.

"నేను ఆరునెలలది యివ్వలేను. ఏజెంట్ల విషయంలో యింతవరకు అలా జరగలేదు," అన్నాడు బక్షీ.

"సరే, ఎన్‌డీటీవీయా, లేక టైమ్స్ ఆఫ్ ఇండియా, నీకు ఏదికావాలో నువ్వే తేల్చు," ఫోన్ చేతిలోకి తీసుకుంటూ అన్నాడు ప్రూమ్.

"ఆరు నెలలు వీలుపడుతుంది. మంచి మేనేజర్లు పాత రివాజులను పక్కకి పెడుతుంటారు," అన్నాడు బక్షీ. అతని చెంపమీద ఎన్ని దెబ్బలు కొట్టినా, అతడు మాట్లాడే పద్ధతిని మార్చలేం అని నాకు అనిపించింది.

"బావుంది. ఆఖరి విషయం, నీ రైట్‌సైజింగ్ ప్రపోజల్‌ను నువ్వు వెనక్కి తీసుకోవాలి. బోస్టన్‌తో మాట్లాడే ఏర్పాటు చెయ్యి. కొనుగోళ్ల ద్వారా కనెక్షన్స్‌ని మళ్లీ బతికించుకోవటానికి ఒక ప్రణాళికను తయారుచేసే వరకూ ఉద్యోగులని పనిలోంచి తీసివేయటం ప్రస్తుతానికి ఆపమను.

"నేనది చెయ్యలేను," అన్నాడు బక్షీ.

ప్రూమ్ తన మొబైల్ ఫోను తీసి దానిని బక్షీ మొహం ముందు ఉంచాడు.

"రేపటికల్లా నీ గురించి ఇండియా అంతా తెలుసుకునేలా చేస్తాను," అన్నాడు ప్రూమ్ "విను, ఇడియట్! ఈ ఉద్యోగం అంటే నాకు లెక్కలేదు, కాని, పిల్లలు, కుటుంబాలు, జీవితంలో బాధ్యతలు ఉన్న ఏజెంట్లు ఉన్నారు. వాళ్లంతా మనుషులు, మానవవనరులు కాదు. ఇప్పుడు చెప్పు, ఏ న్యూస్ ఛానెల్ అంటే నువ్వు యిష్టపడతావ్?" అన్నాడు మళ్లీ.

"నాకో అరగంట టైమివ్వండి. బోస్టన్‌కు కాల్ చేస్తాను, అన్నాడు బక్షీ.

"గుడ్. ఆ ఈ-మెయిల్‌ని మేము పాతిపెట్టేస్తాం. కాని నువ్వీ కాల్‌సెంటర్‌ను, ఈ నగరాన్ని యింకా ఈ దేశాన్ని ఎంత వేగంగా వీలైతే అంత వేగంగా వదిలేసి వెళ్లాలి. మాకో కొత్త బాస్ కావాలి. పైపై మెరుగులున్న డిగ్రీలని సంపాదించుకున్న జలగలాంటి రక్తం పీల్చే బాస్ కాకుండా, మామూలుగా ఉండి, మమ్మల్ని ప్రేరేపించగల, సభ్యతగల బాస్ కావాలి మాకు.

బక్షీ తలూపాడు, అదే పనిగా మొహానికి పట్టిన చెమటని తుడుచుకుంటూ.

"గుడ్. ఇంకేమన్నా ఉందా? నా మానిటర్ గురించి నీకు కొన్ని ప్రశ్నలున్నట్టున్నాయి?" అన్నాడు ప్రూమ్.

"మానిటరా? ఏ మానిటర్?" అన్నాడు బక్షీ.

# # 33

బక్షీ స్పీకర్ గది తాళంచెవిని ప్రూమ్‌కి ఇచ్చాడు. వెంటనే మేనేజ్‌మెంటు మీటింగులని ఏర్పాటుచేయమని అడగటం కోసం బక్షీ బోస్టన్‌కు ఫోను చేశాడు. అతను అంత సమర్థంగా పనిచేయటాన్ని అంతకుముందు నేను చూడనేలేదు.

బ్రాడ్‌కాస్ట్ చేసే గదిలోకి వెళ్లి, ప్రూమ్ మైకులకున్న స్విచ్‌లను ఆన్ చేశాడు. అవి సరిగ్గా వినిపిస్తున్నాయా లేదా అని చూడటంకోసం, నేను మెయిన్ కంప్యూటర్ల బేలోకి వెళ్లాను.

"హలో, మీకందరికీ ఒక ముఖ్యమైన విషయం చెప్పాలనుకుంటున్నాను. స్ట్రేటజిక్ గ్రూప్‌నించి ప్రూమ్‌ని మాట్లాడుతున్నాను."

ప్రూమ్ గొంతు కనెక్షన్స్ లోపల ప్రతిధ్వనించింది. కష్టమర్లతో ఒకపక్క మాట్లాడుతూనే, ప్రతీ ఒక్క ఏజెంట్ స్పీకర్లవేపు చూడసాగాడు.

"మిమ్మల్ని విసిగిస్తున్నందుకు నా క్షమాపణలు, కాని మనం ఒక అత్యవసర పరిస్థితిలో ఉన్నాం, అది లే ఆఫ్స్ గురించి - అందరినీ ఉద్యోగాలలోంచి తొలగించే పరిస్థితి, మీ కాల్స్‌ని అన్నిటినీ దయచేసి ఆపేస్తారా?" స్పీకర్‌లో వినిపించింది.

ప్రతీ ఒక్కరూ 'లే ఆఫ్స్' అన్న మాట విన్నారు, ఒకేసారి కొన్నివేల కాల్స్ ఆపివేయబడ్డాయి. ప్రూమ్ తన మాటలు కొనసాగించాడు.

"ఈ ఆఫీసుని ఇన్నాళ్లూ మూర్ఖులు మేనేజ్ చేస్తూ వచ్చారు. దానివల్ల ఈ రోజు రాత్రి మనందరికీ నష్టం వాటిల్లబోతోంది. వాళ్లు చేసిన తప్పుల ఫలితంగా మీలో మూడొంతుల మంది ఉద్యోగాలు పోగొట్టుకోబోతున్నారు. ఇది నాకు న్యాయం అనిపించటం లేదు. మీకు న్యాయం అనిపిస్తోందా?"

ఎటువంటి జవాబూ రాలేదు.

"కమాన్! మీ జవాబు వినాలనుంది. మీ ఉద్యోగాలనీ, ఈ కాల్‌సెంటర్నీ కాపాడటానికి మీరు నాతో సహకరిస్తారా?"

ఏజెంట్లందరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు, వాళ్లకింకా పూర్తి నమ్మకం కలగలేదు. వాళ్లలో చాలామంది నీరసంగా "యెస్!" అన్నారు.

"ఇంకా గట్టిగా చెప్పండర్రా! అందరూ కలిసి చెప్పండి. మీరందరూ నాతో సహకరిస్తారా?" అన్నాడు ప్రూమ్.



"యెస్!" అందరి గొంతులూ కలవగా వచ్చిన ఆ మాటకి కనెక్షన్స్ భవనం అదిరింది!

నేను మెయిన్ బేలో ఒక మూలగా ఉన్న హాల్లో నిలబడ్డాను. ప్రతి ఏజెంటు కళ్లూ ఫయిర్ డ్రిల్ స్పీకర్‌కి అతుక్కుపోయాయి. ప్రూమ్ ఈసారి మరింత గట్టిగా స్పష్టంగా చెప్పసాగాడు.

"థాంక్యూ, మై ఫ్రెండ్స్! నాకు కోపంగా ఉంది. ఎందుకంటే, ఈ లోకంలో ఎంతో తెలివీ, బలం ఉన్నవాళ్లు చాలామంది ఉన్నారు, వాళ్లల్లో కొంతమంది నా దేశంలో కూడా ఉన్నారని నేను రోజూ గమనిస్తున్నాను. ఇంత శక్తి తెలివీ ఉండి కూడా, అదంతా వ్యర్థమవుతోంది. ఒక తరం వాళ్లంతా రాత్రంతా మేలుకుని, తెల్ల మొద్దులు తమ జీవితాలని ముందుకి తీసుకుపోవటానికి, వారికి చంకకర్రలుగా ఉపయోగపడుతున్నారు. ఆ తరవాత పెద్దపెద్ద కంపెనీలు మన దగ్గరకొచ్చి, మనకి అక్కర్లేని చెత్తనంతా వెలకట్టమని, ప్రకటనలతో మనని ఒప్పించాలని చూస్తాయి, మనకి రోత కలిగించే ఉద్యోగాలు చేసి, జంక్ ఫుడ్‌నీ, రంగుల కోలాలనీ, పనికిమాలిన క్రెడిట్ కార్డ్లనీ, ఎక్కువ ధర ఉన్న జోళ్లనీ కొనమని నమ్మబలుకుతాయి. దాన్ని వాళ్లు 'యువ సంస్కృతి' అంటారు. యువకులు అంటే ఇదేనన్నా వాళ్ల ఉద్దేశం? రెండు తరాల క్రితం యువతరం ఈ దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టింది. అది చాలా సార్థకమైన పని! కానీ ఆ తరవాత ఏం జరిగింది? మనని ఎక్కువ డబ్బు ఖర్చుపెట్టే జనాభాగా మిగిల్చింది. యువశక్తి అంటే వాళ్ల ఉద్దేశంలో ఇప్పుడు ఖర్చుపెట్టే శక్తి అనే!" అన్నాడు ప్రూమ్. ప్రతి ఒక్క ఏజెంటూ అతని మాటలు శ్రద్ధగా వినటం చూసి నేనే ఆశ్చర్యపోయాను.

ప్రూమ్ మళ్లీ మాట్లాడటం మొదలుపెట్టాడు, "ఇది ఇలా ఉండగా, పనికిమాలిన బాసులూ, బుద్ధిలేని అమెరికన్లూ మనదేశంలో అందరికన్నా ఎక్కువ ఉత్పాదన సామర్థ్యం ఉన్న తరం రక్తాన్ని పీల్చుకుంటూ ఉన్నారు. కానీ ఈ రోజు రాత్రి మనం వాళ్లకి మన తడాఖా చూపిస్తాం. దానికి నాకు మీరందరూ సాయం చెయ్యాలి. రాబోయే రెండుగంటలసేపూ మీరందరూ కష్టపడి పనిచెయ్యటానికి సిద్ధమేనా, చెప్పండి?"

"సిద్ధమే!" అందరూ ఒకేసారి అన్నారు. ప్రూమ్ ఊపిరి తీసుకోటానికి ఆగాడు.

"గుడ్! అయితే వినండి. మన ఫోన్ల సంఖ్య పెరిగినట్టయితే ఈ కాల్‌సెంటర్ కోలుకుని బతుకుతుంది. నా ప్లాన్ ఏమిటంటే, అమెరికన్లు మనకి క్రమం తప్పకుండా ఫోన్లు చేసేట్టుగా వాళ్లని భయపెట్టాలి. టెర్రరిస్టులు ఒక కొత్త రకమైన కంప్యూటర్ వైరస్‌తో వాళ్ల దేశం మీద దాడి చేశారనీ, అది వాళ్ల దేశాన్ని నేలమట్టం చెయ్యబోతోందనీ, చెప్పాలి. వాళ్లు సురక్షితంగా ఉండాలంటే వాళ్ల పరిస్థితి ఏమిటో తెలియజేయటానికి మనకి తరచు ఫోన్ చేస్తూ ఉండటం ఒక్కటే మార్గాంతరమని చెప్పాలి. మనం ఈ పనిని ఎలా చెయ్యాలంటే, మీ దగ్గరున్న వినియోగదారులందరి నంబర్లూ కంప్యూటర్‌లోంచి బైటికి లాగి, వాళ్లకి ఫోన్ చెయ్యాలి. కాల్‌స్క్రిప్ట్‌ని నేను ఈమెయిల్‌లో మీ అందరికీ పంపిస్తాను. అది మీ దగ్గరికి ఐదు నిమిషాల్లో వస్తుంది. ఈ లోపల ఆ నంబర్లు వెతికి పెట్టుకోండి," అన్నాడు ప్రూమ్.

ఒకే సమయంలో వందలకొద్దీ సంభాషణలు మొదలయేసరికి, మెయిన్ బేలో కోలాహలంగా గొంతులు వినిపించసాగాయి. తమ డేటాబేస్‌లో అందరూ వినియోగదార్ల

నంబర్ల ప్రింట్స్ తీసుకోవటానికి ప్రయత్నించేసరికి పిచ్చి ఆవేశం అంతటా అలుముకుంది. ఈ ప్లాన్ ఫలితాన్నిస్తుందని ఎవరికీ నమ్మకం కుదరలేదు, అయినా అందరూ ఉద్యోగాలు పోకుండా ఉండటానికి ఎటువంటి ప్రయత్నం ఐనా చెయ్యటానికి ఒప్పుకున్నారు.

ష్రూమ్, నేనూ, మా విభాగానికి వచ్చేశాం. అతను వేగంగా కంప్యూటర్ మీద ఏదో టైపు చేసి, కొన్ని నిమిషాలయాక, నా భుజం తట్టాడు.

"నీ ఈమెయిల్ ఒకసారి చూసుకో," అన్నాడు నా కంప్యూటర్‌కేసి చూపిస్తూ.

నేను నా 'ఇన్‌బాక్స్'ని తెరిచాను. ష్రూమ్ కాల్‌సెంటర్‌లో ఉన్న వాళ్లందరికీ ఈమెయిల్ పంపాడు.

విషయం : ఆపరేషన్ యాంకీ ఫియర్

మిత్రులందరికీ,

ఆపరేషన్ యాంకీ ఫియర్‌ను అమలుపరచటంలోని ఒకే ఒక లక్ష్యం, కనెక్షన్స్ కాల్‌సెంటర్‌కి వచ్చే ఫోన్‌కాల్స్ సంఖ్యని పెంచటం, ఈ భూమ్మీద అమెరికన్లని మించిన పిరికిపందలు మరొకరు లేరన్న నిజాన్ని మనకి అనుకూలంగా ఉపయోగించుకోవటం. ఇలా చెయ్యటం వల్ల అతిపెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఊడటాన్ని ఆపటం, ఇక్కడ పరిస్థితిని మెరుగుపరిచేందుకు మరికొంత వెసులుబాటుని చేజిక్కించుకోవటం వీలవుతుంది. అంతేకాక, కొత్త ఖాతాదార్లని సంపాదించుకునేందుకు మార్కెటింగ్‌కి అవసరమయే ప్రయత్నాలు కూడా చెయ్యచ్చు.

ఆపరేషన్ యాంకీ ఫియర్ మీ సహకారం నూటికి నూరు శాతం లేకుండా విజయాన్ని సాధించలేదు. అందుచేత, ఈ కింద ఇచ్చిన సూచనలని జాగ్రత్తగా చదివి, అలిసిపోకుండా రాబోయే రెండు గంటల్లో ఫోన్‌కాల్స్ చెయ్యటం మీద ధ్యాస ఉంచండి. ప్రతి ఒక్క వినియోగదారుకీ ఫోన్ చేసేటప్పుడు, మీరు వాళ్లకి అందించవలసిన ముఖ్యమైన సందేశం ఇదీ :

1. ముందుగా థాంక్స్ గివింగ్ రోజున వాళ్లకి ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నందుకు క్షమాపణ చెప్పటంతో ప్రారంభించండి.
2. ఈ ప్రపంచంలోని కొన్ని 'దుష్టశక్తులు' ఒక కంప్యూటర్ వైరస్‌ని వదిలిపెట్టాయనీ, అవి అమెరికాలోని ఒక్కొక్క కంప్యూటర్‌నీ ఆక్రమించే ప్రమాదం ఉందనీ చెప్పండి. ఈ రకంగా ఆ దుష్టశక్తులు ఒక్కొక్క అమెరికన్‌నీ గమనిస్తూ ఉంటాయనీ, త్వరలోనే అమెరికన్ ఆర్థిక వ్యవస్థని నాశనం చేస్తాయనీ అనండి. మీకు అందిన సమాచారం ప్రకారం, ఈసరికే ఆ వైరస్ వాళ్ల కంప్యూటర్ల మీద దాడిచేసిందని చెప్పండి.
3. ఆ 'దుష్టశక్తులు' ఏమిటి అని వాళ్లు కనక అడిగితే, ఏవైనా అస్పష్టమైన వివరాలు ఇవ్వండి. 'అమెరికాకి హాని కలిగించాలని అనుకునే శక్తులు,' అనో, 'స్వేచ్ఛకీ, స్వాతంత్ర్యానికీ ప్రమాదం వాటిల్లజేసే సంఘాలు,' అనో చెప్పండి. ఒక్క విషయం గుర్తుపెట్టుకోండి, మీ జవాబు ఎంత అస్పష్టంగా ఉంటే, వాళ్లకి అంత ఎక్కువ భయం



వేస్తుంది. మీ గొంతులో నిజమైన గాభరా వాళ్లకి వినిపించాలి.

4. తమ కంప్యూటర్‌లో వైరస్ ఉందో లేదో తెలుసుకునేందుకు వాళ్లని ఎమ్ఎస్‌వర్డ్ టెస్ట్ చేసి చూసుకోమనండి. ఖాళీ ఎమ్ఎస్‌వర్డ్ ఫైలు తెరవమని చెప్పండి, దాన్లో =రాండ్ *(200,99)* అని టైపు చేసి, ఎంటర్ బటన్ నొక్కమని చెప్పండి. 'టెక్స్ట్‌పాప్స్' ఎక్కువ సంఖ్యలో తెరమీదికి వస్తే, కంప్యూటర్‌లో వైరస్ ఉన్నట్టు అర్థం. (మరేం బెంగలేదు : టెక్స్ట్‌పాప్స్ తప్పకుండా వస్తాయి. ఎమ్ఎస్‌వర్డ్‌కి సంబంధించిన పెద్ద వైరస్ అది!) అలా జరగ్గానే మీ వినియోగదార్లు భయంతో వణకటం మొదలుపెట్టచ్చు.
5. ఈ వైరస్ దాడినించి మీరు వాళ్లని కాపాడగలరనే దానికి ఈ కింది కారణాలు చెప్పండి : ఎ) మీరు ఇండియాలో ఉన్నారు, ఇండియన్లందరూ కంప్యూటర్ విషయంలో నిపుణులు. బి) ఇండియా ఏళ్ల తరబడి ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటోంది. సి) వాళ్లు చాలా విలువైన ఖాతాదార్లు, మీకు వినియోగదార్లకి సాయపడటంలో విశ్వాసం ఉంది.
6. ఏదేలా ఉన్నా, వాళ్లకి మన సాయం అవసరమైతే, కనెక్షన్స్ కాల్‌సెంటర్‌కి వాళ్లు ఆరుగంటలకొకసారి ఫోన్ చేస్తూ ఉండాలి. ఏమీ జరగకపోయినా, అంతా సరిగ్గానే ఉందని చెప్పటానికైనా సరే, వాళ్లు ఫోన్ చెయ్యాలి (ఆ కాల్స్ ఎంత తక్కువ వ్యవధి కలవైతే మనకి అంత మంచిది, అది వేరే విషయం.)
7. ఒకసారి ఫోన్ల సంఖ్య పెరిగిన వెంటనే, నేను బోస్టన్‌కి ఫోన్ చేసి, ఉన్నట్టుండి ఫోన్‌కాల్స్ సంఖ్య పెరిగిందనీ, ఉద్యోగాలు పీకెయ్యటం అనే కార్యక్రమాన్ని మరో రెండు నెలల వరకూ వాయిదా వెయ్యటం మంచిదనీ, సిఫార్సు చేస్తాను. ఆ తరవాత మనం పూర్తిగా కోలుకోవటం గురించి ఏదైనా ఉపాయం ఆలోచించచ్చు.

ఛీర్స్,

వరుణ్@డబ్ల్యుఎఎస్‌జీ

నేను ఈమెయిల్ చదవటం ముగించేసరికి, ష్రూమ్ పళ్లన్నీ బైటపెట్టి నవ్వి, నాకు కన్ను కొట్టాడు.

"ఆ ఎమ్ఎస్‌వర్డ్ ట్రిక్ ఏమిటి?" అన్నాను.

"ప్రయత్నించి చూడు, వర్డ్‌ఫైలు తెరు," అన్నాడు ష్రూమ్.

నేను వర్డ్ డాక్యుమెంట్ తాలూకు ఖాళీపేజీ తెరిచాను. దానిలో = రాండ్ (200,99) అని టైప్ చేశాను.

ఎంటర్ బటన్ నొక్కగానే, రెండువందల పేజీల టెక్స్ట్ కంప్యూటర్ తెరమీద సాక్షాత్కరించింది! అది చూస్తే దడపుట్టింది! ఆ పేజీల్లో ఇలా ఉంది :

*The quick brown fox jumps over the lazy dog. The quick brown fox jumps over the lazy dog. The quick brown fox jumps over the lazy dog. The quick brown fox jumps over the lazy dog. The quick brown fox jumps over the lazy dog. The quick*

*brown fox jumps over the lazy dog. The quick brown fox jumps over the lazy dog. The quick brown fox jumps over the lazy dog. The quick brown fox jumps over the lazy dog. The quick brown fox jumps over the lazy dog. The quick brown fox jumps...*

"ఏమిటిది? నమ్మలేకపోతున్నాను...!" అన్నాను.

"చెప్పా కదా, ఎమ్ఎస్‌వర్డ్‌లో ఉండే ఒక బగ్ అది. ఏదీ నిర్దుష్టంగా ఉండదు. ఇక అలా కూర్చుని ఏం జరుగుతుందో, చూస్తూ ఉండు!" అన్నాడు వ్రూమ్.

వ్రూమ్ రాసిన ఈమెయిల్ వేలకొద్దీ మెయిల్ బాక్స్‌ల్లోకి వెళ్లిపోయింది. ఏజెంట్సందరూ దాన్ని వెంటనే చదివారు.

ఏజెంట్లకి ఇంకా ఏవైనా సందేహాలుంటే టీమ్‌లీడర్లు వాటికి జవాబులు చెప్పారు. కొద్ది నిమిషాలలోనే ఏజెంట్లు, తమకి ఎంతో బాగా తెలిసిన పనిని చెయ్యటం ప్రారంభించారు : వీలైనంత త్వరగా జనానికి ఫోన్లు చేసి తమకి తెలిసిన సమాచారాన్ని అందివ్వటం. నేను నా విభాగంనుంచి బైటికొచ్చి మెయిన్ బే వైపుకి వెళ్లాను. టెలిఫోన్ సంభాషణల నుంచి అక్కణ్ణించి ఒక వాక్యం, ఇక్కణ్ణించి ఒక వాక్యం వినిపించాయి నాకు.

"హల్లో, మిస్టర్ విలియమ్! థ్యాంక్స్ గివింగ్ రోజున మీకు ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నందుకు, మన్నించండి. ఒక అత్యవసర పరిస్థితి ఏర్పడటంవల్ల నేను వెస్టర్న్ కంప్యూటర్స్ నించి ఫోన్ చేస్తున్నాను. అమెరికా వైరస్ దాడికి లోనయింది," అన్నాడు ఒక ఏజెంటు.

"యెస్, సార్! మా రికార్డులని బట్టి మీ కంప్యూటర్‌లో కూడా వైరస్ ఉంది..." అంటోంది మరొక ఏజెంటు.

"గాభరాపడకండి, సార్! కానీ, యెస్, దుష్టశక్తులు మీమీద గురిపెట్టాయనే అనిపిస్తోంది," అంటున్నాడు పద్ధెనిమిదేళ్ల ఏజెంటొకడు. "కానీ మేం మిమ్మల్ని కాపాడగలం," అని కూడా అంటున్నాడు.

"మాకు నాలుగైదు గంటలకొకసారి ఫోన్ చేస్తూ ఉండండి," అంది ఒక ఏజెంటు ఫోన్ పెట్టేస్తూ.

ఇంకాస్త చొరవ ఉన్న ఏజెంట్లు ఇంకొక్క అడుగు ముందుకు వేసి, "మీరు మీ స్నేహితులకీ, బంధువులకీ, అందరికీ ఈ సంగతి చెప్పాలని మా కోరిక. అవును, వాళ్లు కూడా మాకు ఫోన్ చెయ్యచ్చు," అంటున్నారు.

కొందరు వినియోగదార్లు గాభరాపడ్డారు ఏజెంట్లు వాళ్లకి ధైర్యం చెప్పాల్సి వచ్చింది "ఏం ఫరవాలేదు. మేం మీ దేశాన్ని కాపాడతాం. దుష్టశక్తులు ఎన్నటికీ గెలవలేవు."

వెయ్యిమంది ఏజెంట్లు, ఒక ఫోన్‌కాల్, నాలుగు నిమిషాలు. అంటే రెండు గంటల్లో ముప్పైవేల ఫోన్‌కాల్స్ చెయ్యగలుగుతాం. వాళ్లు ఆరుగంటలకొకసారి మాకు ఫోన్ చేసినట్లయితే,



గంటకి లక్ష కాల్స్ చెయ్యగలుగుతాం. ఇది ఒక వారం రోజులు కొనసాగినా, రాబోయే రెండు నెలలకి అవసరమయే లక్ష్యాన్ని సాధించగలుగుతాం. బహుశా, కొత్త మేనేజర్‌తో, ఇంకా ఎక్కువ అమ్మకాలు చెయ్యటానికి ప్రయత్నించి, కనెక్షన్స్ కోలుకోగలుగుతుందని మా ఆశ. ప్రస్తుతానికి ఎవరూ ఉద్యోగం వదులుకోనక్కర్లేదు.

నాకోసం వెతుకుతూ మెయిన్ బేకి వచ్చాడు వ్రూమ్. మేమిద్దరం మళ్లీ డబ్ల్యుఏఎస్‌జీకి వెళ్లాం. వ్రూమ్ కాన్ఫరెన్స్ రూమ్‌లోకి రమ్మని నాకు సైగ చేశాడు.

"వాళ్ల స్పందన అద్భుతంగా ఉంది. మనం ఫోన్ చెయ్యటం మొదలుపెట్టి అరగంటే అయింది. ఇప్పటికే కాల్స్ సంఖ్య రెట్టింపయింది," అన్నాడు వ్రూమ్.

"అదిరింది, మాన్! మన వెబ్ డిజైన్ కంపెనీ గురించి నాకు నువ్వింకా ఎక్కువ నమ్మకం కలిగించావు. కానీ, పద మన బల్ల దగ్గరకి పోదాం. నన్నెందుకు ఇక్కడికి రమ్మన్నావు?" అన్నాను.

"మనం మూడో ఎజెండా గురించి రహస్యంగా మాట్లాడుకోవాలి."

"ఏమిటది?"

"మూడో ఎజెండా నీకోసం. నీకు ప్రియాంకా ప్రేమని మళ్లీ పొందాలని లేదా?"

# # 34

"లేదు, ప్రియాంకకీ నాకూ మధ్య ఉన్న సంబంధం ఇక ముగిసిపోయినట్టే!" అన్నాను.

"నిజం చెప్పు, గురూ! నువ్వు దేవుడితో మాట్లాడటం అదీ చేశావు కదా!"

నేను కళ్లు దించుకున్నాను. నేనేమైనా అనేదాకా వ్రూమ్ ఆగాడు.

"నాకు ప్రియాంక కావాలా, వద్దా అనేది ఇక్కడ ముఖ్యం కాదు. నాకున్న పోటీని ఒక్కసారి చూడు. మిస్టర్ పర్‌ఫెక్ట్ మ్యాచ్, గణేశ్‌ని నేను ఎలా ఓడిస్తాను?"

"చూశావా, అసలు సమస్య అక్కడే ఉంది. మనమందరం గణేశ్‌లో ఎటువంటి లోపమూ లేదని అనుకుంటున్నాం. కానీ అలాంటి మనిషి ఎవరూ ఉండరు."

"అవునవును! స్విమ్మింగ్ పూలున్న ఇల్లూ, నా పదేళ్ల జీతం కన్నా ఎక్కువ ఖరీదు చేసే కారూ, ప్రపంచంలోని ఒక గొప్ప కంపెనీలో పనిచెయ్యటం - వీటన్నిటినీ చూస్తే నాకెక్కడా లోపం ఉన్నట్టు కనిపించటం లేదు."

"ప్రతివాళ్లలోనూ ఏదో ఒక లోపం ఉంటుంది, గురూ! గణేశ్‌లో ఉన్న లోపాన్ని కనిపెట్టటమే మనం చెయ్యవలసింది."

"కానీ, ఏనాటికైనా అది ఎలా సాధ్యం? పైగా, అతనిలో మనం ఏదైనా ఒక లోపాన్ని కనిపెట్టగలిగినా, దానివల్ల ఏం లాభం? అతను అన్ని విధాలా యోగ్యుడు, ప్రియాంక ఎప్పటికైనా అతన్నే ఇష్టపడుతుంది," అన్నాను.

"కనీసం తను ఏ లోపాలూ లేని మనిషిని ఎంచుకోవటం లేదనే సంగతి ప్రియాంకకి తెలుస్తుందిగా?" అన్నాడు వ్రూమ్.

నేను రెండు నిమిషాలు మౌనంగా ఉండిపోయాను. "సరే, కానీ ఇప్పుడు మనం గణేశ్‌లోని లోపాన్ని ఎలా కనిపెడతాం?" అని నా వాచీకేసి చూశాను, 5:30 అయింది.

"ఏదో ఒక దారి దొరక్కపోదు," అన్నాడు వ్రూమ్.

"మన షిఫ్టు మరో గంటన్నరలో అయిపోతుంది. ప్రియాంక ఇంటికి వెళ్లిపోతుంది. మరి నువ్వేం ప్లాన్ చేస్తున్నావు? వెంటనే సియాటల్‌లో ఒక ప్రైవేట్ డిటెక్టివ్‌ని నియమించబోతున్నావా?" అన్నాను నా గొంతులో విసుగుని దాచుకోకుండా.

"అలా అస్త్రసన్యాసం చెయ్యకు, శ్యామ్!" అని వ్రూమ్ నా భుజం తట్టాడు.

"నేను ప్రియాంకని మర్చిపోటానికి ప్రయత్నిస్తున్నాను, కానీ నువ్వు నా మనసులోతుల్లో వెతకగలిగితే, అక్కడ ఇంకా బాధ మిగిలి ఉందని గ్రహిస్తావు. దాన్ని మరింత పెంచకు, వ్రూమ్!"

"వావ్! ఏం డైలాగు, గురూ! నా మనసులోతుల్లో వెతుకు, అక్కడ బాధ ఉంది!" అని వ్రూమ్ నవ్వాడు.

"అలా పిచ్చిపిచ్చిగా మాట్లాడినందుకు, ఏమనుకోకు. పద, మన బేకి పోదాం," అన్నాను.

"ఏయ్, కాస్త ఆగు! ఇప్పుడే వెతుకు అన్నావుగా!"

"అవును నా మనసులో వెతుకు, అక్కడ బాధ ఉంది, అన్నాను. చాలా పనికిమాలిన మాటలని, నాకు తెలుసు. అయినా ఎందుకలా అంటున్నావు?"

"వెతకటం. మనం అదే చెయ్యగలం. గూగుల్ మనకోసం డిటెక్టివ్‌లా పనిచేస్తుంది. అతని పేరు టైప్ చేసి వెతుకుదాం, ఏం దొరుకుతుందో చూద్దాం. ఏమైనా ఆశ్చర్యకరమైన విషయాలు దొరకచ్చు."

"ఏమిటీ? గణేశ్ విషయం తెలుసుకోటానికి, గూగుల్‌లో వెతుకుతావా?"

"అవును. కానీ మనకి అతని పూర్తిపేరు తెలియాలి. అతనే కాలేజీలో చదివాడో కూడా తెలుసుకోవాలి. అతను అమెరికాలోనే ఎమ్ఎస్ చదివినట్టున్నాడు. కమాన్, పద వెళ్దాం," అని నా షర్టు పట్టుకుని లాగాడు, వ్రూమ్.

"ఎక్కడికి?" అన్నాను, అతని వెంట వెళ్తూ.

"డబ్ల్యుఏఎస్‌జీ బేకి," అన్నాడు వ్రూమ్.

ప్రియాంక ఫోన్‌లో మాట్లాడుతూ, అమెరికన్లకి హడలెత్తిస్తూ, బిజీగా ఉంది. తను కావాలనుకున్నప్పుడు గొంతులో అధికారం ధ్వనించేట్టు మాట్లాడగలదనుకుంటా. అలాంటప్పుడు ఆమె మాటల్ని నమ్మకుండా ఉండటం అసంభవం. తనకి ఆ పోలిక వాళ్లమ్మ దగ్గర్నించి వచ్చి ఉండాలి. ప్రియాంక ఫోన్‌లో మాట్లాడటం అయిపోయాక వ్రూమ్ ఆమెతో, "ఏయ్, ప్రియాంకా! ఒక చిన్న ప్రశ్నకి త్వరగా జవాబు చెప్పు, నా కజిన్ కూడా అమెరికాలోనే కంప్యూటర్స్‌లో ఎమ్ఎస్ చేశాడు. గణేశ్ ఏ కాలేజీలో చదివాడు?" అన్నాడు.

"ఊఁ! విస్కాన్సిన్ అనుకుంటా," అందామె.

"అవునా? నేను నా కజిన్‌కి ఈమెయిల్ పంపించి తనది కూడా అదేనా అని కనుక్కుంటా. అన్నట్టు గణేశ్ పూర్తి పేరేమిటి?"

"గుప్తా...గణేశ్ గుప్తా," అంది ప్రియాంక మరో ఫోన్‌కాల్ చెయ్యటానికి సిద్ధం అవుతూ.

"ఊ...హ్! ప్రియాంకా గుప్తా," ఈషా సమాజంలోని గొప్పవారి గొంతుని అనుకరిస్తూ ఎగతాళిగా అంటూ, నవ్వింది. ప్రియాంక ఆమెని తన మోచేత్తో పొడిచింది. ప్రియాంకకి ఈషా పెట్టిన ఈ కొత్త పేరుకి నా పక్కటెముకల్లో బాధ అలలు అలలుగా లేచింది.

"కూల్! ఫోన్లు చేస్తూ ఉండు," అని వ్రూమ్ తన సీట్లోకి వెళ్లిపోయాడు.

ఫ్రూమ్ కంప్యూటర్ పగిలిపోవటంతో, అతను నా కంప్యూటర్ మీద పని చెయ్యసాగాడు. గూగుల్.కామ్‌లో ఈ కిందివి వెతకసాగాడు :

**గణేశ్ గుప్తా తాగుబోతు విస్కాన్సిన్**

**గణేశ్ గుప్తా ఫైన్లు విస్కాన్సిన్**

**గణేశ్ గుప్తా గర్ల్ ఫ్రెండ్**

ఎన్నో లింకులు తెరమీదికి వచ్చాయి, కానీ అవేవీ మాకు పనికివచ్చేవిగా కనిపించలేదు. తరవాత గణేశ్‌తో పాటు చదువుకున్నవాళ్ల లిస్ట్‌ని వెతికాం. అతను బోస్టన్‌లో డీన్‌ల లిస్ట్‌లో ఉన్నట్టు తెలిసింది.

"డామిట్! ఎంత బోరింగ్ ఫెలోనో! ఇంకా కొన్ని ప్రయత్నిస్తానుండు," అని ఫ్రూమ్ మరికొన్ని లింకులు వెతికాడు.

**గణేశ్ గుప్తా ఫెయిల్**

**గణేశ్ గుప్తా పార్టీ**

**గణేశ్ గుప్తా డ్రగ్స్**

ఆసక్తికరమైన సమాచారమేదీ దొరకలేదు.

"వదిలెయ్యి, గురూ! బహుశా క్లాసులో అతనే లీడరు అయి ఉంటాడు," అన్నాను.

"సరిగ్గా చెప్పావు! టీచర్‌కి ముద్దొచ్చే పిల్లల టైపు," అన్నాడు ఫ్రూమ్ చిరాగ్గా నిట్టూర్పు విడుస్తూ. "నేను ఓడిపోయాను. నేను ఈసారి ఇలాంటిదేదైనా టైపు చేస్తే బోలెడంత సమాచారం దొరకచ్చు, అతను ఎంతో సాధించాడుగా!" అన్నాడు మళ్లీ.

**గణేశ్ గుప్తా మైక్రోసాఫ్ట్ బహుమతి**

అని టైప్ చేసేసరికి ఎన్నో లింకులు తెరుచుకున్నాయి. మేము కొన్నిటిని మౌస్‌తో క్లిక్ చేశాం, ఆ తరవాత అతని ఫొటో ఉన్న ఒక లింకు ఒకటి దొరికింది. అది గణేశ్ ఆన్‌లైన్ ఆల్బమ్.

"డామిట్! అతనూ, అతని స్నేహితులూ ఉన్నారనుకుంటా వీటిలో," అంటూ ఫ్రూమ్ ఆ సైట్‌ని క్లిక్ చేస్తూ, "అతని స్నేహితులు ఎంత ఘోరంగా ఉన్నారో చూద్దాం," అన్నాడు.

ఆ లింక్ తెరుచుకుని, 'మైక్రోసాఫ్ట్ బహుమతి పార్టీ ఫొటోలు," అనే ఒక వెబ్‌పేజీ తెరమీదికి వచ్చింది. ఆ పార్టీ గణేశ్ ఇంట్లో జరిగినది. మైక్రోసాఫ్ట్‌లో గణేశ్ ఏదో సైడీ డెవలపర్ అవార్డు గెలుచుకున్నాడు. అతని స్నేహితులిద్దరు పార్టీ చేసుకోవటానికి అతనింటికి వచ్చారు.

"స్లయిడ్ షో వెయ్యి," అన్నాను. ఫ్రూమ్ దానిమీద క్లిక్ చేశాడు. అమ్మాయిలందరూ కాల్స్‌తో బిజీగా ఉన్నారని నిర్ధారణ చేసుకోవటానికి ఒకసారి మేమిద్దరం తలెత్తి చూశాం.

మొదటి ఫొటో తెరమీదికొచ్చింది. ఒక గార్డెన్‌పార్టీలో అందరూ ఇండియన్లే ఉండటం కనిపించింది. బల్లలమీద ఒక చిన్న ఊళ్లో ఉండే జనానికి సరిపడేంత తిండి పదార్థాలున్నాయి. గణేశ్ ఇంటినీ, అతిగా పొగడ్తకి గురైన స్విమ్మింగ్‌పూల్‌నీ చూశాను. నన్నడిగితే, అది కాస్త పెద్ద సైజు బాత్‌టబ్‌లాగా ఉందంతే. గణేశ్ ఆ పూల్‌లో ఒలింపిక్ ఛాంపియన్లు ఈతలో శిక్షణ పొందినంత గొప్పగా దాన్ని గురించి చెప్పాడు!



"హేయ్, మనకి ఏదో దొరికినట్టుంది. చూడు మనవాడిని!" అన్నాడు ఫ్రూమ్ ఒక ఫొటోని చూపిస్తూ. దాన్లో గణేశ్ బీరుగ్లాసు పట్టుకుని నిలబడ్డాడు. "అందులో వింతేముంది?" అన్నాను నేను. "బీరుగ్లాసు చేత్తో పట్టుకోవడంలో సిగ్గుపడాల్సినదేముంది. ఫ్రీగా దొరికితే ప్రియాంక కూడా అటువంటి పదిగ్లాసులని ఖాళీ చేసెయ్యగలదు!"

"గణేశ్ తలని బాగా చూడు," అన్నాడు ఫ్రూమ్.

"ఏమిటీ?" అని నేను తెర దగ్గరకెళ్లి చూస్తే, అది నాకు కనిపించింది.

"ఓహ్, నో!" అని అంటూ నా గొంతు అందరికీ వినిపించకుండా చేత్తో నోరు మూసుకున్నాను.

ఆ ఫొటోలో గణేశ్ తల మధ్యలో చిన్న బట్టతల ఉంది. హ్యాపీ మీల్ బర్గర్ సైజులో ఉన్న ఆ ప్రదేశం కెమెరా ఫ్లాష్‌లైట్ పడి మెరుస్తోంది.

"నమ్మశక్యం కాకుండా..." అన్నాను.

"ఉష్!" అని, "ఒక సంగతి గమనించావా? స్టేచ్యూ ఆఫ్ లిబర్టీ దగ్గర తీసుకున్న ఫొటోలో అతనికి బట్టతల లేదు!" అన్నాడు ఫ్రూమ్.

"ఈ ఆల్బమ్‌లో ఉన్న అన్ని ఫొటోల్లోనూ అతను ఇలాగే ఉన్నాడా?" అన్నాను.

"యెస్ సార్!" అని ఫ్రూమ్ మళ్లీ స్లయిడ్ షో ప్రారంభించాడు. ఒక బోరింగ్ ఫొటో తరవాత మరొకటిగా, ముఖ్యంగా మనుషుల నోళ్లలోనూ, ప్లేట్లలోనూ పదార్థాలతో అవి నిండి ఉన్నాయి. ప్రతి ఫొటోలోనూ ఒకటి మటుకు కనిపించింది, గణేశ్ ఉన్న ప్రతి ఫొటోలోనూ, మెరిసే నున్నని ప్రదేశం ఉంది!

ఫ్రూమ్ తన కంప్యూటర్ మౌస్‌ని దూరంగా జరిపాడు. తన కుర్చీమీద వెనక్కి వాలి, గర్వంగా మొహం పెట్టాడు. "నే చెప్పినట్టుగా, ఏ లోటూ లేనివారంటూ ఎవరూ ఉండరు, ఒక్క గూగుల్ తప్ప," అన్నాడు ఫ్రూమ్.

నేను కంప్యూటర్ తెర వైపూ, ఫ్రూమ్ మొహం వైపూ నిర్ఘాంతపోతూ చూశాను.

"అయితే ఇప్పుడేం చేద్దాం?" అన్నాను.

"ఇప్పుడు లేడీస్‌ని పిలిచి ఇవి చూపిద్దాం," అన్నాడు ఫ్రూమ్ పళ్లన్నీ బైటపెట్టి నవ్వుతూ.

"వద్దు, అది బావుండదు..." అన్నాను, కానీ అప్పటికే ఆలస్యమైపోయింది.

"ఈషా, రాధికా, ప్రియాంకా! గణేశ్ ఫొటోలు ఇంకా కొన్ని చూడాలనుందా? త్వరగా రండి!" అన్నాడు ఫ్రూమ్.

అమ్మాయిలు ఫోన్ చెయ్యటం మానేసి, మావైపు చూశారు. ఈషా, రాధిక లేచి నిలబడ్డారు.

"ఏవీ? ఎక్కడ? మాకు చూపించు!" అంది ఈషా.

"దేన్ని గురించి మాట్లాడుతున్నారు?" అంటూ ప్రియాంక మేమున్నచోటికి వచ్చింది.

"ఇంటర్నెట్‌కున్న శక్తి గురించి. మాకు ఒక ఆన్‌లైన్ ఆల్బమ్ దొరికింది. రా, చూద్దు స్త్రీ కొత్త ఇల్లు ఎలా ఉండబోతోందో," అన్నాడు ప్రూమ్. మెరిసే బట్టతల గురించి అతనేమీ అనలేదు. అమ్మాయిల్నే చూసి తెలుసుకోనీ అనుకుని ఊరుకున్నాడు. ప్రియాంక మొహంలో ఆత్రుతా, కుతూహలం కలగలిసి నాకు కనిపించాయి.

"ఇల్లు బావుంది!" అంది ఈషా పూల్ వెనక ఉన్న బార్బెక్యూని గమనించి. "కానీ, గణేశ్ ఏడీ? ఉండు ఎక్కడున్నాడో కనుక్కోనీ," అంటూ తన వేలిని మానిటర్ దగ్గరకి తెచ్చింది. ఇదుగో, ఇతనే... కాదు... ఉండు, ఇతనికి బట్టతల ఉంది. గణేశ్ అన్న అయి ఉంటాడా?" అంది.

ప్రియాంకా, రాధికా దగ్గరకొచ్చి చూశారు.

"కాదు, అది గణేశే!" అంది ప్రియాంక. ఆమె నోరు ఆ బట్టతలంత వెడల్పుగాను తెరుచుకుంది. ఆమె ఊపిరితిత్తుల్లోంచి గాలి బైటికొచ్చేసిందని నాకు అనిపించింది.

"కానీ, ప్రియాంకా! నువ్వు చూపించిన ఫొటోలో నేనా బట్టతలని గమనించలేదే..." అంది ఈషా. రాధిక ఈషా చేతిని గట్టిగా గిల్లింది. ఈషా మాటని మధ్యలో తుంచేసి, కనుబొమల్ని ఎత్తింది.

ప్రియాంక కంప్యూటర్ దగ్గరకొచ్చి, ఫొటోలని ఒకటొకటిగా చూడసాగింది. ఆమె ఒంగి అలా చూస్తూంటే ఆమె జుట్టు నా భుజాలమీద పడుతూ ఉండటాన్ని తను గమనించలేదు. అది నాకెంతో బావుంది.

కానీ ప్రియాంకకి ఏమీ బాగాలేదు. ఆమె స్టేచ్యూ ఆఫ్ లిబర్టీ ఫొటో బైటికి తీసింది. మేమందరం దాన్ని మళ్లీ చూశాం. గణేశ్‌కి తలనిండా జుట్టుంది.

"ఒకవేళ ఆన్‌లైన్ ఆల్బమ్‌లో ఉన్నది గణేశ్ అన్నయ్యేమో!" అంది రాధిక.

"లేదు, అతనికి అన్నదమ్ములు లేరు. ఒకే ఒక చెల్లెలుంది," అంది ప్రియాంక. ఆమె మొహం విచారంతో పాలిపోయింది.

కొన్ని సెకన్లపాటు నిశ్శబ్దం అలుముకుంది.

"ఊఁ... దీనివల్ల పెద్ద ఇబ్బందేమీ ఉండదనుకుంటా, కదా? రెండు ఆత్మలమధ్య నిజమైన ప్రేమ ఉన్నప్పుడు బెత్తెడు చర్మం కనిపించినంత మాత్రాన ఏమవుతుంది?" అన్నాడు ప్రూమ్. నవ్వు ఆపుకోటానికి నేను నా రెండు దవడల్నీ గట్టిగా నొక్కి పట్టాను. "పదండ్రా! ఇక ఈ పిచ్చి మాటలు ఆపేసి పని చూసుకుందాం. ఫోన్ల విషయం మర్చిపోకండి," అన్నాడు ప్రూమ్.

ప్రియాంక అతినెమ్మదిగా నడుస్తూ తన సీటు దగ్గరకెళ్లింది. అక్కడికి వెళ్లి తన మొబైల్ ఫోన్ తీసింది. ఒక పెద్ద నంబరు డయల్ చేసింది, బహుశా చాలా దూరంగా ఉన్నవాళ్లెవరికో అనుకుంటా. ఈ ఫోన్‌కాల్ బలే మజాగా ఉండబోతోంది. నేను ట్యాప్ చెయ్యగలిగితే బావుండేది, అనుకున్నాను.

"హల్లో గణేశ్," అంది ప్రియాంక సూటిగా ఉన్న గొంతుతో. "చూడూ, నేను ఎక్కువసేపు



మాట్లాడలేను. ఒక విషయం కనుక్కుందామని ఫోన్ చేశాను... అవును, ఒకే ఒక ప్రశ్న అడగాలి... అసలు నేనింతకు ముందు ఊరికే ఇంటర్నెట్‌లో ఏవేవో సైట్లు చూస్తూ ఉన్నాను..." అని తన సీటులోంచి లేచింది ప్రియాంక. గదిలో ఒక మూలకెళ్లింది, ఆ తరవాత నాకామె మాటలు వినబడలేదు.

నేను ఇంకొన్ని కాల్స్ చేసి, మరికొంతమంది అమెరికన్లకి హడలు పుట్టించాను. పది నిమిషాల తరవాత ప్రియాంక తన సీటు దగ్గరకొచ్చి, సెల్‌ఫోన్‌ని బల్లమీదికి గిరవాటేసింది.

ఈషా తన కనుబొమలని పైకీ కిందికీ ఆడించింది అంటే అది 'ఏమయింది?' అని అడగటం అన్నమాట.

"ఆన్‌లైన్ ఫొటోలో ఉన్నది అతనే! ఎక్కువేమీ మాట్లాడలేకపోయాడు. స్టేచ్యూ ఆఫ్ లిబర్టీ ఫొటోలో జుట్టు ఉన్నట్టు కాస్త ఇంకుతో సరిచెయ్యమనీ, పెద్దవాళ్లు చూసి చేసే పెళ్లిళ్లకి అది అవసరమనీ, వాళ్లమ్మ తనతో చెప్పిందని అన్నాడు," అంది ప్రియాంక.

"ఓహ్ నో!" ఈషా బాధగా అరిచింది.

"అతను చాలాసార్లు క్షమించమని అడిగాడు. ఫొటోలో లేనిది ఉన్నట్టు చూపించటం అతనికి ఇష్టం లేదనీ, వాళ్లమ్మ ఒత్తిడి చెయ్యటం వల్లే తనలా చెయ్యవలసి వచ్చిందనీ అన్నాడు."

"తను సొంతంగా ఆలోచించుకోలేడా?" అంది ఈషా.

"ఓ గాడ్! నేనిప్పుడు ఏం చేయాలి?" అంది ప్రియాంక.

"అతను క్షమించమని మనస్ఫూర్తిగానే అన్నాడా?" అంది రాధిక.

"అవును, అన్నాడనే అనిపిస్తోంది నాకు. నేనెలా ఫీలయుంటానో తను అర్థం చేసుకోగలనన్నాడు. నావాళ్ల ముందు కూడా క్షమాపణ చెప్పటానికి తను సిద్ధమే అన్నాడు."

"సరే, అయితే ఇక సమస్యే లేదు. ఇప్పుడేం కొంప మునిగిపోయిందని? అతనికి బట్టతల ఉంటే నీకు అభ్యంతరమేమీ ఉండదు, కదూ?" అంది రాధిక.

"అవును. పైగా కొన్నేళ్లకి అందరు మొగాళ్లకీ బట్టతల ఎలాగూ వచ్చేస్తుంది. అప్పుడు మాత్రం మనం ఏం చెయ్యగలుగుతామని?" అంది ఈషా.

"అది నిజమే," అంది ప్రియాంక తియ్యటి గొంతుతో. ఆమె మెత్తబడుతోందని గ్రహించి, ప్రూమ్‌కేసి చూశాను.

"అవును, ఏం ఫరవాలేదు. పెళ్లిలో మట్టుకు అతను టోపీ పెట్టుకునేట్టు చూడు. పెళ్లి ఫొటోలన్నిట్లోనూ అతని బట్టతలకి ఇంకు పూస్తానని నువ్వు అనుకుంటే, అది వేరే సంగతి," అని ప్రూమ్ నెమ్మదిగా నవ్వాడు. నేనూ ఈషా మా నవ్వుని ఆపుకోటానికి నేలచూపులు చూశాం.

"షటప్, ప్రూమ్!" అంది రాధిక.

"సారీ, చాలా నీచంగా ప్రవర్తిస్తున్నాను కదూ? నిజం చెపుతున్నా, ప్రియాంకా! లోటుపాట్లు లేనివారంటూ ఎవరూ ఉండరు. ఆ విషయం మనందరికీ తెలుసు, అవునా? అందుచేత, మనం మళ్లీ ఫోన్‌కాల్స్ విషయం చూద్దాం," అన్నాడు ప్రూమ్.

# # 35

తరవాత అరగంటసేపు మేం పనిమీదే ధ్యాస పెట్టాం - కనెక్షన్స్‌ని కాపాడేందుకు ఫోన్‌కాల్స్ చేస్తూ ఉండిపోయాం.

6:30కి, నేను మెయిన్ బేకి వెళ్లాను. టీమ్ లీడర్లందరూ నా చుట్టూ మూగి, విషయాన్ని చెప్పారు. ఆరుగంటల తరవాత గానీ మాకు వచ్చే ఫోన్‌కాల్స్ సంఖ్య ఆకాశాన్నంటేట్టుగా ఉండదని మేం అనుకున్నప్పటికీ, ఇప్పటికే అది అనుకోనంతగా పెరిగిందని తెలిసింది. టర్కీ డిన్నర్లతో పండగ చేసుకుంటున్నా, అమెరికన్లు భయంతో మతిపోగొట్టుకుని ఉన్నారు. ఒక గంటలోనే చాలామంది మాకు ఎన్నోసార్లు ఫోన్లు చేశారు.

కొందరు సీనియర్ టీమ్ లీడర్లతో కలిసి వ్రూమ్, నేనూ బక్షీ ఆఫీసుకి వెళ్లాం. బక్షీ బోస్టన్ ఆఫీసుతో అత్యవసర వీడియో సమావేశం ఏర్పాటు చేశాడు. మేం కొత్తగా వచ్చిన కాల్స్ తాలూకు వివరాలూ, వచ్చే పోయే కాల్స్ గురించి సూక్ష్మంగా మాకు అర్థమైన విషయాలూ, ఆదాయం పెంచటానికి ఉపయోగపడగల కొత్త వనరుల గురించీ వివరిస్తూంటే, బక్షీ మా పక్షం వహించాడు. ఇరవై నిమిషాలపాటు సాగిన ఈ వీడియో సంభాషణ ముగిశాక, బోస్టన్ రెండు నెలల వరకూ లేఆఫ్‌లని నిలిపివేయటానికి ఒప్పుకుంది. అలాగే పైస్థాయిలో పనిచేస్తున్న టీమ్‌లీడర్లని కొన్నాళ్లపాటు అమ్మకాలు చేసే పనిమీద బోస్టన్‌కి పంపే విషయాన్ని గురించి ఆలోచించటానికి కూడా అక్కడి ఆఫీసర్లు ఒప్పుకున్నారు. కానీ, టీమ్ లీడర్లు కొన్ని వారాల్లోగా ఒక స్పష్టమైన ప్రణాళికని వాళ్ల ముందు ఉంచాలని అన్నారు.

"మనం ఈ పని ఎలా చెయ్యగలిగాం, గురూ? ఇది వీలవుతుందని నేనెప్పుడూ అనుకోలేదు!" అన్నాను వ్రూమ్‌తో, బక్షీ ఆఫీసులోంచి బైటికొస్తూ.

"అమెరికన్లకి భవిష్యత్తులో బోలెడన్ని డాలర్లు దొరుకుతాయని మాటిస్తే చాలు, వాళ్లు నీ మాట వింటారు. రెండు నెలలు మాత్రమే వాయిదా వేశారు, కాని ప్రస్తుతానికి ఇది చాలు," అన్నాడు వ్రూమ్.

ఇక కనెక్షన్స్‌ని కాపాడగలిగాం అనే నమ్మకంతో, నేను నా బల్ల దగ్గరికి వెళ్లిపోయాను. డ్రైవరు నిద్రలేచేలోపల, క్వాలిస్‌ని శుభ్రం చేసేందుకు వ్రూమ్ బైటికెళ్లాడు. నేను ఎవరికీ చెప్పకుండా జారుకుంటాననీ, గుడ్‌బైలూ, కావలించుకోటాలూ, మళ్లీ కలుసుకుంటామనే వాగ్దానాలూ వద్దనుకున్నాననీ, ముఖ్యంగా ప్రియాంక ముందు ఇలాంటివేవీ చెయ్యననీ, వ్రూమ్‌తో అన్నాను. వ్రూమ్ సరేనన్నాడు, 6:50 కల్లా బైక్‌తో బైట నా కోసం రెడీగా ఉంటానన్నాడు.



అమ్మాయిలు 6:45 కల్లా ఫోన్లు చెయ్యటం ఆపేశారు. మా షిఫ్ట్ ముగిసింది. అందరూ సీట్ల దగ్గర 7:00 కల్లా మాకోసం రెడీగా ఉండే క్వాలిస్‌ని అందుకోటానికని, కంప్యూటర్లని లాగౌట్ చేయడం మొదలుపెట్టారు.

ఈషా తన మానిటర్‌ని ఆఫ్ చేస్తూ, "నాకు చాలా ఉత్సాహంగా ఉంది, రాధిక నాతో వచ్చి ఉండబోతోంది!" అంది. ఆమె తన హ్యాండ్‌బాగ్‌ని తెరిచి దాన్లో ఉండే వస్తువులని సర్దటం మొదలుపెట్టింది.

"నిజంగానా?" అన్నాను నేను.

"అవును, నిజమే. మిలిటరీ అంకుల్ కూడా ఒక లాయర్ని పరిచయం చేస్తానన్నారు. నాకొక మంచి, గట్టివాడైన విడాకుల లాయర్ కావాలి," అంది రాధిక.

"సమస్యని పరిష్కరించుకోవటానికి ప్రయత్నం చెయ్యవా?" అని అడిగింది ప్రియాంక స్టీల్ బాక్సులని తీసి బ్యాగులో పెడుతూ.

"చూద్దాం. నేను రాజీపడే మూడ్‌లో లేను. అంతేకాదు, మళ్లీ నేనతని ఇంటికి వెళ్లటం అనేది జరగని పని. ఇవాళ నా అత్తగారు తనే స్వయంగా బ్రేక్‌ఫాస్ట్ చేసుకుంటుంది."

"ఆ తరవాత శనాదివారాల్లో నేను రాధికని చండీగఢ్‌కి తీసుకెళ్తున్నాను," అంటూ ఈషా నవ్వింది.

అందరూ ప్లాన్లు వేసుకోవటంలో బిజీ అయిపోయారు. నేను మంచినీళ్లు తాగటానికి వాటర్‌కూలర్ దగ్గరకెళ్తున్నానని సాకు చెప్పి, అట్నించటే బైటికి వెళ్లిపోవటానికి, చల్లగా జారుకున్నాను.

# #36

6:47కి నేను వాటర్‌కూలర్ దగ్గరకెళ్లాను. కాల్‌సెంటర్‌లో ఆఖరిసారి నీళ్ల తాగేందుకు, కొళాయివేపు ఒంగాను.

తాగటం పూర్తిచేసి నిటారుగా నిలబడ్డ నాకు, నా వెనకాలే నిల్చున్న ప్రియాంక కనిపించింది.

"హాయ్! వెళ్లిపోతున్నావా?" అందామె.

"ఓ...హాయ్! అవును, నేను వ్రూమ్ బైక్ దగ్గరకెళ్తున్నాను..." అని, మూతి తుడుచుకున్నాను.

"నిన్ను మిస్సవుతాను," అంది నా మాటలకి అడ్డొస్తూ.

"ఓహ్? ఎక్కడ? క్వాలిస్‌లోనా?" అన్నాను.

"కాదు శ్యామ్! అసలు యిక ఎప్పుడూ కూడా నువ్వు కనిపించవేమో అని అనిపిస్తుంది. మన మధ్య జరిగిన దానికి నాకు చాలా విచారంగా ఉంది."

"విచారించకు. ఇందులో తప్పంతా నాదే. నాకా సంగతి తెలుసు. నేనే పనికి మాలిన వాడిలా ప్రవర్తించాను..." అన్నాను చేతివేళ్లు ఆరటానికి వాటిని దులుపుతూ.

"శ్యామ్! వ్రూమ్ అన్నాడు చూడు, ఇండియా బీదదేశం అయినంత మాత్రాన మనం దాన్ని ప్రేమించటం మానివేయనవసరం లేదని," అంది ప్రియాంక.

"ఏమిటీ?" అన్నాను మాట్లాడే విషయం ఉన్నట్టుండి మారిపోయే సరికి, కళ్లు ఆర్పుతూ. "ఆc అదా? అవును, నేను కూడా ఒప్పుకుంటాను, ఎంతైనా ఇది మనదేశం..."

"అవును, ఇండియా మనది కాబట్టి మనం దాన్ని ప్రేమిస్తాం. కానీ, దాన్ని మనం ప్రేమించటం మానకపోవటానికి ఇంకో కారణం ఉంది, అది నీకు తెలుసా?"

"ఎందుకు?"

"ఎందుకంటే మనం వెనకబడి ఉండటానికి ఇండియాదే పూర్తి బాధ్యత కాదు. మన పాత లీడర్లు కొందరు ఇంకోరకంగా ప్రవర్తించి ఉండి ఉంటే బావుండేది. కానీ మనలో సత్తా ఉంది. అది మనకి తెలుసు. వ్రూమ్ అన్నట్టు ఏదో ఒక రోజున మన సత్తా ఏమిటో వాళ్లకి చూపిస్తాం."

"అవును మంచి పాయింటే చెప్పావు," అన్నాను. ఇంత పొద్దున్నే తను దేశభక్తి గురించి మాట్లాడటం నాకు కొంచెం ఆశ్చర్యం కలిగించింది. బహుశా మా ఆఖరి కలయిక ఇది. అలాంటప్పుడు ఈ మాటలు వింతగా తోచాయని వేరే చెప్పక్కర్లేదు.

నేను తలాడించి అక్కణ్ణించి బైటికి నడవసాగాను, "వ్రూమ్ నాకోసం ఎదురుచూస్తూ ఉంటాడనుకుంటా..." అన్నాను.

"ఉండు, నేను మాట్లాడటం ఇంకా అయిపోలేదు," అంది.

"ఏమిటీ?" అని ఆగి ఆమెవైపు చూశాను.

"నేను ఇంతకుముందు చెప్పిన విషయం ఇంకో దానికి కూడా వర్తిస్తుంది. ఇదీ, నా శ్యామ్ ఒకటే అనిపించింది. శ్యామ్ ప్రస్తుతం విజయాన్ని సాధించి ఉండకపోవచ్చు, కానీ అతనిలో ఆ సత్తా ఉంది. అంతేకాక, అంతమాత్రాన అతన్ని నేను ప్రేమించకుండా ఉండాలని ఎక్కడా లేదు!" అంది ప్రియాంక.

నేను మూగబోయి నిలబడిపోయాను. నేను ఎదురుచూడని విషయం ఇది. నేను మాటలకోసం తడుముకున్నాను. చివరికి వణికే గొంతుతో, "నీకాక సంగతి తెలుసా, ప్రియాంకా? నువ్వింత చక్కగా మాట్లాడుతున్నావు...రాత్రంతా నీమీద ద్వేషం పెంచుకోవాలని ప్రయత్నించినా, అది నావల్ల కాలేదు. కానీ నిన్ను ద్వేషించి, ముందుకి పోవాలని నాకు తెలుసు. ఎందుకంటే, మిస్టర్ మైక్రోసాఫ్ట్ నీకు ఇవ్వగలిగినది, నేను ఇవ్వలేను..." అధైర్యంతోనూ, షాకుతోనూ నేను గబగబా మాట్లాడసాగాను.

"గణేశ్," అంటూ ఆమె నాకడ్డొచ్చింది.

"ఏమిటీ?" అన్నాను.

"అతని పేరు గణేశ్, మిస్టర్ మైక్రోసాఫ్ట్ కాదు," అంది.

"అవును, ఏదో ఒకటి," అని నేను ఊపిరి తీసుకునేందుకు కూడా ఆగకుండా మాట్లాడసాగాను, "గణేశ్ నీకు ఇవ్వగలిగింది నేనివ్వలేను. ఈ జన్మలో లెక్సస్ కొనలేను. ఏదో ఒక రోజున మారుతి 800 కొంటానేమో, అంతకు మించి ఏమీ చెయ్యలేను..." అన్నాను.

ఆమె నవ్వింది.

"నిజంగా? 800? ఏసీ ఉన్నదా, లేనిదా?" అంది.

"షటప్, నేనెంతో లోతైన విషయాలు మాట్లాడుతూంటే అది నీకు వేళాకోళంలా కనిపిస్తోందా?" అన్నాను.

ఆమె మళ్లీ నవ్వింది, కానీ ఈసారి మృదువుగా. నా కుడికంట్లో ఉబికిన కన్నీటి చుక్కని తుడుచుకున్నాను. ఆమె, తన చెయ్యి చాపి, నా ఎడమకంట్లోని కన్నీటిని తుడిచింది.

"ఏమైనా, మనిద్దరి మధ్యా ఉండిన సంబంధం ముగిసిపోయింది, ప్రియాంకా! నాకా సంగతి తెలుసు. త్వరలోనే నేను కోలుకుంటాను. నాకు తెలుసు, బాగా తెలుసు," అన్నాను నాకు నేనే చెప్పుకునే ధోరణిలో.

నేను మామూలుగా అయేదాకా తను మాట్లాడకుండా ఊరుకుంది. నేను మళ్లీ కూలర్ దీనికి ఒంగి నా మొహం మీద నీళ్లు జల్లుకున్నాను.

"అది సరేగాని, నీ పెళ్లి ఎక్కడ జరుగుతుంది? పెళ్లి బ్రహ్మాండంగా చెయ్యటానికి బహుశా మీ అమ్మ తన దగ్గరున్న డబ్బంతా నీళ్లలా ఖర్చు చేసేస్తుందేమో!" అన్నాను నిటారుగా నిలబడుతూ.

"తప్పకుండా ఏదో ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌లోనే అయియుంటుంది. ఆ తరవాత ఏళ్ల తరబడి అప్పులు తీరుస్తూనే కూర్చుంటుంది. కానీ ఆ రోజు రాత్రికి మాత్రం బంగారం తాపడం చేసిన స్టేజీ ఏర్పాటు చెయ్యాల్సిందే! నువ్వొస్తావుగా?"

"తెలీదు," అన్నాను.

"తెలీదంటే ఏమిటి నీ ఉద్దేశం? నువ్వు రాకపోతే వింతగా అనుకుంటారు అందరూ!"

"అక్కడికొచ్చి అనవసరంగా బాధపడటం నాకిష్టంలేదు. అయినా నేను రాకపోతే వింతగా అనుకోవటం దేనికి?"

"ఊc, పెళ్లిరోజున పెళ్లికొడుకే రాకపోతే కాస్త వింతగా ఉండదూ?" అంది ప్రియాంక.

ఆ మాటలు వినగానే బిర్ర బిగుసుకుపోయాను. ఆమె మాట్లాడిన ఆ చివరి వాక్యాన్ని నా మనసులో మూడుసార్లు మళ్లీమళ్లీ అనుకున్నాను.

"ఏమిటీ? ఏమన్నావు నువ్వు?" అన్నాను.

నా బుగ్గ గిల్లి, "ఏమిటీ? ఏమన్నావు నువ్వు?" అంటూ నన్ను వెక్కిరించింది.

నేను నిర్ఘాంతపోయి అక్కడే నిలబడిపోయాను.

"కానీ నిన్ను అంత సులభంగా వదుల్తాననుకోకు. ఏదో ఒకరోజు నువ్వు నాకు 800 కారు, ఏసీ ఉన్నది, కొనిపెట్టాల్సిందే!" అంటూ నవ్వింది.

"ఏమిటీ?" అన్నాను.

"నేనన్నది నీకు వినిపించింది. నాకు నిన్ను పెళ్లి చేసుకోవాలని ఉంది, శ్యామ్!" అంది ప్రియాంక.

నాకు ఆమె మాటల మీద నమ్మకం కలగలేదు. ఆనందంతో గంతులు వేస్తానని అనుకున్నాను, కానీ నేను మ్రాన్పడిపోయాను. ఆమెని కావలించుకుని, ఏడవాలనీ, అదే సమయంలో నవ్వాలనీ అనిపించినా, నాలోంచి ఒక గొంతు, ఒక కావలివాడిలా, దృఢంగా ఇలా అంది : *ఏమిటిదంతా? అబ్బ! నా బతుకు ఎంత అధ్వాన్నంగా ఉన్నా, నేను యితరుల జాలికోసం ఎదురుచూడలేదు.*

"ఏమంటున్నావు, ప్రియాంకా? గణేశ్‌ని వదిలేసి, నన్ను పెళ్లి చేసుకుంటావా? ఇదేమిటి, సానుభూతితో తీసుకున్న నిర్ణయమా?"

"నీ గురించి ఆలోచించటం ఆపు. నా జీవితంలో అన్నిటికన్నా ముఖ్యమైన నిర్ణయం, సానుభూతితో తీసుకున్న నిర్ణయం అవదు. నేను దీన్ని గురించి ఆలోచించాను. గణేశ్ చాలా గొప్పవాడే, కానీ..."



"కానీ, ఏమిటి?"

"ఆ ఫోటోలో బట్టతల లేనట్టుగా చూపించటం, నన్ను ఇబ్బంది పెడుతోంది. అతను తనంతట తానుగా విజయాలు సాధించాడు కదా. మరలాటప్పుడు అబద్ధం చెప్పవలసిన అవసరమేం వచ్చింది?"

"అంటే అతనికి బట్టతల ఉందని వద్దనుకుంటున్నావా? నా జుట్టు మట్టుకు ఎప్పటికీ ఇలాగే ఉంటుందని నమ్మకం లేదే!" అన్నాను. నేనన్నది నిజమే. నేను షవర్‌బాత్ తీసుకున్నప్పుడల్లా నా తలమీదకన్నా నా టవల్ మీదే ఎక్కువ జుట్టు ఉంటుంది.

"లేదు, బట్టతల ఉందని అతన్ని వద్దనటంలేదు. అందరు మొగాళ్లకీ ఏదో ఒకరోజున బట్టతల వస్తుంది. అది చాలా ఘోరం, నాకు తెలుసు," అని ఆమె నా జుట్టు చెరిపింది. మళ్లీ, "అతను చాలా విధాలుగా మంచివాడే అయియుండచ్చు, కానీ ఇక్కడ నే చెప్పొచ్చేది, అతను అబద్ధం చెప్పాడని. ఇది అతనెలాటివాడో తెలియజేస్తుంది. అలాంటి వ్యక్తితో నేను నా జీవితమంతా గడపలేను. అసలు, నాకు ముందుగా బాగా తెలియని వ్యక్తితో కలిసి బతకాలని నాకు లేదు. ఇది నా నిర్ణయానికి ఒక కారణం. మరో పెద్ద కారణం కూడా ఉంది," అంది.

"ఏమిటది?" అన్నాను.

"అది, నీమీద నాకున్న ప్రేమ. ఎందుకంటే ఈ లోకంలో నీతో మట్టుకే నేను, నేనులా ఉండగలను. అంతేకాక, నాలో ఉన్న లోటుపాట్లన్నీ తెలిసి కూడా నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించేవాడివి ఈ ప్రపంచంలో నువ్వొక్కడివే. అలా అనే నేను అనుకుంటున్నాను," అంది ఆమె కంపిస్తున్న గొంతుతో.

నేనేమీ మాట్లాడలేదు.

ఆమే మళ్లీ ఇలా అంది, "ఈ లోకం నేను చాలా ఉదాసీనంగా ఉంటానని అన్నప్పటికీ, నాలో కూడా కారణం చెప్పలేని రొమాంటిక్ సెంటిమెంట్స్, భావాలూ ఉన్నాయి. నిజంగా నేను డబ్బుకి విలువ ఇస్తానా? అందరూ విలువ ఇవ్వాలంటారు కాబట్టి ఇస్తాను. అబ్బ! ఫైవ్‌స్టార్ హోటళ్లకన్నా నాకు ట్రక్‌డ్రైవర్లు వెళ్లే ధాబాలే ఇష్టం. శ్యామ్, నాకు తెలుసు, నువ్వూ, మా అమ్మా నేను ఏమీ పట్టించుకోనని అంటారు..."

"నేనా మాట ఎప్పుడూ అనలేదు..." అని ఆమె భుజాలు పట్టుకున్నాను.

"సారీ, శ్యామ్! నేను నిన్ను చాలా విమర్శించాను. నేను చాలా చెడ్డదాన్ని!" అంది ప్రియాంక.

ఆమె ముక్కు ఎగబీల్చింది. చిట్లించిన ఆ ముక్కు ఇంతకు మునుపటికన్నా కూడా ముద్దొచ్చింది.

"ఏం ఫరవాలేదు, ప్రియాంకా!" అంటూ ఆమె కన్నీళ్లు తుడిచాను.

"సో, అదీ సంగతి, శ్యామ్! లోతుగా చూస్తే, నాకిష్టమైన అబ్బాయితో ఉండాలని కోరుకునే మామూలు అమ్మాయిని నేను. నీలాగే, ఈ అమ్మాయికి కూడా బోలెడంత ప్రేమ కావాలి."

"ప్రేమా? నాకు బోలెడంత ప్రేమ కావాలా?" అన్నాను నేను.

"మరేమిటి? నీకు కావాలి. మిగతావాళ్ళకి కూడా కావాలి. ఆశ్చర్యం, మనమెప్పుడూ పైకి చెప్పం. ఆకలి వేసినప్పుడు అందరి ముందూ, "నేను తిండిలేక మాడుతున్నాను," అని అరిస్తే ఫరవాలేదు. అలాగే అలసిపోయినప్పుడు, "నాకు నిద్రొస్తోంది," అని అరిచినా ఫరవాలేదు. కానీ "నాకు మరికొంత ప్రేమ కావాలి" అని మాత్రం ఎందుకోగాని మనం అనలేం. ఎందుకు అనలేం, శ్యామ్? అది ఎంత ముఖ్యమైనది మనకి!"

నేనామెకేసి చూశాను. ఆమె ఇలా లోతైన వేదాంతం మాట్లాడిన ప్రతిసారీ ఆమె పట్ల నాకు విపరీతమైన ఆకర్షణ కలుగుతుంది. నాలో ఉన్న కావలివాడు, 'కరిగిపోవద్దు' అని గుర్తు చేశాడు.

"ప్రియాంకా?"

"యెస్!" అంది ఇంకా ముక్కు ఎగపీలుస్తూ.

"ఐ లవ్ యూ!" అన్నాను.

"ఐ లవ్ యూ టూ!" అంది ప్రియాంక.

"థ్యాంక్స్! కానీ...ప్రియాంకా, నేను నిన్ను పెళ్ళి చేసుకోలేను. ఈ మాటంటున్నందుకు క్షమించు, నువ్వు ఎంతో బ్రహ్మాండమైన మన పెళ్ళి ప్రస్తావన తెచ్చావు, కానీ నా జవాబు మాత్రం అది వీలుకాదనే," అన్నాను.

"ఏమిటీ?" అంది ప్రియాంక నమ్మలేనట్టు కళ్ళు పెద్దవి చేస్తూ. నాలోని కావలివాడు నన్ను తన అధీనంలో పూర్తిగా ఉంచుకున్నాడు.

"లేదు, నేను నిన్ను పెళ్ళి చేసుకోలేను. ఈ రోజు నేనొక కొత్త మనిషిని. ఈ కొత్త మనిషి ఒక కొత్త జీవితాన్ని అమర్చుకుని, కొత్త గౌరవాన్ని సంపాదించుకోవాలని అనుకుంటున్నాడు. నువ్వు గణేశ్‌ని ఎంచుకున్నావు, అతనికేం? బాగానే ఉన్నాడు. నువ్వు కూడా కొత్త జీవితాన్ని ఎంచుకునే అవకాశాన్ని పొందావు. నీకు నిజానికి నా అవసరం లేదు. కనుక ఇలా ఉండటమే మంచిదేమో!" అన్నాను.

"నాకింకా నువ్వంటే ప్రేమ ఉంది, శ్యామ్! నీమీద మాత్రమే! ప్లీజ్ కాదనకు..." అంటూ నాకు దగ్గరగా వచ్చింది.

"సారీ!" అంటూ మూడడుగులు వెనక్కి వేశాను. "నావల్లకాదు. నేను నీ 'స్పేర్ వీల్'ని కాను. నువ్వు మళ్ళీ వెనక్కి రావటం గురించి నాకు మంచి అభిప్రాయమే ఉంది, కానీ నేను ముందుకు పోవటానికి సిద్ధంగా ఉన్నానని అనుకుంటున్నాను," అన్నాను.

ఆమె అక్కడ అలాగే నిలబడి ఏడవసాగింది. నా మనసు బలహీనంగా మారుతోందని అనిపించింది, కానీ నా బుర్ర మాత్రం గట్టిగానే ఉంది.

"బై, ప్రియాంకా!" అని నెమ్మదిగా ఆమె భుజం తట్టి అక్కణ్ణించి వెళ్ళిపోయాను.



# # 37

"ఏం చేస్తున్నావింతసేపు?" ముఖద్వారం దగ్గర తన బైక్‌మీద కూర్చుంటూ ఆగాడు వ్రూమ్. తన వాచీకేసి చూపించాడు, 6:59 అయింది టైము.

"సారీ, గురూ! వాటర్‌కూలర్ దగ్గర ప్రియాంక కనిపించింది," అంటూ వెనకసీటు మీద కూర్చున్నాను.

"తరవాత ఏమయింది?" అన్నాడు వ్రూమ్.

"ఏమీ లేదు. ఊరికే గుడ్‌బైలూ అవీ చెప్పుకున్నాం. అన్నట్టు, తను మళ్ళీ నాతో స్నేహం చెయ్యాలనీ, నన్ను పెళ్ళి చేసుకోవాలనీ అనుకుంటున్నానని చెప్పింది. నమ్ముతావా నువ్వు?"

వ్రూమ్ నావైపు తిరిగాడు.

"నిజంగానా? నువ్వేమన్నావు?"

"నాకిష్టం లేదన్నాను," అన్నాను ఉదాసీనంగా.

"ఏమిటీ?" అన్నాడు వ్రూమ్.

మేం మాట్లాడుకుంటూండగా, రాధిక, ఈషా, మిలిటరీ అంకుల్ ముఖద్వారంలోంచి చలికాలపు ఎండలోకి బైటికి వచ్చారు.

"హేయ్! మీరిద్దరూ ఇంకా ఇక్కడే ఉన్నారా?" అంది రాధిక.

"ఇంతకుముందే శ్యామ్ ప్రియాంకకి 'నో' చెప్పాడు. ఆమె అతన్ని పెళ్ళి చేసుకుంటానందిట, కానీ శ్యామ్ తనకి ఇష్టం లేదని అన్నాడు."

"ఏమిటీ?" అన్నారు రాధికా, ఈషా ఒకేసారి.

"హేయ్, ఊరుకోండర్రా! నా జీవితంలో కాస్తంత గౌరవాన్ని సంపాదించుకోవటానికి అలా చెయ్యవలసి వచ్చింది. నా జోలికి రాకండి," అన్నాను.

క్వాలిస్ డ్రైవర్ వచ్చి హారన్ వేశాడు.

"మేమేమీ నీ జోలికి రావటం లేదు. నీ జీవితం నీది...పద ఈషా పోదాం," అని రాధిక నావైపు అసహ్యంగా చూసింది. ఈషా వైపు తిరిగి, ఆమెతోపాటు క్వాలిస్ వైపు నడిచింది.

"ప్రియాంకా ఎక్కడ, మేడమ్? ఆలస్యం అవుతోంది!" అన్నాడు డ్రైవరు.

"వస్తోంది. వాళ్లమ్మతో ఫోన్లో మాట్లాడుతోంది. గణేశ్ తలిదండ్రులు వీళ్లింటికి బ్రేక్‌ఫాస్ట్‌కి వస్తున్నారట. వాళ్లమ్మ వేడివేడిగా పరాఠాలు చేస్తోంది," నాకు వినిపించాలని గట్టిగా అంది రాధిక. పరాఠాల ప్రసక్తి రాగానే నాకు ఆకలి వేసింది. కానీ ఆ బ్రేక్‌ఫాస్ట్‌కి నన్ను ఎవరూ పిలవరని అనిపించింది.

"చూస్తే రెండు కుటుంబాల వాళ్లందరూ ఒకర్నొకరు పెళ్లి చేసుకుంటున్నారనిపిస్తోంది!" అన్నాడు వ్రూమ్. మేము ఇంటికి బైలుదేరే ముందు ఆఖరిసారి పొగ తాగటానికని అతను సిగరెట్టు వెలిగించాడు.

డ్రైవర్ క్వాలిస్‌ని స్టార్ట్ చేశాడు. ఈషా, రాధికా మధ్య సీట్లో కూర్చున్నారు, మిలిటరీ అంకుల్ వెనకాల కూర్చున్నారు.

ప్రియాంక ప్రధానద్వారంలోంచి పరిగెత్తుకుంటూ వచ్చింది. నా దగ్గరకి రాకుండా నేరుగా ముందు సీట్లోకి వెళ్లి కూర్చుంది. డ్రైవర్ క్వాలిస్‌ని, వెనక్కి తిప్పటంతో, దాని వెనకభాగం మా ముందుకి వచ్చింది.

క్వాలిస్ ముందుకి కదలగానే మిలిటరీ అంకుల్ కిటికీలోంచి బైటికి చూసి ఏదో అన్నాడు. నేను ఆయన పెదవుల కదలికని బట్టి, "యూ బ్లడీ ఇడియట్...!" అని అతను అన్నాడని అనుకున్నాను.

నేను జవాబు చెప్పేలోపుగా క్వాలిస్ వెళ్లిపోయింది.

వ్రూమ్ తన సిగరెట్టుని ఆర్పేశాడు.

"ఓ, నో! నేను నిజంగానే బ్లడీ ఇడియట్‌ని! ఆమెని వెళ్లిపోనిచ్చాను," అన్నాను.

"ఊఁ... హూఁ...!" అన్నాడు వ్రూమ్ హెల్మెట్ పెట్టుకుంటూ.

"అంటే నేను ఇడియట్‌ననా? నువ్వు కూడా నేను పూర్తిగా బుద్ధిలేనివాణ్ణని అనుకుంటున్నావా?"

"నీ గురించి నీకన్నా ఎక్కువ ఎవరికి తెలుస్తుంది?" అన్నాడు వ్రూమ్ కాళ్లతో బైక్‌ని ముందుకి తోస్తూ.

"వ్రూమ్! ఏం చేశాను నేను? ఆమె ఇంటికి వెళ్లి గణేశ్ తలిదండ్రులతో కూర్చుని పరాఠాలు తింటే, ఇక అంతా అయిపోయినట్టే! నేనెంత తెలివితక్కువ దద్దమ్మని!" అని నా సీటుమీద పైకీ కిందికీ ఎగరసాగాను.

"ఆ డాన్స్ ఆపు! నేను బైక్ నడపాలి," అన్నాడు వ్రూమ్ తన కాలిని కిక్ పెడల్‌మీద పెట్టి.

"వ్రూమ్ మనం ఆ క్వాలిస్‌ని అందుకోవాలి. దాన్ని చేరుకునేంత వేగంగా నువ్వు బైక్ నడపగలవా?"

వ్రూమ్ హెల్మెట్ తీసేసి నవ్వాడు.

"నువ్వు నన్ను అవమానిస్తున్నావా? ఆ క్వాలిస్‌ని నేను అందుకోగలనా లేదా అని అనుమానిస్తున్నావా? నా మనసు దెబ్బతింది, మాన్!"



"...వ్రూమ్...ప్లీజ్, పద పోదాం!" అన్నాను అతని భుజాలు పట్టి తోస్తూ.

"లేదు. ముందు నా డ్రైవింగ్ సామర్థ్యాన్ని గురించి అనుమానించినందుకు నాకు సారీ చెప్పు."

"సారీ, బాస్! నిజంగా సారీ!" అంటూ చేతులు జోడించాను. "ఇక పద, షుమేకర్!" అన్నాను.

వ్రూమ్ కిక్ ఇచ్చి బైక్‌ని స్టార్ట్ చేశాడు. కొన్ని సెకన్లలో మేం కాల్‌సెంటర్‌ని వదిలి ముందు కెళ్లిపోయాం. ఉదయం కావటంతో హైవే మీద రద్దీ పెరుగుతోంది. అయినా వ్రూమ్ గంటకి తొంభై కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నాడు. కార్లనీ, స్కూటర్లనీ, ఆటోలనీ, స్కూల్ బస్సులనీ, న్యూస్‌పేపర్ కుర్రాళ్లనీ, తప్పించుకుంటూ, ఢిల్లీకి వెళ్లే రోడ్డుమీదికి చేరుకున్నాం.

నాలుగు నిమిషాల తరవాత, దూరంగా ఉన్న ట్రాఫిక్‌లైట్ల దగ్గర నాకు తెల్లరంగు క్వాలిస్ కనబడింది.

"అదే అయి ఉంటుంది," అన్నాను దానికేసి చూపిస్తూ.

వ్రూమ్ ముందుకి కదిలాడో లేదో, ఒక మేకల గుంపు రోడ్డు దాటాలని నిశ్చయించుకుంది. యాభై మేకలున్నాయి. అవి మా దారికి అడ్డంగా వచ్చాయి.

"డామిట్! ఇవెక్కణ్ణించి వచ్చాయి?" అన్నాను విపరీతంగా చలించిపోతూ.

"కొంతకాలం క్రితం వరకూ గుడ్‌గాంవ్ ఒక పల్లెటూరు. ఈ మేకలు బహుశా మనం ఎక్కణ్ణించి వస్తున్నామని అడుగుతున్నట్టున్నాయి," అన్నాడు వ్రూమ్ మెటికలు విరుస్తూ.

"నోరు మూసుకుని, ఏమైనా చెయ్యి!" అన్నాను.

వ్రూమ్ బైక్‌ని ముందుకి తీసుకెళ్లటానికి ప్రయత్నించాడు. కానీ అది ముందుకి పోకుండా ఒక మేక కొమ్ములకి కొట్టుకుంది. రోడ్డు కుడివైపునించి పోదామా అని ఆలోచించాడు కానీ, అటునించి వస్తున్న ట్రాఫిక్ అంతా ట్రక్కులతో నిండి ఉంది. అటువెళ్తే ఐదు సెకన్లలో మా ప్రాణాలు పోతాయి!

"ఇక మనకున్న దారి ఒకటే," అని హెల్మెట్ లోపల్నించి నన్ను చూసి నవ్వాడు వ్రూమ్.

"ఏం..." అనే లోపలే వ్రూమ్ బైక్‌ని డివైడర్ మీదికి ఎక్కించాడు.

"నీకేమైనా మతిపోయిందా?" అన్నాను.

"కాదు, ఆమెని వెళ్లనిచ్చావు చూడు, నీకే మతిపోయింది!" అని వ్రూమ్ డివైడర్ మీద బైక్‌ని నడపసాగాడు. మేకలూ, ట్రాఫిక్కూ మాకేసి షాక్‌లో చూడసాగారు. వ్రూమ్ వీధిదీపాలని తప్పించుకుంటూ, మేకలమందని దాటేవరకూ అలాగే బైక్‌ని నడిపాడు. మళ్లీ రోడ్డుమీదికి రాగానే వ్రూమ్ బైక్‌ని వంద కిలోమీటర్ల వేగంతో నడిపాడు. ఒక్క నిమిషంలో మా బైక్ రెడ్‌లైటు దగ్గరున్న క్వాలిస్‌ని చేరుకుంది. నేను బైక్ దిగి, ముందు సీటు దగ్గరున్న కిటికీ అద్దాన్ని తట్టాను. ప్రియాంక మొహం తిప్పుకుంది. అరచేత్తో అద్దాన్ని బాదాను.

ప్రియాంక కిటికీ తెరిచి, "ఏమిటీ? మాకేం కొనాలని లేదు," అంది, నేనేదో రోడ్డుమీద వస్తువులమ్మే మనిషిలాగ!

"నేనొక బుద్ధిలేని గాడిదని!" అన్నాను.

"ఇంకా?" అంది ప్రియాంక.

క్వాలిస్‌లో ఉన్న అందరూ నన్ను చూడటంకోసం కిటికీ అద్దాలని దించారు.

"నేనొక తెలివితక్కువదద్దమ్మని. నేనొక మొద్దుని, పిచ్చిసన్నాసిని, బుర్రలేనివాణ్ణి. ప్లీజ్, నాకు నిన్ను పెళ్లి చేసుకోవాలని ఉంది!"

"ఓ! నిజంగానా? మరి కొత్తమనిషిగా మారి గౌరవం సంపాదించుకోటం సంగతి ఏమయింది?" అంది ప్రియాంక.

"నేనేమంటున్నానో అప్పుడు నాకే తెలీలేదు. గౌరవాన్ని ఎవరైనా ఏం చేసుకుంటారు? దాన్ని నేను నా జేబులో పెట్టుకోలేనుగా!" అన్నాను.

"సో, నువ్వు నన్ను నీ జేబులో పెట్టుకోవాలనుకుంటున్నావా?" అంది ప్రియాంక.

"నువ్వు ఎలాగూ నా ప్రతి జేబులోనూ ఉన్నావు – నా జీవితంలో, నా మనసులో, నా హృదయంలో, నా ఆత్మలో – ప్లీజ్ వెనక్కి రావా! వస్తావు కదూ?" అన్నాను ఎర్రలైటు పసుపురంగులోకి మారుతూంటే.

"ఊఁ...చూద్దాంలే!" అంది ప్రియాంక.

"ప్రియాంకా ప్లీజ్ త్వరగా చెప్పు!"

"తెలీదు. నన్ను కాస్త ఆలోచించుకోనీ. మళ్లీ వచ్చే రెడ్‌లైట్ దగ్గర కలుసుకో, సరేనా? మనం వెళ్దాం, పదండి డ్రైవర్‌జీ!" అంది లైటు పచ్చరంగుకి మారగానే. డ్రైవర్, నా బాధని చూసి ఆనందిస్తున్నట్టుగా, అతివేగంగా కారుని పోనిచ్చాడు.

"ఏమంది?" నేను మళ్లీ బైక్ మీద కూర్చోగానే అడిగాడు వ్రూమ్.

"మళ్లీ రాబోయే రెడ్‌లైట్ దగ్గర చెపుతానంది. పద పోదాం!"

తరువాతి రెడ్‌లైట్ దగ్గర ఒక చిన్న ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. నేను బైక్ దిగి, కొన్ని వాహనాలని దాటుకుంటూ క్వాలిస్ దగ్గరికి పరిగెత్తాను. మళ్లీ కిటికీ అద్దం మీద తట్టాను. ప్రియాంక అక్కడ లేదు.

"ప్రియాంక ఏదీ?" అని డ్రైవర్ని అడిగాను. అతను భుజాలెగరేశాడు.

క్వాలిస్‌లోకి తొంగిచూశాను. రాధికా, ఈషా కూడా భుజాలెగరేశారు; ఆమె అక్కడా లేదు.

ఎవరో వెనకనించి వచ్చి నన్ను కావలించుకున్నారు.

"మేమేమీ కొనదల్చుకోలేదని చెప్పాకదా? ఎందుకు ఊరికే అలా మావెంటపడతావు?"



ప్రియాంకవైపు చూడటానికి వెనక్కి తిరిగాను.

"ఆ వాటర్ కూలర్ దగ్గర నేనేం చేశానో నాకే తెలీదు," అన్నాను.

"నోరు మూసుకుని నన్ను కావలించుకో!" అంటూ ప్రియాంక చేతులు బార్లా చాపింది.

మా కళ్లు కలుసుకున్నాయి. నేను చాలా మాట్లాడాలనుకున్నాను కానీ, మా కళ్లే అన్నీ మాట్లాడేసుకున్నాయి. కొన్ని సెకన్లపాటు నేనామెని కావలించుకుని ఉండిపోయాను. ఆమె నన్ను ముద్దు పెట్టుకుంది. మా పెదవులు కలుసుకున్నాయి. ట్రాఫిక్‌లో ఇరుక్కున్న వాళ్లందరూ మమ్మల్నే చూడసాగారు, తెల్లారుతూనే ఇంతమంచి సీను దొరికిందని ఆనందిస్తూ. అలాటి చోట ముద్దుపెట్టుకోవటం కొంచెం ఇబ్బందిగానే అనిపించింది, కానీ ఆమెనుంచి విడివడటం నావల్ల కాలేదు. ఆరునెల్ల తరవాత మేమిద్దరం ముద్దుపెట్టుకుంటున్నాం, ఇన్నాళ్లూ అణచిపెట్టుకున్న కోరిక అది. వ్రూమ్, క్వాలిస్‌లోని మిగతావాళ్లూ మాచుట్టూ చేరారు. కొద్దిసేపటికే ఈలలు వేస్తూ చప్పట్లు చరచసాగారు. ఆ చప్పట్లకి తోడు రోడ్లు మీది వాహనాలు హారన్లు మోగించటం మొదలుపెట్టాయి. కానీ నాకవేవీ కనిపించలేదు, వినిపించలేదు. నాకు ప్రియాంక తప్ప ఏమీ కనిపించలేదు, నాలోనుంచి ఒక గొంతు, ముద్దుపెట్టుకో... ముద్దుపెట్టుకో... ఇంకొంతసేపు ముద్దుపెట్టుకో, అనటం తప్ప ఏమీ వినిపించలేదు.

# 38

అదర్రా సంగతి, ఆ రాత్రీ, నా కథా, ఆ రకంగా ముగిశాయి. భవిష్యత్తులో ఏం జరుగుతుందో, ఎలా, ఎప్పుడు ఎక్కడ ఏవి జరుగుతాయో మాకు తెలీలేదు. ఇప్పటికీ ఇంకా తెలీదనే చెప్పాలి. కానీ జీవితమంటే అదే కదా! ఒక్కొక్కప్పుడు అయోమయంగానూ, ఒక్కోసారి అన్నీ అవకతవకలుగానూ ఉంటుంది, అయినా అందులో కూడా ఏదో మజా ఉందని అనిపిస్తుంది. అయినా, ఆ రోజు రాత్రి తరవాత నెలరోజులకి మేమెక్కడున్నామో చెప్పనివ్వండి. బక్షీ ఇచ్చిన పెట్టుబడితో నేనూ, వ్రూమ్ ఒక వెబ్‌సైట్ డిజైన్ కంపెనీని మొదలుపెట్టాం. దానికి 'బ్లాక్‌షీప్ వెబ్ డిజైన్ కంపెనీ' అని పేరుపెట్టాం. నెలరోజుల్లో మాకు ఒకే ఒక ఆర్డర్, అదీ మా ప్రాంతం నుంచే, దొరికింది. దానివల్ల మేం పెట్టిన డబ్బు వెనక్కి రావటమేకాక, కొద్దిగా లాభం కూడా చూపించే అవకాశం ఉంటుందనిపించింది. అంటే, వ్రూమ్ తన సిగరెట్ల ఖర్చు కంపెనీ ఖాతాలో వేస్తాడా లేదా అనేదాన్నిబట్టి లాభం గురించి చెప్పగలం అన్నమాట! అంతర్జాతీయ స్థాయిలో ఆర్డర్లేవీ రాలేదు, కానీ చూద్దాంలే, అనుకున్నాం.

ఈషా తన మోడలింగ్ ఆశల్ని వదిలేసి, కాల్‌సెంటర్లోనే పని చెయ్యటం కొనసాగించింది. అయినా, పగటిపూట ఒక ఎన్‌జీవో సంస్థలో పనిచేస్తోంది. కార్పొరేట్ వాళ్ల దగ్గర నిధులు సేకరించటం ఆమె పని. ఆమె బాగానే సంపాదిస్తోందని విన్నాను. అంత సెక్సీ అమ్మాయి, ఒక మంచిపనికోసం డబ్బులడిగితే, మగ ఆఫీసర్లు లేదని అనరని నా ఉద్దేశం. బహుశా వాళ్లలో చాలామంది చెక్కు మీద సంతకం చేస్తున్నప్పుడు ఈషా బొడ్డుకున్న రింగునే కళ్లార్పకుండా చూస్తారని అనుకుంటా. ఇదికాక, వ్రూమ్ ఆమెని పైవారం కాఫీకి, సెమి-డేట్ అట (అంటే ఏమిటో అతనికే తెలియాలి!) పిలిచాడు ఆమె సరే అందనుకుంటా.

మిలిటరీ అంకుల్‌కి అమెరికాకి వెళ్లటానికి వీసా దొరికింది. తన కొడుకుతో రాజీ కుదుర్చుకోటానికి ఆయన అక్కడికెళ్లాడు. ఆయన వెనక్కి రాలేదంటే అక్కడ అన్నీ సవ్యంగానే ఉన్నాయని అనుకోవాలి. రాధిక తన మొగుడినించి విడాకులు తీసుకోవటానికి, అతనిమీద కేసు వేసింది. ప్రస్తుతం ఈషాతో కలిసి ఉంటోంది. తన తలిదండ్రుల దగ్గరకెళ్లి కొన్నాళ్లుండాలని కూడా ప్లాన్ చేస్తోంది. అనుజ్ క్షమాపణ చెప్పాడు కానీ, రాధిక ప్రస్తుతం ఒప్పుకునేందుకు సిద్ధంగా లేదు.

ప్రియాంక కూడా కనెక్షన్స్‌లోనే పనిచేస్తోంది, కానీ ఆరునెలల్లో తను కాలేజీకి వెళ్లి సంవత్సరంలో ముగిసిపోయే బీ.ఈడీ కోర్సు చేయబోతోంది. పెళ్లి ఇంకా రెండేళ్లకి వాయిదా వెయ్యాలని ఇద్దరం నిశ్చయించుకున్నాం. ప్రస్తుతం ఇద్దరం తరచు కలుసుకుంటూనే ఉంటాం,



కానీ మా ధ్యాసంతా కెరీర్ మీదే ఉంది. ప్రియాంక గణేశ్‌ని చేసుకోనని చెప్పాక వాళ్లమ్మ మూడుసార్లు హార్ట్‌ఎటాక్ వచ్చినట్టు నటించింది. కానీ ప్రతిసారీ ప్రియాంక ఆవలించింది! ఇక దాంతో ఆవిడ గుండెజబ్బు అభినయాన్ని కట్టిపెట్టి, గణేశ్ ఫైల్‌ని మూసేసింది.

సో, ఇక అన్నీ సవ్యంగానే ఉన్నట్టు కనిపిస్తున్నాయి. ఇక నా విషయం, ఒక వ్యక్తిగా చాలావరకూ నా గురించి నా అభిప్రాయం అలాగే ఉంది. అయినా, ఒక తేడా మాత్రం కనిపిస్తోంది. ఇంతకుముందు, నేనెందుకూ పనికిరాననీ, ఏమీ సాధించలేననీ అనిపించేది. కానీ అది నిజం కాదు. ఏమైనా, కాల్‌సెంటర్లో వందలకొద్దీ ఉద్యోగాలని కాపాడగలిగాను, నా బాస్‌కి గుణపాఠం నేర్పాను, నా సొంత కంపెనీని ప్రారంభించాను, ఒక ఎన్ఆర్ఐ పెళ్లికొడుకు, పెద్దచేపతో పోటీలో గెలిచాను, ఒక అద్భుతమైన అమ్మాయిని సొంతం చేసుకున్నాను, ఇక ఇప్పుడు ఒక పుస్తకాన్ని రాసి పూర్తిచేశాను. అంటే దీని అర్థం i) నేను నిజంగా కావాలనుకుంటే ఏమైనా చెయ్యగలను, ii) దేవుడు ఎప్పుడూ నాపక్కే ఉంటాడు, iii) అన్నీ ఆలోచించిన తరవాత పనికిమాలిన వాళ్లంటూ ఎవరూ ఉండరు.

# ఉపసంహారం

"వావ్! బలే ఉందే కథ!" అన్నాను. ఆమె తల ఆడించి, నీళ్లసీసాలోంచి గుక్కెడు నీళ్లు తాగింది. కదిలే రైల్లో నీళ్లు తుళ్లకుండా సీసామూత గట్టిగా బిగించి ఉంచింది.

"థాంక్యూ. కథ వల్ల రాత్రి చాలా త్వరగా గడిచిపోయింది," అన్నాను.

టైము చూశాను, ఉదయం 7 గంటలయింది. మా ప్రయాణం పూర్తి కావచ్చింది. ఇంకో గంటలోగా ఢిల్లీ చేరుకుంటాం. రైలు రాత్రిని చీలుస్తూ పోతోంది, క్షితిజం వైపుకి దూసుకుపోతోంది. ఆకాశంలో కాషాయరంగు కనిపించింది నాకు.

"అయితే, మీకు నచ్చిందా?"

"ఆఁ. సరదాగా అనిపించింది. అదే సమయంలో నన్ను ఆలోచింపజేసింది. నేను కూడా ఒకప్పుడు శ్యామ్ ఉన్న పరిస్థితిలోనే ఉండేవాడిని, పనిచేసేచోటా, నిజజీవితంలోనూ, ఈ కథ నాకు అప్పుడే తెలిస్తే బావుండేది. అప్పుడు నేను ఇంకోరకంగా ప్రవర్తించేవాణ్ణి, కనీసం ఇంకొంచెం తక్కువ బాధపడి ఉండేవాణ్ణి."

"మంచి మాటన్నారు. ఈ కథ చాలా అరుదైనది. చదవటానికి సరదాగా ఉంటూనే అది మీకు సాయపడుతుంది. అందుకే దీన్ని అందరికీ చెప్పమని మిమ్మల్ని అడుగుతున్నాను. అయితే దీన్ని పుస్తకంగా తీసుకురావటానికి మీరు రెడీయేనా?" అంది నీళ్లసీసాకి మూత పెడుతూ.

"రెడీయే అనుకుంటా, కానీ దీనికి కొంత టైం పడుతుంది," అన్నాను.

"అవును. నేను ఇందులో ఉన్న వాళ్లందరి వివరాలూ ఇస్తాను. కావాలంటే ఏమాత్రం సంకోచించకుండా వాళ్లని మీరు కలవచ్చు. అయితే వీళ్లలో ఎవరి నోట కథ చెప్పిద్దామనుకుంటున్నారు?"

"శ్యామ్. ముందే చెప్పా కదా, అతనూ, అతని కథా నాకు చాలా దగ్గరగా ఉన్నాయి. అతన్లో నన్ను చూసుకోగలుగుతున్నాను; నాకూ అలాంటి సమస్యలే ఎదురైనాయి. అది నా జీవితంలోని చీకటికోణం!"

"అవునా? చాలా ఆసక్తికరంగా ఉందే! కానీ నిజానికి మనందరి జీవితాల్లోనూ చీకటి కోణాలున్నాయి, మనలో మనకి నచ్చని విషయాలు, అవి మనకి కోపం తెప్పిస్తాయి, మనని మనం మార్చుకోవాలనుకునే కొన్ని విషయాలు అవి. తేడా అల్లా మనం వాటిని ఎలా ఎదుర్కొంటామనే విషయంలోనే వస్తుంది," అందామె.



నేను ఔనని తలాడించాను. రైలు నెమ్మదిగా, హాయిగా ఊగుతూ వెళ్తోంది. కొద్ది నిమిషాలు ఇద్దరం మౌనంగా ఉన్నాక, నేను మళ్లీ మాట్లాడుతూ, "చూడండి, ఇలా అంటున్నానని ఏమీ అనుకోవద్దు. కానీ ఈ కథలో ఒక అంశం చదివేవాళ్లకి సమస్య అనిపించవచ్చని అనుకుంటున్నాను."

"ఏమిటది?"

"దేవుడితో మాట్లాడటం."

ఆమె చిరునవ్వు నవ్వింది.

"అందులో సమస్య ఏముంది?" అంది.

"ఊఁ, మరేం లేదు, కొంతమంది పుస్తకం కొనకపోవచ్చు. కథ రాసేప్పుడు అందులో వాస్తవ సంఘటనలనే రాయాలి. చదివేవాళ్లెప్పుడూ, "అసలు నిజంగా జరిగిందేమిటో చెప్పండి!" అనే అంటారు. ఆ విధంగా చూస్తే, 'దేవుడు ఫోన్ చెయ్యటం' అనేది కథలో ఎలా ఇముడుతుంది."

"ఏం? అలా జరుగుతుందని మీకనిపించటం లేదా?" అంది తన సీటులో కదులుతూ. అప్పుడు ఆమె రగ్గు పక్కకి జరిగి, ఒక పుస్తకం బైటికొచ్చింది. దాన్ని నేనింతకు ముందు గమనించలేదు.

"ఊఁ, నాకు తెలీదు. సామాన్యంగా అది అంత తరచుగా జరగదు కదా! అంటే, నా ఉద్దేశం, మనం చెప్పే విషయాలకి తార్కికమైన, శాస్త్రీయమైన వివరణ ఉండాలి."

"నిజంగానా? జీవితంలో అన్నీ అలాగే జరుగుతాయా?"

"అవుననుకుంటా."

"సరే, చూద్దాం. ఎందుకో తెలీదుకాని, శ్యామ్‌కీ మీకూ ఏదో సంబంధం ఉందనిపించిందన్నారు కదూ? దీనికి తార్కికమైన, శాస్త్రీయమైన కారణం ఏమిటి?"

కొద్ది క్షణాలు ఆలోచించాను, కానీ నాకు సరైన సమాధానం తట్టలేదు.

నేను తడబడటం చూసి, ఆమె నవ్వింది.

"ప్లీజ్, అర్థం చేసుకోటానికి ప్రయత్నించండి. దేవుడినించి ఫోన్‌కాల్స్ రావటం అనేది ఎప్పుడు పడితే అప్పుడు జరగదు. దాని గురించి ఎలా రాయను?" అన్నాను.

"సరే, ఐతే వినండి. 'దేవుడి ఫోన్‌కాల్'కి బదులు నేను మీకు ఇంకోటి చెపుతాను, తార్కికమైనది, సరేనా?" అని నీళ్లసీసాని పక్కన పెట్టేసింది.

"అదేమిటి?"

"మనం కొద్దిగా వెనక్కి వెళ్దాం. అయితే, వాళ్లు ఒక గోతిలోకి క్వాలిస్‌ని డ్రైవ్ చేసేసరికి, అది అక్కడ ఇరుక్కుపోయింది, ఇనపకడ్డీల మీద వేలాడుతూ ఉండిపోయింది, కదా? ఆ సంఘటన గురించి మీకు అభ్యంతరమేమీ లేదుగా?"

"లేదు, దాని గురించి నాకేం అభ్యంతరం లేదు," అన్నాను.

"అప్పుడు వాళ్లకి తమ జీవితం ముగియబోతోందని అనిపించింది. బతుకు మీద ఆశ పోయింది - అక్షరాలా, అలంకారికంగా. అవునా?"

"అవును." అన్నాను.

"ఓకే! అయితే మనం, ఆ సమయంలో మిలిటరీ అంకుల్ మాట్లాడాడని అనుకుందాం. ఆయన, 'ఇక్కడ మీరు చాలా వింత పరిస్థితిలో ఇరుక్కుని ఉన్నారు, అందుకని నేను కల్పించుకుని మీకు సలహా ఇద్దామనుకుంటున్నాను: అంటాడనుకుందాం."

"దేవుడు సరిగ్గా అదే మాట అన్నాడుగా!" అన్నాను.

"అవును. అక్కడినించి దేవుడన్న మాటలన్నీ మిలిటరీ అంకుల్ అన్నట్టు రాయండి. ఆయన వాళ్లకి విజయం గురించీ, లోపల్నించి పలికే గొంతు గురించీ, మిగతా విషయాలన్నీ ఆయనే చెప్పాడని రాయండి," అంది ఆమె.

"నిజంగానా? అసలు జరిగింది అదేనా?" అన్నాను.

"లేదు. నేనలా అనలేదు. మీరు కావాలంటే అలా మార్చుకోవచ్చని మాత్రమే అని అంటున్నాను, అప్పుడు అంతా శాస్త్రీయంగా, తార్కికంగా కనిపిస్తుందని. మీకు నేను చెప్పేది అర్థమవుతోంది కదా?"

"యెస్!" అన్నాను.

"అయితే కథ ముఖ్యభాగంలో మీకిష్టమైనది ఎంచుకోండి. ఎంతైనా అది మీరు రాయబోయే కథే కదా!"

నేను అవునని తలాడించాను.

"కానీ నేను మిమ్మల్ని ఒక ప్రశ్న అడగచ్చా?" అంది ఆమె.

"తప్పకుండా," అన్నాను.

"రెండిట్లోనూ ఏది ఎక్కువ బావుంది?"

నేను ఒక్క క్షణం ఆలోచించాను.

"దేవుడు ఉన్నదే," అన్నాను.

"జీవితంలాగే, తార్కికంగా ఉన్నా లేకపోయినా, దేవుడు ఉంటేనే ఆ కథ మెరుగ్గా ఉంటుంది."

ఆమె అన్న మాటల గురించి కొన్ని నిమిషాలు ఆలోచించాను. ఆమె మౌనంగా ఉండిపోయింది. నేనామెకేసి చూశాను. తెల్లారగట్ల లోపలికొస్తున్న సన్నటి వెల్తుర్లో ఆమె మరింత బావున్నట్టనిపించింది.

"ఊc...ఢిల్లీ దగ్గర పడుతున్నట్టుంది," అని బైటికి చూసింది. పొలాలు అయిపోయి, ఢిల్లీ శివార్లలో ఉండే ఇళ్లు కనిపించసాగాయి.

"అవును. ప్రయాణం ముగిసింది. అన్నిటికీ థ్యాంక్స్! ఊc... నన్ను ఊహించనివ్వండి... ఈషా కదూ?" అని షేక్‌హ్యాండివ్వటానికి లేచాను.



"ఈషా? నేను తనే అయుంటానని ఎందుకనుకున్నారు?"

"ఎందుకంటే, మీరు చాలా అందంగా ఉన్నారు."

"థ్యాంక్స్!" అని నవ్వింది. "సారీ, కానీ నేను ఈషాని కాను,"

"అయితే? ప్రియాంకా?" అన్నాను.

"కాదు."

"రాధిక కాదు కదా?"

"కాదు, రాధికని కూడా కాదు," అందామె.

"మరైతే, మీరెవరు?"

ఆమె నవ్వి ఊరుకుంది.

అప్పుడు నా బుర్రలో లైటు వెలిగింది! ఆమె ఒక అమ్మాయి, ఆమెకి ఆ కథ మొత్తం తెలుసు, కానీ ఆమె ఈషా, రాధిక, ప్రియాంక, వీళ్లల్లో ఎవరూ కాదు. అయితే ఇక ఒకే ఒక జవాబు మిగిలి ఉంది.

"అయితే...అంటే...ఓహ్..." నేను నిలదొక్కుకోలేకపోవటంతో నా శరీరమంతా వణకసాగింది. నేను మోకాళ్లమీద కూలబడ్డాను. సూర్యుడి వెల్తురు మా బోగీలోకి నేరుగా పడటంతో ఆమె మొహం ప్రకాశవంతంగా అయింది.

ఆమె చిరునవ్వు నవ్వుతూంటే, నేను కళ్లెత్తి ఆమెని చూశాను. ఆమె పక్కనే ఒక పుస్తకం తెరిచి ఉంది. ఏదో పవిత్రగ్రంథం తాలూకు ఇంగ్లీషు అనువాదం అది. తెరిచి ఉన్న పేజీలోని కొన్ని పంక్తులమీదికి దృష్టి సారించాను;

ఎప్పుడూ నా గురించే ఆలోచించు, నా భక్తుడివి కా, నన్ను ఆరాధించు, నాకు అంజలి ఘటించు. అప్పుడు తప్పకుండా నాదగ్గరకి చేరుకుంటావు. నువ్వు నాకు ప్రాణస్నేహితుడివి కనకే నేనీ వాగ్దానం చేస్తున్నాను.

"ఏమిటీ?" అన్నాను నా తల గిర్రున తిరుగుతూంటే. రాత్రి నిద్రలేకపోవటం వల్లే అనుకుంటా, కానీ ఆమె మాత్రం చెరగని చిరునవ్వుతో అలాగే ఉండిపోయింది. ఆమె తన చేతిని పైకెత్తి నా తలమీద ఉంచింది.

"ఏమనాలో నాకేమీ పాలుపోవటం లేదు," అన్నాను మిరుమిట్లు గొలిపే వెల్తురు నా కళ్లకి ఏమీ కనబడకుండా చేస్తూంటే.

అర్థంకాని అలసట ఏదో నన్ను కమ్ముకుంది. రాత్రంతా నిద్రపోకపోవటం వల్ల అలా జరుగుతోందని అనుకుని, కళ్లు మూసుకున్నాను.

మళ్లీ నేను కళ్లు తెరిచేసరికి, రైలు ఆగిపోయి ఉంది. తల నేలకి ఆనించి నేను మోకాళ్ల మీద ఒంగి కూర్చునున్నాను. రైలు ఢిల్లీ స్టేషన్లో ఉంది. పోర్టర్లు, టీ అమ్మేవాళ్ల గోలా, ప్రయాణీకుల హడావిడీ, నా చెవుల్ని గింగుర్లెత్తించాయి. నేను నెమ్మదిగా తలెత్తి ఆమె సీటుకేసి చూశాను, కానీ ఆమె వెళ్లిపోయింది.

"సాబ్! సామాను మీరే దింపుకుంటారా? నన్ను దింపమంటారా?" అంటూ ఒక పోర్టర్ నా భుజం తట్టాడు.